# కథా కౌముది

2010



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 63

# కౌముది 2010 సంచికలలో ప్రచురితమైన కథలు

## ఇందులో...


| | | | |
|---|---|---|---|
| 1 | రావయ్యా చందమావయ్యా.. | స్వరూప్ సిన్హా | 1 |
| 2 | ఆసరా | జయంతి వెంకటరమణ | 6 |
| 3 | స్వేచ్ఛాజీవనం | వక్కలంక సత్యనారాయణ | 12 |
| 4 | పార్టీ మనిషి కాదా? | తాడికొండ కె.శివకుమార్ శర్మ | 14 |
| 5 | మేరా భారత్ మహాన్ | పొత్తూరి విజయలక్ష్మి | 18 |
| 6 | అజగరమ్ | కొంపెల్ల లక్ష్మీ సమీరజ | 25 |
| 7 | ఇలా ఔతుందనుకోలేదు | డా.ఉమా ఎయ్యుణ్ణి | 32 |
| 8 | మంత్రి గారొస్తారా? | కొల్లూరి సోమశంకర్ | 40 |
| 9 | మరి వీళ్ళో? | పాలపర్తి జ్యోతిష్మతి | 44 |
| 10 | ఏకైక అస్త్రం | కాశీభట్ట శశికాంత్ | 48 |
| 11 | నేనెవరితో చెప్పుకోను? | డా.కె.వి.ఎస్.జ్ఞానేశ్వర రావు | 53 |
| 12 | డామిట్ | డా.గాయత్రీ దేవి | 56 |
| 13 | ఆకుపచ్చని అనుభవం | యర్రమిల్లి విజయలక్ష్మి | 60 |
| 14 | సాక్షి | నాదెళ్ళ అనూరాధ | 65 |
| 15 | మంచుతెర | ‘నెమలికన్ను‘ మురళి | 71 |
| 16 | బడిశాల | డా.మూలా రవికుమార్ | 77 |
| 17 | అమ్ములు | లలిత | 82 |
| 18 | ఉగ్రవాదీ నమోన్నమః | జొన్నలగడ్డ రామలక్ష్మి | 86 |
| 19 | ఫ్లిప్ ఫ్లాప్ ప్రయాణం | శైలజ సోమయాజుల | 92 |
| 20 | స్నేహ మౌక్తికం | మధురవాణి | 96 |
| 21 | మీడియా | అరుణశర్మ నిమ్మగడ్డ | 100 |
| 22 | తారుమారు | అక్కినపల్లి సుబ్బారావు | 105 |
| 23 | మరో ప్రపంచం | అనిల్.ఎస్.రాయల్ | 114 |
| 24 | యత్ర నార్యస్తు పూజ్యంతే | డా.సుధా నిట్టల | 122 |
| 25 | వేపచెట్టు | శివపార్వతి అనంతు | 129 |

| | | | |
|---|---|---|---|
| 26 | అధమంలో ప్రథమం | విశ్వసాహితి | 131 |
| 27 | ప్రొఫెసర్ మూర్తి | కృష్ణ అక్కులు | 140 |
| 28 | జమ్మడు | పాలకొల్లు రామలింగస్వామి | 147 |
| 29 | గాజుకళ్ళు | పి.వి. ఆర్.రాజశేఖర్ | 152 |
| 30 | వలస పక్షులు | ప్రగతి | 157 |
| 31 | లోకరీతి | అపర్ణ మునుకుట్ల గునుపూడి | 161 |
| 31 | సిటుక్కు సిటిక్కూ వాన సుక్కా | శ్రీనివాస్ ప్రభల | 167 |
| 32 | కిన్నెరసాని ఒడ్డున | మధురవాణి | 171 |
| 33 | టిప్పూ - ఆయేషా - నేను | వి.బి.సౌమ్య | 176 |
| 34 | దేశి అస్త్రప్రయోగాలు | పిన్నమనేని శ్రీనివాస్ | 182 |
| 35 | అబద్ధంలో అతడు ఆమె | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 187 |
| 36 | స్వర్గంలో ఓ సాయంకాలం | కె.జయశంకర్ రెడ్డి | 191 |
| 37 | భోగి పిడక | వాసు ముళ్ళపూడి | 193 |
| 38 | శ్రీకారం | బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్ | 298 |
| 39 | ప్రాయశ్చిత్తం | ఎమ్.రమేష్ కుమార్ | 204 |
| 40 | అంతర్మథనం | దీప్తి కనుపర్తి | 210 |
| 41 | ఇద్దరు అభిసారికలు - రెండు సెలయేర్లు | శ్రీధర్ అయ్యల | 213 |
| 42 | అమ్మ | కోరాడ సాయిలక్ష్మి | 219 |
| 43 | కల కరిగింది | వియోగి | 222 |
| 44 | సభాపర్వం | అల్లూరి గౌరీలక్ష్మి | 228 |
| 45 | అంతర్వాహిని | నాగేంద్ర కాశి | 232 |
| 46 | కొత్త బంగారులోకం | ఎ.విజయకుమార్ | 236 |
| 47 | ఆశ | భువనచంద్ర | 242 |
| 48 | రైలుబండి | ఆర్.శ్యామల | 245 |
| 49 | ప్రవాహం | కె.వరలక్ష్మి | 252 |
| 50 | కాలం తెచ్చిన మార్పు | మధురవాణి | 257 |
| 51 | బంగారు కలలు | మాధవ్ దుర్భా | 262 |

| | | | |
|---|---|---|---|
| 52 | తిరుమది శే.సా.లక్ష్మి(అగినిప్రు రిటర్న్డ్) | భువనచంద్ర | 266 |
| 53 | గురువిందగింజ | ఆర్.శర్మ.దంతుర్తి | 270 |
| 54 | పడమట సంధ్యారాగం | సరిపల్లి మంజుల | 277 |
| 55 | ఒక నిజం ఒక నమ్మకం | డా.ఎమ్.సుగుణ రావు | 282 |
| 56 | పరిణీత | విజయ (క్రరా) గంటి | 287 |
| 57 | బహుమతి | సన్నిహిత్ | 291 |
| 58 | గుర్తింపు | శ్యామలాదేవి దశిక | 295 |




**రావయ్యా చందమామయ్యా! - స్వరూప్ సిన్హా**

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**'చందమామ ఎలా ఉంటాడు?'**

తనలో తానే గొణుక్కున్నాడు హేమంత్ పదోసారో, పదకొండోసారో!

'ష్. గట్టిగా అనకు.. సార్ రౌండ్స్ కొస్తున్నారు....' హెచ్చరించాడు ప్రక్కనుండే నేస్తం మహేష్. అయిష్టంగా... కంటి చూపును చదివే స్టడీమెటీరియల్ పైకి సారించడానికి ప్రయత్నిస్తున్నాడు హేమంత్.

'భగవాన్.. ఇంకా రెండు గంటలు... ఈ స్టడీ అవర్స్ అయిపోయేటప్పటికి రాత్రి పదిన్నరవుతుంది...' ముళ్ళమీద కూచున్నట్టుంది.

'ఈసారి ప్రీ - ఫైనల్లో మునుపటి సెవంటీఫైవ్ పర్సెంటొస్తే సరిపోదు... అసలు నువ్వేమనుకుంటున్నావు... ఎంత కాంపిటీటివ్ వరల్డ్‌లో మనమున్నామో నీకేమైనా అవగాహన ఉందా.. బాగా మనసు పెట్టి చదువు.. అలా మార్కులు తెచ్చుకుంటేనే నేను నిన్ను హాలిడేస్‌కు ఇంటికి తెచ్చేది. లేకుంటే స్లోలెర్నర్స్ బ్యాచ్‌లో వేయమని మీ ప్రిన్సిపాల్‌తో చెప్పి సెలవులంతా అక్కడే ఉంచేస్తాను జాగ్రత్త.... ' పెద్ద కంపెనీలో పెద్ద పోస్టులో ఉండే తండ్రి బెదిరింపు!

'డాడీ నీ మంచికే చెపుతున్నారు కన్నా... బాగా శ్రద్ధగా చదవాలి. ముందు క్లాసులో నీ వెనక ర్యాంకులో ఉండే ఆ మహేష్ వాళ్ళంతా ఇప్పుడు చూడు ఎయిటీ ఫైవ్, నైంటీ లెవెల్‌కి వెళ్ళిపోయారు.. కాంపిటీటివ్ స్పిరిట్ ఉండాలి...' మరొక పెద్ద కంపెనీలో ఇంకా పెద్ద పోస్టులో ఉన్న తల్లి హెచ్చరిక. తల్లితండ్రులంతగా హేమంత్‌ను శ్రద్ధ పెట్టి చదవమంటున్నది ఏ ఇంటరో, ఎమ్సెట్టో, ట్రిపుల్ ఐటి అనుకుంటే పొరపాటే. హేమంత్ చదువుతున్నది ఆరో క్లాసే! నెలలో రెండో ఆదివారం గంట సేపు తలిదండ్రులతో మాట్లాడనిస్తారు ఆ రెసిడెన్షియల్ స్కూల్లో. "మమ్మీ.. అసలు చందమామ ఎలా ఉంటాడు మమ్మీ.. చూసి చాలా రోజులైంది.. నాకు గుర్తురావట్లేదు..." ఊహించని ఈ ప్రశ్నకు హేమంత్ తల్లి అవాక్కయింది. తండ్రి కొడుకునో పిచ్చివాణ్ణి చూసినట్టు చూసాడు..!

ఆలోచనల్లో మునిగిపోయిన హేమంత్ భుజంపై చరున బెత్తం దెబ్బపడింది 'అమ్మా!...' భుజం తడుముకుంటూ మూలిగాడు.

రౌండ్స్‌లో ఉన్న ట్యూటర్ హెచ్చరించాడు.'నువు పుస్తకం ఎదురుగా పెట్టుకున్నావుగానీ చదవట్లేదు... పదినిముషాల్లో నాకు ట్వంటీఫస్ట్ పేజీలోని కొశ్చెన్‌కు ఆన్సర్ చెప్పాలి..' అతని ముఖం రౌద్రంగా ఉంది. హేమంత్ కన్నుల్లో నీరు తిరిగింది పుస్తకంలోనికి దృష్టి సారించాడు.

'అయినా నీకిదేం పిచ్చి పట్టుకుందిరా.. ఎప్పుడూ చందమామను గురించి ఆలోచిస్తూ కూచుంటావు..' గుసగుసగా అడిగాడు మహేష్.

నిట్టూర్చాడు హేమంత్. ఎప్పుడో చిన్నప్పుడు అమ్మమ్మ ఉన్నప్పుడు చందమామను చూపిస్తూ తీయటి పాటలు పాడుతూ.. తనకు కమ్మనైన బువ్వ తినిపించడం లీలగా గుర్తుంది. మమ్మీ డాడీలు పెద్ద ఉద్యోగాలు చేస్తూ ఎప్పుడూ బిజీగా ఉంటారు గాబట్టి అమ్మమ్మ చనిపోయాక ఎవరికీ తనతో కొంత సమయం గడిపే తీరికలేకపోయింది. అందుకే బేబీ క్లాసు నుండీ తనని రెసిడెన్షియల్ స్కూల్లోనే చేర్పించారు.

ప్రతి రెండో ఆదివారం వస్తే తనకు ఇంటిమీద ధ్యాస మళ్ళుతుందని రెండు మూడు నెల్లకోసారి వస్తూ ఉంటారు. మమ్మీ డాడీ వచ్చిన రోజు ఆ ఒకటి రెండు గంటలూ తన చదువు గురించే మాట్లాడతారు తప్ప మరొక టాపిక్కే ఉండదు.

తన స్నేహితుడు ప్రశాంత్ డేస్కాలర్. రోజూ ఉదయం తొమ్మిదింటికి వాళ్ళ డాడీ స్కూటర్లో దిగబెట్టి వెళతారు. సాయంకాలం నాలుగున్నరకి ఇంటికి తీసుకెళ్ళిపోతారు. తామిద్దరికీ ఈ బిజీ షెడ్యూల్‌లో ఓ పది నిమిషాలు మాట్లాడుకోవడానికి ఖాళీ దొరికినప్పుడు ప్రశాంత్ తన ఇంట్లో విశేషాలు చెపుతూ ఉంటాడు. టీ.వీ చూస్తూ కూచుంటే వాళ్ళకి రోజూ మాట్లాడుకునే తీరిక దొరకదని వాళ్ళ డాడీ అసలు టీ.వీ ఎప్పుడో తప్ప పెట్టనివ్వరట. వాళ్ళ మమ్మీ కూడా చాలా మంచిది. రోజూ రాత్రి అందరూ కలిసి ఎనిమిదింటికి భోంచేస్తారట. భోజనాలయాక ఆ రోజు జరిగిన విశేషాలూ, కబుర్లూ నవ్వుల్తో ఓ గంట గడుపుతారట. వాళ్ళమ్మగారు గానీ నాన్నగారు గానీ ప్రశాంత్‌ను వాళ్ళ చెల్లినీ కూర్చోబెట్టుకుని మంచి మంచి కథలు చెపుతారట. వారానికి మూడ్రోజులు ఓ గంట సేపు ప్రశాంత్ సంగీతాన్ని, వాళ్ళ చెల్లి డాన్స్‌ను నేర్చుకుంటారట. మిగతా రోజుల్లోనైతే సాయంత్రం అయిదింటి నుండీ ఆరింటి దాకా షటిల్ గానీ, టెన్నికాయిట్ గానీ నలుగురూ కలిసి ఆడతారట. ఇక ఎవరైనా చుట్టాలొస్తే సందడే సందడట. ఆదివారాలూ, సెలవుదినాలూ సరేసరి దగ్గర్లో గుడికిగానీ, చుట్టుప్రక్కల ప్రదేశాలకి పిక్నిక్‌కి గానీ వెళ్ళివస్తారట. పగలు సూర్యోదయాల్నీ చూస్తూ ధ్యానం, పూజ చేసుకోవడం... సాయంత్రాలు చంద్రోదయమవుతూనే కొంత సేపు ఆరుబయట గానీ, డాబాపైన గానీ వెన్నెల్లో కూచుని కథలు చెప్పుకోవడం పాటలు పాడుకోవడం.. వెన్నెల్లో ఆటలాడుకోవడం... చందమామ చూస్తుంటే వెన్నెల్లో కూచుంటే తప్ప ఆ హాయి తెలియదు. ఓహ్.! ప్రశాంత్ చెపుతూ ఉంటే హేమంత్‌కు తనివి తీరేది కాదు. ఇంకా ఇంకా.. కథలాగా చెప్పించుకుని వినేవాడు..

'అసలు చందమామ ఎలా ఉంటాడురా...?' ఉన్నట్టుండి ప్రశ్నించే హేమంత్‌ను ఆశ్చర్యంగా చూసేవాడు ప్రశాంత్.

'అదేమిట్రా...నువ్వెప్పుడూ చూళ్ళేదా..?'

'చిన్నప్పుడెప్పుడో చూసిన గుర్తు... ఇక్కడ ఎలా వీలవుతుందిరా.. ఎప్పుడూ హాల్లో స్టడీ అవర్‌లో కూచోవాలి లేక డార్మిటరీలో పడుకుని నిద్రపోవాలి తప్పితే క్లాస్ రూం.. కనీసం పౌర్ణమి రోజు కిటికీ ప్రక్కన కూచుని కిటికీ మెష్‌లోంచి తొంగి చూద్దామంటే ట్యూటర్ సార్ వచ్చి, నేను చదువునుంచి డైవర్ట్ అవుతున్నానని తిట్టి నాపై కంప్లయింట్ ఇచ్చారు. ఆ మర్నాటి నుండీ బయటి ప్రపంచం కనిపించకుండా కిటికీలకు నల్లటి దట్టమయిన విండో కర్టెన్స్ వచ్చి చేరాయి. ఆ సండే మా పేరెంట్స్‌కూ ఇదే కంప్లయింట్ అందింది.

అప్పుడు డాడీ చెప్పారు బయట విషయాలను మరిచిపొమ్మని... చదువుపైనే కాన్సంట్రేట్ చెయాలనీ.. లేకుంటే ఎందుకూ పనికి రారనీ..' చెప్పాడు కన్నీళ్ళతో హేమంత్.

'అయ్యో పాపం... నువ్వు మా ఇంట్లోనే పుట్టి ఉంటే బాగుణ్ణు. మనిదరం ఎంచక్కా అన్నదమ్ములా కలిసిడుకునేవాళ్ళం కదూ...' హేమంత్ భుజంపై చేయివేసి ఓదార్చాడు ప్రశాంత్. అతనికి తన స్నేహితుని 'జైలు' జీవితం చూస్తే కళ్ళు చెమర్చాయి.

రాత్రి పదిన్నరకి డార్మిటరీ లోని 'త్రీ టైర్ స్లీపర్' పైకి చేరుకోగానే.. హేమంత్ నిద్రకుపక్రమిస్తూ రోజూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కోరేవి రెండే కోరికలు - దేవుడా నాకు చందమామను చూపించు. వెన్నెల్లో ప్రశాంత్ వాళ్ళింట్లోలా, మా మమ్మీ డాడీలతో ఆడుకోనివ్వు.. పిల్లలందరూ వారి వారి బెడ్స్ (బెర్తులనాలేమో!) చేరుకోగానే వార్డెన్లు వచ్చి లైట్లు తీసివేస్తారు. ఎవరూ ఎవరితోనూ అనవసరంగా మాట్లాడరాదు. మాట్లాడితే టైమ్ వేస్ట్. మళ్ళీ పొద్దున నాలుగింటికే లేవద్దూ!

సుమారు రాత్రి పన్నెండవుతుండగా ఎవరో తనను తట్టి లేపుతునట్లయి కళ్ళు తెరిచి చూసాడు హేమంత్! ధగ ధగ మెరిసే తెల్లటి వస్త్రాల్లో చల్లనైన చిరునవ్వుతో.. కన్నులో కరుణ, వాత్సల్యం పొంగి పొరలుతుండగా తననే పిలుస్తున్నాడు, ఎవరతను? 'బాబూ.. హేమంత్ లే నాన్నా... నాతోరా... మనం అలా షికారుకు వెళ్ళి ఆడుకుందాం..'

'ఎవరు. ఎవరు.. మీరు..?'

'నేను... కన్నా.. నన్ను గుర్తుపట్టలేదా.. నువ్వెప్పుడో చూసిన నీ చందమామను..'

ఓహ్.. ఇతనేనా.. చందమామ.. ఎంత అందంగా ఎప్పుడో సినిమాలో చూసిన రాకుమారుడిలా ఠీవిగా ఉన్నాడు. మంచుతో కడిగి పోసిన మల్లెలంత తెల్లనైనవాడు.. ముత్యాలరాశులను తలదన్నే చిరునవ్వుతో.. చల్లచల్లగా తనను తట్టిలేపుతున్నాడు.

నెమ్మదిగా కలలోలా మేఘాలపై తేలిపోతున్నట్లుగా ఉంది హేమంత్‌కు లేవడానికి ప్రయత్నించి తూలి పడబోయాడు. 'ఆ...ఆ...నెమ్మదిగా నాన్నా.. ఇలారా నేను నిన్ను ఎత్తుకుంటాను'.

తన వెచ్చనైన చేతులు హేమంత్‌ను చుట్టేసి పైకి లేపి ఒక్క మారు ఆ చల్లని ఎదకు పొదుముకున్నాయి. అలాగే కొంతసేపు అతని ఎదను అనుకొని సేదతీరాడు హేమంత్. ఎంత హాయిగా ఉందిప్పుడు... రోజంతా మాస్టార్లచే తిన్న తిట్లూ, దెబ్బలూ, నిరసనలూ, ఛీత్కారాలు... బెంచీలమీద కూచుని చదివిన ఒళ్ళునొప్పులూ, కళ్ళ నొప్పులూ, రోజువారీ పరీక్షలు వ్రాసి వ్రాసి వచ్చిన వేళ్ళనొప్పులూ అన్నీ అలా... అలా.. ఆ క్షణంలో మాయమయ్యాయి. మరింతగా అతన్ని కరుచుకుపోయి కళ్ళు మూసుకున్నాడు. అంతలో హేమంత్‌కు ఏదో గుర్తొచ్చినట్లుగా చటుక్కున క్రిందకు దిగాడు.

'ఏం నాన్నా నేను నిన్ను ఎత్తుకుని తీసుకెళుతున్నాగా దిగిపోయావేం?' చిరునవ్వుతో అడిగాడతను.

సిగ్గుపడ్డాడు హేమంత్ 'అది కాదండీ.. నేనేమన్నా చిన్నపిల్లాణ్ణా. ఇలా మీరు నన్ను ఎత్తుకుని తీసుకెళ్ళడం ఎవరన్నా చూస్తే నవ్వుతారు.'

'నన్ను ముందు నువ్వు అండీ గిండీ అనడం మానేయాలి'.

'మరేమని పిలవాలి' ఆశ్చర్యంతో కళ్ళింతయ్యాయి హేమంత్‌కు.

'నన్ను చూస్తే నీకెవరు గుర్తొస్తున్నారు...?'

ఊ..కళ్ళు మూసుకుని కొంచెం సేపు ఆలోచించి చెప్పాడు హేమంత్ 'మమ్మీ... మా అమ్మ గుర్తుకొస్తుంది. అలాగే డాడీ.. నీలా కోపం లేకుండా నాతో నవ్వుతూ మాట్లాడితే బాగుండుననిపించే డాడీ గుర్తుకొస్తున్నాడు...'

'అదీ.. మమ్మీ, డాడీ ఇద్దరూ నాలాటి వాళ్ళే కాబట్టి చందమామ అందరికీ మామయ్యే... నన్ను మామయ్యా అని పిలువు.'

'మామయ్యా.. మామయ్య..' ఎంతో తియ్యగా ఉందా పేరు పదే పదే అనుకున్నాడు హేమంత్.

'సరే మామయ్య నిన్ను అలాగే పిలుస్తాను. నాకో సాయం చేసి పెడతావా?' ఆశగా అతని కళ్ళలోకి చూసాడు.

'చెప్పు నాన్నా... అంతకంటేనా!'

'మరేం లేదు... మా మమ్మీ డాడీలతో చెప్పి ఆ ప్రశాంత్‌లాగా నేను డేస్కాలర్‌గా వచ్చే ఏర్పాటు చెయ్యి. ఎంచక్కా ఇంట్లో మమ్మీ డాడీలతో ఆడుకుంటాను. ... అసలు నేను ఇక్కడి కంటే ఇంట్లో ఉంటేనే బాగా చదవగలను. '

'తప్పకుండా చెబుతాగా... నువ్వెప్పుడూ సంతోషంగా ఉండి బాగా చదువుకుని గొప్పవాడివి కావాలి. సరేనా....? అలా అని మాటిస్తావా' చేయి చాచాడు చందమామ.

'ప్రామిస్' చేతిలో చేయివేసి చెప్పాడు హేమంత్

గులాబీ పువ్వంత కోమలమైన ఆ చిన్నారి చేతిని పెదవుల కానించుకుని 'థాంక్స్' అన్నాడతను.

....'ఎవరదీ... తలుపు ప్రక్కనే నిద్ర నుంచి హఠాత్తుగా మేలుకున్న వార్డెన్ కళ్ళు నులుముకుంటూ లైటు వేసాడు. హేమంత్‌ను చూసి ఉగ్రుడైపోయాడు వార్డెన్.

'ఏరా రాస్కెల్.. అందరూ నిద్రపోయే టైంలో ఎక్కడికీ షికారుకి బయలుదేరావ్? పారిపోదామనే?' నిలదీసాడు.

'అబ్బే.. లేదు. లేదు.. సార్.. చందమామ వచ్చి నన్ను ఆడుకుందాం రమ్మన్నాడు.. అందుకే....! ' నీళ్ళు నమిలాడు హేమంత్.

'ఏమిటీ...?' కళ్ళింత చేసుకుని హేమంత్ ముఖంలోకి చూసాడు.

'అవున్సార్.. నేను నిజమే చెపుతున్నా.... చందమామ వచ్చాడు.. నాతో మాట్లాడాడు...' స్పష్టంగా చెప్పాడు హేమంత్.

హాస్టల్లో నిద్రిస్తున్న మిగతా స్టూడెంట్‌లూ, వార్డెన్‌లూ రెసిడెన్షియల్ ట్యూటర్‌లూ... అందరు లేచి వింతగా చూడటం మొదలు పెట్టారు... వీరివైపు.

ఆ మరునాటి ఉదయం పదిగంటలకి ప్రిన్సిపాల్ ఒక మీటింగ్ ఏర్పాటు చేసాడు. రాత్రి హేమంత్ అనే ఓ తరగతి విద్యార్థి పారిపోవడానికి ప్రయత్నించాడని దానికి కారణాలు పరిష్కారాలు తెలుసుకోడానికి ఏర్పాటు చేయబడిన అత్యవసర సమావేశమది!

'అసలు హేమంత్‌ను సైకియాట్రిస్ట్‌కు చూపించడం మంచిది సార్... ఆ పిల్లవాడు గత కొన్ని నెలలుగా... చందమామ... చందమామ... అని ఏదో పిచ్చిగా మాట్లాడుతూ అన్నాడు...' చెప్పాడొక వార్డెన్. నిజమేనంటూ వత్తాసు పలికారు మిగతా స్టాపంతా.. తోటి విద్యార్థులు కూడా అవునని అంగీకరించారు. కానీ ప్రశాంత్ మహేష్ లాటి ఏ కొద్దిమందో విషయం అర్థం కాక దానికి మించి స్నేహితుడిపై జాలి, ప్రేమ వల్ల గుడ్ల నీరుకక్కుకుంటూ మౌనంగా ఉండిపోయారు.

ప్రిన్సిపాల్ గొంతు సవరించుకుని బిగ్గరగా అన్నారు. 'హేమంత్ ను చూపించవలసింది సైకియాట్రిస్ట్‌కు కాదు కేవలం అతని తల్లిదండ్రులకు... రేపు సాయంత్రం ఏడింటికి విద్యార్థుల తల్లిదండ్రులందర్నీ మనం డిన్నర్‌కు ఆహ్వానిస్తున్నట్లు మెసేజ్ పంపించండి...' ప్రిన్సిపాల్ చెప్పేది ఎవ్వరికీ అర్థంకాలేదు. మళ్ళీ ఆయనే అన్నారు పి.యి.టి. వైపు తిరిగి 'మిస్టర్ శర్మ.. ప్రతి క్లాసుకు వారంలో మూడు రోజులు గేమ్స్ వచ్చేలా చూడమని చెప్పాను. పిల్లల్ని మీరు ఆటైములో ఆడిస్తున్నారా?'

'గేమ్స్ ఆడిస్తే వీళ్ళు చదవడం లేదని కంప్లైంట్స్ వచ్చాయి సార్.. అందుకనీ..!'

'ఇట్సాల్ నాన్సెన్స్! సరే సరే.. రేపు డిన్నర్‌కి అన్ని ఏర్పాట్లు చెయ్యండి.'

మన హాస్టల్ టెర్రస్ మీద.. 'మూన్ లైట్' డిన్నర్ అన్నారాయన. మూన్ లైట్ అన్న పదాన్ని వత్తి పలుకుతూ ఈసారి అందరి నోళ్ళూ ఆశ్చర్యంతో మరింత పెద్దవయ్యాయి. 'బైదివే... హేమంత్‌ను ఈ రోజు మా ఇంటికి గెస్ట్‌గా తీసుకెళుతున్నాను... మళ్ళీ రేపు రాత్రి డిన్నర్‌కు అతని పేరెంట్స్ వచ్చేవరకూ మా దగ్గిరే ఉంటాడు... రేపంతా క్లాసులకి రాడు.. మీకేం అభ్యంతరం లేదు కదా...' అన్నారాయన వారి ముఖాల్లోకి పరీక్షగా చూస్తూ. వారు కేవలం గుడ్లు మిటకరించారు! ఆ మర్నాడు డాబా మీద ఏర్పాటు చేసిన వేదికపై ప్రిన్సిపాల్ ప్రక్కనే కరస్పాండెంట్ గారు మరొక ప్రక్కన హేమంత్ కూచుని ఉన్నాడు. హేమంత్ ముఖం ఎప్పుడూ లేనంత సంతోషంగా అగుపించింది. ఆకాశంలో అందమైన చందమామ వెన్నెల నవ్వులు కురిపిస్తూ ఉన్నాడు.

హేమంత్ తల్లిదండ్రులు మాత్రం వచ్చిన పదినిముషాల లోపే తమ కొడుక్కేదో అనారోగ్యం చేసిందని.. చాలా ఆందోళనగా... భయంగా ఉన్నారు. అక్కడికొస్తూనే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. హేమంత్‌కు పిచ్చి పట్టిందని కొందరూ, నిద్రలో లేచి నడుస్తున్నాడని మరికొందరు, గాలి సోకిందని ఇలా రకరకాలుగా మాట్లాడుకుంటూ సానుభూతి చూపిస్తున్నారు.

అంతలో ప్రిన్సిపాల్ వచ్చిన పేరెంట్స్‌ను, విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడాడు. 'హేమంత్ ఒక్కడే కాదు ఇలా ఎందరో విద్యార్థులు పదిమందిలో ఉండి కూడా ఒంటరితనం ఫీలవుతున్నారు. వారిక్కావలసింది మెడికల్ ట్రీట్‌మెంట్ కాదు మిత్రులారా... 'ప్రేమ' ట్రీట్ మెంట్ ఇది కేవలం తల్లిదండ్రుల వల్ల మాత్రమే సాధ్యమయేపని. మీరు మీ పిల్లలతో కనీసం వారానికోరోజు కొన్ని గంటలైనా గంటలైనా గడపండి... వారితో మాట్లాడండి.. విసుక్కోకండి.. నవ్వుతూ..... హాయిగా.. వారితో గడపండి.'

ఒక పేరెంట్ లేచి కార్డ్‌లెస్ మైకు తీసుకుని చెప్పాడు.

'మేమొస్తే డిస్టర్బ్ అవుతారని రావడం లేదు. వారిని చదివించాల్సిన బాధ్యత మీదే కదండీ... మీకు పిల్లల్ని అప్పగించాక మీదే బాధ్యత కదా?'

'చూడండి సార్.. మేం చదువు చెప్పగలంగానీ తల్లీ తండ్రీ ఇచ్చే ఆప్యాయత ఇవ్వలేం.. మేం రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టింది దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు, చదువుకోడానికి ఇంట్లో పరిస్థితులు అనుకూలించని వారికే గానీ..అన్ని పరిస్థితులూ అనుకూలంగా ఉన్నా.. బాధ్యత తప్పించుకోవడానికి పిల్లల్ని రెసిడెన్షియల్స్‌లో వేసి చేతులు దులుపుకునే వారికోసం మాత్రం కాదు. ఒక వేళ అలాటి ఉద్దేశమేదైనా ఉన్నట్లయితే దయచేసి మీ పిల్లల్ని వెంటనే ఇక్కణ్ణించి తీసుకుపొండి.. ఎన్ని ఎక్కువ గంటలు స్టడీ అవర్స్ ఉంటే పిల్లలంత బాగా చదువుతారనుకోవడం కేవలం మీ భ్రమ! దయచేసి హేమంత్ పేరెంట్స్ ఒక్కసారి స్టేజ్ మీదకు రండి' పిలిచాడతను.

వారు సందిగ్ధంగా.. భయంగా వచ్చి నిలుచున్నారు....

'చూడండి.. హేమత్ ఈజ్ పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్.. బాబుక్కావలసింది కేవలం మీ ఆప్యాయత మాత్రమే... చిన్నపిల్లలు దైవస్వరూపాలండి! వాళ్ళతో కొంతసేపు గడపండి.. వారిక్కావలసింది అమ్మా నాన్నల సామీప్యమూ, స్పర్శ.. రోజూ కాకున్నా.. వారానికొక్కసారి మీ చిన్నారులను దగ్గరకు తీసుకోండి. కొన్ని నిమిషాలు వారిని మీగుండెలకు హత్తుకుని వారికి మేమున్నాము అన్న భరోసా ఇవ్వండి. వారెంత హాయిగా, సంతోషంగా ఫీలవుతారో చూడండి. వారితో ఆడండి. పాడండి.. అప్పుడు వాళ్ళంతట వాళ్ళే చదువుమీద దృష్టి సారిస్తారు.. హేమంత్ తను ఒంటరిగా ఫీలవుతూ తననర్థం చేసుకునే ఓ బలమైన ఆధారం కోసం వెతుకుతూ ఉన్నాడు... ఆ నమ్మకాన్ని బాబులో కలిగించగలిగేది తల్లిదండ్రులు మీరే.. హేమంత్ వెదుకుతున్న చందమామ మీరే సార్' ఒక్కసారి అతను హేమంత్‌ను ఎత్తుకుని నుదుటి మీద ముద్దాడి తండ్రి చేతికి అందించాడు. హేమంత్ తండ్రి అశ్రునయనాలతో కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు.

## ఆసరా - జయంతి వెంకట రమణ

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

"**గోవిందరావుగారు** రెండు రోజులై నీ కోసం వస్తున్నార్రా! నీవేమో ఇంటర్ పరీక్షలంటూ ఆ ఊళ్ళో కూర్చున్నావు. పాపం ఆయనకు నీతో ఏం పనిపడిందో ఏమిటో" అంది మా అమ్మ. బస్సు దిగి నేను ఇంట్లో కాలు పెడుతుంటే.

"పనేమిటో చెప్పలేదామ్మా?" అని అడిగాను, ఎంతో ముఖ్యమైన పని ఉంటే గానీ ఆయన రారని తెలిసి.

"లేదురా! కానీ ఏదో పెద్ద పని ఉన్నట్టే ఉంది. మళ్ళా రాత్రి వస్తారో ఏమిటో, ఇప్పటికే రాత్రి ఏడయింది. ఆయన్నీ రాత్రి బాధపెట్టడమెందుకు? కాళ్ళూ చేతులు కడుక్కుని, ఇంత కాఫీ తాగి నీవోసారి వాళ్ళింటికి పోరాదు" అంది.

నేనూ వాచీ చూసుకుని "అలాగే లే అమ్మా" అంటూ స్నానానికి వెళ్ళాను.

ఓ పావుగంటలో తయారై గోవిందరావుగారింటి కెళుతుంటే దారిలోనే ఎదురొచ్చారాయన. మా బాబాయి, ఆయన టవునులో ఒకే చోట ఒకే డిపార్ట్ మెంటులో పనిచేయడం చేత అతను, అతని కుటుంబం, మాకు బాగా తెలుసు. అతను కష్టపడి పైకొచ్చినవాడు. ఒక కొడుకు, ఒక కూతురు. ఇద్దర్నీ బాగా చదివించాడు. మంచి ఉద్యోగాలు రాగానే పెళ్ళిళ్ళు చేసేసి పంపేశాడు. నలుగురూ ఉద్యోగస్తులే. బెంగుళూరులో. అతనికే సమస్యలూ లేవు. ఆయన తల్లి, మాకు బాగా సన్నిహితం. ఆమె కోదండరామస్వామి కోవెల్లో పాడే ఆధ్యాత్మరామాయణ కీర్తనలంటే మాకెంతో ఇష్టం. ఆమె కొన్నాళ్ళు గోవిందరావుగారి దగ్గర. కొన్నాళ్ళు అతని తమ్ముడు సూర్యారావు దగ్గర కాలక్షేపం చేస్తూ ఉంటుంది. సూర్యారావ్ టవునులో ఉంటాడు. వీళ్ళ చిన్నతనంలోనే తండ్రిపోతే, ఈమే వాళ్ళని కష్టపడి చదివించి, పెద్ద చేసి ప్రయోజకులను చేసింది. వాళ్ళకు పెళ్ళిళ్ళయిన తరువాత అక్కడా ఇక్కడా కాలక్షేపం చేయడం ఆమెకు తప్పనిసరి అయింది.

నన్ను చూడగానే గోవిందరావుగారు నడక వేగం తగ్గించారు. ఇద్దరం దారిప్రక్కనే ఉన్న రావిచెట్టు క్రింద సిమెంటు బల్లమీద కూర్చున్నాం

"మీరేదో అత్యవసరమైన పని మీదే వచ్చారని అమ్మ చెప్పింది. రేపుదయమే డ్యూటీకి బయలుదేరి వెళ్ళాలి. అందుకే వచ్చాను. అమ్మగారి ఆరోగ్యమెలా ఉంది? ఆ మధ్య హై.బీ.పి అన్నారు. ఇప్పుడు కులాసాయే కదా?" అడిగాను.

"అందరూ బాగానే ఉన్నారు. మీరు నాకొక సహాయం చెయ్యాలి. మరి మీరు అన్యథా భావించకూడదు" అన్నాడు నా చేతులు పట్టుకుని.

"చెప్పండి."

"మీరు మనసులో పెట్టుకోవాలి."

"ఎవరితోనూ చెప్పను. సరేనా? మీకు నేనేం చేయగలనో చెప్పండి" అన్నాను.

"మీరు ఇంటరు పరీక్షలు నిర్వహించడం కోసం 'ఛీఫ్'గా వేళుతున్నారట కదా."

"అవును. మన ఊరికి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఊరి పేరు, కాలేజీ వివరాలు..."

"తెలిసే వచ్చాను. ఏ'మాల్' ప్రాక్టీసో చేయించవచ్చాననుకునేరు. అదేం కాదు. ఇది నా వ్యక్తిగతం. ఆ ఊరిలో ఒక ఆశ్రమం ఉందట. దాని వివరాలు కావాలి"

"ఆశ్రమమా? ఏ ఆశ్రమం? దాని నిర్వహణ ఎవరు చేస్తున్నారు? ఏ స్వామి?"

"అది వృద్ధాశ్రమం. అక్కడ ముసలి వాళ్ళనుంచుకుని వాళ్ళ మంచి చెడ్డలను చూస్తారట కదా. దాని వివరాలు నాకు కావాలి. ఆ మధ్య ఓ పేపరులో ఆ ఆశ్రమం గురించి చదివాను. లక్కీగా మీరు ఆ ఊరే వెళుతున్నారు. అందుకే మీ దగ్గరకొచ్చాను"

విషయంభాగానే అర్ధమైంది. అయినా అన్నాను అమాయకంగా " మీరింకా సర్వీసులోనే ఉన్నారు కదా!"

"నా గురించి కాదండి. మా అమ్మగురించి"

నేను కాసేపు మాటాడకపోతే తనే అన్నాడు "మా తమ్ముడు పెళ్ళి చేసుకుని, టవునులో కాపురం పెట్టిన దగ్గరనుండి, ఓ మూడేళ్ళు మా అమ్మ నా దగ్గరే ఉంది, అటు తరువాత నాలుగేళ్ళయి, ఓ ఆరునెలలు వాడి దగ్గర, ఓ ఆరునెలలు నా దగ్గర ఉంటూ వస్తోందని, మీకు తెలుసుగా. వాడీ మధ్య ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులో ఫ్లాటు కూడా తీసుకున్నాడు. వాడు వాడి భార్య ఇద్దరూ ఉద్యోగస్తులే. ఇప్పుడు వాడి భార్యకు ప్రమోషన్ వచ్చిందట. పిల్లలూ పెరిగి పెద్దవుతున్నారట. వాళ్ళకో గది, వీళ్ళలో గది అవసరం పడటంతో ఇల్లు వాళ్ళకేసరిపోవటం లేదట. వాడి పిల్లలకీ, అమ్మకీ పడటం లేదట. అమ్మది సర్దుకుపోయే నైజమే. అయినా ఈనాటి పిల్లల సంగతి మీకు తెలుసుగా. మనమాటే వినరు. మనం పడిన కష్టాలు వాళ్ళకు సుత్తి. ఈ పరిస్థితిలో వాడి మరదలు, యూనివర్శిటీలో పై చదువుల కోసం వచ్చిందట. ఓ వారం రోజుల పాటు అమ్మ కారిడార్‌లోనే పడుకుందట. అందుచేత మా సూర్యం అమ్మను నా దగ్గరకు పంపేస్తూ 'ఇక అమ్మను నీ దగ్గరే ఉంచేసుకో. నెలకి ఇంతో అంతో పంపిస్తాన'ని మెసేజ్ పంపాడు. వాడు వదిలేశాడని నేను వదిలేయగలనా చెప్పండి. అమ్మను నా దగ్గరుంచేసుకోడానికి నేకేమీ అభ్యంతరం లేదు. ఇల్లు పెద్దది. ఎక్కడ తిరిగినా అడిగేవారుండరు. కానీ ఈ మధ్య అమ్మకీ వాతావరణం పడటంలేదు. నీళ్ళు పడటం లేదు. ఎప్పుడూ ఏదో అనారోగ్యమే. మనదేమీ పెద్ద ఊరు కాదు. జలుబు, జ్వరానికి డాక్టర్లే గానీ, పెద్ద డాక్టర్లు లేరు. అన్నింటికీ టవును పోవలిసిందే ఓ సారి అమ్మకు జబ్బు చేస్తే టవును తీసుకెళ్ళి వారం రోజులుంచాం. చిత్రమేమిటో తెలుసునాండి. ఇంత జరిగినా వాడొక్క రోజు తొంగి చూడలేదు. కబురు పెట్టినా రాలేదు. మేమింత చేస్తున్నా ఇక్కడ కొచ్చిన దగ్గరనుండి అమ్మ వాడిని, వాడిపిల్లల్ని తలచడమే. 'అక్కడున్న రోజుల్లో మనల్ని కూడా అమ్మ అలాగే తలుస్తుందిలే' అని నే అన్నా మా ఆవిడ ఊరుకోదు. మా అమ్మ ఊరికే కూర్చునే రకం కాదు. చిన్నా చితకా పనులు చేసిపెడుతూనే ఉంటుంది. కానీ మా అమ్మ చేసిన పనులు మా ఆవిడకు నచ్చవు. ఏవో వంకలు పెడుతుంది. అమ్మ ఇచ్చే సలహాలు మా ఆవిడకు నచ్చవు. ఎప్పుడైతే మా అమ్మ నాదగ్గరే ఉండిపోడానికి వచ్చేసిందని తెలిసిందో అప్పటినుండి మా ఆవిడ ఆరునెల్లకంటే ఎక్కువ ఉండడానికి వీల్లేదని పట్టుపట్టింది. రోజూ దేనికో దానికి తగువులు, తంటాలు. నాకు అన్నీ ఉన్నాయి. ఏ సమస్యలూ లేవు. మరి ఇదేంటండీ ఈ తలకాయనొప్పి నాకు? అందుకే మా అమ్మను ఏ వృద్ధాశ్రమంలోనో ఉంచేద్దామని నిర్ణయానికొచ్చాను. మా అమ్మను ఆ ఊరి ఆశ్రమంలో ఉంచడానికి వీలవుతుందేమో కనుక్కోండి" అంటూ నా చేతులు పట్టుకున్నాడాయన. గొంతు బొంగురు పోయింది. కళ్ళలో నీళ్ళొచ్చాయి.

"మీ అమ్మగారికి, మీ ఆలోచనలు తెలుసునా?" అడిగాను.

"తెలియవు. తెలిస్తే ఒప్పుకోదు. ఆ మధ్య ఓసారి మాటల్లో పెద్దవాళ్ళ బాధ్యతల గురించి వస్తే 'ముసలితనం వచ్చేసిన తరువాత పిల్లల దగ్గర తప్ప మరెక్కడా ఉండకూడదురా' అంది అమ్మ"

"మరి ఇప్పుడెలాగ?"

"ఆ ఊళ్ళో మా ఆవిడ దూరపు బంధువులున్నారు. వాళ్ళింటికని వెళతాం. రెండు రోజు ఆశ్రమంలో తిరుగుతాం. మూడో రోజున అక్కడ చేర్పిస్తాం. అప్పుడప్పుడు వచ్చి చూచిపోతుంటామని ధైర్యం చెపుతాం. అమ్మ నెమ్మదిగా అలవాటు పడుతుంది. నేనైనా అమ్మను చూడకుండా ఉండలేను. అదీ అంతే. ప్రతి ఆదివారం వచ్చి చూస్తాం. డబ్బు కట్టాలంటే కడతాను. అక్కడి పరిస్థితులు మీరు చూసివస్తే చాలు" అన్నాడాయన.

"సరే. నేను ఓ వారం రోజులక్కడ ఉండాలి. ఈలోపుగా నాలుగూ కనుక్కుని వస్తాను."

"ఏదైనా మీరక్కడున్నప్పుడే జరిగిపోవాలి"

"సరే" అని హామీ ఇచ్చి పరీక్షా కేంద్రానికి ఆ మర్నాటి ఉదయమే బయలుదేరి పోయాను. మరి ఆలోకంలో పడితే, ఇల్లు, పిల్లలూ ఎవరూ గుర్తుకురారు. ఉదయాన్నే పోలీస్ స్టేషన్ కెళ్ళడం. ప్రశ్నాపత్రాల పార్శిల్స్ తీసుకోవడం, పరీక్షలు సక్రమంగా నిర్వహించటం, తనికీ అధికారుల ముందు సమాధానాలు సిద్ధం చేయడం, మర్నాటి పరీక్షకు ఏర్పాట్లు చూచుకోవడం. అదో ప్రపంచం.

మరో రెండు రోజులు పోయిన తరువాత సమాధాన పత్రాల్ని పార్సిల్ చేస్తున్న సత్తిబాబుతో "ఈ ఊళ్ళో ముసలివాళ్ళ కోసం ఆశ్రమం ఉందట నీకేమైనా తెలుసునోయ్?" అన్నాను.

"ఉందటండి"

"దాని వివరాలేమైనా నీకు తెలుసునా!"

సత్తిబాబు చేస్తున్న పనినాపి "నేనెందుకు తెలుసుకోవాలండి?" అన్నాడు.

"అలా కోప్పడకోయి. ఒకరడిగారు. అందుకే అడిగాను"

"కోపం కాదండి. ఈ ముసలివాళ్ళంతాఆశ్రమాల్లో కూకుండిపోతే మరి మనకు పెద్దదిక్కెవరండీ! మా యమ్మ, మా నాయనా నాకాడ ఉన్నారు కాబట్టే, మా ముదురోడికి సంబంధమొ చ్చినా, నా పెద్దమ్మాయికి సంబంధమొచ్చినా, మా తమ్ముడి కూతురు ఈడేరినా నాకు దిగులునేకపోయింది గదండి. అయినా ఆళ్ళకు వయసొచ్చేసినాదని ఆశ్రమాల్లలో ఇడిసిపెట్టేస్తే రేపు మన పిల్లలు అదే సెయ్యరాండి?" అన్నాడు పార్సిలుకు సీళ్ళేస్తూనే.

"నీవు చెప్పినదంతా నిజమేనోయి. నన్నొకరడిగారందుకని"

"సర్లెండి సారూ. రేపుదయానికల్లా అడ్రెస్ తెస్తాకదా" అన్నాడు. మరునాడు ఉదయానికల్లా అడ్రస్ తీసుకొచ్చి మాట నిలబెట్టుకున్నాడు. ఆ రోజు నేను ఇంటికి వెళ్ళడానికి అవలేదు. మర్నాడు పరీక్షలయిన తరువాత నే వెళ్ళేసరికి వీధివరండాలో నైటు లాంపు వెలుగులో కుర్చీలో దీర్ఘాలోచనలో కూర్చున్న గోవిందరావుగారు నన్ను చూసి "ఇవ్వాళ వస్తారనే చూస్తున్నాను" అన్నాడు.

నేను ఎడ్రస్ కాగితం అతనికిచ్చాను.

"పూర్తి వివరాలన్నీ మీరే తెలుసుకోవాలి నాకు రావడానికి అవదు. మీమీద పెద్ద భారం పెడుతున్నాను. ఏమనుకోకండి" అన్నాడు.

"మరి మీ అమ్మగారికీ విషయం...."

"మేమెవరం అమ్మకు చెప్పలేదు. కాని తనికి అనుమానమొచ్చింది. బట్టలు, దుప్పట్లు ఉతికించడం, బ్యాగ్ జిప్పు సరిచేయించడం చూచి."

"మీరైనా ఆమెను మెంటల్‌గా ప్రిపేర్ చేయించాలి కదా. ఒక్కసారి నీటిని వదిలిన చేపను చేస్తే ఎలాగు?" అన్నాను.

"నిజమే మరి" అన్నాడాయన. ఆ మర్నాడుదయం కాస్త ముందుగానే బయలుదేరి అడ్రెస్ ప్రకారం ఆశ్రమాల్ని వెతుక్కుంటూ వెళ్ళాను.

విశాలమైన ఆవరణలో కొబ్బరి చెట్ల మధ్య పెద్ద గదుల్లో ఉందాశ్రమం. మూడు వేపులా గదులు - ఒకవేపు వంటశాల - భోజనశాల. ప్రక్కనే స్టోర్ రూము ఉన్నాయి. ఆఫీసు గది ఓ ప్రక్కగా ఉంది. ఆడా, మగ టాయిలెట్స్, స్నానాల గదులు ఉన్నాయి. పూలమొక్కలు, కూరగాయల పాదులు, ఒక బోరు బావి ఉన్నాయి. నేను వెళ్ళేసరికి ఆఫీసు గదిలోంచి విష్ణుసహస్రనామం వినిపిస్తోంది. నేను ఆఫీసు గదిలోకి వెళ్ళి వచ్చినపని చెప్పాను

"ఇక్కడ కుల, మత, జాతి వివక్షతలు లేకుండా వృద్ధులనందరినీ చేర్చుకుంటామండి. డాక్టరు పర్యవేక్షణ, వైద్య సదుపాయం ఉన్నాయి. సీరియస్ జబ్బులయితే తప్ప మేం మీ వరకు రానివ్వం. మీరు రావచ్చు. చూచిపోవచ్చు. అప్లికేషన్ ఇస్తాను. అందులో విధిగా వ్యక్తిగత ఆరోగ్యపరిస్థితి, బీ.పి, షుగరు, గుండెజబ్బులు వగైరా వివరాలన్నీ ఇవ్వాలి. వాటి ననుసరించే భోజనం విషయాల్లోశ్రద్ధతీసుకుంటాం ఉత్సాహంగా ఉన్న స్త్రీలు వంటపనిలోను, పురుషులు గార్డెనింగ్ లోను పాల్గొంటారు. ఏపనీ చేసుకోలేనివారి కోసం ఆయా, అటెండరు ఉంటారు. ఒక్కమాట ఇక్కడ చేర్పించిన తరువాత బాధ్యత లేదనుకుని చేతులు కడిగేసుకోకూడదు. ఒక ముసలాయని నలుగురు కుమారులు చేర్పించి, డొనేషన్ ఇచ్చేసి అమెరికా పారిపోయారు. అంతే ఆ తరువాత ఆయనకు ప్రాణం మీది కొచ్చి ఎన్ని టెలిగ్రాములిచ్చినా వాళ్ళు రాలేదు. అప్పుడు మాకు తెలిసింది వాళ్ళు విదేశాల్లో ఉన్నారని. ఆయన పోయినా లేదు. ఆశ్రమమే దహన సంస్కార బాధ్యతలు తీసుకుంది. దయచేసి అలా చేయకండి. మీరు త్వరగా వస్తే అవకాశమిచ్చిన వారమవుతాము. అప్లికేషన్ నింపి, రెండు పాస్ పోర్టు ఫోటోలు తెండి" అన్నాడాయన.

ఆయనతోపాటు ఆశ్రమంతా తిరిగి చూశాను. అంతా నచ్చింది. నేవెళ్ళేముందాయనన్నారు "మీరు మీవాళ్ళ కోసం పండ్లు, తినుబండారాలు తేవచ్చు మీరేమి తెచ్చినా మా దృష్టిలో పెట్టండి. మీరు తెచ్చింది ఎంత తక్కువైనా అందరికీ సమానంగా పంచుతాం. ఒకరికి ఉండి మరొకరికి లేకపోవటం ఇక్కడ జరగదు"

"మంచి మాటే" - అంటూ అప్లికేషన్ తీసుకునివచ్చేశాను. పరీక్ష అవగానే అప్లికేషన్‌తో బస్సెక్కాను. నేను వెళ్ళేసరికి గోవిందరావుగారు ఆఫీసునుండి రాలేదు. నన్ను చూచి గోవిందరావుగారి భార్య గేటు దగ్గరకు పరుగున వచ్చి "వివరాలన్నీ కనుకున్నారా! మంచి రోజు చూసి చేర్పిస్తామని చెప్పలేకపోయారా? రెండు రోజులై నీళ్ళ విరోచనాలని మంచమెక్కిందా మహా తల్లి. ఇవాళ కొంత నయం. వీలయినంత త్వరలో పని పూర్తిచేయాలి. ఆయనతో ఏమైనా చెప్పాలా?" అంది. ఆవిడ అనుకుంటుంది, తనది చిన్న నోరని. అందుచేత నేను ఎక్కువ మాట్లాడకుండ " రెండు పాస్ పోర్ట్ ఫోటోలు సిద్ధం చేసి ఉంచండి. రేపు నాలుగైదు గంటలకల్లా వస్తాను. ఎల్లుండితో పరీక్షలు సరి" అన్నాను.

"ఉండండి. అప్పుడెప్పుడో ఎందుకో తీయించిన ఫోటోలు ఉండాలి. నెగిటివ్ అయినా ఉందేమో చూసొస్తాను" అంటూ ఇంట్లోకి పరుగెత్తిందామె. నేనుగేటు దగ్గరే నిలబడిపోయాను. నా వెనుకే గోవిందరావుగారొచ్చి "మీరొకవేళ వస్తారేమోనని త్వరగా బయలుదేరి వచ్చేశాను. రండి" అంటూ తీసుకెళ్ళాడు. వరండాలోనే నా దగ్గర అప్లికేషన్ తీసుకునిగబగబా నింపేశాడు.

"ఫోటోలు ఉండాలి తెస్తాను"అంటూ లోపలి గదుల్లోకి పరిగెట్టాడు.

చాలాసేపు వెతుకులాటలో పడ్డారు భార్యాభర్తలు.

అప్లికేషన్ లోని వివరాల్ని చూస్తున్న నాకు "బాగున్నారా బాబూ?" అన్నమాటలు విని తలెత్తాను. జాజిపందిరి కవతల గేటుకు దగ్గరగా నిలబడి అడుగుతోంది. సుందరమ్మగారు, గోవిందరావుగారి తల్లి.

"బాగున్నాను" అన్నాను తలాడిస్తూ; పాలిపోయిన ఆమె ముఖం చూస్తూ.

"మీ అమ్మ కామాక్షి బాగుందా? నీ దగ్గరే ఉంటోందా?" అని అడిగింది వణికే గొంతుతో నా ముఖం వేపే చూస్తూ.

"ఊ" అన్నాను

"అవును కదా." అంది అదే చూపు. ఈసారి నా కళ్ళలోకి సూటిగా. గుండెల్లో ఎక్కడో గుచ్చుకునే చూపు. నన్ను ప్రశ్నించే చూపు.

"మీ అమ్మ నీ దగ్గరే నీ సంరక్షణలోనే ఉండొచ్చు. కానీ నా లాంటి వాళ్ళు అనాధలుగా బ్రతకాలి కదూ! ఈ వ్యవహారంలో నీవు సంధాన కర్తవు కదూ!" అన్నట్టున్నాయి ఆమె చూపులు.

నేనేదో మాట్లాడాలనుకుంటుండగా గోవిందరావుగారు లోపలినుంచి వచ్చారు. ఆమె ప్రక్కకి వెళ్ళిపోయింది.

"ఫోటోలు లేవు. నెగిటివ్ కనపడటంలేదు. ఈ రోజే స్టూడియోకి తీసుకెళ్ళి ఫోటోలు తీయిస్తాను. మళ్ళా మీరెప్పుడొస్తారు"

నాకు సర్రున కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకుని "అంటే?" అన్నాను.

"రేపటికల్లా ఫోటోలు సిద్ధం చేయిస్తాను. ఎల్లుండి మీతోపాటే మేమూ వస్తాం. మీరక్కడుండగానే అక్కడ చేర్పిద్దాం"

అది అమాయకత్వమో గడుసుతనమో నాకర్థంకాదు.

"మళ్ళా మీరు రేపు వస్తారుగా?" అడిగాడు

"రాను" అందామనుకున్నాను; పెంకితనానికి. కాని పెద్దాయన కదా.. అనలేదు.

"వివరాలేమీ అడగరా? మీరక్కడికొచ్చి అక్కడి పరిస్థితులు, వాతావరణం చూడనైనా చూడరా!"

"మీరు చూశారుగా.. మీకు నచ్చకపోతే అప్లికేషన్ తేరుగా"

"అయినా అది పద్ధతికాదుసార్. మీ నిర్ణయలు, ఆలోచనలు ఉండవా!?"

"నిర్ణయం అదేకదా. ఇంక మార్పేమి ఉంటుంది? రేపు మీరు డ్యూటీనుండి రాగానే అప్లికేషన్ తో వస్తాను మీ ఇంటికి అక్కడే అన్నీ మాట్లాడుకుందాం. ఇక్కడవద్దు" అన్నాడాయన కుర్చీలోంచి లేస్తూ

నాకూ కదలక తప్పలేదు.

ఇంటికి వచ్చి దాచుకోలేక "ఏమీటమ్మా ఈయన ఇదేదో నా స్వంత వ్యవహారంలాగా. అక్కడికెళ్ళి పరిస్థితులు చూచేపాటు బాధ్యతైనా ఆయనకు లేదామ్మా?" అన్నాను ఆవేశంగా.

అమ్మ ఏమనలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఇంట్లో ఆడవాళ్ళు సర్దుకుంటే ఎప్పుడూ, ఏదీ సమస్యకాదు" అంది మా శ్రీమతి, అమ్మ కంటి నీరు తుడుస్తూ.

"సుందరమ్మ అమాయకురాలురా. నా ఇద్దరు కొడుకులు 'రత్నాలు' అంటూ మురిసిపోతుంది. ఇప్పుడేమో...."

"ఊరుకోండి, అది వాళ్ళింటి సమస్య అని సరిపెట్టుకోండి. మీరు మాత్రం ఎప్పుడూ మాతోనే ఉంటారు." అంటూ చంటిపిల్లను లాలిస్తున్నట్టు కన్నీరు తుడించింది. నేను అర్జెంటు పని ఉండి రాత్రికి రాత్రే పరీక్ష కేంద్రానికి బయలుదేరాను.

పరీక్షలు ముగియటానికి రెడురోజులే వ్యవధి ఉంది. ఆ మర్నాటి పరీక్ష పూర్తవగానే పేపరు ఎక్కౌంట్సు మర్నాడు చూసుకోవచ్చని బస్సెక్కాను, అయినా చీకటి పడిపోయింది. బస్సు దిగి మా ఇంటిని చేరడానికి నడుస్తుంటే, మా ఊరి ఏకైక ఫోటోగ్రాఫరు సైకిలు మీద నా వెనుక పరిగెత్తుకుంటూ వస్తూ! "సార్! సార్! ఆగండి ఈ పాస్ పోర్టు సైజు ఫోటోలు గోవిందరావుగారు మీకు అందజేయమన్నారు. నిన్న రాత్రి స్టూడియో కొచ్చి తీయించారు సార్. పెళ్ళి ఫోటోలు తీయాలి. వస్తాను సార్" అంటూ సైకిలెక్కాడు.

గోవిందరావుగారి ప్రవర్తన నా కర్థంకాలేదు. ఆమె ఫోటోలు కూడా నాకు పంపడమేమిటి? - చివరికి నన్నే అక్కడ ఆమెను చేర్పించమంటాడా? నా కర్థంకాలేదు.

ఇంట్లో అడుగుపెడుతూ "గోవిందరావుగారు గాని వచ్చారామ్మా? ఫారం నింపి ఇచ్చారా?" అడిగాను.

"రాలేదురా" అంది నా చేతికి కాఫీ గ్లాసు అందిస్తూ

"వస్తానన్నారమ్మా అప్లికేషన్తో. రేపు మంచి రోజు. ఆశ్రమంలో చేర్పిస్తామని చెప్పి వచ్చాను." అన్నాను.

"ముందు కాఫీ తాగు. తరువాత అన్నీను" అంది అమ్మ. గబగబా కాఫీ త్రాగేసి" అభిప్రాయం మార్చుకున్నారేమోనమ్మా! అన్నాను.

"లేదురా. భగవంతుడే అభిప్రాయం మార్చుకున్నాడు"

"అంటే?"

"చెప్పేందుకేముందిరా! ఈ రోజు మధ్యాహ్నమే ఆమె పోయింది. అసలు ఉదయమెప్పుడో పోయిందట. ఎవరూ గమనించలేదు. మొన్నటినుండి పెరటి వసార్లోనేకదా ఆమె మంచం. విరోచనాలని అక్కడే ఉంచేశారట"

నాకు షాకు తగిలినట్టయింది'

"ఆమె పోవడమేమిటి? నిన్నసాయంత్రం నాతో మాటాడిందిగా"

"అంతే కాదు. నిన్న రాత్రి రిక్షాలో ఫోటో స్టూడియోకు కూడా వెళ్ళివచ్చిందట కొడుకుతో. తిరిగివస్తున్నపుడు పెద్ద విరోచనమే అయిందట. రిక్షా గంగులు చెప్పాడు" అంది అమ్మ తలదించుకునే.

నాకు చాలాసేపటి వరకు మాటలు రాలేదు.

"అయితే తీసికెళ్ళారామ్మా! తీసుకెళ్ళిపోయారా?" నా గొంతు వణికింది.

"లేదురా! చిన్న కొడుకు ఇంకా రాలేదుట వీధివసారాలోనే ఉంచారు. మరి రేపు ఉదయమే! మేము చూసి వచ్చాం. వెళ్ళి చూసొస్తావా?"

ఎలా పరుగెత్తానో నాకు తెలియదు. వీధి వసారాలో హాయిగా నిద్రపోతోందామె. నలుగురైదుగురు తప్ప ఎవరూ లేరు. నన్ను చూసి గోవిందరావుగారు 'అంతా అయిపోయింది' అన్నట్టు చేతులు తిప్పారు.

దగ్గరకెళ్ళి చూశాను. ఆమె నిద్రపోతోంది. ఆమె కనురెప్పలు మూతపడే ఉన్నాయి. కాని కనురెప్పల వెనకనుండి జాజిపందిరి దగ్గర నిలబడి నన్ను ప్రశ్నిస్తున్న చూపులే నాకు కనిపించాయి. ఆ చూపులు నన్ను ప్రశ్నిస్తున్నాయి.

"నేను అనాధనా? దిక్కులేని దానిలా పడిఉండాలా? నాలాంటి వాళ్ళను అనాధలుగా చేసే వ్యవహారంలో నీవు సంధాన కర్తవా?... సంధాన కర్తనా?... సంధాన ... "

నేనిక నిలవలేకపోయాను.

ఫోటోగ్రాఫర్ ఇచ్చిన రెండుఫోటోలు నా దగ్గరే ఉన్నాయి, పెట్టె అడుగున భద్రంగా. తెరిచి చూచే ధైర్యం మాత్రం నాకు లేదు. రాదు కూడా. దైన్యం నిండిన ఆ కళ్ళలోకి నేను చూడలేను. ఆ చూపులు నన్ను దహిస్తాయి.

# స్వేచ్ఛా జీవనం - వక్కలంక సత్యనారాయణ

**మా చిన్నప్పుడు** ఇని రైళ్ళు లేవు. రైలు ప్రయాణం చాలా సరదాగా ఉండేది. ఎప్పుడెప్పుడు రైలెక్కుతామా, ఏ ఏ ప్రాంతాలు చూద్దామా -- అని ఉండేది.

పెద్దయ్యాక రైలు ప్రయాణం మరీ ఎక్కువైందని చెప్పవచ్చు. మొన్నీ మధ్య మా అమ్మాయి ఊరు వెళుతున్నాము. చాలా దూరం. రెండు రోజుల ప్రయాణం. రెండు రైళ్ళు మారాలి. అతి కష్టం మీద రెండో రోజు ప్రయాణంలోకి వచ్చాం. గమ్యం గంటల్లోకి వచ్చేసిందనగా - మా ట్రైన్ ఓ చిన్న పల్లెటూళ్ళో ఆగింది.

చాలా చిన్న స్టేషను. ముందు అంతగా పట్టించుకోలేదు. ఏదో క్రాసింగు కోసం ఆగిందనుకున్నాను. తరువాత తెలిసింది - ఎదర ట్రాక్ పాడైందనీ, ట్రైన్ రూటు మార్చి వేరే దారిలో ప్రయాణించాలనీ, అందులో మామూలుకన్నా ఐదారుగంటలు ఎక్కువపడుతుందనీ! హమ్మయ్య, ఇంటికొచ్చేస్తున్నామనుకున్న ప్రయాణం - ఐదారుగంటలు లేటు అనేసరికి ప్రాణం నిస్త్రాణగా అయిపోయింది.

మెల్లమెల్లగా చీకటి పడుతోంది. ఆ రైల్వే ట్రాకు నానుకుని చిన్న చిన్న గుడిసెలు చాలా ఉన్నాయి. గుడిసెల బయట - ఆడా, మగా, పిల్లా, పెద్దా అందరూ చాలా ఫ్రీగా ఉన్నారు. బహుశః ఆ ట్రాకు మీద రైళ్ళ రాకపోకలు బాగా తక్కువ, వచ్చినవేవీ అక్కడ ఆగవు - అనుకుంటాను. అంతా దట్టంగా గడ్డిమొలిచింది.

అక్కడి వాళ్ళ జీవనం చాలా హాయిగా అనిపించింది. చీకూ చింతా లేనట్లు పిల్లలు ఆడుకుంటున్నారు. ముసలివాళ్ళు తమకేమీ పట్టనట్లు, పైవాడి పిలుపుకోసం తపించే యోగుల మాదిరి నిర్లిప్తంగా ఉన్నారు.

ఏవో ఆలోచనలతో - నేను శ్రీమతి నుంచి విడిపోయి- ఒకచోట కూర్చుని వాళ్ళకేసి చూస్తూ కూర్చున్నాను. ఇంతలో ఒక స్త్రీ ఏడుస్తూ, పరుగెతుకుంటూ అటొచ్చింది. ఆమెను తరుముతూ, బండ బూతులు తిడుతూ, అందినప్పుడు బాదేస్తూ ఓ మగాడు. మధ్య మధ్య రెస్టుకి ఆగి రొప్పుతున్నాడు. ఆమె అప్పుడప్పుడు చేతులతో కాకపోయినా మాటలతో ప్రతిఘటిస్తోంది. ఆ మాటల మధ్య ఏడుపు రాగం.

అదో డ్రామా. నాకది టైం పాస్ కూడా. కానీ వినోదం అనడానికి లేదు. వాళ్ళ జీవితంపై తేలిక భావం కలిగిందా అనుకుంటే మనసు బరువెక్కింది మరి!

మెల్ల మెల్లగా చీకట్లు ముసురుకుంటున్నాయి. కాసేపటికి ఆ మగధీరుడు అలసిపోయినట్లున్నాడు. తిట్లు ఆపేశాడు. కొట్టడానికి వాడికీ, దెబ్బలు తినడానికి ఆమెకూ ఓపిక లేదన్నట్లు - ఇద్దరూ పక్కపక్కనే చతికిలపడ్డారు. అంతలో ఏమయిందో ఆ ఆడమనిషి గుడిసెలోకి వెళ్ళింది. ఆ వెనుకే ఆ మగాడూ గుడిసెలో దూరాడు. ఏం అఘాయిత్యం జరుగుతుందో -- వాడామెను కొడతాడో, చంపుతాడో అని నాకు బెంగ.

నా బెంగకి తగ్గట్లే అక్కడ కాసేపు భయంకర నిశ్శబ్దం. ఈ మధ్య నాగరికుల నేరాలు - ఘోరాలు టీవీల్లో చూసాను పత్రికల్లో చదివాను. ఇక ఆ అనాగరికుల మధ్య హింసలెలా ఉంటాయో ఊహించుకుంటేనే మనసునిండా భయం పేరుకుంది.

ఐతే నా ఊహల్నీ, భయాల్నీ అర్థరహితం చేస్తూ - పదినిముషాల తరువాత ఆ మగాడు గుడిసెలోంచి హీరోలా బయటకు వచ్చి అక్కడే ఉన్న కుక్కిమంచం వాల్చుకుని హాయిగా నడుం వాల్చాడు. కాసేపటికి ఆ స్త్రీ కూడా ఓ చేత్తో చీరకుచ్చెళ్ళు సర్దుకుంటూ, మరో చేతిలో గ్లాసొకటి పట్టుకుని బయటకు వచ్చింది. వాడి పక్కనే కూర్చుని కల్లో, గంజో ఉన్న గ్లాసు అందించింది. ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ అంతకు ముందున్న యుద్ధవాతావరణం స్పృహే లేనట్లు కబుర్లు చెప్పుకుంటున్నారు.

అంతవరకూ - పేదరికం, నిరక్షరాస్యత, మహిళాపట్ల దౌర్జన్యం, అవినీతి, రాజకీయాలు - వగైరాలమీద నా చేత పరిపరివిధాల ఆలోచింపజేసిన ఆ నిర్భాగ్యులనుకోవడం నా అవివేకమనిపించింది.

ఆ సంఘటనలో ఏదో జీవిత సత్యం! ఏదో సందేశం!

భార్యాభర్తల ఆరాటంలోనే జీవన పోరాటం దాగుందా? బద్దశత్రువులులా ఉన్నవాళ్ళు అంతలోనే ఆత్మీయులైపోయారు. అంతవరకూ దాన్నిప్రాణం తీసేస్తానన్నట్లు భయపెట్టి - గుడిసెలోకి వెళ్ళొచ్చిన పది నిముషాల్లో ప్రియుడిగా, శాంతమూర్తిగా మారిపోయాడు. మరి అంతకుముందు అంతగా శిక్షించడానికి భార్య చేసిన తప్పేమిటి? అంతలోనే ఆ తప్పు ఒప్పు ఎలా అయిపోయింది?

నాకేమీ అర్ధంకాలేదు. తనకేమైనా తెలియొచ్చని - శ్రీమతి దగ్గరకెళ్ళి ఇదంతా టూకీగా చెప్పాను.

ఆమె ఓపిగ్గా వింది. సన్నగా నవ్వింది. "వాళ్ళ గొడవకి కారణం చెప్పలేను. తప్పొప్పులెవరివో నిర్ణయించలేను. ఎవరికెవరు లొంగారో ఊహించే ప్రయత్నం చేయను. వాళ్ళ గురించి నాకు తెలిసినదొక్కటే!

" వాళ్ళు స్వేచ్ఛాజీవులు. వాళ్ళ మనస్పర్ధలు బాహాటం. వాళ్ళ ప్రేమ బాహాటం కాని బాహాటం" అంది.

"మనం విశాలమైన ఇళ్ళల్లో ఉంటున్నాం. వాళ్ళవి ఇరుకు గుడిసెలు. కానీ వాళ్ళు మనకంటే ఎక్కువ సంతోషంగా ఉండడం ఆశ్చర్యంగా ఉంది.." అన్నాను అసంతృప్తిగా.

"కళ్ళు లేకపోవడం వల్ల గుడ్డివాడు మిగతా ఇంద్రియాల్ని మనకంటే ఎక్కువగా సద్వినియోగం చేసుకోవడంలేదూ! అలాగే వాళ్ళకి ఇల్లు ఇరుకై దృక్పధాన్ని విశాలం చేసుండొచ్చు. మనకి ఇల్లు విశాలమై దృక్పధాన్ని ఇరుకు చేసుండొచ్చు. ఏదేమైనా విశాల దృక్పధానికీ, భార్యాభర్తల అనుబంధానికీ కూడా మనకి తెలియని ముడి ఏదో ఉంది" అంటూ ముసిముసిగా నవ్విందామె.

అప్పుడు నాకు లైటు వెలిగింది. ఆమె చెప్పింది నిజం. మా మధ్య కూడా ఎన్నో సమస్యలు మంచువిడినట్లు ఎలా తేలిపోయాయో ఆమె ముసి ముసి నవ్వులు గుర్తుచేసాయి.

కాసేపటికి మా ట్రైనుకు దారి దొరికింది. రాత్రి ఏడుగంటలకు బదులు అర్ధరాత్రి ఒంటిగంటకి ఇల్లు చేరాం. పాపం - మా గ్రాండ్ చిల్డ్రెన్ స్టేషనుకొచ్చి రిసీవ్ చేసుకుందామనుకున్నారట. మేమూ వాళ్ళని చూసి ఎలా స్పందించాలో రిహార్సల్ వేసుకున్నాం.అంతా అప్ సెట్ - మేము వెళ్ళేసరికి వాళ్ళు నిద్రపోయారు.

మరునాడు వాళ్ళు నిద్ర లేస్తూనే మా పక్కనే చేరి ఎన్నో విషయాలు మాట్లాడేశారు. అక్కమీద తమ్ముడూ, తమ్ముడి మీద అక్క - నేరాలు నాన్‌స్టాప్‌గా గలగలా చెబుతుంటే - మేము రెండురోజుల రైలు ప్రయాణం, ఆరుగంటల ఆలస్యం అన్నీ మర్చిపోయాం.

మా అమ్మాయి వేడి వేడి కాఫీ ఇచ్చింది. మా అల్లుడు చదువుకోమని పేపరు ఇచ్చాడు. పిల్లలు స్కూలు రిక్షాకోసం ఎదురు చూస్తూ గేటుకవతల రోడ్డుమీద నిలబడ్డారు. అమ్మా నాన్నా వాళ్ళకు సాయం.

కాఫీ సిప్ చేస్తూ రైలుకట్ట పక్క దంపతుల్ని గుర్తుతెచ్చుకున్న నా కళ్ళు అప్రయత్నంగా శ్రీమతిని వెతికాయి. ఏం చేయను? నా కూతురు కాఫీలో పంచదార వేయడం మరిచి పోయిందని చెపితే నమ్మాలి మరి!

# పార్టీ మనిషా కాదా? - తాడికొండ కె.శివకుమార శర్మ

**సుందరయ్యను** ఎంతో కాలంగా ఎరిగిన వాళ్ళకు కూడా అతను చేసిన సరికొత్త పని విస్మయాన్ని కలిగించింది.

అతను అమెరికా వెళ్ళేటప్పటికి అతనికి రచనా వ్యాసంగంతో సంబంధంలేదు - పార్టీ ఫామ్‌ప్లేట్లను పంచడం రచనా వ్యాసంగం కాదు మరి! పోనీ, కావాలంటే మొదటిసారి అమెరికా వెళ్ళిన వాళ్ళలాగా యాత్రానుభవాలని, అక్కడి కార్ల గూర్చీ, ఎత్తైన బిల్డింగుల గూర్చీ, విశాలమైన రోడ్ల గూర్చీ రాయొచ్చు కదా! అలా కాక ఈ తిరుగుబాటేమిటి?

పైగా, సుందరయ్య సామాన్యమైన వ్యక్తా, ఏమిటి? వాళ్ళ నాన్న దేశంకోసమని ఉన్నదంతా దానం చెయ్యడమే కాక, ఆయన్ని ఉత్తేజపరిచిన దేశభక్తుని పేరుని - ఇంటిపేరుతో సహా - కొడుక్కుపెట్టినవాడు. చుట్టాలు వెర్రి ముదిరిందని అనుకున్నా, పెళ్ళాం తన ఖర్మ అని నుదురు కొట్టుకున్నా, నామకరణం నాడు చేయిస్తున్న బ్రాహ్మడితో సహా తల్లిదండ్రులు, అత్తమామలు, శాస్త్రప్రకారం కుదరదని మొత్తుకున్నా బియ్యపుళ్ళెంలో పుచ్చలపల్లి సుందరయ్య అని వ్యావహారిక నామాన్ని రాసి, స్కూల్లో వేసినప్పుడు ఇంటిపేరుతో సహా రావున పుచ్చలపల్లి సుందరయ్య అని నమోదు చేయించాడు.

అంతటితో ఆగక, అడ్డాలనుంచీ కూడా కొడుకుని "సుందరయ్యగారూ!" అని సంబోధించేవాడు - ఆ మహానుభావుడి పేరుకు ఏమాత్రం గౌరవభంగాన్ని కలుగనీయకుండా.

తండ్రి అడుగుజాడల్లో సుందరయ్య నడవడానికి కలిగిన ముఖ్యమైన ఆటంకం - ఆయన చేసిన గొప్ప పనిని చెయ్యడానికి తగ్గ ఆస్తి అతనికి లేకపోవడం. ఉన్న ఆస్తినంతటినీ తండ్రే దానం చేసిన తరువాత కొడుక్కు అంత ఆస్తి ఎక్కణ్ణించీ వస్తుంది మరి? అది తప్పితే, చిన్నప్పటినుంచీ తండ్రితోబాటు పార్టీ కార్యాలయాలకీ, సమావేశాలకీ తిరిగాడు కనుక పార్టీ ఉద్దేశాలనీ, ఆశయాలనీ బాగానే వంటబట్టించుకుని, తండ్రికి తగ్గ కొడుకనిపించుకున్నాడు.

తండ్రిపోయిన తరువాత కుటుంబం గడవడం కష్టమయితే ఎవరో ఇచ్చిన సలహా ననుసరించి కిరాణాకొట్టు పెట్టాడు. పార్టీ ఆశయాలకి స్వంత వ్యాపారం విరుద్ధం కదా! అందుకే, అది పెట్టడానికి ముందు అతను అంతరాత్మతో పెద్ద ఘర్షణపడి, చివరకు ఓ పెద్దాయన్ను సంప్రదించాడు. "పార్టీ సభ్యులు కూడా తిండి తినాల్సిందే కదరా" అని ఆయన ఇచ్చిన సలహాని పాశుపతాస్త్రంగా స్వీకరించి, దానితో అంతరాత్మను ఓడించాడు.

పార్టీ సభ్యులకి ప్రత్యేకమయిన రాయితీ ఇవ్వడంతో అతను కొట్టుపెట్టాడని విమర్శించిన వాళ్ళు కూడా అతని కొట్టుకే రావడం మొదలుపెట్టారు. అతని సామర్థ్యంవల్లా, శక్తివంచన లేని కృషివల్లా వ్యాపారం అభివృద్ధి చెంది, కిరాణాకొట్టు కాస్తా త్వరలోనే జనరల్ స్టోర్ అయింది.

అతన్ని ఒక కంట కనిపెట్టిన వాళ్ళకి అది కంటగింపు అయ్యేలోగానే అతను పార్టీకి విరాళాలివ్వడంతో ఎక్కువ విమర్శలకి అతను గురికావలసిన అవసరం లేకపోయింది. పైగా, ఆ విరాళాలు సంవత్సరానికి ఏ ఒకసారో కాక, నెలవారీ వస్తుండేసరికి పార్టీ పెద్దలకి ఆనందంగానూ, బాగా గుర్తుగానూ ఉండేది. పెద్దల ఆనందమే సభ్యుల సంతోషం కావడం వల్ల సుందరయ్య వ్యాపారానికేమీ అడ్డంకులు రాలేదు.

మొదటిసారి అతను పార్టీ విమర్శను ఎదుర్కోవలసివచ్చింది. అతని తల్లిపోయినప్పుడు. తండ్రయితే, "నాకు కర్మలూ అవీ జరగడానికి వీల్లేదు" అని శాసించడం వల్ల పార్టీ నిబంధనలకు అనుగుణంగానే సుందరయ్య నడుచుకోగలిగాడు. పైగా, అది అతని దగ్గర తినడానికే డబ్బుల్లేక కటకటలాడే సమయం. అందుకని, సుందరయ్య తల్లికూడా పెద్దగా ఏవీ అనలేకపోయింది. అదే, ఆవిడ పోయే

సమయం వచ్చేసరికి సుందరయ్య వ్యాపారం బాగానే నడుస్తోంది. అందుకే ఆవిడ, "నాకు ఆచారం ప్రకారం కర్మకాండలు చేయించాల్సిందే" అని శాసించింది. ఇది పార్టీ నిబంధనలకి విరుద్ధం కాబట్టి సుందరయ్య పార్టీకి రాజీనామా చేస్తానన్నాడు. పార్టీ ఆదాయం ఎక్కణ్ణుంచీ వస్తుందో పెద్దలకు తెలుసుకనుక, వాళ్ళు రాముని జన్మభూమి అయిన దేశంలో తల్లి ఆజ్ఞ పాటించడం తప్ప సుందరయ్య చెయ్యగలిగిందేమీ లేదు అని నిర్ధారించి అతను గుండు కొట్టించుకోవడానికి పెద్ద అభ్యంతరమేమీ చెప్పలేదు.

అతని వెనుక పార్టీ సభ్యుల గుసగుసలు మొదలయ్యింది. అతని కొడుకు ఇంజినీరింగులో చేరినప్పుడు అయితే, అది ఐ.ఐ.టిలో కావడంతో "ప్రైవేటు కాలేజీలో చేర్పిస్తే కడిగేద్దాం" అని ఎదురు చూసిన వాళ్ళు నిరాశపడక తప్పలేదు. కూతురు బిట్స్‌పిలానీలో చేరిన తరువాత సుందరయ్య పార్టీ కార్యాలయానికి వచ్చి అక్కడ పనులు చేసిపెడుతుంటే - టీలు తెచ్చిపెట్టడంతో సహా - "పాప పరిహారార్థం" అని కమిటీ సభ్యులు నవ్వుకోవడం అతని చెవిన పడకపోలేదు.

వాళ్ళు కూడా, పార్టీ సభ్యుల బహిరంగ సమావేశాలకి సుందరయ్య ముందే వచ్చి కుర్చీలు వెయ్యడం, అందరూ వెళ్ళిపోయేదాకా ఉండి చిందరవందరగా ఉన్న ప్రదేశాన్ని శుభ్రం చెయ్యడానికి సహాయం చెయ్యడం, కింద పడేసి ఉన్న కుర్చీల నెత్తడం గూర్చి విని ఉన్నారు కనుక (వాళ్ళు ఆలస్యంగా వచ్చి, ముందరే వెళ్ళిపోయేవాళ్ళు - లేకపోతే చూడగలిగేవాళ్ళు కూడా) మరీ ఎక్కువగా వ్యంగ్యమైన విసుర్లు చేసేవాళ్ళు కాదు.

అయితే, సుందరయ్య కొడుకు వినోబా అమెరికా వెడుతున్నప్పుడు మాత్రం పెద్ద గొడవే జరిగింది. అతని పార్టీ భక్తినే గాక దేశ భక్తిని కూడా ప్రశ్నించారు పార్టీ పెద్దలు. కొడుకు పార్టీలో చేరకపోయినా ఫర్లేదన్నారు కానీ పార్టీ ఆశయాలకి వ్యతిరేక ధ్రువమైన దేశానికి వెళ్ళడాన్ని మాత్రం సహించలేమన్నారు. తండ్రి మార్గాననుసరిస్తూ సుందరయ్య కూడా తన ఆస్తినంతటినీ పార్టీకి అప్పచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అతని వ్యాపారం అభివృద్ధి చెందడంలో పార్టీ సభ్యుల పాత్ర ఎంత విలువైనదో మరచిపోవద్దన్నారు. ఆ దేశభక్తుని పేరు పెట్టుకున్నందుకు ఆ పేరుకు ఇవ్వాల్సిన గౌరవాన్ని గుర్తుచేశారు.

సుందరయ్య ఇంకా కాలేజీలో ఉన్న పెళ్ళికాని కూతురు బాధ్యతని వాళ్ళకు గుర్తు చేశాడు. మధ్యేమార్గంగా తనిచ్చే విరాళాల మొత్తాన్ని పెంచుతానన్న అతని ప్రతిపాదనని కమిటీ సభ్యులు తిరస్కరించలేకపోయారు. కూతురుకి పెళ్ళి అయిన తరువాత అతని ఆస్తి తమకి చెందాలన్న తమ వాదనకి అతను ఎదురు చెప్పకపోవడం వాళ్ళకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

సుందరయ్య కూతురి చదువు పూర్తికాకముందే కొడుకు పెళ్ళయ్యింది.

"నాన్నా! ఇజబెల్లా, నేనూ ఈ శుక్రవారం రిజిస్ట్రాఫీసులో పెళ్ళి చేసుకుంటున్నాం. నువ్వు, అమ్మా, ఝాన్సీ ఇక్కడ ఉండివుంటే బాగుండేది. ఇజబెల్లాకి వీసా ప్రాబ్లం వల్ల తను అమెరికానుండి బయటకు అడుగుపెడితే మళ్ళీ అమెరికాలోకి రాలేదు. మీ ముగ్గురికీ ఇక్కడికి రావడానికి అయ్యే ఖర్చు నువ్వు పెట్టవని తెలుసు. నా దగ్గరా అంత డబ్బులేదు. నా చిన్నతనం నుండీ తాతయ్యను గూర్చి నువ్వు చెప్పిన కథలను వినడంవల్లా, నీ ఆదర్శాల గూర్చి తెలిసిన వాణ్ణవడం వల్లా నువ్వు నా పెళ్ళిని అందరిలాగా ఎంతో ఖర్చుపెట్టి చేస్తావనిగానీ, చెయ్యాలనిగానీ ఎప్పుడూ అనుకోలేదు. వింతేమిటంటే, ఇజబెల్లా వాళ్ళ నాన్న నీకిష్టమైన చే గువేరా ఆశయాలకు కట్టుబడినవాడు. మీకిద్దరికీ అమెరికాలో కలిసి వాటిని మాట్లాడుకోవడానికి ఛాన్స్ లేదనుకుంటా - ఎందుకంటే ఆయనకి గానీ నీకు గానీ అమెరికా అంటే పడదు కదా!" ఇదీ అతడు ఫోన్లో సుందరయ్యకు చెప్పింది.

"ఇక్కడ రిజిస్ట్రాఫీసయితే బావుండేది" అనుకున్నాడు సుందరయ్య.

"కూతురి పెళ్ళయినా ఘనంగా చెయ్యకపోతే నేను బావిలో దూకాను" అని బెదిరించడమే కాక దూకి కూడా చూపించింది సుందరయ్య భార్య - ఝాన్సీ తనకు నచ్చిన రాజస్థానీ అబ్బాయిని పెళ్ళిచేసుకుంటానన్నప్పుడు సుందరయ్య రిజిస్ట్రార్ ఆఫీసు ప్రసక్తి తెచ్చేసరికి. పెళ్ళయినప్పటినుంచీ భార్య సంగతి సుందరయ్యకి తెలిసినా, కస్తూరిబాలాగే ఎప్పటికైనా భర్త అడుగుజాడల్లో ఆవిడ

నడవకపోతుందా అని ఆశపడ్డ సుందరయ్యకు ఆవిణ్ణి ప్రాణాలతో బావిలోనుంచీ బయటకు లాగకముందే ఆవిడ అభీష్టం ముందు తలవంచక తప్పలేదు.

"నేను చెప్పలా? ఆదర్శాలన్నీ మాటలవరకేనయ్యా!" అన్నాడు కొడుకుకు పాతిక లక్షల రూపాయల కట్నం తీసుకున్న కమిటీ మెంబరొకాయన. సుందరయ్య అమెరికా ప్రయాణం వార్త మోతచెయ్యొద్దని బోర్డుపెట్టిన చోట లారీ మోగించిన ఎయిర్ హారన్లా చెవులు చిల్లులుపడేలా అందరికీ వినిపించింది.

"సుందరయ్య మారతాడని ఎప్పుడో తెలుసు. అనుకున్నదానికంటే కొంచెం ఆలస్యమైందంతే." అన్నారు పార్టీ సభ్యులు కొందరు.

"ఆ వెళ్ళేముందరే ఇచ్చేదేదో ఇచ్చేస్తే సరిపోతుందిగా!" అన్నారు కమిటీ మెంబర్లు కొందరు.

"చుట్టపుచూపుగా వెడుతున్నానంతే. మనవడికివడికి పదేళ్ళు వస్తున్నాయి. మనవరాలికి అయిదేళ్ళు దాటాయి. 'తెలిసిన అందరు ఇండియన్ల ఇళ్ళల్లోనూ ఎప్పుడూ తాతయ్యలు, అమ్మమ్మ, బామలు కనిపిస్తుంటారు. మరి మనింటికి ఎవరూ రారేం?' అని పిల్లలు గోలచేస్తున్నారు. అక్కడ ఇజబెల్లా వాళ్ళ నాన్నా, ఇక్కడ మీరూ ఈ గడ్డమీద అడుగుపెట్టమని భీష్మించుకుని కూర్చున్నారు. మా ఖర్మ ఇంతే!' అని వాడు పడే బాధని తట్టుకోలేకపోయాను." అని చెప్పాడు సుందరయ్య వినేవాళ్ళకు.

ఇద్దరూ ఉద్యోగాలు చేసేవాళ్ళవడంచేత కొడుకూ కోడళ్ళకు వాళ్ళ సంసారం ఈదడానికి తప్ప వేరే వ్యాపకాలని పెట్టుకోవడానికిగానీ, సమాజాన్ని గూర్చిగానీ, ప్రపంచాన్ని గూర్చిగానీ ఆలోచించడానికి కూడా సమయం దొరకదన్న సంగతి త్వరగానే అర్థమయ్యింది సుందరయ్యకి. వీళ్ళ భాష పిల్లలకి అర్థంకాకపోయినా పిల్లలు స్కూలు నుండి వచ్చేసరికి పెద్దవాళ్ళు ఇంట్లో ఉండడంతోనూ, ఒకవేళ వాళ్ళకి కొద్దిగా జలుబూ జ్వరాలు వచ్చినా కూడా, ఆఫీసులకి సెలవుపెట్టాల్సిన అవసరాలు తప్పడం వల్లనూ కొడుకూ కోడళ్ళకి రిలీఫ్‌గా అనిపించింది.

దానితోపాటుగా రిలీఫ్ ఇచ్చిన ఇంకో విషయం – ఇంట్లో రిపేర్ మేన్ వచ్చినప్పుడు సెలవు పెట్టాల్సిన అవసరం లేకపోవడం.

బాత్‌రూంలో పంపు లీక్ అవుతోందని రిపేర్ మేన్‌ని పిలిచి, అతడు వచ్చిన తరువాత రిపేర్‌కి ఎంత అవుతుందో చెప్పిన తరువాత తనకు ఫోన్ చెయ్యమని చెప్పి వెళ్ళాడు వినోబా. అలాగే ఫోన్ చేసి చెప్పాడు సుందరయ్య – "రెండువందల డాలర్లట" అని. "దోచేస్తున్నారు" అన్నాడు వినోబా అట్నించి.

ఇంటికొచ్చిన తరువాత బిల్లు చూపించి చెప్పాడు – "చూడు ఇక్కడికి వచ్చినందుకు తొంభై డాలర్లు. రిపేర్ చేయించుకున్నాం కనక అది బిల్లులో కలిపేశాడు. 'రిపేర్ చేయించుకోం' అంటే ఆ తొంభై డాలర్లూ జేబులో వేసుకుని వెళ్ళిపోయేవాడు. పార్టు చూడు – నలభై డాలర్లట. హోం డిపోలో దీని ఖరీదు ఇరవై! మిగిలింది లేబర్ ఛార్జెస్. నూట అరవై డాలర్లు. నేను చేసుకోలేక కాదు. టైం లేక అంతే. ఈ ఉద్యోగం మానేసి ప్లంబింగ్ షాప్ పెట్టుకుంటే బాగుపడతాను."

వాడు తన ఇంట్లో ఏమీ రిపేర్ చేసిన గుర్తులేదు సుందరయ్యకు. "పనివాళ్ళ గూర్చిన వీడి ఆలోచనలు నాకెప్పుడూ తెలియలేదు" అనుకున్నాడు సుందరయ్య. "నా ఆదర్శాల నీడలో పెరిగినవాడికి ఇలాంటి ఆలోచనలు ఎక్కణ్ణించీ వచ్చాయి?" అని ఆశ్చర్యపడ్డాడు కూడా.

ఒకసారి వినోబా ఇంటికి వచ్చేదారిలో కారు రోడ్డు మధ్యలో కదలనని మొరాయిస్తే టో ట్రక్కు వచ్చి మెకానిక్ షాపుకి తోలుకెళ్ళిన తరువాత అన్నాడు. "ఇక్కడింతే నాన్నా! లేబర్ ఛార్జెస్ చాలా ఎక్కువ. రేపొద్దున్న దీనికి ఏం రిపేరో ఫోన్ చేసి చెబుతాడు. అది చెప్పినందుకే వందడాలర్లంటాడు. రిపేర్ చేసినందుకు కనీసం ఇంకో వంద – అక్కణ్ణించీ ఎంతకైనా పెరగొచ్చు. నేను స్టూడెంట్‌గా ఉన్నప్పుడు నా కార్లో ఒక పార్టు వెయ్యడానికి రెండొందలన్నాడు ఓ మెకానిక్. నేను తెచ్చి వేసుకుంటే, ఎంత? అరవైలో అయిపోయింది."

సుందరయ్యని ఆలోచింపజేసిన విషయాలివే కాదు.

ఒక శనివారంనాడు వినోబా మిత్రుల ఇంట్లో కలిసినప్పుడు వాళ్ళ మధ్య సంభాషణలో ఈ రిపేర్ల ప్రసక్తి మళ్ళీ వచ్చింది. ఒకతను అన్నాడు. "నా భార్యా పిల్లలు ఇండియాలో ఉన్నప్పుడు కిచెన్లో మా ఎలక్ట్రిక్ పొయ్యికి రిపేర్ వచ్చింది. ఓస్! ఆ బర్నర్ని నేను మార్చలేనా అని దాన్ని తీసుకొచ్చి వేశాను. నేను చేసిన తప్పల్లా ముందు దాని ఫ్యూజ్ని తియ్యకపోవడమే! టుప్ మని సర్క్యూట్ కాలిపోయింది. తప్పక రిపేర్ మేన్ని పిలిచాను. వాడొచ్చి చూసి 'రెండు వందల ఎనభై' అన్నాడు. 'రేయ్! ఇంత పెద్ద పొయ్యే నాలుగొందలకొస్తుంది కదరా!' అన్నాను. 'సరే! రెండొందలియ్యి, నేను కంపెనీకి చేసినట్టుగా కాకుండా నా స్పేర్ టైంలో చేసినట్లుగా చేస్తా' నన్నాడు. సర్లే, ఎనభై తగ్గినా తగ్గినట్టేనని నోర్మూసుకుని పనిచేయించుకున్నాను" అన్నాడు.

ఇంకొకతను, సుందరయ్యతో, "ఇక్కడ లేబర్ చాలా ఖరీదండీ. మొన్నీ మధ్య మా ఇంట్లో కిటికీలు మార్పించాము. ఇండియాలోలాగా ఇక్కడివన్నీ గట్టికట్టడాలు కావు మరి! ఎప్పుడూ ఏదో ఒకటి మార్పించాల్సిందే అక్కడక్కడా కిటికీల చుట్టూ చిన్న చిన్న చెక్కముక్కలు మార్చాడంతే. కిటికీల ఖరీదేమో ఆరువేల డాలర్లు, వాటిని మార్చినందుకు పన్నెండువేలూను."

వాళ్ళకి అమెరికాలో ఏదైతే నచ్చలేదో సుందరయ్యకి అదే బాగా నచ్చింది - ఇండియాలో అతని బావమరిది ఇంట్లో కేబినెట్లకని చెక్కలకి లక్షా, వాటిని అమర్చినందుకు అయిన లేబర్ ఖర్చు యాభైవేలూ గుర్తొచ్చి.

"ఈ లేబర్ ఎంత బరితెగించిపోయారంటే, ప్రపంచంలోకెల్లా అతి పెద్దదయిన కార్ల కంపెనీని - అదే జనరల్ మోటార్స్ని - వాళ్ళు మట్టి కరిపించారు కదా! ఆ మెకానిక్కులకి ఎంతెంత జీతాలని! దాందుంపతెగా, ఒక్క మెకానిక్కు జీతం నా జీతమంత ఉంటుందట! అదీకాక, రిటైరయింతర్వాత కూడా పెన్షన్ ఇవ్వడమేకాక మెడికల్ ఇన్సూరెన్స్ కయ్యే ఖర్చు కూడా కంపెనీయే భరించేదట.

టయోటాలూ, హోండాలూ ఎందుకు లాభం చేసుకుంటున్నయ్యా అంటే వాళ్ళకి లేబర్ యూనియన్ లేకపోవడం వల్లనే." ఇంకొక తెలుగతను - వినోబా చేసేలాంటి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తాడట - కారాలు నూరాడు.

"డాక్టర్ల దగ్గరకి వెళ్ళినప్పుడు కన్సల్టేషన్ ఫీజు వందడాలర్లు తీసుకున్నారంటే, వాళ్ళు తెలివితేటలున్నవాళ్ళు గనుక, ఎంతో కష్టపడి చదివిగారు కనుక అందులో అర్థం ఉంది. ప్లంబర్లకీ, కారు మెకానిక్కులకీ, కిటికీలు మార్చే వాళ్ళకీ ఇంత డబ్బులుపొయ్యవలసిరావడంలోనే అర్థంలేదు." ఇంకొకతను శృతికలిపాడు,

"అమెరికా గొప్పదేశమయ్యా!" అన్నాడు సుందరయ్య ఇండియాకి తిరిగివచ్చిన తరువాత, పార్టీ సభ్యులలో విన్నవాళ్ళతో.

"మీలో మార్పు వస్తుందని మీరు అక్కడికి వెళ్ళకముందే మాకు తెలుసు"నన్నారు వాళ్ళు.

"మనం సాధించాలనుకున్నది వాళ్ళెప్పుడో సాధించేశారు" అన్నాడు సుందరయ్య - సాఫ్ట్వేర్ ఇంజనీర్కీ కారు కంపెనీలో పనిచేసే మెకానిక్కుకీ ఒకే జీతమన్న విషయం గుర్తొచ్చి.

"కాపటలిస్ట్ దేశాన్ని అంత పొగుడుతారేమిటి?" అన్నారు కొందరు చిరాగ్గా.

"ఇప్పుడూ, నీ ఇంట్లో ఉడ్ వర్కుకి లేబర్ ఛార్జీలు నువు ఇప్పుడు ఇచ్చేదానికి మూడింతలు ఇవ్వమని పనివాళ్ళు గొడవచేశారనుకో?" అన్నాడు సుందరయ్య.

"వాళ్ళని తన్ని తరిమేసి చవగ్గా చేసేవాళ్ళని పిలుచుకుంటాను" జవాబిచ్చాడొకడు.

"అమెరికాలో ఎవడికైనా అట్లా మూడింతలు ఇవ్వాల్సిందేనని చెప్పాననుకో?"

"అక్కడికే వెళ్ళి కూలీ, నాలీ చేసుకుని బతుకుతాను."

"అర్థంకాలా? అంతే కాదు. ఇక్కడ కార్మికులెన్నిసార్లు సమ్మెలు చేసినా వాళ్ళే బాధలననుభవించారు, పోలీసులచేత తన్నులు తిని జైలుకెళ్ళారు గానీ, వాళ్ళు గెలిచిన దెప్పుడైనా ఉన్నదటయ్యా? జనరల్ మోటార్స్ అంత పెద్ద కంపెనీయే లేబర్ ఛార్జీలవల్ల దివాళా తీసిందంటే - అందులో ఏ కొద్దిమాత్రం నిజం ఉన్నాగానీ - అలాంటిది ఇక్కడ కలలో కూడా ఊహించుకోగలమా?"

అతను మాట్లాడినది విన్న వాళ్ళందరికీ అర్థం అయింది, తలలూపారుగానీ, "అమెరికా అంత ఎత్తు మనం ఎదగాలి!" అన్న శీర్షికతో అతను రాసిన వ్యాసాన్ని పార్టీ పత్రికలో ప్రచురణకై పంపినప్పుడే - కమిటీ సభ్యుల్లో ముందు విస్మయాన్నీ, తరువాత చికాకునీ కలిగించింది.

# మేరా భారత్ మహాన్

పొత్తూరి విజయలక్ష్మి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**శ్రీహరికి చిన్నతనం నుండి** ఒక కోరిక ఉంది. మంచు ప్రదేశం చూడాలి మంచుతో ఆడుకోవాలి. సినిమాల్లో చూసి చూసి ఎలాగైనా మంచు కురిసే ప్రదేశానికి వెళ్ళాలని ప్రగాఢ వాంఛ.

అతను హైదరాబాదులో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఎల్. టీ. సీ సదుపాయంలేదు. ఎప్పుడు వెళ్ళాలనుకున్నా ఏదో ఆటంకం. చివరికి ఆ కోరిక కార్యరూపం దాల్చేసరికి పెళ్ళయి పాప పుట్టి దానికి రెండేళ్ళు నిండాయి.

అనుకోకుండా ఎరియర్స్ డబ్బు పదిహేను వేలు వచ్చింది. ఇటువంటి అవకాశం మళ్ళీ రాదు. ఎలాగైనా వెళ్ళాలని గట్టి పట్టుదలతో ప్రయాణం పెట్టుకున్నాడు. అది మార్చి నెలాఖరు. సీజను కూడా బావుంటుంది.

మనాలీ వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. టూరిస్టు సర్వీసులు ఉన్నాయి. కానీ అని వాళ్ళ వీలుకు తగ్గట్లు ఉండవు. అందుకని విడిగా వెళ్ళాలనుకున్నాడు. టూరిస్ట్ డిపార్ట్‌మెంట్ ద్వారా నెట్‌ద్వారా తగిన సమాచారం సేకరించాడు. మనాలీ వెళ్ళాలంటే రెండు మార్గాలున్నాయి. ఢిల్లీ, సిమ్లా మీదుగా ఒకటి, పఠాన్ కోటా కాంగ్రా మీదుగా మరొకటి. రెండవ మార్గాన్నే ఎంచుకున్నాడు.

ఎందుకంటే సిమ్లా మీదుగా వెళితే కోటాన్ దాటాకగానీ కనిపించవు మంచుపర్వతాలు. కాంగ్రా మీదుగా వెళితే పఠాన్ కోటా దాటిన కాసేపటికే కనిపిస్తాయి. మంచు శిఖరాలు చివరిదాకా వాటి పక్కనే ప్రయాణం.

వరంగల్ నుండ్ పఠాన్ కోటా వెళ్ళే రైలుకి రిజర్వేషన్ చేయించుకున్నాడు. భార్యా బిడ్డలతో రైలెక్కాడు. ఆరుగంటలు ఆలస్యంగా పఠాన్ కోట్ చేరింది రైలు. ఆ రాత్రి హోటల్‌లో బస చేసి మర్నాడు ఉదయం మనాలీ వెళ్ళే బస్ ఎక్కాడు.

పఠాన్ కోటా దాటిన రెండు గంటల తర్వాత దూరంగా కనిపించాయి మంచు శిఖరాలు. శ్రీహరికి ఒళ్ళు గగుర్పొడిచింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. భర్త వంక చూసి నవ్వుకుంది శారద.

సాయంత్రానికి మనాలీ చేరింది బస్. దిగగానే ఆటోవాళ్ళు టాక్సీవాళ్ళు చుట్టుముట్టారు. ఒక ఆటో మాట్లాడుకుని ఏదైనా మంచి హోటల్‌కి తీసుకెళ్ళమన్నాడు రెండు మూడు హోటళ్ళు తిరిగి చూసి ఒక హోటల్లో దిగాడు. అతను హైదరాబాదులో సేకరించిన వివరాలతో పోల్చి చూస్తే ఎక్కువగానే ఉన్నాయి హోటల్లో గదుల ధరలు.

అదేమిటి అని అడిగితే ఈ మధ్యనే ధరలు పెరిగాయి అన్నారు. ఎనిమిదివందలు అద్దె కానీ రూము బావుంది. గదిలో కిటికీ దగ్గర నుంచుంటే మంచి దృశ్యం పైన మంచుతో కప్పబడిన కొండలు. వాటి మీద పచ్చని పైన్ చెట్లు.

స్నానం చేశాక శారద రూములోనే ఉండిపోయింది. శ్రీహరి తయారై బయటకి వచ్చాడు. రిసెప్షన్ దగ్గరకి వెళ్ళాడు. మనాలీ వచ్చిన ప్రతి టూరిస్టూ అడిగే మొదటి ప్రశ్న స్నో గురించి. ఆ మాటే శ్రీహరీ అడిగాడు. స్నో చూడాలి ఎలా వెళ్ళాలి?

"ఈ ఏడాది కాస్త తక్కువగానే పడింది మంచు. రోహ్‌తాంగ్ పాస్ దగ్గర ఉంది స్నో. గవర్నమెంట్ వాళ్ళ సైట్ సీయింగ్ ట్రిప్ ఉంది. ఆ బస్‌లో వెళ్ళండి. బస్టాండ్ ఎదురుగానే టిక్కెట్లు కావాలంటే నేను తెప్పించి పెడతాను " అన్నాడు హోటలతను.

అతనికి డబ్బులిచ్చి టిక్కెట్లు తెప్పించుకున్నాడు. రూముకి వచ్చాడు. చలి ఎక్కువగా ఉంది. అదనంగా రోజుకి డెబ్బైరూపాయలు చెల్లించేలా రూము హీటరు తెప్పించుకున్నాడు.

తెల్లవారి ఏడింటికే తయారై బయటపడ్డారు. రోడ్డు పక్క హోటల్లో వేడి వేడి ఆలూ పరాఠాలు తిని, కాఫీ తాగి బస్సెక్కారు. బస్సునిండా టూరిస్ట్‌లు ఉన్నారు. బస్ బయలుదేరింది. రోహ్ తాంగ్ పాస్ యాభై కిలోమీటర్లు వెళ్ళే దారిలో ఊలు దుస్తులు, బూట్లు అద్దెకి ఇస్తారు.ఒక చోట బస్ ఆపితే అందరూ దిగి తీసుకున్నారు. ఎత్తుకి వెళుతున్న కొద్దీ మంచు దగ్గర పడుతూవుంటే అందరూ కేరింతలూ కేకలు.

అలా వెళ్ళి వెళ్ళి రోహ్ తాంగ్ పాస్ పన్నెండు కిలోమీటర్లు అని ఉన్న మైలురాయి దగ్గర పక్కకు తీసి బస్ ఆపేశాడు డ్రైవరు. ఇక ముందుకి వెళ్ళదు. మూడుగంటలు టైం ఇస్తున్నాం ఈలోగా తిరిగిరావాలి. అన్నాడు.

అంతా దిగారు. అక్కడికి దగ్గరలో మంచు లేదు. కిందంతా తడిగా బురదగా ఉంది. రోడ్డు బాగానే ఉంది. అడ్డంగా బారికేడ్లు పెట్టారు. బస్ దిగిన వాళ్ళంతా తెల్లమొహం వేసుకుని చూస్తుండిపోయారు.

కాస్త దూరంలో గుర్రాలు వరసగా నిలబెట్టి ఉన్నాయి. బస్ ఆగగానే గుర్రాలవాళ్ళు టూరిస్ట్‌లను చుట్టుముట్టారు.

అక్కడికి అయిదు కిలోమీటర్ల దూరంలో బియాస్ నాలా (Beas Naala) అనే ప్రదేశం దగ్గర స్నో ఉంది. అక్కడికి వాహనాలను అనుమతించరు. గుర్రాల మీదే వెళ్ళాలి. లేకపోతే నడిచి వెళ్ళాలి. గుర్రానికి రానూపోనూ అయిదువందలు.

తెల్లబోయాడు శ్రీహరి. తను సేకరించిన సమాచారంలో ఈ గుర్రాల ప్రసక్తిలేదు. అక్కడ పసిపిల్లతో నడవడం చాలాకష్టం. అదీగాక చాలా సమయం పడుతుంది. అందుకే గుర్రాలు మాట్లాడుకున్నారు. శ్రీహరి పాపను పట్టుకుని ఒక గుర్రం మీద శారద మరో గుర్రం మీద.

స్నో పాయింట్‌కి చేరారు. ఫుట్ బాల్ స్టేడియం అంతమేర మంచు ఉంది. విపరీతమైన జనం. అందరూ తొక్కడం వలన మంచు రంగు మారిపోయి నల్లగా ఉంది. కొండ వాలున ఎత్తుకి వెళితే అక్కడ స్వచ్ఛంగా మెరుస్తోంది కానీ అంతదూరం వెళ్ళడానికి ఎవరూ సాహసించడంలేదు. అంతా కింద కిందనే ఉన్నారు.

స్కేటింగ్ సామాన్లు అద్దెకిస్తాం స్టీరింగ్ చేస్తారా అని అడిగే వాళ్ళూ, మంచుతో మీ బొమ్మ చేస్తాం డబ్బులివ్వమనేవాళ్ళూ, కాఫీలూ, టీలూ, చిప్సూ పాప్‌కార్న్ వగైరా పదార్థాలు అమ్మే వాళ్ళు అంతా గందరగోళంగా ఉంది.

ఆ దృశ్యం చూసి నీరుగారిపోయాడు శ్రీహరి. నాలుగు అడుగులు వేస్తే ఎవరో ఒకరు తగులుతున్నారు. ఊహించినదానికీ వాస్తవానికీ ఏ మాత్రం పొంతన కుదరక ఢీలా పడిపోయాడు. అయినా లేని ఉత్సాహం తెచ్చుకుని మంచుతో ఆడుకున్నారు దంపతులు. ఒక గంట సేపు అక్కడే గడిపి మళ్ళీ గుర్రాలు ఎక్కారు. మనాలీ చేరి మరికొన్ని ప్రదేశాలు చూపించి బస్టాండులో దించింది బస్.

చలి. అలవాటులేని గుర్రపుస్వారీ. ఒళ్ళు హూనం అయిపోయింది. రూముకి వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుని బయటికి వెళ్ళి బజార్లో తిరిగి భోజనం చేసి వద్దాం అని బయలుదేరారు. కాసేపు షాపులన్నీ చూసి రోడ్ పక్కనే ఉన్న హోటల్‌కి వెళ్ళి భోజనం ఆర్డర్ ఇచ్చాడు.

వీళ్ళ మాటలు విని పక్క టేబుల్ దగ్గర కూర్చున్నతను పలకరించాడు. అతనూ తెలుగువాడే పేరు ప్రసాద్. కొత్తగూడెం నుండి వచ్చాడట. మాటలు కలిశాయి. "స్నో చూశారా?" అని అడిగాడు ప్రసాద్.

"ఆ చూశాం లెండి!" అన్నాడు శ్రీహరి. వీళ్ళు బస్‌లో వెళ్ళారని తెలిసి "అరే! అలా వెళ్ళారా?" అని బాధపడ్డాడు ప్రసాద్.

ఆశ్చర్యపోయాడు శ్రీహరి. "ఇంకెలా వెళ్ళాలి?" అని అడిగాడు. దానికి సమాధానంగా మొత్తం చరిత్ర అంతా చెప్పుకొచ్చాడు ప్రసాద్.

మనాలీ నుండీ రాహ్ తాంగ్ పాస్ మీదుగా లడాఖ్ లేహ్ వెళ్ళే మార్గం  చలికాలంలో పూర్తిగా మూసుకుపోతుంది. ఫిబ్రవరి నెలాఖరుకి మంచు తొలిగించటం మొదలుపెట్టి ఏప్రిల్ నెల పదిహేను తరువాత మళ్ళీ రాకపోకలకు అనుమతిస్తారు. అంతదాకా బియాస్ నాలా వరకూ మాత్రమే టూరిస్టులను వెళ్ళనిస్తారు. అక్కడిదాకా అందరూ వాహనాల మీద వెళితే తమకు ఆదాయం ఉండదని గుర్రాలవాళ్ళు బియాస్ నాలాకు అయిదుకిలోమీటర్లకు ముందే రోడ్‌కి అడ్డం పెట్టేస్తారు.

అలా వాళ్ళు వచ్చి అడ్డం పెట్టేలోగా అంటే తొమ్మిదింటిలోగా ఆ ప్రదేశం దాటి వెళ్ళిపోతే బియాస్ నాలా దాటిన తరువాత కొంతమేర రోడ్డు క్లియర్ చేసేశారు అక్కడంతా మంచుమయం. జనం ఉండరు. అక్కడికి వెళ్ళడానికి జీపులు దొరుకుతాయి. ఎనిమిదొందలు తీసుకుంటారు. తెల్లవారి అయిదుగంటలకి బయలుదేరాలి. అని వివరంగా చెప్పాడు.

నోరావలించాడు శ్రీహరి. "ఇవన్నీ మీకెలా తెలిశాయి?" అని అడిగాడు.

"వస్తుంటే సిమ్లాలో ఒక తెలుగాయన పరిచయం అయ్యాడు. పాపం ఆయనే ఇవన్నీ చెప్పి పుణ్యం కట్టుకున్నాడు. ఆయన తిరుగు ప్రయాణంలో ఉన్నాడు. వాళ్ళూ అలాగే వెళ్ళారట. మేము నిన్న వెళ్ళివచ్చాం. మనం అంతదూరం నుండి పడుతూ లేస్తూ వచ్చింది ఎందుకు? స్నో చూడ్డానికే కదా! " అన్నాడు ప్రసాద్.

"మరి ఈ ఏర్పాట్లు అన్నీ ఎవరు చేశారు?" అని అడిగాడు శ్రీహరి.

"అందరికీ తెలుసు కానీ ఓ పట్టాన చెప్పరు నా దగ్గర ఆ డ్రైవర్ నెంబరుంది. ఇస్తాను తీసుకోండి. మీకు ఏ మాత్రం అవకాశం ఉన్నా వెళ్ళిరండి. మళ్ళీ మళ్ళీ ఇంతదూరం రాము కదా! అని నెంబరిచ్చి వెళ్ళిపోయాడు."

కాసేపు తర్జన భర్జన పడి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. బయటికి వెళ్ళి టెలిఫోన్ బూత్ నుండి ఫోన్ చేశాడు. వీళ్ళుండే హోటల్ వివరాలు అడిగి ఇంక అరగంటలో మీ రూముకి వచ్చి కలుస్తాను. అన్నాడు డ్రైవరు.

హోటల్‌కి వెళ్ళి రిసెప్షన్ దగ్గరున్న శాస్త్రీని ఈ విషయం అడిగితే "అవును అలా కూడా వెళ్ళొచ్చు!" అన్నాడు తాపీగా.

"మరీమాట ముందే చెప్పలేదేం? చెప్పుంటే ఇవ్వాళే వెళ్ళేవాళ్ళంకదా! " అన్నాడు చిరాగ్గా శ్రీహరి.

"మీరు అడగలేదుగా!" అన్నాడతను.

రుసరుసలాడుతూ రూముకి వచ్చాడు శ్రీహరి. "ఇదే మనదేశంలో ఉన్న దరిద్రం. చేసేది చెప్పరు. చెప్పేది చెయ్యరు. అంతా గుట్టూ గుంభనా!" అన్నాడు.

"పోన్లెండి. ఇక్కడ ఉండగానే తెలిసింది. రైలెక్కాక తెలిసుంటే జీవితాంతం బాధపడేవాళ్ళం" అంది శారద.

కాసేపటికే వచ్చాడు డ్రైవర్. పేరు అశోక్. పహాడీ జాతివాడు. పాతికేళ్ళుంటాయి. చెప్పండి "ఏమిటి విషయం?" అన్నాడు.

ఇలా రాహ్ తాంగ్ పాస్‌కి వెళ్ళాలంటే, "నా బళ్ళు రెండూ బుక్ అయిపోయాయి అన్నాడు. సర్లెండి అంతదూరం నుండి వచ్చారు  ఏదోవిధంగా మీకు న్యాయం చెయ్యాలి కదా వేరేవాళ్ళని ఎవరినైనా అడుగుతాను అన్నాడు. పన్నెండొందలు అవుతుంది అన్నాడు."

"అదేమిటి? నిన్న నా ఫ్రెండ్ ఎనిమిదొందలే ఇచ్చాడుగా" అంటే ఏవో కథలు చెప్పాడు. బేరం ఆడి ఎనిమిదొందలు యాభైకి ఒప్పించాడు శ్రీహరి.

"సర్లెండి మీరు గొప్పవాళ్ళు మీరు తృప్తిపడితే నాకు మరికాస్త బక్షీస్ ఇవ్వకపోతారా?" అనేసి "ఫ్యూయల్ తీసుకోవాలి నాలుగొందలు ఇవ్వండి అని డబ్బడిగి తీసుకుని రేపు ఆరింటికల్లా వచ్చేస్తాను రెడీగా ఉండండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ముందే తెలియక రెట్టింపు ఖర్చుపెడుతున్నాం కదా అని కాసేపు బాధపడి పోన్లే మళ్ళీ మళ్ళీ రాబోతామా అని సరిపెట్టుకున్నాడు శ్రీహరి.

మర్నాడు అయిదింటికే లేచి తయారై కూర్చున్నారు. ఆరున్నరకు వచ్చాడు అశోక్. జీప్ చాలాబావుంది. స్పీడ్‌గానే డ్రైవ్ చేస్తున్నా కంట్రోల్ ఉంది. ఏమిటో కబుర్లు చెపుతూనే ఉన్నాడు.

ఎనిమిదింటికి క్రిందటి రోజు బస్ ఆపిన చోటికి వచ్చారు. ఇంకా ఎవరూ రాలేదు. సర్రున దూసుకుపోయింది జీప్. బియాస్ నాలా దగ్గరికి వెళ్ళి మళ్ళీ మరో కొండమీదకి ఎక్కసాగింది. అంతా మంచు. కనుచూపు మేర సూది మొనమోపే ఖాళీ లేకుండా మంచు ఉదయపుటెండలో మెరిసిపోతోంది.

రోడ్ కి ఇరుపక్కలా మంచుగోడలు. మరో కిలోమీటరు వెళ్ళి జీప్ ఆపేశాడు అశోక్. "ఇంతేసాబ్. ఇంతవరకే రోడ్ క్లియర్ చేశారు. దిగండి మీ ఇష్టం వచ్చినంత సేపు ఇక్కడ ఉండండి" అన్నాడు.

మంత్రముగ్దుల్లా కార్లోంచి దిగారు. రెప్పవేస్తే ఆ సుందరదృశ్యం కనుమరుగయిపోతుందేమో అని భయం. బూట్లు కోట్లు అద్దెకి తీసుకున్నారు కాబట్టి అవి వేసుకుంటే వెచ్చగా ఉంది. తనివి తీరా మంచులో ఆడుకున్నారు. తమని మర్చిపోయారు.

రెండు గంటలు అక్కడే ఉండి "ఇక చాలు వెళదాం" అని తిరుగు ముఖం పట్టారు. వెళ్ళేటప్పుడు ఏ ఆటకంలేకుండా వెళ్ళిపోయారు కానీ వచ్చేటప్పుడు రెండు సార్లు పోలీసులు ఆపేశారు. "రోడ్డు తెరవకుండా ఎందుకువెళ్ళారు? ఏదైనా జరిగితే ఎవరిది జవాబుదారీ? " అని తిట్టిపోశారు.

శ్రీహరికి తలకొట్టేసినట్లే అయింది. అశోక్ మాత్రం ఇదంతా మామూలే అన్నట్లు ఊరుకున్నాడు. శ్రీహరిని అడిగి డబ్బు తీసుకుని వాళ్ళ చేతుల్లో పెట్టాడు.

రోడ్డుకి అడ్డం పెట్టిన దగ్గర గుర్రాలు వాళ్ళతో కాస్త దెబ్బలాట అయింది. వాళ్ళకీ ఏదో సమర్పించుకోక తప్పలేదు. ఒక్కోరోజు ఇంతే. "ఒక్కోరోజు చూసీచూడనట్లు వదిలేస్తారు" అన్నాడు అశోక్.

అంతమంచి అనుభవం తర్వాత ఇటువంటి వ్యవహారాలు కాస్త చిరాగ్గా అనిపించాయి శ్రీహరి దంపతులకు. హోటల్‌కి చేరుకున్నారు. నాలుగువందలు మినహాయించుకుని మిగిలిన డబ్బులు ఇచ్చేశాడు.

"మీకోసం ఇంత శ్రమపడ్డాను. పోలీసులతో గొడవపడ్డాను. నాకు ఈనాం ఇవ్వండి" అన్నాడు అశోక్.

యాభై రూపాయలు ఇవ్వబోతే వద్దుపొమ్మన్నాడు.

శ్రీహరికి కోపం వచ్చింది. "దారంతా అందరికీ సమర్పించుకుంటూనే వచ్చాను" అన్నాడు.

"అందరికీ ఇస్తే నాకిచ్చినట్లు అవుతుందా? " అన్నాడు అశోక్.

మాటామాటా పెరిగింది. కనీసం రెండొందలైనా ఇవ్వమంటాడు అశోక్.

అరిచి మొత్తుకున్నా యాభై కంటే ఇవ్వనంటాడు శ్రీహరి.

"వద్దు అదికూడా నువ్వే ఉంచుకో ఇటువంటి గతిలేనివాళ్ళు ఎందుకొస్తారు టూర్లకి బుద్దిలేక మీతో బేరం కుదుర్చుకున్నాను" ఈసడించాడు అశోక్.

శ్రీహరి ఆగ్రహం అవధులు దాటింది అతనిమీదకి దూసుకెళుతుంటే అప్పటికే అక్కడ మూగిన జనం అడ్డుపడి ఆపేశారు.

పెద్దగా అరుస్తూనే వెళ్ళిపోయాడు అశోక్.

"ఎందుకండీ వాళ్ళతో గొడవ? వాళ్ళు ఇక్కడివాళ్ళు మనం బయటనుంచి వచ్చిన వాళ్ళం. ఏదో కొంత ఇచ్చి రాజీపడాలిగానీ పోట్లాటకు దిగితే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లేకదా!" అన్నాడు ఆ హోటల్లోనే బసచేసిన తోటి టూరిస్ట్.

విసురుగా రూముకి వచ్చాడు శ్రీహరి. "ఛ. దిక్కుమాలిన దేశం. దిక్కుమాలిన మనుషులు. ఇటువంటి అన్యాయం ఇంకెక్కడా ఉండదు. కొత్త ప్రదేశానికి వచ్చిన మనిషిని జలగల్లా పట్టి పీడించి పిల్చి పిప్పి చేసిగానీ వదలరు. మళ్ళీ విదేశీయులని నెత్తినపెట్టుకుని తిరుగుతారు. డబ్బు కోసం ఎంతకైనా తెగిస్తారు. అసలైనా నాదీ బుద్ధి తక్కువ. తగుదునమ్మా అని విహారయాత్రకు వచ్చినందుకు నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి. డబ్బు పుష్కలంగా ఉన్న ధనవంతులు టూర్లు చేస్తే అందం ఆనందం. నా బోటి బికారి వెధవకి ఇటువంటి మర్యాదే జరుగుతుంది" అని బాధపడ్డాడు.

ఆవేశం చల్లారాక డబ్బులెక్కచూసుకున్నాడు. అనుకున్నదానికంటే బాగా ఎక్కువే ఖర్చయింది. బొటాబొటిగా మిగిలింది డబ్బు. జాగ్రత్తగా ఖర్చుచేస్తూ ఇంటికి చేరితే జన్మధన్యం అనుకున్నాడు.

మర్నాడంతా ఆ చుట్టుపక్కల తిరిగారు కాలినడకన. మర్నాడు పొద్దున బస్‌కి టికెట్లు బుక్ చేసుకుని హోటల్‌కి వచ్చేశారు. రాత్రిపూట ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. మన అదృష్టం నిన్నా, మొన్న వాతావరణం బాగుంది. కాబట్టి అన్నీ చూడగలిగాం అనుకున్నారు. రాత్రంతా ఆగకుండా మారుస్తూనే ఉంది వాన.

తెల్లవారి ఎనిమిదింటికి బస్.

ఏడింటికే తయారై హోటల్ గది ఖాళీ చేసి సామాన్లు తీసుకుని బస్టాండుకి వెళ్ళారు. అక్కడ అయిదారు బస్సులు ఉన్నాయి. జనం అంతా బస్టాండులో ఉన్నారు. ఏదో గందరగోళంగా ఉంది. ఏమిటని అడిగితే తెలిసింది.

రాత్రి పడిన వానకి ముందర రోడ్ పాడైంది. బస్సులు బయలుదేరవు. టికెట్ చూపించి డబ్బు వెనక్కి తీసుకోమని చెపుతున్నారు.

గుండెల్లో రాయిపడినట్లు అయింది శ్రీహరికి. యాంత్రికంగా వెళ్ళి టికెట్లు చూపించి డబ్బు తీసుకున్నాడు. మళ్ళీ జల్లు మొదలైంది.

"పదండి అలా వెళ్ళి హోటల్లో కూర్చుందాం" అంది శారద. సామాన్లు తీసుకుని రోడ్ పక్కనే ఉన్న హోటల్లోకి వెళ్ళి కూర్చున్నారు. టీ ఆర్డర్ ఇచ్చాడు.

అప్పుడే అశోక్ కూడా హోటల్లోకి వచ్చాడు. అతని వెంట మరికొంతమంది ఉన్నారు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని విసురుగా మొహాలు తిప్పేసుకున్నారు.

అశోక్ వాళ్ళు పెద్దగా మాట్లాడుకుంటున్నారు. "ఇలా వర్షం పడడం మంచిదే పైన చాలా మంచు కురిసింది. సీజన్ పూర్తిగా మంచువుంటుంది. టూరిస్ట్‌లు బాగా వస్తారు. మన పంట పండినట్లే!" అనుకుంటున్నారు.

"ఆ విషయం లో మనం జాగ్రత్తగా ఉండాలి. మంచి పార్టీని చూసుకోవాలి. బక్షీస్ ఇవ్వమంటే ఏడిచే సన్యాసి వెధవలు దొరికితే మనకేం లాభం?" అన్నాడు అశోక్ పెద్దగా.

శ్రీహరికి ఒళ్ళుమండిపోయింది. ఆ చిరాకంతా పేచీపెట్టి విసిగిస్తున్న కూతురి మీద చూపిస్తూ రెండు తగిలించాడు. దాంతో గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టింది ఆ చంటిది.

శ్రీహరి లేచి హోటల్ కౌంటర్ దగ్గరకి వెళ్ళాడు. "బస్సులు ఎప్పుడు బయలుదేరుతాయి? మేము వెళ్ళాలి?" అన్నాడు.

"రాత్రి వర్షానికి రోడ్డు బాగా పాడైందనే అంటున్నారు. ఇవ్వాళ బస్సులు నడవవు" అన్నాడతను.

"మరి వేరే వాహనాలు అంటే షేర్ జీపులుగానీ ఏవైనా దొరుకుతాయా?" దీనంగా అడిగాడు శ్రీహరి.

"బస్సులే వెళ్ళలేకపోతే ఇక చిన్నవాహనాలు వెళతాయా?" అన్నాడు హోటలతను. మళ్ళీ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు శ్రీహరి. పరిస్థితి తలుచుకుంటే గుండె జారిపోతుంది. చేతుల్లో డబ్బు బొటాబొటీగా ఉంది. క్రెడిట్ కార్డు మెదపలేదు. దూరం ప్రయాణం దొంగల భయం అని భార్య మెడలోని గొలుసూ, చేతిగాజులూ తీసేసి మంగళసూత్రాలు గిల్ట్ గొలుసులో గుచ్చుకుంది.

ఇప్పుడెలా ఇక్కడ ఆగిపోతే రైలు అందదు ఏం చెయ్యడం? అప్రయత్నంగా కళ్ళనీళ్ళు తిరిగాయి. అతనిని ఒక గంట గమనిస్తున్న అశోక్ గభాల్న లేచి వాళ్ళ దగ్గరికి వచ్చాడు.

"సాబ్! ఏమైంది? ఏమిటలా ఉన్నారు?" అని అడిగాడు. ఆ కంఠంలో అదివరకటి హేళన లేదు. ఆదుర్దా మాత్రమే ధ్వనిస్తోంది.

శ్రీహరి మాట్లాడకపోయేసరికి "మేము హోటల్ ఖాళీ చేసేశాం. బస్ కేన్సిల్ అయింది" అని తనే చెప్పేసింది శారద.

"ఓస్. అంతేనా పదండి నేను తీసుకెళతాను హోటల్‌కి" అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా సామాన్లు తీసుకుని బయటికి నడిచాడు అశోక్.

గబగబనడుస్తున్న అతని కింద నడిచాడు శ్రీహరి. ఇద్దరూ రోడ్ మీదకి వచ్చేశారు. "ఆగు అశోక్" అంటూ అప్పుడు నోరు విప్పాడు. "నా దగ్గర అంత డబ్బులేదు. ఇక్కడ చిక్కుపడిపోతే రైలు వెళ్ళిపోతుంది. సగం డబ్బు కోసేసుకుని సగమే ఇస్తారు. మళ్ళీ టికెట్లు కొనాలి. ఎలా? నా దగ్గరున్న డబ్బు సరిపోదు" ఇక ఆ తర్వాత మాటలు రాలేదు. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. అప్పటికి పరిస్థితి పూర్తిగా అర్థం చేసుకున్న శారద ఏడవడం మొదలుపెట్టింది.

ఒక్క క్షణం తెల్లబోయాడు అశోక్. వెంటనే "ఏం ఫర్వాలేదు సాబ్. మా ఇంటికి వెళదాం" అంటూ తన జీప్ దగ్గరికి వెళ్ళి సామాన్లు లోపలపెట్టాడు. వాళ్ళూ ఎక్కాక తిన్నగా అతనింటికి తీసుకెళ్ళాడు.

చిన్న ఇల్లు. తల్లీదండ్రీ ఉన్నారు. పరిచయం చేశాడు. వాళ్ళకి హిందీ రాదు. పహాడీ భాషలోనే ఏదో చెప్పారు.

"మిమ్మల్ని ఏమీ మొహమాటపడొద్దని చెపుతున్నారు" అని చెప్పాడు అశోక్. అతిథులను తల్లికి అప్పగించి వెళ్ళిపోయాడు. సామాన్లు పక్కనపెట్టుకుని కూర్చున్నారు శ్రీహరి శారద. అతని మనసు పరిపరి విధాల పోతోంది. ఈ ఆదరణ వెనకాల ఏదైనా కుట్రలేదుకదా! ఏదైనా జరగరానిది జరిగితే ఈ కొత్తప్రదేశంలో ఎవరు దిక్కు? ఎందుకిటువంటి పరిస్థితి ఎదురైంది? ఆలోచనలతో బుర్రవేడెక్కిపోయింది.

రెండుమూడు గంటల తరువాత అశోక్ అతని తమ్ముళ్ళూ వచ్చారు. వాళ్ళిద్దరికీ మారుతీ వోమనీలు ఉన్నాయట. రోడ్డు మూసుకుపోయి టూరిస్టులు ఆగిపోవడం వల్ల వాళ్ళని హోటళ్ళకి చేర్చడంలో బేరాలు బాగానే దొరికాయట.

అశోక్ తల్లి అందరికీ భోజనం వడ్డించింది. వాళ్ళెంత ఆదరంగా చూస్తున్నా మనసులో ఏదో భయం ఏమూలనుండి ఏ ఆపద వస్తుందానని ఆదుర్దా. ఆ రోజంతా గడిచింది. తెల్లవారింది. ఆ కుటుంబం వీళ్ళని కడుపులో పెట్టుకుని చూశారు. వాళ్ళకున్నదే ఆప్యాయంగా పెట్టారు. మధ్యాహ్నానికి అశోక్ సమాచారం తీసుకొచ్చాడు.

వందమీటర్ల మేర రోడ్డు కోసుకుపోయిందట. మిలట్రీ వాళ్ళు రంగంలోకి దిగారట. అక్కడిదాకా వాహనాల్లో టూరిస్టులను తీసుకెళ్ళి ఆ కాస్త దూరం నడిచి దాటిస్తే అటు పక్క మళ్ళీ వాహనాలు సిద్ధంగా ఉంచుతారట.

శ్రీహరికి ప్రాణం లేచివచ్చింది. అంతలోనే సమస్య గుర్తువచ్చింది. "అశోక్ నేను మళ్ళీ రైలు టికెట్లు కొనుక్కోవాలి. నా దగ్గరున్న డబ్బు చాలకపోవచ్చు. నా దగ్గర కొద్దిగా బంగారం ఉంది. అది తీసుకుని నాకు డబ్బిస్తావా?" అన్నాడు ఇంకా అతన్ని సాయం అడుగుతున్నందుకు సిగ్గుతో చచ్చి సతమతం అయిపోతూ

అశోక్ నొచ్చుకున్నాడు. "అదేం మాట సాబ్. నేను డబ్బిస్తాను. ఇంటికి వెళ్ళి నాకు పంపించండి" అన్నాడు

మర్నాడు పొద్దున్నే ప్రయాణం అశోక్ తల్లి పరోటాలు చేసిపెట్టింది. దార్లోకి మరికొన్ని కట్టి ఇచ్చింది. కళ్ళనీళ్ళతో ఆవిడ కాళ్ళకు దణ్ణం పెట్టింది శారద. ఆదరంగా దగ్గరకు తీసుకుని తల నిమిరింది ఆవిడ. శ్రీహరి కూడా వాళ్ళకి పదే పదే కృతజ్ఞతలు తెలియజేశాడు. అందరూ గమ్యం దాకా కలిసి అతిథులను సాగనంపారు.

బస్టాండ్ దగ్గర అంతా సందడిగా ఉంది. మిలట్రీ వాళ్ళు పూనుకుని అక్కడ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆడవాళ్ళు పిల్లతో ఉన్నాడు కాబట్టి వీళ్ళ కుటుంబానికి ఒక సీటు కేటాయించారు.

అశోక్‌ని కావలించుకున్నాడు శ్రీహరి. "జాగర్త సాబ్ వెళ్ళగానే ఉత్తరం రాయండి. మా ఇంట్లో మీకేమైనా అసౌకర్యం కలిగివుంటే క్షమించండి." అంటూవుంటే శ్రీహరి మనసు భారమైపోయింది

"సమయానికి దేవుడిలా ఆదుకున్నావు. నన్ను నమ్మి డబ్బిచ్చావు. నేను తిరిగి ఇస్తానో లేదో అనే అనుమానం అయినా రాలేదా అశోక్ నీకు?" అని అడిగాడు.

"అదేం మాట సాబ్. పొట్టకూటికోసం పోట్లాడతాం. కానీ నమ్మిన వాడిని మోసం చెయడం మన రక్తంలోనే లేదు కదా సాబ్. ఇక నేను చేసిన సాయం అంటారా ఆపదలో మనిషికి సాటి మనిషి సాయం చెయ్యకపోతే ఇంకెవరు వస్తారు ఆదుకోడానికి" అన్నాడు అశోక్.

"వెళ్ళగానే డబ్బు పంపిస్తాను. నువ్వెప్పుడైనా హైదరాబాద్ వస్తే మా ఇంటికే రావాలి" అన్నాడు శ్రీహరి ఆప్యాయంగా.

"అంతదూరం మేమేం వస్తాం సాబ్, మీరే మరోసారి రండి. నా జీప్ లో లేహ్ లడాఖ్ తీసికెళతాను" చెప్పాడు అశోక్.

బస్ హారన్ మోగించారు. మరోసారి అతని చేతులు పట్టుకుని కృతజ్ఞతలు చెప్పుకుని బస్సెక్కాడు శ్రీహరి.

బస్ నిండా జనం. కీచులాటలూ, పోట్లాటలూ. రోడ్డుపాడైన దగ్గర ఆ కాస్త దూరం నడిచేసరికి చుక్కలు కనిపించాయి. ఆర్మీ వాళ్ళ అదిలింపులు.

పఠాన్ కోట చేరాక టికెట్లు చూపిస్తే సగం డబ్బు తిరిగి ఇచ్చారు. మళ్ళీ తికెట్లు కొనుక్కుంటే రిజర్వేషన్ దొరకలేదు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉంది. ఆ రోజంతా వెయిటింగ్ రూంలో గడపాల్సి వచ్చింది. అక్కడంతా చీదరగానే ఉంది.

రైలొచ్చాక టి.సి.ని బ్రతిమాలి చెయ్యితడిపితే దయతలచినట్లు ఫోజు పెట్టి రెండు బెర్త్‌లు ఇచ్చాడు. రైలెక్కాక చూస్తే ఇంకా ఖాళీలు ఉన్నాయి.

కూలివాడు డబ్బులెక్కువ ఇమ్మని దెబ్బలాడాడు.

రైలు పెట్టికి కిందంతా వేరుశెనక్కాయ తొక్కలూ, ఎంగిలి కప్పులూ పడున్నాయి. అయినా ఎందుకో శ్రీహరికి చిరాకు వెయ్యలేదు.

"ఏది ఏమైనా మేరా భారత్ మహాన్!" అనుకున్నాడు.

# అజగరమ్ కొంపెల్ల లక్ష్మీ సమీరజ

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**కాలేజీ నుంచి సరాసరి** ఇంటికి వచ్చి, నా చేతిలో ఉన్న రెండు వస్తువులూ రిక్షా అబ్బాయికి ఇచ్చి తీసుకోమన్నాను. లోపలకు వచ్చి తలుపుతాళం తీసి తెరిచాను - దబ్బున నా మీద నేను మోయలేనంత బరువైనదేదో పడినట్లనిపించింది. తెరిచి ఉన్న ద్వారబంధం కొండచిలువ నోటిలా అనిపించి ఒక్కక్షణం నిలువెల్లా ఒణుకు పుట్టింది. వెంటనే సర్దుకుని లోపలికి నడిచాను. రోజూ నాతో తెచ్చుకునే రిఫరెన్స్ పుస్తకాలూ - లైబ్రరీ బుక్సూ ఏమీ లేవు నా దగ్గర.

రిటైరైపోయాను కదా! ఇంక వాటి అవసరం ఏముంది - ఎవరికి చెప్పాలి పాఠాలు? తలుపులు మూసి లోపలికొచ్చి మంచం మీదపడుకున్నాను. ఇందాక నా మీద పడిన బరువైన వస్తువు - మెల్లగా - మెత్తగా నన్ను చుట్టుకోవటం ప్రారంభించింది. ఇంటికొచ్చిన ఈ కొద్దిసేపటిలోనే ఏమీ తోచటం లేదనిపిస్తోంది. ఇంక జీవితమంతా ఇలా ఎలా గడపటం? లేచి కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. ఊహూ... ఏమీ ఆలోచన తట్టటం లేదు.

ఇంతలో నా దృష్టి ఎదురుగా టేబుల్ మీద ఉన్న టెలిఫోన్ మీద పడింది. 'అవును...! ఒక్కసారి విజయ్.. రవి .. ప్రభ.. వీళ్ళకి ఫోన్ చేసి నేను ఈ రోజే రిటైరయినట్లు చెపితే..!!' ఆలోచన వచ్చినదే తడవుగా ఫోన్ దగ్గరకు నడిచాను. టైము చూస్తే ఎనిమిదవుతోంది. వాళ్ళకక్కడ తెల్లారుతూ ఉంటుంది. లేస్తారు అందరూ కూడా! ఉద్యోగాలకి వెళ్ళే వాళ్ళేగా! నేనీమాట చెప్పగానే "అప్పుడే రిటైరైపోయావా అక్కా! ఇంకా నలభై ఏళ్ళదానిలాగే ఉంటావు. అరవై ఏళ్ళువచ్చేశాయా అప్పుడే" అంటూ ఆశ్చర్యపోతారు.. "ఇన్నేళ్ళూ కాలేజీ - ఉద్యోగం - బాధ్యత అంటూ గడిపేశావు.. ఇప్పుడైనా ఒక్కసారి ఇక్కడకు రాకూడదూ?" అని పిలుస్తారు.

కొన్నాళ్ళు వాళ్ళదగ్గరకెళ్ళి ఉండివస్తే... కాలక్షేపం అవుతుంది. తరవాత ఏం చేయాలీ అనేది వాళ్ళతో సంప్రదించి నిర్ణయించుకోవచ్చు.

టెలిఫోన్ నంబర్లు రాసి ఉన్న పుస్తకం తీసి రవి నంబరుకి డయల్ చేశాను." మేము బైటకెళ్ళాము. బీప్ శబ్దం వచ్చాక మెసేజ్ ఇవ్వండి.." రిప్లయి వచ్చింది అటునుంచి. విజయ్, ప్రభ.. వీళ్ళఫోన్లూ అదే రెస్పాన్స్ ఇచ్చాయి. అప్పుడే వెళ్ళిపోయారా బైటకి! నా నంబరు అక్కడ రికార్డవుతుంది కదా చూసుకుని చేస్తారు వాళ్ళు. అయినా వాళ్ళు ఇక్కడకొచ్చి ఆరేడేళ్ళకి పైన అయింది ఒకసారి అందరినీ ఇక్కడకు రమ్మంటే అంతా కల్సి పది - పదిహేను రోజులు సరదాగా గడపవచ్చు. నా రిటైర్మెంటు బెనిఫిట్స్‌తో వాళ్ళకి.. పిల్లలకి కావలసినవి ఇవచ్చు. నాకు మాత్రం వాళ్ళు తప్ప ఎవరున్నారని? జీవితమంతా వాళ్ళకోసమే గడిపాను. ఇప్పుడూ అంతే. ఆ మాట వాళ్ళకి మాత్రం తెలియదా? అసలు నన్నిక్కడ ఒంటరిగా ఉండనిస్తారా? 'ఇల్లు అమ్మేసి వచ్చెయ్యి మా దగ్గర అక్కడే ఉందువుగాని' అంటూ గోల చేయరూ -

అమ్మో... నేనా పని చెయ్యగలనా? ఈ ఇల్లు ఈనాటిదా? ఇక్కడ తాతగారూ.. బామ్మ.. అమ్మా..నాన్నగారు.. ఎంతమంది ఉన్నారు ఆ రోజుల్లో. ప్రతి అణువులో వాళ్ళ జ్ఞాపకాలు నిండిలేవూ! బైట తోటలో గోడదగ్గర పెరిగి బోలెడు కాపుకాస్తున్న సపోటా చెట్లూ - మామిడి చెట్లూ ఆ రోజుల్లో తాతగారు నాటినవేగా! నాన్న సరేసరి.. మంచి భావుకత కలిగిన మనిషి చిత్రకారుడూ! 'దామెర్ల

రామారావుగారి తరువాత మన ఆంధ్రప్రదేశ్‌లో నాన్నంత గొప్ప చిత్రకారుడు లేర`ని ఇప్పుడు కూడా ఆయన జయంతికీ వర్ధంతికీ చిత్రకళాపట్ల ఆసక్తి కలిగిన వాళ్ళు రాసిన వ్యాసాలు పేపర్లో - మ్యాగజైన్సులో వస్తుంటాయి. ఈ మధ్యన కూడా కొందరు వచ్చి నాన్న వేసిన పెయింటింగ్స్‌ని రామారావుగారి మ్యూజియంకి ఇవ్వమని అడిగారు. కానీ నాన్నని వాటిలోనే చూసుకుంటున్న నేను ఇవ్వలేకపోయాను. అమ్మితే కొంటామనీ, ఒకొక్క పెయింటింగ్‌కీ అరవై డెబ్బయ్ వేలకి పైనే ఇస్తామనీ కొందరు అడిగారు. ఛ. అమ్మటమా?

తాతగారూ - బామ్మా ఇద్దరూ ఉన్న పెయింటింగ్ ఎంత జీవకళ ఉట్టిపడుతూ ఉంటుంది? అది చూస్తుంటే తాతగారు ఇప్పటికీ ఆ కుర్చీలో దర్పంగా కూర్చుని ఉన్నట్లు, పక్కనే బామ్మ, అప్పుడే వంటగదిలో నుంచి చేతులు తుడుచుకుని వచ్చి నిలుచున్నట్లూ అనిపిస్తుంది. ఆవిడ ముఖానికి పట్టిన చెమట కూడా ఎంత సహజంగా వేశారు నాన్న! "నేను ప్రత్యేకమైన అలంకారాలతో అందచందాలతో రాను. ఉన్నదాన్ని ఉన్నట్లు ఇలా వేస్తే వెయ్యి - లేకపోతే మీ నాన్నగారి నొక్కరినే వెయ్యి" అని చెప్పిందట బామ్మ ఆ బొమ్మ గీసినప్పుడు - నాన్న ఆ బొమ్మ చూసినప్పుడల్లా ఆ మాట చెప్తుతూ ఉండేవారు.

గోడగడియారం పదిగంటలు కొట్టి.. నన్ను తట్టి పిలిచింది ఆలోచనలలోనించి! గేటు తాళం వేయలేదని గుర్తొచ్చింది. గదిలోనుంచి బైటకి వచ్చేసరికి హాలంతా చీకటిగా ఉంది. ఆ బైట తోటా చీకటే.. స్ట్రీట్ లైట్లు వెలుతురు మాత్రం పడుతుంది కొద్దిగా ఆ వైపున ఎదురింటివాళ్ళ ఇంట్లోనుంచి లైట్లు కనిపిస్తున్నాయి. ఒక్కొక్క లైటూ వేసుకుని వెళ్ళి గేటు తాళం వేసి వస్తుండగా, పక్కింటి ఆవిడ వరండాలో నిల్చుని కనిపించింది. నన్ను చూసి - "భోజనమయిందా టీచరుగారూ?" అడిగింది.

ఎటూకాకుండా తలూపాను.

"రిటైరయ్యారట కదా ఇవాల్టితో?" మళ్ళీ ఆవిడే అడిగింది.

అవునన్నట్లు తలఊపాను.

"ఇల్లు అద్దెకిచ్చి మీవాళ్ళ దగ్గర కెళ్ళిపోతారా?"

చిన్నగా నవ్వి లేదన్నట్లు తలఊపాను.

ఇంతలో ఆవిడ - లోపల ఎవరో పిలిచినట్లున్నారు. "రేపు వస్తాలెండి కాస్సేపు కబుర్లు చెప్పుకోవటానికి" అంటూ ఇంట్లోకెళ్ళిపోయింది. "అమ్మయ్య.. రేపు ఇరవైనాలుగుగంటల్లో రెండు గంటలు ఈవిడతో గడిచిపోతాయి" అనిపించింది లోపలికొచ్చి తలుపు తాళం వేస్తుండగా పోర్టికోలో చిన్న లైటు వేసి, లోపల అన్ని గదుల్లోనూ కిటికీతలపులు గట్టిగా వేసి ఉన్నదీ లేనిదీ చూసుకుని - వచ్చి మంచం మీద పడుకున్నాను. నన్ను చుట్టి చుట్టిన వస్తువు మరింత బిగుస్తూ మరో చుట్టు చుడుతున్నట్టనిపించి ఊపిరాడలేదు.

నిద్రపట్టటంలేదు. బైట తోటలో ఏదో అలికిడయినట్టు అనిపించింది. నేను గేటు తాళం వేయటం ఆలస్యమయింది - ఈ లోపల ఎవరైనా తోటలోకి వచ్చారేమో...! ఒక్కదాన్నే ఉంటానని అందరికీ తెలుసు. కిటికీ దగ్గర ఏదో కదిలినట్టనిపించిద్మి. మంచం మీద లేచి కూర్చున్నాను. గొంతుక ఎండిపోతున్నట్టనిపించింది.లేచి వంట గదిలో కెళ్ళి కాసిని మంచినీళ్ళు తాగి పెయింటింగ్స్ పెట్టిన గదిలోకి నడిచాను - నేను ఒంటరిగా ఫీలయినప్పుడల్లా వెళ్ళి కూర్చునే చోటది.

అక్కడ కూర్చుంటే ఒక్కదాన్నే ఉన్నానన్న ఫీలింగ్ ఉండదు. నా వాళ్ళందరూ నాకు ఉన్నారన్న ధైర్యం వస్తుంది. అక్కడికెళ్ళి కూర్చున్నాక ఎప్పుడు నిద్రపట్టిందో... తెల్లవారి - మంగమ్మ గేటు దగ్గరనుంచి `అమ్మా.. అమ్మా` అని గట్టిగా అరుస్తుంటే మెలుకువ వచ్చింది. ఎప్పుడైనా పేపర్లు దిద్దుతూనో, లెసన్ ప్రిపేరవుతూనో రాత్రి ఆలస్యంగా పడుకుంటే ఇలా కావటం అలవాటే అవటంతో మంగమ్మ ఏమీ అడగకుండానే లోపలికొచ్చి పనిచేసుకుని వెళ్ళిపోయింది.

నేను లేచినది మొదలూ విజయ్.. రవి... ప్రభ - వీళ్ళ ఫోన్ల కోసం ఎదురుచూస్తున్నాను. కనీసం ఒకళ్ళయినా చేయకపోతారా అని. లేదు ఎక్కడినుంచీ కూడా రాలేదు. నేను చేసి చూద్దామని మళ్ళీ ముగ్గురికీ చేశాను. అప్పుడూ అదే సమాధానం - "మేము బైటకు వెళ్ళాం... మెసేజ్ ఇవ్వండి" అంటూ! ముగ్గురికీ నేను రిటైరయిన సంగతి చెప్పి, 'సరదాగా కొన్నాళ్ళు అందరం కలిసి గడపవచ్చు రమ్మ'ని పిలిచాను.

మధ్యాహ్నం పక్కింటావిడ వచ్చి 'భోజనం అయిందా టీచరుగారూ' అని అడిగేవరకూ నేనసలు వంట చేసుకోలేదనే విషయం కూడా గుర్తులేదు. "రిటైర్మెంటు బెనిఫిట్స్ ఎంతదాకా వస్తాయి? పెన్షను ఎంత వస్తుంది? అంతా ఏం చేయాలనుకుంటున్నారు?" అంటూ ఏవేవో ప్రశ్నలడిగి, "ఈ రోజుల్లో కడుపున పుట్టిన పిల్లలనే నమ్మలేకపోతున్నాం - నేనన్నానని కాదుగానీ టీచరుగారూ! మీకంటూ మీరు దాచుకోండమ్మా - చేయినొచ్చినా - కాలునొచ్చినా మీదంటు మీకు ఉండాలి. 'వాళ్ళకెందుకండీ - డాలర్లు సంపాదించుకుంటున్నారు, దీనికి వాళ్ళు ఆశపడతారా' అనవచ్చు మీరు - పైసా అయినా డబ్బు డబ్బేనమ్మా - పుస్తకాలూ కాలేజీ - అక్కడి పిల్లలూ తప్ప ప్రపంచం తెలియదు మీకు - చూస్తూ ఉంటాం కదా.. ఈ చుట్టుపక్కల వాళ్ళం అందరం అనుకుంటూ ఉంటాం 'కనీసం టి.వి కూడా లేదు మీ ఇంట్లో' అని! గోడపక్కనే కదా మేము ఉండేది - ఏ అవసరమొచ్చినా ఒక్క కేకేయండి - మేమున్నాం మీకు. ఏం కావాలన్నా మా పిల్లల్తో చెపితే తెచ్చిపెడతారు..." అంటూ చెప్పి వెళ్ళిందావిడ.

ఆవిడ మాటలు వినేసరికి మనస్సెలాగో అయిపోయింది. మళ్ళీ నాన్న వేసిన పెయింటింగ్స్ దగ్గరకెళ్ళాను. అమ్మ, తులసి మొక్క దగ్గర దణ్ణం పెట్టుకుంటున్న పెయింటింగ్ కనిపించింది. దానిదగ్గర కెళ్ళి నిలుచున్నాను. ఎంత బాగుందో అమ్మ ఆ పెయింటింగ్‌లో -

అవును -

అమ్మ చాలా అందంగా ఉండేది.

ఆవిడ అందమంతా ఆవిడ వ్యక్తిత్వమే!

స్వాభిమాన ప్రతిమ ఆవిడ!

నాన్నతో చాలా విషయాలలో అభిప్రాయబేధాలొచ్చేవి అమ్మకి! ఏ విషయమైనా తన మనస్సులోని అభిప్రాయాన్ని నిక్కచ్చిగా - నిర్భయంగా చెప్పేది. ఆయన మాటలతోగానీ - పనులతోగానీ తన మనస్సు నొచ్చుకుంటే మాత్రం అది ఆయనతో చెప్పేది కాదు.

నాతో చెప్పేది -

నిజం! నాతోనే చెప్పేది!

నేను ఆవిడకు పెద్ద బిడ్డను మాత్రమే కాదు - మంచి స్నేహితురాలిని కూడా! ఒక స్త్రీ మనస్సు.. స్త్రీకే అర్థమవుతుంది అంటారు - నేను 'మీ ప్రవర్తన - మాటలు ఈ రకంగా నాకు బాధ కలిగిస్తున్నాయ'ని ఆయనతో చెపితే.. 'వట్టి పిచ్చిదానివి' అంటారు తప్ప ఆయనకు అర్థంకాదు. ఆడపిల్లవిగా అర్థం చేసుకోగలవని నా బాధనీతో పంచుకుంటున్నాను" అంటూ తనబాధ చెప్పుకున్నా - నాన్న అంటే ఎంతో అభిమానంగా ఉండేది అమ్మ.

నాన్న కూడా మూర్ఖత్వపు మనిషే అయినా అమ్మ అంటే అభిమానంగా ఉండేవారు. అమ్మకి పెద్దజడ ఉండేది - ఎప్పుడూ ముడివేసుకునే ఉండేది. నాన్నకి అమ్మ వాల్జడతో ఉంటే ఇష్టం - ఆయన సమక్షంలో ఏమో కానీ ఎపుడూ జడవేసుకోగా అమ్మను చూడలేదు నేను. ఒకసారి తులసి కోట దగ్గర దీపంపెట్టి - దణ్ణం పెట్టుకుంటూ నిలుచుంది అమ్మ. నాన్న వెనకనుంచి వెళ్ళి ఆవిడ ముడిసూదులు తీసేశారు. చుట్టవిప్పి - లేచి నిల్చునున్న నల్లతాచులా జారి నిల్చుంది అమ్మ నిడుపాటి జడ. అమ్మ పూజలో ఉండటంతో కదలకుండా అలాగే నిలుచుంది.

అప్పుడు అమ్మను చూసి ... గీసారు నాన్న ఈ పెయింటింగ్! పూజపూర్తవగానే ముడివేసేసుకునిగానీ లోపలకు రాలేదు అమ్మ. "ఏ ప్రకృతి దృశ్యాలో వేసుకోవాలిగానీ - బొమ్మనా? ప్రాణం ఉన్న మనిషిని! నాకు ఇష్టం ఉండదని చెప్పినా నా బొమ్మ ఎందుకు వెయ్యాలిట?" అంది కోపంగా లోపలకొస్తూనే!

"రేపు.. తట్టనెత్తిమీద పెట్టుకుని వస్తున్న నాగమ్మ బొమ్మ వేస్తాలే" అన్నారు నాన్న. 'అమ్మకి ఇష్టం లేనప్పుడు వేయటం దేనికి ఈయన' అని అప్పుడు నాకు అనిపించినా, నాన్న అప్పుడు వేశారు కనకనే అమ్మ రూపం - ఇంత అందంగా ఈ ఇంట్లో ఇప్పటికీ ఉంది. మరణించే ముందు అమ్మ రూపం గుర్తుకు వచింది.

అమ్మకి క్యాన్సర్ వచ్చింది.

అప్పట్లో ఏం మందులు ఉన్నాయుని? ఏ బ్రెస్ట్‌కో అయితే ఆపరేషన్ చేసి తీసేసే వారేమో కానీ ఆవిడకు యూట్రస్‌కి వచ్చింది. నాన్న బాగా కుంగిపోయారు అమ్మకి వచ్చిన వ్యాధిపేరు వినగానే. అమ్మ బాగా నిబ్బరంగా ఉంది - అసలేమీ లేనట్లే పైగా, "జాతస్యమరణం ధ్రువమ్' అని తెలిసి కూడా ఎందుకు బాధపడటం? జీవితాన్ని ఎలా ఎదుర్కొని బతుకుతున్నామో మరణాన్నీ అలాగే ఎదుర్కోవాలి." అంటూ నాన్నకి ధైర్యం చెప్పేది. మనిషి బాగా చిక్కిశల్యమైపోయి రూపురేఖలు మారిపోయి బొమ్మలాగా ఇంత మనిషైపోయింది చివరిరోజుల్లో!

ఎందుకో ఇక ఆ గదిలో ఉండాలనిపించలేదు.

ఇంట్లోనుంచి బైటకు వచ్చాను.

అవును -

ఇక్కడే .. ఈ చోటులోనే అమ్మని 'పడుకోబెట్టారు' - స్నానం చేయించి పసుపుకుంకుమలు పెట్టిస్తూ - తీసుకువెళ్ళేముందు!

ఎలా ఉండేది పూచిన తంగేడల్లే! బట్ట నలిగేది కాదు - జుట్టు రేగేది కాదు - ఇంట్లో పనంతా తనే చేసుకున్నాకూడా!

ఇక్కడ పడుకోబెట్టినప్పుడూ అలాగే ఉంది. నాకు బాగా జ్ఞాపకం - అమ్మకి స్నానం చేయిస్తుంటే నేను గబగబా లోపలికెళ్ళి బీరువా తెరిచి ఆవిడ కోసం నాన్న కొన్న కొత్తచీర తీస్తుంటే, అత్తచూసి - " ఏమిటీ అమ్మాయ్! ఇప్పుడు నువ్వవన్నీ ముట్టుకోకూడదు" అంటూ కేకలేసింది. అమ్మకి ఆకుపచ్చరంగంటే చాలా ఇష్టం. ఆ చీర పట్టుకుని, ఆవిడ మాటవినిపించుకోకుండా నే వెళ్ళి అమ్మకి కప్పాను. గబగబా దొడ్లో పూసిన మల్లెపూలు కోసి మాలకట్టి మండిమీద పెట్టాను. గోరింటాకు కోసి నూరి రెండు చేతులకూ పెట్టాను. కాలివేళ్ళ మీద వేసి, అరికాళ్ళలో పెడుతుండగా - "ఆడవాళ్ళు అరికాళ్ళలో గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకోవాలి 'అయిదోతనం' అంటూ నాకు తను పెట్టటం గుర్తొచ్చింది -! అమ్మ ముఖం చూశాను - ప్రశాంతంగా చిరునవ్వు నవ్వుతున్నట్టుగా అనిపించింది. లేచి ముఖం దగ్గరగా వెళ్ళికూర్చుని తల నిమిరి బొట్టు సర్దుతుంటే -

"ముందు దాన్ని దూరంగా తీసుకువెళ్ళండి - ఇలా అయితే మతి చలించేలా ఉంది" అన్నారు నాన్న.

అత్త నన్ను తీసుకెళ్ళి విజయ్.. రవి.. ప్రభ ఉన్నచోట కూర్చోబెట్టింది - అప్పటికి విజయ్‌కి ఎనిమిదేళ్ళు - రవికి నాలుగేళ్ళు - ప్రభ ఏడాది పిల్ల! నా తరవాత పన్నెండేళ్ళకి పుట్టాడు విజయ్! వాళ్ళని చూడగానే నా బాధ్యత గుర్తుకు వచ్చింది. అవును.. వీళ్ళని అమ్మ నాకు అప్పగించింది. అమ్మలేని లోటులేకుండా చూసుకోవాలి వీళ్ళని నేను -

"అమ్మకి ఏమయిందక్కా?" అడిగాడు విజయ్ -

ఏమని చెప్పను - ఏమని చెపితేవాడికి అర్ధమవుతుంది?

ప్రభ ఏడుపు మొదలుపెట్టింది ఇంతలో -

లేచి దానిని భుజానికి ఎత్తుకున్నాను.

విజయ్ నీ.. రవినీ గుండెలకి హత్తుకుని అక్కడే కూర్చున్నాను -

"అమ్మ్ మా..." అంటూ ప్రభ అరచేతులతో నా ముఖం మీద కొడుతూ ఆడుకోవటం మొదలుపెట్టింది!

ఫోన్ మోగుతుంటే ఒక్కసారి ఉలిక్కిపడ్డాను -

"వీళ్ళే ఎవరో చేసి ఉంటారు" - అనుకుంటూ గబగబా వెళ్ళి ఉత్సాహంగా ఫోను ఎత్తాను.

"హలో.." నేను అంటూ ఉండగానే -

"అమ్మా... అప్పుడే రిటైరయ్యావా?" అంటూ అవతలనుంచి బాబాయి గొంతు వినిపించింది.

"బాబాయ్.." ఉత్సాహంగా పిలిచాను.

"నిన్న నీ పుట్టినరోజు అని మీ పిన్ని చెప్పిందమ్మా. అప్పుడు గుర్తొచ్చింది ఓసారి నువ్వు చెప్పినట్టు - ఈ సంవత్సరమే నీ రిటైర్మెంటని! ఫోను చేశానుగానీ కాలేజీలో ఉన్నట్టున్నావు ఎత్తలేదు. తెల్లవారు ఝామున చేసినా ఎత్తకపోయేసరికి ఏ గుడికైనా వెళ్ళావేమోననుకున్నాము. ఇదిగో మళ్ళీ ఇప్పుడు కుదిరింది. ఏమిటి విశేషాలు.. మా దగ్గర కొచ్చి నాలుగు రోజులు ఉండాలమ్మా నువ్వు... ఎప్పుడొస్తావు.. ఏమిటి.." ఆగకుండా తనే మాట్లాడేస్తున్నాడు.

పిల్లలంతా విదేశాల్లో సెటిలయిపోయి - వీళ్ళిద్దరే హైదరాబాదులో ఉంటున్నారు. ఇద్దరూ వీణ విద్వాంసులు కావటంతో సాధన చేసుకుంటూ అప్పుడప్పుడు రేడియోలో వాయిస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

"వస్తాలే బాబాయ్... ముందు, పిల్లల్ని ముగ్గుర్నీ రమ్మని పిలిచాను వాళ్ళు వచ్చినపుడు మీరిద్దరూ కూడా రండి అందరం సరదాగా నాలుగురోజులు కలిసి ఉందాం ఇక్కడ" చెప్పాను.

"ఇల్లు అమ్మేస్తున్నారటగా - తలో ఐదారు లక్షలూ వస్తాయి - నాన్న వేసిన పెయింటింగ్స్ కూడా ఇక్కడకు తెచ్చి అమ్మితే మినిమమే ఒక్కోదానికి రెండులక్షలయినా వస్తాయి" అంటూ విజయ్.. రవి మొన్న మా విశ్వానికి చెప్పారట. నువ్వో మాటైనా నాతో అనలేదే అనుకున్నాను -" అంటూ బాబాయి చెపుతుంటే నా తలమీద పిడుగులు పడినట్టుగా అనిపించింది.

బాబాయి, తరవాత ఏం మాట్లాడిందీ వినిపించలేదు.

ఫోను పెట్టేశాను -!

ఇల్లు అమ్ముతారా -

పెయింటింగులు అమ్ముతారా -

నాతో ఒక్కమాటకూడా అనలేదు -! అప్పుడే నేను పనికిరానిదానైపోయానా?

"మీకు పుస్తకాలూ - కాలేజీ - అక్కడి పిల్లలూ తప్ప ప్రపంచం తెలియదు" అంటూ పక్కింటావిడ అనటం గుర్తొచ్చింది.

ప్రపంచంలో అందరిలాగే వీళ్ళూనా?

నేను... ప్రభ .. నన్ను అమ్మా అంటుంటే.. నేను 'అక్కనిరా' అని చెప్పేదాన్ని 'అక్కమ్మా' అనేది తప్ప అక్క అని ఎప్పుడూ పిలవలేదది. దానికి అయిదో ఏట నాన్న కూడా వెళ్ళిపోయారు. నేను అప్పటికే ఉద్యోగంలో చేరాను. ప్రభని స్కూల్లో చేర్పించటంతో వాళ్ళ ముగ్గురినీ చూసి.. పంపి ఇంటికి తాళం పెట్టి బైటకు వచ్చేదాన్ని. నిన్నటిదాకా అలాగే తాళం వేసి ఉండేది పగలంతా ఇల్లు!

ముగ్గురూ పెద్దవాళ్ళయి వృద్ధిలో కొచ్చి విదేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. ప్రభకి సంబంధం తెచ్చి పెళ్ళిచేసి.. అప్పుడు పెళ్ళిళ్ళు చేసుకున్నారు విజయ్.. రవి కూడా! ఇద్దరినీ ప్రేమ పెళ్ళిళ్ళే - నేను వెళ్ళి అక్షింతలు వేసి రావటం తప్ప ఏమీ చేయలేదు వాళ్ళ పెళ్ళిళ్ళకి! అవును - నాకిప్పుడు గుర్తొస్తోంది. ముగ్గురూ కూడా వాళ్ళ పెళ్ళిళ్ళకి నన్ను రమ్మని పిలవలేదు -! నా పిల్లలు నన్ను పిలిచేదేమిటని నేనే

వెళ్ళేదాన్ని - వాళ్ళు నన్ను పట్టించుకోకపోయినా! నేనిచ్చినవి పుచ్చుకోవటమే కానీ, ఎప్పుడూ ఒక్క అరటిపండు కూడా నా చేతిలో పెట్టలేదు.

ఒక్కసారి తలవిదిలించాను. "ఛ ఇలా ఆలోచిస్తున్నానేమిటి? నేను వాళ్ళ కోసం చేశానా? నా మనస్సుకు నాకు తృప్తిగా ఉండాలని చేశాను. అమ్మకి బిడ్డనే కాదు - స్నేహితురాలిని కూడా. అందుకే వాళ్ళు నా బిడ్డలనుకుని చూశాను. వాళ్ళకేం తెలుసు? తెలీదు కాబట్టే ఇలా మాట్లాడుతున్నారు. పోనీ.." నేనిలా ఆలోచిస్తూ ఉండగా మళ్ళీ ఫోను మోగింది.

ప్రభ...!

"అక్కమ్మా - విజయ్.. రవి, నాన్న పెయింటింగ్స్ తీసుకుంటారట! అమ్మ తులసి మొక్క దగ్గరున్న పెయింటింగ్ మాత్రం వాళ్ళకివ్వకు. అది నాకు కావాలి. మా ఇంట్లో షోపీస్ గా పెట్టుకుంటాను. అలాగే ఇల్లు అమ్మితే నాకూ వాటా కావాలి..! నా తరపున నువ్వే మాట్లాడాలి వాళ్ళతో..." చెపుతోంది. నా కళ్ళముందు, దానిని ఎత్తుకుని, గోరుముద్దలు తినిపిస్తూ.. చందమామని చూపిస్తూ.. జోలపాడి నిద్రపుచ్చుతూ.. అమ్మ కనిపించింది! అమ్మ.. దాని ఇంట్లో షోపీస్‌గా నిలబడాలా ఇప్పుడు..!

తల తిరుగుతున్నట్టనిపించి.. అది అలా మాట్లాడుతూండగానే ఫోను పెట్టేశాను. ఒక్కసారి శక్తిమొత్తం వెళ్ళిపోయింది శరీరంలోనుంచి.. ఊఁఊఁ... జీవచైతన్యమే పోతోంది లోపలనుంచి! రెప్పవేసి తెరిచేసరికి నన్ను చుట్టి బంధించిన కొండచిలువ భయంకరంగా నోరు తెరిచి నన్ను మింగేయటానికి వస్తూ కనిపించింది.

"వద్దు.. వద్దు.." అంటూ గింజుకుంటూ వదిలించుకునే ప్రయత్నం చేస్తుండగానే నా తల దాని నోటిలోకి వెళ్ళిపోయింది. ఆ తరువాత నాకేమీ తెలియలేదు.

స్పృహలోకి వచ్చేసరికి నా దగ్గర బాబాయి, పిన్ని, యామిని కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారు. నాకు వాళ్ళతో మాట్లాడాలనిపించలేదు. మళ్ళీ కళ్ళుమూసేసుకుని పడుకున్నాను, వాళ్ళమాటలు వింటూ!

"ఇది ఇవాళ్టి పరిస్థితి కాదు బాబాయ్.. దాదాపు ఏడాది నుంచీ రిటైరవటం.. తరవాత ఏం చేయటం అంటూ రకరకాలుగా ఆలోచిస్తోంది. ఒంటరితనం అనేది భయంకరమైన శత్రువు. పగలస్తమానం కాలేజీలో గడిచిపోయినా ఇంటికొచ్చి తలుపుతీసేసరికి బావురుమంటూ ఇంత ఇంట్లో ఒక్కదానివీ ఉండాలి ఎవరికైనా ఇల్లు అద్దెకివ్వమని చెప్పేదానిని.! అదిగో ఆ పెయింటింగ్స్ పెట్టే చోటు ఉండదని ఇవ్వలేదు. పిచ్చికాకపోతే.. ఏం చేసుకుంటుంది వాటిని? ఆర్ట్ గ్యాలరీలో ఇవ్వమని వాళ్ళు ఎన్నిసార్లు అడిగినా ఒప్పుకోలేదు. తమ్ముళ్ళు.. చెల్లెలు ఏదో తనని నెత్తిన పెట్టుకుంటారనుకుంటూ - భవిష్యత్తువాళ్ళతో గడపవచ్చని కలలు కంటోంది - ఆ పెయింటింగ్స్ లో ఉన్న పెద్దవాళ్ళు తనతో మాట్లాడుతున్నారంటూ కలలో బతుకుతాను. నాకు తెలుసు ఎప్పుడో ఇలా జరుగుతుందని! ఇప్పటికైనా ఆ పెయింటింగ్స్ గ్యాలరీకి ఇచ్చేసి ఆ వాటా అద్దెకిస్తే కాస్త ఇలాంటి పరిస్థితి వస్తే చూసేవాళ్ళయినా ఉంటారు." చెపుతోంది యామిని.

తను ఒక నియోనటాలజిస్టూ - పీడియాట్రీషియను కూడా, చిన్నప్పుడు ఇద్దరం కలిసి చదువుకున్నాం. ఆ స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. పిల్లలు పుట్టకముందే. తల్లి కడుపులో ఉండగా.. వాళ్ళతో మనం మాట్లాడుతూ.. వాళ్ళకి కొత్త కొత్తసంగతులు సంగీతం.. విజ్ఞానమూ.. వేదమంత్రాలూ అటువంటివాటిని వినిపిస్తూ ఎలా నేర్పించవచ్చో.. ఎక్స్‌పెరిమెంటల్ బేసిస్ మీద.. తన ఆస్పత్రిలో ఒకొక్కదానికి స్పెషల్ రూమ్స్ ఏర్పాటుచేసి.. ఆరోనెల వచ్చిన దగ్గరనుంచీ గర్భిణీస్త్రీలని రోజూ గంటన్నర - రెండుగంటల పాటు అక్కడ గడపమని చెపుతూ ఉంటుంది తన దగ్గరకు ట్రీట్ మెంట్ కోసం వచ్చినవాళ్ళని! అలాగే పిల్లలు పుట్టాక కేవలం వాళ్ళ శారీరక ఎదుగుదల గురించేకాకుండా - మానసిక ఎదుగుదలగురించికూడా పేరెంట్స్‌కి సలహా చెప్పి... వాళ్ళు పాటిస్తున్నదీ లేనిదీ కుడా గమనించుకుంటూ ఉంటుంది. పిల్లల కివ్వాల్సిన ఆహారం దగ్గరనుంచీ ఎంతో శ్రద్ధ తీసుకుని చెపుతూ ఉంటుంది.

తను నన్ను కూడా ఏడాది నుంచీ గమనిస్తూ... నా మానసిక పరిస్థితిని చూస్తోందని మాత్రం గ్రహించలేకపోయాను.

"బైట మెట్లమీద పడి ఉందని.. పక్కావిడ నీకు ఫోను చేసి చెప్పింది కనుక తెలిసింది. లేకపోతే ఏమయ్యేది?" పిన్ని అంటోంది.

"అసలు.. మా అన్నయ్య ఇల్లు దాని పేర రాస్తూ నాతో చెప్పాడు - దానికి, పన్నెండేళ్ళొచ్చాక ఈ తరువాత పిల్లలు పుడుతుంటే.. మీ వదిన బాధపడేది - ఇప్పుడు ఈ వయసులో పిల్లలేమిటని.! నాకప్పుడు తెలియలేదు. వాళ్ళ కోసం అది తన జీవితం పణంగా పెడుతోంది.. ఇది చూస్తుంటే తండ్రిగా నాకు సిగ్గనిపిస్తోంది. వీళ్ళు ఎదిగి దానిని గౌరవిస్తారో లేదో నాకు తెలియదు. ఒక తండ్రిగా నేను దానికి చెయ్యగలిగిన పెళ్ళి అది చేసుకోనంటోంది - కాబట్టి రేపు ఏ పరిస్థితి వచ్చినా అది నిలవనీడలేనిది కాకూడదు. ఈ ఇల్లు దాని పేర రాసేస్తున్నాను. నీ మనసులోనే ఉంచుకో ఈ మాట. దానికి చెపితే వాళ్ళకోసం అమ్మేసినా ఆశ్చర్యపోనక్కరలేదు." అని! అందుకే నేనామాట ఎవరితోనూ.. ఇదిగో ఈవిడతో కూడా చెప్పలేదు. ఇప్పుడు చెప్పి, కాస్త దానికి ధైర్యం చెపితే.. కోలుకుని మామూలు మనిషవుతుంది." అన్నాడు బాబాయి.

"మనమందరం వాళ్ళ మాటల్ని.. ప్రవర్తననీ చూసి అర్థం చేసుకున్నాం కానీ తనుమాత్రం వాళ్ళ మీద పిచ్చి ఆపేక్షపెంచుకుని - 'నేను లేకుండా వాళ్ళు బతకలేరు' అనే భావంలోనే జీవిస్తోంది.." యామిని చెపుతోంది.

నేనా మాటలు వింటూ అలాగే పడుకున్నాను. నాన్న ఆ ఇల్లు నాకు ఇచ్చేశారా మనస్సుకు ఎంతో తేలికగా అనిపించింది ఆ మాట వినగానే - వాళ్ళకు నేనక్కర్లేదు పోనీ.. అణువణువునా అమ్మా - నాన్నల జ్ఞాపకాలు నిండిన ఆ ఇల్లు నాకు ఉంది. అక్కడ నేనేం చేయాలో అప్పుడే నిర్ణయం చేసుకున్నాను.

ఏమీ తెలియనట్లే వాళ్ళందరితో కలిసి ఇంటికి వెళ్ళి - ఆర్ట్‌గ్యాలరీకి ఫోను చేసి - వచ్చి పెయింటింగ్స్ తీసుకు వెళ్ళమని చెప్పాను. అమ్మని పడుకోబెట్టిన చోట - జారుడుబల్లా.. రెండు చిన్నఉయ్యాలలూ ఏర్పాటు చేర్పించి.. ఇంట్లో చెయిల్డ్ కేర్ సెంటర్ పెట్టాలనుకుంటున్నానని చెప్పినప్పుడు బాబాయి, పిన్ని.. యామిని కూడా ముఖాలు చూసుకున్నారు ఆశ్చర్యంగా!

అవును.. యామిని చెప్పినట్టు చిన్నపిల్లలు రేపటి దేశపౌరులు.. వాళ్ళు సరైన మార్గంలో పెరగాలంటే ఐదేళ్ళలోపలే వాళ్ళకి మనం చెప్పగలిగిన మంచినీ.. నేర్పగల ధైర్యసాహసాల్నీ ఇస్తూ పెంచాలి. ఉద్యోగాల కెళ్ళిపోయే తల్లిదండ్రులు... ఒంటరి కుటుంబాలలో పిల్లలకవి ఇవ్వలేరు. దేశమంతా బాగుచేయలేకపోయినా నా పరిధిలో నేను.. యామిని గైడెన్స్‌లో చేయగలిగింది చేస్తే.. నన్నిప్పుడే విడిచిపెట్టివెళ్ళిపోయిన ఒంటరితనమనే కొండచిలువను మళ్ళీ నా దగ్గరకు రానివ్వకుండానూ ఉండగలను - నలుగురుకి మంచి చేసిన దానినీ కాగలుగుతాను.

ఇన్నేళ్ళూ నా కుటుంబం అంటూ ఆలోచించి.. ఇప్పుడు 'నేను' అని ఇంకా సంకుచితంగా ఆలోచించేసరికే.. ఆ ఆలోచన కొండచిలువైంది.కానీ కుటుంబాన్ని విస్తృత పరచుకుని - సమాజం వైపు దృష్టిసారిస్తే.. సృష్టియావత్తూ నాదే అనిపించి.. ఎంత ఆనందంగా ఉంటుందో!

ఈ ఇంటికి రాబోయే పసిపిల్లల్ని తలచుకుంటూ హాయిగా ఉన్నాను ఇప్పుడు.

# ఇలా ఔతుందనుకోలేదు

డా.ఉమా ఎయ్యుణ్ణి

**"నేను రెడీ, బాబుకి కొంచెం** స్వెట్టరు వేస్తారా?, కొద్దిగా చలి వేస్తున్నట్లుంది." హడావుడిగా జడ అల్లుకుంటూ గదిలోంచి బయటకు వచ్చిన సునీత అలాగే నిల్చుండిపోయింది!

అది రెండు బెడ్రూంలు ఉన్న చక్కని పొందికయిన అపార్ట్‌మెంట్. ముందు గదిలో ఉన్న రెండేళ్ళ సునీల్ చేతికందిన మాగిజిన్ నోట్లో పెట్టుకుని నములుతున్నాడు. "అయ్యో, అదేమిటండి.." అంటూ ఒక్క అంగలో వచ్చి వాడి చేతిలో పుస్తకం లాగేసింది సునీత. వాడు గట్టిగా ఏడుపు లంకించుకున్నాడు. ఒక చేత్తో వాడిని ఎత్తుకుంటూనే భర్త కేసి కోపంగా చూసిన సునీతకి ఒక్కసారి గుండె గతుక్కుమంది. "ఏమిటిది, ఉన్నట్లుండి ఇతనికేమయింది?" భర్త చేయి పట్టుకోబోయింది. సునీత.. అతను ఆ చేయిని ఒక్క తోపు తోసి, గబగబా సునీతని దాటుకుంటూ తలుపు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

"ఏమండీ," అంటూ వెనకే పరుగెట్టిన సునీతకి, గుమ్మం తలుపు పడితే లాకయిపోతుందని గబుక్కున జ్ఞాపకం వచ్చింది.. వెంటనే మేకుకి వేళ్ళాడేసిన తాళాలు పట్టుకుని వరండాలోకి పరుగెట్టింది. అప్పటికే అనిల్ గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు. సునీతకి ఏం అర్థం కాక అలాగే ప్రమాన్పడి నిల్చుండిపోయింది.

తను పరిచయమయి, తమకి పెళ్ళయిన మూడు సంవత్సరాలలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మామూలుగా నవ్వుతూనే ఉన్నా, అనిల్ కొంచెం ముభావంగా ఉండే వారిలోనే లెక్క. అతనికున్న స్నేహితులు తక్కువమందే అయినా, అందరితోనూ పలకరించేటంత పరిచయం మాత్రం పెంచుకుంటాడు. ప్రాణ స్నేహితులు అంటూ చెప్పుకోదగ్గవారు ఎవరూ లేరు. సహజంగా బిడియస్తురాలు అయిన సునీత కూడా, అతని రిజర్వుడు మనస్తత్వం గురించి పెద్దగా పట్టించుకోలేదు. కాని ఎప్పుడయినా ఒకసారి, అతను శూన్యంలోకి చూస్తూ కూర్చోడం, ఈ మధ్య తనలో తనే గొణుక్కోడం, ఒక్కసారిగా తల విదిల్చి, మళ్ళీ మామములుగా అయిపోవడం చూస్తూనే ఉంది. కాని, మళ్ళీ అతనికి పనిలో ఏం వత్తిడి ఉందోనని సర్ది చెప్పుకుంది. చాలా నిదానస్తురాలు సునీత. వారిద్దరి పరిచయం కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే.

చిన్నప్పుడే తల్లి, తండ్రిని పోగొట్టుకున సునీత, మేనమామ ఇంట్లో ఆదరంగానే పెరిగింది. ఒక చిన్న ఉద్యోగస్తుడయిన మేనమామ మీద ఇంకా చదువు పూర్తయ్యాక కూడా ఆధారపడడం భావ్యంకాదని, ఎమ్.సి.ఎ చేసిన సునీత, బెంగుళూరు లేడీస్ హాస్టల్లో చేరింది.

ఒక్క బస్ తీసుకుంటే ఇరవయి నిమిషాల్లో ఆఫీస్ చేరుకునేది. చేరిన కొద్ది రోజుల్లోనే రజని ప్రాణ స్నేహితురాలయింది, సునీతకి. గలగలా మాట్లాడుతూ, చలాకీగా తిరిగే రజనికి, చిరునవ్వే సంభాషణగా గల సునీతకి గాఢ స్నేహం కుదరడం విచిత్రమే. ఇంజినీరింగ్ పూర్తిచేసి అమెరికా వెళ్ళిపోయి, వీసా స్థిరపడ్డాక చాలామంది కుర్రాళ్ళలాగే అనిల్ మూడు వారాలు సెలవు పెట్టి బెంగుళూరు వచ్చాడు.

తనకన్న పెద్దది, పెళ్ళయి పోయిన పెద్దమ్మ కూతురు పదం ఇంకెవరూ నా అన్న వాళ్ళు లేని అనిల్, పద్మ స్నేహితురాలు రజని పరిచయం చేసిన సునీతని చూడగానే ఇంప్రెస్ అయిపోయాడు. ఇద్దరివైపూ బాదరబందీలు ఏమీ లేకపోవడం వలన, మూడువారాలలోనే పరిచయం, అతి సింపుల్‌గా పెళ్ళి, కలలోలాగ జరిగిపోయింది అమెరికా వచ్చేసింది.

రిజిస్ట్రారు ఆఫీసులో సంతకం పెడుతున్నప్పుడు మాత్రం, ఒక్క నిముషం చేతులు వణికాయి. జన్మల అనుబంధం అంటే ఇదే కాబోలు అనుకుంది. పెద్ద అందెకత్తె కాకపోయినా స్వచ్ఛమయిన చిరునవ్వు, బారెడు జడ సునీతకి ఆభరణాలు. అలాగే సౌమ్యం నిండిన

ముఖం, మంచి పొడుగు అనిల్ సొత్తు. వాళ్ళ ఇద్దరినీ అలా చూసిన సునీత మేనమామ, మా పిల్ల ఎంతో అదృష్టవంతురాలు అనుకుని మనసులోనే వెయి దేవుళ్ళకి మొక్కుకున్నాడు.

అలా ఏ ఆర్భాటం లేకుండానే, పరచిన పూల బాటలాగ, అమెరికాలో అడుగుపెట్టింది సునీత. వచ్చిన ఏడాది ఒక్క నిమిషంలాగ గడచిపోయింది. న్యూయార్క్ మహా నగరానికి నలభై మైళ్ళదూరంలో ఉంటూ, సిటీలో పనిచేసే అనిల్, పొద్దున్నే ఆరున్నర రైల్లో వెళ్ళిపోయేవాడు. మళ్ళీ సాయంత్రం ఏడుగంటలకల్లా ఇంట్లో ఉండేవాడు. ఇద్దరూ కలిసి ఎక్కడికయినా వెళ్ళాలంటే మాత్రం, శని ఆదివారాలు మాత్రమే.

వచ్చిన కొత్తలో, చేతినిండా పనిలేక, సర్దిన మళ్ళీ సర్దిన కాసిని వస్తువులే మళ్ళీ సర్ది, విసుగొచ్చి, తనూ ఏదన్నా ఉద్యోగం చేయాలి, వీసా ప్రయత్నాలు చెయ్యాలనుకుంటుండగానే చినారి సునీల్ వాళ్ళ జీవితంలోకి ప్రవేశించాడు. సునీత, అనిల్ కలిపి, సునీల్ అని ముద్దుగా పిల్చుకునే సునీతకి ప్రపంచం అంతా ఒక రంగుల కలలాగ, జీవితం అద్భుతంగా అనిపించసాగింది. ఇంత ఆనందం పంచుకోడానికి అమ్మ, నాన్నకాని, తోబుట్టువులు కాని లేరే అనుకునే సునీతకి, అప్పుడప్పుడూ ఈ మెయిల్లో పలుకరించే రజని ఒక్కతే ఆప్తురాలిగా మిగిలింది. ఇప్పుడు సునిల్ వచ్చాక, క్రమంగా చుట్టుప్రక్కల ఉన్న వియత్నామీస్ కుటుంబం, ఇద్దరు భారతీయులు పరిచయమయ్యారు. అందులో ఒక మహా రాష్ట్రుల జంట నేహ, అనూప్‌లు బాగా దగ్గరయ్యారు. అనూప్ అనిల్ ఆఫీసులోనే పనిచెయ్యడం, వాళ్ళకీ సునీల్ వయసు పాప ఉండడంతో పరిచయం మంచి స్నేహంగా మారింది.

వాళ్ళ పాప పుట్టినరోజు పార్టీకి బయలుదేరిన సునీతకి, అనిల్ హఠాత్తుగా ఎక్కడికి వెళ్ళిపోయాడో అర్థంకాలేదు. ఏం చెయ్యాలో పాలు పోక, ముందుగా స్నేహితురాలికి ఫోన్ చేసి, పార్టీకి రాలేమేమో, అనిల్ ఇంకా ఇంటికి రాలేదని చెప్పింది. ఎంతాలస్యమయినా పరవాలేదు, తప్పక రమ్మని చెప్పింది నేహ. సరేనంటూ ఫోన్ పెట్టేసిన సునీతకి ఏం చెయ్యాలో దిక్కుతోచలేదు.

"అసలివాళ అనిల్‌కి ఏమయింది? సాయంత్రం ఇంటికొచ్చినప్పుడు బాగానే ఉన్నాడే రేపు శనివారం కదా, పార్టీ లేటయినా పరవాలేదు అని కూడా అన్నాడు. మరి ఇంతలో ఈ మార్పు ఏమిటి?. ఈ మధ్య అప్పుడప్పుడు తనకేసి రెప్పవెయ్యకుండా అతను స్టేర్ చేస్తుంటే, నాకు దిష్టి తగులుతుందబ్బా అనికూడా తను జోక్ చేసింది కూడ!

కానీ, ఎక్కడని వెతుకుతుంది తనిప్పుడు? బిక్క మొహం వేసుకుని చూస్తున్న బాబుని చూస్తే సునీతకి చివ్వున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తనకే ఇంత గాభరాగా ఉంటే పసివెధవకి, బట్టలు, షూస్ వేసుకున్నాక, బయటకి ఎందుకు వెళ్ళడం లేదో ఎలా అర్థం అవుతుంది? వాడిని కాసేపు ఆడించి, ఎలాగోలా వాడికి మాత్రం కొంచెం అన్నం వండి పెట్టి, నిద్రపుచ్చిన సునీతకి ఒక్కసారి నీరసం నిస్సత్తువ ముంచుకొచ్చాయి.

ఇరవయి నాలుగేళ్ళు నిండిన సమయంలో, బెంగుళూరులో వంటరిగా హాస్టల్లో ఉన్న సునీతకి కొంచెం మనో నిబ్బరం ఎక్కువే. కాని, గత మూడేళ్ళుగా, అనిల్ సాహచర్యంలో, పూర్తిగా గృహిణి జీవితానికి అలవాటు పడిపోయింది. అందులో బాబు పుట్టాక మరీను. చక్కని చిన్న సంసారంలోని భద్రతకి అలవాటు పడిన సునీతని ఇవాళ సాయంత్రం జరిగిన సంఘటన ఉక్కిరి బిక్కిరి చేసేసింది. ఆ నిముషంలో ఆమెకేం తెలుసు, అది తుఫానుకి ఆరంభం మాత్రమేనని!

రాత్రి ఎనిమిది, తొమ్మిది కూడా గడిచాయి. సునీతకి అనిల్ ఏమయిపోయాడోనన్న భయం ఎక్కువయిపోతోంది నిమిష నిమిషానికి. ఇంక మొహమాటం చంపుకుని, నేహాకే ఫోన్ చేసింది, ఒకవేళ అక్కడికి వెళ్ళిపోయాడేమోనని అనూప్ తీసుకున్నాడు ఫోన్, నేహ గెస్ట్‌ను సాగనంపుతుందిట. సహజంగా సునీత, అనిల్ అంటే ఉన్న అభిమానంతో, సహృదయుడైన అనూప్‌కి, సునీత గొంతులోని ఆదుర్దా, భయం స్పష్టంగా వినపడ్డాయి. ఏమీ కంగారు పడవద్దని, ఇంకొపదినిముషాల్లో భార్య చేత ఫోన్ చేయిస్తానని చెప్పి పెట్టేసాడు. ఆఖరు అతిథిని సాగనంపి పసిదానికి బట్టలు మారుస్తున్న నేహ భర్తలోని ఆదుర్దాని గమనించింది. తరువాత అర్థమయింది ఎందుకో.

ఎందుకంటే అనిల్ సాధారణంగా ఎక్కడికీ వెళ్ళడు. తాము కొద్దిమంది తప్ప ఎక్కువ పరిచయస్తులూ లేరు. ఆఫీసులో కూడా తన పని చేసుకుని వెళ్ళిపోతాడు ఆఫీస్ వాళ్ళు లోనర్ అనికూడా బిరుదిచ్చారు. అతను అదీ పట్టించుకోడు. ఒకవేళ అతని ముందే ఆ మాట ఎవరయినా అన్నా కూడా నవ్వేసి వెళ్ళిపోతాడు ఇంజినీరింగ్ డిస్టింక్షన్ తో పాసయ్యాడని అతనికి గర్వం అని మంచి పొజిషన్‌లో ఉన్నాను కదాని, ఎక్కువ సోషల్‌గా ఉండడనీ, కొంతమంది అనుకున్నా, అనూప్‌కి మాత్రం సునీత అన్నా, అనిల్ అన్నా చాలా ఇష్టం. హైదరాబాదులో కొంతకాలం గడపడం వలన, నేహాకి, అనూప్‌కి కూడా కొంచెం తెలుగు అర్థం అవుతుంది. ఆ కాస్త తెలుగుకే ప్రాణం వచ్చినట్లుంటుంది సునీతకి.

ప్రశ్నార్థకంగా చూస్తున్న భార్యకేసి చూసి, "అనిల్ ఇంకా ఇంటికి రాలేదట అన్నాడు అనూప్. "అదేమిటి, అతను చెప్పకుండా అలా వెళ్ళడే అంది నేహ ఫోన్ అందుకుంటూ సునీతకి డయిల్ చేసింది. అప్పటిదాకా నిబ్బరంగా ఉన్న సునీత, నేహా గొంతు వినగానే ఒక్కసారి బావురుమంది. "ఛ ఊరుకో సునీత, హి విల్ బి బాక్, పోనీ అనూప్‌ని పంపనా" అనడిగింది. "వొద్దొద్దు, మీరు ఇద్దరూ కూడా బాగా అలసిపోయి ఉంటారు, నేను బానే ఉన్నాను, అంది"

"సరే, నీకు ఎప్పుడు కావాలంటే అప్పుడే వెంటనే ఫోన్ చెయ్యి. హెజిటేట్ చెయ్యకు, గట్టిగా చెప్పి పెట్టేసింది నేహా.

పార్టీకి వెళుతున్నాం కదాని, వంట చెయ్యలేదు సునీత. బాబుకి ఉన్న అన్నం పెట్టేసి పడుకో పెట్టేసింది. ఇంత గాభరాలో కూడా తనకి ఆకలి వెయ్యడం గుర్తించి, తనకే నవ్వొచ్చింది. ఏదీ ఎవరికోసం ఆగదు కదా! ఫ్రిజ్‌లో ఉన్న రెండు పుల్కాలు కొంచెం పెరుగుతో తినేసింది. అనిల్ ఇంటికొస్తే ఆకలి అంటాడని, గబగబా కొంచెం ఉప్మా చేసింది, ఓపిక తెచ్చుకుని. అప్పటికి రాత్రి పదిన్నర. ఇంతలో ఫోన్ మోగింది. అనిల్ అనుకుని గమ్మున తీసిన సునీత, నేహా గొంతు విని నిరాశపడినా, వెంటనే సర్దుకుంది. "పోనీ అనూప్‌ని పంపనా సునీతా? ఎంతో ఆదరంగా అడిగింది నేహా. "కాని వాళ్ళు పాపం పొద్దున్నుంచీ అలిసిపోయి ఉంటారు, వద్దంది సునీత. తను బాగానే ఉన్నానని, అనిల్ వచ్చేస్తాడని అనిపిస్తోందని నచ్చ చెప్పి, ఫోన్ పెట్టేసింది సునీత.

ఏమీ తోచక, పచార్లు చేయడం మొదలెట్టిన సునీత, గతంలో ఏమయినా ఇలాగ జరిగిందా? తనేమయినా మిస్ అయిందా అని ఆలోచించడం మొదలుపెట్టింది. అప్పుడప్పుడూ చాలా నిశ్శబ్దంగా ఉండిపోడం, గంటల తరబడి మాట్లాడక పోవడం తప్ప, గతమూడేళ్ళల్లో తమ మధ్య చెప్పుకోతగ్గ సంఘటన ఏమీ జరగలేదు. ఆఫీస్ లో అనిల్‌కి చాలా తెలివయిన వాడని, మంచి పేరే ఉంది.

కానీ ఈ మధ్య బాస్ మారాడని, కొంచెం తిక్కవాడనీ అతను చిరాకు పడుతున్నాడు. కాని వెంటనే సర్దుకుపోయేవాడు కూడా. అందునా, ఈ మధ్య సునిల్ కి కొంచెం కొంచెం మాటలు వస్తున్నాయి, అందుకని వాడు నిద్రపోయేదాక వాడే కాలక్షేపం తమకి.

అలాటి అనిల్ కి ఏమయిందివాళ?

ఆలోచనాభారంతో తలదిమ్ముగా ఉండి, అలాగే సోఫాలో కూర్చుండిపోయిన సునీతకి కునుకు పట్టేసింది. ఎప్పుడో అర్ధరాత్రి తలుపు చప్పుడయి గబుక్కున లేచింది. కారు తాళాలతో బాటు ఇంటి తాళం కూడా కలిసి ఉండడం వలన, అనిల్ మెల్లగా తలుపు తెరుచుకుని వచ్చాడు. సునీత అతని మొహం చూసి హడలిపోయింది. జుట్టు రేగిపోయి, కళ్ళు ఎర్రగా, మొహం వాడిపోయి ఉంది అతని దగ్గరగా వెళ్ళడానికి కూడా జంకనిపించింది. ఎలాగో మనసు చిక్కపట్టుకుని "ఏమన్నా తింటారా?" అనడిగింది. అనిల్ మాట్లాడకుండా జోళ్ళు విప్పి, డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళికూర్చున్నాడు.. సునీత గబగబా ఉప్మా వేడి చేసి, పక్కనే మంచినీళ్ళ గ్లాసు పెట్టింది. అతను ఆవురావురుమని తింటుంటే సునీతకి ఆవేదన, ఆదుర్దా అన్నీ కలిపి వచ్చాయి. అతను ఏమీ మాటాడకుండా తినేసి, జేబులోంచి ఏదో తీసుకుని నోట్లో వేసుకుని వెళ్ళి పడుకున్నాడు. ఎంతో శుభ్రంగా ఉండే అనిల్, తప్పనిసరిగా రాత్రి కూడా పళ్ళు తోముకోకుండా పడుకోని అనిల్, అలాగ బయటకు వెళ్ళిన బట్టలతోనే పక్కమీద పడుకున్న తీరు చూస్తే సునీతకి గుండె తరుక్కుపోయింది. అతని

అరికాళ్ళు ఎంతో దూరం నడిచిన వాడిలాగ ఎర్రగా కందిపోయాయి. మరి కారులో వెళ్ళాడుగా!? సునీత మనసు సందిగ్ధంలో ఉండిపోయి, చాలా సేపు నిద్రపట్టలేదు.

మాట్లాడకుండా దిండు తీసుకుని బాబు క్రిబ్‌కి దగ్గరగా వేసుకుని కార్పెట్ మీద పడుకున్న సునీతకి అది రానున్న ఎన్నో రాత్రులకి నాంది అని తెలియలేదు.

మర్నాడు సునీత లేచేసరికి బాగా పొద్దుపోయింది సునీల్ కూడా ఏ గొడవా చెయ్యకుండా క్రిబ్‌లోనే కూర్చున్నాడు, నోట్లో వేలు వేసుకుని. గభాల్న లేచిన సునీతకి అనిల్ ఏమయ్యాడా అని గాభరా వేసింది. అనిల్ ఇంకా అలా ముడుచుకుని నిద్రపోతూనే ఉన్నాడు. చప్పుడు కాకుండా బెడ్రూం తలుపు జేరవేసి, సునీత బాబుకి పాలు కలిపి, తమ కాఫీకి రెడీ చేసింది.

అనిల్‌ని ఆఫీస్‌కి వెళ్ళడానికి లేపాలా వద్దా అని సందేహించిన సునీత, ఎందుకయినా మంచిదని అనూప్‌కి ఫోన్ చేసింది. అతను అప్పుడే ఆఫీస్‌కి బయలుదేరబోతున్నాడు. అనిల్‌ని లేపద్దనీ, తను తరపున సిక్ లీవ్ చెపుతానని చెప్పాడు. అతను లేచాక ఏ సంగతీ కనుక్కొని డాక్టరు దగ్గరకు వెళ్ళమనీ చెప్పాడు. అతనితో మాట్లాడాక కొంత ధైర్యం వచ్చింది సునీతకి. మెల్లగా తన పనులు ముగించుకుని స్నానం వంట అయేవేళకి అనిల్ నిద్రలేచాడు. ముందురోజు ఏమీ జరగనట్లే స్నానం చేసి, భోజనం పెట్టమని అడిగాడు. అతను సౌమ్యంగానే ఉండడం చూసి సునీత మెల్లగా అడిగింది. "ఒంట్లో బాగుందా?" అని. అతను వెంటనే "అలా అడుగుతావేం? కొంచెం ఆలస్యంగా నిద్రలేచాను. పనికి వెళ్ళబుద్ధి కాలేదు అన్నాడు". ఇంక డాక్టరు దగ్గరకు వెళదామా అని అడిగే ధైర్యం చాలలేదు సునీతకి.

ఆ రోజు అలా గడిచిపోయింది. కాని అలాటి సంఘటనలు తరచూ జరగడం మొదలెట్టాయి. ఉన్నట్లుండి ఎక్కడికో వెళ్ళిపోవడం, గంటల తరబడి ఇంటికి రాకపోవడం, ఎక్కువగా నిద్రపోవడంతో బాటు బట్టలమీద, ఒంటిమీద శ్రద్ధ తగ్గడం మొదలయ్యాయి.. ఏదో ప్రాజెక్ట్ మీద అనూప్ కూడా ఊరు వెళ్ళడంతో సునీతకి ఆఫీసులో ఏం జరుగుతోందో తెలియలేదు. రెండునెలలు గడిచాక ఇంక ఉండపట్టలేక సునీత డాక్టరు దగ్గరకు వెళదామని పట్టుపట్టింది. ఇంక విధిలేక ఒప్పుకున్నాడు. తీరా అప్పాయింట్మెంట్‌కి ఒక గంట ముందుగా బయటకు వెళ్ళిపోయాడు. ఎంతసేపటికీ రాడు! ఏం చేయాలో తోచక సునీత నేహాకి ఫోన్ చేసి, తను పడుతున్న వ్యధ చెప్పుకుంది. సునీతకు కాని, అనిల్ కి కాని "నా" అన్న వాళ్ళు లేరు. కొద్ది మంది స్నేహితులు తప్ప. ఎంత మంచి స్నేహితులయినా, ఇలాగ ఇంకొకరి కుటుంబ సమస్యల్లో తలదూర్చడానికి పది సార్లు ఆలోచిస్తారు అంతటి చనువూ ఉండదు.

అక్కడికీ, ఊరునుంచి వచ్చాక, సునీత బాధ చూసి, అనూప్ మెల్లిగా అడిగాడు, "ఒకసారి డాక్టరు దగ్గరకు వెళ్ళకూడదా?" అని. "ఒకవేళ తాగుడు కాని, డ్రగ్స్ కాని అలవాటు చేసుకున్నాడా అని కూడా అనుమానం వచ్చిందతనికి. కాని, ఆఫీసుకి వచ్చినప్పుడు, పని వంకపెట్టలేనంత బాగా చేస్తున్నాడు మరి. డాక్టరు సంగతి ఎత్తగానే, థాంక్యూ అనేసి లేచి వెళ్ళిపోయిన అతన్ని చూస్తుంటే ఏం అనుకోవాలో అంతుబట్టలేదు అనూప్‌కి.

మొత్తానికి డాక్టరు దగ్గరకు వెళ్ళిన అనిల్, ఆయన ఇచ్చిన మందుల చీటీని చెత్తబుట్టలో పారేసాడు. అదేమని అడిగిన సునీతకేసి తీవ్రంగా చూసి, నాకేం మందులూ అవసరం లేదు, అనేసి, బాత్రూం తలుపు ధడాలున వేసేసాడు. హడలిపోయింది సునీత, బాబు బావురుమన్నాడు. మరాడు జరిగిన సంఘటనతో సునీత పూర్తిగా బెదిరిపోయింది.

ఆఫీస్‌కి బయలుదేరిన అనిల్ రెండు గంటల్లో తిరిగి వచ్చేసాడు. అప్పటికే నిద్రలేచిన సునిల్‌కి పాలు పట్టి, నీళ్ళు పోద్దామని వాడిని బాత్రూంలోకి తీసుకెళ్ళిన సునీతకి తలుపు చప్పుడు వినపడలేదు. కూనిరాగాలు తీస్తూ మెల్లిగా పసివాడికి నీళ్ళు పోస్తున్న సునీతకి ధడాల్న శబ్దం వినపడింది. గబుక్కున పసివాడిని తువ్వాల్లో చుట్టి బయటకు వచ్చిన సునీతకి అనిల్ ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులు ఒకొక్కటీ

తీసి నేలకేసి కొట్టటం కనపడింది. "అయ్యో" అంటూ అతని దగ్గరకు వెళ్ళబోయిన సునీత టక్కున ఆగిపోయింది. అనిల్ మొహం ఎర్రగా కందిపోయి, మొత్తం వణికిపోతున్నాడు. సునీతకేసి చూసిన చూపులో గుర్తింపు లేదు. సునీల్ గట్టిగా ఏడవడం మొదలెట్టాడు.

అంతే తలుపుతీసుకుని విసవిసా బయటికి వెళ్ళిపోయాడు. ఈ గలాటాకి ఎదురు అపార్ట్మెంట్లో ఉన్న ఫిలిప్పినో ఆవిడా తలుపు తీసి "యు ఓకే? " అనడిగింది. బిక్కచచ్చిపోయిన సునీత తలూపి లోపలికి వచ్చేసింది. ఆ రోజు రాత్రి మళ్ళీ ఆలస్యంగా, పదకొండు దాటాక వచ్చాడు. సునిల్ ని దగ్గరగా పెట్టుకుని సునీతకి ఏడ్చే ఓపిక కూడా లేకుండా పోయింది. మాట్లాడకుండా డైనింగ్ టేబుల్ మీద పెట్టిన కంచంలో అన్నం పెట్టుకుని తినేసాడు. కంచంలోనే చెయ్యి కడుక్కుని అలాగే బల్లమీద ప్లేటు వదిలేసి వెళ్ళిపడుకున్నాడు. సునీతకి కంటిమీద కునుకు లేదు.

ఎటూ తోచని సునీత మర్నాడు అనిల్ ఆఫీస్కి వెళ్ళాక, సునిల్ని తీసుకుని నేహా ఇంటికి బయలుదేరింది. ఉన్నది ఒక్క కారు కాబట్టి, తను డ్రైవింగ్ నేర్చుకుని, రోజూ భర్తని లోకల్ ట్రైన్ దగ్గర దింపి, పికప్ చేసుకునేది. అలాంటిది ఈ మధ్య చెప్పా పెట్టకుండా కారు తీసుకెళ్ళిపోతున్నాడు అనిల్. కొంత దూరం బస్, తరువాత ట్రైన్ ఎక్కి వెళ్ళిన సునీతని నేహా ట్రైన్ దగ్గరకు వచ్చి ఎక్కించుకుంది. వాడిపోయిన సునీత మొహం చూసి, ముందుగా పిల్లలిద్దరికీ అన్నం పెట్టేసి, బొమ్మల ముందు పిల్లల్ని కూర్చోపెట్టిందాకా, ఏమీ సీరియస్గా మాట్లాడలేదు నేహా.

"ఓకె అబ్ బోలో క్యా హో రహాహై? " అన్న నేహా ప్రశ్నకి తల అడ్డంగా ఊపింది సునీత.

"ఏమీ తెలియడం లేదు నేహా. వాట్ కెన్ ఐ డు?" అంది.

"ముందు నువ్వు మనసు గట్టి చేసుకుని ఒకరోజు అడిగెయ్యి ఏమిటి నీ ఉద్దేశ్యం ఏం జరుగుతోంది అని. ఎందుకయినా మంచిది, నీ సర్టిఫికెట్లు, రెజ్యూమె నాకు ఇవ్వు. అనూప్తో చెపుతాను ఏదన్నా జాబ్ చూడమని" నేహా మాటలకి ఉలిక్కిపడింది సునీత.

"నేనా? జాబ్ చేయాలా?" మరి వాడినేం చెయ్యను? సునిల్ ని చూపిస్తూ అడిగింది.

"ఏమిటి సునీతా? చదువుకున్న దానివి, ప్రాక్టికల్గా ఆలోచించు. అనిల్ సరిగా లేకపోతే నీ సంగతి ఏమిటి? సునిల్ని ఏం చేస్తావు? రోజు ఎలా గడుస్తుంది?" ఇలా ఓ రెండుగంటలు సాగిన వారి మాటలతో, మనసు గందరగోళపడినా, బుద్ధి సునిశితంగా పని చెయ్యడం మొదలుపెట్టింది, సునీతకి. స్నేహితురాలి వయిపు సాలోచనగా చూసిన సునీత మొహంలో కొంత తేటదనం చూసింది నేహా.

ఇద్దరూ టీ తాగేసరికి పిల్లలిద్దరూ ఆడి ఆడి అలసి, నిద్రపోయారు. ఉండు, అనూప్కి ఫోన్ చేసి, నిన్ను ఇంటి దగ్గర దింపుతాను అని, నేహా పక్క ఇంటి పిల్లని పిలిచి, తం ఇంటిని, పిల్లాడినీ అప్పచెప్పి, సునీతని బయలుదేర తీసింది.

ఆ రోజు నుంచీ రెండు నెలలపాటు రోజుకి మూడు సార్లయినా ఫోన్ చేసి, నేహా, అనూప్లు సునీతకి తోడుగా నిలిచారు. ఈ రెండు నెలల్లో అనిల్ పరిస్థితి చాలా దిగజారిపోయింది. చివరికి ఒక రోజు సునీల్ని బేబీ సిట్టర్ దగ్గర దింపి, అనిల్ని బలవంతంగా డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళింది సునీత. దాదాపు గంటసేపు అతనితో మాట్లాడిన డాక్టరు, ఒక మంచి సైకియాట్రిస్ట్ పేరు చెప్పి, అతని ఆఫీసు నుంచే అప్పాయింట్ మెంట్ తీసుకున్నాడు.

సునీతకి గుండె జారిపోయింది. "సైకియాట్రిస్ట్" ఎందుకు అని భయంగా అడిగిన సునీతకి మెడికల్ డాక్టర్ వివరంగా అనిల్ పరిస్థితి చెప్పాడు.

"లుక్, ఐ డోంట్ నో వాట్ టు టెల్ యు. ఐ తింక్ హి హాజ్ ఎ మేజర్ సైకొలాజికల్ క్రైసిస్. వర్క్లో కాని, ఇంటిలో కానిఏదన్నా మేజర్ ప్రాబ్లం వచ్చిందా ఈ మధ్య?"

తనకేమీ తెలియదని తల అడ్డంగా ఊపిన సునీతని డాక్టరు జాలిగా చూసాడు.

"యు బెటర్ గెట్ సమ్ హెల్ప్" అన్న డాక్టరు కేసి అయోమయంగా చూసింది సునీత. తమకెవరున్నారు? నిద్దట్లోలాగా నర్స్ ఇచ్చిన అప్పాయింట్ మెంట్ కార్డు తీసుకుని, కళ్ళనుండి తన ప్రమేయం లేకుండా కారిపోతున్న కన్నీటిని తుడుచుకుంటూ బయటకు వచ్చిన సునీత, దూరంగా నిల్చుని సిగరెట్ కాలుస్తున్న అనిల్‌ని చూసి నిర్ఘాంతపోయింది. తనకి తెలిసినంత వరకూ అనిల్‌కి ఏ దురలవాట్లూ లేవు. అతనికి సిగరెట్టు అంటే చాలా అసహ్యం కూడా.

"ఇతను నా అనిలేనా? లేక ఇతన్ని ఇంకెవరయినా ఆవహించారా? అనిపించింది సునీతకి.

మొత్తానికి వారం గడిచింది. సునీతకి ఒక జాబ్ ఇంటర్వ్యూ వచ్చింది. ఈలోగా సునిల్‌ని ఇంటికి దగ్గరగా ఉన్న ఒక డే కేర్ లో చేర్చింది. మొదటిరోజు ఏడ్చినా, తన వయసు పిల్లల్ని చూసి సంబరపడ్డాడు. ముందుగా రోజుకి మూడుగంటలు పంపి మెల్లిగా అలవాటు చేసిన సునీత, వాడు క్రమంగా ఏడవకుండా వెళ్ళడం చూసి అమ్మయ్య అనుకుంది. ఇంట్లో ఇన్ని మార్పులు జరుగుతున్నా అనిల్ తనకేమీ పట్టనట్లు నిర్లిప్తంగా ఉండిపోయాడు. తోచినప్పుడు ఉద్యోగానికి వెళ్ళడం, లేకపోతే వాడు మీదకెక్కినా, పట్టించుకోకపోవడం. వాడూ క్రమంగా దగ్గరకు వెళ్ళడం మానేసాడు.

సునీతకి అతని ఉద్యోగం గురించి బెంగ మొదలయింది. ఇలా బిహేవ్ చేస్తే ఉద్యోగంలో ఎవరూరుకుంటారు?

అతను కొంచెం శాంతంగా ఉన్న రోజున సునీత ధైర్యం చేసి,

"అనిల్, మీకు మనసు బాగుండడం లేదా? నా వల్ల ఏమయినా పొరపాటు జరుగుతోందా?" నడిగింది.

"నాకు నిజంగా ఏమీ అర్థం కావడంలేదు సునీతా! ఒక్కోసారి పిచ్చ కోపం వస్తోంది ఎందుకో నాకే తెలియడం లేదు. ఊరికే బుర్రలో వాయిసస్ వినపడుతున్నాయి. దె వాంట్ మి టు హర్ట్ మై సెల్ఫ్"

" హు ఆర్ దె? " అడిగింది సునీత భయం భయంగా.

గబుక్కున సునీత ఒళ్ళో తలదాచుకుని, "నాకు తెలియదు పోనీ ప్లీజ్ హెల్ప్‌మి" అన్నాడు.

"మరి పోనీ సైకియాట్రిస్ట్ దగ్గరకు వెళదామా? " అంది అతని తలనిమురుతూ.

తల అశాంతిగా ఊపుతూ "సరే" అన్నాడు.

ఆ తరువాతి వారం బాగానే గడిచింది. నేహా రోజుకి రెండుసార్లు ఫోన్ చేస్తూనే ఉంది. అనిల్ చెప్పిన సంగతులు నేహాతో చెప్పింది సునీత. తప్పకుండా డాక్టరు చెప్పినట్లు చెయ్యమని గట్టిగా చెప్పింది నేహా. సునీత ఉద్యోగాలకి అప్లై చేస్తూనే ఉంది. ఈ లోపల ఇంటర్నెట్‌లో తలలో వాయిసస్ గురించి చదవడం మొదలుపెట్టిన సునీతకి నిజంగానే మతిపోయింది. స్కిజో ఫ్రెనియా కాని, బై పోలార్ డిసీజ్ కాని అయిండచ్చు, కాని అవి సాధారణంగా పద్దెనిమిది, ఇరువయి ఏళ్ళ మధ్య రావచ్చనీ, జీవితంలో అనుకోని దెబ్బ తిన్నప్పుడు ఈ వ్యాధులు బయట పడవచ్చనీ, ఎంతో తెలివయిన వాళ్ళకి ఈ వ్యాధులు రావచ్చని చదివింది. సంతృప్తిగా సాగిపోతున్న తమ జీవితంలో అనిల్ మనసుకి అంత తట్టుకోలేనంత దెబ్బ ఏం తగిలిందో సునీతకి తలబద్దలు కొట్టుకున్నా తెలియలేదు. కాని, ఒక్కోసారి, ఏ కారణమూ లేకుండానే నిద్రాణమైన వ్యాధులు బయటపడవచ్చని కూడా రాసి ఉంది. మధ్య మధ్యలో అతను తన ఆలోచనలు సునీతకి వినపడుతున్నాయా? అని అడగడం మొదలెట్టాడు. "లేదండి అదెలా సాధ్యం?" అని సునీత అడిగినా అతను అనుమానంగా సునీతకేసి చూడ్డం, అప్పుడప్పుడూ తనలో తనే మాట్లడుకోవడం గమనించింది సునీత.

ఒకరోజు బయటకు వెళ్ళిన అనిల్ రెండు రోజులదాకా వెనక్కి రాలేదు. సైకియాట్రిస్ట్ అపాయింట్ మెంట్ దాటిపోయింది. రెండు రోజులు సునీత మనసు నరకయాతన పడింది. మూడోరోజు మధ్యాహ్నం రెండు గంటలకు సునీతకి ఇంకో జాబ్ ఇంటర్వ్యూ వచ్చింది. పన్నెండున్నర ప్రాంతాల్లో, ఇంటికి ఒక ఆరుమైళ్ళ దూరంలో ఉన్న హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది. అనిల్‌ను అడ్మిట్ చేసుకున్నామని, అతనే సునీత పేరు, ఇంటి నంబరు ఇచ్చాడని, అంతకన్నా వివరాలు తాము చెప్పలేమని కబురు అతన్ని చూడడానికి సాయంత్రం ఆరు -

ఎనిమిది మధ్యన మాత్రమే వీలవుతుందనీ, సిగరెట్లు మాత్రం తెమ్మనీ, ఇంకేమీ ఎలౌవ్ చెయ్యమనీ సారాంశం. సునీతకి ఎటూ తోచలేదు. ఒక్కసారి అనిల్‌తో మాట్లాడాలని మళ్ళీ హాస్పిటల్‌కి ఫోన్ చేసింది. అయితే అతని కోడ్ చెప్పమనీ, అది తెలియకపోతే సైకియాట్రిక్ వార్డులో ఎవరితోనూ మాట్లాడ్డానికి వీలు పడదనీ అంటున్న నర్స్ మాటలు నిజంగా అర్థంకాలేదు సునీతకి. ఎలాగో మనసు చిక్కపట్టుకుని, నేహాకి ఫోన్ చేసింది.

తనకి ఇంకో గంటలో ఇంటర్వ్యూ, "భగవంతుడా, ఏమిటి చెయ్యడం?" నేహా మాత్రం చాలా గట్టిగా చెప్పింది. ఈ పరిస్థితిలో సునీతకి ఉద్యోగం చాలా అవసరమనీ, ఏమయినా సరే ధైర్యంగా ఉండమనీ చెప్పింది. ఎలాగోలా మనసు దిట్టం చేసుకుని, సునీత జాబ్ ఇంటర్వ్యూకి వెళ్ళింది. వాళ్ళేం అడిగారో తనేం చెప్పిందో, సునీల్‌ని ఎలాగ పికప్ చేసుకుందో అంతా ఆటో పైలట్ మీద లాగ జరిగిపోయాయి. సాయంత్రం నేహా, అనూప్ వచ్చారు.

"ఆఫీస్ లో ఏమయినా జరిగిందా? " అని అనూప్‌ని అడిగింది సునీత.

ఎప్పటిలాగే "లంచ్ కి వస్తావా? " అని అడిగాడట అనూప్, అనిల్‌ని.

కంప్యూటర్ మీద ఏదో పని చేస్తున్న అతను, "గెట్ లాస్ట్" అన్నాడట.

భుజం మీద చెయ్యి వెయ్యగానే, అనూప్ ని తోసేసి, కర్స్ చేస్తూ బయటకి వెళ్ళిపోయాడట.

ఆ తరువాత ముఖ్యమయిన మీటింగ్ ఉండడంతో అనూప్ కి సునీతకి చెప్పే అవకాశం కూడా దొరకలేదట. అతనంతట అతనే హాస్పిటల్ వెళ్ళి ఉంటాడు అన్నాడు అనూప్.

నేహాకి సునిల్‌ని అప్పచెప్పి, అనూప్‌తో హాస్పిటల్‌కి వెళ్ళింది సునీత. అతను మాత్రం లాబీలో ఉండిపోయాడు. సునీత కలలోలాగ నడుస్తూ, సైకియాట్రి యూనిట్ కనుక్కొని వెళ్ళింది. ఎప్పుడూ హాస్పిటల్‌లో ఎవర్ని కలవడానికి వెళ్ళే అవసరం రాలేదు సునీతకి. సునీల్ పుట్టినప్పుడు కూడా రెండు రోజులు హాస్పిటల్‌లో గడిపిన అనుభవమే. ఇది పూర్తిగా కొత్త తనకి అనిల్‌ని కలవటానికి ముందుగా సునీత దగ్గర్నుంచి పర్సు, సెల్‌ఫోన్ తీసేసుకుంది నర్సు. డబుల్ డోర్స్‌లోంచి లోపలికి రానిచ్చి, ఒక రూంలో కూర్చోబెట్టారు. సునీతకి గొంతు తడారిపోయింది. అనిల్ మెల్లిగా లోపలికి వచ్చాడు. అతని కళ్ళుబరువుగా ఉన్నాయి.

"సునీతా, నేనింక భరించలేను ఈ అలజడి. నాకేదో అయిపోతోంది. తలనిండా అరుపులు, కేకలు వినపడుతున్నాయి. ప్లీజ్, నన్నిక్కడినుంచి తీసుకుపోవా?"

రెండు చేతులూ పట్టుకుని అతి దీనంగా అడుగుతున్న భర్తని చూసేసరికి సునీతకి ఏడుపు ఆగలేదు.

"మీకేం కాదు. నేనున్నాను. ఒక్క రెండు రోజుల్లో సర్దుకున్నాక వెళ్ళిపోదాం, నా మాట వినండి" అన్న సునీతని

"నన్ను ఇంటికి తీసుకెళ్ళవా? అయితే నువ్వెందుకు నాకు? ఇప్పుడే పో" అని గబగబా తోసుకుని వెళ్ళిపోయాడు అనిల్.

రెండు చేతుల్లోనూ మొహం కప్పుకుని ఏడ్చేసింది సునీత. ఇంతలో ఒక నర్స్ మెల్లగా భుజం మీద చెయ్యివేసి, సునీతని డబుల్ డోర్స్ వయిపు నడిపించింది. బయటకు వెళ్ళడానికి కూడా తాళం తీయాల్సి వచ్చేసరికి, సునీత హడలిపోయింది. పర్స్ తీసుకుని ఎలాగో లాబిలోకి వచ్చిపడిన సునీతని చూస్తూనే, అనూప్ దగ్గరగా వచ్చి, భుజం మీద చెయ్యివేసాడు.

తోటి వ్యక్తిగా అతని సానుభూతి చూసేసరికి బావురుమంది, తట్టుకోలేక అతను మెల్లిగా, లాబీలోని సోఫాలో సునీతని కూర్చోబెట్టి, వెండింగ్ మెషిన్ లోంచి కాఫీ తెచ్చి ఇచ్చాడు. ఆ గోరు వెచ్చని కాఫీ ఎందుకు తాగిందో, ఎలా ఇంటికి వచ్చిందో సునీతకి తెలియనే లేదు. అనూప్ నేహా పిల్లలిద్దరికీ అన్నం పెట్టి పడుకో పెట్టేసింది. సునీత దగ్గర ఉన్న చనువుతోటో, పొందిగ్గా ఉన్నవాళ్ళ ఇంట్లో అలవాటు కాబట్టి, వాళ్ళ ముగ్గురికీ కిచిడీ చేసేసింది. ఎలాగో సునీత చేత తినిపించి, వాళ్ళిద్దరూ బయలుదేరేసరికి రాత్రి పదయింది.

వాళ్ళతో రమ్మని ఎంత బలవంతం చేసినా ఎందుకో సునీతకి ఇల్లు వదిలి వెళ్ళబుద్ది అవలేదు. ఏమన్నా అవసరం వస్తే ఫోన్ చేస్తానని పదిసార్లు చెప్పించుకుని, వాళ్ళు వెళ్ళిపోయారు.

భగవంతుడా, మేము ఏం పాప చేసుకున్నామని ఈ నరకయాతన? ఎందుకిలా అవుతోంది? సునీత మనసులో సుడులు తిరుగుతున్న ప్రశ్నలకి అంతంలేదు, సమాధానమీ లేదు. రోజూ సునీల్ని ఎవరో ఒకరికి అప్పచెప్పి, హాస్పిటల్‌కి వెళ్ళి రావడం, మూడ్ సరిగా ఉంటే అనిల్ మాట్లాడితే వినడం, లేదా భారమయిన మనసుతో ఇంటికి రావడం, సునీతకి అతిభారంగా నాలుగు రోజులు గడిచాక అసలు సమస్య మొదలయింది.

అనిల్ ని డిశ్చార్జ్ చేస్తామనీ, కానీ మందులు తప్పకుండా వాడాలనీ, అప్పాయింట్ మెంట్‌లు తప్పనిసరిగా నిలుపుకోవాలనీ నర్స్ గట్టిగా చెప్పింది ఒకసారి బిజినెస్ ఆఫీసుకు వెళ్ళమంది. అక్కడ వాళ్ళు చెప్పిన సంగతి వింటే మతి పోయింది సునీతకి. అనిల్ ఇన్సూరెన్స్ మెంటల్ హెల్త్ కవర్ చెయ్యదుట, ఈ అడ్మిషన్ ఎనిమిదివేల ఏడువందలని చెప్పింది. ఒకవేళ అంత డబ్బూ ఒక్కసారి కట్టలేకపోతే, ప్రతినెలా పేమెంట్ ప్లాన్ ఉందని చెప్పింది. జాంబీ లాగ తల ఊపి బయటకు వచ్చింది సునీత.

అనిల్ ఇంక మీదట ఉద్యోగం చెయ్యగలడా? చెయ్యకపోతే తమకి ఎలా గడుస్తుంది? తను వర్క్ చేస్తుంటే అనిల్ మీద ఇంటి బాధ్యత వదలగలదా?

అటు ఇండియా వెళ్ళిపోదామంటే, అనిల్‌కీ తనకీ మాత్రం ఎవరున్నారు?ఇక్కడే ఉండిపోదామంటే హెల్త్ ఇన్సూరెన్స్‌లు అవీ ఎలాగ? తనొక్కర్తీ బాబునీ అనిల్‌నీ చూసుకోగలదా? ఉద్యోగం వచ్చినా, ఇంత మనస్తాపంతో తను చెయ్యగలదా? చెయ్యకపోతే ఇల్లు ఎలా గడుస్తుంది? పసివాడి బతుకు ఏమవుతుంది?

అన్నీ ప్రశ్నలే కిటికీలోంచి చీకట్లోకి చూస్తుంటే తమ జీవితం కూడా అంధకారమయం అనిపించసాగింది సునీతకి.

"ఇలా అవుతుందనుకోలేదు" మనసులో ఏదో ఆశ, తెల్లవారితే ఇది ఒక కల అనీ, అనిల్‌కి ఏమీ కాదనీ ఒకమూల ఏదో భావన.

మనసులో ఎప్పుడో విన్న దేవులపల్లి వారి గీతం... ఉపశమింపని తపనయే నాకున్న భాగ్యం కన్న తండ్రీ, ఎటులనే నీలీల కీర్తింతు, ఓ దేవ దేవ, ఎటులనేనీ మ్రోల నర్తింతు..?

భగవంతుడా! నాకు ఏది దారి?

అంతులేని ఆవేదనతో, నీళ్ళింకిపోయిన కళ్ళతో చీకట్లో వెలుగురేఖ కోసం వెతుకుతోంది సునీత. నిద్దట్లో అమ్మా అన్న సునీల్‌ని గట్టిగా వాటేసుకుని, "ఇలా అవుతుందని ఎప్పుడూ అనుకోలేదురా కన్నా" అని తనలో తను గొణుక్కునే సునీతలెంతమంది ఈ ఆధునిక సమాజంలో? వారి జీవితాలకి ఆలంబనలేవీ ఈ నవ్య నాగరికతలో? ***

*ఒక వైద్యురాలిగా ఎదుర్కునే సంఘటనలకు మనసుచలించి, ఒక మంచి మాట, కొంత మనోధైర్యం తప్ప ఇంకేమీ ఇవ్వలేని నిస్సహాయతకి కరిగిన కన్నీళ్ళు నీరాజనంగా, ఇది మానసిక వ్యాధులతో పరితపించే కుటుంబాలకి అంకితం.*

*డా.ఉమ*

# మంత్రి గారొస్తారా? కొల్లూరి సోమశంకర్

**నరేంద్రకి చాలా** దాహంగా ఉంది, గొంతెండిపోతోంది.

బొంబాయి నుంచి బికనేర్ సమీపంలోని ఈ ఊరికి బయలుదేరుతున్నప్పుడు మిత్రులు అతడిని హెచ్చరించారు.

"నువ్వు కనీసం అస్సాంలో లేదా ఉత్తర్‌ప్రదేశ్ లలోనైనా బ్రతగలవు, అక్కడ గొడవలు కాని, కాల్పులు కాని, లూటీలు గాని ఎటువంటి పరిస్థితులు ఉన్నా, తినడానికి తిండి, తాగడానికి నీరు దొరుకుతాయి. కాని అక్కడ.. "అంటూ రాహుల్ చెప్పడం ఆపాడు.

నరేంద్ర చిన్నగా నవ్వాడు. 'ఆపేశావే, చెప్పు రాహుల్' అన్నాడు.

కపాడియా అందుకున్నాడు.

"నేను చెబుతా. అక్కడకి వెడితే, నువ్వు ఆకలిదప్పులతో చావాలి!! ముఖ్యంగా ఆ గ్రామం.. దాని గురించి మనం వింటున్న కథలు చాలు. నువు రిపోర్టు రాసివ్వడానికి. నువు స్వయంగా వెళ్ళనవసరంలేదు."

తన మిత్రులు చెబుతున్నదాన్ని నరేంద్ర ఆమోదించలేకపోయాడు.

నీరు, ఆహారంలేకుండా జనాలు అక్కడ పిట్టల్లా రాలిపోతున్నారని విన్నాడతను. పశువులెప్పుడో నశించాయట.

నరేంద్ర కోపంతో రగిలిపోయాడు. అతని హృదయం బరువెక్కింది. 'ఇదసలు ఎలా జరిగింది? ఎందుకు జరిగింది?' అని తనని తాను ప్రశ్నించుకున్నాడు.

ప్రభుత్వమేమో ఆ ప్రాంతంలో అసలు ఆకలి చావులు లేవని, యుద్ధప్రాతిపదికన ఉపశమన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించింది. నరేంద్ర స్వయంగా వెళ్ళి అక్కడి పరిస్థితిని కళ్ళారా చూడాలనుకున్నాడు.

మిత్రుడు రాజారాం రైల్వేస్టేషన్ వరకు తోడుగా వచ్చాడు. అది అతనికెంతో ప్రోత్సాహాన్నిచ్చింది.

నరేంద్ర బికనేర్ చేరాడు. అక్కడి బస్సు, ఎడ్లబండి.. ఏవాహనం దొరికితే, దాంట్లో ఊర్లు తిరిగాడు. ఈ ఊరిలోకి అడుగుపెట్టగానే నిర్ఘాంతపోయాడు.

జీవితంలో మొదటిసారిగా 'దారిద్ర్యరేఖకి దిగువున ఉండడం' అంటే ఏమిటో అర్థమైందతనికి.

ఇంతకుముందు ఊర్లో ప్రయాణ సౌకర్యం దొరకడం కష్టమైంది. ఈ ఊరికి బస్సులు నడపడం మానేసారు. ఓ ఎడ్లబండి అతన్ని అడిగాడు నరేంద్ర. అతను రానన్నాడు. చాలా ఎక్కువ బాడుగ ఇస్తానని నరేంద్ర బ్రతిమాలితే, చివరికి ఒప్పుకున్నాడు.

"ఆ ఊరు దెయ్యాల బీడు బాబూ, ఒకప్పుడు వందమందికి పైగా ఉన్నా ఆ ఊర్లో ఇప్పుడు ఇరవయ్యో, ముప్పైయ్యో ఉన్నారంతే. చాలామంది చచ్చిపోయారు, కొంతమంది వలసపోయారు. గడ్డి దొరకక పశువులు చచ్చిపోతున్నాయి. ఘోరం బాబూ... నిజంగా దారుణం.." చెప్పాడు ఎడ్లబండి నడిపే బోలీ, బండిని నరేంద్ర కోరిన ఊరివైపు నడుపుతూ. నరేంద్ర గట్టిగా నిట్టూర్చాడు.

బోలీ తన బండ్లో మూడు కాసుల నీళ్ళు, కొన్ని సమోసాలు, కొన్ని మిఠాయిలు పెట్టుకున్నాడు. అతని దయార్ధ్ర హృదయం నరేంద్రకి నచ్చింది.

"అక్కడ ఎవరైనా చిన్నపిల్లలు ఉండచ్చు కదా బాబు, పైగా మీరక్కడ చాలా సేపు ఉండి ఫోటోలవీ తీసుకుంటే, మీకు ఆకలి వేస్తుంది కదా.." అన్నాడు బోలీ.

ఎంతటి దూరాలోచన రాజకీయ నాయకులకు ఏ మాత్రం తట్టనిది..! నరేంద్ర కూడా బస్ స్టాండ్ నుంచి కొన్ని బిస్కట్ పాకెట్లు తెచ్చుకున్నాడు. బండిమెల్లగా దెయ్యం గ్రామంలోకి ప్రవేశించింది. ఆ ఊరిని చూసిన మొదటి క్షణంలో నరకమంటే ఇదేనేమోననిపించింది నరేంద్రకి. అంతటి భయవహ వాతావరణంలోను, గ్రామం కాస్త సందడిగానే ఉంది.

ఓ టీ కొట్టులోంచి అరిగిపోయిన టేప్ వినిపిస్తోంది. 'మేరే ఆంగనే మే తుమ్హారా క్యా కామ్ హై?' అంటూ అమితాబ్ బచ్చన్ అడుగుతున్నాడు. నరేంద్ర టీ కొట్టువైపు నడిచాడు.

"తాతా, టీ దొరుకుతుందా? " అని కొట్టు యజమానిని అడిగాడు. ఆయనకి దాదాపు ఎనభై ఏళ్ళ వయసుంటుంది.

"ఉంది బాబు. కూర్చోండి" అంటూ అక్కడ ఉన ఓ విరిగిన చెక్క బల్లని చూపాడు. 'మీరు ప్రభుత్వం నుంచి వస్తున్నారా? మంత్రిగారి తరపున వచారా?' అంటూ పీల గొంతుతో ఆశగా అడిగాడు. కళ్ళు కొద్దిగా మెరిసాయి.

"లేదు. నేను విలేకరిని. మీ ఊరి గురించి పేపర్లో రాస్తాను..."

ముసలతను టీ కలిపి ఓ పాత, మట్టికొట్టుకుపోయిన కప్పులో పోసి నరేంద్రకి అందించాడు.

"టీ చెత్తగా ఉంటుంది బాబు, ఏమనుక్కు. పాలివ్వడానికి మా ఆవుకి గడ్డిలేదు. ఏ మాత్రం లేదు. ఈ రోజు పొద్దున్నే నా కొడుకు, కోడలు, మనవడు కాస్త ఆరోగ్యంగా ఉన్న ఆవుని తోలుకుని వెళ్ళిపోయారు."

"ఎక్కడికి?" అడిగాడూ నరేంద్ర. తేనీరు కషాయం పలచగా, చేదుగా ఉంది. ముసలతను తెలియదన్నట్లుగా నిరాశగా చేతులాడించాడు.

"ఎక్కడికి వెళ్ళారో నాకు ఖచ్చితంగా తెలియదు, మిగతా అందరూ ఎక్కడికి వెళ్ళారో అక్కడికే వెళ్ళుంటారు. పోన్లే. వాళ్ళయినా సుఖంగా ఉంటే అంతే చాలు" టీ చాలా చేదుగా ఉంది, ఈ ముసలతని జీవితంలానే.

"మరి నువ్వెందుకు వెళ్ళలేదు తాతా?"

"హుఁ.... ఎనభై ఏళ్ళ క్రితం నేనీ ఊరి ఒడిలో పడ్డాను. పేగు బంధం ఇంకా తెగిపోలేదు.. నేనిక్కడ పెరిగి పెద్దవాడినయ్యాను, ఈ ఊరి అమ్మాయినే ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. ఈ ఊరి మొత్తానికి నేనే పాలు పోసేవాడిని. మా కొట్టంలో ఎన్నో ఆవులు, గేదలు ఉండేవి. కాని ఇప్పుడిలా... మా దురదృష్టాన్ని అసలు నమ్మలేకపోతున్నాను. మా ఊరి వాళ్ళెందరో నా కళ్ళముందే చనిపోయారు. మా ఆవిడ కూడా ఈ మధ్యే పోయింది. బహుశా నెల రోజులయ్యిందేమో... నా ఆవు, నేను కూడా తొందర్లోనే పోతాం..."

టీ నరేంద్ర గొంతు దిగడంలేదు. కటిక చేదు రుచి పచి లేదు..కషాయం!

"మా ఊరికి మంత్రిగారొస్తారని పదిరోజుల నుంచి అందరు చెప్పుకుంటున్నారు. అందుకే నేను నిన్ను అలా అడిగాను..."

ఇంతలో శుష్కించిన చర్మంతో ఉన్న ఓ యువతి ఎముకల గూడులా ఉన్న ఓ బిడ్డని ఎత్తుకుని అక్కడికి వచ్చింది. "రామ్మా, రా. కూర్చో. ప్యారా ఎలా ఉన్నాడు?" అంటూ ముసలతను అడిగాడు.

ఆమెకి కూడా ఓ కప్పులో టీ కషాయాన్ని అందించాడు. వడలిపోయిన చర్మంతో ఉన్న వణుకుతున్న చేతులతో కప్పుని ఆత్రంగా అందుకుని, ఒక్క గుక్కలో తాగేసింది. ఆమె భుజం మీద పిల్లాడు నిద్రపోతున్నాడు.

"ఏం లాభం లేదు మావయ్యా. ఆయన పరిస్థితి బాలేదు... మెల్లిగా.. మెల్లిగా చచ్చిపోతున్నాడు." ఆమె మాటలింక పూర్తిచేయలేకపోయింది. మాయదారి కరువుకి ఎంత శక్తి ఉందంటే కళ్ళలో తడిని కూడా పీల్చేసినట్లుంది. వాస్తవం... కఠోరమైన వాస్తవం....

ముసలాయనకి యాభై రూపాయల నోటిచ్చి, అక్కడి నుంచి కదిలాడు నరేంద్ర. ఆ యువతి వెంబడి ఊర్లోకి నడిచాడు. ఇళ్ళన్ని నిర్మానుష్యంగా ఉన్నాయి. బావులన్నీ ఎండిపోయాయి. దూరంగా కొన్ని రాబందులు కనబడ్డాయి. బహుశా పశువుల శవాలని పీక్కుతినడానికేమో. చెట్లు మోడుపోయాయ్. అన్నిచోట్లా చావు వాసనలే.

ఊర్లో ఉన్న కొద్ది మంది మనుషుల కళ్ళల్లో ఏ మాత్రం మెరుపు పేదు. వాళ్ళ జీవితాలలో సంతోషం లేదు, బ్రతకాలన్న ఉత్సుకత లేదు.

రోడ్డు ప్రక్కగా ఓ కుటుంబం కూర్చుని ఉంది. నరేంద్ర వాళ్ళ వైపు వెళ్ళాడు. వాళ్ళేవో మాట్లాడుకుంటున్నారు.

"అమ్మా, మంత్రిగారు నిజంగా వస్తారా?"

"వస్తారు.బాబు. తప్పకుండా వస్తారు. "

"అప్పుడు మనకి నీళ్ళు వస్తాయి కదా, మంత్రిగారు లారీలలో నీళ్ళు తెస్తారు కదూ"

నాలుగేళ్ళ కొడుకు, ముప్పై ఏళ్ళ వయసుండే తల్లిని అడుగుతున్నాడు. వాడి కళ్ళలో ఏదో చిన్నమెరుపు. మరోవైపు ఎండిపోయిన తల్లి రొమ్ముని చప్పరిస్తోంది నాలుగునెలల పాప.

"అమ్మా, మంత్రిగారు రొట్టెలు, మిఠాయిల్ కూడా తెస్తారు కదూ"

"అవును బంగారం"

"నాన్నెప్పుడు వస్తాడు?"

"నువ్వు పడుకో. నువ్వు నిద్రలేచేసరికి నాన్న వచ్చేస్తాడు"

ఆ కుర్రాడు తల్లిని చుట్టూ తిరుగుతున్నాడు. ఆ ఎముకలగూడుకి నిద్రరావడంలేదు.

"అమ్మా"

"ఊఁ!c" ఆమె స్వరంలో నిస్సత్తువ వ్యక్తమవుతోంది.

"అమ్మా, నాన్న కూడా ప్యారా మావయ్యలా చచ్చిపోతే..."

ఆమె చిగురుటాకులా వణికిపోయింది.

"తప్పు బాబు అలా అనకూడదు" అంటూ మంగళసూత్రాన్ని బయటకు తీసి కళ్ళకద్దుకుంది... 'అమ్మోరు తల్లీ...' అంటూ గొణిగింది. దూరంగా ఉన్న దేవాలయం గర్భగుడిలో పార్వతి దేవి వీళ్ళని చూస్తుండిపోయింది. నిశ్శబ్దంగా. పూజరి ఎప్పుడో చచ్చిపోయాడు. దేవి కూడా ఆకలితో ఉంది.. నరేంద్ర ఆమె దగ్గరకి వెళ్ళాడు.

"ఏమ్మా, మీ ఇంటాయన ఎక్కడ పనిచేస్తాడు?'

నరేంద్ర కేసి చూస్తూ, కొంగులో కొంత భాగాన్ని తలమీద కప్పుకుందామె.

"ఇక్కడే స్కూల్లో టీచరు. మంత్రిగారిని కలవడానికి వెళ్ళారు..."

"మీరు రోడ్డు మీద ఎందుకు కూర్చున్నారు? మీకు ఇల్లు లేదా?"

కొన్ని గజాల దూరంలో, గుడి వెనక ఉన్న ఓ ఇంటివైపు వేలు చూపిందామె.

"మా కొట్టంలో రెండు ఆవులు చచ్చిపడున్నాయి, వాటి కంపు భరించలేకపోతున్నాం, పైగా రాబందుల గొడవొకటి.." అని చెబుతూ, "మంత్రిగారొస్తారా?" అని అడిగింది.

"వస్తారు. తప్పకుండా వస్తారు.." చెప్పాడు నరేంద్ర, కనీసం తన అంతరాత్మనైనా సంతృప్తి పరుద్దామని.

నరేంద్ర బోలీని పిలిచి అక్కడున వారందరికి, నీళ్ళు, తినే పదార్థాలు పంచమని చెప్పాడు బోలీ. బొంబాయి చేరేసరికి నరేంద్ర హృదయం విచారంతో క్రుంగిపోయింది, కోపంతో భగ్గుమంది.

నరేంద్ర తీసిన ఫోటోలకి, రాసిన వ్యాసానికి ఎడిటర్ ఎంతో సంతోషించాడు.

"అదిరిందయా దీన్ని ఫ్రంట్ పేజీలో వేసేద్దాం. సేల్స్ బ్రహ్మాండంగా పెరిగిపోతాయి"

రోతగా అనిపించింది నరేంద్రకి. ఎంతసేపూ అమ్మకాలు... లాభాలు.. డబ్బు... వీటి గురించే ఆలోచిస్తారెందుకో అనుకున్నాడు.

"సరే, నరేంద్ర, నీకు టికెట్లు ఏర్పాటు చేసాను. అలీనోద్యమం సమావేశాలని కవర్ చేయడానికి ప్రతినిధిగా నువ్వు ఢిల్లీ వెడుతున్నావు. సామాన్లు సర్దుకో" చెప్పాడు ఎడిటర్.

కొత్త ఢిల్లీ అందంతోను, సంపదతోను నరేంద్రని ఆహ్వానించింది. హైవేలు, షాపింగ్ కాంప్లెక్సులు, పూలతో నిండిన చెట్లు... ఇవన్నీ అతడిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

అతడు సమావేశంలో ఫిడెల్ క్యాస్ట్రోని దగ్గరగా ఫోటో తీసుకోగలిగాడు. వారం రోజుల తర్వాత అతడికి మంచి నిద్రపట్టింది, అతడి గుండెని ముల్లుతో పొడుస్తున్నట్టుగా ఉన్న బాధ మాయమైంది.

హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ అద్భుతంగా ఉంది. నరేంద్ర ఆలోచనలన్నీ నిన్నటి క్యాస్ట్రో ఉపన్యాసం పైనే ఉన్నాయి. వాస్తవానికి, నరేంద్ర క్యాస్ట్రో ఆలోచనల గురించి ఇంతకు ముందు పుస్తకాలలో చదివాడు. కొన్ని అతని మనసులో ముద్రించుకుపోయాయి. కొన్ని కన్నీళ్ళు కార్పించాయి. మరికొన్ని సెగలా... అతడి గుండెని మండించాయి.

"ఉన్నవాళ్ళ సంపదని తొలగించి, వాళ్ళని పేద వాళ్ళతో సమానంగా చేయాలనుకోడం మూర్ఖత్వం. నిజమైన విప్లవం ఏంటంటే, ఆర్థిక స్థాయిని పెంచి, దారిద్ర్య రేఖకి దిగువన ఉన్నవారి జీవిత ప్రమాణాలని పెంచాలి.. వాళ్ళు సౌకర్యంగా ఉండేట్లు చూడాలి.."

ఇంతలో 'డైలీ మార్నింగ్ స్టార్' విలేకరి పార్థసారథి అక్కడికి వచ్చాడు.

"ఏం నరేంద్ర, దేని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నావు? నీ కప్పులో కాఫీ చల్లారిపోతోంది" అంటూ పలకరిచాడు. నరేంద్ర ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. కప్పులోకి చుసాడు. దాంట్లో కాఫీ కనపడలేదతనికి.

బదులుగా, పల్చగా, మురికిగా ఉన్న కాషాయం కనపడింది.టీ కొట్లో ముసలతను, చచ్చిపోతున్న ప్యారా, రోడ్డుమీద కూర్చున్న కుటుంబం... ఒక్కసారిగా అతడి జ్ఞాపకాలతో వెల్లువయ్యాయి. మంత్రిగారు ఆ ఊరికి వెళ్ళుంటారా?

నరేంద్ర కుర్చీలోంచి పైకి లేచి, కప్పులోని కాఫీని టేబుల్‌పై అందంగా అలంకరించిన ఖరీదైన ఫ్లవర్ వేస్‌లో ఒంపేసాడు.

కాఫీ చాలా చిక్కగా, వెగటుగా ఉన్నట్లనిపించిందతనికి.

*కథ నేపథ్యం గురించి సంక్షిప్తంగా:*

*మూల కథని 1984 లో తమిళంలో రాసారు. 1983 లో రాజ్‌స్థాన్‌లో తీవ్రమైన కరువు వచ్చింది. అదే ఏడాది మార్చిలో ఢిల్లీలో అలోనోద్యమం సమావేశాలు జరిగాయి. కథావస్తువు రాజస్థాన్‌లో కరువైనా, దానిని ఇటీవల ఆంధ్రదేశంలో సంభవించిన వరదలతో పోల్చుకోవచ్చు. రెండిటికీ కారణాలు వేరైనా, అటువంటి దుర్ఘటనలు మిగిల్చే విషాదాలు, వెతల ఫలితాలు మాత్రం ఒకేలా ఉంటాయి, వాటికి బలయ్యేది మాత్రం సామాన్యులే. నిస్సహాయులైన ప్రజలు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వ సాయం ఎంతలా కోరుకుంటారో, రాజకీయనాయకులొచ్చి తమను ఆదుకుంటారని ఎంతగా నమ్ముతారో ఈ కథ చెబుతుంది.*

# మరి వీళ్ళో?

## పాలపర్తి జ్యోతిష్మతి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణప్రచురణకు ఎంపికైన కథ)

**అమ్మా, నాన్నా టీవీలో** వార్తలు చూస్తున్నారు. ఏడేళ్ళ చింటూకి విసుగ్గా ఉంది. కానీ వార్తల తరువాత వచ్చే వాణిజ్యప్రకటనల కోసం అట్లాగే కూర్చున్నాడు.

వార్తలు చదివే అమ్మాయి ఏదో చెప్పగానే తెరమీది దృశ్యం మారింది. నలుగురు వ్యక్తులు ఒక ఇంటి దగ్గరికి వచ్చి తలుపు తట్టారు. తలుపు తియ్యగానే గబగబా లోపలికి వెళ్ళి ఇల్లంతా వెతికారు. ఒకగదిలో పదేళ్ళ అమ్మాయి కసువూడుస్తూ కనిపించింది. వాళ్ళు ఆ అమ్మాయిని ఫోటోలు తీశారు. ఏవేవో ప్రశ్నలు అడిగారు. తరువాత ఇంటి యజమానితో ఏదో మాట్లాడారు. ఏవో కాయితాలు తీసి రాసుకున్నారు. ఇంటి యజమాని వాళ్ళ వెనకే వెళుతూ ఏదో చెపుతున్నా వినిపించుకోకుండా గబగబా వెళ్ళిపోయారు. పనిపిల్ల బిక్క మొహంతో చూస్తుంటే కసిరి పంపించేశారు ఇంటివాళ్ళు.

"తిక్క కుదిరింది" కసిగా అంది అమ్మ.

"ఏంటమ్మా? ఏమైంది?" అడిగాడు చింటూ.

"చిన్నపిల్లలు డబ్బు సంపాదించడానికి పనిచేస్తుంటే వాళ్ళని 'చైల్డ్ లేబర్' అంటే 'బాలకార్మికులు' అంటారు. పధ్నాలుగేళ్ళకంటే తక్కువ వయసున్న పిల్లల చేత పనిచేయించకూడదు. అది నేరం. వాళ్ళింట్లో చిన్నపిల్ల పని చేస్తోంది కదా? అందుకే ఆయన మీద కేసు రాసుకున్నారు." చెప్పింది అమ్మ.

"పిల్లలు అసలు ఏ పనీ చెయ్యకూడదా?"

"ఏ పనీ చెయ్యకూడదనేం లేదు. లేబర్ యాక్ట్ ప్రకారం పిల్లలచేత ఏ ఏ పనులు చేయించకూడదో ఒక లిస్టు ఉంటుంది. ఆ లిస్టులో ఉన్న పనులు పిల్లల చేత చేయించకూడదు" వివరించాడు నాన్న.

"అదేంటి? కొన్ని పనులు చేయించకూడదు, కొన్నిపనులు చేయించొచ్చు అని ఉంటుందా?"

"గవర్నమెంటు పాలసీ అది. అంతే."

"వాళ్ళు పని చేసుకోలేక పనిమనిషి కావాలని పెట్టుకున్నారేమో?"

"పనిమనిషి కావాలంటే పెద్దవాళ్ళను పెట్టుకోవాలి. చిన్నపిల్లల్ని పెట్టుకోకూడదు. ఆ అమ్మాయివాళ్ళ అమ్మా నాన్న ఆ అమ్మాయిని పనికి పంపించినా వీళ్ళు పెట్టుకోకూడదు. 'మాకు చిన్నపిల్ల వద్దు' అని చెప్పి పంపించెయ్యాలి."

"ఆ అమ్మాయి వాళ్ళింట్లో అన్నంలేదేమో! అందుకే పనిచేస్తోందేమో?"

"అన్నం లేకపోతే వాళ్ళ అమ్మా, నాన్నా పనిచేసి సంపాదించి పెట్టాలి. అంతే కానీ పిల్లల చేత పనిచేయించకూడదు. పిల్లలని బడికి పంపించి చదివించాలి."

"పొద్దునే వచ్చి పనిచేసేసి తరువాత బడికి వెళుతుందేమో?"

"అయినా సరే. చిన్నపిల్లలచేత పని చేయించుకోవడం నేరం."

"మరి వాళ్ళ అమ్మా నాన్నా సంపాదించేది సరిపోకపోతే ఏం చేస్తారు?"

చింటూ ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో నాన్నకి తోచలేదు."ఆ లిస్టులో లేని పనులు ఏవో చేసుకుంటారు. అయినా ప్రతి విషయం గురించీ నీకింత ఆరా ఎందుకు?" విసుక్కుంది అమ్మ.

అమ్మా,నాన్నలు చెప్పిన విషయాలు అర్థం అయినట్టూ, కానట్టూ ఉండి గందరగోళంగా అనిపించింది చింటూకి.

ఇంతలో టీవీలో ప్రకటనలు మొదలయ్యాయి. ముగ్గురూ ఉత్కంఠతో చూస్తున్నారు. వాళ్ళు ఎదురు చూస్తున్న ప్రకటన రానే వచ్చింది.

సంవత్సరం వయసున్న పాపకు ఒకతను ఏదేదో చెపుతున్నాడు. ఆ పసిపిల్ల ఒకసారి బిక్కమొహం పెట్టింది.

ఒకసారి కిలకిలా నవ్వింది, ఒకసారి చప్పట్లు కొట్టింది, ఒకసారి ఆశ్చర్యపోయింది. చేతులు తిప్పుతూ రకరకాల హావభావాలతో అతను చెపుతున్నదంతా అర్థమైనట్టుగా నటించింది. ప్రకటన అయిపోయింది.

అమ్మా నాన్నల మొహాల్లో అనిర్వచనీయమైన ఆనందం. చింటూకి మాత్రం దుఃఖం పొంగుకొస్తోంది. పెదాలు బిగించుకుని ఆపుకుంటున్నాడు.

'ఆ ప్రకటన మొదటిసారి టీవీలో వచ్చినప్పుడు వీధి వీధంతా తమ ఇంటికి వచ్చేసింది. 'ఎంత బాగా నటించిందో క్యూట్ గాళ్!' అంటూ చెల్లాయిని ఎత్తుకుని, ముద్దులు పెట్టి నలిపేశారు. చెల్లాయి ఒకటే ఏడుపు. అందరూ వెళ్ళిపోయాక 'దిష్టితగిలింది' అంటూ అమ్మ ఎంత హడావుడీ చేసింది!'

"తను కావాలనుకున్న ఫీలింగ్స్ దీని మొహంలో రాబట్టటానికి ఆ డైరెక్టర్ ఎంత తిప్పలు పడ్డాడో! ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది." ఆనందంగా నవ్వుతూ కూతుర్ని ముద్దాడుతోంది అమ్మ. చింటూకి చెల్లాయిని అమ్మ చేతుల్లోంచీ లాక్కుని గుండెలకి హత్తుకోవాలనిపించింది. ప్రకటన షూటింగ్ కోసం బొంబాయి వెళ్ళడం గుర్తొచ్చింది.

'మూడు నెలల క్రితం ఒకరోజు పేపరు చదువుతూ నాన్న అమ్మని పిలిచి ఏదో చూపించాడు. వెంటనే ఒక ఫోటోగ్రాఫర్‌ని పిలిచి రకరకాల ఫోజుల్లో చెల్లాయికి ఫోటోలు తీయించి ఎక్కడికో పోస్టులో పంపించారు. పదిహేను రోజుల తరువాత చెప్పాపెట్టకుండా తన చేత స్కూలుకి సెలవు పెట్టించి బొంబాయికి బయలుదేరారు అమ్మా నాన్నా. 'ఎందు'కని అడిగితే 'చెల్లాయిని ఒక వ్యాపార ప్రకటనలో నటించడానికి తీసుకుంటున్నారు' అని చెప్పారు. అప్పుడు తన కెంత నవ్వొచ్చిందో! ఇంత చిన్నపిల్ల నటించడమేమిటని.

'బొంబాయి వెళ్ళేటప్పటికి పొద్దున్నయింది. హోటల్లో రూము తీసుకుని, గబగబా తయారయి స్టూడియోకెళ్ళి కూర్చున్నాము. అక్కడ నాన్న ఎవరెవరితోటో ఇంగ్లీషులో, హిందీలో ఏదేదో మాట్లాడుతూనే ఉన్నాడు. తనకసలేమీ అర్థం కాలేదు. కాసేపటికి ఒకాయన వచ్చాడు. ఆయన చెల్లాయికి నాన్నగా నటిస్తాడట. నల్లగా, పొడుగ్గా, భయమేసేటట్లున్నాడు. ఆయన ఎత్తుకోగానే చెల్లాయి పెద్ద ఏడుపు. దాని ఏడుపును పట్టించుకోకుండా ఆయన దాన్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని నాన్నతో చాలాసేపు మాట్లాడాడు. అమ్మా నాన్న కూడా చెల్లాయి ఏడుపును పట్టించుకోలేదు. 'చెల్లాయి ఏడుస్తుంటే అట్లా వదిలేశావేంటమ్మా?' అని అడిగితే 'అందరి దగ్గరికీ వెళ్ళడం దానికి అలవాటు కావాలి' అంది అమ్మ. 'అలవాటు కాకపోతే ఏమౌతుంది? అంత ఏడిపించడం ఎందుకు?' అనిపించింది తనకు.

'ఆయన లోపలికెళ్ళి కాసేపటికి గుర్తుపట్టలేనట్టుగా తయారై వచ్చాడు – నల్లటి మొహానికి తెల్లరంగు వేసుకుని. వెంటనే చెల్లాయి మొహానికి కూడా ఆ తెల్లరంగు వెయ్యడం మొదలుపెట్టారు. అది తనకస్సలు నచ్చలేదు. తను అమ్మనడిగాడు – 'అమ్మా! చెల్లాయి తెల్లగా, అందంగా, ముదుగా ఉంటుంది కదా? ఇంకా ఆ రంగు వెయ్యడం ఎందుకు?' అని. 'అందంగా, ముద్దుగా ఉంటుంది కాబట్టే అదృష్టం మనల్ని వెతుక్కుంటూ వచ్చిందిరా. ఇంకో రెండు మూడు అవకాశాలు వచ్చాయంటే దాని కెరీర్ సెటిలయిపోయినట్టే. దానిగురించి మనకింకేం దిగులుండదు' అంది అమ్మ. కెరీర్ సెటిలయిపోవడమేమిటో తన కర్థంకాలేదు గానీ మళ్ళీ మళ్ళీ ఇట్లా షూటింగులకి ఇక్కడికి రావలసి ఉంటుందని అర్థమైంది. ఇప్పటికే చెల్లాయి ఇంతలా ఏడుస్తుంటే మళ్ళీ మళ్ళీ రావడమేమిటి, అర్థం లేకుండా? అనిపించింది తనకి.

'షూటింగు మొదలయ్యాక దాని ఏడుపు మరీ ఎక్కువయ్యింది. ఆ లైట్లూ అవి చూసి భయపడిపోయిందో, ఏమో. 'అమ్మా! చెల్లాయిని అంతలా ఏడ్పించి ఈ షూటింగు చెయ్యకపోతే ఏం? మనం వెళ్ళిపోదాం' అంటూ తనూ ఏడ్చాడు. అమ్మకి ఎంత కోపం వచ్చిందో! 'ఎప్పుడూ ఏవో ప్రశ్నలతో విసిగిస్తూ ఉంటావు. కాసేపు మాట్లాడకుండా ఉండు.' అని కసురుకుంది.

'చెల్లాయి ఏడుస్తోందని తను ఆదుర్దా పడూతుంటే 'ఇట్లా ఏడిస్తే మీ అమ్మాయి పనికిరాదు' అని షూటింగు ఆపేస్తారేమోనని అమ్మా నాన్నా కంగారు పడుతున్నారు.

'ఏడ్చీ ఏడ్చీ ఎన్ని బట్టలు తడిపేసిందో పాపం. ఆ ఏడుపుకి మేకప్పంతా కరిగిపోవడం, మళ్ళీ దాని మొహానికి రంగు పుయ్యడం. మధ్యాహ్నం దాకా సరిపోయింది. పాలు పట్టీ, నీళ్ళు పట్టీ, పెదాలకి తేనెపూసీ, రకరకాల బొమ్మలిచ్చీ ఎన్ని తిప్పలుపడ్డారో చెల్లాయిని నవ్వించడానికి. ఊహూఁ! ఏడుపు మానితేనా? 'ఫోటోలు తీయించినప్పుడు ఎంత చక్కగా నవ్వుతూ ఫోజులిచ్చింది! ఇవాళేంటి ఇట్లా పెంకితనం చేస్తోంది?' అంటూ అమ్మ చెల్లాయి మీద చిరాకు పడుతోంది. నానేమో 'షూటింగు రేపటికి వాయిదా వేశారంటే ఇంకో రోజు ఇక్కడే ఉండిపోవలసి వస్తుంది. హోటలు బిల్లు బోలెడు అయిపోతుంది. తిరుగు ప్రయాణానికి చేసుకున్న రిజర్వేషన్లు వేస్టయిపోతాయి. మళ్ళీ రిజర్వేషను దొరక్కపోతే ప్రయాణం చాలా కష్టమవుతుంది' అని టెన్షన్ పడ్డాడు.

'ఇదంతా ఇట్లా ఉంటే ఆ పొడుగాటాయన 'ఇంత ఆలస్యం అయితే చాలా కష్టం. నేనెళ్ళిపోతాను' అన్నాట్ట.

‘చిన్నపిల్లకదా? ప్రయాణం బడలిక వల్ల తిక్కగా ఉంది. కాసేపు నిద్రపోయి లేస్తే సర్దుకుంటుంది. కాస్త ఓపిక పట్టండి‘ అంటూ నాన్న బతిమాలితే, ఎట్లాగైనా ఆ రోజే షూటింగు పూర్తిచేస్తామని డైరెక్టరు మాటిస్తే అప్పుడు శాంతించాట్ట. ఇంటికొచ్చేశాక అమ్మ చెప్పింది.

‘చివరికి నిద్రపుచ్చితే కాసేపు పడుకుని లేచాకగానీ దానికి హుషారు రాలేదు. అప్పుడు మళ్ళీ మేకప్ వేసి షూటింగు పూర్తిచేశారు. అప్పటికి రాత్రి ఏడయింది.

‘చెల్లాయి అమ్మదగ్గరికి రాగానే ఎన్ని ముద్దులు పెట్టాడో తను. అపుడు అందరూ తనమీద జోక్స్ వేస్తూ ఎట్లా నవ్వుకున్నారో. ఆ ప్రకటన చూసిన ప్రతిసారీ తనకి అదంతా గుర్తొచ్చి ఎంత ఏడుపొస్తుందో.

‘ఆ రోజు స్టూడియోలో చెల్లాయిలాగానే నటించడానికి వచ్చిన రకరకాల వయసులున్న నలుగురైదుగురు పిల్లల్ని చూశాడు తను. ఇంట్లో పనిచేసే పిల్లల్ని బాలకార్మికులంటారని నాన్న చెప్పాడు. మరి వీళ్ళనేమనాలి?

‘చిన్నపిల్ల చేత పనిచేయించుకోడం నేరమని వాళ్ళెవరి మీదో కేసు పెట్టారు కదా! మరి తాము చేసే పనేమిటో, దానివల్ల ఎవరెవరికి ఏమి లాభమో కూడా తెలియని చిన్నపిల్లల్ని ఏడిపించి బలవంతాన యాక్ట్ చేయించొచ్చా?

‘ఆ ప్రకటనలో చూపించిన వస్తువు తయారుచేసే కంపెనీ వాళ్ళకు ఎంతో లాభం వస్తుంది కదా?

చెల్లాయిని తీసుకెళ్ళి యాక్ట్ చేయించినందుకు నాన్నకు కూడా డబ్బిచ్చారు కదా? ఇది నేరం కాదా? ఆ కంపెనీ వాళ్ళమీదా, ప్రకటన షూటింగ్ చేసిన వాళ్ళమీదా, ఆఖరికి అమ్మా నాన్నలమీద కూడా కేసు పెట్టాలి.‘ కసిగా అనుకున్నాడు చింటూ.

న్యాయాన్యాయాల మధ్య సమన్వయం కుదుర్చుకోలేక, సమాధానం దొరకని ప్రశ్నల్ని అణిచిపెట్టుకోలేక చింటూకి ఉక్రోషం ముంచుకొచ్చింది. చేతిలోని రిమోట్‌ని బలంగా నేలకేసి కొట్టి చెల్లాయిని ఎత్తుకుని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

# ఏకైక అస్త్రం

కాశీభట్ల శశికాంత్

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**"ఇప్పుడే నారాయణరావుగారి** పాలేరు వచ్చి వెళ్ళాడు. మిమ్మల్ని ఒకసారి రమ్మని కబురు చేశారు" భర్త ఇంటికి రాగానే చెప్పింది అనిత

"ఎందుకో చెప్పాడా?" అడిగాడు శేఖర్

"అడిగాను.. మీతో ఏదో మాట్లాడాలట"

"సరే.. ఒకసారి వెళ్ళొస్తాను" బయలుదేరుతూ అన్నాడు.

"బాగుంది... భోజనం చేసి వెళ్ళండి, మళ్ళీ వచ్చేటప్పటికి ఎంత లేటవుతుమో... పిలిచింది పెద్దవాళ్ళుకదా"

"అదే నేనూ చెప్పేది.. ఎంతో ముఖ్యమైన పనైతేనేగానీ ఇలా కబురుపెట్టరు. ఒక్కపూటకి భోజనానికి లేటైతే పరవాలేదు. నువు నాకోసం ఆగకు" అని బయటకు నడిచాడు శేఖర్.

"నమస్కారం సార్" అన్నాడు శేఖర్ నారాయణరావుగారి వరండాలోకి అడుగుపెడుతూ. 'వీళ్ళకి ఇళ్ళుపట్టవేమో' అనుకున్నాడు నారాయణరావుగారిని నీడలా అంటిపెట్టుకుని ఉండే బృందం ఎప్పటిలాగే ఆయన చుట్టూచేరి కనబడేసరికి.

"రావోయ్. రా. ఏమిటి.. ఈ మధ్య కనిపించడంలేదు. స్కూల్ ఎలా నడుస్తోంది. ఇబ్బందులేమీ లేవు కదా" ఆప్యాయంగా పలకరించాడు నారాయణరావు.

"మీరుండగా మాకేం ఇబ్బందులుంటాయండీ" వినయంగా అన్నాడు శేఖర్

"అది నా బాధ్యత కాదూ.. ఏమైనా.. నా స్నేహితుడికొడుకువని చెప్పడం కాదుకానీ.. నువ్వీ ఊరికి టీచర్‌గా వచ్చిన దగ్గర్నుంచీ స్కూల్ ఒక దారిలో పడిందోయ్. ఇంతకు ముందు చేసిన వాళ్ళందరూ ఏదో.. ఉద్యోగం అవసరం కనుక వచ్చి మొక్కుబడిగా పనిచేసి వెళ్ళిపోయారు. నువ్వలా కాక. ఈ ఊళ్ళోనే సెటిలై స్కూలుని జాగ్రత్తగా చూసుకుంటున్నావు. నీకు ఇక్కడ కోరి పోస్టింగ్ వేయించినందుకు నా గౌరవం నిలబెట్టావు"

"అంతా మీ అభిమానం. మా నాన్నగారిచ్చిన ఇల్లు, పొలం వదిలి దూరంగా ఉండలేక ఇక్కడికి రావాలనుకున్నాను. మీ దయవలన ఆ కోరిక నెరవేరింది" అన్నాడు శేఖర్. కొద్దిసేపు అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

"శేఖర్ గారితో మాట్లాడాలని చెప్పారు కదా?" అందించాడు పక్కనున్న శంకరం.

"ఆ.. చూడవోయ్ శేఖర్... నీతో చిన్నపని పడింది" అన్నాడు నారాయణరావు

"చెప్పండి సార్"

"నేను ఫ్యాక్టరీ పెడుతున్న సంగతి నీకు తెలుసుకదా"

"విన్నాను సార్. ఎందరికో ఉపాధి కలిపించబోతున్నారని తెలిసి ఆనందించాను."

"మరి.. అంత మంచి పనికి ఉడతా భక్తిగా నువు కూడా ఒక చెయ్యి వెయ్యాలి" అన్నాడు నారాయణరావు. తాను చెయ్యగల సహాయం ఏమిటో అర్థం కాలేదు శేఖర్‌కి.

"దాందేముంది సార్.. నా చేతనైనదైతే తప్పకుండా చేస్తాను. ఊరికి మీరింత చేస్తున్నప్పుడు మాకు కూడా బాధ్యత ఉంటుంది కదా" అన్నాడు.

"కరెక్ట్‌గా చెప్పావోయ్.. అందుకే నువ్వంటే నాకు ఇష్టం. మన ఫాక్టరీ సైట్ నీకు తెలుసు కదా.. రైల్వే స్టేషన్ దాటాక" అన్నాడు నారాయణరావు. తెలుసన్నట్టుగా తలూపాడు శేఖర్.

"అన్నివిధాలా అనుకూలంగా ఉందని ఆ సైట్ డిసైడ్ చేశాను. ఇప్పుడో సమస్య వచ్చి పడింది. ఫాక్టరీ సైట్ నుంచి తూర్పు వైపున్న పెద్దరోడ్‌కి కలపాలంటే పొలంలోంచి ఎప్రోచ్ రోడ్ వెయ్యాలి. మొదట్లో వెంకట్రావు దానికి ఒప్పుకున్నాడు. బేరం కూడా కుదిరింది. ఆ రాముడున్నాడుగా.. వెంకట్రావుని ప్రలోభపెట్టాడు. దాంతో వెంకట్రావు అడ్డం తిరిగాడు. నా ఫాక్టరీ రాకుండా చెయ్యాల్ని తెగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అది అతని వల్ల ఎలాగూ కాదనుకో. కాకపోతే ఇలాంటి తల నొప్పులు తీసుకొస్తాడు. సరే... అది వదిలేయ్. ఇంక.. మరొక పక్క గుడి, దానిని ఆనుకుని రాయుడి పొలాలు. ఇంకోపక్క రైల్వే ట్రాక్ ఉండనే ఉంది. ఇంక మిగిలిందల్లా నీ పొలం" అని ఆగాడు.

శేఖర్‌కి విషయం అర్థమైంది. కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు.

"నీ పొలంలోంచి అడ్డరోడ్డుకి అప్రోచ్ రోడ్ వేసుకోవడమే దీనికి పరిష్కారం" అని నారాయణరావు మళ్ళీ గేప్ ఇచ్చాడు ఈ నాన్పుడు భరించలేకపోతున్నాడు శేఖర్.

"ఆ అప్రోచ్ రోడ్డు కోసం మీ పొలంలో కొంత ముక్క వదిలేకన్నా మీ రెండెకరాలు ఫాక్టరీ సైట్‌కి కలిస్తే ముమ్ముందు రాబోయే అవసరాల దృష్ట్యా బాగుంటుందని అయ్యగారి ఆలోచన." అని ముగించాడు శంకరం.

"నాకు ఉన్నదే ఆ రెండెకరాలు. అదెలా వదులుకోగలను?"

"కంగారు పడకోయ్.. ఫాక్టరీలో పెట్టి ఎందరికో ఉద్యోగాలు ఇవ్వాలనుకునేవాడిని... నీ గురించి ఆలోచించకుండా ఉంటానా. ఆ పొలం నాకు ఇచ్చేసినందుకు గాను... బదులుగా.. రెండు పద్దతులు చెబుతాను. నీకు అనుకూలంగా ఉన్నదే ఎంచుకో. మొదటిది.. నువ్వీ ఊళ్ళోనే సెటిలవడానికి భూమిమీద నీకున్న మమకారమే కారణం కనుక నీ పొలానికి బదులుగా శివాలయం అవతల ఉన్న నా రెండెకరాలు నీకు ఇస్తాను."

"ఆ పొలమా..!?" నిర్ఘాంతబోతూ అన్నాడు శేఖర్.

నారాయణరావు ఒక్కసారి ఉరిమి చూసి అంతలోనే తమాయించుకున్నాడు.

"భలేవాడివోయ్ శేఖర్... అదేమన్నా తీసిపోయిందా.. సరే.. అంత వద్దనుకునేవాడికి పొలం ఎందుకుగానీ రెండోపద్దతి అన్నారుగా అదికూడా చెప్పండి" అన్నాడు శంకరం.

"అలా అన్నావు బాగుంది.. ఎకరానికి లక్షచొప్పున ఇస్తాను. పొలం వదిలేయ్" అన్నాడు నారాయణరావు తాపీగా కుర్చీలో వెనక్కివాలి కూర్చుంటూ. శేఖర్ తల తిరిగిపోయింది.

"అది మా నాన్నగారిచ్చిన పొలం. దానిని ఎప్పటికీ అమ్మకూడదనుకున్నాను... నన్ను క్షమించండి సార్" వినయంగా అన్నాడు శేఖర్.

"ఊరికి మంచి చెయ్యాలని నిన్నిలా అడుగుతున్నాను కానీ నాకెందుకయ్యా నీ బోడిపొలం. మా పెద్దలు దానం చేసిన వాటిలో ఇది ఎన్నో వంతు" కోపంగా అన్నాడు నారాయణరావు.

"అయ్యా.. మీరు ఉండండి.... శేఖర్.. అమ్మకూడదు అని నిర్ణయించుకోవడానికి మనమేమైనా జమిందార్లమా. నీకు ఇద్దరూ కూతుళ్ళేకదా. రేపొద్దున్న వాళ్ళ పెళ్ళిళ్ళకోసమైనా అమ్మక తప్పదు కదా.. అదేదో.. ఒక మంచి పనికోసం ఇప్పుడే అమ్ముతున్నాననుకో.. ఒకవేళ అయ్యగారు చెప్పిన రేటు నీకు కష్టంగా తోచిందనుకో.. ఆ మాటే చెప్పు. ఆయనేమైనా పరాయివారా.. మన మంచికోరే మనిషి" అన్నాడు శంకరం.

"దాందేముంది.. ఎకరానికి ఇంకో ఏభైవేలిస్తాను. మొత్తం మూడు లక్షలు. ఆ రేటుకేగా ఈ మధ్య వెంకటేశ్వర్లు పొలం అమ్మింది"

"ఇలా అంటున్నందుకు క్షమించండి, ఆ పొలానికి, నాదానికి సాపత్యం ఏముంది.. నాది చెరువు పక్కపొలం"

"బాగుందోయ్ నువ్వు చెప్పేది. చెరువు కిందపొలమైతే నాకేమిటి ఒరిగింది. దాంట్లో నేనేమైనా వ్యవసాయం చెయ్యబోతున్నానా?"

గట్టిగా నవ్వుతూ అన్నాడు నారాయణరావు. ఆయన నవ్వితే తాము కూడా నవ్వడం రివాజు కనుక శేఖర్ తప్ప అందరూ నవ్వేశారు.

"భూమి విలువ నిర్ణయించబడేది దానికున్న వసతులను బట్టీ.. వాడుకునే అవసరాన్ని బట్టీ" లోపల అనుకుంటున్నాననుకుని పైకే అనేశాడు శేఖర్.

"భలే అడిగావోయ్ పంతులూ.. నీకు వివరంగా చెప్పాలంటే... ఆ.. ఎవర్నో ఎందుకు.. ఉదాహరణకి నిన్నే తీసుకో... నువ్వు ఇంగ్లీషు బాగా మాట్లాడతావట... బోలెడు పుస్తకాలు చదివావట.. మా మేష్టారికి తెలియని విషయం లేదు అంటారు పిల్లలు.. ఏవో కథలు అవీ గిలుకుతుంటావని మనవాళ్ళు అంటూ ఉంటారు.. మరి నీకు.. నువ్వు ఏ పనికి ఉపయోగపడుతున్నావో దాని ప్రకారం జీతమిస్తున్నారా? లేక.. పంతులుగారి దగ్గర చాలా విద్యత్తుందని.. ఎక్స్ట్రా ఏమైనా ఇస్తున్నారా?"

"అబ్బబ్బబ్బ... ఏం అడిగారండీ.. ఏ అసెంబ్లీలోనో.. పార్లమెంటులోనో వదలాల్సిన ప్రశ్నలాంటిది వదిలారు.... పిచ్చుక మీద అదేదో అంటారే.. అలా పడింది. శేఖర్ .. ఇంక ఆర్గ్యుమెంటేముంది.. అయ్యగారు చెప్పినట్టు కానిచ్చేయ్."

"క్షమించండి సార్. రేపు నా పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలంటే అదే ఆధారం. దానిని నేను అమ్మలేను" అని లేచి నమస్కారం పెట్టాడు శేఖర్.

"మాటల మధ్యలో లేచిపోయావంటే.. ఏమిటి నీ ఉద్దేశ్యం?" తీవ్రంగా అన్నాడు నారాయణరావు

"అయ్యా.. ఒక్క క్షణం. శేఖర్.. ఇలారా" అని శేఖర్ భుజం మీద చెయ్యివేసి పక్కకి తీసుకువెళ్ళాడు శ్రీను.

"నీకేమైనా మతిపోయిందా.. ఆయన సంగతి తెలుసుండే మొండికేస్తున్నావు" మందలింపుగా అన్నాడు శ్రీను.

"అలా అని .. పదిలక్షలు చేసే పొలాన్ని మూడులక్షలకి ఎవడిస్తాడు? అయినా.. అమ్మను బాబో అంటే ఈ బలవంతం ఏమిటి?"

"నువ్వు ఎన్ని చెప్పినా ఆఖరి నిర్ణయం వాళ్ళదే. మనం చెయ్యగలిగిందల్లా వీలైనంత సంపాదించుకోవడమే. మనకి చిన్నప్పటినుంచీ ఉన్న స్నేహం వలన నేను నీకు చెయ్యగల సహాయం ఒకటే.. నాలుగు లక్షలు ఇప్పిస్తాను... సరేనా"

"ఇదా నువ్వు చేసే గొప్ప సహాయం. నాకే బేరాలేం వద్దు. నన్ను వదిలేయండి"

"శేఖర్.. ఈ మొండితనం వదులుకోకపోతే తర్వాత విచారించినా లాభంలేదు. ఇంతకన్నా వివరంగా చెప్పలేను.. అర్థంచేసుకో"

"ఏం.. బెదిరిస్తున్నావా? ఎన్ని అన్యాయాలు చేసినా తనకి ఉన్న ధనబలం, అధికారబలంతో ఆయన చట్టం నుంచి తప్పించుకోవచ్చు. కానీ.. న్యాయం, ధర్మం అనేవి ఉన్నాయి. నాకు అన్యాయం తలపెడితే.. ఇంతకింత అనుభవిస్తాడు" ఉక్రోషంగా అన్నాడు శేఖర్.

"పిచ్చివాడా.. ధర్మాధర్మాలు.... మంచీ చెడు అనేవి మనలాంటి వాళ్ళమీదే తప్ప జమిందార్ల మీద ప్రభావం చూపించవు. ఆ మహాసముద్రంలో ఒక కోటి రావచ్చు.. పోవచ్చు.... తేడా పెద్దగా ఉండదు. నువ్వింకేం మాట్లాడకుండా వారిచ్చింది పుచ్చుకుని పొలం రాసిచ్చేయ్" నెమ్మదిగా అని "అయ్యా.. శేఖర్ ఒప్పుకున్నాడండీ" అని నారాయణరావుగారితో గట్టిగా అని, నెమ్మదిగా చెవిలో ఏదో చెప్పాడు శ్రీను.

"ఓస్.. దాందేముంది.. అలాగేనయ్యా శేఖర్ శ్రీను చెప్పినట్టే చేద్దాం. ఎల్లుండి మంచిరోజు.. రిజిస్ట్రేషన్ పెట్టుకుందాం. శంకరం.. గుమస్తాని పిలు.. ఎడ్వాన్సు ఇచ్చి సంతకం పెట్టించుకోండి. పాపం మళ్ళీ మళ్ళీ ఏం తిరుగుతాడు"

"అయ్యా నేను చెప్పేది కూడా.." ఇంకా అనబోతున్నాడు శేఖర్.

"ఏం.. నెమ్మదిగా మాట్లాడుతున్నాననా.. నా సంగతి నీకు పూర్తిగా తెలియదు. మారు మాట్లాడకుండా ఇచ్చింది పుచ్చుకుని సంతకం పెట్టు" తీవ్రంగా అన్నాడు నారాయణరావు.

"నారాయణరావుగారు ఎందుకు పిలిచారు?" ఇంటికి వచ్చిన భర్తను ఆత్రుతగా అడిగింది అనిత. శేఖర్ మౌనంగా లోపలికి వచ్చి కూర్చున్నాడు. అతని వాలకం చూసి అనిత కంగారుపడింది.

"మిమ్మల్నే.. ఏం జరిగింది?"

"ఈ డబ్బు బీరువాలో పెట్టు" ఒక కవర్ ఆమె చేతికిచ్చి అన్నాడు శేఖర్

"ఏమిటిది.. అమ్మో.. ఇంత డబ్బుందేమిటి?"

"పొలం అమ్మేస్తున్నాను.. ఇది ఎడ్వాన్సు"

"ఏమన్నారు.. పొలం అమ్మేస్తున్నారా.. ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది... అదీ చెప్పాపెట్టకుండా ఇంత సడన్‌గా అసలు అమ్మాలని ఎందుకు అనుకున్నారు?" అయోమయంగా అంది అనిత.

"పిచ్చిదానా.. మనం అమ్మాలనుకోనక్కరలేదు... నారాయణరావుగారిలాంటివాళ్ళు కొనాలనుకుంటే చాలు. రేటు, ఎడ్వాన్స్ వారే డిసైడ్ చేస్తారు. వాళ్ళు చెప్పినప్పుడు వెళ్ళి సంతకాలు పెట్టడం తప్ప ఇంకే బాదరాబందీ మనకి ఉండదు."

"అది మన పొలం.. ఆయనకేం హక్కుంది దానిమీద.. వాళ్ళ తాతలు దానం చేసిన పొలమేం కాదు.. అమ్మను అని ఖచ్చితంగా చెప్పకపోయారా? రేపు పిల్లల పెళ్ళిళ్ళు ఎలా చేద్దామనుకుంటున్నారు?"

"రేపటి గురించి ఆలోచించే స్థితిలో నేను లేను"

"ఏం... బెదరించాడా..? ఇంకా ఆయనేదో మంచి మనిషి అనుకుంటున్నాం"

"అది ఆయనలో నువ్వు ఇప్పటిదాకా చూసిన ఒక కోణం. ఆయనలోని మరో కోణం చూసిన నరసింహం ప్రస్తుతానికి భూమిమీద లేడు."

"మీ నాన్నగారు ఆయనకి అంత స్నేహితులు కదా?"

"వాళ్ళ ప్రయోజనాలకి అడ్డురానంతవరకే ఏ బంధాలైనా. పోలీసులు, కోర్టులు వాళ్ళనేం చెయ్యలేవు. నారాయణరావుని అడ్డుకోగలవాడు రాయుడొక్కడే.. వాడింతకన్నా దుర్మార్గుడు. మన ఖర్మ ఇంతే అనుకోవడమే" బాధగా అన్నాడు శేఖర్.

తలుపు దబదబ బాదిన చప్పుడుకి అనితకి మెలుకుఅ వచ్చింది. అప్పుడే తెల్లవారిందా అనుకుని గడియారం కేసి చూసింది. ఇంకా అయిదు కూడా కాలేదు. ఈ టైములో ఎవరొచ్చి ఉంటారా అనుకుని మంచం దిగింది. మళ్ళీ తలుపులు బాదిన చప్పుడు వినబడింది. శేఖర్ తలుపు తియ్యడానికి వెళ్ళాడు. అనిత గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

"నువ్వా... ఏమిటి ఈ టైములో వచ్చావు"

"మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారు"

"ఈ టైములోనా...ఎందుకు?"

"ఏమోనండి.. నాకు తెలీదు"

"సరే వస్తున్నాను.. ఉండు" అని లోపలికి వచ్చాడు శేఖర్

"నారాయణరావుగారింటి నుంచి వచ్చాడు. అర్జంటుగా తీసుకురమ్మన్నారట"

"ఎందుకు పిలిచి ఉంటారు? నాకు ఎందుకో భయంగా ఉంది"

"భయం ఎందుకు. మనం వాళ్ళమాటని కాదని అనలేదుగా"

"ఆ పొలం సంగతి మీరు ఎవరి దగ్గరైనా ఏమైనా అన్నారా.....? అది తెలిసి.. ఆ కోపంతో..."

"అదేం అయ్యుండదు. నువ్వు ఖంగారుపడకు" అని లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని డ్రస్ వేసుకుని వచ్చాడు శేఖర్.

"వాళ్ళేం చెప్పినా ఎదురు చెప్పకండి.. ఎవరినైనా తోడు తీసుకు వెళ్ళరాదా.. పోనీ నేను రానా"

ఆమె అమాయకత్వానికి నవ్వుకుంటూ అతను బయటకి నడిచాడు. భర్త వీధి మలుపు తిరిగేవరకు చూసి లోపలికి వచ్చి తలుపు వేసుకుంది. ఆమెకి మనసు మనసులో లేదు. ఎప్పుడే వార్త వినవలసి వస్తుందో అని బిక్కుబిక్కుమంటూ కూర్చుంది. శేఖర్ పైకి నెమ్మదస్తుడిలా ఉంటాడు కానీ ఒక్కొక్కసారి ఉక్రోషంతో ఎంతటి మాటైనా అనేస్తాడు. ఎవరి దగ్గరో నారాయణరావుగారిని ఏదో అనే ఉంటాడు. అది తెలిసి పిలిపించలేదుకదా. దానికి ఈ టైములో ఎందుకు పిలిపిస్తారు. ఆమె రకరకాల ఆలోచనలతో కొట్టుకుపోయింది.

తలుపు చప్పుడికి ఉలిక్కిపడి తలుపు తీసిన అనిత వీధిలో భర్తని చూసి తేలికగా ఊపిరి పీల్చుకుంది.

"ఏం జరిగింది?" ఆత్రుతగా అడిగింది

"జరగాల్సిందే జరిగింది" మామూలుగా అనడానికి ప్రయత్నించాడు శేఖర్.

"అసలు ఎందుకు పిలిపించారు?"

"ఆ అవసరం వచ్చింది.. కాదు వచ్చేలా చెయ్యగలిగాను. ఎస్... నేనే చెయ్యగలిగాను" అన్నాడు గట్టిగా. అణిచిపెట్టుకున్న ఉత్సాహం అతని మొహంలో ప్రతిఫలిస్తోంది.

"కోట్ల ఆస్థి.. రాజకీయ బలం... పలుకుబడి.. అంగబలం.. అటువైపు.. ఆఫ్టాల్ టీచర్ని.. ఒంటరివాడిని.. ఇటువైపు.. ఒకేఒక్కమాటతో.. కాళ్ళబేరానికి" అని గర్వంగా నవ్వాడు.

"మీరు అంతున్నదేమిటో నాకు అర్ధం కాలేదు"

"నిన్న హుంకరించిన నోరు ఇప్పుడు మాట్లాడలేదు. ఉరిమి చూసిన కళ్ళు బేల చూపులు చూస్తున్నాయి. మన కళ్ళల్లో తిరిగిన నీరు మన ఇంట్లో రాజ్యం చేసిన విషాదం ప్రస్తుతం అక్కడ తిష్ఠ వేశాయి. పాపం... శరీరంలో ఎడమభాగం అంతా.. నారాయణరావుగారు ఇంక మంచంలోనే. అందరూ బెంబేలెత్తిపోయారు. నేను.... నేను.. శాపం వెనక్కి తీసుకోవాలట" పగలబడి నవ్వుతూ అన్నాడు శేఖర్.

"శాపం ఏమిటి" ఆశ్చర్యంగా అడిగింది అనిత.

"ఏదో ఉక్రోషంతో అన్నాను.. కానీ వాళ్ళలా అనుకోవడం లేదు. వాళ్ళేకాదు కొద్దిసేపట్లో ఊరు ఊరంతా నీ భర్త నోటి మహిమను గురించి చర్చించుకోబోతోంది."

"జరిగిన దానికి మీరు ఆనందిస్తున్నారా?" భర్త మనస్తత్వం తెలిసిన ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"మనం చాలా సామాన్యులం అనితా. ఆయుధాలతో తిరగబడలేం. కోర్టుకెక్కి నెగ్గుకురాలేం. పాముకాటుకి భయపడి రాయుడిలాంటి గద్దకి ఆహారంగా వెళ్ళలేం. చాలా సామాన్యులం. తన మీద బాణాలు వేస్తున్న వేటగాడు పాముకాటుకి నేలకూలితే సంబరపడే లేళ్ళలాంటి వాళ్ళం. వేటగాడి మేలుకోరి ప్రార్థించే మహాత్ములం కాదు. నాకు ఇప్పుడు ఒక కోరిక కలుగుతోంది. మనలాంటి వాళ్ళకి నిజంగానే శాపం పెట్టగల శక్తి ఉంటే ఎంత బాగుంటుంది.

బక్కవాళ్ళకి, దగా చెయ్యబడుతున్నవాళ్ళకి.. ఈ పోలీసులు, చట్టాలు కేవలం తమ రక్షణకే ఉన్నాయని భ్రమపడుతున్న అమాయకులకి.. సమ్మెలు, బందులు, వాకౌట్లు తమ మంచికోసమే అని నమ్మే మూర్ఖులకి.. దేవతా వస్త్రాలలాంటి సమాజ రక్షణ కవచం మీద మితిమీరిన నమ్మకాన్ని పెంచుకుని ఆదమరిచి నిద్రించేవారికి.. ఆ అస్త్రం ఒక్కటే ఉంటే చాలు ఏ చట్టం ఇవ్వలేని రక్షణని అది ఒక్కటే ఇస్తుంది. ఉన్నది కాస్తా కోల్పోయి కడుపు మండితే వాడు శాపం పెడతాడు అనే భయం ఒకటే చాలదూ నారాయణరావు, రాయుడిలాంటి వాళ్ళ పొగరుకి కళ్ళెం వేయడానికి" ఆవేశంగా అన్నాడు శేఖర్.

## నేనెవరితో చెప్పుకోను? డా.కె.వి.ఎస్.జ్ఞానేశ్వర రావు

**గంగాధరం** యూనివర్సిటీలో పాలిటిక్స్ ప్రొఫెసరు. అతనికి రాజకీయ రంగంలో పలుకుబడి ఎక్కువ. ఎంతోమంది ఉద్దండపిండాలు ఆయనచుట్టూ గింగిరాలుకొట్టి సలహాలకోసం ప్రదక్షిణలు చేస్తూ పడిగాపులుపడి ఉంటారు. అతని పట్టు అలాంటిది. వాళ్ళలో కేంద్ర, రాష్ట్రమంత్రులు కూడా ఉంటారంటే అతనెంతటి మేధావో అంచనా వెయ్యొచ్చు.

ముఖ్యంగా ఎన్నికల సమయంలో అతనికి తీరికే ఉండదు. కింగ్‌మేకర్లు కూడా బుర్రలు బద్దలుకొట్టుకునే విషమసమస్యల్ని అతను అవలీలగా సాధించి హితోపదేశం చేసి, మార్గనిర్దేశం చేస్తాడు. నియమబద్ధుడై ఎవరినీ 'దేహీ' అని యాచించక పోయినా, ఎవరికి తోచిన పద్ధతిలో వాళ్ళు ద్రవ్యరూపేణాగాని, మాటసాయంగాగాని అతనికి ఉపకరిస్తూనే ఉంటారు. అతని ప్రజ్ఞాపాటవాలని అందరూ కథలు కథలుగా చెప్పుకుంటారు.

ఇంట్లో మాత్రం అతను చండశాసనుడు. అందరూ అతని కనుసన్నలలో మెలిగేవారే. అతనిని ఏమి అడగాలన్నా గడగడా వణికిపోతారు. భార్యకిగాని, పిల్లలకిగాని అతనివద్ద ఏమాత్రమూ చనవు లేదు. అసలతనికి వాళ్ళతో మాట్లాడేందుకు కూడా సమయమే

చిక్కదు. అడపాదడపా సెమినార్లకీ, కాన్ఫరెన్స్‌కీ వెళ్ళివస్తుంటాడు. యూనివర్సిటీ కమిటీల్లో సలహాదారుగా ఎన్నో మీటింగులకి వెళ్ళక తప్పదు. అంతేకాక ప్రశ్నపత్రాలు పంపుతాడు. థీసిస్‌లు ఇవాల్యుయేట్‌చేసి రిపోర్టులు పంపుతాడు.

నగరానికి ఏ మినిస్టరు వచ్చినా తప్పనిసరిగా ఈయనకూడా అతని కోటరీలో ఉండి తీరాల్సిందే ఈ పనులన్నిటితో సతమతమౌతూ కూడా గ్రంథ రచన చేస్తాడు. పత్రికలకి సమీక్షలూ, వ్యాసాలూ రాస్తాడు. ఇవికాక లక్షాతొంభై స్థానిక సంస్థల్లో ఉపన్యాసాలు ఇస్తూ ఉంటాడు.అతనికి కీర్తి కండూతి మహా జాస్తీ. పొగడ్తలకి కరిగి పోతూ ఉంటాడు. కాని చేతిలోంచి ఎర్రని ఏగానీ రాలదు. అంతా శుష్కప్రియాలు-శూన్యహస్తాలు. అందరికీ అరచేతిలో వైకుంఠం చూపిస్తాడు. ఆయన వెంట చుట్టూ కూడా తిరిగే వందిమాగధులు ఎంతోమంది ఉన్నారు. పేరున్న ప్రతీ వ్యక్తి దగ్గరా ఇలాంటివాళ్ళు తరచూ కనిపిస్తూ ఉంటారు.వాళ్ళు పెత్తనం చేతిలోకి తీసుకుని ఆయనా తామూ 'మమేకం' అని ప్రచారం చేసుకుంటూ ఉంటారు.

ఇది ఇలా ఉండగా మంచి ఎలెక్షన్ టైము వచ్చింది. తమాషా ఏంటంటే ప్రత్యర్థులుగా ఉన్న ఇరు వర్గాలవారూ ఆయన సలహా కోరి వస్తారు. ఆయన ఎవరినీ నిరుత్సాహపరచడు.

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి
అన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక... ... ...

తగిన సలహా చెప్పి పంపేస్తూ ఉంటాడు. బాగా లౌక్యం తెలిసిన మనిషి. అందువల్ల అతనికి విరోధులే లేరు. అంతా ఆప్తులే. అటువంటి రసకందాయం వేళలో ఊహించని పరిణామం అతడిని కుదిపివేసింది.

అతని వియ్యంకుడు హైదరాబాదులో ఇల్లు కట్టుకుని ఇతగాడిని గృహప్రవేశానికి ఆహ్వానించాడు. తప్పదుగాబట్టి ములగానాం తేలానాం ఎన్ని పనుల్లో కూరుకుపోయినా వైజాగునుండి పెకలించుకుని ఫామిలీతో వెళ్ళి వచ్చాడు. కాని ఆ భవనాన్ని చూసి వచ్చినప్పటినుండీ అతనిలో ఏదో తెలియని ఆరని చిచ్చు చెలరేగింది. ఇంకా తాను అద్దె కొంపలోనే ఉంటున్నందుకు, సొంత ఇల్లు కట్టుకోనందుకు అతడు పొర్లి పొర్లి పొగిలి పొగిలి కుమిలిపోయాడు. తన చుట్టూ ఎన్నేళ్ళనుండీ ఎంతమంది ఇళ్ళు కట్టుకోవడంలేదు? తాను ఇంత మూఢత్వంలో ఎందుకు మునిగిపోయినట్టు? థాంక్ గాడ్! ఇప్పటికైనా కళ్ళు తెరుచుకున్నాయి.(మనలో మన మాట. పెళ్ళాం చెవిలో ఇల్లుకట్టుకుని పోరినా ఎప్పుడైనావినిపించుకుని ఏడిస్తేనా? 'బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్')

అతనికి లేదా పోదా? రాజు తలుచుకుంటే దెబ్బలకి కొదవా? లేడికి లేచిందే ప్రయాణం అన్నట్లుగా తన పరపతితో స్థలం సంపాదించి సొంత భవన నిర్మాణం ప్రారంభించాడు. వాస్తు వగైరా జాగ్రత్తలు పాటించి మంచి ఆర్కిటెక్టుని సంప్రతించి ఆరునెలల్లో పని పూర్తి చేయించి తాను కలలు కన్న ఇంట్లో ప్రవేశించాడు. విదేశాల్లో ఉన్న నాకు కూడా గృహప్రవేశ ఆహ్వానం పంపించాడు మరిచిపోకుండా. తర్వాత ఏడాదికి గాని ఇండియా వచ్చేందుకు నాకు తీరలేదు. ఈలోగా వాడితో మాట్లాడేందుకు కూడా నాకు కుదరలేదు. విశాఖపట్నం రావడానికి మరో పదిరోజులు పట్టింది. మా మిత్రులద్వారా వాడి కాలికి చిన్న ప్రమాదం జరిగి ఒక కార్పోరేట్ ఆస్పత్రిలో ఉన్నట్లు తెలిసింది. హుటాహుటిన అక్కడికి వెళ్ళి వాడిని పరామర్శించాను. ఇంకో ఆశ్చర్యకరమైన వార్త. వాడు స్వంత ఇంట్లో దిగి పట్టుమని పదిరోజులైనా తిరగకుండా ఇంటిని అద్దెకి ఇచ్చి సిటీ సెంటరుకి వెళ్ళిపోయాడని!!! అంత మనసుపడి కట్టించుకున్న ఇల్లు వదిలి ఎందుకు పొయాడు? ఇంటిని అద్దెకి ఇవ్వాల్సిన ఖర్మ వాడికేం పట్టింది?

నేను వెళ్ళేసరికి అదృష్టం కొద్దీ దగ్గర ఎవరూలేరు. నాతో తెచ్చిన పళ్ళు పక్కన పెట్టి ప్రశ్నల వర్షం గుప్పించాను. సమాధానంగా వాడి మొహంపై శ్రావణ మేఘాలు కమ్ముకున్నాయి. దిగ్గజాల్ని గజగజలాడించే మొనగాడు అలా డీలా పడిపోవడం చూసి నాకు నోట మాట రాలేదు. వాడికి గతం గుర్తుకు వచ్చినట్లుంది. స్వంత ఇంట్లో దిగిన వారం రోజులకే భార్యతో జరిగిన సంభాషణ.

'నాకు ఇక్కడ ఏమీ బాగాలేదు.మన అబ్బాయి కొన్న ఎపార్టుమెంటులోకి వెళ్ళిపోదాం. నా ఫ్రెండ్సంతా అక్కడే వున్నారు. మీ కోసం వచ్చే వాళ్ళతో ఇల్లు ఎప్పుడూ కలకలలాడేది. ఇక్కడ నాకేమీ తోచదంలేదు' భార్య తన ఉద్దేశ్యం వెల్లడించింది.

'అదేం మాట? నేను ఎక్కడ వుంటే జనం అక్కడికే వెతుక్కుంటూ వస్తారు. రెండు రోజులు పోతే ఇక్కడ కూడా నీకు ఫ్రెండ్స్ ఏర్పడుతారు. అప్పుడు గతంలో మన నివాసాన్ని నువ్వు మరిచిపోతావు. ఐనా ఇక్కడ నీకు ఏం తక్కువైంది? ఊరికి దూరంగా చక్కటి డెవలపింగ్ లొకాలిటీ. కొండచరియలో దట్టమైన వృక్షాలమధ్య చక్కటి ఉద్యానవనాలు. విశాలమైన రోడ్లు. వర్షం వస్తే చుక్క నీరు కూడా నిలవదు. బస్టాండు, రైల్వేస్టేషనూ, ఎయిర్ పోర్టుల రొదలూ సిటీబస్సుల రణగొణధ్వనులకి సుదూరంగావున్న ఈ ప్రాంతం ప్రశాంతంగా ఋషివాటికలాగా ఉంటుంది. ఇకపై మనం ఆధ్యాత్మికంగా కూడా దృష్టి సారించవచ్చు.'

'ఆపుతారా? మనకి ఏమంత వయసు ముదిరిపోలేదు. మనిషి అలికిడి లేకుండా భరించలేని నిశ్శబ్దం. పట్టపగలు దొంగలు దోచుకున్నా విని రక్షించే దిక్కులేదు. విసిరేసినట్టు అక్కడో కొంపా అక్కడో కొంపానూ. హాకర్లూ, ముష్టివాళ్ళూకూడా రా వెరచే ప్రదేశం.చీకటిపడితే జుట్టువిరబోసుకున్న దెయ్యాల్లా జీబూతాల్లాంటి చెట్లు. మీ కొండమీంచి కోతులూ, కొండముచ్చులూ, ఎలుగుగొడ్లూ కూడా పెరట్లోకి దిగిపోతాయి. ఇక పాములూ తేళ్ళ సంగతి వేరే చెప్పాలా? మీరు వెయ్యిచెప్పండి-లక్షచెప్పండి.నేను ఇకమీదట ఒక్క క్షణంకూడా ఇక్కడ ఉండేదిలేదు. మీకు ఇష్టమైతే రండి. లేకపోతే ఇక్కడే కొంగజపం చేసుకుంటూ కూర్చోండి'.

ఎన్నడూ ఎదిరించని భార్య మొండికేసి భద్రకాళి అవతారందాల్చి రంకెలేస్తుంటే ఆయన నిర్ఘాంతపోయాడు. అతను ఎన్నడైనా ఎవరినైనా వాళ్ళ మనసులో మాట కనుక్కున్న పాపానపోయాడా?

'అదేమిటే? అలాగంటావూ? నీకోసం చక్కటి బంగళా కట్టించాను. ఈ వైభోగం వదిలేసి పీతబొక్కలాంటి ఎపార్ట్ మెంటుకి పోతానంటావేంటి?అందునా అది స్టేట్స్‌లోవున్న మన అబ్బాయి కొనుక్కున్నది కదా? వాడు ఫామిలీతో వచ్చేస్తే అందరికీ అది ఏం సరిపోతుంది? అప్పుడు మనం ఎక్కడికి పోతాం?'

'అదంతా నాకు తెలీదు. మీరు నాతో వస్తున్నారా లేదా? '

గతం బుర్రలో సినిమారీలులా తిరగ్గానే కళ్ళనీళ్ళపర్యంతం అయ్యాడు గంగాధరం. వాడి దుస్థితిచూసి నేనే అడిగాను.

'ఎలాంటివాడివి ఎలా ఐపోయావురా? సింహంలాగా ఢిల్లీ సింహాసనాన్నే కదిలించే శక్తిగా ఎదిగిన నువ్వు నోరుమూసుకుని ఆవిడ ఆజ్ఞ శిరసావహిస్తున్నావంటే త్యాగరాజస్వామి మాట... ... ఎంతవారలైనా కాంత దాసులే... ... అన్నది అక్షరసత్యమని తోస్తోంది'.

'ఒరే-చచ్చిన పామునే కొట్టకురా! ఇంటిగుట్టు లంకకు చేటు. నేను ఎక్కడైనా కింగునేకాని ఇంట్లోకానని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ఆవిడని చూసి పిల్లలుకూడా నామాట వినడం మానేశారు. నేనెవరితో చెప్పుకోను? '

'అందుకే అన్నారు పెద్దలు-తాడి తన్నేవాడి తలతన్నేవాడుంటాడని! ఇంటగెలిచి రచ్చగెలవమంటారు. ఐనా భార్యాభర్తల మధ్య గెలుపోటముల ప్రసక్తేలేదు. శేషజీవితం హాయిగా గడుపు.

తనసంతోషమె స్వర్గము

తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!

అని శతకకారుడు ఏనాడో చేప్పాడు. ఇకమీదట పరాయివాళ్ళకి సలహాలివ్వడం మానుకుని సొంత సంసారంపై దృష్టిసారించి ప్రశాంతత లభించే మార్గాన్ని ఎన్నుకో.'

'అంతేనంటావా? '

'అక్షరాలా అంతే! '

వాడిని ఆ స్థితిలో చూడలేక లేచి చక్కావచ్చాను.

# డామిట్ డా.గాయత్రీ దేవి

**పవన్ కుమార్** చిన్నప్పుడు, వాళ్ళ బామ్మ.. "మగ వెధవలకేముందిరా.. గోచీ గుడ్డపెట్టుకున్న వాడికయినా బోలెడు కట్నాలు పోసి, పచ్చని పసిమిఛాయతో బంగారు బొమ్మల్లా ఉండే పిల్లని కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తారు.. నా మనవడు రాజకుమారుడు. వాడికి పెళ్ళాంగా రాజకుమార్తే వస్తుంది." అంటుండేది. మా బామ్మ మాట బంగారు మాట, తిరుగులేని రామబాణం లాంటిది అనుకుని తెగ సంబరపడిపోతుండేవాడు పవన్ కుమార్.

పవన్‌కి పెళ్ళి

బోలెడు కట్నం...

చూడచక్కని హీరోయిన్ లాంటి అమ్మాయి.. బాపూ బొమ్మలాంటి అమ్మాయి.. బంగారు బొమ్మలాంటి అమ్మాయి.

'పోస్ట్ గ్రాడ్యుయేట్' బ్యాంక్‌లో ఉద్యోగం..

పవన్ అంటే ఆ పావనికి (అతని ఉద్దేశ్యంలో... పవన్ భార్య పావని అన్నమాట,) పరమ ప్రేమ...

పొద్దున్నే లేచి గబగబా తలంటు పోసేసుకుని, దేవుడికి దీపం పెట్టేసుకుని.. కాఫీ కాచేసి, తడి జుట్టుతో చక్కని కుంకుంబొట్టుతో, కళ్ళనిండా కాటుకతో, చేతిలో కాఫీ కప్పుతో, బెడ్ రూంలోకి వచ్చి, పవన్ కుమార్‌ని గోముగా, ప్రేమగా చిలిపిగా.. నిద్రమేల్కొలిపి, అతనందించేవి పుచ్చుకుని, తను కాఫీ అందించి,

పళ్ళుతోముకోవడానికీ, ఒళ్ళుతోముకోవడానికీ, తుడుచుకోవడానికీ, లోపలా బయటా వేసుకోవడానికీ అందించి, తలదువ్వి, గుండెల మీద ఉన్న చొక్కాకి ఊడిన గుండీలు కుట్టి,

ఈ మధ్యలో అతనికి ఇష్టమయిన పూరీ కూర చేసేసి వేడివేడిగా తినిపించేసి, వెళ్ళను అని మారాం చేస్తుంటే, గారాంగా బతిమాలి, ఎన్నో హామీలూ, ముద్దులు ఇచ్చేసి, టాటా చెప్పి పంపించి...

తరువాత తను తినడానికి టైం లేక గబగబా, కాస్తంత నోట్లో కుక్కుకుని, ఆదరాబాదరాగా రెడీ అయ్యి, బ్యాంకుకి బయలుదేరింది...

సాయంత్రం ఆఫీసునుండి త్వరగా వచ్చేసి, పకోడీలు చేసేసి, స్నానం చేసేసి, తెల్లచీరా మల్లెపూలతో రాబోయే పవన్ కోసం గుమ్మంలో ఎదురుచూస్తూ నిలబడేసి, అతను రాగానే చిరునవ్వులతో, వేడి వేడి కాఫీ పకోడీలతో.. స్వాగతం పలికేసి..

నిత్యం ఇలాగే....

పవన్ కుమార్‌ని స్వర్గంలో ముంచెత్తిస్తోంది.. పావని..

అహా నా జన్మ ధన్యం.. నా అందానికీ.. అర్హతలకీ సరిపోయే భార్య దొరికి తీరాలి అనుకున్నా, అలాగే దొరికింది.. బామ్మ ఆశీర్వాదం ఫలించి తీరాలి అనుకున్నా అలాగే జరిగింది.. అనుకుంటూ కాలర్ ఎగరేసి, చిన్న మిసం మీద వేలు పెట్టుకునే ప్రయత్నం చేశాడు పవన్ కుమార్..

మెలుకువ వచ్చేసింది.... కమ్మని కల కరిగిపోయింది...

హు. కలలు కనే అవస్థ ఏనాటికి తప్పేనో అనుకున్నాడు.. ఇరవై ఎనిమిదేళ్ళ పవన్‌కుమార్.

పవన్ కుమార్ పెళ్ళి..

బో..లెడు కాని కట్నం...

అమ్మాయి బంగారు బొమ్మా, బాపూ బొమ్మాకాదు

కాదు కానీ చూడచక్కనిదే. అంతా ఈడూ జోడూ బాగానే ఉందిలే అన్నారు..

పావని కాపురానికి వచ్చింది..

సినిమా హీరోయిన్లలా కాకపోయినా పవన్ కుమార్ అంటే ప్రేమే.. పొద్దున్నే లేచింది, కాఫీ టిఫిన్లు తయారు చేసి భర్తని మేలు కొలిపి, అతని స్నానపానాలన్నిటికీ కావలసినవన్నీ అందించి, సాగనంపి, తను ఇంత తిని, తన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగానికి బయలుదేరింది.

సాయంత్రం ఆఫీసు వదలగానే ఇంటికి వచ్చి కాఫీటిఫిన్ తయారు చేసి, భర్తకోసం ఎదురు చూస్తూ కూర్చుంది...

భర్త రాగానే, రండి టిఫిన్ తిందాం అంటూ, తను అతనికి కొసరి కొసరి తినిపించింది.

ఆహా నాకు సరిపోయిన భార్యే దొరికింది.. అనుకుంటూ కాలర్ ఎగరేసుకోబోయాడు పవన్.. చెయ్యి పైకెత్తగానే మెలుకువ వచ్చేసింది..

కలలు కనే అవస్థ తప్పె యోగం లేదా అనుకున్నాడు.. ముప్పై ఏళ్ళ పవన్.. కుమార్.

పవన్ కుమార్ పెళ్ళి.

కట్నం లేదు...

అమ్మాయి.. కాస్తంత అనాకారి..

చదువు స్కూలు దాటలేదు...

వేళకి చేతనయిన వంట చేస్తుంది.. ఇంటిపట్టున ఉంటుంది.. కాస్తంత మొద్దు స్వరూపమే...

అయినా...

ఆడది.... పెళ్ళాం దొరికింది... నాకంతే చాలు - కలలో మాట పైకే అనేశాడు.. ముప్పైమూడేళ్ళ పవన్

తన కలల్ని ఆకాశం నుండి పాతాళానికి దింపినా కల కలగానే మిగిలిపోతోంది..

అసలింక నాకు ఈ జన్మలో పెళ్ళికాదా అని దిగులు పట్టుకుంది.. ఇంకా కుమార్ గానే ఉన్న పవన్‌కి..

'గోచీ పెట్టుకున్న మగవెధవలయితే చాలు. పిల్లనిస్తారంది బామ్మ - మరి రేమాండ్స్ సూటింగ్‌లూ, షర్టింగులూ వేసుకుంటున్న తనకి ఎవరూ పిల్లనెందుకు ఇవ్వడంలేదో అర్ధంకాలేదు.. పల్లెటూరి పిల్లయినా, అసలు చదువేరాకపోయినా, కట్నం ఇవ్వలేకపోయినా, ఏ

పనీ చెయ్యలేక పోయినా పరవాలేదు.. చీర కట్టిన ఆడపిల్లయితే చాలు అనుకునా ఒక్క సంబంధమూ కుదరడంలేదు‘ తెగ బాధగా అనుకున్నాడు పవన్.

ఇంతకాలమూ మ్యారేజ్ బ్యూరోలలో తన పేరు రిజిష్టర్ చేసుకోవడం ఏమిటి అనుకుంటూ ఉండిపోయిన పవన్ ఓ మ్యారేజ్ బ్యూరోకి వెళ్ళాడు - వాళ్ళు అడిగిన బయోడేటా అంతా ఇచ్చాడు, డేటా అంతా చూసిన ఆ మోడర్న్ పెళ్ళిళ్ళ పేరయ్య పెదవి విరిచాడు..

ఏమన్నట్లు క్వశ్చన్ మార్క్ ముఖంతో చూశాడు పవన్.

"పెళ్ళికుమారుడివి కావడానికి కావలసిన అసలు క్వాలిఫికేషన్ ఏదీ?" అన్నాడు పెళ్ళిళ్ళ బ్యూరో పేరాయ్, స్టైల్‌గా.

డబుల్ క్వశ్చన్ మార్క్ మొహమే జవాబుగా చూశాడు, పవన్ కుమార్.

"ఆ మాత్రం జనరల్ నాలెడ్జి లేదా, ఇక పెళ్ళెలా అవుతుందనుకున్నావ్?" అన్నాడు పేరాయ్, మాయాబజార్ సినిమాలో అల్లురామలింగయ్య స్టయిల్‌లో.

"అబ్బబ్బ, విసిగించక విషయం చెప్పండి" అని లంబు జంబుల స్టయిల్‌లో అడిగాడు పవన్.

అతని అజ్ఞానానికి ఆశ్చర్యపోతూ "సాఫ్ట్‌వేర్.. సాఫ్ట్‌వేర్... నువ్వు సాఫ్ట్‌వేర్‌వి కాకపోతే నీకు పెళ్ళికాదు. వెరీ సింపుల్.." అన్నాడు పేరాయ్ ఈసారి వంగర సుబ్బారావు స్టయిల్‌లో.

"ఇవి చేతులు కావు కాళ్ళనుకోండి, కాస్తంత వివరంగా చెప్పండి స్వామీ" అంటూ, పేరాయ్ చేతులు పట్టుకుని కుతూహలంగా అడిగాడు, తన సమస్యకి కారణం ఏమిటో తెలుస్తోందన్న ఉత్సాహంతో, పవన్ కుమార్.

నీకు పెళ్ళికాదు అని చెబితే ఉత్సాహంగా అడుగుతున్నాడేమిటి చెప్మా అనుకుంటూ -" చూడు నాయనా పవన్, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే అబ్బాయిలకి మాత్రమే డిమాండ్ ఉంది, వాళ్ళని మాత్రమే అమ్మాయిలూ, వారిని కన్నవారూ కూడా సెలెక్ట్ చేసుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో లేని అబ్బాయిలకి ఇప్పట్లో పెళ్ళి కావడం కష్టం"

"అమ్మాయిలూ, వారిని కన్నవారూ అంటున్నారు, సెలెక్ట్ చేసుకోవలసింది మగపిల్లవాళ్ళ వాళ్ళు కదా.. మా బామ్మ చెప్పింది.. గోచీ పెట్టుకున్న వెధవయినా సరే మగ వెధవయితే చాలు కట్నకానుకలతో సహా పిల్లనిచ్చి పెళ్ళిచేస్తారని.. ఆడపిల్లలకి పెళ్ళి చెయ్యడమే కష్టమనీ.."

"నువ్వింకా ఎక్కడో మీ బామ్మ రోజుల్లో ఉన్నావు బాబూ.. ఇలా చూడు, ఇక్కడ రెండు గుట్టల్లా ఫైల్స్ ఉన్నాయి కదా - ఇదుగో ఈ చిన్న గుట్ట ఫైల్స్ పెళ్ళి కూతుళ్ళవి, ఇటు చూడు హిమాలయ శిఖరమంత ఎత్తు ఉన్న ఈ ఫైళ్ళు పెళ్ళికొడుకులవి. పెళ్ళికొడుకులు అమ్మాయిలు నచ్చారని వెంటనే ఓకే చెప్పేస్తున్నారు, అమ్మాయి తరఫువారికే అబ్బాయిలు నచ్చడం లేదు. అసలు నచ్చడం మాట తరువాత మొదట నీ పేరు ఈ ఫైలులో చేరాలంటే నీకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉండాలి. అది బేసిక్ క్వాలిఫికేషన్. నువ్వు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో వచ్చావనుకో క్షణాల్లో నీ పెళ్ళి నేను కుదిర్చేస్తా" భరోసాగా చెప్పాడు పేరాయ్

శ్రీ కృష్ణుడి నోట గీత విన్న అర్జునిడిలా శ్రద్ధగా విన్నాడు పవన్, పేరాయ్ గారి కాళ్ళమీద సాష్టాంగ పడి, ఈల వేసుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

పవన్ ధోరణికి "ఇతగాడికి కాస్తంత పిచ్చి కూడా ఉందేమో, నా దగ్గర రిజిష్టర్ చేసుకున్నాను కాదు" అని తనని తానే అభినందించుకున్నాడు పేరాయ్.

ప్రముఖ డెయిలీలో రిపోర్టర్ గా పనిచేస్తున్న, పవన్ తను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించి తీరాలి పెళ్ళిచేసుకోవాలి, సాఫ్ట్‌వేర్.. పెళ్ళి సాఫ్ట్‌వేర్ ..పెళ్ళి..

రిపోర్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసేశాడు.

రకరకాల కంప్యూటర్ కోర్సులలో జేరిపోయాడు, క్లాస్‌లకి వెళ్ళడం, అవన్నీ శ్రద్ధగా చదవడం....

ఒక్కటే దీక్ష..

తపస్సులా చదివాడు..

అన్ని పరీక్షలూ పాస్ అయ్యాడు, కాంపస్ ఇంటర్వ్యూలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించేశాడు...

సాఫ్ట్‌వేర్ పవన్‌కి పెళ్ళి....

బోలెడు కట్నం....

చూడచక్కని హీరోయి లాంటి అమ్మాయి. బాపూ బొమ్మలాంటి అమ్మాయి.. బంగారు బొమ్మలాంటి అమ్మాయి...

పోస్ట్ గ్రాడ్యుయేట్. బ్యాంక్‌లో ఉద్యోగం.. కాదు కాదు సాఫ్ట్ వేర్ ఉద్యోగం...

పవన్ మళ్ళీ తన పెళ్ళి కలలు ఉత్సాహంగా కంటూ, మ్యారేజ్ బ్యూరోకి వెళ్ళాడు తన బయోడేటాతో..

"పేరాయ్ గారూ, మీరు నాకు చేసిన మేలు మర్చిపోలేను, నేను ఇంకొన్ని సంవత్సరాలకి ముందే మీ దగ్గరకి వచ్చివుంటే ఈ పాటికి ఇద్దరు పిల్లల తండ్రిని అయివుండేవాడిని, కానివ్వండి, మా బామ్మ చెప్పింది, ఏది ఎప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుంది అని. నేనిప్పుడు సాఫ్ట్‌వేర్‌ని" మీరే నా పెళ్ళి మీ చేతుల్తోనే జరిపించాలి.. ఇప్పుడు నేను సాఫ్ట్‌వేర్‌ని" అంటూ వెన్ను విరుచుకుని, కాలర్ ఎగరేసుకుంటూ చెప్పాడు పవన్.

"ఓయ్ వెర్రివాడా" అన్నట్లుగా ఒక నవ్వు నవ్వాడు, వేదాంత ధోరణిలో పేరాయ్...

"నిజమేనండీ, ఇదుగో నా ఉద్యోగం ఆర్డర్" అంటూ ప్రూఫ్ చూపించాడు, పవన్.

"ఇదెందుకు నాయనా, ఉద్యోగానికి ప్రూఫ్ అక్కర్లేదు. కానీ నీకు పెళ్ళి కావడం కష్టం నాయనా.."

పేరాయ్ ధోరణికి పవన్‌కి పిచ్చెక్కినట్లయ్యింది.

"మీరేగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉంటే పెళ్ళవుతుందని చెప్పారు"

"అవును నాయనా నేనే చెప్పాను, అది ఏడాది క్రితం మాట."

"ఇప్పుడు మళ్ళీ మాట మార్చేస్తారా?"

"ఇప్పుడు సాఫ్ట్‌వేర్ రంగం పడిపోయిందిగా నాయనా.. దాంతో సాఫ్ట్‌వేర్ పెళ్ళికొడుకుల మార్కెట్ కూడా పడిపోయింది బాబూ.. ఇప్పుడు మీడియాలో ఉన్న పెళ్ళికొడుకులకి మార్కెట్ డిమాండ్ ఉంది. జర్నలిజంలో ఉన్న పెళ్ళికొడుకులు కావాలంటున్నారు అమ్మాయిలు.. అంచేత నువ్వు.."

"డామిట్.." అనికూడా అనుకోలేక అవాక్కయ్యాడు పవన్.

# ఆకుపచ్చని అనుభవం

య్మరమిల్లి విజయలక్ష్మి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**రాత్రి ప్రథమభాగం** కాకుండానే నిశిరాత్రిలాగా అక్కడంతా నిబిడాంధకారం ఆవరించి ఉంది. ఎక్కడా - చిన్న వెలుగనేది లేదు. ఆకాశానికి భూమికి మధ్య దట్టమైన నల్లని ఆచ్ఛాదనలా పరుచుకుని ఉన్న వృక్ష సముదాయం మీదనుంచి ఉండుండి చిన్న చిన్న పిట్టల సవ్వడులు మినహా అక్కడంతా నిశ్శబ్దం! ఎవరికి కేటాయించిన వసతిలో వాళ్ళను దింపటానికి బస్సులనీ వెళ్ళిపోయాయి. బస్సుల శబ్దాలకి అక్కడ నెలకొని ఉన్న ప్రశాంతతంత చెదిరి - కలత చెందిన ప్రకృతి విసుగుచెందుతున్నట్లు నల్లని గుబురు నీడల్లా అస్పష్టంగా దృగ్గోచరమవుతున్న తరు సమూహాల మీంచి అర్థంకాని కూతలు - ఆగి, ఆగి వినిపిస్తున్నాయి. మేం ఎక్కడ ఆగి ఉన్నామో - పరిసరాలేమిటో ఆ చీకటిలో ఏమీ గ్రహించలేకపోతున్నాం సరే.. ఒక్కొక్కరం మా బాగ్‌లు భుజాన తగుల్చుకుని బద్ధకంగా బస్సు దిగుతున్నాం.

ఒక్కసారిగా 'కెవ్వు' మంటూ మా ముందు వాళ్ళు వెనక్కి మా మీదకి వచ్చేసారు.' ఏమిటి ఏమైంది..' సెల్స్ ఆన్ చేసి కొద్దిగా వెలుగు తేవాలని ప్రయత్నిస్తున్నారు కొందరు. ఆవుల మంద ఒకటి మా బస్సును చుట్టుమిట్టి ఘొరావ్ చేస్తోంది. కొన్ని మరో అడుగు ముందుకేసి బస్సులోకి ఎక్కేసి మాకు స్వాగతం చెప్పసాగాయి. ఆవు అంటే సాధు జంతువే... అయి ఒక్కసారి అకస్మాత్తుగా ఈ చీకట్లో.. కొత్త ప్రదేశంలో అన్ని ఆవులు ఊహించని విధంగా దండెత్తినట్లు మీదకు వస్తుంటే బెదిరిపోయాం. అవి మా అదిరింపుల్నీ, బెదిరింపుల్నీ లక్ష్యపెట్టకుండా మోరలు సాచి మా బేగుల్ని క్రిందకు క్రిందకి తోసేసి, ముట్టెలతో బుసలు కొడుతూ వెనకే వస్తునాయి. వాటిల్లో తినటానికేమైనా ఉండి ఉంటుందని వాటి ఆశ... అయితే మా దగ్గర ప్రస్తుతం ఒక్క అరిటిపండు కాని, పిడికెడు బియ్యం కాని వాటికివ్వటానికి లేవు. మార్గమధ్యంలో ఒకసారి మాకు ఉపాహారంగా ఇవ్వబడిన రొట్టె, బిస్కట్లు నా బాగ్ లో ఉంటే తీసి ఒక ఆవుకు ఇచ్చాను. అవి దాని పంటి క్రిందకు కూడా రావు.. పాపం చాలా ఆబగా ఒక్క గుటకలో మింగేసి క్రిందకు దిగిపోయింది ఈ సందట్లో మిగతా ఆవులు కూడా ఆశతో మా మీదకు రాసాగాయి. ఎల్లాగో వాటిని తప్పించుకుని బస్సు దిగటం మాకు పెద్దపనే అయింది. తెల్లని మంచు కొండల్లాంటి ఆవులు కొత్తవాళ్ళని ఆహ్వానిస్తున్నట్లు అక్కడంతా గుమిగూడి ఉన్నాయి. అవి మా కాసేపు మా చుట్టూ తిరిగి, మమ్మల్ని బ్రతిమాలి, బెదిరించి చివరకు మా వల్ల ఏమీ ప్రయోజనంలేదని గ్రహించి ఒకదానివెంట ఒకటి మర్యాదగా నిష్క్రమించాయి,

నీమ్‌సార్‌గా పిలవబడే ఆ నైమిశారణ్యమతా చీకటిలో మునిగి ఉంది. మాకోసం ఎన్నో జనరేటర్లు తెప్పించి వెలుగు తెచ్చారు. రోజుకి నాలుగు గంటలు మాత్రమే అక్కడ విద్యుత్ సరఫరా ఉంటుందని మేం బసచేసిన అహోబిల మఠ అర్చకుడు చెప్పాడు. అది అటవీ ప్రాంతమనీ, వసతులు తగినంతగా ఉండవనీ, ఏర్పరచుకోవటం కూడా కష్టమనీ ఉన్నంతలో సర్దుకోవాలని యాత్రికులకు ముందే చెప్పటం జరిగింది. మా స్వస్థలం పెద్ద పారిశ్రామిక నగరం. పది నిమిషాలు అంతరాయంకలిగినా సర్దుకోలేని పరిస్థితి. విద్యుత్ పరికరాలు ముఖ్యంగా ఏ.సీ లేకుండా గంట గడవదు. ప్రపంచమంతా ఆగిపోతుంది. అయినా ఈ ప్రాంతాన్ని చూడాలని కోరి వచ్చాం. అందువల్ల

ఎంతటి అసౌకర్యాన్నైనా సరే.. భరించటానికి సిద్ధపడే ఉన్నాం. అయినా మాకెవరికీ ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అన్నీ ఏర్పాటు చేసారు.

మరునాడు తెల్లవారుఝామునుంచి మా కార్యక్రమాలు ఆరంభమయాయి. అహోబిలమఠం. అదే మా బృందానికి ఏర్పాటు చేయబడిన వసతి. లక్ష్మీనృశింహస్వామి వారి ఆలయం - అనుబంధంగా విశాలమైన మఠం. వసతి గృహం. దాదాపు వెయ్యిమంది సాధకులు గల అతి పెద్ద యాత్రిక బృందం మాది. అక్కడి మఠాలు, సత్రవులు అన్నీ మా వసతి కోసం కేటాయించారు.

అహోబిల మఠంలో ఉన్న మా బృందం గోమతీ నదీస్నానానికి బయలుదేరాం. అప్పటికి నాలుగు పక్కల నుంచి అక్కడక్కడ ఆశ్రమాలలో బసచేసినవాళ్ళందరూ నదికి దారి తీసే కూడలిలో కలిసాం. వెన్నెల క్రమంగా మందగిస్తోంది. కానన మార్గంలో పశ్చిమ దిగంతాలలోని కాంతిని కోల్పోయిన చంద్రుడు వాటారి పోతున్నాడు. చుట్టూ నీడలు. చీకటి.. తెల్లవారుఝాము.. గాలి తేమగా చలిచలిగా ఉంది. త్రోవలో రెండు మూడు మట్టి మెత్తడి ఇళ్ళలాంటివి కనిపించాయి. పరిసరాలన్నీ నిద్రాణంగా ఉన్నాయి. నదికి వెళ్ళాలంటే బాట వదిలి ఎత్తైన గట్టు ఎక్కి అటువైపు క్రిందకి దిగాం. దారి ఏ మాత్రం అనువుగా లేదు. మెట్లలాటి సదుపాయం లేదు సరికదా కాలు సాగనీయకుండా పెద్దపెద్ద బండరాళ్ళు అడదిడ్డాలుగా గుట్టలుగా పడివున్నాయి. అక్కడ నుంచి కనుచూపుమేర దిగువనంతా ఇసక, మెత్తని ఒండ్రు కలిసిన విశాలమైన తీరం. వెలుగులు పూర్తిగా విచ్చుకోని ఆ ప్రత్యూషంలో అంత దూరాన నీటిపాయలా కనిపిస్తోంది గోమతి.

'రండి.. త్వరగా స్నానాలు కానివ్వండి.మళ్ళీ ధ్యాన తరగతికి ఆలస్యమౌతుంది'.. మేం అక్కడ సాధనలో ఉన్నన్నాళ్ళు నిత్యం గోమతీ నదీ స్నానంతోనే మా దైనందిన కార్యక్రమాలు ఆరంభమౌతాయి. నది నాకు కొత్తకాదు. ప్రస్తుత నివాసం నగరమే అయినా పుట్టిపెరిగింది గోదావరీ తీర గ్రామంలోనే. తరువాత తరువాత అలవాటు తప్పిపోయింది కానీ చిన్నతనంలో అమ్మమ్మ వెంట శివరాత్రినీ, కార్తీకమాసమనీ గోదావరి స్నానాలకి వెళ్ళేవాళ్ళం. సాధన అనే ఆధ్యాత్మిక శిక్షణలనీ ఇప్పుడిటువంటి పవిత్ర ఏకాంత స్థలాలకు బయలుదేరుతున్నాను. ఎక్కడో ఏదో దొరుకుతుందని ఆశ.. జీవితమంతా ఈ వెతుకులాట, తిరుగులాటతోనే గడిచిపోతుందేమోనన్న భయం కలుగుతుంటుంది. అయినా ఏమో - ఏ పుట్టలో ఏముందో.. బుద్ధుడికి బోధి వృక్షం క్రింద జ్ఞానోదయమైంది. ఈ తపోభూమితోనో మరే హిమాలయ పర్వతసానువుల్లోనో ఆత్మోన్నతి కలగకపోతుందా. కాని మా అమ్మమ్మ, ఉన్న చోటనే గృహవస్థ జీవన ఒడిదుడుకులే సాధనగా ప్రశాంతమైన జీవనయాత్ర సాగించి ఆనందంగా పరమాత్మలో లీనమైంది.

'భయం లేదు. అస్సలు లోతులేదు.' ఎవరో నా చెయ్యి పట్టుకుని నీళ్ళలోకి లాగారు నా సహచరులు మాత్రం ఇటువంటి విషయాలలో ప్రవీణులే. ముందు భయపడినా దిగాక నాకూ గోమతిలో స్నానం సరదాగా ఆనందంగా అనిపించింది. నది అసలు లోతు లేదు. ఎంత మధ్య మధ్యకు లోపలికి పోయినా మా భుజాలవరకే మునుగుతోంది. పాదాల క్రింద మెత్తని ఇసక గులక స్పర్శ తగులుతోంది. నులివెచ్చని జలం.. ఏ మాత్రం కాలుష్యమనేది లేక పరిశుభ్రంగా నిర్మలంగా ఉంది. ఆ చుట్టూ పరిసరాలన్నీ వ్యాపించి ఉన్న అరణ్యంలో అనేక ఔషధ గుణాలు కల వృక్షాలు ఉన్నందువల్ల - నదిలో స్నానం చర్మదోషాలను నయం చేస్తుందట. ఎంతసేపానదిలో ఉండిపోయామో చెప్పలేను. కాళ్ళ క్రింద గులక గర, గర స్పర్శ మధురమయిన మాతృ పరిష్వంగంలా! మెత్తగా వెచ్చగా వంటిని చుట్టుకుని తన్మయపరుస్తున్న నిర్మల ప్రవాహం. ఒక తెలియని అలౌకికానందాన్ని కృంగించి - నేను కోరినదిక్కడ పొందగలనన్న ధైర్యమేదో కలిగింది. తూర్పున తొలిచ్ఛాయ పరుచుకుంటోంది. సింధూరపు గోళంలా సూర్యుడుదయిస్తున్నాడు. ఇంత అద్భుతమైన ఉదయాన్ని నేనెప్పుడూ చూసి ఉండలేదు. సూర్యోదయాలు సూర్యాస్తమయాలు, నెలపొడుపులూ, పున్నమి రాత్రులూ మేమెప్పుడో కోల్పోయాం. అసలు ప్రకృతితో కాని, బయట ప్రపంచంతోకానీ మాకేం నిమిత్తం లేదు. అన్నిసేవలు మా ముప్ఫై ప్రత్యేక గదుల నేలమాళిగలోనే ఉంటాయి. ఒక గంట మోగిస్తే చాలు. ఏ తరగతి చెరసాల.. అదోలోకం..

మేం స్నానాలు కానిచ్చి తీరం మీదకి వచ్చేసరికి అక్కడంతా తెల్లని గోనె బరకాలు పరిచి ఉన్నాయి. ప్రతీ బరకం దగ్గర ఒక స్త్రీ, ఒకరిద్దరు పిల్లలు ఉండి చిన్న, చిన్న ఆకుదొనెల్లో వత్తి, పూలు, పసుపు, కుంకుమ ఉంచి ఇస్తున్నారు. కార్తీకం.. స్నానం, దీపం, దానం మూడు ప్రధానంగా చెప్పబడ్డాయి. నదిమెత్తని తరగలమీద మేం వదిలిన దీపమాలికలు తల్లి ఒడిలో ఉయ్యాలూగుతునట్లు మెల్లిగా తిన్నగా కదిలిపోతున్న దృశ్యం అద్భుతంగా ఉంది.

వ్యతిక్రమించరాని కఠినమైన కార్యక్రమ ప్రణాళిక మాకుంది. నది ఎంతబాగున్నా తీరం కొండలు గుట్టల్లాటి బండరాళ్ళతో నిండి ఉంది. అవన్నీ దాచుకుని క్రిందకి వస్తుంటే అనేక మంది పిల్లలు త్రోవ పొడుగునా నిలబడి మావైపు చేతులు చాపి 'కన్యా కో దాన్ దే మా౦' అంటున్నారు. ఇంచుమించు అందరూ పదేళ్ళ లోపు వాళ్ళే. ఇంకో విశేషమేమంటే అందులో కొందరు తెలుపు నీలం రంగులో ఉన్న ఏదో స్కూలు యూనిఫాం వేసుకుని ఉన్నారు. ఆరేడు సవత్సరాల వయసున్న పిల్లలు ఒకటి, రెండు సంవత్సరాల చంటిపిల్లల్ని ఎత్తుకుని ఉన్నారు. మేం సాధక యాత్రికులం - పుణ్యక్షేత్రాలలో చేసిన దానధర్మాలు అధిక ఫలమిస్తాయని శాస్త్రం. అందుకని చిల్లర డబ్బులు మూటకట్టుకుని వచ్చి అడిగిన వాళ్ళకి ఎంతో కొంత ఇచ్చేవాళ్ళం. సాధారణంగా సాధువులు, సన్యాసులు, ముముక్షువులు లాటివాళ్ళే చిన్న కాషాయి జోలి భుజాన తగుల్చుకుని ఈ అరణ్యానికి మోక్షసాధనకోసం వస్తారు. వాళ్ళు పాపం వీళ్ళకేం ఇవ్వగలరు.

తెల్లవారిందగ్గరనుంచీ కొద్దిగా జనసంచారం కంటపడుతోంది. చాలా చిన్న ప్రదేశం - జనవాసం... ఊరు అని కూడా అనలేం. ఇళ్ళు అనుకోవల్సిన చిన్న చిన్న తాత్కాలిక మట్టికట్టడాలు అక్కడక్కడ చెదురుమదురుగా తగులుతున్నాయి. చిన్న, పెద్ద అనేక మఠాలు - పురాతనదేవాలయాలు.. మా బస నుండి బాలాజి మందిరానికి వెళ్ళాలి. అక్కడే మా తదుపరి కార్యక్రమాలన్నీ ఉంటాయి. ఎక్కడో.. ఏమిటో ఎల్లాగా వెళ్ళటం..!?

నదికి వెళ్ళివచ్చేసరికే అలిసిపోయాం. నడక తప్పదని నిర్ణయించుకుని బయటికి వచ్చాం. మఠం ఎదురుగా రచ్చబండలా ఉన్న రావిచెట్టుక్రింద కొన్ని వాహనాలు ప్రత్యక్షమయ్యాయి. అవి చూట్టానికి రిక్షాలలాగ ఉన్నాయి. పెద్ద చెక్క తొట్టెల్లా ఉన్నాయి డ్రైవర్స్ రిక్షా యాంగిల్స్ పుచ్చుకుని మా కోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళందరూ ఎక్కువమంది పది పదిహేను సంవత్సరాల లోపు మగపిల్లలు ఒకరిద్దరు వృద్ధులూ ఉన్నారు. మా బృందనాయకుడు వెళ్ళి బేరం సాగించాడు 'ఏక్.. పాంచ్ రూపయా' అన్నారు కుర్రాళ్ళు. నిజానికి బాలాజి మందిరం అక్కడికి ఎంతదూరంలో ఉందో అప్పటికి మాకు తెలియదు. అయినా అడిగినంతా ఇచ్చేస్తే ఎల్లా.. 'ఏక్ దో.. తీన్.. మూడు' అన్నాడు మా లీడర్ గారు వాళ్ళకు అర్ధం కావాలని మూడు వేళ్ళు చూపుతూ. మాకు భాష రాదని గ్రహించి అంగీకారంగా తల ఊపారు. ఆ రిక్షాలు చిత్రంగా ఉన్నాయి. చిన్నపిల్లలాడుకునే చక్రాలబండిలా ఉన్నాయి పరిమాణంలోనే తేడా.. నేల బారుగా ఉండి సీటు తొట్టెలా ఉంది. ఎత్తేమీ లేదు కనుక రిక్షా ఎక్కటం ఇబ్బంది లేదు. కాని సర్దుకు కూర్చోవటమే కష్టమనిపించింది. ఎల్లాగో ఇరుక్కుని రిక్షాకి నలుగురేసి చొప్పున కాలు ముడుచుకుని పేరంటానికి కూర్చున్నటు కూర్చున్నాం. కాళ్ళ క్రిందకి పెడితే బర్రున నేలకు కూరుకుపోతున్నాయి. రిక్షాలు కదలగానే అక్కడక్కడే ఆడుకుంటున్న పిల్లలు నలుగురేసి పెద్దగా కేరింతలు కొట్టుకుంటూ వెంటపడ్డారు. పిల్లలు ఏదో సరదాగా అల్లరిగా వస్తున్నారనుకున్నాను. నాలుగు బారలు సాగేసరికి అర్ధమైంది వాళ్ళ సహకారం లేకుండా బండి ముందుకు సాగలేదని. దారంతా ఎత్తులు, పల్లాలు - గుట్టలు, గోతులూను... చాలా అధ్వానంగా ఉంది. ఎత్తువచ్చినప్పుడల్లా అటునలుగురు అంచులు గట్టిగా పట్టుకుని జాగ్రత్తగా గెంటి శిఖరారోహణ చేయిస్తున్నారు పల్లంలో క్రిందకు రయ్యిన దొర్లి పల్టీలు కొట్టించకుండా పెద్దగా 'హేయ్.. హేయ్..' అని అరుచుకుంటూ వేగాన్ని అదుపుచేస్తున్నారు. ఈ విధంగా ఓ అరగంట పెద్ద ఊరేగింపుగా వాహనయాత్రసాగింది. అంతసేపూ గుండెలు గుప్పెట్లో పట్టుకుని దేవుడ్ని తలుచుకుంటూ కూర్చున్నాం. అందరూ పిల్ల వెధవలు. ఆకతాయిలు ఎక్కడ పట్టువదిలేస్తారోనని..! మొత్తానికి మా అంగరక్షకులుగా అంతమంది బాలవీరులు కలిసి మమ్మల్ని బాలాజి మందిరం దగ్గర దిగవిడిచారు. అందరూ ఎవరి మూడు రూపాయలు వాళ్ళు రిక్షా అబ్బాయికిస్తున్నారు. వాడు నల్లగా పొడవుగా చువ్వలా ఉన్నాడు. అలసటకి ముఖం

మీద చెమట పట్టింది. కొద్దిగా వగురుస్తున్నాడు. అయినా వాడి కళ్ళు నన్ను ఆకర్షించాయి. అవి మిణుకు మిణుకుమంటూ నక్షత్రాల్లా మెరుస్తున్నాయ్. 'చదువుకుంటున్నావా?'.. 'హాఁ మా!' వాడు తల ఊపుతూ చెప్పాడు. ఆరాలు తీయటానికి సమయంలేదు 'రండి.. రండి' మందిరంలోకి పరుగులు తీస్తున్నారు. అది మొదటి రోజు కనుక తరువాత ఆ ప్రయాణం చాలా సరదాగానే ఉంది. ఈ విధంగా ఉదయం రావటం మధ్యాహ్నం భోజన విరామంలో బసకు వెళ్ళటం - తిరిగి నాలుగుగంటలకి మందిరానికి వచ్చి ఇంక రాత్రికి కార్యక్రమాలన్నీ ముగిసాక పదిగంటలకి బసకు చేరుకోవటం. ప్రతిసారీ ఇదే తంతు. ఏదో ఒక వాహనం మీద పడెయ్యాల్సిందే తప్ప మా శరీరాన్ని మేమే మోసుకోలేని అసమర్థులం. అంతరాత్రిలో ఆ కుర్రాళ్ళు రిక్షాలతో మాకోసం చూస్తూ ఉండేవారు. ఏదో నడిచే బాధ తప్పిందని సంతోషించాం.

ఇక్కడికి ఇంతపెద్ద బృందం రావటం ఇదే మొదటిసారి కావచ్చు. అపురూపం, అతి సుందరం, ఏకాంతం, నిర్జనం అయిన ఆ గాఢ అరణ్యసీమలో మా ఉనికి సంచలనమే కలిగించింది. సాయంత్రానికి బాలాజి మందిరం ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో కొన్ని దుకాణాలు వెలిసాయి. యాపిల్, కమల, బత్తాయి, జామ, అరటిలాటి పళ్ళు బళ్ళమీద ఉంచి రిటైర్ వ్యాపారం కొందరు ప్రారంభించారు. రుద్రాక్ష, తులసి, తామరగింజ - ఇంకా పేరు తెలియని రకరకాల జపమాలల దుకాణాలూ ఏర్పడ్డాయి. పువ్వులు, పూజా సామగ్రి సరే.. అక్కడ జామ, వెలగ ఎక్కువగా ఉన్నాయి. నదికి వెళ్ళే దారిలోనూ, మందిరం దగ్గర రోడ్డుమీద కుప్పలు పోసి పిల్లలు, ఆడవాళ్ళు వాటిని అమ్ముతుండేవారు. జామపళ్ళు తియ్యగా మధురంగా ఉండేవి. ఇక తెల్లని అందమైన ఆవులు మందలు మందలుగా! ఇక్కడ మనుష్యుల కంటే ఆవులే ఎక్కువన్నట్టు కనపడేది అటవీ ప్రాంతం.. ఆకూ, అలము - గడ్డీగాదంలాటి పశుగ్రాసం బాగానే ఉంటుంది కనుక అవన్నీ ఆరోగ్యంగా, బలంగా కామధేనువుల్లాగే ఉన్నాయి. మా భోజనాల వేళకి పెద్దమందలా మైదానంలో దూరంగా నిలబడేవి. పళ్ళు, అన్నం ఏదిపెడితే అవి తిని వెళ్ళిపోయేవి. తెల్లని రాజహంసల్లా పరమ సుందరంగా ఉన్న పెద్ద పెద్ద అడవి బాతులు నారింజ రంగు ముక్కులు తెరుస్తూ, మూస్తూ చిత్రంగా కూస్తూ తిరుగుతుండేవి. అవి నిర్భయంగా, స్వేచ్ఛగా తిరుగుతుంటే చూట్టానికి సరదాగా ఉండేది. చిలకలు, పిట్టలు, ఉడతలు వడ్లపిచుకలు లాటి ప్రకృతి ప్రాణులేవీ కనపడవు మాకు. చూడాలంటే ప్రదర్శనశాలకు వెళ్ళాలి.

'మనం వచ్చింది ఆధ్యాత్మిక సాధనకోసం.. ఇటువంటి వ్యర్థమైన విషయాల గురించి ఆలోచించి సమయం పాడుచేసుకుంటారేమిటి..' అంటారు మావాళ్ళు.' ఇక్కడ ఆకలి నేరాలు ఎక్కువ. ప్రజలు చాలా దుర్మార్గంగా ఉంటారు వందరూపాయలకోసం మనిషి చంపేసినా చంపేస్తారు. జాగ్రత్త ఎక్కడికీ వంటరిగా వెళ్ళకండి. అడవిలో లోపలికి వెళ్ళకండి.'

'ఇంత పెద్ద రక్షణాలయం మన రక్షణ కోసం ఉండగా మనకేం భయం' మందిరానికి ఎదురుగా అటువైపు రోడ్డుమీద ఎత్తుగా రుధిర వర్ణపు రంగు అలంకరించి ఉన్న పెద్ద భవనం చూపిస్తూ ఎవరో అంటున్నారు. నిజమే! ఒక్క గట్టి పక్కా గృహనిర్మాణమైనా లేని ఆ ఊళ్ళో అంత పెద్ద ఠాణా భవనం చిత్రంగా కనిపిస్తోంది. అడవి ప్రాంతం... యాత్రా స్థలం.. పుణ్యతీర్థం.... పైన పేదరికం.. అతి పేదలే అతివాదులుగా నేరస్తులుగా పరిణమించే ప్రమాదముంది. అందుకే లాగుంది. విద్య, వైద్య ఆర్థిక సదుపాయాలు లేకపోయినా పూర్తిస్థాయి రక్షణాలయం మాత్రం ఉంది ఆరుబయట కుర్చీలలో సిబ్బంది నేరాలకోసం ఎదురు చూస్తున్నట్టు కనిపించేవారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అభివృద్ధి నీడకూడా సోకని ఒక దైన్యపు పార్శ్వాన్ని చూస్తున్నాను బహుశా: వయసులోఉన్న మగవాళ్ళు పరిశ్రమ చేసి సంపాదించుకోవటానికి దగ్గర్లో ఉన్న నగరానికి వెళ్ళివుండవచ్చేమో. ఇక్కడ ఆడవాళ్ళు, పిల్లలు పశువుల్ని మేపుకుంటూ - అడవిలోంచి పుల్ల, పుడకా పోగుచేసి తెచ్చుకుంటూ తమలోకంలో ఉండేవారు. జీవనపోరాటమే ఒకసాధనగా ఆ ప్రకృతిలో భాగంగా నిశ్శబ్దంగా, నిర్వికారంగా కనిపించేవారు.

క్రమంగా ఎలాటి కోలాహలమూ జనసమర్ధమూ రుచించనట్టు, పరమగంభీరంగా అంతర్ముఖుడై ఉన్న ఏ మౌన యోగిలాగో ఉన్న ఆ గహనారణ్యం నన్నావహిస్తోంది. బృందాన్ని వదిలి తృణ గుల్మాల పరిసరాల పసరు పరిమళం ఆస్వాదిస్తూ ఇంకా లోపలకి

పోవాలనిపిస్తోంది. ఈ సమస్త సృష్టిలోనూ మనిషి ఎంత ఏకాకోనన్న అధీర విహ్వల భావం గుండెల్ని బరువెక్కిస్తోంది. మహాచైతన్య స్వరూపిణి అయిన అవన సౌందర్యాన్ని మించిన ఆనంద అనుభూతి ఇంకేముంటుంది. ఒకప్పుడు ఉత్తేజభరితంగా ఒకప్పుడు భీతావహంగా, ఒకప్పుడు తీవ్రమైన నిర్వేదంగా, మరొకప్పుడు రహస్యమైన అలౌకిక స్వప్నంగా - నిలువనీయని తాత్విక భావప్రేరణగా వివరించలేని అనేకానేక విచిత్ర అనుభూతులకు లోనయ్యాను. ఇక్కడ ప్రకృతి సత్యస్వరూప దర్శనం లౌకిక ప్రపంచంలో భౌతిక తాపత్రయాలలో లీనమై బతుకుతున్న నాలో అంతులేని అశాంతిని, అలజడని, ఆలోచనను మున్నెరుగని తీవ్రమైన వైరాగ్యభావాన్ని కలిగించింది.

సాధన ముగింపు దశకు వచ్చింది. వెనుతిరిగే సమయమైంది. తెల్లవారి నాలుగుగంటలకే తిరుగు ప్రయాణం. నగరంలో రేపు బంద్. అకారణంగా మా ప్రయాణానికి ఇబ్బంది కలగకూడదని తెల్లవారుఝామునే బయలుదేరినా సాయంత్రం అయిదుగంటలలోపే ముగింపు కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. బసకెళ్ళటానికి రిక్షాలెక్కాం. కాస్త దూరం వెళ్ళాం 'పాంచ్ రూపయా దే ( మా..' రెండు వెలగపళ్ళు రెండు జామ పళ్ళు దోసిట్లో ఉంచుకుని చినపిల్లాడొకడు మా రిక్షా వెంటపడ్డాడు. అక్కడ ఏ పిల్లా.. పిల్లాడూ వంటరిగా కనపడడు. వెనక ఇద్దరో, నలుగురో వానర మూకలా చిన్న అనుచరగణం ఉంటుంది.

'మూడు .. మూడుకిస్తావా?' పరుగెడుతున్న రిక్షాలోంచి ఒకావిడ బేరం చేస్తోంది.

క్రిందకి జారిపోతున్న నిక్కరు పట్టించుకోకుండా పళ్ళు గట్టిగా పట్టుకుని ఎత్తుకుపోతున్న రిక్షా అందుకోవాలని ఆయాసపడుతూ పరుగున వస్తున్నాడు. ఆవిడ పళ్ళు కొంటుందని వాడి ఆశ. రిక్షా ఆగటానికి లేదు. నడి ఎత్తున ఆగిందంటే జర్రున పల్లానికి జారి ముసలి, ముతక నలుగురం గల్లంతైపోతాం అవతల అయిదురూపాయల బేరం కోసం పసివెధవ పట్టు వదలకుండా నస పోసుకుంటూ వస్తున్నాడు.

అప్రయత్నంగా నేను ఐదురూపాయలనోటొకటి వాడివైపు విసిరి 'తీసుకో పైసా లేవ్' అని అరిచాను.

రిక్షా ఎత్తుకి ఎక్కేసి అటువైపు దిగబోతోంది గాలికి ఎగిరిపోతున్న నోటు వాడి అనుచరుడొకడు ఒడుపుగా దొరకపుచ్చుకున్నాడు. డబ్బులిచ్చేసాను. పళ్ళు ఇవ్వాలని వాడి ఆరాటం.

'వీడికివ్వడేమో.. వాడు తీసేసుకుంటాడేమో' ఆ కుర్రాడి శ్రమకి ఫలం వాడికే దక్కాలని అటే చూస్తున్నాను.

'అదేమిటి పళ్ళు తీసుకోకుండానే డబ్బులిచ్చేసారేమిటి?' అంది నా సహచరి.

నాకు సమాధానం చెప్పాలనిలేదు. రిక్షా పల్లానికి దిగిపోతోంది. వాడి అనుచరుడూ నవ్వుతూ ఐదురూపాయల నోటు వాడికిస్తున్నాడు. మరుక్షణం పాలోమంటూ వాళ్ళు నలుగురూ మా వెంటపడాలని ప్రయత్నించి - ఆగిపోయారు. ఆ చిన్నవాళ్ళలోని నిజాయితీ ఆరాటం జాలి కలిగించింది. ఆ నిర్మలమైన ప్రకృతి ఒడిలో పెరుగుతున్న పిల్లలు అంతే నిర్మలంగా ఉంటారని ఆనందమనిపించింది.

వెయ్యిమంది ఒక్కసారి వెళ్ళిపోయాక ఆ ప్రాంతం ఎల్లాఉంటుందో అనుకుంటే దిగులుగా ఉంది. రోజూ తెల్లవారేసరికి మఠం అరుగుల మీద చెట్టుక్రింద పిల్లలు మాకోసం ఎదురు చూస్తూ ఉండేవారు. కార్తీకం వెళ్ళమారిపోతోంది. తెల్లవారు ఝామున చలిగాలి రివ్వున వీస్తోంది. చుట్టుపక్కల గుడిసెలు నిద్రలో జోగుతున్నాయి అడవి అంతా నిరామయంగా ఉంది. ఇలా వచ్చిపోయే వాళ్ళెందరో! మేం వచ్చాం వెడుతున్నాం మా వెనుక ఎవరో వస్తారు వెడతారు. తరువాత ఇంకోరు. .. ఆ తరువాత... చూసి చూసి అలసిపోయి ఉంటారీ పిల్లలు... నిమిత్తమాత్రంగా సేవలందించారు. రగ్గులు కప్పుకుని బస్సులో అందరూ వెచ్చగా సర్దుకుంటున్నారు. బస్సు దీపాల వెలుగుతో ఆశగా అటు చూసాను. వచ్చిపోయే ఈ అశాశ్వత ప్రపంచంలో తనకేం పని అన్నట్లే గంభీరంగా సాక్షీభూతంగా ఉంది కనుచూపుమేర.

అడవి బస్సుల రొదకు కొట్టాలలో ఆవులు నిద్రాభంగమై కదులుతున్నాయి. చీకటిలో వచ్చాం... చీకటితో పోతున్నాం.. మధ్య.. 'అబ్బ.. కిటికీ మూసెయ్యండి.. చలి!!

# సాక్షి

## నాదెళ్ళ అనూరాధ

(కౌముది-రచన నిర్వహించిన పోటీలో ఎంపికైన ఉత్తమ కథ)

**"శశీ!"** మెల్లిగా తలుపు తట్టింది సావిత్రి. ఎలాటి సమాధానం లేదు. నెమ్మదిగా తలుపు తోసి లోపలకు వెళ్ళింది.

గదిలో వెచ్చగా ఉంది. శశి, పాపాయి గాఢ నిద్రలో ఉన్నారు. లేపేందుకు మనస్కరించక వెనక్కి వచ్చింది. ఇంకా మూడోనెల రాలేదు పాపాయికి. తల్లి పక్కలో ఒదిగి హాయిగా నిద్రపోతోంది. రాత్రి పుస్తకం చదువుతూ నిద్రలోకి జారినట్లుంది. తలవైపు మంచం కింద పుస్తకం పడి ఉంది.

తలుపు దగ్గరకి లాగి బయట వసారాలోకి వచ్చింది సావిత్రి. రాత్రినుండీ పడుతూనే ఉంది వర్షం. పెద్దవాన కాకపోయినా ఆగకుండా కురుస్తోంది. కాంపౌండులో పూలమొక్కలు వర్షంలో తడిసి ముద్దవుతున్నాయి. మబ్బుపట్టిన ఆకాశం ఎందుకో దిగులుగా తొంగి చూస్తోందనిపిస్తోంది.

ఈ వర్షం మాయలో పడిందంటే ఆమె అక్కడినుండి మరి కదల్లేదు. చటుక్కున తలవిదిల్చి వంటింటివైపు కదిలింది.

ఇంతకీ సమస్య సమస్యగానే మిగిలింది. చిన్నుని స్కూలుకి పంపాలా వద్దా ఈ వర్షంలో. ఈ పూటకి వెళ్ళకపోతేనేం వాడు. నాలుగేళ్ళ పసివెధవ. హాయిగా తాత పక్కలో వెచ్చగా నిద్రపోతున్నాడు. కృష్ణమూర్తి ఆఫీసుకు వెళుతూ ఆ వీధి చివర కిండర్ గార్డెన్‌లో వాణ్ణి దింపి వెళ్ళిపోతాడు. వాడు లేస్తే ఏ పనులూ సాగవు. వాణ్ణి తయారు చేసి, ఓ ఇడ్లీ తినిపించి, పాలు తాగించేందుకు సరిగ్గా గంటపడుతుంది.

కృష్ణమూర్తి లేచాక ఆయన ఏమంటాడో. ఈ లోపు వంటింటి పని పూర్తిచేసుకుంటే సరి.

క్షణక్షణం టైము చూస్తూనే వంట పనులు ముగించుకుని గదిలోకొచ్చేసరికి తాతామనవలిద్దరూ నిద్రలేచి మంచం దిగేందుకు సిద్ధమవుతున్నారు.

"ఏమండీ! ఈ వర్షంలో స్కూలుకి పంపాలంటారా?"

"ఇక్కడే కదూ. నేను డ్రాప్ చేస్తాను వాడికి కాస్తకాలక్షేపం స్కూలుకి వెళితే. ఇంట్లో ఉంటే వాడికి ఏం తోస్తుంది?!" కృష్ణమూర్తి బ్రష్, పేస్ట్ అందుకున్నాడు.

చిన్నికి అమ్మమ్మ ప్రశ్న బాగానే అర్థం అయింది.

"అమ్మమ్మా! నేను స్కూలుకి వెళ్ళను. ఈ రోజు చెల్లితో ఆడుకుంటాను" అన్నాడు తనో నిర్ణయానికివచ్చి.

"వద్దురా. ఇంట్లో నీకు తోచదు నాన్నా. చెల్లి చిన్నపిల్లకదూ, నీతో ఆడుకోలేదు స్కూల్లో అయితే నీకు రాహుల్, అనీష్, సుమి అందరూ ఉంటారు ఆడుకుందుకు" మనవణ్ణి మంచం దింపి తయారు చేసేందుకు సిద్ధమైందామె. వాడు గొడవ మొదలు పెట్టాడు

"ఈ రోజు స్కూల్కి వెళ్ళను" అంటూ.

"అమ్మకి మెలుకువ వస్తుందిరా. పాపాయి లేచి నడుస్తుంది. గట్టిగా గొడవ చెయ్యకు" ఆమె మాటలు లెక్క చెయ్యకుండా వాడి మానాన వాడు ఏడుపు మొదలుపెట్టాడు.

"సావిత్రీ! కాఫీ!" అంటూ వచ్చిన కృష్ణమూర్తి.

"వాడికి లేని అయిడియా ఇచ్చావ్ అనవసరంగా" అంటూ విసుక్కున్నాడు. ఐదునిమిషాలు గడిచాయి. పదినిముషాలు గడిచాయి. ఏడుపు ఆగలేదు. 'చిన్నూ!' అంటూ గదిలోంచి లేచి వచ్చింది శశి.

"ఎందుకు ఏడుపు ప్రొద్దున్నే" విసురుగా కొడుకు జబ్బపట్టుమని లేవదీసింది.

"నేను స్కూలుకి వెళ్ళను" స్పష్టంగా చెప్పాడు తల్లితో.

"వెళ్ళకపోవడం ఏమిటి? టైమవుతోంది, పద" వాణ్ణి బాత్ రూము వైపుగా లాక్కెళ్ళి "అమ్మా! వీణ్ణి చూసుకో" అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

సావిత్రికి ఉసూరుమనిపించింది. పసి వెధవ. తను అన్నమాటలకి వాడు స్కూలుకి వెళ్ళక్కర్లేదు అనుకున్నాడు. అనవసరంగా ప్రొద్దున్నే వాణ్ణి ఏడ్పించింది. బాత్ రూమ్ బయట వెక్కుతున్న మనవణ్ణి దగ్గరకుతీసుకుని, స్కూల్కి తయారు చెయ్యడంలో నిమగ్నురాలైంది.

ఆరోజు ఆదివారం. పాపాయిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి. శశి తయారవుతోంది. తల్లిగదిలో మంచం చుట్టూ తిరుగుతున్నాడు చిన్ను.

"అమ్మా! నీతో నేనూ వస్తాను" అన్నాడు హక్కుగా.

"వద్దు చిన్నూ. హాస్పిటల్లో చాలా రష్గా ఉంటుంది. పాపాయికి వాక్సిన్ వేయించి తీసుకువస్తాను." బ్యాగ్ సర్దుకుంటూ కొడుక్కి బుజ్జగింపుగా చెప్పింది. 'ప్లీజ్, అమ్మా!' స్కూలుకి వెళ్ళడం మొదలయ్యాక 'సారీ, ప్లీజ్' లాటి మాటలు నేర్చుకుని చక్కగా వాడుతుంటాడు. కొడుకు తెలివికి మురిసిపోయింది శశి.

"ఒరేయ్. నీకెంత మంచి మేనర్స్రా! నా బంగారు తండ్రివి కదూ. ఇంట్లో ఆడుకో" అంటూ వాడి బుగ్గలు నిమిరి పసిదాన్ని తీసుకుని ముందుగదిలోకి వచ్చింది.

"అమ్మా! వెళుతున్నాను. వీణ్ణి పట్టుకో" అంటూ చిన్నూని తల్లికి అప్పగించి వెళ్ళిపోయింది శశి.

చిన్న ఏడుపు ఆపడం చాలాసేపటివరకూ సావిత్రికి చేతకాలేదు. వాడి చిన్ని మనసుకు ఈ మధ్య తల్లి తనని దూరంగా పెట్టేస్తోంది అన్న విషయం కష్టం కలిగిస్తోంది. చెల్లి వచ్చాక అమ్మ తనతో ఇదివరకటిలా ఆడుకోవటం లేదు. ఎప్పుడూ బొమ్మలతో ఆడుకోమంటుంది. లేకపోతే అమ్మమ్మతో కథలు చెప్పించుకోమంటుంది.

సావిత్రి సముదాయించబోయినా వాడు దూరంగా బొమ్మల మధ్య కూర్చుండి పోయాడు. వాడి చేత అన్నం కూడా తినిపించలేకపోయిందామె. కృష్ణమూర్తి బయటనుండి వస్తూ మనవడు చిన్నబుచ్చుకున్న ముఖంతో ఒక్కడూ ఉండడం చూసి,

"సావిత్రీ! వీడు ఇలా డల్గా ఉన్నాడేం? నాకు భోజనం పెట్టేయ్. అన్నట్లు వీడు అన్నం తిన్నాడా?"

"వాళ్ళ అమ్మ వాణ్ణి హాస్పిటల్కి తీసుకువెళ్ళలేదని అలిగాడు. అన్నం పెట్టాలని చూసినా తినడంలేదు" సావిత్రి దిగులుగా చెప్పింది.

"తీసుకురా.. వాడు నాతోపాటు తింటాడు" డైనింగ్ హాల్లో తాతయ్య పక్కన కూర్చున్నాడు. కాని వాడు అలక సాగిస్తూనే ఉన్నాడు. బలవంతాన ఒక ముద్ద నోట్లో పెట్టినా అది నమలకుండా బుగ్గన పెట్టుకు కూర్చున్నాడు.

"ఏరా! ఇదివరకిలా అలిగేవాడివి కాదు. చెల్లిపుట్టాక అల్లరి, పేచీలు నేర్చుకుంటున్నావా?" కృష్ణమూర్తి మాటలకి సావిత్రి సమాధానం చెప్పింది.

"అవును మరి, చెల్లి రాన్రిక్రితం వాడే మహరాజు. వాళ్ళ అమ్మ వాడి చుట్టూ తిరిగేది. వాడితోనే దానికి రాత్రి పగలు. ఇప్పుడు చంటిపిల్ల ఆలనా పాలనా చూసుకునేసరికి దానికి సరిపోతోంది. వీడికి అన్నం తినిపించేందుకు కూడా దానికి కుదరడంలేదు. ఆ తేడా వీడికి బాగా అర్ధం అవుతోంది. అందుకే ఈ అలకలు" నిట్టూర్చింది సావిత్రి.

శశి హాస్పిటల్ నుండి వచ్చేసరికి చాలా ఆలస్యమైపోయింది. "అబ్బబ్బ! చాలా రష్‌గా ఉందమ్మా. ఊళ్ళో జనం అంతా అక్కడే ఉన్నారేమో అనిపించింది. అన్నం పెట్టెయ్యమ్మా"

నిద్రపోతున పాపాయిని గదిలో పడుకోబెట్టి భోజనానికి కూర్చుంది శశి. భోజనం ముగింపుకొచ్చాక అడిగింది,

"అమ్మా! వీడేడి? అన్నం తిన్నాడా?"

"నువ్వెళ్ళాక చాలా గొడవపెట్టాడు. అలిగి అన్నం వద్దన్నాడు. నాన్న వచ్చాక ఆయనతో రెండు ముద్దలు తిన్నాడు. ఆయనతోపాటు ఆ గదిలో నిద్రపోయాడు"

"మరీ పేచీలు ఎక్కువైపోతున్నాయి వాడికి" విసుక్కుంది శశి.

తలుపు దగ్గరగా వేసుకుని పాపాయి ప్రక్కన మంచం మీద వాలిపోయింది.

సాయంత్రం ఐదుకావొస్తోంది. రివ్వున గదిలోకి దూసుకొచ్చాడు చిన్ను. "అమ్మా" అంటూ. గాఢ నిద్రలో ఉన్న శశి చటుక్కున కళ్ళు తెరిచింది. ప్రక్కన నిద్రపోతున్న పసిది ఉలిక్కిపడి ఏడుపు అందుకుంది.

ముఖం మీద ముఖం పెట్టి "అమ్మా" అంటూ కావలించుకుంటున్న చిన్నుని ఒక్కసారి విదిలించింది. చేతిలో చాక్‌లెట్ బార్ తింటూ రావడంతో బుగ్గలు, నోరు పులుముకుని ఉంది, తినడం ఆపి ఒక్కసారిగా నిలబడిపోయాడు 'వెళ్ళు తింటూ తింటూ రావద్దన్నానా ఈ గదిలోకి! చెల్లి నీ అరుపుకి భయపడి ఏడుస్తోంది చూడు'

బిత్తరపోయి వాడూ ఏడుపు అందుకున్నాడు.

"అమ్మా! కాసేపు వీణ్ణి అవతలకి పిలు" తల్లికి వినిపించేలా చెప్పి పాపాయిని చేతుల్లోకి తీసుకుంది.

చిన్ను అమ్మమ్మ ఒళ్ళో కూర్చుని టీ.వి చూస్తున్నాడు. వాడి కళ్ళు టీ.వి స్క్రీన్ మీద ఉన్నా మనసు మాత్రం కలతబారింది. వాడి కళ్ళనిండా దిగులు.

సావిత్రి గమనిస్తూనే ఉంది. డెలివరీ అయ్యాక శశి పూర్తిగా కోలుకోలేదు. అందుకే ఈ రెండు నెలలుగా చిన్ను బాధ్యతని పూర్తిగా తను తీసుకుంది. వాడూ తల్లిమీద బెంగపెట్టుకున్నాడనిపిస్తోంది. భోజనం సరిగా చెయ్యడంలేదు.

శని, ఆదివారాలు రెండురోజులు స్కూలుకి సెలవు. ఆ రెండురోజులు తల్లి చుట్టూ తిరుగుతాడు అటెన్షన్ కోసం. తల్లి ప్రక్కనే క్రొత్తగా చెల్లి ఉంటోంది. వాడి పసిమనసుకి ఇదంతా అర్ధం కావడంలేదు.

తండ్రి దూరంగా ఉన్నాడు. అమ్మమ్మ ఎంత ప్రేమ చూపించినా, తాతయ్య ఎంత గారాం చేసినా తల్లిదగ్గరకు తియ్యడం లేదన్న దిగులు వాణ్ణి వేధిస్తోంది.

సావిత్రి మనవణ్ణి దగ్గరగా తీసుకుంది అనునయిస్తున్నట్లుగా ప్రొద్దున్నే పనులు ముగించుకుని కూతురి గదిలోకి వచ్చింది సావిత్రి.

"శశీ! చిన్ను నీమీద బెంగపెట్టుకున్నాడే వాణ్ణి కొంచెం ఓపిక చేసుకుని దగ్గర కూర్చోబెట్టుకో! రోజూ వాడితో కాసేపు గడుపుతూ ఉండు. వాడు తిండికూడా సరిగా తినడంలేదు! "

తల్లి మాటలకి వింతగా చూసింది.

"అదేమిటమ్మా! నువ్వు, నాన్నగారు వాణ్ణి నెత్తిమీద పెట్టుకుని చూస్తున్నారు. వాడి గురించి వర్రీ అవుతావెందుకు"

"శశీ! మేమెంత దగ్గర తీసినా తల్లివి నువ్వు చేరదియ్యడంలేదు. ఇన్నాళ్ళూ వాడికి నీతోడిదే లోకం. ఇప్పుడూ పూర్తిగా నీనుండి విడిపడి ఉండాల్సిరావడం వాడికి అర్ధంకావడంలేదు. నువ్వు వాణ్ణి దేనికోదానికి కసురుకునో, విసురుకునో దూరంగా పంపేస్తున్నావని వాడికి తోస్తోంది. వాడు నిన్ను బాగా మిస్ అవుతున్నాడు"....

"నువ్వు హాస్పిటల్‌కి వెళ్ళాక నన్ను అడుగుతున్నాడు,'అమ్మమ్మా! అమ్మ హాస్పిటల్ నుండి ఇంకా చాలా పాపాయిల్ని తెస్తుందా?' అని. వాడికి అర్ధం అయిందల్లా నువ్వు ఒకసారి హాస్పిటల్ నుండి వస్తూ పాపాయిని తెచ్చావు. అప్పటినుండీ వాణ్ణి పట్టించుకోవడంలేదు. ఇంకా పాపాయిల్ని తెస్తావేమో అనివాడి బెంగ."

"అమ్మా! వాణ్ణి మాత్రం ఎందుకు చూసుకోను. నువ్వు నాన్న ఉన్నారన్న భరోసాతో వదిలేస్తున్నాను. అయినా అస్తమానం 'అమ్మమ్మా' అంటూ నీ వెనకే ఉంటాడు కదా, కబుర్లకోసం, తాయిలాలకోసం. నామీద బెంగపెట్టుకుంటాడని నాకు తోచలేదమ్మా. "

"ఎవరైనా అమ్మ తరవాతేనే శశీ. నీ తర్వాతే మేమంతా. స్కూల్ నుండి వచ్చాక కాస్సేపు నీ దగ్గర కూర్చోబెట్టుకుంటూ ఉండు. పాపాయ్‌ని నేను చూసుకుంటాను."

ఆ రోజు స్కూల్ నుండి తీసుకొచ్చి మనవణ్ణి బట్టలు మార్చి తయారు చేసి టిఫెన్ తినిపించి తల్లి దగ్గరకు పంపింది సావిత్రి.

తల్లి దగ్గర కూర్చుని వాడిబొమ్మలు, పుస్తకాలు చుట్టూ పరిచి ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. వాడి ముఖంలో ప్రపంచాన్ని జయించిన ఆనందం. సావిత్రి హాయిగా ఊపిరి పీల్చుకుంది.

రోజూ స్కూల్ నుండి వస్తూనే తల్లి దగ్గరకు వెళ్ళివాడి కబుర్లన్నీ చెప్పాలి. వాడిలోకం చాలా చాలా ఉంది. ఆ సాయంత్రం పనిమనిషి రాలేదు. వంటింట్లో పనులు తెమలడం లేదు సావిత్రికి. "శశీ! వచ్చి బత్తాయి రసం తీసుకుంటావంటే" తల్లి పిలుపు విని శశి లేచి వెళ్ళింది. రసం తీసుకుని వెళ్ళిన శశి సడన్‌గా కేకలు వెయ్యడం వినిపించి సావిత్రి పరుగెత్తుకొచ్చింది.

చిన్ను జబ్బపుచ్చుకుని గది బయటకు లాక్కొచ్చింది శశి, "చూడమ్మా! నేనలా వచ్చేసరికి వీడేం చేసాడో" తల్లికి ఇంకేమీ వివరించలేక తలుపు భళ్ళున వేసుకుంది శశి.

రాత్రి అందరూ భోజనాలు ముగించి టీ.వి న్యూస్ చూస్తున్నారు. పసివాళ్ళిద్దరూ నిద్రపోయారు. తండ్రితో కబుర్లు చెపుతోంది శశి.

పనులు ముగించుకుని సావిత్రి హాల్లోకి వచ్చింది.

"ఏమే శశీ! చిన్ను ఏం చేశాడు. సాయంత్రం అంతలా కోప్పడ్డావు? బాగా భయపడ్డాడు వాడు"

"వీడితో ఎలా వేగలో తెలీడంలేదమ్మా. నేను పండు రసం తీసుకువచ్చేసరికి పాపాయి ముఖం మీద వాడి కారు బొమ్మ పెట్టి చూపిస్తున్నాడు. అది ఊపిరాడక గిజగిజలాడుతోంది. సమయాన్కి వెళ్ళాను కనుక సరిపోయింది...

రెండురోజుల క్రితం నేను ప్రక్కనే ఉన్నాను. తింటున్న చాక్‌లెట్ దాని నోట్లో కుక్కెయ్యబొయ్యాడు. ఎలాగమ్మా ఇలా?" బేలగా అడిగింది శశి.

"ఇవన్నీ తప్పవు శశీ మనం వెయ్యికళ్ళతో కాచుకోవాలి పసివాళ్ళని"

"ఏమోనమ్మా. నాకు తెలియదు. వీడిని కొన్నాళ్ళు నీ దగ్గర వదిలేసి వెళ్ళినా అని ఆలోచిస్తున్నాను. పసిదాన్ని ఎప్పుడు ఏం చేస్తాడో అని భయం వేస్తోంది"

"అలాంటి పనిచెయ్యకు శశీ. ఇప్పటికే వాడు నీ మీద బెంగతో నీ అటెన్షన్ కోసం తపిస్తున్నాడు. వాడికి చెల్లలంటే ఎంత ఆపేక్షో. 'అమ్మమ్మ చెల్లికి మమ్మం పెట్టేవా?' అని అడుగుతాడు రోజూ. మొన్న ఉయ్యాలపేరంటం రోజు ఉయ్యాల్లో పాపాయిని ఎవ్వర్నీ ఎత్తుకోవద్దనీ, అది తన చెల్లెలనీ ఎంత గొడవచేశాడు! గుర్తులేదూ"

తల్లిమాటల్లో నూరుశాతం వాస్తవం ఉందని శశికి తెలుసు. నిద్రకి లేచి వెళుతూ "అమ్మా! శిరీష ఊరునుంచి వచ్చింది. రేపు మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పింది. దానిక్కూడా వండు" అంటూ స్నేహితురాలి రాక గురించి తల్లికి సమాచారం అందించింది.

సాయంత్రం చిన్ను స్కూలు నుండి వస్తూనే ఎప్పటిలా గదిలోకి పరుగెత్తుకొచ్చాడు. శశితో గదిలో ఉన్న శిరీషని చూసి ఒక్క అడుగు వెనక్కి వేసినవాడు అంతలోనే తల్లి దగ్గరకు పరుగెత్తి 'అమ్మా!...' అంటూ ఏదో అనబోయేంతలో "చిన్నూ! ఈ ఆంటీ నీ కబుర్లు వినేందుకు వచ్చింది. త్వరగా తయారైరా" శిరీష వైపుఆసక్తిగా చూస్తూ నెమ్మదిగా అమ్మమ్మ దగ్గరకు వెళ్ళాడు.

రాత్రి మరీ ప్రొద్దు పోలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. బయట అప్పుడో చినుకు, అప్పుడో చినుకు చేస్తున్న చప్పుడు మినహా రోడ్లన్నీ నిర్మానుష్యంగా నిద్రపోతున్నట్లున్నాయి.

శశి మనసంతా పశ్చాత్తాపంతో కృంగిపోయింది. నిద్రపోతున్న కొడుకు దగ్గరకు వెళ్ళింది. పాలు కారే ఆ బుగ్గలు. ముఖం మీద పడుతున్న ఒత్తైన జుత్తు, నిద్రలోనూ దిగులుతో ముడుచుకున్న బుల్లి సున్నాలాటి నోరు..

వీడు.. ఈ పసివాడు గత రెండుమూడు నెలలుగా తనకంటికెందుకు సడన్‌గా పెద్దవాడైపోయినట్లు కనిపిస్తున్నాడో శశికి అర్థం అవుతోంది. ప్రక్కనే ఉయ్యాల్లో పాపాయి నిద్రలో చిన్నగా కదిలింది. ఆ చిన్ని పెదవుల మీద పరుచుకున్న విశాలమైన నవ్వులు.

సాయంత్రం జరిగిన సంఘటన పదేపదే శశికళ్ళుముందుకొస్తూంది.

శిరీష చిన్నూతో కబుర్లు చెబుతూ చాలాసేపు ఉండిపోయింది. తను తెచ్చిన బొమ్మలు, డ్రాయింగ్ బుక్స్, కలర్స్ అన్నీ వాడి చేతికిచ్చింది.

వాడు ఆనందంగా డ్రాయింగ్ బుక్ తెరిచి రంగుల లోకంలో మునిగిపోయాడు. "చిన్నూ! పాపాయిని మా ఇంటికి తీసుకు వెళ్ళిపోతున్నాను. అందుకే వచ్చాను" అంటున్న శిరీష మాటలకి చిన్నూ చాలా గొడవచేశాడు.

"ఇది నా చెల్లి. నేనివ్వను" వాడి పొసెసివ్‌నెస్ చూసి మరీ మరీ వాణ్ణి ఉడికించింది శిరీష.

"శిరీ! నీ కబుర్లు సరే. మధ్యాహ్నం సరిగ్గా భోజనం చెయ్యలేదు. అమ్మ నీకోసం పకోడీలు చేసింది. ఇవైనా తిను" స్నేహితురాల్ని కొసరి కొసరి తినిపించే ప్రయత్నం చేస్తోంది శశి.

సాయంత్రం చీకటి పడుతోంది.

"శశీ! వెళతానే అమ్మ ఎదురు చూస్తుంటుంది. వెళ్ళేలోపు మళ్ళీ వచ్చేందుకు ప్రయత్నిస్తాను"

గుమ్మం దాకా వెళ్ళిన స్నేహితురాళ్ళ కబుర్లు అక్కడ మరో అరగంట సాగాయి. ఆమె వెళ్ళాక సావిత్రి కూతుర్ని భోజనానికి పిలిచింది.

"శశీ భోజనం వడ్డించేస్తున్నానురా. పాపాయి పడుకుంది కదా. లేస్తే నేను చూసుకుంటాను" తల్లి పిలుపుకి వంటింట్లోకి వెళుతూ గదిలోకి ఒకసారి తొంగి చూసింది.

పాపాయి నిద్రలో ఉంది. చిన్నూ రంగుల్లో ఉన్నాడు.

సడన్‌గా పాపాయి ఏడుపు వినిపించి కంచం దగ్గర్నుండి లేచి పరుగెత్తింది శశి. ఆమె గదిలోకి వచ్చేసరికి చిన్ను పాపాయి మీదకి ఒంగి సముదాయించే ప్రయత్నం కాబోలు చేస్తున్నాడు.

"ఏం చేసావురా నిద్రపోతున్నదాన్ని" గభాలున వాణ్ణి ఇవతలకు లాగి పసిదాన్ని చేతుల్లోకి తీసుకుంది.

"ఏం చెయ్యలేదమ్మా. చెల్లిని ఏడవవద్దని చెబుతున్నాను"

"ఏం చెయ్యకపోతే నిద్రపోతున్న పిల్ల ఎందుకు అంతలా ఏడుస్తుంది. చెల్లాయి దగ్గరకు రాకు నువ్వు. ఫో, అమ్మమ్మ దగ్గరకి. " తల్లి కసురుకోవడంతో చిన్న మొహం వేసి వెనక్కి తిరిగాడు.

పాపాయి చాలాసేపు ఏడుస్తూనే ఉంది. పాపాయి ఏడుపుతో శశికి ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది. ఈ పిల్లల్ని తను సవ్యంగా పెంచగలదా. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. డెలవరీ అయ్యాక శరీరానికి పూర్తి సత్తువ ఇంకా రాలేదు. ఆ నీరసంతో అస్తమానూ కోపం వచ్చేస్తోంది. కొన్నాళ్ళు చిన్నూని తల్లిదగ్గర విడిచి భర్తదగ్గరికి వెళ్ళాలా అని ఆలోచిస్తుంది కాని వాణ్ణి విడిచి ఉండగలదా తను? వాడు పాపాయిని చూసి జెలసీ ఫీలవతున్నాడా అని భయం వేస్తుంది. పాపాయిని తల్లి బడిలో చూసినప్పుడు ఎక్కడో ఆడుకుంటున్న వాడు కాస్తా తల్లి చుట్టూ తిరిగి ఆమె అటెన్షన్ కోసం అర్థంలేని అల్లరి చేస్తున్నాడు చిన్ను.

"పాపాయి చిన్నది కదా. నువ్వు పెద్దవాడివి అయ్యావు. చక్కగా నీ బొమ్మలతో ఆడుకో" తల్లి మాటలుచెవినిపెట్టుకోక 'నన్నూ ఎత్తుకో' అని గొడవ మొదలుపెడతాడు వాణ్ణి సమాధానపరచలేక విసుక్కుంటోంది.

"అమ్మా! వీడిని నా గదిలోకి పంపొద్దసలు. పాపాయిని ఏం చేసాడో అంతలా ఏడ్చింది. పడుకున్న దాని ఏడిపించాడు. అసలు దాన్ని చూస్తేనే వీడికి నచ్చట్లేదు. బాగా కుళ్ళుగుణాలు వస్తున్నాయి వెధవకి" తల్లి కేకలకి చిన్నూ అమ్మమ్మని కావలించుకున్నాడు. వాడి బుగ్గలమీద ధార కట్టిన కన్నీళ్ళు కూడా శశి కోపాన్ని ఆర్పలేకపోయాయి.

"దెబ్బలు పడక ఇలా తయారయాడసలు" చిన్ను మీదకి రాబోతున్న కూతుర్ని చూసి,

"నీకేమన్నా మతిపోయిందటే శశీ. పసివాణ్ణి పట్టుకుని ఏమిటామాటలు" తల్లిమాటలకి ఉక్రోషంగా గదిలోకి వెళ్ళిపోయింది.

వంటిల్లు చక్కబెట్టుకుని కూతురుకి పాలగ్లాసు తీసుకొచ్చింది సావిత్రి. పడక్కుర్చీలో చేతుల్లో పాపాయితో అలాగే కూర్చుంది శశి. నిద్రపోతున్న పాపాయిని నెమ్మదిగా ఉయ్యాల్లో పడుకోబెట్టింది. పాపాయి కుడిచేతి మీద ఎర్రగా కందినట్లు ఉండడం చూసి కొంచెం కొబ్బరి నూనె రాసింది.

తల్లి తెచ్చిచ్చిన పాలు త్రాగి పక్కమీద పడుకోబోతూ మంచం క్రింద ఏదో పడి ఉండడం గమనించి, ఒంగి చేత్తో తీసింది.

"పకోడీ...." దాని చుట్టూ ఎర్రచీమల బారు...... పాపాయి ఏడుపుకు సాక్షిగా.

శశికి ఒక్కసారి షాక్ కొట్టినట్టైంది. ఇందాక శిరీష తింటూ తింటూ మంచం మీద కూర్చుంది పాపాయిని పలకరిస్తూ.

పాపాయి మంచం దగ్గర ట్యూబ్ లైట్ పని చెయ్యకపోవడంతో చిన్న బల్బు వేసింది శిరీషతో మాట్లాడుతూ. క్రిందపడిన పకోడిని ఎవరూ గమనించలేదు.

శశి మనసుకి సమాధానం చెప్పలేకపోయింది. చిన్నూని తింటూ తింటూ గదిలోకి రావద్దని ఆంక్షలు పెట్టింది. తనుమాత్రం స్నేహితురాలి కోసం ఫలహారం గదిలోకి తెచ్చింది. ఆమె మనసంతా మళ్ళీ మళ్ళీ అపరాధభావంతో ముడుచుకుపోయింది.

# మంచుతెర 'నెమలికన్ను' మురళి

**టాక్సీ నెమ్మదిగా ప్రయాణిస్తూ** టౌన్ దాటి ఘాట్ రోడ్డెక్కింది. సూర్యుడింకా నిద్ర లేవలేదు.. శీతాకాలం కదా, ఆయనకి కూడా బద్ధకంగా ఉందనుకుంటా. పాతకాలపు అంబాసిడర్ అవ్వడంతో విశాలంగా అనిపిస్తోంది, మా 'మారుతి' తో పోలిస్తే. వెనుక సీట్లో విండోకి ఒక పక్క నేను. ఘాట్ రోడ్డుకి రెండుపక్కలా ఉన్న అడివి చెట్లు మంచులో తడుస్తూ కనిపించాయి. వాతావరణం చలి చలిగా ఉంది. నా మూడ్ డిస్టర్బ్‌డ్ గా ఉంది. పాటలు వింటూ మూడ్ మార్చుకుందామని ఇయర్ ఫోన్స్ తగిలించుకున్నాను.. ఇళయరాజా సంగీతం వినగానే నేను కార్లో కాక, రోడ్డు మీద మంచులో తడుస్తున్నాననిపించింది. "మంచు కురిసే వేళలో మల్లె విరిసేనేందుకో.." అంటూ జానకి గొంతు.. నాకీవిడ అంటే కొంచం ప్రత్యేకమైన అభిమానం.. నా పేరు కూడా జానకే.

సీట్లో అటు చివర విండో పక్క కూర్చుని బిజీగా ఫోన్ మాట్లాడుకుంటున్న పురుషుడు నేను రాముా అని పిలుచుకునే రామకృష్ణ. పధ్నాలుగేళ్ళ క్రితం నాకు మొగుడై, తర్వాత నా ఇద్దరు పిల్లలకీ తండ్రయ్యాడు. పధ్నాలుగేళ్ళు అనుకోగానే నాకు 'వనవాసం' గుర్తొస్తోంది.. ఇన్నాళ్ళూ నేను చేసింది వనవాసమేనా? కట్టుకున్న వాడు రాముడైతే వనవాసమైనా సంతోషంగా చేయొచ్చు.. కానీ ఇతగాడు రాముడో, కృష్ణుడో తెలియడం లేదిప్పుడు. నెల క్రితం వరకూ నావాడు రాముడనే నమ్మాను.. ప్చ్.. ఇప్పుడలా అనుకోలేక పోతున్నాను. సీటు మధ్యలో ఉంచిన నా నల్లని హ్యాండ్ బ్యాగ్ శత్రు దేశాల మధ్య సరిహద్దు రేఖలా కనిపిస్తోంది.

మా పెళ్ళైన కొత్తలో ఇద్దరం కలిసి మొదటిసారి తిరుమల కొండకి వచ్చాం. అప్పుడూ ఇలా టాక్సీలో ప్రయాణమే, స్టేషన్ నుంచి గుడికి. ఇప్పటిలాగే అప్పుడు కూడా మేమిద్దరం, ముందు సీట్లో డ్రైవర్ మాత్రమే. కానీ అప్పుడు మా ఇద్దరి మధ్యా సరిహద్దు రేఖ లేదు.. అసలు హద్దులే లేవు. మేమిద్దరం చేసిన అల్లరికి కారు డ్రైవర్ ముసిముసిగా నవ్వుకోడం తెలుస్తూనే ఉంది. డ్రైవర్ ఏమన్నా అనుకుంటాడేమో అని రాముా చెవిలో గొణిగితే "వాళ్ళకి ఇవన్నీ మామూలే" అని కొట్టి పడేశాడు తను. రోజులు ఎంత సంతోషంగా గడిచిపోయాయో కదా..

"మన్మధునితో జన్మ వైరం చాటినపుడే.." అంటున్నాడు బాలు నా చెవుల్లో. కసిగా పీక నొక్కేశాను. బాలుది కాదు, నా మొబైల్ ఫోన్ కం ఎంపీత్రీ ప్లేయర్‌ది. శ్రీమాన్ రామకృష్ణ గారి ఫోన్ సంభాషణ ఇంకా పూర్తవ్వలేదు. ఎవరితో మాట్లాడుతున్నాడో తెలీదు.. అవతలి వాళ్ళని ప్లీజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడని మాత్రం తెలుస్తోంది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. మనుషుల్ని మాటలతో పడగొట్టడం ఎలాగో మా ఆయన దగ్గరే నేర్చుకోవాలి ఎవరైనా. తన ఫోన్ కూడా విసిరి కొడదామా అన్న ఆలోచన వచ్చింది కానీ, నేను తనతో 'మౌన వ్రతం'లో ఉన్న విషయం గుర్తొచ్చి ఊరుకున్నాను. ఇంటికి కాల్ చేద్దాం అనుకున్నా కానీ ఎవరితో మాట్లాడాలి? మానస ఈపాటికి ట్యూషన్‌కి వెళ్ళిపోయి ఉంటుంది. జయబాబు ఇంకా నిద్ర లేచి ఉండడు. నేను లేకపొతే అమ్మ వాడిని మరీ చెడగొట్టేస్తుంది.

మా బ్యాంక్ వాళ్ళకి ఎవరికైనా చేసి సుత్తి కొట్టొచ్చు.. ఆఫీసర్ని కదా, భయానికైనా మాట్లాడతారు. కానీ వెనుక తిట్టుకుంటారు. అయినా విషయం ఏమీ లేకుండా ఇంత ఉదయాన్నే ఫోన్ ఏమిటి? ఆలోచన కట్టి పెట్టి కారు విండో నుంచి బయటికి చూడడం మొదలు పెట్టాను, ఘాట్ రోడ్డు కుదుపులకి యెగిరి తన ఒళ్ళో పడకుండా ముందు సీట్‌ని గట్టిగా పట్టుకుని. సూర్యుడు బద్ధకంగా నిద్ర లేచినట్టున్నాడు. లేత ఎండ పడి చెట్ల ఆకుల మీద పేరుకున్న మంచు నెమ్మదిగా కరుగుతోంది. యెర్రని, పచ్చని అడివి పూమొగ్గలు నెమ్మదిగా విచ్చుకుంటున్నాయి. వాటి నుంచి వచ్చే పరిమళం కోసం విండోని కొద్దిగా దించుదామా అనుకుంటుండగా మొబైల్ 'బీప్ బీప్'

మంది. ఇంత ఉదయాన్నే ఎవరబ్బా అని చూస్తే రాము నుంచి. "మనం దైవ దర్శనానికి వెళుతున్నట్టు లేదు.. విడాకుల కోసం కోర్టుకి వెళుతున్నట్టుంది" అని పక్కనో స్మైలీ పెట్టాడు.

తన ఉద్దేశం నేను తల తిప్పి తనవైపు చూడాలని..కావాలనే అస్సలు చూడకుండా, విండో అద్దం దింపే పనిలో పడ్డాను. చల్లగాలి జివ్వున తగలడంతో, కట్టుకున్న కాటన్ చీర కొంగుని చెవుల చుట్టూ కప్పుకుంటూ తన వైపు ఓరగా చూశాను, నవ్వు దాచుకునే ప్రయత్నంలో ఉన్నాడు అందగాడు. కోపంగా అనడం కాదు కానీ రాము నిజంగా అందగాడే "అరవింద స్వామికి కజిన్‌లా ఉన్నాడే యూ ఆర్ సో లక్కీ .." అంది నా క్లోజ్ ఫ్రెండ్ మాలతి. దానికి అరవింద స్వామి అంటే పిచ్చి.

అసలు మా పెళ్ళి కుదరడమే చాలా చిత్రంగా జరిగింది. నేనప్పుడు పీజీ పూర్తి చేసి బ్యాంక్ టెస్ట్‌లకి ప్రిపేర్ అవుతున్నాను. నాన్న ఫ్రెండ్ చారి అంకుల్ మా ఇంటికి వచ్చారో రోజు. నాన్నతో పాటే సెక్రటేరియట్లో పనిచేస్తున్నారాయన. నాన్న ఒక సెక్షన్‌కి ఆఫీసర్ అయితే, ఆయన మరో సెక్షన్ ఆఫీసర్. "రామకృష్ణ అని నా సెక్షన్‌లో ఓ యూడీసీ ఉన్నాడోయ్. మీవాడే. కుర్రాడు బాగుంటాడు, బుద్ధిమంతుడు. అమ్మాయి కోసం ప్రయత్నించ రాదూ.." నా రూంలో చదువుకుంటున్నా అంకుల్ మాటలు నా చెవిన పడ్డాయి.

అప్పటివరకూ పెళ్ళి గురించి సీరియస్‌గా ఆలోచించ లేదు నేను.. నాన్న కూడా అంతే అనుకుంటా.. నెల్లాళ్ళ తర్వాత ఒకరోజు రాత్రి అమ్మ చెప్పింది, మర్నాడు నాకు పెళ్ళి చూపులని. వచ్చిన వాడు రామకృష్ణుడే నాన్న ఆఫీసులో ఓ నెల్లాళ్ళ పాటు ఎంక్వైరీలు చేసి కుర్రాడు మంచాడే అని తేల్చుకున్నారుట.. అమ్మమ్మ చెప్పింది నాకు. అమ్మమ్మ నాన్నకి సొంత అక్క, మా ఇంట్లో నాకు బెస్ట్ ఫ్రెండ్ ఎంగేజ్మెంటుకీ, పెళ్ళికీ మధ్య ఓ మూడు నెల్ల గ్యాప్ వచ్చింది. ఇద్దరం ఉండేది హైదరాబాదే అయినా కలుసుకున్నది తక్కువే. తనంతట తానుగా ఎప్పుడూ ప్రయత్నించేవాడు కాదు.

ఎలా తెలిసిందో కానీ, కాబోయే అల్లుడికి పులస చేపల పులుసంటే మహా ఇష్టమని నాన్నకి తెలిసింది. సీజన్ కూడా అవ్వడంతో తెలిసిన వాళ్ళ చేత రాజమండ్రి నుంచి పులస తెప్పించి, ఓ ఆదివారం రాముని భోజనానికి పిలిచారు. "గోదారి జిల్లా వాళ్ళలా ఈ పులస పిచ్చేమిటో ఇతగాడికి" అని గొణిగాను అమ్మమ్మ దగ్గర. "మొగాడు మనం చెప్పినట్టు వినాలంటే వాడికి నచ్చిన వంట చేసి పెడితే చాలే," అని రహస్యం చెప్పింది అమ్మమ్మ. 'మనవడికి' ఇష్టమైన వంటకాలేమిటో కూపీ లాగి, అవన్నీ తర్వాత నాకు వరుసగా నేర్పించింది కూడా. భోజనాలయ్యాక సినిమా ప్రోగ్రాం వేశాడు అన్నయ్య. ముగ్గురం థియేటర్‌కి బయలుదేరాం కానీ, చివరి నిమిషంలో అన్నయ్య డ్రాప్ అయ్యాడు, ఏదో వంక చెప్పి. అది ఇంటిల్లపాదీ కలిసి నా మీద చేసిన కుట్ర అని అర్థమయ్యింది.

సినిమాలో హీరో ఎవరో కూడా తెలీదు నాకు. అసలు సినిమా చూస్తే కదా.. "నా గురించి మీ ఇంట్లో ఏమన్నారు?" అని రాముని అడిగాను, మాటల మధ్యలో. "పిల్ల నలుపైనా ముఖంలో లక్ష్మీ కళ ఉందన్నారు," అని చాలా మామూలుగా చెప్పాడు. నాకెంత కోపం వచ్చిందంటే, సినిమా అయ్యేంత వరకూ రాము నన్ను బతిమాలుకుంటూనే ఉన్నాడు. నిజానికి నేనేమీ నలుపు కాదు, చామన చాయ.. తను మంచి రంగవ్వడం వల్ల నేను నల్లగా కనిపించినట్టున్నాను వాళ్ళకి. ఈ పధ్నాలుగేళ్ళ లోనూ విషయాన్ని గురించి ఎన్ని సార్లు వాదించుకున్నామో లెక్కే లేదు.

ఆలోచనల్లో పడి ఎదుటి సీటు ఎప్పుడు వదిలేశానో తెలీదు. నేను జరగ కూడదనుకున్న ప్రమాదం జరగనే జరిగింది. టాక్సీ బ్లైండ్ కర్వ్ తీసుకోడం, నేను యెగిరి రాము భుజం మీద పడడం ఒక్కసారే జరిగింది. నా తల తగిలి తన కుడి చెవి ఎర్రగా కందిపోయింది. నేను సర్దుకుని కూర్చొనే లోగానే, తను చెవి రాసుకుంటూ నా వైపు చూసి నవ్వాడు. అంత కోపంలోనూ నేను ఒక్కసారిగా గతంలోకి వెళ్ళిపోయాను. మా పెళ్ళయ్యాక మలి రాత్రి మూడో జామున.. ముద్దులకి విరామం ఇచ్చి ముచ్చట్లు మొదలు పెట్టిన వేళ.. "నేను మొదట చూసింది నీ పాదాలనే తెలుసా.." అన్నాడు రాము, నా మెట్టెలని సవరిస్తూ. "ఊ?" అన్నాన్నేను, పెళ్ళిచూపుల్లో అలవాట్లో పొరపాటుగా కాలి మీద కాలేసుకుని కూర్చుని తర్వాత అమ్మ చేత తిట్లు తినడాన్ని గుర్తు చేసుకుంటూ.

"అమ్మాయి కనబడగానే, ముందు కాలి వేళ్ళకి మెట్టెలు ఉన్నాయో లేదో చూడడం, తర్వాత చెప్పుల క్వాలిటీ అంచనా వేయడం అలవాటైపోయి..." తన మాట పూర్తి కాలేదు, నా ఎడం చేత్తో తన కుడి చెవి అందుకుని కసితీరా మెలి పెట్టేశాను. తను "కెవ్వు" మని అరిచిన అరుపుకి నా గుండె ఒక్కసారి ఆగి మళ్ళీ కొట్టుకుంది. ఇంట్లో వాళ్ళంతా నిద్ర లేచే ఉంటారు అరుపుకి. రేప్పొద్దున్న వాళ్ళందరికీ ముఖం ఎలా చూపించాలో, ఏమిటో. రామూని చూస్తే సీరియస్‌గా పడుకున్నాడు, చెవి మీద చేయి ఆన్చుకుని. దగ్గరికి వెళ్ళి పలకరించడానికి కొంచం భయం వేసింది. అలా అని అమ్మమ్మ దగ్గరికి వెళ్ళి పడుకుందామా అంటే, ఇంట్లో వాళ్ళంతా పంచాయితీ పెట్టేస్తారేమో అని భయం. చిన్నప్పటినుంచీ నేనంతే.. ఆవేశ పడిపోడం, తర్వాత తీరిగ్గా బాధ పడడం. ఓ గంట గదిలోనే కాలక్షేపం చేసి, నెమ్మదిగా అమ్మమ్మ పక్కలోకి చేరిపోయాను.

నాకున్న కష్టం చాలదన్నట్టు భోజనాల వేళకి రామలక్ష్మత్తమ్మ దిగబడింది. ఆవిడ మాకు దూరపు బంధువు. నూజివీడు పక్కన పల్లెటూరు. "మన వెంకటరావు కూతురి పెళ్ళి కూడా మీ ఇంట్లో పెళ్ళి ముహూర్తానికే అయ్యింది కదా.. మన ఊరొచ్చి పిలిచాడు.. అందుకని పెళ్ళికెళ్ళి, మీ అల్లుడిని కూడా చూసి పోదామని వచ్చాను.. కుక్కలపల్లిలో ఇల్లు కట్టాడు వెంకటరావు..పెళ్ళి కూడా ఎంత గొప్పగా చేశాడో.." నాన్నతో నాన్‌స్టాప్‌గా మాట్లాడేస్తోంది అత్తమ్మ, మా ఇల్లంతా గుచ్చి గుచ్చి చూస్తూ. మాట అనడానికి ఎక్కడ ఏ వంక దొరుకుతుందా అని వెతకడం ఆవిడ అలవాటు. నాకు రామూ చెవి గురించి బెంగ పట్టుకుంది. దానికి తోడు, అతగాడు శేష పానుపు మీద విష్ణుమూర్తిలా బెడ్‌రూంలో డబల్ కాట్ దిగడం లేదు.. నేను ఎన్నిసార్లు దొంగలా గదిలోకి తొంగి చూసినా తన చెవి మాత్రం కనిపించడం లేదు.

అందరం భోజనాలకి కూర్చున్నాం. అత్తమ్మ రామూని కళ్ళతోనే ఎక్స్ రే తీసేస్తోంది. "అదేంటి బాబూ. చెవంత ఎర్రగా ఉందీ.." అని ఆరాతీసింది, తనేదో కనిపెట్టేశానన్న ఆనందంలో. నేల చీలిపోయి, నేనందులో కూరుకుపోతే బాగుండుననిపించింది. మా వాళ్ళందరికీ వాళ్ళ డౌట్లకి సమాధానం దొరికినట్టుంది. వాళ్ళంతా ముసిముసిగా నవ్వుకుంటున్నారని అనుమానం నాకు. ఎవరివైపూ చూడకుండా తలొంచుకుని విస్తరి కెలుకుతూ కూర్చున్నా.. "చీమేదో కుట్టినట్టుందండీ.." అన్నాడు రామూ, అమాయకత్వం అభినయిస్తూ. అప్పటికి ఎవరూ ఏమీ మాట్లాడలేదు కానీ, తర్వాత అమ్మమ్మ నన్ను ఒక్కదాన్నీ పట్టుకుని "అబ్బాయి మరీ సున్నితంలా ఉన్నాడు.. అంత మోటు సరసం కూడదే పిల్లా.." అంటూ పేద్ద లెక్చర్ ఇచ్చేసింది, నేను చెప్పేది వినిపించుకోకుండా.

వేళ అర్ధరాత్రి, అప్పుడే ఏదో గుర్తొచ్చినట్టు "నీకో విషయం చెప్పాలి, కొంచం రహస్యం," అన్నాడు రామూ, గదిలో ఉన్నది మేమిద్దరమే అయినా నా చెవి దగ్గరకి వస్తూ. "మధ్యాహ్నం భోజనానికి వచ్చే ముందు నా చెవి నేనే పిండుకున్నా.." జరిగిందేమిటో అర్ధం అవ్వగానే యాపిల్ కోసే చాకుతో తనని ఒక్క పోటు పొడవాలనిపించింది. కానీ నా చెవుల మీద గిలిగింతలు పెడుతున్న తన మీసాలు నా కోపాన్ని మంచులా కరిగించేశాయి. నన్ను ప్రసన్నం చేసుకునే రహస్యం ఒకటి నా పతి దేవుడికి తెలిసిపోయింది. ఏమో అనుకున్నాను కానీ కనిపించినంత ముద్ద పప్పేమీ కాదు కుర్రాడు. "చెప్పులవైపు చూస్తావా? మీ గుంటూరోళ్ళు భలే ధైర్యస్తులే.." అంటూ కిలకిల్లాడాను. "తెలిసి తెలిసి కృష్ణా జిల్లా పిల్లని చేసుకున్నానంటే ఎంత ధైర్యం ఉండాలి మరి?" అని రిటార్ట్ ఇచ్చాడు తను.

నేనింకా ఫ్లాష్ బ్యాక్ నుంచి బయటికి రాక ముందే, టాక్సీ కాటేజ్ ముందు ఆగింది. పళ్ళ మొక్కలు, పూల మొక్కల మధ్య అడివిలో కట్టిన మోడర్న్ కుటీరంలా భలేగా ఉంది కాటేజీ. ఏమాటకి ఆమాటే చెప్పుకోవాలి, ఎంత చివరి నిమిషం ప్రయాణమైనా సరే ఏర్పాట్లన్నీ పక్కాగా చేస్తాడు రామూ. సెక్షన్ ఆఫీసర్‌గా తనకున్న పరపతికి తోడు, తను మెయింటెన్ చేసే పీ.ఆర్ కూడా బాగా ఉపయోగ పడుతుంది ఇలాంటప్పుడు. నేను పూల మొక్కలని పలకరిస్తుండగా, డ్రైవర్ చేత లగేజీని కాటేజిలో పెట్టించాడు రామూ.

చుట్టూ వాతావరణం నాకు బాగా నచ్చినా, రామూ నన్ను చూసినప్పుడల్లా ముఖం మాడ్చుకుంటున్నాను నేను. తను మాత్రం అదేమీ పట్టించుకోనట్టు తన పనులు చేసుకుంటున్నాడు. అది చూసి ఇంకా మండుతోంది నాకు. కాఫీ టిఫిన్స్ కాటేజికే వచ్చాయి. అదేదో

నవల్లోలా మా ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది. "దర్శనం టిక్కెట్లు తీసుకొస్తా.." అని చెప్పి తను బయటికి వెళ్ళాడు. కాటేజిలో ఒంటరిగా నేను.. చిన్నప్పటినుంచీ కూడా ఒంటరిగా ఉన్నప్పుడల్లా ఆలోచనల్లోకి వెళ్ళిపోవడం నా అలవాటు. నాకు తెలియకుండానే జరిగిపోతుంది. రాముకీ నాకూ మొదటిసారి గొడవ జరిగిన సందర్భం గుర్తొచ్చింది.

మేమిద్దరం కాపురం పెట్టిన పది రోజులకి, ఉదయం తను ఆఫీసుకి వెళ్ళేటప్పుడే సాయంత్రం తన కొలీగ్ ఇంటికి భోజనానికి వెళ్ళాలనీ, రెడీగా ఉండమనీ చెప్పి వెళ్ళాడు. తను వచ్చేసరికే సిద్ధమై పోయాను. ఎప్పుడో ఎగ్జిబిషన్‌లో ముచ్చట పడి కొనుక్కున్న నల్లంచు చందనం రంగు నేత చీర కట్టుకున్నాను. పదో తరగతి పాసైనప్పుడు అమ్మమ్మ నాకు మురిపెంగా చేయించిన బుట్టల గొలుసు వేసుకున్నాను. చెవి జూకాలు మార్చి బుట్టలు పెట్టుకున్నాను. తలంటి స్నానం చేసిన జుట్టు సాంబ్రాణి పొగ వేసి ఆరబెట్టుకుని పొడవాటి జడ వేసుకున్నాను. అమ్మమ్మ చిన్నప్పటినుంచీ చేసిన సంరక్షణ పుణ్యమా అని నా జడ బారెడు ఉండేది అప్పట్లో.

విజిలేసుకుంటూ ఇంట్లోకి వచ్చిన మా ఆయన నన్ను చూడగానే బొమ్మలా నిలబడి పోయాడు. "జానీ.. నువ్వేనా?! ఎంత బాగున్నావో.. అచ్చం 'సాగర సంగమం' లో జయప్రదలా..." చివరి మాట వినగానే నాకు వేసవి కాలంలో వేన్నీళ్ళు స్నానం చేసినట్టు అనిపించింది. అసలు నన్ను ఎవరితోనూ పోల్చడం ఇష్టం ఉండదు.. ఇంకెవరూ దొరకనట్టు జయప్రదతో.. అయినా ఆవిడగారికి మరీ అంత అందమా? .. తను హాల్లో నిలబడి ఉంటే, నేను బెడ్‌రూంలో ఉన్నా.. తన ముఖం మీదే బెడ్‌రూం తలుపు విసురుగా లాగి, "నువ్వు మాత్రం 'స్వాతిముత్యం'లో కమల్ హాసన్ లా ఉన్నావ్" అని అరిచి భళ్ళున తలుపేశా.. మూడు రోజులు మాటల్లేవు మా ఇద్దరికీ.

మూడో రోజు మధ్యాహ్నం పక్క కాలనీలో ఉన్న అమ్మ వాళ్ళింటికి వెళ్ళి, అమ్మమ్మకి జరిగింది రహస్యంగా చెప్పేశా. "మొగాడికి అంత కోపం తెప్పించకూడదే. వాళ్ళ మాట వింటున్నట్టే ఉంటూ, మనం చేయదల్చుకున్నది చేసేయాలి. గొడవలు పెంచుకోడం తెలివైన వాళ్ళ లక్షణం కాదు.." అంటూ హితబోధ మొదలు.. మగవాళ్ళ గురించి అమ్మమ్మకి ఇన్ని విషయాలు తెలుసు కదా, అయినా తాతయ్య ఇల్లు విడిచి పెట్టి ఎందుకు వెళ్ళిపోయాడా? అని ఎప్పుడూ ఒకటే సందేహం నాకు. వేళ సాయంత్రం అమ్మ, అమ్మమ్మ మమ్మల్ని చూడ్డానికి వచ్చినట్టుగా వచ్చి, రామూని మాటల్లో పెట్టి, గొడవ సద్దుబాటు చేసేశారు. అమ్మమ్మకి నోరు నొప్పి మిగిలింది తప్ప, ఆవిడ బోధలు నామీద పనిచేయలేదు.

మా పెళ్ళైన ఏడాదికి మానస పుట్టింది. కన్సీవ్ ఐనప్పటినుంచీ మగపిల్లాడు కావాలని నాకు, ఆడపిల్ల పుట్టాలని రామూ..చివరికి తనే గెలిచాడు.. అదే. నేనే గెలిపించాను.. మరి కన్నది నేనే కదా. మానస మొదటి పుట్టిన రోజు నాటికి నాకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఇంటితో పాటు ఆఫీసు బాధ్యత కూడా మీదపడింది. మొదట్లో సరదాగానే అనిపించింది కానీ, రాను రానూ నాకు విసుగు ఎక్కువయ్యింది. మానస రెండో పుట్టిన రోజయ్యాక రోజు సాయంత్రం నాకూ, రామూకీ ఏదో విషయం మీద గొడవ జరిగింది. కొంచం పెద్దదే మా గొడవ పూర్తవ్వక ముందే మాకు తెలిసిన వాళ్ళు వచ్చారు, పెళ్ళిపిలుపు కోసం. ఇద్దరం వాళ్ళని నవ్వుతూ ఆహ్వానించాం. వాళ్ళు మానస చేత మాట్లాడిస్తూ, దాని ముద్దు మాటలకి మురిసి పోతున్నారు.

"నాన్న అమ్మని పూల్ అన్నాలు.. అమ్మేమో నువ్వే పూల్ అంది.." అని మానస చేతులు తిప్పుతూ చెబుతుంటే నాకూ, రామూకీ ఏం చెయ్యాలో అర్థం కాలేదు. వచ్చిన వాళ్ళు మాట మార్చేసి, ఏవో కబుర్లు చెప్పి నేనిచ్చిన కాఫీ తాగి వెళ్ళిపోయారు. పిల్ల ఎదురుగా ఇంకెప్పుడూ పోట్లాడుకోకూడదని ఇద్దరం ఏకగ్రీవంగా ఒక నిర్ణయానికి వచ్చాం ఆ రోజు. ఇప్పటికీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. కాటేజీ తలుపు చప్పుడవ్వడంతో ఆలోచనలనుంచి బయట పడ్డాను. వీలైనంతగా ముఖం మాడ్చుకుని వెళ్ళి తలుపు తీశా. ఎదురుగా చేతిలో ఫ్లాస్కు, ఫ్లాస్టిక్ కప్పులతో టీ అమ్ముకునే కుర్రాడు. వద్దని చెప్పి పంపించి, తలుపేసి వచ్చి మంచం మీద వాలా. తెలియకుండానే నిద్ర పట్టేసింది..

మొబైల్ ఆగకుండా మోగుతూనే మెలకువ వచ్చింది. "రామూ.. తలుపు తియ్యి" మని. చాలాసేపు తలుపు కొట్టి చివరికి ఫోన్ చేసినట్టున్నాడు. మరీ మొద్దు నిద్ర పట్టేసింది. "లంచ్‌కి బయటికి వెళదామా? తెప్పించుకుందామా?" అని అడిగాడు.. నేను మాట్లాడలా.. తనకీ ఇక తిరిగే ఓపిక లేనట్టుంది.. "తెప్పించేస్తాను లే.." అన్నాడు. భోజనం అవ్వడంతోనే తను నిద్రలోకి జారుకున్నాడు. నా నిద్ర అయిపోయింది కదా.. ఇంటికి ఫోన్ చేశా. జయబాబు తీశాడు. "మార్నింగ్ ఫీవరొచ్చింది మమ్మీ.. అందుకే స్కూలికి వెళ్ళలేదు..నౌ అయామోకే" అని ముద్దుగా చెప్పాడు కానీ, నేనస్సలు నమ్మలేదు. వాడి కథలు వాళ్ళమ్మమ్మ నమ్మేస్తుంది. "పోన్లేవే..చంటాడు.. ఒక్కరోజు వెళ్ళకపోతే ఏవయ్యింది" అనేసింది అమ్మ తేలిగ్గా.

ఫోన్ అయ్యాక, ఏమీ తోచక నా హ్యాండ్ బ్యాగ్ సర్దడం మొదలు పెడితే రాబిన్ శర్మ రాసిన 'ది మాంక్ హూ సోల్డ్ హిస్ ఫెరారి' పుస్తకం కనిపించింది. కొని నెల్లాళ్ళయ్యింది. పట్టుమని పది పేజీలు కూడా చదవలేదు. నాకసలు మల్లాది, యండమూరి నవలలు ఇష్టం. మొన్నటివరకూ అవే చదివేదాన్ని. ఆఫీసర్ అయ్యాక తెలుగు నవలలు చదవడం అంత బాగోదు కదా. ఈ ఇంగ్లీష్ నవల్లేమో ఓ పట్టాన పేజీలు తిరగవు. ఓ అరగంట చదివేసరికి విసుగొచ్చింది. రెండు వారాల నుంచీ వాయిదా వేస్తున్న పని గుర్తొచ్చింది. లీగల్ ప్రొసీజర్ ఏమిటో తెలుసుకోవాలి, రామూతో మాట్లాడడానికి ముందే

మాలతికి ఫోన్ చేశాను. అదిప్పుడు వైజాగ్‌లో బిజీ లాయర్. "ఊ..చెప్పవే కబుర్లు.. ఎలా ఉన్నాడు అరవింద స్వామి?" అని అడిగింది, దాని స్టైల్లో. కొందరంతే, ఎంత వయసు వచ్చినా మారరు. బెడ్‌రూం తలుపు తీసే ఉండడంతో నేను కూర్చున్న ముందు గదిలోనుంచే నిద్రపోతున్న రామూని కొంచం పరిశీలనగా చూశాను. కళ్ళ చుట్టూ నల్లని లోతైన వలయాలు. చిరు బొజ్జ కాస్తా పెద్దదయ్యింది. పీర్ అని చెప్పి పార్టీలు మరీ పెంచేసినట్టున్నాడీ మధ్య. నేను మాట్లాడ్డం మానేశాక బొత్తిగా భయం లేకుండా పోయింది. అక్కడక్కడా నెరిసిన జుట్టుకి మధ్య నేను బలవంతాన వేయించిన డై వెలిసిపోయి తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"ఏంటే మాట్లాడవు.. లైన్‌లో ఉన్నావా?" అరుస్తోంది మాలతి. బానే ఉన్నాడని చెప్పి, నాకు కావాల్సింది అడిగేశా. నా కొలీగ్ ఒకమ్మాయి డైవోర్స్‌కి అప్లయ్ చేయాలనుకుంటోందని చెప్పి, ప్రాసెస్ పూర్తవ్వడానికి ఎంత సమయం పడుతుందని అడిగా.. ఏడాదికి తక్కువ పట్టదని వినగానే నీరసం వచ్చింది. డైవోర్స్‌కి అప్లయ్ చేద్దామని అనుకుంటోన్నది నేనే అని చెప్పలేకపోయాను మాలతికి. చాలామంది మగాళ్ళకి ఏడేళ్ళకి తేనెటీగో ఏదో కుడుతుందిట కదా.. కానీ రామూని మాత్రం అప్పట్లో అలాంటిది ఏదీ కుట్టలేదు. రెండోసారి తండ్రైన ఆనందంతోనూ, గర్వంతోనూ ఉన్నాడు తను.

ఇక మాకు మానస ఒక్క ర్తే అనుకుంటున్నప్పుడు మగ పిల్లాడు పుట్టాడు. జయంత్ అని పేరు పెట్టాం. నేను కూడా చాలా సంతోష పడ్డా.. ఆలస్యంగా అయినా నా కోరిక తీరినందుకు. మొదటిసారిలా డెలివరీ సులువుగా కాలేదు. సిజేరియన్ చేయాల్సి వచ్చింది. కొన్ని సైడ్ కాంప్లికేషన్స్ కూడా. నా ఆరోగ్యంలో మార్పు వచ్చి, నెమ్మదిగా బరువు పెరగడం మొదలు పెట్టాను. మా ఆయన్ని ఏడేళ్ళకి తేనెటీగ కుట్టలేదన్న ఆనందం, పధ్నాలుగేళ్ళకి రెండు తేనెటీగలు కుట్టాయని తెలియగానే ఆవిరైపోయింది.

పిల్లలు పెద్దవాళ్ళు అవుతూ ఉండడం, తనకి సెక్షన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ రావడంతో ఇంటా, బయట పెరిగిన బాధ్యతల వల్ల నా మీద శ్రద్ధ తగ్గి ఉంటుందిలే అనుకున్నాను, గత నెలలో వాళ్ళ ఆఫీసులో జరిగిన ఓ పార్టీకి తనతో పాటు వెళ్ళే వరకూ. వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్ట్‌లో మొదటి దశ విజయవంతంగా పూర్తి చేసినందుకు జరిగిన పార్టీ అది. వాళ్ళ డిపార్ట్‌మెంట్ మంత్రితో పాటు, సెక్రటరీ, డైరెక్టర్లు కూడా వచ్చారు. అబ్బబ్బ. ఈ గవర్నమెంట్ సర్వీస్ ఏమిటో కానీ.. రామూ తన పైవాళ్ళ చుట్టూ తిరగడం, రామూ సెక్షన్‌లో పని చేసే వాళ్ళు రామూ చుట్టూ తిరగడం.. పార్టీ అంటే విరక్తి వచ్చినంత పనయ్యింది.

నేనొక్కదాన్నీ ఉండడం గమనించినట్టు ఉన్నారు. ఇద్దరమ్మాయిలు వచ్చి పలకరించారు. అప్పుడే కాలేజీ చదువు పూర్తి చేసినవాళ్ళలా ఉన్నారు చూడ్డానికి. 'మేడం' 'మేడం' అంటూ కబుర్లు, అక్కడికి నేనే వాళ్ళ బాస్ అయినట్టు. దాదాపు నాలుగు

గంటలపాటు సాగిన పార్టీలో రాముా ఇద్దరు అమ్మాయిలతోనూ కొంచం ఎక్కువ క్లోజ్‌గా ఉండడం గమనించాను. నాకు చిన్న అనుమానం మొలకెత్తింది. రాముా ప్రతి కదలికనీ తనకి తెలియకుండా స్కాన్ చేయడం మొదలు పెట్టాను. తన ఫోన్ కాల్ రిజిష్టర్లో వాళ్ళిద్దరి నెంబర్లే ఎక్కువగా కనిపించాయ్. గత కొంతకాలంగా తను నాతో ఎలా ఉన్నాడో గుర్తు చేసుకున్నా.. నా మీద ప్రేమ తగ్గిందని గట్టిగా అనిపించింది.

ఏం చెయ్యాలి నేను? చారి అంకుల్ మీదా, నాన్న మీదా విపరీతంగా కోపం వచ్చింది. మన మధ్య లేని వాళ్ళ మీద కోపం తెచ్చుకుని ఏం లాభం? అమ్మకి చెప్పీచెప్పనట్టుగా చెప్పాను. నామీద గయ్యిమంది. అల్లుడు బంగారం అంది. అనవసరపు ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోవద్దని సలహా ఇచ్చింది. "బంగారమేనమ్మా.. కానీ మన బంగారం మంచిదో, కాదో" అనలేదు నేను.. అన్నా ఉపయోగం ఉండదని. అన్నయ్య, రాముా మంచి ఫ్రెండ్స్. అన్నయ్యకి చెప్పినా సమాధానం వేరేగా ఉండదు. అయినా ఇది నా ఇంటి సమస్య, నేనే పరిష్కరించుకోవాలి. నా ఉద్యోగం నాకు ఉంది కాబట్టి ఎవరిమీదో ఆధార పడాలన్న భయం లేదు. కానీ పిల్లలు సఫరవుతారేమో..

భవిష్యత్తు గురించి ఆలోచన చేస్తూనే, రాముాతో మాట్లాడ్డం బాగా తగ్గించాను. తను నన్ను ఎలా చూసుకుంటున్నాడో గమనించడం మొదలు పెట్టాను. ప్చ్.. తన గొడవలో తను ఉన్నాడు. ఇంట్లో ఉండే కాసేపూ కూడా ఫోన్లు.. "ఇద్దరితోనేనా?" మనిషి మీద ఒక్కసారి అనుమానం మొదలైతే ఏదీ నమ్మలేం కదా. నెల్లాళ్ళుగా నేను కడుపునిండా తినలేదు, కంటి నిండా నిద్రపోలేదు.. ప్రపంచం అంతా కలిసి నా మీద ఏదో కుట్ర చేస్తున్నట్టు అనిపిస్తోంది. ఉన్నట్టుండి గతవారం తనే అన్నాడు. "వచ్చే వారం తిరుపతి వెళదాం.. రెండు రోజులు సెలవు పెట్టు.. మనం ఇద్దరమే.." ఇదీ మంచిదే అనిపించింది నాకు. నేను అడగ దల్చుకున్నవి నాలుగూ అడిగేసి, నేను చెయ్య దల్చుకున్నది చేసేయొచ్చు, ఆలస్యం లేకుండా.

సాయంత్రం అవుతుండగా నిద్ర లేచాడు రాముా. "బయట తిరిగొద్దాం" అంటూ ప్రయాణం చేశాడు. ఇష్టం లేకపోయినా బయలుదేరాను. తను మాట్లాడే ప్రయత్నాలు చేస్తున్నాడు. నేను "ఊ...." తప్ప ఇంకేమీ అనడం లేదు. డిన్నర్ కానిచ్చి కాటేజికి వచ్చాం. నెల్లాళ్ళుగా చేసుకున్న అలవాటుని కొనసాగిస్తూ, బెడ్ మీద ఒక చివర నేను పడుకుని నా పక్కన ఓ దిండు పెట్టాను. మా ఇద్దరి మధ్యా కోడ్ అది. రాముా చెప్పిందే పెళ్ళైన తొలి రోజుల్లో నాకు ఇష్టం లేనప్పుడు తలనొప్పనో, జ్వరమనో చెప్పేదాన్ని. తను నాకు నిజంగానే బాలేదనుకుని కంగారు పడేవాడు. కొన్నాళ్ళకి తనకి విషయం అర్ధమై తనే ఈ ఏర్పాటు చెప్పాడు. "నీకు ఇష్టం లేనప్పుడు ఓ దిండు మనిద్దరి మధ్యా పెట్టు.. నేను నిన్ను డిస్టర్బ్ చేయను" అని.

పార్టీకి వెళ్ళిన నాటినుంచీ నా పక్కన దిండు పెట్టడం అలవాటు చేసేసుకున్నాను నేను. రాముా కూడా పెద్దగా పట్టించుకోలేదు. అవునూ.. ..తనకింక నేనెందుకు? తనూ మంచం మీద చేరి, నేను అడ్డంగా పెట్టిన దిండు తీసి తన తలకింద పెట్టుకున్నాడు. తను ఇలా చేయడం ఇదే మొదటి సారి. నేను స్ప్రింగులా లేచి కూర్చున్నా. మాటల యుద్ధం మొదలైపోయింది. నెల్లాళ్ళుగా నా మనసులో పేరుకున్నదంతా వెళ్ళగక్కేశాను. ఎంత ఆపుకుందామన్నా, నాకు ఏడుపాగలేదు. ఆశ్చర్యంగా తను నా మాటలకి అడ్డు పడలేదు. తలొంచుకుని అంతా విన్నాడు. నేను ఏడుస్తుంటే ఓదార్చే ప్రయత్నం కూడా చేయలేదు.

కాసేపయ్యాక, నాకు మంచి నీళ్ళు తెచ్చిచ్చి, నన్ను పూర్తిగా తాగనిచ్చి, తను చెప్పడం మొదలు పెట్టాడు. ఆఫీసులో పెరిగిన బాధ్యతలు, వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్ట్ డెడ్‌లైన్లు , వాళ్ళ స్టాఫంతా ఎలా కష్టపడి పని చేస్తున్నారో..అంతా నెమ్మదిగా చెబుతున్నాడు. నేను తననే చూస్తూ వింటున్నాను, ఏమీ మాట్లాడకుండా. అమ్మాయిల గురించి ఒక్క మాటే అన్నాడు. "నాకు ఉద్యోగం వచ్చిన వెంటనే మన పెళ్ళై ఉంటే మన మానస కూడా వాళ్ళంతా ఉండేది కదూ?.." నేను పూర్తిగా కన్విన్స్ కాలేక పోతున్నా. "చాలా ప్రెషర్ లో పనిచేస్తున్నాం జానీ.. ఇంత ఒత్తిడి ఉంటుందని నేనెప్పుడూ ఊహించలేదు.. ఇల్లు కన్నా ఆఫీసుని ఎక్కువ పట్టించుకోవాల్సి వచ్చింది.. ఇంటిని నాకన్నా బాగా నువ్వు చూసుకుంటావన్న నమ్మకం కూడా.." మాతో స్పెండ్ చేయలేకపోతున్న గిల్ట్ వినిపించింది తన గొంతులో.

చాలాసేపు మాట్లాడాడు తను. మాట్లాడుతూ ఉండగానే కాటేజీ తలుపు కొట్టిన చప్పుడయ్యింది. ఉలిక్కి పడ్డాన్నేను. అర్ధరాత్రి అవుతోంది.. ఇప్పుడెవరు? "నేను చెప్పేంత వరకూ నువ్వు బయటకి రాకు" అంటూ తను ముందు గదిలోకి పరుగున వెళ్ళి, బెడ్‌రూంకి బయటి నుంచి బోల్ట్ పెట్టేశాడు. నేను మొబైల్ ఫోన్ చేతిలోకి తీసుకున్నా. కాసేపు యేవో మాటలు వినిపించాయి. తర్వాత నిశ్శబ్దం. చిన్న చిన్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. నా గుండె దడదడలాడుతోంది. ఐదు నిమిషాల తర్వాత బోల్ట్ తీసిన చప్పుడైై ముందు గదిలోకి పరుగెత్తాను. లైటు వెలగడం లేదు. గదంతా కొవ్వొత్తులు వెలిగించి ఉంది.. గది మధ్యలో టీపాయ్ మీద చిన్న కేక్.. కేక్ మీద వెలుగుతున్న కొవ్వొత్తి.. రిబ్బన్ చుట్టిన చాకు నా చేతికిచ్చి "హ్యాపీ బర్త్ డే జానీ" అన్నాడు రామూ..

ఉద్వేగంతో కొట్టుకుంటున్న నా గుండె చప్పుడు వినిపిస్తోంది నాకు. నెల్లాళ్ళుగా ఈ గొడవలో పడి నా పుట్టినరోజునే మర్చిపోయాన్నేను. కేక్ కట్ చేయబోతుంటే నా చెయ్యి వణికింది. తను సాయం చేశాడు. కరిగిపోతున్న కొవ్వొత్తులు సుగంధాన్ని విరజిమ్ముతున్నాయి. నా వళ్ళో రామూ తల, తన పల్చని జుట్టులో కదులుతున్న నా వేళ్ళు. ఎంత ప్లాన్ చేశాడు నాకోసం! ఎంత గొప్ప సర్‌ప్రైజ్ ఇచ్చాడు!! కొవ్వొత్తులన్నీ కరిగిపోయేవరకూ అలాగే ఉండిపోయాం, నిశ్చల చిత్రంలా. గదంతా చీకటై ఒకలాంటి వింత పరిమళం కమ్ముకోగానే, "పద" అంటూ బెడ్‌రూం లోకి దారితీశాడు తను.

నాలో ఏ స్పందనా లేదు..నిజానికి ఎలా స్పందించాలో తెలియడం లేదు నాకు. ఉన్నట్టుండి "నీకో రహస్యం చెప్పాలి" అంటూ నా చెవి దగ్గరికి వచ్చాడు రామూ. "తెల్లవారుజామునే గుడికి వెళ్ళాలి. ఇప్పుడు నిద్రపోతే లేవలేం.. అందుకనీ.... " తన గుబురు మీసం గిలిగింత రేపుతోంది. బయట మంచు వర్షంలా కురుస్తోంది. నాకు మాత్రం అస్సలు చలెయ్యడం లేదిప్పుడు.

## బడిశాల — డా.మూలా రవికుమార్

**విజినారం జిల్లాలో** ఉన్న వేల పల్లెటూర్లలో చింతలవలస పేరుతో పదికిపైగా ఊర్లున్నా ఈ చింతవలస మాత్రం బహుశా అన్నిటికన్నా చిన్నది. ఈ ఊరికి ఎటువైపు పది కిలోమీటర్లు వెళ్ళినా ఈ ఊరిపేరు తెలీదు. అదేంటో, ఈ ఊరికి నాలుగు దిక్కులా ఉన్న ఊళ్ళు ఇంత అనామక ఊళ్ళు. నూటపదిగడపలున్న ఆ ఊరు అరవయ్యోదశకంలో మైనరు పంచాయితీ స్థాయి పొందినా, ఈ సంఘటన జరిగేనాటికి అనగా ఇరవయ్యేళ్ళకు పైగా ఒకాయనే సర్పంచ్. ఆ ఊళో వాళ్ళు తార్రోడ్డు గానీ, రైలు పట్టాలు చూడాలంటే, పదికిలోమీటర్లు దూరంలో విశాఖపట్నం నుంచి ఒరిస్సా మీదుగా రాయపూర్ వెళ్ళే జాతీయరహదారి, దానికి సమాంతరంగా ఉన్న రైలు మార్గాలే. బస్సూ, రైలు చూడాలన్నా డిటో. ఎలక్షన్‌లప్పుడు మాత్రం జీపులు కనబడుతూ ఉంటాయి వాళ్ళకి.

హైవే నుంచి బయలుదేరి ఆ ఊళ్ళోకి ప్రవేశిస్తే మొదట్లోనే ఎండోడు (ఎండిపోయిన దేహం గలవాడు) అనబడే వీర్రాజు ఇల్లు కమ్ దుకాణం ఉంటుంది. డిమాండు ననుసరించి ఇడ్లీలో, కుడుములో టీలూ చేసి అమ్మడం, వ్యవసాయపనులు ముమ్మరంగా జరిగే రోజుల్లో జంతికలూ చేగోడీలూ, ఊరిపిండి వడియాలు జంగిట్లో పెట్టుకుని పొలాల వెంబడి తిరుగుతూ అమ్మటం. లేనప్పుడు వీటినే ఇంటిదగ్గరనుంచి అమ్ముకోవటం అతడి దినచర్య, నెలచర్యా, సంవత్సరచర్యా, ఇంకా చెప్పాలంటే దశాబ్దాలచర్య.

ఎండోడి ఇంటినుంచి మొదలయ్యే ఊరు, ఒకే వీధిగా పావుమైలు దూరంలో అంతమౌతుంది. అంతమయ్యేచోట ఆ ఊరివాళ్ళు బడిశాల అని పిలుచుకునే ఆ ఊరి పాఠశాల, పాతికమంది కూర్చోగలిగే తాటాకుపాక ఉంటుంది. బడిశాల్లో ఒకమూల గుంజకి

ఆనుకుని ఒక రోలు బోర్లించింటుంది. అదే మాస్టారి కుర్చీ. దాని మీద కూర్చుని గుంజకి చేరబడి పాఠాలు చెబుతారాయన. విశ్రాంతి సమయంలో రోలు దిశమార్చి, కాళ్ళు పంచకి ఆనించి గుంజకి చేరబడి కునుకు తీస్తారు. చుట్టుప్రకల ఇళ్ళల్లో మొగాళ్ళెవరైనా ఉంటే ఆయన విశ్రాంతి కోసం ఒక నులక మంచం తెచ్చి వేస్తారు. స్కూలు లేని టైంలోనూ, సెలవురోజుల్లోనూ చుట్టుపక్కల ఇళ్ళ ఆడవాళ్ళు మాస్టారి కుర్చీ రోట్లో పసుపు, బియ్యం, వగైరాలు వాళ్ళ రోకళ్ళు తెచ్చుకుని దంపుకుంటూ ఉంటారు. ఇలా దంపుకునే దినసుల్లో మిరపకాయలు ఉండకూడదన్నది మాస్టారుకి, ఆడవాళ్ళకీ మధ్య ఉన్న అలిఖిత ఒప్పందం. అయితే చుట్టపుచూపుగా వచ్చే ఆడవాళ్ళో, ఆ ఊరి కొత్తకోడళ్ళో, తెలియక ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించటం, తత్ఫలితంగా మాస్టారుకి కారంవల్ల కొంత ఒప్పంద ఉల్లంఘనవల్ల ఇంకొంత వళ్ళు మండి వాళ్ళని కేకలెయ్యటంలాంటివి జరుగుతూ ఉంటాయి.

ఆ స్కూల్లో చదివే పిల్లలు ఒకటి నుంచీ ఐదు తరగతుల వరకూ కలిపి ఇరవైమంది. ఉంటారు. స్కూలు రిజిస్టరు ప్రకారం యాభైమంది ఉంటారు. జెండాల పండుగ అనగా ఆగస్టు పదిహేనునాడు బిళ్ళలు పంచినప్పుడు మాత్రం వందమంది వరకూ ఉంటారు. రోజూ వచ్చే పిల్లల్లో ఎవరు ఏ క్లాసో వాళ్ళకే తెలీదు. మాష్టరునడిగితే రిజిష్టరు చూసి చెప్పగలరు.

ఇంటిదగ్గర అల్లర చెయ్యటానికి పనికొచ్చీ, చెప్పినపని చెయ్యటానికి పనికిరాని వయస్సురాగానే పిల్లల్ని ఆ స్కూల్లో జాయిన్ చేస్తారు. రెండుమూడేళ్ళ చదువు పూర్తవగానే గొర్రెపిల్లని మేపే వయసుకొచ్చేస్తారా పిల్లలు. అప్పటినుంచీ వాళ్ళని స్కూలికి పంపమని మాష్టారూ, గొర్రెపిల్లని మేపించుకొంటామని పెద్దవాళ్ళూ వాదించుకుంటూ ఉంటారు. వాదన కొనసాగుతూ ఉండగానే మధ్యలో దసరా సెలవులో సంక్రాంతి సెలవులో వస్తే వాడు గొర్రెపిల్లతో సెటిల్ అయిపోతాడు. వేసవి సెలవులొస్తే ఇంక చూడక్కర్లేదు. మాష్టారి బలవంతం మీద ఏ మోతుబరి రైతైనా తన కొడుకుని ఐదోతరగతివరకూ చదివించేవాడు. ఆ ఊరిపిల్లల్ని ఆరోక్లాసులో చేర్పించటం బ్రహ్మతరంకూడా కాదు. ఎందుకంటే అప్పటికి ఆ పిల్లడికి ఆవుల్ని కాసే వయసొచ్చేస్తుంది. అదీకాక ఆ ఊళ్ళో ఉన్నది ఐదు తరగతులేగనక మాష్టారి బలవంతంలేదు. పైగా పక్కూరి స్కూలో ఆరోక్లాసులో జాయిన్ చెయ్యాలంటే, పలకా పుల్లలు చాలవు. పుస్తకాలూ, పెన్నూ కావాలి. దానితోపాటే పొరుగూరికి షర్టులేకుండా నిక్కరుతో పంపలేరు.

ఈ ఊరిమాష్టారి రొటీన్ పరిశీలిస్తే, నాలుగు కిలోమీటర్లదూరంలో ఉన్న వేరే ఊరినుంచి సైకిల్ మీద వస్తారు. ఉదయాన్నే వస్తూ, మధ్యాహ్నానికి కేరేజి తెచ్చుకుంటారు. తను స్కూలికి చేరేటప్పటికే, ఆవరణలో ఆడుకుంటున్న ఒకణ్ణి కేకేసి, మిగిలిన వాళ్ళని పిలుచుకురమ్మంటారు. వాడు మరో అరగంటలో మిగిలిన వాళ్ళని వెతికి, వాళ్ళతో పాటు వస్తాడు. ఎవరెవరెందుకు లేటయ్యేరో వివరణ అడుగుతారు మేష్టారు.

"మేష్టాండీ మాయమ్మ ఊరికెళ్ళింది. "

"మాయమ్మ పొలంకాడికి సల్లందొట్టుకురమ్మంది "

ఇలాంటి సమాధానాలతో మరికొంచెంసేపయేసరికి బాసీ గేస్ అంటారు మేష్టారు. అది ఇంటర్వెల్ సంకేతం. ఆ సంకేతం అందుకున్న బాసి తన ఇంటికీ, మిగిలిన పిల్లలు ఆడుకోవటానికీ పరిగెడతారు.

బాస అని మిగిలిన పిల్లలచేతా బాసీ అని మేష్టారిచేతా పిలువబడే భాస్కరరాజు, ఎండోడి కొడుకు. ఇంటర్వెల్లో తన ఇంటికి వెళ్ళి మాష్టారికి టీ తీసుకురావాలి. పావలా విలువచేసే టీకి మేష్టారి దగ్గర ఇరవైపైసలే తీసుకుంటాడు వీర్రాజు. ఐదుపైసలు రాయితీ ఫ్రీ డెలవరీ వల్ల వీర్రాజుకి ఉన్న ముఖ్యమైన లాభం: తన కొడుకు బడికి రోజూ వెళుతున్న విషయం ఖచ్చితంగా తెలిసిపోతుంది. తన కొడుకు పెద్దయ్యేదాకా ఊరిపిండి వడియాలూ, జంతికిలూ స్థాయిదాటి, చుట్టుప్రక్కల పదూళ్ళపంట కొనగలిగీ, ధాన్యాన్ని నేరుగా రైసు మిల్లులకీ, వేరుసెనగపంట, నూనె మిల్లులకీ అమ్మగలిగే స్థాయి చేరాలన్నది వీర్రాజు కోరిక. అందుకు సరిపడా చదువుకావాలంటే, రైతువారీ

పిల్లలకంటే తనకొడుకు ఎక్కువ శ్రద్ధగా చదవాలని అతడికి తెలుసు. కానీ తన వ్యాపారం వదిలేసి, కొడుకు క్రమశిక్షణమీద నిఘా పెట్టలేడు. మేష్టారి ఇంటర్వెల్ టీ వీర్రాజుని ఆదుకున్నది ఇక్కడే

ఇంటర్వెల్ కాగానే మాష్టారు, బాగా చిన్నపిల్లలిని అ ఆలూ, వాళ్ళ మీద వాళ్ళని కాఖ్ఖాలూ, గుణింతాలూ, ఎక్కాలూ వగైరాలు రాయమంటారు. రాసినవాళ్ళ పలకలు చూసి, చిన్న చిన్న తప్పులైతే తిట్లూ, పెద్దవైతే తొడపాశాలూ పెడతారు. పిల్లల ఏడుపూ, గోలా, మాష్టారి తిట్లూ కలిపి ఊరి మధ్యవరకూ వినిపిస్తూ సందడిగా ఉంటుంది. అటుగా వెళుతున్న పెద్దలెవరైనా ఏడుస్తున్న తమ పిల్లల్ని చూసి, "అలగ బయ్యం చెప్పండి మా నంజికొడుక్కి" అని మెచ్చుకునేవారు కొందరైతే, నోట్లోంచి చుట్ట తియ్యకుండానే, "అంక గక్కిగా కొక్కగంగి మెక్కే రంగీ, పెంట్రిల్లిపోతడు గుంటడు" (అనగా "అంత గట్టిగా కొట్టొద్దు మేష్టారూ, జడుసుకుంటాడు" అని). ఈ దెబ్బలసాకుతో గుంటణ్ణి స్కూలు మానిపించిన సందర్భాలూ ఉన్నాయి.

భోజనానికెళ్ళిన పిల్లలు మరి మధ్యాహ్నం రారు. మేష్టారు కేరేజి తిని సాయంత్రం వరకూ రెస్ట్ తీసుకుని ఇంటికి వెళుతూ ఊళ్ళో తనకున్న పలుకుబడి, ఆరోజు అదృష్టం బట్టీ, కూరగాయాలూ వగైరాలు, ఉచితంగానో రాయితీ ధరకో కొనుక్కుని తన ఊరికెళతారు.

అలాంటి ఊళ్ళో ఒకరోజు మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో వీర్రాజు ఇంటి దగ్గర రోడ్డు మీద ఒక జీపు ఆగి అందులోంచి ఒకావిడ వయసు ముప్పై ఐదు అనుకోవచ్చు, దిగింది. దిగుతూనే స్కూలెక్కడ అని ఒక ముసలాయన్ని అడగటం, అతడి సమాధానం విని డ్రైవరుకేదో చెప్పి ఆవిడ ఒక్కర్తీ స్కూలువైపు నడవటం మొదలెట్టింది, రెండు చెవులూ పరిసరాలకొదిలేసి.

జీపు ఊరిమలుపుకి ముందు ఆగటం వల్ల ఆవిడ నడుచుకుంటూ వచ్చిందనుకున్నారు ఊళ్ళో ఆవిణ్ణి చూసినవాళ్ళు. ఆవిడక్కావలసిందీ అదే

"ఒవ్వులాలు?"

"క్రలా ఇండీసంలు పొడవడానిగ్గ్రలా"

"ఒరి పోకిరీవోడా, ఇండీసంలు పొడవాలంతే ఒక నరుసులమ్మ ఇద్దరు మొగోల్లూ వొత్తార్రా. ఆవిడ కాడ మందులపెట్టి నేదురా."

"బడిశాల సూడ్డానికి ఇనసపెట్రుగావాల"

"ఒక్క ఆడమనిషి ఎలాగొచ్చేసినాదో"

ఇలా ఆవిడెవరో ఎందుకొచ్చిందో మాట్లాడుకుంటున్నారు ఆవిడని చూసినవాళ్ళు.

రోడ్డు పక్క నూతిదగ్గర ఆడవాళ్ళు అంతకు ఐదార్రోజుల క్రితం వార్తని చర్చించుకుంటున్నారు

"ఇందిరమ్మని సంపినారట. రేడియ్యల పొద్దాల్ల సెప్పుతన్రు"

"సంపేసింది పోలీసులే గవలా"

"పంజాబోల్లంట.."

"ఆడదాన్ని సంపినోడాడేమ్మొగోడు? "

ఒకావిడి ఇందిరాగాంధీని హత్య చేసినవాణ్ణి తిట్లంకించుకుంది. "ఆడి జిమ్మడిపోను, ఆడి రోజుల్జెయ్యి, ఆడి బుగ్గెత్తిపొయ్యి, ఆడి పెల్లాంతాడు తెంప, దని బిట్టుకడగ... " కొత్తవ్యక్తిని చూడగనే మాటలూ తిట్లూ ఆగుతున్నాయి.

ఆవిడ స్కూలుకెళ్ళేసరికి మాష్టారు విశ్రాంతి భంగిమలో పంచకి కాళ్ళు ఆనించి ఇంటినుంచి తెచ్చుకున్న ఏదో పుస్తకం చదువుతూ ఉన్నారు. ఈవిణ్ణి ఒకసారి చూసి, ఆవలించుకుంటూ మళ్ళీ పుస్తకంలో మునిగిపోయారు.

"ఈ స్కూల్లో మీరే మాష్టారా?"

"అవునండి.."

"పిల్లలు..?"

"ఉదయంపూటే వస్తారు. "

"మీ కుర్చీ..? "

"ఈ ఊరి సర్పంచ్ ఇంట్లో ఉంటుంది. రోజా ఇక్కడికి తెచ్చి తిరిగిపెట్టడం ఎందుకని ఈ రోలు ఏర్పాటు చేసుకున్నాను. "

"పిల్లల్లేనప్పుడు మధ్యాహ్నం మీరు ఇంటికెళ్ళిపోవచ్చుకదా.. "

"మా నాన్నగారూరుకోరండీ.."

"ఎందుకు?"

"ఉజ్జోగానికి ప్రమాదం అని ఆయన భయం"

"ఇనస్పెక్టర్లెవరూ రారా?"

"ఆరుమైళ్ళు నడిస్తే గానీ ఈ ఊరు రాలేరు. అయినా ఇలాంటి స్కూళ్ళ గురించి అందరికీ తెలుసండీ."

"తాలూకా ఆఫీసునుంచి ఎవరూ రారా?"

"మేం మీటింగ్‌కి వెళ్ళినప్పుడు మా రిజిష్టర్లు తీసికెళితే ఇక్కడికి విజిట్‌కి వచ్చినట్టు రాసి సంతకం పెడతారు."

"పిల్లల అటెండెన్స్ రిజిష్టర్"

"అదికూడా ప్రెసిడెంట్ ఇంట్లోనే ఉంటుందండీ. నెలకొకసారి తీసి నింపి దాచేస్తాం. ఇక్కడ దానికి సేఫ్టీ లేదు. "

"బ్లేక్ బోర్డు..?"

"పక్క ఊరి హైస్కూల్లో ఒక క్లాసుకి బోర్డు తక్కువైతే బీడీవో గారు అక్కడికి పంపించమన్నారు."

"మరి ఇలాంటి ఊళ్ళో స్కూలు అవసరమా..?"

"లేదుగాని.. డియ్యీవో ఆఫీసులోనూ కలక్టరాఫీసులోనూ ఉండేవాళ్ళు ఎప్పుడు చూడాలి?"

"మీరుకాక ఈ ఊరికి ఎవరైనా గవర్నమెంటుజ్జోగస్తులొస్తారా?"

"మలేరియా డిపార్ట్‌మెంట్ వాళ్ళూ, పిల్లల టీకాలవాళ్ళూ వస్తూ ఉంటారు. ఇంతకీ మీరు? "

ఈ సంభాషణంతా, ఆవిడ నుంచొనీ, మాష్టరు, పుస్తకం చదువుతూనే జరిగింది.

"నా పేరు జలజాక్షి. నేను ఈ స్కూలు చూడ్డానికే వచ్చాను. "

వెంటనే మేష్టారు లేచినిలబడి, "మీరు కూడా టీచరా, లేదా ఏదైనా సర్వే కోసం వచ్చారా?"

"నేను ఈ జిల్లాకి కొత్తగా వచ్చిన జాయింట్ కలెక్టర్నండి."

ఆవిడ ఎంత నెమ్మదిగా, వినయంగా చెప్పినా, మాష్టారి చెవుల్లో డైనమేట్లులా పేలాయి. నోట మాటరాక వణుకుతూ నిలబడ్డారు. అప్రయత్నంగానే గుంజమీద చెయ్యి పడింది, పడిపోకుండా.

అంతలో ఒక జీపు స్కూలుముందు ఆగటమూ, అందులోంచి, దాదాపుగా గెంతి, పరుగులాంటి నడకతో వస్తున్న ఇద్దరి మొహాలూ, ఎప్పుడో చూసినట్టనిపించాయి మాష్టారికి.

వాళ్ళు స్కూల్లోకి వచ్చి "నమస్తే మేడం..!" అన్న తరువాత గానీ మేష్టారు వాళ్ళిద్దరినీ, బ్లాక్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ (బీడీఓ) డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డియ్యీఓ)గా గుర్తించగలిగారు. ఎప్పుడూ పులుల్లా ఉండే వీళ్ళిద్దర్నీ మొదటిసారిగా మార్జాలవతారంలో చూస్తున్న విషయం స్ఫురించలేదాయనకి. తను స్వయంగా పులీ పిల్లుల మధ్య ఉన్న ఎలకనన్న విషయం మాత్రం అర్థమయింది, నెమ్మదిగా.

"మీ ప్రోగ్రాం గురించి తెలియగానే బయలుదేరాం". డియ్యీవో అన్నాడు, సంజాయిషీగా.

"మిమ్మల్ని ఈ ఊరు రమ్మనాలన్న ఉద్దేశ్యం ఉంటే ముందే మిమ్మల్ని పిలిచేదాన్ని. "

"పక్కా బిల్డింగ్స్ లేని ఇలాంటి స్కూళ్ళ రికార్డ్స్ సర్పంచ్ గారింట్లో ఉంటాయి. వెళ్ళి తీసుకొస్తాను. " బీడీవో అన్నాడు.

"అవసరంలేదండీ. మాష్టారన్నీ చెప్పారు. మాష్టారు తన డ్యూటీ చక్కగా చేస్తున్నారు. "

"మీరు కూడా ఎలాగో వచ్చారు కాబట్టి, మనం తిరిగివెళ్ళే దారిలో ఏదైనా హైస్కూలు చూసి వెళదాం."

తాము రాకముందూ, ఈవిడ మాష్టారిని ఏమేమి అడిగిందో, ఆయనేం చెప్పాడో, తెలుసుకునే అవకాశం తమకింకలేదని అర్థం అయింది వాళ్ళకి. ముగ్గురూ డియ్యావో జీపెక్కేసారు, ఊరి చివరికి రాగానే ఆవిడొచ్చిన జీపు వాళ్ళని ఫాలో అయ్యింది.

మాష్టారు వారం రోజులు జ్వరం పెట్టుకున్నారు. కానీ జ్వరంతోనే స్కూలికి వచ్చేవారు.

వారం తర్వాత, మాష్టారు తనకందిన సీల్డ్ కవర్ని వణుకుతున్న చేతులతో విప్పి చూసారు.

***గజపతి నగరం తాలూకా చింతలవలస స్కూల్లో జాయింట్ కలెక్టరు గారి ఆకస్మిక తనిఖీ సందర్భంగా***

***--- అని ఆదేశించడమైనది.***

తదుపరి కార్యక్రమాలన్నీ ఒక వారంలో ఆదేశానుసారం జరిగాయి.

రెండు మైళ్ళవతల ఊళ్ళో ఉన్న పుట్టింటికి వెళ్ళి అప్పుడే ఊళ్ళోకి వస్తున్న కొత్తకోడలు అచ్చెమ్మ ఊరిమలుపు దగ్గర ఆగి కనబడ్డ ఎండోణ్ణి అడిగింది. "బాస కేరేజొట్టుకొనెక్కడికెలతన్నాడు? " అని.

"ఇప్పలొలస బడికి! "

"మనూర్ల బడిశాల? "

"మేట్టారుకి గైపీనారం అవతల ఊరు టాంసరయిపోంది. "

"కొత్తమేట్టరు రానేదేటి? "

"వచ్చే సమచ్చరం దాక మనూరి బడిశాల మూసీసినారట. కలెక్టెరు కాయితం పంపారు. మీవోళ్ళు గుంట్లకి గెరిపిల్లలు కొనీసినారు. నాను బాసకి సిలవరి (అల్యూమినియం) కేరేజి, పుత్తకాలూ కొని, ఇప్పలవలస బళ్ళో ఏసేను. రోజుకొగ్గంట నడుత్తాళ్ళే"

"అలాగైతే, ఈ సుట్టు (ఈసారి) మిరగాయలు దంచడానికి బడిశాలకెళ్ళిపోవచ్చు. ఇంటికాడైతే గొౖటూ (ఘాటు). "

ఆనందంగా చెప్పిందా కొత్తకోడలు..!!



**స్వస్థలం:** అమరాయవలస గ్రామం, విజయనగరం జిల్లా.

**ప్రస్తుత నివాసం:** రాజస్తాన్‌లో భరత్ పూర్

**చదువు:** పశు వైద్యంలో స్నాతకోత్తర పట్టా (Post-Graduation in Veterinary Sciences)

**రచయితగా:** పదికి మించని ప్రచురిత కథలు

**ప్రోత్సహించిన పెద్దలు:** వసుంధర, రచన శాయి, కవన శర్మ, ఎలక్ట్రాన్, శ్రీరమణ గార్లు.

# అమ్మలు

లలిత

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**"అమ్మగారూ.. అమ్మగారండీ... అమ్మగారండోయ్..."**

పెరటి గుమ్మం తలుపు మీద ఇనుప గొళ్ళెంతో దరువేస్తూ ఎవరో అదే పనిగా అరుస్తున్నారు.

"అబ్బబ్బా... ఏవిటా అరుపులు వచ్చేవరకూ ఆగలేవూ" చీర చెంగుతో చేతులు తుడుచుకుంటూ వెళ్ళి తలుపు తీసి విసుగ్గా చూసాను. ఎదురుగా రంగు రంగుల మట్టిగాజులు నిండిన చేతుల్లో మాసిపోయిన వైరు బుట్టపట్టుకు నుంచునుంది నూకాలు. జరీ అంచు వెంకటగిరీ చీరమడమలపైకి కట్టింది. కళ్ళను ముంచేస్తూ పులిమిన కాటుకవల్ల అసలే పెద్దకళ్ళు రెండింతలైనట్టున్నాయి. నొసటి మధ్యరూపాయి కాసంత కుంకుమ బొట్టు దిద్దేటప్పుడు పడ్డ హడావిడిని చెప్పకనే చెపుతున్నట్టుంది. కంగారుగా తుంచేసి అడ్డంగా కొప్పులో కూరవేసిన ముద్దమందారం ఆకుల మధ్య ఊపిరాడక అవస్తపడుతున్నట్టుంది. నూకాలు మొహంలో కళ కొట్టొచ్చినట్టు ఉంటుందేమో, చూసేవారికి దాని వంటి రంగు ధ్యాసకే రాదు. కాయకష్టం చేసే బలిష్టమైన వంటివాటం చూసినప్పుడల్లా ఏదో దేవాలయంలో చూసిన నల్లరాతి నాట్య శిల్పం ఠక్కున గుర్తొస్తుంది నాకు. నూకాలుకి పెళ్ళయిన కూతురుందంటే ఒక పట్టాన నమ్మలేరు ఎవరూ. కూతురు పక్కనే నూకాలుని చూస్తే ఇద్దరూ అక్కా చెల్లెళ్ళనుకుంటారు తెలియనివాళ్ళు.

దాని వాలకం చూసి ఎక్కడికీ ప్రయాణం అని అడగబోయి ఆగాను.

పండుగలకీ ప్రయాణాలకీ ఇలా ప్రత్యేకంగా ముస్తాబై కనిపిస్తుంది నూకాలు 'రాములవారి ఊరేగింపు పల్లకీలా' నూకాలు చేతులకీ, బుగలకీ అంటుకున్న మందార పుప్పొడిని చూస్తూ "ఏవే.. ఎన్నిసార్లు చెప్పినా వినవుకదా. పువ్వుల నెందుకే అలా తుంచేస్తావు!" చిరు కోపంగా అంటూ వెళ్ళి అరుగు చివర కూర్చున్నాను.

"ఆ.. ఊరుకోండమ్మా. పుట్టిన సోటే రాలిపోతే దాని బతుక్కి అర్ధవేవుంటాది. అందంగా కొప్పులోనో, దేవుడి పాదాల దగ్గరో సేరినప్పుడే కదా దాని ఇలువ పెరిగేది" అంటూ అలవాటుగా నన్ను దబాయిస్తుందనుకున్నాను. కానీ ఎందుకో మౌనంగా నా వెనకే వచ్చి చివరి మెట్టుమీద కూర్చుండిపోయింది. అప్పుడు గమనించాను. ఎప్పుడూ పాపికొండల మధ్య గోదావరిలా తెగ వయ్యారాలు పోయే నూకాలు ఏ క్షణాన్నయినా గట్టు తెగడానికి సిద్ధంగా ఉన్న వరదగోదావరిలా గంభీరంగా ఉంది. దాన్నలా చూడటం కొత్తగా ఎందుకో భయంగా ఉంది.

"అవతల నాకు చాలా పనుంది. నీతో కూర్చుంటే కాదు. ఇంతకీ ఎక్కడికో ప్రయాణమయినట్టున్నావ్ అలా మూగమొద్దులా కూర్చుంటే ఎలా, వచ్చినపనేమిటో త్వరగా చెప్పు" కొంచెం విసుగ్గా అడిగాను అలా అయినా దాని మౌనం బద్దలవుతుందేమో అని.

"అమ్మగారూ..." గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు ఆగిపోయింది నూకాలు.

"ఏంటే నూకాలు ఏం జరిగింది? మీవాళ్ళెవరికయినా వంట్లో బాలేదని కబురు తెలిసిందా. డబ్బులేవైనా కావాలా? అవునూ అమ్ములెలా ఉంది. "

అమ్ములు పేరు వినగానే చివ్వున తలెత్తి చూసింది నూకాలు. నీళ్ళు నిండిన కళ్ళు. కురవడానికి సిద్దంగా ఉన్న కారు మబ్బుల్లా ఉన్నాయి. అనుకున్నానులే. అమ్ములు గుర్తొచ్చుంటుంది. "కూతుర్ని చూడటానికి వెళుతున్నావా?" అన్నాను అరుగుమీంచి లేవబోతూ. భర్త దూరమయ్యాకా తన ప్రాణాలన్నీ కూతురుమీదే పెట్టుకు బ్రతికింది నూకాలు. కూతురికి పెళ్ళిచేసి పంపినప్పటినుండీ మరీ వంటరిదయిపోయింది. పోనీ నువ్వూ వాళ్ళతోనే ఉండవచ్చుగా అని ఎవరైనా తమాషాకన్నా, "హత్.. పోయి అల్లుడి పంచన బ్రతకమంటారా?" అని అంతెత్తున లెగుస్తుంది.

ఇంకొక్క క్షణం భరించలేననుకుందో ఏమో, ఇంతసేపు మౌనంగా ఉన్నదల్లా.. "నా కూతురి జీవితం అన్యాయమైపోయింది తల్లో...." అంటూ ఒక్క పెట్టున ఏడుస్తూ తలబాదుకుంది. దుఃఖం కట్టలు తెంచుకుంది. కన్నీరు వరదలా పొంగింది. ఒక్క క్షణం అవాక్కై అంతలోనే తేరుకున్నాను. దాన్నెలా ఆపాలో తెలీలేదు. "అయ్యో.. అయ్యో.. మంగళవారం పూట నట్టింట్లో ఈ సొకన్నాలేవిటే.. అసలేం జరిగిందో చెప్పకుండా?" నేను గదమాయించేసరికి గబగబా కళ్ళుతుడుచుకుని కొంగునోట్లో కుక్కుకుంది.

"అవునూ అమ్ములు మొగుడుకి అదే నీ అల్లుడికి ఎలా ఉంది?" ... ఏదో గుర్తొచ్చి అడిగాను.

సరిగ్గా నెల్రక్రితం ఓ రోజు పొద్దున్నే హడావిడిగా వచ్చింది నూకాలు. "అమ్మగారూ అమ్ములు ఉత్తరం రాసిందండీ, నాల్రోజుల క్రితం మొగుడూ పెళ్ళాలిద్దరూ మొదటాట సినిమాకెళ్ళి సైకిలు మీద ఇంటికొత్తుంటే... పెద్ద కారోడు ఎనకనుంచి సైకిలిని గుద్దేసిపోయాడంటండి. అమ్ములికేం కాలేదంటండి. అల్లుడు మాత్రం అంతెత్తెగిరి రాళ్ళ గుట్టమీద పడ్డాడటండి. కవుకు దెబ్బలు తగిలేయి సిన్నయేలే నువ్వు కంగారు పడిరామాకు అని రాసిందండి." ఆయాసపడుతూ ఆగింది. అంతా పిల్ల అదృష్టవండి. తన కూతురు అదృష్టమే అల్లుడికి ఏం కాకుండా కాసిందని పదే పదే చెప్పి వెళ్ళిన విషయం గుర్తొచ్చింది. నేను ఆలోచనలోంచి తేరుకునేసరికి నూకాలు లోపల్లోపల ఏడుస్తూ తనలో తానే గొణుక్కుంటుంది. "అక్కడకీ మానూరి పంతులుగారు సెప్పేరు తల్లో.. పిల్లలిద్దరికీ నచ్చత్రాలు కల్లేదు ఈ సంబంధం వద్దులే నూకాలూ అని నేను ఇంటిని కాదు దేవుడో..! " నూకాలు స్వరం హెచ్చించింది.

వేసవిలో ఓ రోజు సాయంత్రం పెరట్లో పాదులు తడుపుతుంటే వచ్చింది నూకాలు. రెండు మిఠాయి ఉండలు ఉన్న కాగితం పొట్లం నా చేతిలో పెట్టి "అమ్మగారూ అమ్ములుకి సంబంధం రైటయ్యిందండి. ముహూర్తం కూడా పెట్టించేసెను".... మొహం చాటంత చేసుకు చెప్పింది. "అదేవిటే పంతులుగారు వద్దన్నారని చెప్పేవు... అయినా ఇప్పుడంత తొందరగా దానికి పెళ్ళిచేసెయ్యకపోతే ఏం?.... ఏవంత వయసుందని...? " నేనేం చెప్పబోతున్నానో పసిగట్టిన దానిలా నా మాటను మధ్యలోనే అడ్డేసింది.

"ఆ... మీకేం తెలుసమ్మా మా కష్టాలు? మీలా అంతఃపురంలో ఉండేవాల్లమా, మాటులేని బతుకులు మాయి. తెల్లారి లేత్తే వీధిలోకి రాకుండా రోజు గడుత్తుందా? మగదిక్కులేకుండా ఈడొచ్చిన పిల్లను ఎన్నాళ్ళని కాయగలనమ్మా. దాన్నో అయ్య సేతుల్లో పెట్టేత్తే, ఇక నా బతుకెలాగో ఎల్లిపోద్ది... మీరీ మద్దెన సూళ్ళేదుగానమ్మా.. అమ్ములు మా బారుగా పెరిగిందండి. పిల్లకి నా దిస్టే తగిలేట్టుందండి." ఇక మీరు చెప్పొచ్చు అన్నట్టూ ఆగి నా కేసి చూసింది.

"అది సరే మరి కుర్రాడి వివరం పూర్తిగా కనుక్కున్నావా? " అన్నాను పాదులో చిక్కుడు కాయలు వెతుకుతూ.

నే అడగడమే ఆలస్యం అన్నట్టూ గడగడా చెప్పేసింది.... " పిల్లోడు సానా బుద్ధిమంతుడండి. అమ్మా, అయ్యా సిన్నప్పుడే పోయారు. అన్నగారు పెళ్ళిసేసుకుని వేరే ఉంటున్నాడు. పట్నంలో మెకానిక్ సెడ్లో పనిసేసుకుంటూ బానే సంపాదిత్తన్నాడు. వుమ్మట్లో సిన్న ఇల్లుందమ్మా... అన్నీ కలిసొత్తే సొంత యాపారం పెట్టుకుంటాడంట. పైగా సేసుకుంటే అమ్ములునే సేసుకుంటానని అన్నగారితో గట్టిగా సెప్పేడంట. పైసా కట్నం ఈయక్కరలేదండి. నాకు మాత్రం ఎవరున్నారమ్మా రేపు కాలు సెయ్యీ ఒంగకపోతే ఆల్లే సూడాలికదమ్మా నన్ను. తల్లీ తండ్రీ ఉన్నోడయితే నన్ను సేరనిత్తాడా!"... అసలు సంగతి చెప్పి ముగించింది.

నూకాలు ముందు చూపుకి ఆశ్చర్యం వేసింది.

"మరి కలవని నక్షత్రాలనెలా కలిపావ్?" నా మాటలో వెటకారం గుర్తించి కిసుక్కున నవ్వింది నూకాలు "అపాయం కనిపెట్టినోరినే ఉపాయం సెప్పమన్నాను. ఓ వెయ్యి నూట పదార్లు ఎదురుగా పెట్టేసరికి చిటెకలో ఉపాయం ఊడిపడింది. లగ్నపత్రికలో అమ్ములు పేరు మార్చి కొత్త పేరు రాయిత్తే సాలు, ఇంక దోసవుండదు అని కాసిని మంత్రాలు చదివి కొత్తపేరు రాసిచ్చారండి. 'అమల' బావుంది కదమ్మా పట్నం పేరులాగా.! " తన తెలివితేటలకు తనే తెగమురిసిపోతూ చెప్పింది.

"నే బతికుండగా నా కూతురికి అన్యాయం జరగనిత్తానా... నా బిడ్డని కడుపులో పెట్టిసూసుకోనూ...!" నూకాలు ఏడుస్తూ అంటున్న మాటలతో ఈ లోకంలో కొచ్చిపడ్డాను.

"వచ్చినప్పటినుండి చూస్తున్నాను. అసలు విషయం చెప్పకుండా నీ పాటికి నువ్వు అలా కుమిలిపోతే ఎలానే? ఏం జరిగిందో వివరంగా చెప్పు" భుజమ్మీద చెయ్యేసి ఆప్యాయంగా అడిగాను.

"అమ్మగారూ... ఆ మద్దిన సైకిలు మీచి రాళ్ళమీద పడ్డాడు కదండీ అమ్ములు మొగుడు. అప్పుడు దెబ్బలు సిన్నయ్యే పర్లేదనుకున్నాం. ఆ రోజు నుండి జరం తగ్గకపోతే పెద్దాసుపత్రికి తీసుకెల్లేరటండి పిల్లోడ్ని. అక్కడ పెద్ద డాటర్లు పోటోలు అయ్యా తీసి... ఎన్నుపూస దెబ్బతింది. ఇక నడుం పనిసెయ్యదు. బతుకంతా మంచమ్మీదే ఎల్లిపోవాలని సెప్పేరంట తల్లో...." చెప్పటం పూర్తవగానే భోరున ఏడ్చేసింది నూకాలు. వింటున్న నాకు నెత్తిమీద పిడుగు పడ్డట్టయ్యింది.

"హారి భగవంతుడా... ఎంతఘోరం జరిగిందీ, చిన్నప్రమాదం అనుకున్నది కాస్తా... అయ్యో.. పిల్ల కాపరం మూణ్ణాళ్ళ ముచ్చటయిపోయిందా?"... పసుపు బట్టలతో నాకాళ్ళకు నమస్కరిస్తున్న కొత్త జంట కళ్ళల్లో కదలాడింది.

"అత్తపోరు లేకుండా నా బిడ్డ రాజాలాంటి మొగుడితో, సొంతింట్లో సుఖంగా ఉంటుందని సంబరపడ్డాను. ఏ దేవుడికి కన్నుకుట్టిందో, దాని బతుకిలా అన్నాయమైపోయింది తల్లో...." నూకాలుని ఓదార్చలనున్నా గొంతు పెగల్లేదు.

కూతురి పెళ్ళయ్యాక నూకాలు ఏ పనిమీద వచ్చినా ఉన్నంతసేపూ కూతురి, అల్లుడి ముచ్చట్లే అలుపు లేకుండా చెప్పుకొచ్చేది. పెళ్ళాన్ని పల్లెత్తు మాట అనడని, సినిమాలకి షికార్లకీ అడక్కుండానే తీసుకెలతాడనీ, వాయిదాల్లో ఇంట్లోకి వస్తువులు అమర్చాడని..... ఎంతయినా తన కూతురు గొప్పజాతకురాలని తెగమురిసిపోతూ చెప్పేది. కాని అంతలోనే ఇలాటి ఆపదవచ్చిపడింది.

"అయితే పిల్లకి సాయంగా ఉండటానికి వెళుతున్నావా...?"ఎలాగో గొంతుపెగుల్చుకుని అన్నాను.

"మరేనండమ్మా.. నాలుగు రోజులుండి పిల్లని తీసుకుని వచ్చేత్తాను"

"ఏంటే నువ్వనేదీ.. పిల్లనొక్కద్దాన్నీ తీసుకురావటం ఏంటి?"

"మరి తీసుకురాకపోతే అక్కడ అవిటిమొగుడికి సేవ సేసుకుంటూ బతకమని వదిలేమంటారా?"... నే బతికుండగా నా కూతురికి అంత కష్టం రానీయనమ్మా. పిల్లోణ్ణి అన్నగారికి అప్పసెప్పి నా కూతుర్ని తీసుకొచ్చేసుకుంటాను. పంచాయితీ పెట్టి తెగతెంపులు సేసెయ్ మంటాను. మళ్ళీ పెళ్ళిసేత్తాను నా పిల్లకి. మూణ్ణాళ్ళయినా లేని కాపరం కోసం బతుకంతా ముద్దూ ముచ్చటా లేకుండా మగ్గిపోవాలా.?" నూకాలు తెగింపుకి నోట మాటరాలేదు. ఎందుకో దాని మాటల్లో పచ్చి స్వార్థం కనిపించింది. నా మనసొగలేదు.

"ఏవిటే.. ఆ మాటలూ.. ఎన్నాళ్ళు కలిసున్నా పెళ్ళంటూ జరిగాక కష్టం సుఖం ఏదైనా భార్యా భర్తలు కలిసి పంచుకోవలసిందే కదా. సుఖంలో అంతా నా అదృష్టమనుకుని ఇలా కష్టం వచ్చినపుడు నాకేం సంబంధం అని వదిలి వచ్చేయటం పాపం కదూ! లోకం ఏవంటుంది. సమాజం బ్రతకనిస్తుందా?" నా ధోరణిలో చెపుతూ పోతున్న నేను "ఇక సాల్లే ఆగండమ్మా" అన్న నూకాలు అరుపుకి గతుక్కుమని ఆగాను. ఆవేశంతో ఊగిపోతోంది నూకాలు.

"లోకం.. అదీ ఇదీ అని పెద్దమాటలు సెప్పకండమ్మా... సంటి బిడ్డని, నన్నూ నడివీధిలో వదిలేసి ఇంకోదాన్ని తగులుకు పోయాడు నా మొగుడు. పంచాయితీ పెడితే మూడువేలు నా మొహాన కొట్టి ఆడి తప్పు కొట్టేసి లేని లచ్చనాలు నాకు అంటగట్టి, ఆడి

దారిన ఆడ్ని ఒదిలేసారు పెద్దలు. ఇప్పుడు ఏ నోటితో నా బిడ్డకి తీర్పు సెపుతారో అదీ సూత్తాను. ఆ మాత్రం రూపాయలు నేను ఇసిరేత్తాను. " ఒప్పుకోటానికి మనసు రాకపోయినా నూకాలు మాటల్లో న్యాయం ఉందనిపించింది. అయినా లోపల ఏదో తొలిచేస్తుంది.

"నూకలు... కలకాలం కలిసుంటామని, కష్టసుఖాలు కలిసి పంచుకుంటామని పెళ్ళినాడు చేసిన ప్రమాణాలకి విలువే లేదా?

సమాజానికి, మనుషులకి భయపడకపోయినా, పాప పుణ్యాలకి జడవకపోయినా మనుషులమై పుట్టినందుకు సాటి మనిషి గురించి మానవత్వంతో ఆలోచించక్కర్లేదా?" నా మాటలు వింటుందో, ఏదో ఆలోచిస్తుందో కానీ మౌనంగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

"అయినా తీర్పు చెప్పాల్సిందీ, నువ్వూ నేనూ, పంచాయితీలు, పెద్దలూ కాదు నూకాలూ.... ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది నీ కూతురు అమ్ములు. అవును తన భర్తతో తనకున్న అనుబంధం ఎంతటిదో తనకు మాత్రమే తెలుసు. ఎంతకాలం కలిసి ఉన్నారన్నది అసలు ప్రశ్నే కాదు. కన్నవాళ్ళని, కడుపున పుట్టిన వాళ్ళని కష్టాల్లో వదిలి వచ్చేయగలమా? మరి కట్టుకున్న వాళ్ళ విషయంలోనే ఎందుకు మరోలా ఆలోచించాలి. నీ కూతురి మీద నీకున్న ప్రేమ నీతో ఇలా మాట్లాడిస్తుంది. ఆవేశంతో నిర్ణయాలు తీసుకోవటం మంచిదికాదు. ముందు నువ్వు చేయాల్సినపని కష్టంలో ఉన్న ఆ జంటకి సాయంగా ఉండటం. పరిస్థితి కొంత సర్దుకున్నాకా తన మనసుకు నచ్చిన నిర్ణయం తనే తీసుకునే స్వేచ్ఛ అమ్ములుకు ఇవ్వు"..... చెప్పటం ఆపి ఏం అంటావ్ అన్నట్టు చూసాను.

ఔననలేదు, కాదనలేదు.... అసలు నా మాటలు విందో లేదో కూడా తెలీలేదు. మొహంలో ఏ భావం లేకుండా మౌనంగా లేచినుంచుంది. కొంగుతో మొఖం తుడుచుకుని, రెండుచేతుల్తో జుట్టు సవరించుకుంది. గోడకు జారేసిన వైరు బుట్ట చేతిలోకి తీసుకుని "ఎల్తానమ్మా.... బస్సు దాటిపోద్ది" అని నా ముఖం వంక కూడా చూడకుండా నేల చూపులు చూసుకుంటూ పెరటి గుమ్మం దాటి వెళ్ళిపోయింది.

నూకాలు వెళ్ళిన వైపే చూస్తున్నాను. పసుపుబట్టలతో, నులి సిగ్గుల దొంతరలమధ్య ఒకరినొకరు ఓరచూపులు చూసుకు మురిసిపోతున్న కొత్తజంట లీలగా గుర్తొచ్చింది. ఇప్పుడు అమ్ములు ఏం చేస్తుందీ, ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది. స్వార్థం, వివాహబంధం, మానవత్వం వీటిలో ఏది అమ్ములిని ప్రేరేపిస్తుంది.

******

"బావున్నారా అమ్మగారూ..." గుమ్మంలోంచే పలకరిస్తూ వచ్చింది నూకాలు. వెనకే అమ్ములు "నమస్కారవమ్మా" అంటూ చిరునవ్వు నవ్వింది. అమ్ములుని చూడగానే నా మనసు బాధతో మూలిగింది. కట్టూ, బొట్టూ, వంటివాటం అచ్చు అమ్మలాగే ఉంది.

"ఊర్నించి ఎప్పుడొచ్చారు?... " అంటూ అమ్ములివంక చూసాను. అమ్ములిని పలకరించడానికి ధైర్యం కూడ తీసుకుంటూ.

"నిన్న రాత్రి బస్సుకొచ్చేవమ్మ... కూతుర్ని, అల్లుణ్ణి నాతో తీసుకొచ్చేసేనమ్మ" నా కళ్ళలోకి చూస్తూ చెప్పింది నూకాలు. దానికి తెలుసు ఆ మాట నా కళ్ళల్లో వెలుగు తెస్తుదని. మళ్ళీ తనే చెప్పటం మొదలు పెట్టింది.

"జరిగిందానికి పిల్ల బికసచ్చిపోయివుందమ్మా..... ఇదే అదనని మా అల్లుడి అన్నగారు ఇల్లు తనపేర రాయించేసుకున్నాడంట. ఛీ .. మానవత్వం లేని మనుషులు". మెటికలు విరుస్తూ అంది నూకాలు. "నన్ను సూడగానే పిల్ల బావురుమంది. నేనే సినిమాకి తీసుకెళ్ళమని పట్టుబట్టాను. అంతా నా వల్లే జరిగిందీ అంటూ తప్పంతా తనమీదేసుకుని కుమిలిపోయింది. ఇన్నాళ్ళూ నన్ను కళ్ళల్లో పెట్టుకు సూసుకున్నోడిని, ఆడి కర్మకి ఆడిని వదిలేసి నా సుఖం నన్ను చూసుకోమంటావా నువ్వసలు మడిసివేనా" అని నన్ను కొట్టినంత పనిచేసిందమ్మా సావైనా బతుకైనా ఆడితోటే అని ఖచ్చితంగా సెప్పింది. మొగుణ్ణొదిలి నా కూతురు రానంది, నా కూతుర్నొదిలి నే రాలేకపోయాను. పట్నంలో రాబందుల్లాంటి మనుసుల మధ్య సిన్న పిల్లలేవైపోతారో అని నాతో తీసుకొచ్చేసేనమ్మా. నా రెక్కల్లో సత్తువున్నంత వరకూ ఆళ్ళని నే కాసుకుంటాను. ఆ తరువాత భగమంతుడే ఉన్నాడు. " చెప్పటం ఆపి కళ్ళుతుడుసుకుంది నూకాలు.

తల్లి చెప్పేది వింటూ ప్రసాంతంగా చూస్తుంది అమ్ములు.

"చిన్న పిల్లయినా ఎంత పెద్దమనసుతో ఆలోచించిందో చూడు నూకాలు" అమ్ములు తలనిమురుతూ అన్నాను.

"మరేవనుకున్నారమ్మా... అమ్ములు నా కూతురమ్మా" గర్వంగా కూతుర్ని హత్తుకుంది నూకాలు.

చూస్తూనే కళ్ళకద్దుకోవాలనిపించే కోవెల్లో హారతిలా పవిత్రంగా దేదీప్యమానంగా తోచింది అమ్ములు.

# ఉగ్రవాదీ నమోన్నమః

జొన్నలగడ్డ రామలక్ష్మి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

"**రవీంద్ర భారతిలో సన్మాన** సభ ఉంది. ఈ సాయంత్రం వేరే ప్రోగ్రాం పెట్టుకోకు" అన్నాడు ఆనంద్. ఆనంద్ ఓ లోకల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. నేను ఇంజినీరింగ్ తర్వాత ఎంబియ్యే చేసి ఇటీవలే ఓ ఎమ్మెన్సీ బ్యాంకులో చేరాను. బ్రహ్మచారులమైన మేమిద్దరం రూం మేట్సుమే కాదు, ఒకే ఊరివాళ్ళం. ఆనంద్‌కి సన్మాన సభలంటే ఇష్టం. వక్తలద్వారా ఒక వ్యక్తి విశిష్టతకి ఉండే వివిధ కోణాలు తెలుసుకోవడం ఓ ఎడ్యుకేషన్ అంటాడతడు. పలు సన్మాన సభలకి ఎలాగో అలా ఆహ్వానం సంపాదించి, తోడుగా నన్ను రమ్మనడం అతడికి రివాజు. సాధారణంగా నేను వెళ్ళను. ఐనా అతడో పట్టు వదలని విక్రమార్కుడు.

అల్లసాని పెద్దనామాత్యుడు ఎదురైనచో - శ్రీ కృష్ణదేవరాయలు తన మదకరీంద్రము డిగ్గి కేలూత నొసగి ఎక్కించుకున్నాడు. సాహిత్యాభిమానం, స్పందన, గౌరవం, అంకితభావం - సమ్మేళనం కావడం వల్ల - అదీ అసలైన సన్మానం. సంస్థ ఉనికిని చాటుకుందుకో, అధికారంలో ఉన్నవారి నాకర్షించేందుకో - జరిగే నేటి సన్మాన సభల్లో - అర్హతకంటే దురభిమానానికీ, స్పందనకంటే స్వార్థానికీ, విజ్ఞతకంటే అట్టహాసానికీ - ప్రాధాన్యమెక్కువ. అందుకే నేను వాటికి దూరంగా ఉంటాను - సన్మానం నాకే ఐనా సరే!

"ఈ సభకి ఆహ్వానముంటే బాగుణ్ణనుకున్నా. నువు సాధించావ్. థాంక్స్" అన్నాను.

అంత సులభంగా ఒప్పుకున్నందుకు ఆశ్చర్యపోలేదు ఆనంద్. అతడికి నా దేశభక్తి గురించి తెలుసు. కానీ అతడికి తెలియని మరో విశేషం ఆ సభతో ముడివడి ఉంది.

ఇటీవలే హైదరాబాదు నడిబొడ్డులో తిష్టవేసి - నాలుగు రోజులపాటు నగరజీవితాన్ని స్థంభింపజేసి దేశాన్ని అట్టుడికించారు కొందరు విదేశీ ఉగ్రవాదులు. హోరాహోరీ పోరాటం అనంతరం వారిని అదుపు చేసిన మృత - అమృత పోలీసు, సైనిక వీరులకు నివాళి ఆ సన్మాన సభ. అంతమాత్రాన అది మిగతా సభలకి భిన్నంగా ఉంటుందని నేననుకోవడంలేదు. ఆ సభలో నా ఆసక్తి మా ఊరి నరసింహం.

నరసింహం మా ఊరివాడైనా సామాన్యుడు కాదు. రాష్ట్ర మంత్రివర్గ సభ్యుడు. మంత్రిత్వంలో ఆయనది ఉగ్రవాద నిర్మూలన శాఖ. ఉగ్రవాదులు విదేశం నుంచి హైదరాబాదు వచ్చి అంతటి ఘోరకృత్యానికి పాల్పడగలగడం - ఆయన మంత్రిత్వశాఖ ఉపేక్షాభావానికి నిదర్శనమని దేశమంతా ఎలుగెత్తి ఘోషించింది. ఆయన నిర్లక్ష్యవైఖరిని గర్హిస్తూ విపక్షాలతో పాటు స్వపక్షంనుంచి కూడా ఆయన రాజీనామాని డిమాండ్ చేసినవారున్నారు. కొన్నాళ్ళు ప్రతిఘటించినా చివరికీరోజుదయం రాజీనామా చేయక తప్పలేదాయనకి. ఆయన

రాజీనామాకి ముందే ఈ సన్మానసభ అజెండా ఫిక్సయింది. అందువల్ల ఆ సభకి ఆయనే అధ్యక్షుడు. ఆనంద్ తెచ్చిన ఆహ్వానపత్రికలో కూడా అధ్యక్షుడిగా ఆయన పేరుంది.

ఉగ్రవాదచర్యల్ని అరికట్టడంలో విఫలుడైనందుకు మంత్రి పదవినుంచి బలవంతంగా తప్పుకోవలసివచ్చిన ఆయనకి - ఉగ్రవాదాన్ని అణచిన వారిని సన్మానించే అర్హత ఉంటుందా? ఈ రోజాయన రాజీనామా చేసాడు కాబట్టి - సభాధ్యక్షుడి స్థానాన్ని వేరొకటి కేటాయిస్తారా?

ఇలా నేనాలోచించడానికి కారణం ఆయనంటే నాకున్న అపరిమితమైన ద్వేషం. ఐతే నా ద్వేషానికి కారణం ఆయన మా ఊరివాడు కావడం కాదు.

మా ఊళ్ళో ఆయన మోతుబరి. నేను దళితుణ్ణి. నా ద్వేషానికి కారణమది కూడా కాదు.

ఆయన ఉగ్రవాద నిర్మూలనా శాఖామాత్యుడే కావచ్చు. కానీ నా అభిప్రాయంలో ఆయనే ఉగ్రవాది. అదెలాగంటారా -

రాక్షసులకి వరాలతో బలాన్నిచ్చి - ఆ రాక్షసులనుంచి కాపాడ్డానికి అవతారాలెత్తడం విశ్వనాధుడి రాజకీయం. ఉగ్రవాదానికి నారుపోసి నీరుపోసి పెంచి దాన్ని త్రుంచడానికి నిధులు పదవులు సమకూర్చడం ప్రజానాధుల రాజకీయం. దేవుడికి రాక్షసులిచ్చిన గుర్తింపు ఎంత గొప్పదంటే - ఆయన భక్తులైన మునులు శాపాల్నిచ్చి మరీ రాక్షసుల్ని తయారు చేసేవారు. ప్రజాస్వామ్యలో ఉగ్రవాదం అలా వచ్చిందేనని కొందరంటారు. అందుకేనేమో పురాణాలు బలమదాంధ రాక్షస కథా భరితం. ప్రజాస్వామ్యాలు ఉగ్రవాద వ్యధాభరితం. జయవిజయాలకి ఉగ్రవాదం అడ్డదారి అనుకోవడం కూడా పురాణకాలంనుంచీ వస్తున్న సంప్రదాయం .

ఉగ్రవాదం పేరు చెప్పి ఉగ్రవాదులు కానివారెందరికో ఉపాధి లభించిదనడానికి మా ఊరివారు చెప్పుక్నే ఉదాహరణ నరసింహం. ఊళ్ళో మోతుబరిగా ఉంటూ పంచాయితీనుంచి ఎమ్మెల్యేస్థాయిదాకా ఎదిగిన ఆయనకి ఇటీవలే మంత్రి పదవి లభించిందంటే అది ఉగ్రవాదం చలవే!

దేశంలో ప్రబలిపోతున్న ఉగ్రవాదాన్ని అదుపు చేయడానికి ప్రతి రాష్ట్రప్రభుత్వమూ కొత్త మంత్రిత్వశాఖని సృష్టించింది. అలా నరసింహం మన రాష్ట్రానికి ఉగ్రవాద నిర్మూలన శాఖామాత్యుడిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు - నేను మానసికంగా ఇబ్బందిపడ్డాను. ఎందుకంటే నా జీవనయానంలో ఆయనొక  ఉగ్రవాది. మా నాన్న - నరసింహం ఇంట్లో పాలేరు. అమ్మ పనిమనిషి. అలా అనుకుంటారు కానీ నిజానికి వాళ్ళక్కడ బానిసలు. ఎందుకంటే నరసింహం ఇంట్లో సేవ బానిసత్వానికి నిర్వచనంలా ఉంటుంది. పుట్టుకే తప్ప మతానికి బాప్టిజమూ, కులానికి వృత్తీ అవసరమనుకోదు హిందూ సంప్రదాయం. అలా నేను పుట్టుకతోనే హిందువుని, బానిసని.

నాలుగేళ్ళ వయసులోనే నాకు నరసింహం పిల్లల ఆటపాటలకి తోడుగా ఉండే డ్యూటీ పడింది. వాళ్ళేం చెబితే అది చేయడం, తిడితే పడడం, కొడితే పంటి బిగువున ఏడ్పు ఆపుకోవడం - అప్పుడే నాకు అలవడ్డాయి. నాకు వాళ్ళని చూసినప్పుడల్లా - వాళ్ళకిలా గొప్పగా ఉండాలనీ, చదువుకోవాలనీ అనిపించేది. అమ్మకీ నాన్నకీ చెబితే - బానిసలు కదా - వాళ్ళు నరసింహం అనుమతి కోరారు. బానిసల కొడుకు చదువుకుంటానంటే అదో పెద్ద జోకుట. ఆయన పడీపడీనవ్వాడు. ఆ నవ్వు సంతోషం వల్ల కలిగింది కాదని అమ్మా నాన్నా తెలుసుకోవాలిగా - అలాంటి జోకులు మళ్ళీ వేయొద్దని వాళ్ళని హెచ్చరించాడు.

చదువు విషయంలో అమ్మా నాన్నా చేతులెత్తేసినా నేను నిస్పృహ చెందలేదు. మనం మట్టి అనుకునే దాంట్లోంచి చెరుకు మొక్క పంచదారని వెలికితీస్తుంది. నా దౌర్భాగ్యాన్ని వారసత్వానికి అంటగట్టకుండా స్వయంకృషితో సౌభాగ్యాన్ని సాధించాలన్న ఆలోచన నాలో కలగడానికి కారణం - పూర్వజన్మలో నేను చెరుకు మొక్కని కావడమేమో చెప్పలేను.

సూర్యం మేష్టారు రోజూ సాయంత్రాలు నరసింహం ఇంటికొచ్చి పిల్లలకి ట్యూషన్ చెప్పేవారు. చదువంటే చెప్పలేనంత ఆసక్తి ఉండడంతో నేనా చుట్టుపక్కలే తిరిగేవాణ్ణి. అలా అక్షరాలు, గుణింతాలు, ఎక్కాలు, పద్యాలు వగైరాలు నేర్చుకున్నాను. మేష్టారు నా శ్రద్ధగమనించారు. నన్ను పరీక్షించి, "ఒరేయ్ - నువ్వు జీనియస్‌విరా" అన్నారు. అప్పటికి నాకు జీనియస్ అంటే తెలియదు.

మంచి గురువు శిష్యుడికంటే శిష్యుడిలో జిజ్ఞాసని ఎక్కువ ప్రేమిస్తాడు. సూర్యం మేష్టారికి నేనంటే చెప్పలేనంత అభిమానమేర్పడింది. ఐతే ఆయనకి నా పరిషత్, నరసింహం దృక్పథం పూర్తిగా తెలుసు. అందుకని ఆయన నన్ను రాత్రిళ్ళు తనింటికి రప్పించుకుని తన పిల్లలతో పాటు చదువేకాక, ఉన్నత లక్ష్యాలకి పురిగొలిపే కథలు చెప్పేవాడు. జీవితంలో ఆదర్శం, సంస్కారాల ప్రాధాన్యం ఆయన దగ్గరే తెలుసుకున్నాను. నేను చదువుకుంటే గొప్పగా రాణిస్తానని - మేష్టారు అమ్మా నాన్నలకి ఒకటి రెండుసార్లు చెప్పి చూసాడు. వాళ్ళకి నా భవిష్యత్తు ఊహ, నరసింహం వర్తమానం కాబట్టి - సహజంగానే ససేమిరా అన్నారు.

మరి నరసింహం నా గురించి అంతగా పట్టించుకోలేదో, మేష్టారు రహస్యం దాచడంలో నిపుణుడో చెప్పలేను. ఎనిమిదేళ్ళొచ్చేదాకా సూర్యం మేష్టారి దగ్గర నా చదువు నిరంతరాయంగా కొనసాగింది.

ఎనిమిదేళ్ళంటే మిగతా ఇళ్ళలో ఏమో కానీ - మా ఇంట్లో దూడలు కాసే వయసు. పేడ పిసికే వయసు. నరసింహం నన్ను వయసుకి తగ్గపనిలో పెడితే నా చదువేమౌతుందోనని బెంగ పెట్టుకున్నాను కానీ అదృష్టదేవత నా వైపున ఉండి సరిగ్గా అప్పుడే మా ఊళ్ళో పంచాయితీ ఎన్నికలొచ్చాయి.

అంతకాలం ఊళ్ళో అధ్యక్షపదవికి పోటీ లేదు. కానీ అప్పటికి మూడుసార్లు అధ్యక్షపదవిని నిర్వహించిన ఆయ్యన అనారోగ్య కారణాలవల్ల రంగంలోంచి తప్పుకున్నాడు. అదే అదనని నరసింహం రంగంలో దిగాడు. సంప్రదాయం ప్రకారం పోటీలేకుండా ఆయన్నే ఎన్నుకోవచ్చు కానీ - అందుకు ఆయన చేసిన మంచి పని ఒక్కటంటే ఒక్కటి చెప్పాల్సుంటుందని సవాలు విసిరారు కొందరు గిట్టనివాళ్ళు.

నరసింహం ఘనకార్యాల గడ్డిమేట్లో సత్కార్యమనే సూదిని వెతికిపట్టుకోవడం అంత సులభం కాదు. అంతకంటే కొత్త సూది కొని తేవడం సులభమనిపించి ఒకరోజాయన సూర్యం మేష్టారికి సందర్భం చెప్పి ఊరంతా మెచ్చే ఓ మంచిపని చెప్పమన్నాడు.

చదువునీ, చదువుకునేవాళ్ళనీ మాత్రమే ప్రేమించే అసలు సిసలు గురువు సూర్యం మేష్టారు. ఆయన వెంటనే, "మీ పాలేరు కొడుకు రామ్మూర్తిని స్కూల్లో వేయించి చదివించండి. రామ్మూర్తి దళితుడు. ఇప్పుడు రాజకీయాలన్నీ దళితవర్గం చుట్టూ తిరుగుతున్నాయి. మీరిప్పుడు రామ్మూర్తిని ఉద్ధరిస్తే - ఆ ప్రభావంతో ఏదో రోజున రాజధానిలో మంత్రి కూడా కాగలరు" అంటూ ఆశ పెట్టాడు సూర్యం మేష్టారు.

అలా స్కూల్లో చేరాన్నేను. చేరినవాణ్ణి తిన్నగా ఉండొచ్చుగా - జీనియస్ గిరీ చూపించి క్లాసులో ఫస్టు వచ్చాను. నా దురదృష్టం కొద్దీ నరసింహం కొడుకు రఘురాం నా క్లాస్ మేటు. అతడు క్లాసులో పదోవాడో, పదిహేనోవాడో. తనపైన ఎంతమందున్నా అతడికిబ్బంది లేదు. వాళ్ళ పాలేరు కొడుకైన నేనొక్కణ్ణీ మాత్రం తనకిందే ఉండాలి. విషయం క్లాసునుంచి స్కూలుకీ, స్కూల్నించి నరసింహం ఇంటికి వెళ్ళింది. ఆయన నాన్నని పిలిచి వార్నింగిచ్చాడు. నాన్న ఆ వార్నింగ్ అమ్మకి బదలాయించాడు. అమ్మ దృష్టిలో నరసింహం - తన పాలేరు కొడుకుని స్కూల్లో వేసి చదివిస్తున్న మహాత్ముడు. దాంతో కర్ణుడి కథ మా ఇంట్లో మరోలా రిపీటయింది. యజమాని కొడుకు రఘురాం చేతుల్లో ఓడిపొమ్మని కన్నకొడుకునైన నన్ను శాసించింది అమ్మ.

అప్పుడు నాకిదంతా తెలియదు. తప్పంతా అమ్మదే అనుకున్నాను. అమ్మ ఆయన్ని మహాత్ముడంది కదా అని నమ్మి నేనాయనకి అమ్మ మీద ఫిర్యాదు చేసాను. అప్పుడాయన నాకు గీతోపదేశం చేసాడు. వంగే గుణంలేక, వరదలప్పుడు మట్టిచెట్టు కూకటి వ్రేళ్ళతో కూలిపోతుందట. వంగి ఉండడం వల్ల గడ్డిపోచకేమీ కాదట. మొక్కైవంగనిది మ్రానై వంగదు కాబట్టి నేనిప్పటినుంచీ వంగి ఉండడం

నేర్చుకోవాలట. ఇలా అంతా నా మంచికేనని చెప్పి, "నువ్వు దళితుడివి. నీకు పాసు మార్కులొచ్చినా ఇంజినీరింగులో సీటొస్తుంది. థర్డ్ క్లాసులో ప్యాసైనా గవర్నమెంటు జాబొస్తుంది. అంతగా రాకపోతే పైన నేనుండి నిన్ను ఆకాశ మంత ఎత్తుకి తీసుకుపోతాను. ప్రస్తుతానికి పాతాళందాటి ఒక్క మెట్టు పైకెక్కకు" అని చెప్పాడు. కాళ్ళు లేని వాడికి చక్రాల బండి అవసరం. కానీ చక్రాల బండి ఇవ్వడం కోసం కాళ్ళున్నవాడికి కాళ్ళు విరగ్గొట్టడం ఏం న్యాయం - అనేటంత పరిజ్ఞానం నాకప్పుడు లేదు. విషయం సూర్యం మేష్టారికి చెప్పాను.

"నీకు చదువు ముఖ్యం కాబట్టి నరసింహం మాట వినక తప్పదు. పరీక్షలు వ్రాసినప్పుడు అన్ని ప్రశ్నలకీ జవాబు వ్రాయి. ప్యాస్ మార్కులకి సరిపడా ఆన్సర్ షీట్స్ వెనక్కిచ్చి మిగతావి నీ దగ్గరుంచుకో. అవి నేను కరెక్ట్ చేసి పెడతాను" అన్నాడు సూర్యం మేష్టారు.

ఏడవతరగతిలో పబ్లిక్ పరీక్షలదాకా నేనలాగే చేసాను. అపుడు మాత్రం మేష్టారిచ్చిన ధైర్యంతో మామూలుగా పరీక్ష వ్రాసి స్కూలుకి ఫస్టొచ్చాను. చుట్టుపక్కల గ్రామాల్లో ఏ స్కూలు విద్యార్థికీ నాకొచ్చినన్ని మార్కులు రాకపోవడంతో - నా పేరు మ్రోగిపోయింది. మా స్కూల్లో నా కోసం ఓ సన్మాన సభ జరిగింది. దాని అధ్యక్షుడు నరసింహం పేరు, ఫోటో చాలా పేపర్లో వచ్చాయి. అప్పుడే సన్మాన సభలంటే నాకు విముఖత ప్రారంభమయింది. ఎందుకంటే నా విజయానికి బొత్తిగా సంతోషించనివాళ్ళు అమ్మ, నాన్న నరసింహం వాళ్ళనెంతగా భయపెట్టాడో ఏమో - వాళ్ళునాతో, "ఏదో రోజున దూడలు కాసుకోవలసిందే మనకెందుకొచ్చిన చదువు్లా ఇవి" అని వాపోయారు.

నరసింహం నా భవిష్యత్తు చెప్పి - దానికి అనుగుణంగా వర్తమానాన్ని శాసించమని వాళ్ళని ఆదేశించాడు. నేను విషయం సూర్యం మాష్టారికి చేరేసాను. కానీ నరసింహం అప్పటికే నా ప్రగతి పునాదుల్ని పెకలించే కార్యక్రమంలో ఉన్నాడు. మేష్టారికి ట్రాన్స్‌ఫరైంది మా ఊరికి చాలా దూరంగా.....

సెలవుల్లో నాకు దూడలు కాసే పని. క్లాస్ మేట్స్ నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతుంటే - నా ప్రగతికి ప్రశంసలందుకున్న నరసింహం నా భవిష్యత్తుకి సమాధి కట్టే ప్రయత్నాల్లో ఉన్నాడు.

ఊళ్ళో ఐతే నా చదువు మానిపించడం తనకి చెడ్డపేరు తేగలదని ఊహించాడో ఏమో - ఆయన గొప్ప పథకం వేసాడు. మా ఊరి స్కూల్లో నా ప్రతిభకి న్యాయం జరగదట. అందుకని ఆయన నాకు టీసీ తీసుకుని వేరే ఊళ్ళో తన బంధువులింటికి ప్రయాణం కట్టించాడు. నేనక్కడ వాళ్ళింట్లో పాలేరుగా స్థిరపడితే ఆయనిక్కడ 'ఎలకతోలు' పద్యం ఊళ్ళోవాళ్ళకి వినిపించాలనుకున్నాడు.

ఆడవాళ్ళమీదా, అట్టడుగువాళ్ళమీదా రాళ్ళేయడం అందరికీ ఇష్టమే. ఎటొచ్చీ కుహనా సంస్కారం కారణమడుగుతుంది. తెల్లకాకి ఉనికిని నల్ల కాకి ఉనికి అంత సహజంగా భావించి విశ్వసిస్తుంది....

నరసింహం పథకం నా ఊహకి అందింది. నేను కలవరపడలేదు.

నా ప్రగతికి అడ్డుపడుతున్నా కూడా అమ్మ అమ్మే! ఇంతకాలం అమ్మ సమక్షంకోసం నరసింహాన్నీ, ఆయన ఆగడాల్నీ సహించాను. అమ్మకెలాగూ దూరం కాక తప్పదని ఇప్పుడూ తెలియడంతో - ఆదాయన్నించి శాశ్వతంగా తప్పించుకునే అవకాశంగా భావించాను. టీసీతో నరసింహం చెప్పిన చోటకి కాకుండా సూర్యం మేష్టారి ఊరెళ్ళాను. పరిస్థితి చెప్పాను.

మేష్టారి ఆర్థిక పరిస్థితి గొప్పదేం కాదు. కానీ మనసు గొప్పది. మనసుంటే మార్గముంటుంది. గొప్ప మనసుకైతే గొప్ప మార్గముంటుంది.

ఆ క్షణం నుంచీ నాకాయన రాముడు. నేను హనుమంతుణ్ణి. కానీ ఈ రాముడు నాకేం చెప్పినా తనకోసం కాక నా ఎదుగుదలకోసం చెప్పాడు. నేను ఎదిగాను. ఎమ్మెస్సీ బ్యాంకులో ఉద్యోగినయ్యాను. ఆనంద్ మేష్టారి పెద్దబ్బాయి. అతడికి మా ఊరి కథ కొంతవరకే తెలుసు.

అమ్మకీ, నాన్నకీ నా ఉనికి తెలియకుండా అడపా తడపా క్షేమసమాచారాలందే ఏర్పాటు సూర్యం మేష్టారు చేసారు. నరసింహమనే ఉగ్రవాది కళ్ళబడకుండా ఉండడం నా జీవనయానంలో అంతర్భాగం మరి. ఐతే నేనీస్థాయి చేరుకుంటానని నరసింహం కలలో కూడా అనుకునుండడు. లేకపోతే నన్ను వేటాడి పట్టేసేవాడే! నా తర్వాత అమ్మకి ఇద్దరబ్బాయిలు, ఓ అమ్మాయి. వాళ్ళు నాకులాకాక హిందూ సంప్రదాయాన్ననుసరించి ఆయనకి బానిసలుగా కొనసాగుతున్నారు. నాకులా దూరమైపోతారన్న భయంతో అమ్మ వాళ్ళనెవర్నీ స్కూలుకి పంపలేదు, బయట అక్షరాలైనా నేర్చుకోనివ్వలేదు.

నేను ఉద్యోగస్తుడినయ్యాక ఒక మనిషి ద్వారా కొంత డబ్బు, నా వివరాలు ఇంటికి పంపాను. అది ఉత్తరగోగ్రహణంలో విజయుడు పూరించిన దేవదత్తంలా నా అజ్ఞాతవాసాన్ని భంగపరచి ఊరంతా పెద్ద సంచలనం కలిగించింది. వెంటనే నాకు మా ఊరి ప్రెసిడెంటునుంచి ఫోనొచ్చింది.

దళిత కుటుంబంలో పుట్టిన నేను - ఈ రోజు ఈ స్థాయికి ఎదగడం మా ఊరివారికి గర్వకారణమట. వాళ్ళు నన్నూ, నా తల్లిదండ్రులనీ సన్మానిస్తారట. ఆ సన్మాన సభకి నరసింహం అధ్యక్షత వహిస్తాట్ట.

పంచాయితీ అధ్యక్షుడిగా రాజకీయజీవితం ప్రారంభించి రాష్ట్రమంత్రి స్థాయికి ఎదిగినవాడు నరసింహం. ఆయన నాటగా నేడు మహావృక్షమైన విత్తుని నేను. ఒకే సభలో ఒకే ఊరికి చెందిన మేమిద్దరం. ఏ ఊరికైనా ఇంతకంటేకంటే గర్వకారణముండదని ఊరివారి అభిప్రాయం.

నేను వారి అభిప్రాయాని ఖండించలేదు. సన్మానాలకి విముఖుణ్ణని చెప్పాను.

"ముందోసారి ఊరికిరా" అన్నాడు ప్రెసిడెంటు.

నాకు తెలుసు. నేను వెళ్ళేసరికే అక్కడ సన్మానానికి ఏర్పాట్లైపోతాయి. కాదనలేని స్థితి.

నా ఊరివాళ్ళు నాకు సన్మానం చేయడం నాకూ గర్వకారణమే! కానీ ముఖ్యంగా మూడు కారణాలవల్ల నేనీ సన్మానంపట్ల సంధిగ్ధంలో ఉన్నాను.

ఒకటి - నేను దళితుణ్ణి కాకపోతే ఎమ్మెస్సీ ఉద్యోగాన్ని సాధించడం సన్మానార్హమైన గొప్ప విశేషమని గ్రామస్తులు భావించేవారు కాదు. పుట్టుకతో ముడివడని ఘనకార్యాలే సన్మానార్హమని స్వాభిప్రాయం.

రెండు - ఎవరైతే అడుగడుగునా నన్నణచివేయాలని చూసాడో, ఎవర్ని తప్పించుకోవడం వల్ల నేనీస్థాయికి చేరుకున్నానో - ఆ నరసింహం నన్ను సన్మానిస్తాడు. అప్పుడాయన్ని నిరసించకపోతే అవకాశవాదినౌతాను. నిరసిస్తే అహంకారిననిపించుకుంటాను. వ్యక్తుల హోదాకే తప్ప వ్యక్తిత్వాలకీ, నేపథ్యాలకీ ప్రాధాన్యమివ్వని బూటకు సంస్కృతిలో పాలు పంచుకుంటే - నేనక్కడ 'ఉగ్రవాదీ నమోన్నమః' అన్నట్లే ఔతుంది.

మూడు - కన్నందుకు నా తలిదండ్రులు నాకు దేవుళ్ళే కానీ - నా ప్రగతికి సన్మానార్హత వారికి లేదు. నా జీవనయానంలో నరసింహం ఉగ్రవాది, నా తలిదండ్రులు ఆయన అనుయాయులు. అది వారి అసహాయితే కావచ్చుకానీ అసహాయులకి సన్మానార్హత ఉండదు కదా! నా ప్రగతికి సన్మానార్హుడు సూర్యం మేష్టారు ఒక్కడే - కానీ మా ఊరివాడు కానివాణ్ణి గ్రామస్తులు సన్మానించరు.

అర్హతకంటే దురభిమానానికీ, స్పందనకంటే స్వార్థానికీ, విజ్ఞతకంటే అట్టహాసానికీ - ప్రాధాన్యమిస్తూ సన్మానం తలపెట్టేవారు - ఈ మూడు కారణాలనీ హర్షించరని నాకు తెలుసు.

అందుకే ఈ రోజు నరసింహం చేతులమీదుగా మృత - అమృత వీరులకి జరిగే సన్మానసభ - నా సందిగ్ధానికి పరిష్కారం చూపుతుందని ఆశపడుతున్నాను.

ఆ సాయంత్రం నేను, ఆనంద్ - నిర్దేశ సమయానికే సన్మాన సభకి వెళ్ళాం. రివాజు ప్రకారం సభ ఓ గంట ఆలస్యంగా మొదలైంది. సభని ప్రారంభిస్తూ, "ఈ అధ్యక్షస్థానం పదవిదే తప్ప వ్యక్తికాదు. పదవికి రాజీనామా చేసాక నేనిక్కడ కూర్చోవడం సబబు కాదు" అంటూ లేచి నిలబడి మరో పురప్రముఖుణ్ణి అధ్యక్షుడిగా ఉండమని కోరాడు. మిన్నుముట్టేలా మరోసారి కరతాళధ్వనులు.

అర్థమైంది నాకు. నరసింహం తన మర్యాద దక్కించుకునేందుకు ఇదంతా ముందుగా చేసుకున్న ఏర్పాటు. కొత్త అధ్యక్షుడు లేచాడు. నరసింహాన్ని కాదనలేక అయిష్టంగానే అధ్యక్షస్థానాన్ని స్వీకరిస్తున్నానంటూ ఆయన ముందుగా నరసింహానికి పాదాభివందనం చేసాడు. మళ్ళీ మిన్నుముట్టేలా కరతాళధ్వనులు.

కొత్త అధ్యక్షుడు ఇటీవలి ఉగ్రవాద చర్యని ముచ్చటగా మూడుముక్కల్లో అభిశంసించాడు. ఉగ్రవాదుల్ని అణచివేయడంలో మృత - అమృత వీరులు ప్రదర్శించిన ధైర్యసాహసాల్ని అచ్చటగా ఆరుముక్కల్లో ప్రశంసించాడు. తర్వాత ఒకొక్కరుగా యాభైమందిని వేదికమీదకి పిలిచి సన్మానపత్రాన్ని అందజేసాడు. అమృతులు స్వయంగానూ, మృతుల తరపున స్వీయజనమూ వేదికనెక్కారు. ఒకొక్కరే వేదికనెక్కినప్పుడు సభలో అభినందపూర్వకంగా చప్పట్లు.

సభ ఎంత వేగంగా నిర్వహించబడిందంటే - యాభైమందిని వేదికనెక్కించిన తంతు గంటలోపే ముగిసింది. ఇక సభకూడా ముగిసిందనుకున్నాను. కానీ అధ్యక్షుడు గొంతు సవరించుకుని, "ఇంతవరకూ మీరు తెరముందు వీర సైనికుడు - విలువలకి ప్రాధాన్యమిచ్చి అత్యునత పదవిని కూడా తృణపాయంగా తిరస్కరించగల త్యాగమూర్తి - ఆ ఒకే ఒక్కడు - నరసింహం గారిని మనమందరం కృతజ్ఞతాభినందనలతో సత్కరించనున్నాం.." అని సభలో కరతాళధ్వనులు మిన్నుముట్టుతుంటే ఒక్కక్షణం ఆగాడు.

నాకు పంచేంద్రియాలూ స్థంభించిపోయాయి.

వేదికనలంకరించినవారు ఒకరొక్కరుగా నరసింహాన్నభినందిస్తూ ప్రసంగిస్తున్నారు. మధ్య మధ్య సభలోంచి కూడా కొందరు వేదిక మీదకొచ్చి ఆయనకి పాదాభివందనం చేసి వెడుతున్నారు.

వేరెవరికో అనుకున్నాను కానీ నిజానికది నరసింహం సన్మానసభ.

మ్రాన్పడిపోయిన నేను నిస్సహాయంగా జరిగేది గమనిస్తున్నాను.

సభలో, వేదికపై ఉన్నవారు - నాకులా అసహాయులా, దళితులా, లేక ఉగ్రవాదుల అనుయాయులా అన్నది నాకు తెలియదు. కానీ అందరూ ఉగ్రవాదీ నమోన్నమః అంటున్నట్లే అనిపిస్తోంది.

ఆ సభ మరో రెండు గంటలపాటు అనర్గళంగా కొనసాగింది. ఐతే మా ఊళ్ళో నాకోసం ప్రతిపాదించబడిన సన్మానసభకి సంబంధించిన సందిగ్ధం నాలో ఎప్పుడో తొలిగిపోయింది.

# ఫ్లిప్ ఫ్లాప్ ప్రయాణం

శైలజ సోమయాజుల

**అబ్బ! ఎంత హాయిగా ఉంది.** సూర్యకిరణాలు అద్దంలోంచి పడుతూ ఉంటే వెచ్చగా ఉంది. హాయిగా ఒళ్ళువిరుకున్నాను. ఇక్కడకి వచ్చి రెండురోజులు అయింది. వేలాడతీసిన తాడుతో గుండ్రంగా తిరుగుతూ సరదాగా షో కేస్ లోంచి రోడ్డు మీద జనాలని చూస్తూ ఉన్నాను.

అకస్మాత్తుగా దృష్టి ఓ చిన్నపిల్లవాడు మీద పడింది. వాళ్ళ అమ్మ చేయిపట్టుకుని గెంతుకుంటూ ఇటే వస్తున్నాడు. చాలా ముద్దుగా ఉన్నాడు. గొప్ప ఇంటిబిడ్డలాగా ఉన్నాడు కూడా! హఠాత్తుగా వాడి దృష్టి నా మీద పడింది. అంతే! గబుక్కున నా కిటికీ ముందర ఆగి వాళ్ళ అమ్మ చెయ్యిలాగడం మొదలుపెట్టాడు. వాళ్ళమాటలు వినబడడంలేదు కాని, వాళ్ళ హావభావాల వల్ల అర్థం చేసుకోగలుగుతున్నాను. అయినా ఇది మామూలే! పిల్లలు కావాలని అనడం, పెద్దలు 'వద్దు' అనడం, కొంచెం సేపటికి మారాం కాస్తా ఏడుపులోకి మారింది. ఆవిడ చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయాయి. వీడి మొండితనం ఆవిడకి అర్థం అవడంలేదు. ఖరీదయిన బొమ్మలు వద్దని ఈ వేలాడుతున్న రబ్బరు బొమ్మ కావాలని అంటున్నాడేమిటని ఆశ్చర్యపోతున్నది. మొత్తం మీద వాడి మొండితనమే నెగ్గింది. వాడి చేయి పట్టుకుని 'అమ్మ' తలుపు తీసుకుని షాపులోనికి వచ్చింది.

ఆవిడ వస్తూనే నన్ను చూపించడం, షాపుకుర్రాడు నన్ను వేలాడదీసిన మేకు నుంచి విప్పతీసి 'కౌంటర్' మీద పెట్టడం జరిగిపోయాయి. ఆవిడ కొంటాననేసరికి, యజమాని నా గురించి గొప్పగా చెబుతూ (కొంటున్నారన్న ఆనందంతో) నన్ను జాగ్రత్తగా టిష్యూ కాయితంలో చుట్టి, ఓ చిన్న అట్టడబ్బాలో పెట్టి, దాన్ని ప్లాస్టిక్ సంచిలో పెట్టి ఆవిడకి ఇచ్చి డబ్బులేసుకున్నాడు. (ఇలాంటి మర్యాదలు కొంటున వాళ్ళ వేషభాషల బట్టి మారుతూ ఉంటాయి). పిల్లవాడి పేరు 'బుజ్జీ' అని మాటల సందర్భంలో తెలిసింది. ఇకనుంచి నేను బుజ్జీతోనే ఉంటానని అర్థం అయింది. బుజ్జీ నేనున్న సంచిని రెండు చేతులతో జాగ్రత్తగా పట్టుకుని అమ్మ వెనకాతల వెళ్ళి కారు ఎక్కాడు. సరాసరి ఊర్లో ఉన్నపెద్ద హోటల్ ముందర ఆగింది.

మర్నాడు అదేకారు మమల్ని ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్ళింది. "ఇప్పటివరకు అన్నిరకాల రోడ్డుమీద ప్రయాణం చేసే వాహనాలని ఎక్కాను, పడవ ప్రయాణం చేసే వాహనాలని ఎక్కాను, పడవ ప్రయాణాలు చేసాను, ఇప్పుడు ప్లేన్ ఎక్కుతున్నాను" అని అనుకున్నాను. బుజ్జీ నన్ను పెట్టిన చిన్న సూట్ కేస్ పట్టుకుని లోపలికి వెళ్ళి సామాన్లు తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ బెల్ట్ మీద పెట్టాడు. అక్కడి సెక్యూరిటీ అతను ఆ చిన్న సూట్ కేస్ విప్పి అందులో ఉన్న చాక్లెట్లు, బొమ్మలు తనిఖీ చేసి, ఆఖరిలో నన్ను ఉంచిన సంచి విప్పి నన్ను పైకి తీసి అటూ ఇటూ తిప్పి చూసి నవ్వుతూ ఏదో అనబోయి బుజ్జీ ముఖం చూసి, వాడికళ్ళల్లో కదులుతున్న ఆనందం చూసి, మరి ఏమి అనుకున్నాడో, ఏమీ అనకుండా చిరునవ్వు నవ్వి, నన్ను యధావిధిగా లోపల పెట్టేసి పంపించేసాడు. "థేంక్ గాడ్"! ప్లేన్‌లో బుజ్జి కాళ్ళ దగ్గర సీటు కింద సర్దుకున్నాను. ఈ జీవిత ప్రయాణం ఎక్కడ మొదలు పెట్టాను? ఎక్కడికి వెళతాను? ఎన్నాళ్ళు వెళతాను? ఎన్ని రూపాంతరాలు చెందుతాను? ఇలా ఆలోచిస్తూ జ్ఞాపకాల్లోకి జారుకున్నాను.

మొట్టమొదటిసారి ప్రపంచాన్ని చూసింది ఒక పెద్ద ఊర్లో ఉన పోలిమర్ కంపెనీలో! నేను 'పోలీయురెతెన్' అన్న పదార్థంతో చెయ్యబడ్డాను. ఆ కంపెనీలో! నేను మొదట 'ఫ్లిప్ ఫ్లాప్'గా పుట్టాను. రోజా మాలాంటి వాళ్ళు ఎంతమందో పుడుతూ ఉంటారు. నాకు తోడుగా ఉండడానికి నాతో బాటు ఇంకొకళ్ళని నాకు 'జత'గా కలుపుతారు. మేం చిన్నా, పెద్ద, గొప్ప, బీద అని బేధం లేకుండా మానవుల పాదాలకి రక్ష కలిపిస్తూ ఉంటాం. ఒక మూస ద్వారా శరీర భాగం పాదం ఆకారంలో చెయ్యబడతాయి. తరువాత ఒక మెషీన్

ద్వారా మీద భాగంలో ఒక రంధ్రం, మధ్యలో అటూ ఇటూ రెండు రంధ్రాలు కల్పించబడతాయి. ఆ రంధ్రాల ద్వారా మాకు రెండు స్ట్రాప్స్ తగిలిస్తారు. మానవుల పాదం మా మీద పెట్టి నడిచేటప్పుడు ఆ స్ట్రాప్స్ కాళ్ళకి సరిగ్గా పట్టి ఉండడానికి ఉపయోగపడతాయి.

మేము అందరం ఆకృతిలో ఒకలాగే ఉన్నా, సైజులోనూ, రంగుల్లోనూ, తేడాగా ఉంటాము. మమ్మల్ని ఉపయోగించే మనుష్యులలాగే! ఒకసారి మమ్మల్ని ధరించాక వారి శరీరంలో ఒక భాగంగా కలిసిపోతాము. ఇలా నేను, నా జత పుట్టినప్పటినుంచి ఒక 'భార్యాభర్తల' అనుబంధంతో ఆఖరివరకు కలిసి ఉంటాము. మేమిద్దరం రంగురంగులతో చెయబడ్డం వల్ల మిగతావాటికన్నా మా వెల ఎక్కువే! అందుచేత ఎవరేనా గొప్పవాళ్ళ ఇంట్లో జీవితం హాయిగా గడిచిపోతుందేమో అన్న ఆశ ఉండేది.

ఇలా మమ్మల్ని జతగా అట్ట డబ్బాలో పేర్చి రైలులో ఇంకో ఊరు పంపించారు. అలా మా రైలు ప్రయాణం రెండు మూడురోజులు సాగాక ఇంకో పెద్ద ఊరుచేరుకున్నాం. ఆ రైలు కుదుపులకి బాగానే అలవాటు పడ్డాం. అక్కడినుంచి గోడౌన్ చేరుకున్నాక, కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్నాక మమ్మల్ని వేరే వేరే షాపులకి పంపించారు. అక్కడ మాలో కొంతమందిని షాపులో అరల్లో ఉంచి, కొంతమందిని వెనకాతల గదిలో ఉంచారు.

ఇలా కొన్నాళ్ళు గడిచాక ఒకరోజు అందంగా, నాజూకుగా ఉన్న ఒకావిడ షాపుకి వచ్చింది. వస్తూనే ఆవిడకి నేను నచ్చడం నేను, నా జత కలిసి ఆవిడతో వాళ్ళింటికి కారులో వెళ్ళిపోయాం. ఎంత పెద్ద ఇల్లు, ఎంతమంది నౌకర్లు? ఆవిడ ఒక పేరు మోసిన డాక్టరు అని తెలిసింది. త్వరలోనే ఒక రొటీన్‌కి అలవాటు పడ్డాం. ఆవిడ మమ్మల్ని ఎప్పుడూ ఇంట్లోనే ఉంచేది. అందుకై ఎక్కడా మట్టి, దుమ్ము పట్టేదికాదు. పైగా ఆయా రోజూ శుభ్రం చేస్తూ ఉండేది కూడా! రోజూ నిద్రలేస్తూనే, ఆవిడ బెడ్ పక్కనే ఉన్న మేం ఆవిడ కాళ్ళని అలంకరించేవాళ్ళం. ఆ పాదాలు తెల్లగా, మెత్తగా మృదువుగా ఉండేవి, ఆవిడ నడుస్తుంటే మాకు హాయిగా మసాజ్ చేస్తునట్టు ఉండేదే కాని, మరేవిధమైన కష్టం, శ్రమ ఉండేది కాదు. ఇలా ఏడాదిపైన అయేసరికి క్రమంగా ఆవిడకి మా మీద ప్రేమ తగ్గుతున్నదేమో అని అనుమానం కలగసాగింది.

ఇలా ఉండగా ఓ రోజు ఇంట్లోకి చాలామంది జనం రావడం సామాన్లు అన్నీ సర్ది, లారీల్లోకి ఎక్కించడం చూసాము. డాక్టరుగారికి వేరే ఊరు బదిలీ అయింది. చూస్తుండగా అన్ని సామాన్లు లారీల్లోకి ఎక్కించేసారు కాని, మేం మటుకు బెడ్‌రూములో ఒక మూల ఉండిపోయాం. వెళ్ళిపోతూ డాక్టరుగారు మమ్మల్ని ఆయా చేతిలో పెట్టేసింది. ఆయా సంతోషంగా మమ్మల్ని ఒక పాత న్యూస్ పేపర్లో చుట్టి, గుడిసెకు తీసుకెళ్ళి కూతురు'లచ్చి'కి ఇచ్చింది. ఇన్నాళ్ళు "గొప్పరికం" అనుభవించాం, ఇంక "బీదరికం" అనుభవించాలని తెలిసింది. మనస్సంటే ఉంది కాని, మనసులో మాట చెప్పడానికి నోరులేదుకదా!

'లచ్చి' ద్వారా ఇప్పుడు ఊరంతా చూడగలుగుతున్నాం. పొద్దుటే బజారు పనులకి, దూరంగా ఉన్న స్కూలుకి వెళ్ళి రావడానికి, ఆడుకోవటానికి, సినిమాలకి, స్నేహితుల ఇళ్ళకి వెళ్ళటానికి, అన్నిటికీ 'లచ్చి'కి తోడుగా ఉండడం నేర్చుకున్నాం. రాత్రి అయ్యేసరికి ఒళ్ళు హూనం అయి, అలిసిపోయి, సన్నబడిపోతున్నాం. ఎంతలేదన్నా పైబడుతున్న వయస్సేకదా! ఇలా రెండేళ్ళు గడిచేసరికి క్రమంగా వెలసిపోవడం, చర్మం ముడతలు పడి గట్టి పడడం, పగుళ్ళు వెయ్యడం, ఓ పక్కకి వంగిపోవడం కూడా జరిగింది.

ఇలా ఉండగా, ఓ రోజు హోరున కురుస్తున్న వానలో స్కూలునుంచి ఇంటికి వస్తుండగా, తోవలో ఇంతకుముందే ఫ్రాక్చర్ అయిన నా అవయతం (స్ట్రాప్) ఒకటి ఊడిపోయింది. లచ్చికి మా మీద కోపంవచ్చింది. రోడ్డు పక్కన ఉన్నా కర్రకి మమ్మల్ని తగిలించి ఈడ్చుకుంటూ ఇంటికి తీసుకువచ్చింది. ఎంత బాధపడ్డాం! పైగా విరిగిన అవయవంకూడా! లచ్చి మమ్మల్ని వేసుకున్నప్పుడు జాగ్రత్తగా గతుకులు, రాళ్ళు, బురద, పేడా, పెంకులు ఇలా అన్నిటినీ తప్పుకుంటూ లచ్చికి ఏ బాధ కలగకుండా చూసుకునే వాళ్ళం కదా! ఇదేనా విశ్వాసం? ఒళ్ళంతా ఒకటే నొప్పులు. నా 'జత' తన బాధ దిగమింగుకుని నాకు ధైర్యం ఇస్తోంది. సాయంకాలం ఆయా ఇంటికి వచ్చి మా పరిస్థితి చూసి 'లచ్చి'కి రెండు తగల్నిచ్చి (మళ్ళీ ఇంకో జత కొనాలని కాబోలు) మమ్మల్ని కర్రపుల్లతో సహా ఆ వానలో బయటకు

విసిరేసింది. ఆ ఊపులో మేం రోడ్డు పక్కన ఉనకాలవలో పడిపోయాం! అలా ఊరు చివరవరకు కొట్టుకుపోయి ఓ పెద్ద గొట్టం ద్వారా నదిలోకి పడిపోయాం. ఇంక మా జీవితం మా చేతిలో లేదు. అయినా ఇద్దరం కలిసే ఉన్నాం కదా అని అనుకుంటూ ఉండగానే, నీళ్ళల్లో ఉన్న ఓ చెట్టు కొమ్మకి తగులుకుని నేను ఉండిపోయాను. నా 'జత' నన్ను విడిచి వెళ్ళిపోయింది. నా దుఃఖం ఆగలేదు. నా కన్నీళ్ళతో నది నీళ్ళు ఉధృతం ఎక్కువ అయి, కొమ్మ తెగిపోయి, నీళ్ళల్లో కొట్టుకుపోయింది. దాంతోబాటు నేను కూడా! అలా ఆ ప్రయాణంలో ఎంతమందినో దగ్గరకి చేర్చుకున్నాం. నన్ను పట్టుకున్న ఓ చిన్నపిల్లపిల్లని వీపుకి ఎక్కించుకున్నాను. అలాగే నా స్ట్రాప్ (ఊడిపోయిన) ద్వారా ఓ పేద్ద చీమ నా మీదకి పాకింది. కొమ్మ ఆధారంగా నా రెండవ అవయవం పట్టుకుని ఓ కుక్క ఈదడం మొదలుపెట్టింది. ఇంకా చోటు ఉందికదా అని, ఆకులు, పుల్లలు, పువ్వులు నా వీపుమీద ఎక్కడానికి సాయం అడిగాయి. ఈ సమయంలోకూడా వీరందరికి సాయపడుతున్నానుకదా అని కొంచెం సంతోషంగానూ, కొంచెం గర్వంగానూ అనిపించింది. ఇలాగే నన్ను ఆసరా చేసుకుని నీటిలో ఉన్న algae గడ్డికూడా మాతో ప్రయాణం చేసాయి. ఇలా ఎన్నాళ్ళు ప్రయాణం చేసామో నాకు తెలీదు. శరీరం అలసిపోవడంతో ఎప్పుడో స్పృహ తప్పిపడిపోయాను.

కళ్ళు తెరిచేసరికి నాతోబాటు ప్రయాణం చేసిన మిగిలిన వస్తువులతో బాటు నేనుకూడా ఒక ఒడ్డుకు వచ్చిపడ్డానని అర్థం అయింది. వాన వెలిసింది. నా'జత' జాడతెలియలేదు. మెల్లిగా సూర్యుడు పైకి లేస్తున్నాడు. అక్కడక్కడా బీచ్‌లో జనసంచారం మొదలయింది. ఒకామె, ఒక కుర్రాడు మా వేపు రావడం గమనించాను. వాళ్ళు చాలా బీదగా, చిరుగులతో ఉన్న బట్టలు పోషణలేని శరీరం, సంస్కారం లేని జుట్టుతోనూ కనిపించారు. ఆమెనెత్తి మీద కర్రముక్కలమోపు ఉంది. ఆవిడ ఒడ్డుకు కొట్టుకువచ్చిన కర్రలను ఏరుతూ ఉందని, ఆ పిల్లవాడు తన చేతిలో ఉన్న విరిగిపోయిన ప్లాస్టిక్ బాల్చీలోకి ప్లాస్టిక్ సీసాలు, రేకు మూతలు, రబ్బరు సామాన్లు ఏరి వేసుకుంటున్నాడని గ్రహించాను.

మరుక్షణం వాడి బకెట్‌లోకి చేరుకున్నాను. అలా ఏరుకుంటూ, ఎండ నెత్తికెక్కేసరికి వాళ్ళూ గ్రామం చేరుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక ఆడవాళ్ళు అందరూ ఒకచోట కూడి కుటీర పరిశ్రమ ప్రారంభించారు. వాళ్ళ మాటల బట్టి వారు చాలా నిరుపేదలనీ, మొగవాళ్ళు పొలం పనులు, జాలరి పనులు చేస్తూ ఉంటే, ఆడవారు ఇలా జీవనోపాధి కల్పించుకుంటున్నారని అర్థం అయింది. ప్రొద్దుట ఏరిన సామాన్లు అన్నీ ఒక కుప్పగా పోసి, ఒక్కో రకం వాటిని విడివిడిగా ఏరి వేరే వేరే కుప్పలుగా పోసి పని ప్రారంభించారు. వాళ్ళను చూస్తూ ఉంటే నాకో ఆలోచన తట్టింది. వీళ్ళ చేతుల్లో నేను రూపాంతరం చెందబోతున్నానని! ఇంకో అవతారం ఎత్తబోయే సమ్యం వచింది.

***మానవజీవితం ఇలా కాదు. వాళ్ళకి ముందర జన్మలో ఏమి చేసారో అన్నది జ్ఞాపకం ఉండదు.*** ఒక విధంగా అదే మంచిది. నోరులేని నేను నా సుఖదుఃఖాలనీ, అనుభవాల్ని ఎవ్వరితోనూ పంచుకోలేను. సలహాలు ఇవ్వలేనుకూడా! నేను డాక్టరుగారి దగ్గర ఉన్నప్పుడు విన్నాను. మానవులు ఎవరేనా, హఠాత్తుగానో, ఆక్సిడెంట్ లోనో మరణిస్తే వారి అవయవాలని ఇంకొకరికి ఉపయోగించగలరు అని. దానివల్ల మరొకరికి ప్రాణదానం, అవయవదానం జరుగుతుంది. కాని, దానికి వారు ముందరే పర్మిషన్ ఇవ్వాలనీ లేదంటే మరణించాక వారి బంధువులు కాని పర్మిషన్ ఇవ్వొచ్చు. కాని, మాకు అలాకాదు. మా మటుకు మేం ఏ నిర్ణయాలూ తీసుకోలేం. అయినా ఎవ్వరికి మటుకు సాయం చెయ్యాలని ఉండదు?

ఇంతలో ఒకావిడ నన్ను చేతిలోకి తీసుకుని అటు, ఇటు పరిశీలించి, నా శరీరంలో పాడయిన భాగాలని మెల్లిమెల్లిగా కత్తిరింపచేసి, నా మంచి శరీరభాగాన్ని మెల్లిమెల్లిగా రూపొందించడం మొదలు పెట్టింది. ఇన్నాళ్ళూ, వానలోనూ, నదిలోనూ నానిపోయాను కనుక నొప్పి మరీ ఎక్కువగా లేదు. ఇక్కడ కొంచెం కత్తిరించి, అక్కడ కొంచెం అతికించి, ఇలా చేస్తూ, తను చేస్తున్నది తీరుగా

వస్తున్నదో లేదో అని దూరం నుంచి పరిశీలిస్తూ కొద్దిసేపట్లో నన్ను ఓ చేప ఆకారంలోకి మార్చేసింది. ఈ లోగా నాలాంటివాళ్ళందర్నీ ఇలా చిన్న చిన్న జంతువుల ఆకారాలలోనూ, ఇంకొక గ్రూపులో వాళ్ళు, మా అవయవాలని ఇంకో రూపంలోనూ మార్చేసారు

సాయంత్రం అయ్యేసరికి ఇలా రూపాంతరాలు చెందిన మమ్మల్ని పెద్ద పెద్ద వెదురు బుట్టల్లో పేర్చి ఉంచారు. మర్నాడు ప్రొద్దుటే కొందరు మగవారు ఈ బుట్టలని పడవల్లోకి ఎక్కించుకుని, పక్కనే ఉన్న పట్టణానికి ప్రయాణ అయ్యారు. అక్కడ గవర్నమెంటు వారు నడుపుతున్న ఆఫీసుకి తీసుకెళ్ళి వాళ్ళకి మమ్మల్ని అప్పచెప్పి డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు. ఆ ఆఫీసువాళ్ళు మమ్మల్ని మళ్ళీ శుభ్రపరచి బాగా పాక్ చేసి ఊర్లో ఉన్న బొమ్మల దుకాణాలకి అమ్మేసారు. ఆ విధంగా నేను ఒక షాపు అద్దాల కిటికీలో వేలాడుతూ బుజ్జీ స్నేహితుడిని అయ్యాను. ఎన్నాళ్ళు బుజ్జి దగ్గర ఉంటానో, మరి ఇంకేదైనా రూపాంతరం పొందుతానో, లేక పునర్జన్మే ఎత్తుతానో తెలియడానికి మీరు, నేను కూడా వేచిచూడాలి.

(డాక్యుమెంటరీ ఛానల్లో ఒక షో చూశాక)



రచయిత్రి పరిచయం: భర్త శ్రీ చలపతి రావు గారితో (ఎలెక్ట్రికల్ ఇంజినీరు) అరోరా, ఇల్లినాయ్‌లో నివాసం. సంతానం ఇద్దరు కుమార్తెలు. స్వస్థలం: విశాఖపట్నం. ఇటీవలి వరకూ మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో పనిచేసి ఇటీవలే పదవీ విరమణ చేశారు. సరదాగా పెయింటింగ్ చేయడం, వ్రాయడం, అల్లికలు, కుట్లు, చదవడం, కళాభిమానం ..హాబీలు.

# స్నేహ మౌక్తికం

మధురవాణి

**సాయంకాలపు** నీరెండ పడే సమయంలో, సన్నజాజి పందిరి పక్కనే పడమటి నీడ పడే జాగాలో రెండు కుర్చీలేసుక్కూర్చుని వేడి వేడి పకోడీలు తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు మౌక్తి, సుధ. వాళ్ళిద్దరి మధ్యనా గలగలా పారుతున్న మాటల సెలయేరు వాళ్ళిద్దరూ ప్రియనేస్తులని యిట్టే తెలియచెప్పేస్తోంది. గతంలో విహరిస్తూ గడిచిన కాలపు జ్ఞాపకాల్ని తిరగదోడుతూ తమ మధుర స్మృతుల్ని కలబోసుకుంటూ చాలా బిజీగా ఉన్నారిద్దరూ!

'అబ్బా.. ఎన్నేళ్ళయ్యిందే మౌక్తీ మనిద్దరం ఇలా ఎదురు బొదురు కూర్చుని కబుర్లాడి.. మళ్ళీ ఐదేళ్ళు వెనక్కెళ్ళి కాలేజీ రోజులకెళ్ళినట్టుంది. ఏంటో.. మన చదువులయిపోవడం, వెనువెంటనే నా పెళ్ళి జరిగిపోవడం, ఆ తరవాత నువ్వింకా పై చదువులకెళ్ళిపోవడం, పెళ్ళి చేసుకుని ఫారిన్‌లో ఉండిపోవడం.. దొర్లిపోయిన యీ కొద్ది కాలంలో అప్పుడే ఇన్ని విషయాలు జరిగిపోయాయా అనిపిస్తోంది. కానీ, ఇన్నాళ్ళ తరవాత.. ఉహూ.. ఇన్నేళ్ళ తరవాత నా కళ్ళముందు నిలిచిన నిన్ను చూస్తుంటే మాత్రం.. ఎన్నో యుగాల నిరీక్షణ తరువాత ఒక మధురస్వప్నం నా కంటిపాప ముంగిట సాక్షాత్కరించినట్టనిపిస్తోంది మౌక్తీ..!'

'నువ్వేం మారలేదే సుధా.. మాటల్లో అదే భావుకత్వం.. రోజూ ఇలాగే నీ కమ్మటి పలుకులతో మీ శ్రీవారి మీద కవితావర్షం కురిపిస్తుంటావా.? ఇన్ని రోజులు నేను మిస్సయిపోయిన నీ కవితలన్నీ నాకివ్వాలి సుధా.. ఎంచక్కా నాతో పట్టుకెళ్ళి చదువుకుంటాను.'

'నీకివ్వకుండానా.? నేను రాసే పిచ్చిరాతల్ని చదివి ఆనందించగలిగే నేస్తానివి నువ్వొక్కదానివే కదా మౌక్తీ.. తప్పకుండా ఇస్తాను.' అంటున్న సుధ మోహంలో లిప్తపాటున కాసింత నిరుత్సాం కదలాడింది.

'అప్పట్లో కాలేజీ రోజుల్లో అంటే నీ కవితలు ఎవరికీ చూపించేందుకు ఇష్టపడేదానివి కాదు కాబట్టి.. నేనొక్కదాన్నే నీ అభిమాన పాఠకురాలిని. కానీ, ఇప్పుడు మీ శ్రీవారున్నారుగా నీ కవితాపానం చేయడానికి'

'లేదు మౌక్తీ.. నువ్వెళ్ళాక నా కవితలు ఇంకెవరూ చూళ్ళేదు ఇప్పటి దాకా.. హరి కూడా!'

'అదేంటి.. ఇంతదాకా హరికి యీ విషయమే తెలీదా!?

ఒక చిన్న నిట్టూర్పు విడిచి సుధ చెప్పసాగింది. 'శ్రీమాన్ హరి కిరణ్ అనబడే ఇంజనీరు విగ్రహానికి వాళ్ళ ఫ్యాక్టరీకి సంబంధించిన ఫైళ్ళు, న్యూస్ పేపర్లో వచ్చే హెడ్ లైన్స్, రాజకీయ, వ్యాపార సంబంధిత విషయాలు తప్ప ఇంకే ఇతరత్రా రాతలూ, పుస్తకాలూ అస్సలు పడవు. అందులోనూ యీ కథలూ, కవితలూ, కాకరగాయలూ..అంటే అరక్షణంలో అరవై మైళ్ళ దూరం పారిపోగలడు.'

'అదా సంగతి! అయినా సుధా.. నువ్వెప్పుడైనా హరికి నీ రాతలు చదివి వినిపించే ప్రయత్నమైనా చేశావా అసలు?' అడిగింది మౌక్తి.

'లేదు. నేనిలా రాస్తాననే సంగతే హరికి తెలీదు. అసలు చెప్పే ధైర్యం నాకు లేదు ముందు. ఎందుకంటే, టీవీలో ఏ సాహితీ చర్చో వస్తుంటే 'అబ్బా సోది' అంటూ ఒక్క క్షణం కూడా ఛానల్ చూడడు. పేపరులో కథలూ, వ్యాసాలు ఉండే పేజీపై క్షణంలో సగంసేపైనా దృష్టి పెట్టడు. సాహిత్యంపై తనకున్న యీ విముఖతని గమనించాక ఇహ నేను కవితలు రాస్తానని చెపితే నాకు పైత్యమనో, తిక్కనో అన్నాడనుకో. తరవాత నేను తీరిగ్గా మొహం చిన్నబుచ్చుకోవాల్సి వస్తుంది. యీ గోలంతా ఎందుకులే అని నేనే హరికి చెప్పలేదు యీ విషయం. స్వతహాగా హరిది సున్నితమైన మనస్తత్వమే మౌక్తీ! తనకి నేనంటే చాలా ప్రేమ. ఏ విషయంలోనూ నాకు హరి మీద

ఫిర్యాదు లేదు. కానీ, మా ఇద్దరికీ సాహిత్యాభిరుచి కలవలేదని, నా భావాలు తనతో పంచుకోలేకపోతున్నానని అప్పుడప్పుడూ కాస్త బాధగా అనిపిస్తుంటుంది. హమ్మ్.. నా సంగతి సరేగానీ మౌక్తీ.. చందూని ఏరి కోరి ప్రేమించి మరీ వరించావు కదా.! కాబట్టి, ఎంచక్కా మీ ఇద్దరికి అన్నీ అభిరుచులూ, అభిప్రాయాలు కలుస్తాయనుకుంటా కదూ.!?' ఆసక్తిగా అడిగింది సుధ.

మాయాబజార్లో మాయాశశిరేఖ లాగా ఒక వికటాట్టహాసం అభినయించి మౌక్తి చెప్పడం మొదలెట్టింది.

'అబ్బా.. భలే జోకేశావే సుధా నువ్వు. చందూకి నాకూ అభిరుచులన్నీ కలుస్తాయా.!? హుమ్మ్.. నాకు తెలుగు పాటలు వినడం ఇష్టం, తనకి హిందీ పాటలు కావాలి. నేనేమో తెలుగు సినిమా చూద్దాం అంటాను. తనేమో ఇంగ్లీష్ అంటాడు. నేనేమో పెయింటింగ్ మ్యూజియంకి వెళదామంటే, తనేమో టెక్నాలజీ మ్యూజియంకి వెళ్ళాలంటాడు. చివరాఖరికి నాకేమో వెజిటేరియన్ ఫుడ్డు ఇష్టం. తనకేమో జంతుప్రీతి కాస్త ఎక్కువ. ఇలా మా ఇద్దరికీ అలవాట్లలో, అభిరుచుల్లో బోలెడంత వైరుధ్యముంది. నాకేమో కనీసం కొన్ని అభిరుచులైనా ఇద్దరం కలిసి పంచుకుంటే బావుంటుంది కదా అనిపించేది. అందుకోసం నా వంతు ప్రయత్నంగా అప్పుడప్పుడూ తనకిష్టం కదా అని నేను కూడా హిందీ పాటలు వినే ప్రయత్నం చేసాను. కొన్నిసార్లు కాస్తో కూస్తో అర్థమయ్యి కొన్ని పాటలు నాకూ నచ్చుతుండేవి. తనతో పాటు చూసినట్టుంటుందని నేనూ అడపాదడపా ఇంగ్లీషు సినిమాలు చూసేదాన్ని. తన అభిరుచుల్ని నేనూ మెల్లగా ఇష్టపడటం అలవాటు చేసుకుంటుంటే నాకు ఆనందంగా అనిపించేది. నిజానికి, తన అభిరుచుల్ని ఇష్టపడడానికి ప్రయతించమని తనెప్పుడూ నన్ను అడగలేదు. కానీ, స్వతహాగా నాకే తన ఇష్టాయిష్టాల్ని పంచుకోవాలనిపించింది. అక్కడిదాకా బానే ఉంది గానీ అంతటితో ఆగకుండా, తను కూడా నాలాగే చేస్తే బావుంటుందనిపించింది. క్రమంగా చందూ కూడా నాలా ఉండాలని నేను ఆశించడం మొదలయింది. ఆశింపు కాస్తా కొన్నాళ్ళకి చందూ పట్ల అసంతృప్తిగా రూపాంతరం చెందుతూ వచ్చింది. అలాంటి సమయంలో చందూ ఒకరోజు సరదాగా ఏదో మాటల్లో 'మౌక్తీ.! నాకు సంబంధించిన అన్నీ విషయాల్లోనూ నువ్వు చాలా శ్రద్ధ తీసుకుంటావు. నా ఇష్టాలూ, అయిష్టాలూ, - ఆలోచనలూ, అభిప్రాయాలూ సమస్తం నీకు బాగా తెలుసు. నన్ను నువ్వు పూర్తిగా అర్థం చేసుకున్నావు. నా జీవితంలో నీ ప్రమేయం లేనిదేదీ లేదు అసలు. అందుకే నువ్వు నాకు ప్రియమైన అర్ధాంగివి' అన్నాడు. నేను కూడా సరదాగా నవ్వుతూ.. 'అయితే నువ్వు నాకు ప్రియమైన అర్ధాంగుడివా.? అన్నాను. దానికి సమాధానంగా 'కాదు..అసలలాంటి పదమొకటి లేదనుకుంటాను.. అయినా నీలా నేను నీకు సంబంధించిన ప్రతీ విషయాన్ని పంచుకోవట్లేదు కదా! అందుకే, నేను నీకు పతిదేవుడిని అవుతానన్నమాట.!' అంటూ గట్టిగా నవ్వేశాడు చందూ.

ఏదో హాస్యానికన్నాగానీ ఆ రోజున చందూ అన్నమాటలు ఎందుకో నన్ను చాలాకాలం వెంటాడి తీవ్రంగా ఆలోచింపజేశాయి. ఆడవాళ్ళేమో ఎప్పుడూ భర్తకి సంబంధించిన సమస్తం తమదే అనుకుని బతికేస్తుంటారు. అదే భర్తలు మాత్రం కనీసం భార్య లోకంలోకి తొంగి చూసే ప్రయత్నం కూడా చేయరు అనే విషయం నిజమే కదా అనిపించింది. ప్రేమించి పెళ్ళి చేసుకున్నా, పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకున్నా భార్యా భర్తల ఆలోచనల్లో, ప్రవర్తనలో యీ తేడా ఉంటూనే ఉంటుందా!? నిజంగా భార్యాభర్తలు ఇంతేనా ఏ తరంలోనైనా!? అంటూ చాలా ఆవేశం వచ్చేసింది నాకు. కాసేపు నాకు తెలిసిన జంటలందరూ నా కళ్ళ ముందు మెదిలారు. అమ్మమ్మ చెప్పేది.. వాళ్ళ తరంలో వాళ్ళు భర్తతో అసలు ఎక్కువ మాట్లాడేవారే కాదట. వాళ్ళకి సంబంధిన విషయాలన్నీ చాలా వరకూ అత్తగారి అజమాయిషీలోనే ఉండేవట. అదే అమ్మ వాళ్ళ తరానికొచ్చేసరికి భార్యకి భర్త దగ్గర కాస్త చనువు పెరిగిన మాట వాస్తవమే గానీ, అది కేవలం వారి అవసరాల్ని గమనించి తీర్చడం వరకే! కేవలం భార్య స్థానంలో కాకుండా, ఒక వ్యక్తిగా తన అభిరుచులూ, తన ఆశలూ ఆశయాలూ, తెలుసుకుని వారికి ప్రోత్సాహమందించేంత పరిస్థితి చాలా వరకూ ఉండేది కాదు. అలాంటి పరిస్థితుల్లో కూడా వాళ్ళెవరికీ నాలా యీ అసంతృప్తి సమస్యే రాలేదు ఎందుకా అని ఆలోచిస్తే 'భార్య అంటే ఇలాగే, భర్త అంటే అలాగే' అనే భావం వాళ్ళకి బాగా నాటుకుపోయి ఉండటం వల్లేమో అనిపించింది. కానీ, ఇప్పటి మన కాలంలో దాదాపు భార్యా భర్తలు స్నేహితులుగా మెలగగలిగే సాన్నిహిత్యం వచ్చింది.

అయినా, పరిస్థితి మెరుగ్గా ఉండాల్సిందిపోయి యీ అసంతృప్తి సమస్య ఎందుకు? నేను కూడా 'ఇహ ఇంతే భార్యాభర్తలంటే' అని అనుకుని సమాధానపడాలా? అయితే తప్పంతా చందూ ప్రవర్తనలోనే ఉన్నట్టా? అని పలువిధాలుగా ఆలోచించాను. ఊహూ.. కాదు.. ఎక్కడో ఏదో తేడా ఉందనిపించింది. ఒకవేళ అసలు సమస్య చందూలో కాకుండా నా ఆలోచనలోనే లేదు కదా? అని మొదటిసారి నాకు సందేహం వచ్చింది. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా నా అసంతృప్తిని కాసేపు పక్కకి పెట్టి నేనెరిగిన చందూ వ్యక్తిత్వం గురించి నాలో నేనే ఒకసారి సింహావలోకనం చేసుకోవడం మొదలు పెట్టాను.

కొంత మేథోమథనం తరువాత నాకేమనిపించిందంటే.. చందూ వ్యక్తిత్వం నాకు పూర్తిగా భిన్నం. తన కోసం నేను మారిపోవాలనుకోడు. అదే విధంగా నా కోసం తనని మార్చేసుకోవాలనుకోడు. అలా అని నాపై ప్రేమ లేదా అంటే అదీ కాదు. నేనేమో తనకి సంబంధించిన ప్రతీ విషయంలోనూ నా ప్రమేయం ఉండాలి, తనూ నేనూ ఒకటే అన్నట్టు ఉండాలనుకుంటాను. తనేమో ఒకరి కోసం ఒకరు అభిప్రాయాలూ, అభిరుచులూ, వ్యక్తిత్వాలూ మార్చుకోకూడదు. ఎవరిలా వారుంటూనే ఒకరి సాహచర్యాన్ని మరొకరు ఆస్వాదించాలి అన్నట్టు ఉంటాడు. తనకి ఆసక్తి లేకపోయినా నా అభిరుచుల్ని గౌరవిస్తాడు. నేను తనని అడక్కపోయినా కూడా నా కోసం నాకిష్టమైన పుస్తకాలూ, సంగీతం లాంటివి తెచ్చిచ్చి నన్ను తరచూ ఆశ్చర్యపరుస్తూ ఉంటాడు. నా మీద తనకున్న ప్రేమని విధంగా వ్యక్తపరచడం తనకు నచ్చుతుందేమో! నాకేమో, తన అభిరుచుల్ని నావిగా మార్చుకుంటే బాగుంటుందనిపిస్తుంది. ఎదుటివ్యక్తిని ప్రేమించడం, ప్రేమని వ్యక్తపరచడం అనేది ఒక్కో మనిషి దృష్టిలో ఒక్కోలా ఉంటుంది వారి వారి వ్యక్తిత్వానికి తగ్గట్టు. అచ్చం నేను ప్రవర్తించినట్టే తనుండాలనీ, నా భావవ్యక్తీకరణలాగే తనదీ ఉండాలనీ అనుకోవడం సబబు కాదనిపించింది. యీ విషయం అర్థం చేసుకోగలిగితే నా అసంతృప్తి దూరమవుతుందనిపించింది. అనిపించడం కాదోయ్ సుధా.. ఆ క్షణమే అసంతృప్తి నా నుంచి నిజంగానే దూరమై.. మాయమైపోయింది. భార్యాభర్తల సహజీవనంలో ఒకోసారి కేవలం మన ఆలోచనా విధానం కాస్త మార్చుకుని మరో కోణంలో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే చాలు మన అసంతృప్తి పారిపోతుంది. ముఖ్యంగా ఇరువురికీ భావసారూప్యత లేని విషయాల్లో మన ఆలోచనలన్నీ మనసులోనే దాచేసుకుని పరిష్కారమే లేని సమస్యగా చిత్రించుకోవాల్సిన అవసరం లేదని అవగతమైంది నాకు. కొసమెరుపేంటంటే, ఇలా తన గురించి నాలో నేను తర్కించుకున్న విషయమంతా చందూకి చెపితే తను చాలా తేలిగ్గా స్పందించాడు. 'అంత తీవ్రంగా ఆలోచించావా మౌక్తీ!? నేనెప్పుడూ ఇంతగా తర్కించుకోను అది నచ్చే విషయమైనా, నచ్చనిదైనా సరే! పోన్లే ఏమైతేనేం.. చివరికి యీ అపరాధిని క్షమించేశావన్నమాట!' అన్నాడు నవ్వేస్తూ. అప్పుడర్థమైంది నాకు మా ఇద్దరి ఆలోచనా విధానంలో ఎంత వ్యత్యాసముందో! నేనెంత క్లిష్టంగా ఆలోచిస్తానో, తనెంత సరళంగా ఆలోచిస్తాడో! అప్పటి నుంచీ నేను నాలాగే ఉంటూ, చందూని చందూలాగే ఉండనిస్తూ హాయిగా కాలం గడిపేస్తున్నా. అదన్న మాట కథ.! ఇంకేముందీ.. శుభం కార్డే.. తెర దించవలెను.'

అని నాటకీయ ఫక్కీలో ముగించింది మౌక్తి.

అంతదాకా రెండు చేతులూ గడ్డం కింద పెట్టుకుని పూర్తిగా లీనమైపోయి మౌక్తి మాటలు వింటున్న సుధ ఫకాల్మని నవ్వేసింది. అప్పుడే ఆకాశంలో నిశిరాత్రి విహారానికి బయలుదేరి వచ్చిన పున్నమి చంద్రుడు సమయం తెలీకుండా సాగిపోతున్న వారిద్దరి కబుర్లకి కళ్ళెం వేశాడు. అప్పుడప్పుడే పల్చటి తెరలా పరుచుకుంటున్న వెన్నెల వెలుగులో విచ్చుకుంటున్న సన్నజాజి మొగ్గల్లోనూ, సుధ కళ్ళలోనూ క్రొత్తగా వచ్చి చేరిన కాంతిపుంజమొకటి మౌక్తి దృష్టిని దాటి పోలేదు.

ఇది జరిగిన కొన్నాళ్ళ తరవాత పోస్టులో ఏదో పార్సిల్ వచ్చింది మౌక్తికి.

'ఇండియా నుంచి నాకెవరు పార్సిల్ పంపారా?' అని ఆశ్చర్యపోతూ విప్పి చూసిన మౌక్తి మరింత ఆశ్చర్యానికి లోనయింది. అందులో ఒక అందమైన ముఖచిత్రమున్న పుస్తకం ఉంది. దాని మీద 'కవితాసుధ' అని, క్రిందన 'శ్రీమతి సుధాకిరణ్' అనీ రాసుంది.

పుస్తకం తెరవగానే మొదటి పేజీలో "ప్రేమతో అంకితం.. నా స్నేహ'మౌక్తి'కానికి.." అని రాసుంది. పుస్తకంలో ఒక చిన్న లేఖ కూడా ఉంది.

'ప్రియసఖి మౌక్తికి, నువ్వొచ్చి వెళ్ళాక ఒకరోజు హరికి నా కవితల నోట్స్ చూపించాను. అవి పూర్తిగా అర్థం చేసుకునేంత సాహిత్యాభిరుచి, కవితాజ్ఞానం తనకి లేకపోయినా నాలో ఉన్న భావుకతనూ, కవితాసృజననీ చూసి తనకి చాలా ముచ్చటనిపిస్తోందన్నాడు. తరువాత నా కవితలన్నీ పుస్తకంగా అచ్చు వేయించి నాకు పుట్టినరోజు బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. యీ అపురూపమైన ఆనందాన్ని నాకు అందించినందుకు బదులుగా నీకేమివ్వగలను నేస్తం.!? ప్రేమతో.. నీ సుధ' అని రాసుంది ఆ లేఖలో.

తానేం చూస్తున్నదో అర్థమైన మరుక్షణంలోనే మౌక్తి కళ్ళలో నీళ్ళు నిలిచి ఉత్తరంలో చూస్తున్న అక్షరాలన్నీ అలుక్కుపోయినట్టయి ఆ స్థానే ముగ్ధమనోహరంగా నవ్వుతున్న సుధ మోము కదలాడింది.



మధురవాణి గారు గత ఐదేళ్ళుగా జర్మనీలో నివసిస్తున్నారు. జీవశాస్త్రంలో డాక్టరేటు పూర్తి చేసి ప్రస్తుతం జీవశాస్త్ర సంబంధిత పరిశోధనలోనే సైంటిస్టుగా పనిచేస్తున్నారు. తన ఆలోచనలు, అభిప్రాయాలు 'మధురవాణి' బ్లాగులో వ్రాస్తూనే అప్పుడప్పుడూ కథలు కూడా వ్రాస్తుంటారు. తెలుగు పుస్తకాలు చదవడం, తెలుగు పాటలు వినడం, ఫోటోలు తీయడం మధురగారి అభిరుచులు. http://madhuravaani.blogspot.com

# మీడియా

అరుణశర్మ నిమ్మగడ్డ

**"భూగోళం"** పత్రికా ఎడిటర్ పద్మారావు, ఇండస్ట్రియలిస్ట్ భుజంగరావు అనుకోకుండా ఒక రోజు ప్రొద్దున్నే వాకింగ్‌లో కలుసుకుని, అప్పటినుంచి ప్రతిరోజు కలిసి నడుస్తూ ఉండటంతో నెమ్మదిగా పరిచయం పెరిగి, వారి మధ్య స్నేహంగా మారింది. మనస్సు విప్పి మాట్లాడుకోవటం, మాటల్లో పడి అలుపు తెలియకుండా నడవటం, ఆరోగ్యంగా, ఉత్సాహంగా రోజంతా తమ తమ పనులు చేసుకోవటంతో, మార్నింగ్ వాక్ వారిద్దరికి ఇష్టమయిన రొటీన్ గా మారింది.

"గుడ్ మార్నింగ్"

"ఏమిటీ హడావిడిగా బయటకు వచ్చినట్టున్నారు.. లేటయిందేం?" పద్మారావుగారి కోసం నిలబడి ఆయన్ని చూడగానే ముందుకు నడుస్తూ ప్రశ్నించారు భుజంగరావు.

"సాయంత్రం బాగా పనివత్తిడి పడుకునేటప్పటికి లేటయింది, మా పత్రికల వాళ్ళ బాధలు.. మామూలే! ఏదో ఆర్టికల్, మంత్రిగారి చుట్టం, మా పత్రికలో ప్రచురించమని స్వయంగా ఆఫీసుకి వచ్చి నాకే ఇచ్చాడు..చాలా సమయం పట్టింది లాస్ట్ మినిట్ లో అది సరిదిద్ది, తిరగతోడి రాయటానికి.. మరికొన్ని ఇతరపనులు కూడాను."

"రాసేసరికా?"

"నవ్వుతూ, అదే ఎడిటింగ్ చేసేసరికి సార్. వెయ్యకపోతే ఏం గొడవ వస్తుందోనని, పోనీ అలాగే వేద్దామంటే అసలు ఎందుకు, ఏం రాసాడో తెలియదే!"

"ఒకటే కదా?" భుజంగరావు అన్నారు.

"భలేవారే! డైలీ పేపరు, వారపత్రిక, మార్కెట్‌లోకి పంపాలి, "కొన్ని రచనలు ఇలాగే ఉంటాయి, తప్పనిసరయితే చిన్న చిన్న మార్పులు అప్పుడప్పుడు చేస్తూనే ఉంటాం. కాని టైమ్ స్పెండ్ చెయ్యటమంటే..."

"మీకు సహాయానికి కొత్తవారిని తీసుకోండి"

"పనిలోకి ఇంకా కొత్తవారినా? వారిని ఆర్థికంగా భరాయించాలికదా" అయినా స్టాఫ్ సరిపడా వున్నారు, న్యూస్ పేపర్ బాధ్యత కూడా కొంత నాదే కావటంతో, సాధ్యమయినంత వరకు న్యూస్, పత్రికకు వచ్చే రచనలు, నేనే స్వయంగా చూసి అచ్చుకు పంపటం అలవాటు. మీకు తెలియందేముంది ఎవరిపని వారికే ఉంటుంది కదా"

"కరక్టే!

"ఈ పోటీ ప్రపంచంలో పేపర్‌ని, పత్రికని నిలబెట్టటానికి మా తలప్రాణం తోక కొస్తోంది" పద్మారావుగారు తన బాధ వెళ్ళబోసుకున్నారు..

"మరి సర్క్యులేషన్ పెంచటానికి ఏవైనా మార్గాలు..?"

"లేకేం!! దీన్ని గురించి ఇదివరకే చర్చించాం."

"సో!! ఏం రెజెల్యూషన్స్ తెచ్చారు"

"పేరున్న రచయితలతో ఒక సీరియల్, లేక వారి కథైనా వారపత్రికలో ఉండేట్టు, ఇక డైలీలో, సంచలన, తాజావార్తల సేకరణకు రిపోర్టర్లను మరో ఇద్దరిని తీసుకున్నాం ఇలాటివే కొన్ని! "

"ఆహా"!

"తరువాతే కదండీ మా పత్రిక ఆర్థికంగాను మళ్ళీ నిలబడింది. అంతే కాదు చూస్తున్నారుగా క్రొత్త వార్తల రాజపత్రికగా ఎలా పేరొచ్చిందో!" కించిత్ గర్వం తొణికిసలాడింది పద్మారావుగారి కంఠంలో.

"ఎడిటోరియల్ సంచలనంగా ఉండటం, తాజా సంచనల వార్తలు ప్రచురించడం కాస్త అమెరికన్స్ పద్ధతి మనదేశంలో అవలంబిస్తున్నామంటారా?"

"పూర్తికాదు, కొంత ప్రభావం ఉందనుకోండి."

"అంతేనంటారా!! మాకూ బిజినెస్ లో రకరకాల ఛేంజెస్, టెన్షన్స్! ఏదైనా టీవీ ఛానల్ లో మా కంపెనీ ప్రోడక్ట్ 'సింపుల్ పెయింట్స్' ఎడ్వర్ టైజ్ మెంట్ ఇవ్వాలని, కొన్నిరోజులపాటు వచ్చేట్టు'.

"అయితే మాకు ఒక యాడ్ ఇవ్వాలి మీరు." అడిగారు పద్మారావుగారు.

"తప్పకుండా ఆలోచిద్దాం".

మాట్లాడుతూ నడుస్తూవున్నారిద్దరూ!

వాకింగ్ నుంచి రాగానే ఎదురొచ్చి కాఫీ అందించే భార్య కనిపించకపోవటంతో భుజంగరావుగారు తానే వంటింటి వైపుకు వెళ్ళారు.

"వంటమనిషి రాలేదా?" వంట ఇంట్లో ఉన్న భార్యను చూస్తూ.

"రాలేదు, కాంతమ్మగారు, పనిమనిషి కూడాను"

"తొమ్మిదేళ్ళ చిన్నపిల్లట, గత జన్మగురించి చెప్పటం, ఏవో మహత్యాలు చూపిస్తోందని తెలిసి కాంతమ్మగారు తన కూతురు లక్ష్మిని తీసుకెళితే ఆ అమ్మాయికి మాటలు వస్తాయోమోనని ఆవిడ ఆశ. వద్దని నేనంటే మనస్సు కష్టపెట్టుకుంటుందని ఊరుకున్నాను"

"ఐసీ! అయితే ఈ రోజు అక్కడికి తీసుకు వెళుతోందన్నమాట?" భుజంగరావుగారిలో ఉన్న ప్రత్యేకత అదే! ఏ విషయం చెప్పినా శ్రద్ధగా వింటారు.

"అమ్మగోరు, టీవీ వోళ్ళు పొద్దుకాడ్నించి చెపుతుండారు, మా ఇళ్ళకాడే లక్షమ్మని తీసుకుని కాంతమ్మగోరు నేను ఎళతాం, రేప్పొద్దుటేళ పన్లోకి రాలేము. కాంతమ్మగోరు! మనమ్మాయి రేపు ఇంటికి మాట్టాడుతూ వస్తది చూడండి" ముందు రోజు పనిమనిషి రంగమ్మ అన్న మాటలని అనుకరిస్తూ, "ప్రచారాలకి రంగమ్మ బాగా పనికొస్తుంది, ఈ వంక పెట్టి మొత్తం మీద ఈ పూట తనూ పనిమానేసింది. టీవీలో చూపించారు! వీళ్ళు ఈ పాటికి వెళ్ళుంటారు" భర్తకి అన్ని సంగతులు చెబుతూ కాఫీ అందించింది వాణి.

తోటమాలి ప్రొద్దున్నే బయట ముగ్గేసే చోట ఊడుస్తూవుండటం గుర్తొచ్చింది ఆయనకి. కాఫీ తాగుతూ పేపర్ చదువుతున్నారు. ఎన్నో సంగతులు, 'మీడియా' ఈ ప్రపంచాన్ని ఎంత దగ్గరికి చేరుస్తోంది, ఇటు వార్తా పత్రికలు, అటు టివి, ప్రపంచంలో నలుమూలలా జరిగే విషయాలను చిటికలో ప్రజలముందుంచుతున్నారు, వారు తీసుకునే ప్రయాసలు ఆలోచిస్తుంటే అబ్బురంగా అనిపించింది ఆయనకి.

ఇంటిపని పూర్తిచేసుకుని టిఫిన్ తింటూ టివీ చూస్తున్న వాణి, టాయిలెట్ క్లీనింగ్ పౌడర్ ఎడ్వర్ టైజ్ మెంట్ రావటంతో నోట్లో ఇడ్లీ ఉండటం వల్ల, యాడ్ లో చూపించే టాయిలెట్ బౌల్ వంక చూళ్ళేక చూపు ప్రక్కకి తిప్పుకుంది.

అంతలోనే, ఆ పసిపిల్ల మహత్యం అంతా బూటకం, వొట్టి చిలకపలుకులేనట! అంటూ తేల్చిన సరి కొత్తవార్తలు రావటం గమనించింది. "సరే బావుంది నిన్నంతా ఆ పిల్లలో మహత్యం ఉన్నదన్న సంచలనం, ఇవ్వాళంతా వట్టి అబద్ధమని వార్తలు 'ఇన్‌ఫర్ మేషన్ వార్' అంటే ఇదేనా? " స్వగతంలా అనుకుంది.

"మీరు ఎందుకు వచ్చారు? ఈ పిల్లలో మహత్యం ఉన్నదని తెలిసా? ఎలా తెలిసింది? ఏమన్నా ప్రచారాలు జరుగుతున్నాయా? " టివి రిపోర్టర్ అక్కడకొచ్చిన వారిలో ఒక్కొక్కరిని ప్రశ్నించాడు.

"వేరెక్కడా వినలేదు!! నిన్నంతా మీ న్యూస్ కవరేజ్ చూసి వచ్చాం!"

"ఎంతో ఆశతో వచ్చాం మాకున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని" ఒకావిడ నిరాశగా చెబుతోంది..

"ఇలాంటి న్యూస్‌లు, మనుషుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయా లేక మనుషుల బలహీనతలు చూసి వారిని ఆకట్టుకునే వార్తలను సంచలనంగా సృష్టిస్తున్నారా? ఇక ఇటు సినిమాలను, టివీ సీరియల్స్‌ను, అటు జనాన్ని తీసుకున్నా అంతే! ఎవరి ప్రభావం ఎవరి మీద పడుతోందో? ఎవరినెవరు అనుకరిస్తున్నారో! తెలియటంలేదు?. ఇక సంఘానికి వీటి వల్ల మేలు జరిగితే మంచిదే" ఆలోచిస్తూ టివి కట్టేసి, ఇల్లు లాక్ చేసుకుని కార్లో క్లినిక్ కి బయలుదేరింది సైకాలజిస్టు వాణి.

భుజంగరావు వాణి దంపతులకు, ఇద్దరు సంతానం. ఆడపిల్ల పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళింది, అబ్బాయి ప్రస్తుతానికి అమెరికాలో మాస్టర్సు డిగ్రీ చెయ్యటానికి వెళ్ళాడు. ఇంట్లో ఇద్దరే ఉండటంతో, అదే ఊళ్ళో ఉంటున్న భుజంగరావుగారి చెల్లెలు కమల పిల్లలంటే వారికి మరింత ఆదరం ఎక్కువైంది.

"భుజంగరావు స్పీకింగ్", ఆయన ఫోను ఎత్తగానే, అప్పుడే ఆఫీసులోపలికి వచ్చిన మేనల్లుడిని చూసి, ఫోను మాట్లాడుతూనే కూర్చోమని సైగ చేశారు.

"టీవి తొంబయి నుంచి మాట్లాడుతున్నాం, సార్ మీ యాడ్ రేపట్నించి మా ఛానల్ లో వస్తోంది"

"రేపా ఏ సమయంలో"

"పది గంటలనుండి.. సార్ మంచి స్పందించే కవరేజ్ మధ్యలో యాడ్ వస్తోంది"..

"ఆహా! దట్స్ గుడ్"

"మీకు మరోసారి రిమైండ్ చేద్దామని ఫోన్ చేశాను, ఇక పేమెంట్ చెక్ గురించి మా అక్కౌంటెంటు మాట్లాడతారు, తొందరేం లేదు. ఉంటాను సర్".

"ఒకే" ఫోను పెట్టేసి మేనల్లుడ్ని చూస్తూ

"ఏరా! భాను ఏమిటి విశేషాలు, కాలేజి లేదా?

"నా టీచింగ్ మధ్యాహ్నం క్లాసులకి మామయ్య "

"అమ్మ ఎట్లా వుంది, చెల్లాయి రేఖ, నాన్న"

"అంతా బావున్నారు. చెల్లాయే! నిన్నంతా ఏడుపు",

"ఎందుకట?"

"ఈ మధ్య మామ్మ తాతగారితో యాత్రలకు వెళ్ళిందిగా, ఆ యాత్రా విశేషాలు 'చూడచక్కని స్థలం' అన్న పేరుతో ఒక వ్యాసంగా రాసింది, 'సుగతి' పత్రికలో అచ్చయింది"

"సంతోషమేగా ఇంకేమిటి?

"ఈ ప్రేమ యాత్ర ఓ మధురానుభూతిని మిగిల్చింది", అని పత్రికవారు వారి సొంతవాక్యాన్ని చెల్లాయివ్యాసంలో చేర్చారు. దాని ఫ్రెండ్స్ అంతా ఏడిపించారుట, అలా వారి సొంతమాటలు వాడ్డం ఏమిటి తన వ్యాసంలో అని దాని బాధ. చిన్నపిల్లకదూ, అందులో పెళ్ళిగాని పిల్ల, అటువంటి వాక్యం దానికి బాధే మరి! మామయ్యా! రేఖని చూసుకోటానికి పెళ్ళివారొస్తున్నారు, అమ్మ నీకు ముందుగా చెప్పిరమ్మంది, నాన్న నీకు ఫోన్ చేస్తారట.అత్తయ్యకి చెప్పండి. వస్తాను"

"సరే కలుద్దాం! వెళ్ళిరా!" అంటూ ఆయన కుర్చీలోంచి నుంచి లేచారు మీటింగ్ రూముకి వెళ్ళటానికి..

"అమ్మాయి సుగుణా! టివీలో ఇవ్వాళ భక్తి ప్రోగ్రామ్ చాలా బావుందే! మాలాంటి వయస్సు మళ్ళిన వారికి, బయటివెళ్ళలేని వారికి ఈ కార్యక్రమాలు ఎంత ఆనందం కలిగిస్తాయి. టివీ వారికి, ఆ పండితులకు నిజంగా ఒక నమస్కారం" చేతులు జోడిస్తూ అంది మాణిక్యమ్మగారు..

"అంతేకాదు అత్తయ్యా ఎంతోమందికి జీవనోపాధి కలుగుతోందికదా, ఇంకెందరో కళాకారులు వారి ప్రతిభను ప్రదర్శించకలుగుతున్నారు." ముఖ్యంగా టీవీలో "ఎంత రుచి" లో చూపించే వంటలు సుగుణకు ఇష్టమైన కార్యక్రమం.

"అత్తయ్యా స్నానానికి నీళ్ళు రెడీ! లేవండి!" ఆవిడ లేవటానికి చెయ్యిందించింది, పనిమనిషి పార్వతి సాయంతో నెమ్మదిగా ఎత్తి వీల్ చైర్ లో కూర్చో పెట్టి బాత్ రూములోకి తీసుకు వెళ్ళింది!

సహజ సౌందర్యానికి మారుపేరు సుగుణది, చెవులకు రవ్వల దిద్దులకాంతికి పోటీపడుతున్నట్టు కళ్ళలో నుంచి వచ్చే మెరుపు, భర్త ప్రేమ, అత్తమామల ఆదరణా పొంది, పిల్లపాపల్తో ఆనందంగా, ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ సంతోషం, తృప్తి, ఒక విధమైన ఆత్మవిశ్వాసంతో ఆమె కనిపిస్తూ ఉంటుంది.

నలుగురు ఆడపిల్లల తర్వాత సాంబయ్య మాణిక్యమ్మగార్లకు కలిగిన మగ సంతానం ప్రకాశ్, కడసారివాడు. చిన్నతనంలోనే పెద్ద చదువు, తర్వాత వ్యాపారంలో బాగా డబ్బు గణించిన ప్రకాశ్, ఎవ్వరి మనస్సు నొప్పిచ్చనివాడు, ఇటు భార్య సుగణని, ఆమె సహకారంతో తల్లి తండ్రులను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు.

ప్రకాశ్ వ్యాపార నిమిత్తం టూర్లు వెళతాడు. టూర్ నుంచి రాగానే తన వెంటే వదలకుండా తిరుగుతూ ప్రేమగా ఉండే భర్తని తలుచుకుంటూ అతను ఇవ్వాళో, రేపో వస్తాడని ఎప్పటిలా ఎదురు చూస్తోంది సుగుణ.

పనిమనిషి పార్వతి అన్ని పనులు చేస్తుంది, ఆమె అప్పుడే సూపర్ మార్కెట్టుకి వెళ్ళింది. ఆ రోజు వంట ఇంకా మొదలు పెట్టలేదు సుగుణ, ఆమెకి వంట మాత్రం తనే చేసుకోవటం ఇష్టం!

మామగారు ఈ మధ్య బొత్తిగా లేవటం లేదు, ఆయనకి చెవులు వినిపించటం లేదు. "అమ్మాయి సుగుణా! తోచటంలేదే! టివి పెట్టు" ఆవిడ అడగ్గానే వచ్చి టీవి ఆన్ చేసింది సుగుణ.

"మళ్ళీ ఈ పూట ఇదే సినిమా ఇచ్చాడే!" మార్నింగ్ షోలో, వేసిన సినిమానే మళ్ళీ రావటంతో సుగుణ న్యూస్ ఛానల్ వైపు తిప్పింది.

"అదేమిటే! అబ్బాయి లాగా ఉన్నాడు! ఆ అమ్మాయి ఎవరూ ప్రక్కన, మరో చిన్న ఆడపిల్లతో?"

"అవునత్తయ్యా మీ అబ్బాయే, ఆవిడ సినిమా నటి భవంతి. ఈ మధ్య హీరోయిన్ వేషాలు కాకుండా వదిన, తల్లి పాత్రలు వేస్తోంది. దాదాపు పది సంవత్సరాలు తర్వాత మళ్ళీ సినిమాలోకి వచ్చింది. '

"అబ్బాయితో ఉందేమిటీ? ఏం చెపుతున్నారు విను".

సుగుణ ఆతుతతో కొంచెం ముందుకు వచ్చింది. న్యూస్ ఆగింది, యాడ్ కోసం కొత్తగా పెయింట్ వేసిన పెద్ద బంగళా తళతళలాడుతూ క్లోజప్ లో, అది "సింపుల్ పెయింట్స్" ఎడ్వర్ టైజ్ మెంట్, ఆ పెయింట్ వేస్తే ఇళ్ళలా ఉంటాయని చూపిస్తున్నారు.

"అత్తయ్యా వారిద్దరు ఒక చిన్నపిల్లతో కలిసి ఏదో హోటల్లోంచి బయటకు వస్తున్నారు ఎందుకంటారు?" అడిగింది.

మళ్ళీ న్యూస్ మొదలయ్యింది 'ప్రముఖ సినీనటి భవంతి, గత కొన్ని సంవత్సరాలుగా తెరకు మరుగైన ఈమె, ఒక షూటింగ్ సందర్భంలో ప్రముఖ వ్యాపారవేత్త ప్రకాశ్, కూతురు చంద్రికతో కలకత్తా వచ్చిన ఈమె మాజీ మంత్రి శంభుప్రసాద్ గారి అల్లుడైన ప్రకాశ్‌తో కొంతకాలం గా రహస్యంగా కాపురం చేస్తున్నారు, వీరి ప్రణయ కావ్యం టివీ తొంభయి ఇప్పుడు బట్టబయలు చేసింది", టివీలో చూపుతున్న వారిద్దరి ఫోటోలు సుగుణ ఇక చూడలేకపోయింది, భర్త టూర్ అంటూ క్రమం తప్పకుండా వెళ్ళే ప్రయాణంలో గూఢార్ధమంతా క్షణంలో బోధపడిందామెకు, మనస్సు కుప్పకూలింది.

"ఏమిటే టీవీలో ఆ అబ్బాయి పిచ్చి కూతలు కూస్తున్నాడు." తన కొడుకు మీద అతనెవరో అభాండం వేసాడన్నట్టు కసిగా అంటున్న అత్తగారి మాటలు వినిపించుకోకుండా సుగుణ ఆవేశంతో గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

"అమ్మాయి అమ్మాయి సుగుణా! కుర్చీలోంచి కదల్లేని మాణిక్యమ్మగారి అరుపులు చాలాసేపు అంత పెద్ద ఇంట్లోంచి బయటకి ఎవరికీ వినిపించలేదు.

ఆశ్చర్యం! పెయింట్స్ యాడ్ టెలికాస్ట్ అయిన వెంటనే, ఆ సాయంత్రమే మంచి రెస్పాన్స్ వచ్చింది, మీడియాను మనస్సులోనే అభినందించుకుంటున్న భుజంగరావు, అదంతా పద్మారావుగారికి చెప్పాలని, ప్రొద్దున్నే ఆయనకోసం ఎదురు చూస్తున్నారు.

పద్మారావుగారికి ఆ రోజు కొంచెం బిజి, ప్రొద్దున్నే బయటికి వెళ్ళాల్సిన పని ఉంది, తన బెడ్ రూం కిటికీ నుంచి చూశారు, అప్పటికే వాకింగ్ కి వెళ్ళటానికి భుజంగరావుగారు తనకోసం నిలబడి ఉండటం చూసి గబగబా తయారయి, పరుగెత్తినట్టు నడిచి వచ్చి "సారీ! ఈ రోజూ ఆలశ్యం అయింది, రాత్రి మా వాళ్ళ ఇంటికి వెళ్ళాం, ఆఫీసులో అర్ధరాత్రిదాకా ఉండాల్సి వచ్చింది. అదే ప్రముఖ వ్యాపారవేత్త ప్రకాశ్ కుటుంబం, మాకు బాగా దగ్గరవాళ్ళు, మీకు తెలుసా? " అడిగారు

"ఆ! అతని పేరు విన్నాను"

"ప్రకాశ్ భార్య మరణించింది!. ఆ న్యూస్ పేపర్ లోను వచ్చింది. టీవీలో టెలికాస్టు చేస్తున్నారు. ఆమె ఆత్మహత్య వివరాలు" మాట్లాడుతూ నడుస్తున్నారిద్దరూ.

# తారుమారు

అక్కినపల్లి సుబ్బారావు

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో బహుమతి పొందిన కథ

**మనిషి నిజం** మీద అప్పుడప్పుడూ బోల్తా పడినా, లేచి దులుపుకుని దాని సంగతి పట్టించుకోకుండా యధాప్రకారం ముందరకి సాగిపోతాడు" అన్న మర్ఫీ సూక్తి పేపర్ లో కనిపించగానే, వేమన శతకం పద్యాలలో ఉన్న చేదు నిజాలలా, ప్రజల్ని నిశితంగా గమనించి కూర్చిన తుర్ఫీ సూక్తులు నిజాలని బైటపెడతాయి అనుకుంటూ పేపర్ పేజీ తిప్పాడు చక్రపాణి.

"మీరు పేపర్ పేజీలు తిప్పుతున్నారన్న మాటేకానీ చదివినవి ఆకళింపు అవుతున్నాయా?" అంటూ నిశ్శబ్దాన్ని ఛేదించింది కాళింది.

"ఎవరితోనూ వాదనకి దిగనని మాటయే' అంటూ కొత్త సంవత్సరంలో నోరు మెదడుకి ఇచ్చిన వాగ్దానం జ్ఞాపకానికి వచ్చి మౌనంగా భార్య కాళింది వేపు చూసాడు చక్రపాణి.

"నిన్న అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజెల్స్ నగరానికి దగ్గరగా చాలా ఇళ్ళు దగ్ధమయాయని నాకు ఎందుకు చెప్పలేదు? అక్కడేగా మన రాజేష్ ఉంటోంది?" అంది కాళింది.

"నిజమే. కాని కొండల ఏటవాలులో దగ్ధమైన ఇళ్ళున్న ప్రదేశం, రాజేష్ ఇంటికి దాదాపు ముప్పయి కిలోమీటర్ల దూరంలో ఉంది. నిన్ను అనవసరంగా కంగారు పెట్టడమెందుకని చెప్పలేదు"

"అరగంట క్రితం శారద ఫోన్ చేసి ఈ విషయం గురించి హెచ్చరించాక గుండె ఎంతో ఎక్కువగా కొట్టుకుపోతోంది. మూడున్నర కోట్ల విలువ ఉన్న ఇల్లు! అమ్మో దానికేమైనా అయితే భరించగలమా? ఒకసారి ఫోన్ చేసి ఎలా ఉన్నాడో కనుక్కోకూడదూ?" అంటూ గుండెలమీద చేతులుంచుకుంది కాళింది.

"నువ్వేమీ భయపడకు. అక్కడ నివశించే వాళ్ళకి ఇలాంటి అవాంతరాలు జరిగే ఆస్కారం గురించి ముందే ఊహించి అన్ని జాగ్రత్తలు తీసుకునే జ్ఞానం ఉంటుంది" అన్నాడు చక్రపాణి.

"మీకు భార్య అన్నా, పిల్లలన్నా ఆసక్తి, వ్యాకులపాటు ఎప్పుడున్నాయి కనుక? స్నేహితులు, తప్పితే పేపర్. నా ఖర్మ! " అంటూ తలపట్టుకుంది కాళింది.

ఆరాటం వలనో, వంటింట్లో పనిచేసి రావడం వలనో ఏమో కాని శీతాకాలంలో గడ్డిపోచల్ని అంటిపెట్టుకున్న నీటి రేణువులా కాళింది మొహం మీద చెమ్మ తెర, ఆవేశంగా మాటలాడడం వలన ఎగిసిపడుతున్న కాళింది ఉపరిభాగం చూసి,"దాదాపు ముప్పయి ఐదేళ్ళ క్రితం ఇలాగే దర్శన మిచ్చి కాళింది నన్ను ఆకట్టుకుంది, మ్చ్" అనుకుంటూ పెళ్ళయాక నువ్వీ మాటలు ఎన్నిసార్లు వాడేవో. రాజేష్ బాగోగులు నాకూ ముఖ్యమే. కాస్త ఓపిక పట్టు" అన్నాడు చక్రపాణి.

"ఎలా ఓపిక పట్టనండీ? ఈ దిక్కుమాలిన కొంపలాంటి ఇల్లు అయితే "పోనీలే" అనుకుందును. కానీ నాలుగు కోట్లండీ! ఆ ధర తలుచుకుంటేనే అక్కడ ఏమౌతుందో ఏమోనని ఒళ్ళు జలదరిస్తోంది" అంది కాళింది.

అరనిమిషం క్రితం మూడున్నర కోట్ల రాజేష్ ఇల్లు ఖరీదు చటుక్కున నాలుగుకోట్లకి పెరిగిందే అనుకుని నిట్టూర్చాడు చక్రపాణి. అలనాటి కాళిందికి ఈ కాళిందికి ఎంత వ్యత్యాసం! మనుష్యులలో మార్పు సహజం, అనివార్యం కూడా. కాని ఇంత మార్పా? అంటూ తలమున్కలౌతూ పేపర్ పేజీ తిప్పాడు. సోఫాలో చతికిలపడి టెలివిజన్ ఆన్ చేసి రిమోట్ తో ఛానల్స్ మార్చడం మొదలు పెట్టింది కాళింది. పదినిమిషాలు అన్ని ఛానల్స్ పరిశీలించాక

"ఛీ దరిద్రపు వెధవలు. ఏది ముఖ్యమో దానిని ప్రచారం చేయరు. అమాయకులని కూడా నేరస్తులుగా పరిగణిస్తూ, హత్యలు మానభంగాల వివరాలు తెలియకపోయినా నిందితుల పడకగదుల్లోనికి కెమేరాలతో దూరి వీరవిహారం చేస్తూ అవాకులు చెవాకులు ప్రసారం చేస్తారు. పింజారీ వెధవలు. అది తప్పితే సులభ్ కాంప్లెక్సో, ఇంకో చెత్త భవనమో ప్రారంభానికి వచ్చే రాజకీయ నాయకుల ఊక దంపుడో ప్రసారం చేస్తారు" అంటూ రిమోట్‌ని విసిరింది కాళింది. టెలివిజన్ ఛానల్స్ ప్రసారం చేసే వార్తల గురించి కొంచెం మొరటుగా కాళింది చేసిన వ్యాఖ్యలతో తనూ చాలా మట్టుకు ఏకీభవిస్తాడు. అయితే ఏది ఎవరికి ముఖ్యం? ఏది ప్రసారం చేయాలి? అన్నదే వివాస్పదం. ఎక్కడో అమెరికాలో అడవి మంటలు గురించి ఇక్కడ సామాన్య ప్రజకి ఏమాసక్తి? దేశం మొత్తం మీద మహా అయితే పదివేల నుంచి పదిహేను వేల ప్రజలకి లాస్ ఏంజెల్స్ దగ్గర బంధువులు ఉంటారేమో అనుకుంటుంటే "ఏమిటో తెగ ఆలోచించేస్తున్నారు. ఏదో మేధావి అయినట్లు చటుక్కున ఆలోచనలోనికి కూరుకుపోతారు. ఇంతకీ వాడికి ఫోన్ చేస్తారా? లేక నేను వెళ్ళి ఫోన్ చేసి వచ్చేదా?" అంటూ పాత చోటికి వచ్చింది కాళింది.

"తప్పుతుందా మరి? వెళతాను" అంటూ కుర్చీలోంచి లేచాడు చక్రపాణి.

"సార్, అక్కడ ఫోన్ ఎవ్వరూ ఎత్తడం లేదు. మీరు బైటకి వచ్చేయండి. ఇతరులు నిరీక్షిస్తున్నారు" అన్న టెలిఫోన్ బూత్ యజమాని మాటవిని, పదిసార్లు ప్రయత్నించి విఫలుడయి, ఫోన్‌ని క్రింద ఉంచి ఇంటి ముఖం పట్టాడు చక్రపాణి ఆగస్ట్ మాసం ఆఖరి దశలో ఉన్నా సూర్యుడు సెగలు కక్కడం మానలేదు. దానికి తోడు గాలిలో తేమ ఎక్కువగా ఉండడంతో రెండడుగులు వేసేటప్పటికి చెమటతో తడిసిన బనీను శరీరానికి అంటుకుని చక్రపాణికి ఇబ్బంది కలగచేస్తోంది. రాజేష్‌తో మాటలాడడం వీలుపడలేదని చెప్పగానే కాళింది చిందులు తొక్కుతోంది. అది తలుచుకుంటుంటే శరీరంలోంచి ఇంకా ఎక్కువ చెమట ఉబకనారంభించింది. కాళిందిలో ఇంత మార్పు వస్తుందని తనతో అలనాడు ఎవరైనా అంటే, వాళ్ళని చాచి లెంపకాయ కొట్టేవాడు. కాళింది మీద అలాంటి సడలని నమ్మకం తనకి ఉండేది. ఆమె అన్నా, ఆమె ఊహలన్నా తనలో ఉన్న ఉద్వేగం వివరించలేనిది. కానీ ఈనాడు? కాళిందితో, భయపడకుండా ఏవిషయమూ చర్చించలేడే! ఇంతకీ కాళిందిలో మార్పు వచ్చిందా లేక తనలో వచ్చిన మార్పు వలన కాళిందిని కొత్త కొలత బద్దతో బేరీజు వేసి ఆమెకి "తూర్పు" ని అంటకట్టి దానిని రంగు భూతద్దాలలోంచి చూస్తున్నాడా? తనలో మార్పు వచ్చిందని తన గురించి కాళింది కూడా అనుకుంటుందేమో! అది మరుగుపరచలేక ఈ మార్పు అంతా "కాళిందిలో మార్పు" అని సమర్థించుకుంటున్నాడా? ఒక్కసారి చక్రపాణి శరీరం జలదరించింది. "ఛీ తనలో అంతమార్పు ఏదీ? తనని చిరకాలంగా తెలిసిన ఎవరైనా తనలో మార్పు రాలేదని చెబుతారు అనుకుంటూ లోలోపల నిబిడీకృతమై ఉన్న అహాన్ని అదిమి పెట్టి ఉంచుతుంటే ఎదురుగా వస్తున్న కారు హారన్ శబ్దం వినగానే వాస్తవంలోనికి వచ్చాడు చక్రపాణి. "ఏమయ్యా, హారన్ వినిపించడంలేదా? ఇడియట్" అంటూ ముందరకి కదిలింది కారు.

"నేను సరి అయిన దారిలోనే నడుస్తున్నాను. నీ కారుని రోడ్డుకి కుడివైపు భాగంలో నడుపుతున్నావు. నువ్వే ఇడియట్‌వి" అని అరుద్దామనుకునేంతలో కారు చాలాదూరం వెళ్ళిపోయింది. అరిచి ఏం ప్రయోజనం? డబ్బు! మనుష్యుల దగ్గర నల్లధనం కుప్పలు కుప్పలుగా వచ్చి పడుతుంటే దానిని ఏం చేయాలో తెలియని వ్యక్తులు వీళ్ళు. డబ్బుంటే వచ్చింది కాని నాగరికత ఎలా

అలవరచుకున్నారు? లోకం మారింది అనుకుంటూ తలుపు తోసుకుని లోపలికి వచ్చి "లైన్లు బిజీగా ఉన్నాయి. రాజేష్‌తో మాటలాడడానికి వీలవలేదు. తరువాత మళ్ళీ ప్రయత్నిద్దాం" అంటూ త్వర త్వరగా స్నానాలగదిలోనికి ప్రవేశించాడు చక్రపాణి.

చక్రపాణి చల్లని నీళ్ళు తలమీద గుమ్మరించుకోగానే నడిచి వచ్చిన అలసట మాయమై, శరీరం దానితోపాటు మెదడు ఉత్సాహాన్ని అందుకున్నాయి. మనఃస్ఫూర్తిగా "ఇక్కడే ఉండండి. మీరు ఒక్కరూ కాకినాడలో ఉండడమేమిటి?" అన్న పెద్ద కొడుకు రమేష్ అన్నా, పెరుగుతున్న ఇద్దరు మనవలతో కలిపి ఆరుగురికి రెండు బెడ్రూంలు ఉన్న ఇల్లు చాలక, వాళ్ళు ఇబ్బంది పడుతుంటే తను కాకినాడకి మకాం మార్చాడు. రమేష్ ప్రేమ పూర్వకంగా అర్థించిన ఆ రెండు వాక్యాలు తనలో ఆనందంతో గగుర్పాటుని కలిగించాయి, కాని కాళింది, కోడలు పద్మల మధ్య పరోక్షణంగా నడుస్తున్న నీడల యుద్ధం, వాగ్వివాదాలు కాళిందికి రమేష్ మాట విలువ తగ్గించాయి. కాళింది స్వతంత్రంగా ఉండడానికే నిశ్చయించింది.

"అందరినీ తృప్తిపరిస్తే, ఎవ్వరినీ సంపూర్ణంగా తృప్తి పరచలేదన్నమాట" అన్న మర్ఫీ సూక్తిలా, కాళింది మాటకే విలువనిచ్చి కాకినాడ రెండు సంవత్సరాల క్రితం వచ్చి స్థిరపడ్డాడు. తన స్థిరపడ్డాడు కాని కాళింది దృష్టి, ఆలోచన ఊహలు, ఆశలు అన్నీ రాజేష్ మీదే చిన్న కొడుకు రాజేష్ చుట్టూరా ఆమె ఆలోచనలు అన్ని కోణాలలోంచి పరిభ్రమిస్తోంది. రాజేష్ ధ్యాస ఆమెని కాకినాడలో ఇంకా స్థిరపడనివ్వలేదు అనుకుంటుంటే "నీళ్ళన్నీ మీరే వాడేస్తే నాగతేం కాదు, ఆపండి స్నానం" అంటూ స్నానాలగది దగరగా వచ్చి కాళింది. హెచ్చరించగానే కొళాయి ధారని, ఆలోచనల్ని కట్టి తువ్వాలందుకున్నాడు చక్రపాణి.

"కాళిందీ!"

"నాకు తెలుసు మీరు ఎందుకు పిలిచారో. ఈ వేళ నా మనస్సేమీ బాగోలేదు. ఫలహారం చేసే ఉత్సాహం, ఓపికలేవు. కాఫీ ఇస్తాను కాస్సేపట్లో" అంది కాళింది. స్నానాల గదివేపు నడుస్తూ. మౌనంగా తల ఊపాడు చక్రపాణి. పెద్దకొడుకంటే తండ్రికి, చిన్నకొడుకంటే తల్లికి ఎక్కువ ఇష్టం అన్న నానుడిలో ఎంత నిజముందో తెలియదు కాని చిన్నకొడుకు రాజేష్ అంటే ప్రత్యేకమైన ఆసక్తి. ఆ ఆసక్తి, ప్రేమ గత ఆరేళ్ళుగా చిలువలు పలువలు వేయడం గమనిస్తుంటే తెగ ఆశ్చర్యం వేస్తుంది చక్రపాణికి. చక్రపాణి మెదడు గతంలోనికి జారుకుంది.

రమేష్ మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ తీసుకుని రైల్వేలో ఉద్యోగం చేస్తున్న రోజులవి. ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకే రమేష్ తనకి నచ్చిన పద్మని పెళ్ళిచేసుకున్నాడు. అది తనని ఏమాత్రం బాధించకపోయినా, కాళిందికి రమేష్ చేసిన పని నచ్చలేదు. ఒకే ఇంటిలో అందరూ కలిసి నివశిస్తున్నా కాళింది, పద్మల మధ్య అడపాతడపా ఘర్షణలు రగిలేవి. తనేమీ పట్టించుకోకపోవడంతో పద్మని మందలించడంలేదని తనమీదా, రమేష్ మీద కాళిందికి గుర్రుగా ఉండేది. ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కాలేజీలో మెరిట్ సీట్ రాజేష్‌కి రాకపోవడంతో కాళింది పట్టుదల మీద కర్నాటక రాష్ట్రంలో ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ కోర్స్ చదవడానికి రాజేష్ వెళ్ళాడు. ముందు ఒక లక్షరూపాయలు డొనేషన్, ముప్పయివేలు సంవత్సరానికి ఫీజ్, ఇతర ఖర్చులతో సంవత్సరానికి నలభైవేలు! తనకి వచ్చే జీతం, ఇతర నిల్వలు సరిపోకపోతే రమేష్ కొంత ఆర్థిక సహాయం అందించాడు. తను ఎప్పుడైనా రమేష్ చేసిన ఆర్థిక సహాయం గురించి ప్రస్తావించబోతే, "ఆ! రమేష్ చదువుకి మీరు ఖర్చు పెట్టలేదేమిటి? అది వాడి బాధ్యత" అని రమేష్ చేసిన సహాయానికి విలువ తగ్గించేది. రమేష్ ఏమీ పట్టించుకోకపోయినా పద్మకి కాళింది ధోరణి నచ్చేదికాదు. రమేష్‌ని పొగిడినా, రమేష్ దగ్గర సహాయం అందుకున్నామన్న ప్రస్తావన వచ్చినపుడు పద్మ మొహం వెలగడం, చూసి అది తనని దిగువ పరిచినట్లు భ్రమించి కాళింది రమేష్ చేసిన సహాయం అతే తెగేసి బైటకి వ్యక్తపరచతగ్గదన్నట్లుగా పెదవి విరిచేది.

రాజేష్ డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువులో ఉండగా అతనికి నెలకి ఇరవై ఐదువేలతో ఉద్యోగం ఇస్తామన్న కంపెనీ వాగ్దానం రావడంతో ఇంట్లో వాతావరణంలో అందులో ముఖ్యంగా కాళింది ధోరణిలో మార్పు ప్రస్ఫుటంగా కానవచ్చింది. రాజేష్ గురించి ఆసక్తి, ఆరాటం ఎక్కువయాయి. ఆ హాస్టల్ తిండి ఎలా తింటున్నాడో? వాడి ఆరోగ్యం ఎలా ఉందో! కన్నడులు అన్నింటిలోనూ కొబ్బరి, పంచదార తెగవేసేస్తారు. మన ఆంధ్రా వంటంత రుచికరంగా వాళ్ళకి వండడం రాదు. ఏమంటారు?" అంది కాళింది ఒకరోజు.

"అలా అంటావేమిటి, బెంగుళూర్‌లో చేసే వివిధ రకాలైన వంటకాల ముందర మన వంటలు దిగతుడుపే అని అందరూ పొగుడుతారే!" అని తనంటే

"ఆ! నా మొహం. అలా అన్నవాళ్ళ నాలికల మీద దిబ్బళ్ళు వేసి ఉంటాయి" అంటూ తృణీకరిస్తూ కదలి వెళ్ళింది కాళింది.

రాజేష్ సెలవులకి ఇంటికి వచ్చినపుడు కాళింది చేసే ఆర్భాటం అంతా ఇంతా కాదు. ఒక పూట కాళింది, ఒక పూట పద్మ వంట చేసే ఏర్పాటుని ప్రక్కకి నెట్టి, తనే మూడు పూటలా వంట చేసి రాజేష్‌కి అమర్చి పెట్టేది. ఇతరులు ఏమనుకుంటున్నారో తనకి తెలియదు కాని తనకి అది చాలా ఎబ్బెట్టుగా అనిపించేది. కాని దానిని కాళింది దృష్టికి ఎలా తీసుకురావడం? కాళిందికి ఇంకొకరు చెబితే సరిపడదు. ఆమె ప్రవర్తిస్తున్న తీరు సరి అయినది కాదని చెప్పే ధైర్యం తను ఏనాడో కోల్పోయాడు. దెబ్బలాటలు లేకుండా, సంఘంలో తాము ఆదర్శ వివాహాలలో ఒకటిగా కీర్తి గణించారు. మనస్సులో ఉన్నది భయపడకుండా బైటకి చెప్పలేని తను, నిజాన్ని ఒప్పుకోలేని కాళిందిలది ఆదర్శ వివాహం. ఆదర్శం, అంటే తను ప్రేమలో పడిన అలనాటి కాళింది జ్ఞాపకానికి రాకమానదు. చిక్కనైన చక్కని తెలుపుదనంతో చెక్కినట్లున్న చెక్కిళ్ళతో చకచకా తిప్పే కాటుక కళ్ళతో అలవోకగా చూసి జుత్తుని వెనక్కి విలాసంగా విదిలించే తెల్ల సంపెంగ మొగ్గలాంటి అందమైన స్త్రీలో నిబిడీకృతమై ఉన్న ఆదర్శాలు కనిపించిననాడే కాళింది తన మనస్సుని దోచుకుంది. ఎదుట వ్యక్తికి గౌరవం ఇవ్వడం, ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయడం, డబ్బుకి అంతంత మాత్రమే విలువ ఇవ్వడం లాంటివి తన దృష్టిలో పడి తనని విప్లవాలుని చేసాయి. చెవికి వేసుకున్న బుట్టల మీద పడిన సూర్య రశ్మి హంస మెడలాంటి మెడమీదకి జారి వింత కాంతితో మెరిసిపోతూ కాళింది తనన్ని ఉక్కిరి బిక్కిరి చేసిన రోజులు కోకొల్లలు.

"ఏమండీ, అమెరికాలో ఇప్పుడెంతయి ఉంటుంది?" అనడిగిన కాళింది ప్రశ్న చక్రపాణిని వాస్తవంలోనికి తెచ్చింది.

"ప్రదేశాన్ని బట్టీ సమయంలో మార్పు ఉంటుంది. ఇప్పుడు రాజేష్ ఉన్న ప్రదేశంలో రాత్రి పదకొండున్నర గంటలయి ఉంటుంది."

"మీరు ఉదయం పేపర్ లో మునిగిఉండకపోతే వాడితో మాట్లాడేవారేమో. రాత్రి ప్రయత్నిద్దాం" అంది కాళింది.

తిరిగి చక్రపాణి ఆలోచనలో పడ్డాడు. రాజేష్ ఇబ్బందులలో ఉంటే తల్లిగా కాళింది వ్యాకులపాటు తను అర్థం చేసుకోగలడు. కానీ రాజేష్ ఇబ్బందులలో ఉన్నట్లు ఏమీ దాఖలా లేదు. మంటలు రాజుకున్న ప్రదేశం రాజేష్ ఇంటికి ముప్పయి కి.మీ దూరంలో ఉందని, అతనికి ఏ మాత్రం హానిలేదని చెబుదామని కాళిందికి వివరించబోతే దానిని త్రోసిపుచ్చింది. అదీకాక రాజేష్‌కి అమెరికా కొత్తేమీకాదు. ఇదే కాళింది ఒక సంవత్సరం క్రితం ఇలాంటి సన్నివేశమే ఎదురయితే మరో విధంగా ప్రవర్తించింది!. ఇరవై నాలుగు సెంటీ మీటర్ల వాన ఒక్క రోజులో కురవగానే విశాఖపట్నం జలమయమ మయింది. కొన్ని ప్రాంతాలలో ఇళ్ళళ్ళలోనికి నీళ్ళు రావడంతో పై అంతస్తుల మీదకి ప్రజలు చేరుకున్నారు. రమేష్ ఇల్లు అక్కయ్యపాలెం నీళ్ళు నిలిచిపోయే ప్రదేశంలో ఉండడం, టెలివిజన్ మీద వరద నీళ్ళ ఉధృతం చూపిస్తుంటే, "రమేష్, పద్మ మనువలు ఎలా ఉన్నారో! ఎలక్ట్రిసిటీ ఉందో లేదో!" అని తను భయాన్ని వ్యక్తపరుస్తుంటే "వాడు చిన్న పిల్లవాడు కాదు. ఆఫీస్ మనుష్యులు వచ్చి సహాయం చేస్తారు. కంగారు పడవలసినంత ఏమీ లేదు" అంది కాళింది. తను ఊరుకోలేక రమేష్‌కి ఫోన్ చేయబోతే వీలవలేదు. రాత్రి భారంగా గడిచింది. మర్నాడు ఉదయం రమేష్ ఫోన్ చేసేంతవరకు మనస్సులో చికాకు పోలేదు. "నే

చెప్పలేదా? మీరు అనవసరంగా ప్రతీదానికీ కంగారు పడతారు" అంది కాళింది. అలాంటి గుండె ధైర్యం ప్రదర్శించిన కాళింది, ఈవేళ ఆమె ప్రదర్శిస్తున్న బేలతనానికి ఎక్కడా పోలికే లేదు అనుకుంటుంటే,

"భోజనం వడ్డించేసేదా?" అనడిగింది కాళింది.

రెండవసారి కాఫీ ఇస్తానని మరచిన కాళింది వేపు చూసి సన్నగా నవ్వుకుంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకి నడిచాడు చక్రపాణి.

"హమ్మయ్య, రాజేష్ బాగానే ఉన్నాడండీ" అంటూ చక్రపాణి ప్రక్కనే చతికిలపడింది కాళింది. నదిలో ఉధృతమైన వరద వచ్చి తగ్గాక శాంతంగా ప్రవహిస్తున్న నదిలా ఉంది కాళింది వాలకం, ప్రశ్నార్థకంగా కాళింది వేపు చూసాడు చక్రపాణి.

"నేను వాడితో మాటలాడి వచ్చాను. మీలా నేను నిమ్మకి నీరెత్తినట్లు ఉండలేనుకదా. మండిపోతున్న ప్రదేశాల నుంచి మంటలు వ్యాపించకుండా ఉండడానికి ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేస్తోందట. మీరేమీ చెప్పరు, బెల్లం కొట్టిన రాయిలా ఉంటారు. ఆ దేశం ఆ దేశమేనండీ. అక్కడ వచ్చే అవకాశాలు, లభించే సుఖాలు ఇక్కడిలా కాదు" అంది కాళింది. వాస్తవాలు అన్నీ తెలియకుండా, నచ్చిన వాటినే ఎన్నుకుని, ఇతర దేశాలలో ఉన్న విశిష్టతని తమకి ఆమోగ్యకరమైనవి వాడుకునే చాలామందిలాగే కాళింది అమెరికాలో ఉన్న గొప్పతనాల్ని విశ్లేషిస్తుంటే, కాళింది చెప్పినది ఒక చెవితో విని రెండో చెవితో వదిలేసాడు చక్రపాణి.

"అయ్యో! నా మతిమండ. పోపు మాడిపోతోంది మీ ధర్మమా అని" అంటూ వంటింటి వైపు పరుగు తీసింది కాళింది. చక్రపాణి ఆలోచనలో పడ్డాడు.

ప్రతీ మనిషిలో ఆదర్శాలు ఒడ్డును తాకి సముద్రం నుంచి వచ్చే కెరటాలను ఇసుకలో కలిగి పోయినట్లు చాలామందిలో అవి మాయమవుతాయి. అది తక్కువ మంది వాటిని వాటేసుకుని పదిలంగా కాపాడుకోగలుగుతారు. ఈ పరిణామం భవిష్యత్తులో ఎవరికి వస్తుంది అన్నది ఊహించటం కష్టమే.

కాళింది కాకినాడ కొళాయి చెరువు పార్క్‌లో సాయంకాలం నీళ్ళలో మెరుస్తున్న చంద్రుడిని చూస్తూ ఆదర్శాల గురించి వ్యాఖ్యానించిన కాళింది మాటలు విన్న తనలో గగుర్పాటు ఆనందం వివరించలేనిది. కాని ఏదీ ఆ కాళింది? అరవై ఐదేళ్ళ స్త్రీలో పదహారేళ్ళ పొంకం, హావభావాలు కనిపించినట్లు, ఈ కాళిందిలో అలనాటి ఆదర్శాలు ఏమీ కనిపించడంలేదు. చెట్టుమీద వికసించిన గులాబీ, రోజులు గడుస్తుంటే రేకులు జార్చి మిగిలిన తొడిమిలా కాళిందిలో ఉన్న ఆదర్శాలు కాలంతో పాటు జారిపోయాయి. ప్చ్! అనుకుంటుంటే,

"టేబుల్ మీద అన్నీ అమర్చేసాను, రండి" అంది కాళింది.

"ఆకలిలేదు, కాస్సేపు ఆగుతాను" అని చెబుదామనిపించినా, తరువాత కాళింది వేసే ప్రశ్నలుతో తన మెదడులో పడిలేస్తున్న ఆలోచనల కురుక్షేత్ర సంఘర్షణ గురించి బైటపడే అవకాశం ఉంది, ఆమెతో ఆలోచనలు పంచుకునే రోజులు వెళ్ళిపోయాయి. తన ఒంటరి ఆలోచనలు తోడుకోసం చాలాకాలంగా అలమటిస్తున్నాయి అనుకుంటూ బలంగా ఊపిరి పీల్చే కుర్చీలోంచి లేచాడు చక్రపాణి.

"బాంక్ డిపాజిట్ మీద వడ్డీ బాగా తగ్గించారట. మనం ఖర్చుని అదుపులో పెట్టుకోవాలి కాబోలు" అంటూ మామిడికాయ పప్పుని పళ్ళెంలో వడ్డించింది కాళింది.

"అంత వద్దు" అంటూ వారించబోయాడు చక్రపాణి.

"ఏం దొబ్బిడాయి, మీకు మామిడికాయ పప్పు ఇష్టం కదా?"

నిజమే, కాని దానిలో చితకకొట్టి వేసే వెల్లుల్లిపాయ రుచి నచ్చదు అని తను చాలాసార్లు వివరించినా, తనకి తెలిసినదే ఆచరణ యోగ్యమని, భర్తలకి ఏదిమంచో, ఏది చెడో నిశ్చయించే లక్షలాది స్త్రీలలో కాళింది ఒకర్తి అని తను ఏనాడో గ్రహించాడు. ఎప్పటిలాగే పప్పులో కనిపించిన వెల్లుల్లిని ఏరి ప్రక్కన పెట్టి చప్పున భోజనం కానిచ్చిన చక్రపాణిని చూసి "నేనింకా పప్పు అన్నలోనే ఉన్నాను. ఎన్నాళ్ళయినా ఈ మీ అలవాటుని మాన్పించలేకపోయాను" అంటూ కాళింది విసుక్కుంది.

ప్రతీవాక్యంలో ఏదో ఒక దెప్పిపొడుపు వాడి భర్తలని బలవంతగా మార్చ ప్రయత్నిస్తే వాళ్ళు దూరం అవుతారని గ్రహించని కాళింది వేపు జాలిగా "రాత్రి భోజనం మెల్లిగా చేస్తానులే" అన్నాడు చక్రపాణి.

"ఇది మీకు చెప్పానా? అమెరికాలో పనిచేస్తున్న మా అన్నయ్య అల్లుడికి ఉద్యోగం పోయిందట. అక్కడ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వీళ్ళని ఇక్కడనుంచి తీసుకెళ్ళి ఉద్యోగంలోంచి తీసెయడం! అదేం రోగం వాళ్ళకి? అయినా వాళ్ళకి జాత్యహంకారం ఎక్కువలెండి" అంది కాళింది.

"దాని సంగతి నాకు తెలియదు. ఒక చిన్న ప్రశ్న వేస్తాను, దీని గురించి ఆలోచించు. ఉదాహరణకి మన ఊరిలో ఒక పెద్ద ఫాక్టరీ పెడుతున్నారనుకో, దానిలో పనిచేయడానికి పై రాష్ట్రల నుంచి చవుకగా పనిచేసే కార్మికులుని నియమిస్తే నువ్వేమంటావు? ఆర్థిక మాంద్యం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. మన ఇంటిలో నువ్వూ నేనూ కాక ఒక పరాయి వ్యక్తి ఉన్నాడు. నువ్వు అరకిలో బియ్యం వండేవు. వండిన అన్నం మనకి సరిపోకపోతే అతనికి నువ్వు అన్నం పెడతావా? ఒక్కరోజు వ్యవహారం కాదు!" అన్నాడు చక్రపాణి.

"మీదంతా మిడిమిడిజ్ఞానం. ఏదో తెలిసినట్లు చేతులు ఊపుకుంటూ ఊకదంపుడు కొట్టేస్తారు. అమెరికన్లని, చైనీయులని, ఇండియన్లని అనుకరించమని ఒబామా ఉద్బోదించాడని చదివాను. తెలివైనవాళ్ళని కంపెనీలలోంచి తీసేస్తే కంపెనీలు చచ్చుపడిపోవూ?" అంది కాళింది.

"ఓహో! అదే నిజమైతే మనదేశంలో జరుగుతున్న దేమిటి?" అంటూ లేచాడు చక్రపాణి. భర్త తనవాదాన్ని అంత తేలికగా ఖండిస్తాడని ఊహించని కాళిందికి చలి జ్వరం వచ్చినట్లయింది. లోపల్నించి కుతకుతలాడుతున్న ఉక్రోషాన్ని అదిమి పెట్టి భోజనం కానిచ్చింది కాళింది.

రెండు రోజులుగా ఉదయమేలేచి నాలుగుపేపర్లు కొనుక్కుని వచ్చి చదవడం, ఎడతెరిపిలేకుండా టెలివిజన్‌లో విదేశీ ఛానల్స్ ప్రసారం, కాళింది చూడడం గమనించిన చక్రపాణికి ఆ మార్పుకి కారణం వెంటనే స్ఫురించింది.

"అమెరికాలో నవంబర్‌లో ఆరులక్షలు, డిసెంబరులో ఆరులక్షలపై చిలుకు ఉద్యోగాలు పోయాయట. రాబోయే మూడేళ్ళలో దాదాపు ఒక లక్షమంది సాఫ్ట్ వేర్ ఉద్యోగలు ఇండియా తిరిగివస్తారట" అంది కాళింది కాఫీ కప్పు చేతికి అందిస్తూ.

చక్రపాణి వెంటనే ఏమీ సమాధానమీయలేదు.

"హెచ్ వన్ వీసా ఉంటే, ఒక ఉద్యోగం పోతే మరో ఉద్యోగం చూసుకోవచ్చు కదండీ?" అంది కాళింది సంభాషణని కొనసాగిస్తూ.

"అన్ని కంపెనీలలో ఉద్యోగాలు తగ్గిపోతుంటే మరో ఉద్యోగంలో ఇరకటం ఈ పరిస్థితులలో కొంచెం కష్టమే. సమయం పడుతుంది కాని ఉద్యోగం పోతే మరొక ఉద్యోగం చూసుకోవడానికి వాళ్ళు పెట్టే ఆంక్ష ఒకటి, రెండు నెలలు మాత్రమే".

"మన రాజేష్ తెలివైన వాడని వదులుకునే బుద్ధిహీనులు కారు వారు. వాడి ఉద్యోగానికి ఏమీ ఎసరు ఉండదు" అని స్థిమితపడబోయింది కాళింది.

"అవునవును. కాని ఉద్యోగాలు ఊడిపోవడానికి ఇచ్చిన మెమెంటోలు ఏమీ అడ్డురావు. దేని దారి దానిదే " అన్నాడు చక్రపాణి.

"రాజేష్ ఏ ఇబ్బందులకి గురవకుండా ఉంటే మనం నడిచి వచ్చి దర్శనం చేసుకుంటానని వెంకన్నకి మొక్కుకున్నాను" అంది కాళింది. ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు చక్రపాణి. కాఫీ కప్పులో ఉన్న కాస్త కాఫీ చేయి కుదుపుకి ఒలికి టేబుల్ మీదున్న కాగితాల్ని తడిపింది.

ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ప్రత్యేకంగా దేముడంటే నమ్మకం లేని తను కాళింది నమ్మకాన్ని ఏం విశ్లేషించగలడు? ఆంధ్రప్రదేశ్‌లో నివసించే కోట్ల జనాభా కోరికలకి, అమెరికాలో ఉన్న ఏడెనిమిది లక్షల తల్లితండ్రుల కోరికలని కలిపి తీర్చటానికి ఆ దేముడు ఎలాంటి నడుము కడతాడో! ఆయన మాటేమో గాని కాళిందితో కలిసి ఆ మూడువేల ఐదువందల మెట్లు ఎక్కేసరికి తన వాతపు కాళ్ళు చచ్చుపడతాయి అది తథ్యం అనుకుంటూ ముడుకులని నిమురుకున్నాడు చక్రపాణి.

"నాకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ లలో ఒకదానిని నిర్ణీత సమయానికి ముందరే తీసేసుకుందామనుకుంటున్నాను" అన్నాడు చక్రపాణి బేంక్ మేనేజర్‌తో

"దీనివల్ల కొంత పైకం నష్టపోతారు. ఆ డిపాజిట్ మీద అప్పు ఇస్తాం, తీసుకోకూడదూ?" అన్నాడు బాంక్ మేనేజర్ డిపాజిట్ వదులుకోవడానికి ఇష్టపడక.

"వద్దు సార్. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ కేష్ చేసి అదువందలు లేదా వెయ్యి రూపాయల నోట్లు ఇప్పించండి"

అమ్మకి చెప్పకుండా వీలయినన్ని డాలర్లు పంపమని రాజేష్ దగ్గర నుంచి వచ్చిన ఇ-మెయిల్ చూసాక ఇంకే మార్గం స్ఫురించక బాంక్ డిపాజిట్ రద్దు చేసుకుని ఆ డబ్బుని బ్రోకర్ ద్వారా రాజేష్‌కి పంపనిశ్చయించుకున్నాడు తను. ఇది చట్ట విరుద్ధం! కాని అవసరం! సముద్రకెరటాలు కాళ్ళ క్రింద లాక్కెళ్ళిన ఇసుకలా చట్ట విరుద్ధమైన పనులు చేయకూడదనుకున్న ఆదర్శం రాజేష్ అవసరం ముందర ఓడిపోవడంతో బ్రోకర్ ఆఫీసు మెట్లు ఎక్కాడు చక్రపాణి.

"ఎల్లుండికి మీ అబ్బాయికి డాలర్లు అందుతాయి" అన్నాడు బ్రోకర్ చక్రపాణి ఇచ్చిన డబ్బు అందుకుంటూ.

"థాంక్యూ" అంటూ ఇంటి ముఖం పట్టాడు చక్రపాణి.

రాజేష్‌కి డబ్బు అవసరం ఎందుకు వచ్చిందో కారణం ఊహించడం అంత పెద్ద విషయమేమీ కాదు. ఉద్యోగం లేకపోతే కొన్న ఇల్లు కోసం బాంక్ నుంచి తీసుకున్న పైకం మీద వాయిదా ఆగిపోదు కదా! "అమ్మకి చెప్పవద్దు" అన్న రాజేష్ అభ్యర్ధనకి విలువనిచ్చి కాళిందికి చెప్పకుండా డబ్బు పంపాడు తను. కాని ఆలస్యం చేయకుండా త్వరలో కాళిందికి ఈ విషయం చెప్పాలి అనుకుంటూ ఇంటిలోనికి ప్రవేశించాడు చక్రపాణి.

టెలివిజన్ చూస్తున్న కాళింది "క్రితం సంవత్సరం కాలంలో దాదాపు రెండు మిలియన్ల ఇళ్ళని జప్తు చేసుకుంటున్నారట. ఇళ్ళ ధరలు బాగా పడిపోయాయిట మన రాజేష్ ఇల్లు కూడా పడిపోయిందేమో!?" అంది. అంతకన్నా మంచి సమయం దొరకదన్న నిశ్చయంతో రాజేష్‌కి డబ్బు పంపిన సంగతి చెప్పాడు చక్రపాణి.

"ఇల్లు అమ్మేసి ఎంత వస్తే అంత డబ్బు పుచ్చుకుని ఇండియా రమ్మంటే సరి. ఆ తెచ్చుకున్న డబ్బుతో ఇక్కడ హాయిగా బ్రతక వచ్చు కదండీ" అనడిగింది కాళింది.

"ఇల్లు అమ్మేస్తే ఎంత డబ్బు చేతికి వస్తుంది? అన్నది ప్రదేశాన్ని బట్టి ఉంటుంది. ఇళ్ళ ధరలు ఎంత పతనమయాయో నాకు తెలియదు. ఉదాహరణకి నేను ఏడు లక్షల డాలర్లు కొన నిశ్చయించుకుంటే కనీసం ఒక లక్ష డాలర్లు పెడితే, మిగతా ఆరు లక్షల డాలర్లు బాంక్ నుంచి రుణం తీసుకోవచ్చు. ఈ ఆర్ధిక మాంద్య ప్రభావం వలన ఇళ్ళ ధర ఇరవై శాతం పడిందనుకో, అంటే నే కొన్న ఇల్లు విలువ కేవలం ఐదు లక్షల అరవై వేల డాలర్లు. ఆ ఇల్లు ఇప్పుడు బజారులో అమ్మితే అదే వస్తుంది. అదంతా బాంక్ కి జమ ఇచ్చినా

ఇంకా నలభై వేల డాలర్లు బాకీ ఉంటాం. అందుకే ఇళ్ళని, కట్టిన లక్షల డాలర్లని వదులుకుని చేతులు దులుపుకుని వెళ్ళిపోతుంటే బాంక్ ఆ ఇళ్ళని జప్తు చేసుకుంటోంది" అని వివరించాడు చక్రపాణి. దీనంగా శూన్యంలోకి చూస్తోంది కాళింది.

"మరేమీ కంగారు పడకు. వాడికి త్వరలో మరో ఉద్యోగం దొరుకుతుంది" అంటూ కంటిలో తిరిగిన కన్నీళ్ళని ఆపుకో ప్రయత్నిస్తున్న కాళిందిని సముదాయించ ప్రయత్నించాడు చక్రపాణి.

"వాడిని తిరిగి రమ్మని మీరు సలహా ఇచ్చారా? ముటా ముల్లె సర్దుకుని వచ్చేసాడంటే అక్కడకి మళ్ళీ వెళ్ళే అవకాశం లేనట్లే! నేనేం పాపం చేసానో ఇలా బెడిసి కొట్టింది. వాడి భవిష్యత్తు ఏమిటో!" అంటూ వాపోయింది కాళింది.

"వీడిలా తిరిగి వచ్చేసిన వాళ్ళు హైదరాబాదులో ఉన్న ఉద్యోగాలలో ఇరుక ప్రయత్నిస్తున్నారు. కాంపటీషన్ ఎక్కువే. ఈ ఊరిలో వాడికి ఏం ఉద్యోగం వస్తుంది? ఏదో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో పది - పన్నెండు వేలకో లెక్చరర్ ఉద్యోగం రావచ్చేమో" అన్నాడు చక్రపాణి.

"అక్కడ ఆ ఇల్లు కొనకుండా ఆ డబ్బుతో తిరిగి వస్తే బాగుండేది. కాని శని నెత్తి మీద తాండవిస్తుంటే అదెలా జరుగుతుంది? వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను" అంటూ గింజుకుంటుంది కాళింది.

"ఇక్కడ ఉండడానికి ఇల్లు ఉంది. నాకు పెన్షన్ వస్తుంది. మెల్లిగా ఒక ఉద్యోగంలో సెటిల్ అవుతాడు. అంతగా డబ్బు అవసరమైతే రమేష్ దగ్గర డబ్బు తీసుకోవచ్చు. టెన్షన్ వస్తుంది. మెల్లిగా మాటలాడు, లేకపోతే వాడికి మన మాటలు వినిపిస్తాయి" అంటూ హెచ్చరించాడు - చక్రపాణి. భర్త వేపు ఒక విచిత్రమైన చూపు విసిరి పడక గదిలోనికి వెళ్ళి తలుపేసుకుంది కాళింది.

పరుపు మీదకి చేరిన చక్రపాణి కాళిందిలకి నిద్రరావడంలేదు. రాజేష్ మళ్ళీ మంచి ఉద్యోగలో స్థిరపడతాడని నమ్మకంగా ఉన్నా, ఊహలు తల్ల క్రిందులవగానే నరికిన చెట్టులా కాళింది చతికిలపడిపోవడం, ఆమెలో కలిగిన అలజడి ఎలాంటి పరిస్థితులకి దారితీస్తుందో అన్న భయం చక్రపాణిలో ముప్పిరికొంది. ముక్కుచీదుకుంటూ బెక్కుతున్న కాళిందిని సముదాయించే నైపుణ్యం లేక కళ్ళుమూసుకున్నాడు చక్రపాణి.

రిక్తహస్తాలతో అమెరికా వెళ్ళి, లక్ష డాలర్లు పైనే సంపాదించి, దానిని పోగొట్టుకుని తిరిగి ఖాళీ చేతులతో వచ్చిన రాజేష్ ఏం చేయబోతున్నాడు? ఏభై లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. అది ఆర్జించడానికి ఎన్నాళ్ళు పడుతుంది? అసలు ఆర్జించగలడా? భర్త అన్నట్లు ఇక్కడే ఒక బోడి లెక్చరర్ ఉద్యోగం చూసుకుంటాడా? అమెరికాలో కాపురం చేసి వచ్చిన రాజేష్ భార్య సౌందర్య తనకి ఇంటిపనులలో సాయపడుతుందా? తెలుగు సరిగ్గా రాని సౌందర్యకి తనకి ఏదైనా విభేదాలు వస్తే వేరే కాపురం పెడుతుందా? ఉన్న పరువు కాస్త బజారు పాలు అవుతుందేమో అనుకుంటూ పరిపరి వికృత ఆలోచనలకి నీరు పోస్తూ, దుఃఖాన్ని అదిమి పెట్టుకుని నిద్రకోసం పరితపిస్తోంది కాళింది.

ఏకాగ్రత, ఉత్సాహం లేకుండా అన్నీ అమర్చిపెడుతున్న కాళిందిలో దినదినానికి పెరుగుతున్న నిరాశక్తిని అతి కష్టం మీద అదుపులో ఉంచుకుంటూ నెల్లాళ్ళు గడిచాయి. ఉద్యోగ ప్రయత్నంలో లోపం ఏమీలేకపోయినా రాజేష్‌ని ఉద్యోగంలో చేరమని ఏ కంపెనీ ఆహ్వానించలేదు.

ఒక రోజు డైనింగ్ టేబుల్ మీద కూర్చుని భోజనం చేస్తూ "మా అన్నయ్యకి ఒంట్లో బాలేదట. ఒకసారి వెళ్ళి చూసివస్తాను" అంది కాళింది. అందరూ కాళింది వేపు వివరణ కోసం చూసారు.

"ఏమిటి జబ్బు? ఎప్పుడు వెళతావమ్మా? నాన్నా మీరూ వెళతారా? ఎన్నాళ్ళకి వెళతావు?" అని అడిగాడు రాజేష్.

"వివరాలు నాకు తెలియవు. విజయనగరం వెళ్ళడానికి నాకు సహాయం అవసరం లేదు. అదీకాక నే వెళ్ళడం ఇంకా నిశ్చయించుకోలేదు చూద్దాం" అంది కాళింది. పదేళ్ళ క్రితం మావయ్య, అమ్మల మధ్య వాగ్వివాదం పెరిగి "చచ్చినా, నీ ఇంటి గుమ్మం తొక్కను" అన్న అమ్మ ఇప్పుడు మావయ్య జబ్బు గురించి వివరాలు తెలియకుండా వెళతాననడం రాజేష్‌ని ఆశ్చర్యపరచి అర్ధాంతరంగా తల్లి విజయనగరం ఎందుకు వెళుతుందో! అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు.

కాళింది విజయనగరం వెళ్ళే ఉద్దేశ్యం ఉందని ప్రకటించాక, ప్రయాణానికి ఏమీ ముందంజ వేయకుండా పదిహేను రోజులు భారంగా గడిచాయి.

"చికెన్ గున్యా" వ్యాధి వచ్చాక కీళ్ళ కూడమిలో సత్తువలేనట్లు నడుస్తూ ఇంటిపనులు చేసున్నా పిడుగుపడిన చెట్టు దగ్ధమైపోయి మోడు వారినట్లు సోఫాలో కూలపడి నిర్వీర్యంగా ఒరిగిపోయిన కాళిందిని చూస్తే గుండె జలదరించించి. ఇలాంటి సన్నివేశాలలో ఏమైనా నోరు విప్పితే కాళింది ఎలా రియాక్ట్ అవుతుందో తెలిసిన చక్రపాణికి మౌనమే శరణ్యమైంది.

"నేను అలా నడకకి వెళ్ళొస్తాను" అని బయలుదేరుతుంటే, "నేనూ వస్తాను నాన్నా" అంటూ రాజేష్ చెప్పులు వేసుకున్నాడు. పదినిమిషాలు నడిచి పార్క్‌లో ఖాళీ బెంచ్ మీద చక్రపాణి, రాజేష్ లు ఆసీనులయారు. రెండు నిమిషాలు గడిచాక "నాన్నా, మీకు తెలుసు ఈ ఊరిలో నాకు మంచి ఉద్యోగం రాదని, మా మావగారు అక్కడ ఎక్కువ అంటే, అక్కడికి వెళదామని నిశ్చయించుకున్నాం. అమ్మకి ఈ విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు. మీరు కాస్త అమ్మకి.." అంటూ ఆగాడు రాజేష్.

"నీ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. మీ అమ్మ గురించి నీకు తెలియనిదేముంది? అయినా నచ్చ చెప్ప ప్రయత్నిస్తాను" అన్నాడు చక్రపాణి.

"రేపు సాయంకాలం గోదావరి ఎక్స్‌ప్రెస్ లో హైదరాబాద్ వెళ్ళి అక్కడ నుంచి పూణే వెళ్ళడానికి రైలు రిజర్వేషన్ చేయించాను" అన్నాడు రాజేష్.

"మీ అమ్మతో చర్చించకుండా ఇంత త్వరలో నువ్వు పూణే మీ మావగారి దగ్గరకి వెళ్ళడానికి నిర్ణయించుకోవడం సబబుకాదు" అని చెబుదామని నీటీ చివరి వరకూ వచ్చినా "కొంతవయస్సు వచ్చాక ఎవరి జీవిత పంథాలని వాళ్ళే ఎన్నుకోవడం మంచిదేమో!" అనిపించి తమాయించుకున్నాడు చక్రపాణి. అయినా ఐదేళ్ళు అమెరికాలో పనిచేసి వచ్చిన రాజేష్ కి నేను సలహా ఇవ్వడమేమిటి? అంటూ తలగోక్కున్నాడు చక్రపాణి.

రాజేష్ పూణే వెళ్ళి నెల రోజులయింది.

కాళింది ముభావత్వం, దాని పరిణామం ఇంట్లో పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని ఛేదించలేకపోతుండడంతో చక్రపాణి మెదడు ఆలోచనలకి ఎక్కువ బానిసయింది. ప్రతీ మనిషికి కోరికలు ఉండడం సహజమే. రాజేష్, రమేష్ కంటే తెలివిలో తక్కువయినా, అతన్ని అవకాశం అందలం ఎక్కించింది. సినిమాలలో లైట్ల వెలుతురులో మెరిసే గిల్ట్ నగలు తళతళచూసి తన్మయత్వంలో కూరుకుపోయిన ప్రేక్షకునిలా కాళింది రాజేష్ రాకుమారుడనుకుంటూ మభ్యపెట్టుకుంది. దీనికి ముఖ్యకారణం రాజేష్ ఆర్జించిన ఎక్కువ జీతం. తద్వారా అతను అమర్చుకున్న సుఖాలు. దీనిలో రాజేష్ తప్పేమీ లేదు. డబ్బు ముసుగు జారిపోగానే, చీకటిలో మెరుగు కోల్పోయిన గిల్ట్ నగలకాంతి విహీనత చూసిన కాళింది మీద వాస్తవికత భరింపలేనంత దెబ్బ కొట్టింది. కాలం మానలేనంత గాయాన్ని చేసింది. పాపం కాళింది! అనుకుంటూ నిర్లిప్తంగా, నిరాశగా అంతర్గతంగా రోదిస్తున్న కాళిందిని చూసి చక్రపాణి కళ్ళు మూసుకున్నాడు "ట్రింగ్ ట్రింగ్"

అన్న టెలిఫోన్ శబ్దం విని రిసీవర్ లో మాటలు విని "ఎలా ఉన్నావ్ రాజేష్?" అంటుంటే, సోఫాలోంచి కాళింది చటుక్కున లేచి పడక గదిలోనికి దూరి తలుపేసుకుంది.

బెడ్రూంలో పచార్లు చేస్తున్న కాళిందికి చక్రపాణి టెలిఫోన్ లో మాట్లాడుతున్నది స్పష్టంగా వినిపిస్తోంది.

"కంగ్రాట్యులేషన్స్, ఉద్యోగంలో ఎప్పుడు చేరాలి?

"నువ్వు కోరిన జీతం ఇచ్చారా?"

"పరవాలేదు, నువ్వు సంవత్సరానికి ఆరు లక్షలు అడిగితే ఐదు లక్షలు ఇచ్చినా ఇతర సౌఖర్యాలు ఇస్తున్నారుగా. బాగుందోయ్"

"ఆఫీస్‌కి మీ మావగారి ఇంటికి ఎంతదూరం?"

"అయితే వేరే ఇల్లు తీసుకుంటావా?"

"ఉండు, అమ్మని పిలుస్తాను. ఈ శుభవార్తవిని సంతోషిస్తుంది"

చక్రపాణి వచ్చి తనని పిలుస్తాడనుకుని నిరీక్షిస్తూ రెండు నిమిషాలు గడిచాక, హాలులో నెలకొన్న నిశ్శబ్ధం భరించలేక గది తలుపుతీసుకుని బైటకి వచ్చిన కాళిందికి టెలిఫోన్ క్రెడిల్ మీద కనిపించింది. భర్త ఏదో చెబుతాడని ఆశించిన కాళిందికి కుర్చీలో పెదవి కొరుక్కుంటూ ఆలోచనలో ఉన్న చక్రపాణి కాళిందిని చూసి విసిరిన చూపు కాళిందికి ఆశనిపాతంలా తగిలింది.

## మరో ప్రపంచం — అనిల్.ఎస్.రాయల్

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో బహుమతి పొందిన కథ

'**ఇదిగోండి** ప్రిస్కిప్షన్. ఏ మెడికల్ షాపులోనైనా దొరుకుతాయివి. రోజుకొక్కటే వేసుకోండి'

*'మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు డాక్టర్?'*

'రెండు నెలలు రెగ్యులర్‌గా ఈ మందులు వాడి చూడండి. అప్పటికీ తేడా కనిపించకపోతే ఓ సారి కలవండి. గుడ్ లక్'

ప్రిస్కిప్షన్ జేబులో పెట్టుకుంటూ డాక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి బయటికొచ్చాను. పార్కింగ్ లాట్‌లో ఉన్న కారు దగ్గరికి నడుస్తూ సెల్ ఫోన్‌లో సమయం చూశాను - ఎనిమిదీ ఇరవై ఒకటి.

డోర్ తెరిచి లోపల కూర్చుంటూ సెల్ ఫోన్ పక్క సీట్లోకి విసిరి కారు స్టార్ట్ చేసి పోనిచ్చాను. హాస్పిటల్ గేట్ దగ్గరికొస్తుండగా ఫోన్ మోగింది. తలతిప్పి ఫోన్ అందుకోబోతుండగా లిప్తపాటులో జరిగిందది ....

కారుకి ఎదురుగా అతను .. గాల్లోంచి ఊడిపడ్డట్లు. అదిరిపడి స్టీరింగ్ రెండు చేతులతో బిగించి పట్టుకుంటూ బలమంతా ఉపయోగించి బ్రేక్ నొక్కాను. కీచుమన్న శబ్దం .. దాంతోపాటే పెద్ద కుదుపు.

**(5:23 AM)**

ఎవరో పట్టుకుని కుదిపేస్తున్న ఫీలింగ్‌తో ఉలిక్కి పడి నిద్ర లేచాను. కాసేపది కలో నిజమో అర్థం కాలేదు. నిజం లాంటి కలా, కలలాంటి నిజమా? చెమటలు ధారగా కారిపోతున్నాయి. అది కలే, ప్రస్తుతం నేనున్నది వెలుపలే... అని తెలీటానికి అర నిమిషం పట్టింది.

మళ్ళీ లూసిడ్ డ్రీం. డాక్టర్ వివరణ గుర్తొచ్చింది.

'ఎక్కువ శాతం కలల విషయంలో మన మెదడు స్వప్నానికీ సత్యానికీ తేడా గ్రహించలేదు. అటువంటి సందర్భాల్లో, వచ్చింది పీడ కలైతే, అది వాస్తవమేనని భ్రమ పడి నిద్రలోనే తీవ్ర భయాందోళనలకు గురవుతాం. ఏ లాటరీ తగిలినట్లో కలొస్తే ఆనందమూ అనుభవిస్తాం. అయితే కొన్నిసార్లు మనం కల కంటున్నామన్న గ్రహింపు మెదడుకి ఉంటుంది. వీటినే లూసిడ్ డ్రీమ్స్ అంటాం. ఈ తరహా కలలొచ్చినప్పుడు, నిద్రలో కలగంటున్నామన్న నిజం తెలిసుండటంతో అవి పీడకలలైనా, తీపికలలైనా అంతగా స్పందించం'

ఇప్పుడు నాకొచ్చింది అలాంటి కలే. నేను గాభరాగా బ్రేక్ మీద పాదం మోపటం వరకూ గుర్తుంది. వెంటనే కీచుమన్న శబ్దం, దానితో పాటే పెద్ద కుదుపు. తూలి ముందుకు పడుతున్న ఫీలింగ్‌తో మెలకువ వచ్చేసింది. తర్వాతేమయింది? అతనికి తగిలిందా?. ఏమో. ఒకవేళ తగిలే ఉంటే? అంత వేగంతో ఢీకొట్టాక అతను బతికుండే అవకాశాల్లేవు.

రెండు నిమిషాలు మంచమ్మీదనే కదలకుండా కూర్చున్నాను. గొంతులో తడారిపోయింది, వంట్లో వణుకు. అది కలేనన్న గ్రహింపున్నా అంత భయపడటానికి కారణం - నా ఫోబియా.

యాక్సిడెంట్లంటే నాకెప్పుడూ భయమే. ఎవరిక్కాదు? అయితే నా భయం గుద్దుకున్నాక అతని పరిస్థితేమిటని కాదు, నా పరిస్థితేమిటని. అతనికేమైనా అయితే - నాకిక జైలే గతి. కలలో సైతం ఊహించుకోలేని ప్రదేశమది. నాకు నాలుగైదేళ్ళ వయసులో దొంగ-పోలీస్ ఆటాడుతూ కోళ్ళ గూడులో దాక్కున్నాను. రెండు చదరపు అడుగుల కన్నా తక్కువుండే చోటది. తోటి ఆటగాళ్ళలో ఆకతాయొకడు బయటినుండి గడె పెట్టి పారిపోయాడు. తర్వాత ఎవరో వచ్చి విడిపించేవరకూ, రెండు మూడు గంటల పాటు ఊపిరి కూడా సరిగా ఆడని ఆ గూటిలో భయంతో కేకలు పెడుతూ గడిపాను. అప్పట్నుండీ నాకు చీకటి గదులన్నా, ఇరుకు చోట్లన్నా చెప్పలేనంత భయం. అలాంటి ప్రాంతాలకు వెళ్ళక్కర్లేదు, కేవలం తలచుకున్నా ఊపిరాడనట్లు ఉక్కిరిబిక్కిరైపోతాను. జైలు గదులంటే ఈ రెండింటి సమ్మేళనమని నా నమ్మకం. అందుకే అవంటే అంత భయం. ఏ కారణం చేతన్నా ఇరుకు సెల్‌లో ఉండాల్సి వస్తే .. అన్న ఊహే చెమటలు పట్టిస్తుంది.

నుదుటిపై చెమటలు అరచేత్తో తుడిచేస్తూ అతనెవరో గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేశాను. హఠాత్తుగా జరగటంతో అతని ముఖం చూసే అవకాశం రాలేదు, అయినా బాగా తెలిసినవాడే అన్న భావన. కానీ ఎంతాలోచించినా ఎవరో తట్టలేదు. నేనెరిగిన వారందరినీ వరసగా గుర్తు చేసుకున్నా, వాళ్ళలో అతనెవరో అంతు పట్టలేదు. అతనికి సంబంధించిన దాన్ని దేన్నో చూసినట్లు అనిపించింది కానీ అదేమిటో కూడా అంతు పట్టలేదు.

ఆలోచనలు బలవంతంగా పక్కకి నెడుతూ మెల్లిగా మంచం దిగి బాత్‌రూంలోకి నడిచాను.

**(5:45 AM)**

స్నానం చేస్తున్నా, నా ఆలోచనలన్నీ కలల చుట్టూనే తిరుగుతున్నాయి. కడలిలో అలల్లా, కలగాపులగంగా. ఎక్కడ మొదలై ఎక్కడ తేలతాయో తెలీకుండా .. ఆలోచనలు.

రెండు నెలలుగా తరచూ కలలొస్తున్నాయి. ఎప్పుడూ చూడని ప్రదేశాలకీ, దేశాలకీ వెళ్ళినట్లు. కలలు మొదలైనప్పట్నుండీ కొన్ని కొత్త ప్రాంతాలకి వెళ్ళినప్పుడు వాటిని ఇంతకు ముందే చూసిన ఫీలింగ్! అప్పుడప్పుడూ అపరిచితుల చూపుల్లో నన్ను గుర్తుపట్టిన భావం. అయితే నేను ఆలోచిస్తుంది వాటి గురించి కాదు - మా నాన్న గురించి.

ఆయన పోయి నాలుగు నెలలవుతుంది. చివరి నిమిషంలో ఆయన చేసిన ఫోన్ ఎత్తి ఉంటే ఆయన దక్కి ఉండేవాడన్న భావన ఈ నాలుగు నెలల్లోనూ నన్ను వదల్లేదు. ఆఫీసు పని వత్తిడిలో పడిపోయి, తర్వాత తీరిగ్గా మాట్లాడదాములే అనుకుంటూ ఫోన్

ఎత్తకపోవటం అంత పని చేస్తుందనుకోలేదు. గుండెనొప్పితో విలవిల్లాడుతూ నాకు ఎమర్జెన్సీ కాల్ చేసుంటాడని ఎలా ఊహించగలను? నేనా ఫోన్ తీసుంటే ఆయనకి సమయానికి వైద్య సహాయం అందేలా చేసేవాడినేమో - అన్న గిల్టీ ఫీలింగ్.

ఈ రెండు నెలల్లో ఆయన గురించే ఎక్కువ కలలొచ్చాయి. ఆయన బతికే ఉన్నట్లు, కులాసాగా తిరుగుతున్నట్లు, నాతో ముచ్చట్లు చెబుతున్నట్లు. ఒకటో రెండో సార్లైతే పట్టించుకునేవాడిని కాదు. ఏడెనిమిది సార్లు అటువంటి కలలు రావటంతో నా గిల్టీ ఫీలింగ్ మరీ పెరిగిపోయింది. డిప్రెషన్ మొదలయింది. సరిగా నిద్ర పట్టదు. పట్టిన కలత నిద్ర నిండా కలలు. ఫోన్ తీసున్నా ఆయన బతికుండేవాడా? తెలీదు. ఈ అపరాధ భావన మాత్రం ఉండేది కాదేమో. అదీ తెలీదు. తెలిసిందొక్కటే - ఆయన లేడన్న సత్యం.

సత్యం. ఏది సత్యం? ఏదసత్యం?

'సత్యం అంటూ ఏదీ లేదు. ఉన్నవన్నీ దృక్కోణాలే. మనకు తెలీని కోణాలూ ఉన్నాయి' అంటాడు డాక్టర్. అతని కోణంలో నాన్న బ్రతికే ఉన్నాడు - మరెక్కడో.

'మన లోకంలో మీ నాన్న లేరు కానీ, వేరే లోకంలో ఎక్కడో బ్రతికే ఉన్నారాయన'

*'వాట్ డూ యూ మీన్, డాక్టర్?'*

'అర్ధం కాలేదా? ఫోన్ మీరు తీసి ఉంటే ఆయన బ్రతికేవారని బాధపడుతుంటారు కదా. అది ఇక్కడ - మనమున్న ఈ లోకంలో - జరిగింది. అదొక్కటే మీరు చూసిందీ, మీకు తెలిసిందీ. నిజానికి, ఆ ఫోన్ కాల్ వచ్చిన క్షణంలో మరో లోకం ఏర్పడింది. - ఆ లోకంలో మీరాయన ఫోన్ కాల్ అందుకున్నారు, ఆయన బ్రతికారు. ఆ ఇంకో లోకంలో ఆయన ఇప్పుడు కులాసాగా తిరుగుతుంటారు'

డాక్టర్ చెప్పింది సాధ్యమేనా? సాధ్యాసాధ్యాల సంగతేమో కానీ, ఆ ఊహ మాత్రం చాలా బాగుంది.

ఊహ అనేది ఆశావాదుల ఆవిష్కరణ కాబోలు. అందుకే వాటిలో అధికం అందంగానే ఉంటాయి. దేవుడూ అలాంటి ఊహేనా? అనునిత్యం మనల్ని కాపాడే మహాశక్తి ఏదో ఎక్కడో ఉందన్న అందమైన భావన మాత్రమేనా .. లేక దేవుడనేవాడు నిజంగానే ఉన్నాడా. ఉంటే, ఆయన ఆలకించే ప్రార్ధనలకన్నా వినిపించుకోనివే ఎక్కువెందుకు? చావబోతూ వేడుకున్నా అరుదుగా తప్ప కరుణించడెందుకు?

'ఎందుకంటే... ఇన్ని లక్షల కోట్ల విశ్వాలని మేనేజ్ చేసేవాడికి ప్రతి ప్రాణి కోరికలూ తీర్చేంత తీరికుండదు కాబట్టి, తీరికున్నా అవసరం లేదు కాబట్టి... ఒక్కో జీవికీ లక్షలాది నకళ్ళున్నాయి కాబట్టి, వాటిలో ఒకటి నశించినా పోయేదేమీ లేదు కాబట్టి. అంతకన్నా ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి దేవుడికి'

నా ప్రశ్నకి డాక్టర్ సమాధానం అది. దేవుడున్నాడనే డాక్టర్లనీ, సైంటిస్టులనీ చూస్తే నాకెప్పుడూ ఆశ్చర్యమేస్తుంది. సైన్సుకీ, దేవుడికీ చుక్కెదురని నా నమ్మకమేమో. నేను నాస్తికుడిని కాను, అలాగని ఆస్తికుడినీ కాదు. అవసరమైనప్పుడే దేవుడిని నమ్మే అవకాశవాదిని. దేవుడూ నాలాగే అవకాశవాది, హుండీలో డబ్బులేస్తేనే కోరికలు తీర్చే మెటీరియలిస్టు అనుకునేవాడినిన్నాళ్ళూ. డాక్టర్ మాటలు నాకు దేవుడి మరో కోణాన్ని పరిచయం చేశాయి. అతను చెప్పిందీ నిజమే కావచ్చనిపించింది.

(7:19 AM)

అపార్ట్‌మెంట్‌కి తాళమేసి ఎలివేటర్‌లో కిందికొస్తూ సెల్ ఫోన్‌లో సమయం చూసాను. ఇంకో గంటా పది నిమిషాలుంది. ట్రాఫిక్ జాం ఏదన్నా ఎదురైతే తప్ప, తేలిగ్గా పావు గంట ముందే వెళ్ళిపోవచ్చు.

నా కలల పీడ, అవి తెచ్చిపెట్టిన డిప్రెషన్ వదిలించుకోటానికి పది రోజుల క్రితం మొదటిసారిగా నా మేనేజర్ బలవంతమ్మీద కౌన్సిలింగ్ కోసం ఈ డాక్టర్ దగ్గరికెళ్ళాను. మొత్తం మూడు సెషన్స్ అవసరమౌతాయన్నాడతను. వాటిలో రెండు పూర్తయ్యాయి. ఇప్పుడు నేనెళుతుంది ఆఖరి దానికోసం. ఇందాకటి కలేమో నేనా చివరి సెషన్ ముగించుకుని వస్తున్నట్లు!

ఎలివేటర్లోంచి బయటికొచ్చి పార్కింగ్ గరాజ్‌లోకి నడిచాను. ఎలివేటర్ నుండి ఎనిమిదో లాట్ నాది.

కార్లో కూర్చుని ఇంజిన్ స్టార్ట్ చేస్తూ బ్రేక్ కిందకి నొక్కిపట్టాను. ఎందుకయిందో కానీ, అవసరం లేకున్నా అలా బ్రేక్ కిందకి నొక్కి ఇంజిన్ ఆన్ చెయ్యటం అలవాటయింది. బ్రేక్ పైనుండి మెల్లిగా పాదం తీసేస్తుండగా ఇందాకటి కల కళ్ళలో మెదిలింది. ఎవరతను? అతనికి సంబంధించినది ఏదో ఎక్కడో చూసిన ఫీలింగ్. ఏమిటది? బాగా ఎరిగినదే కానీ గుర్తుకురావటం లేదు .. తల విదిలిస్తూ బండి బయటికి తీశాను. రెండు నిమిషాల్లో కారు రోడ్డెక్కింది. రోడ్డు పక్కనే లోకల్ ట్రైన్ ట్రాక్స్ .. సమాంతరంగా సాగుతూ. అలా సాగి .. సాగి .. సుదూరంగా పట్టాలు రెండూ ఏకమౌతున్న భ్రమ కల్పిస్తూ.

అసంకల్పితంగా నవ్వొచ్చింది – సమాంతర రేఖలు కలవటం అన్న భ్రమకి. జరిగే పనేనా అది? వెంటనే డాక్టర్ మాటలు గుర్తొచ్చాయి.

'ఈ లోకంలో మనకి అసంభవమైనవిగా అనిపించేవి మరో లోకంలో అతి సాధారణం కావచ్చు – ఎందుకంటే అక్కడి భౌతిక నియమాలు మనమెరిగిన వాటికి భిన్నంగా ఉండొచ్చు'

మన ప్రపంచంలో కాకపోయినా, ఏదో ఒక పారలల్ యూనివర్స్‌లో సమాంతర రేఖలు కలవటం అతి సాధారణమైన విషయమన్న మాట.

పారలల్ యూనివర్సెస్! వింతగా అనిపించింది మొదటిసారి విన్నప్పుడు. లక్షల కోట్ల నక్షత్రాలు, గెలాక్సీలతో నిండి ఆదీ అంతమూ లేకుండా ఉండే ఈ ఒక్క విశ్వాన్ని అర్థం చేసుకోటమే నావల్ల కాని పని. ఇలాంటి విశ్వాలు ఇంకా లెక్కలేనన్ని ఉన్నాయని, అనుక్షణం ఇంకెన్నో పుట్టుకొస్తూనే ఉంటాయని మొదటిసారి విన్నప్పుడు తల తిరిగిపోయింది.

'సమాంతర విశ్వం... మరో ప్రపంచం అనీ అనుకోవచ్చు. మన విశ్వానికి సమాంతరంగా, అచ్చు ఇలాంటివే కానీ చిన్న చిన్న తేడాలతో మరి కొన్ని లక్షల కోట్ల విశ్వాలు ఉన్నాయి. తేడాలంటే – మనం ఊహించగలిగేవే కాక ఊహకందనివీ ఉండొచ్చు. ఉదాహరణకి, ఒక్కో విశ్వంలోనూ కాలం ఒక్కో వేగంతో నడవచ్చు. ఒక చోట క్షణం మరోచోట యుగం కావచ్చు. విశ్వాల్లోనూ మనకున్నట్లే భూమీ, సూర్యుడూ, సౌర కుటుంబం, పాలపుంత .. అన్నీ ఉన్నాయి. ఉత్తి అవే అనేమిటి, మీరూ, నేనూ కూడా ఉంటాం వాటిలో. ఈ లోకంలో మనకి అసంభవమైనవిగా అనిపించేవి మరో లోకంలో అతి సాధారణం కావచ్చు – ఎందుకంటే అక్కడి భౌతిక నియమాలు మనమెరిగిన వాటికి భిన్నంగా ఉండొచ్చు'

*'అంటే .. ఊహా లోకాలా డాక్టర్?'*

'ఊహూ. నిజమైన లోకాలే. మనం ఎంత నిజమో, అవీ అంత నిజం'

నిజం .. అంతకన్నా సాపేక్షమైనది మరొకటి లేదేమో. ఒకరికి నిజమైనది మరొకరికి అబద్ధం. ఏది నిఖార్సైన నిజం? పోనీ, ఏది నిజం కాదు? కలలు .. కలలు నిజం కావు, నిజమైనవి కావు .. నిజంగానే కావా? ఏమో. పోనీ అవి నిజమౌతాయా? కలలు నిజమౌతాయా?

'కలలు నిజమౌతాయా అంటే .. చెప్పలేం. నిజాలే కలలవుతాయని మాత్రం చెప్పగలం'

*'ఏంటో డాక్టర్.. తికమకగా ఉంది'*

'తికమకేం లేదిందులో. చాలా సింపుల్. మనకి అనేకానేక పారలల్ యూనివర్సెస్ ఉంటాయనుకున్నాం కదా. కలలనేవి వాటిలోకి తొంగిచూసే కిటికీల్లాంటివి. కలలో మీరేదో పని చేస్తున్నట్లు చూశారనుకోండి; నిజానికి మీరు చూస్తుంది మిమ్మల్ని కాదు – మీకున్న వేలకొద్దీ నకళ్ళలో ఒకదాన్ని. అంటే, మీరు కల అనుకునేది మీ నకళ్ళలో ఒకతని దినచర్య. అతనికి నిజమయిందే మీకు కలయ్యింది. అదీ సంగతి. ఇంతకీ మీరేమనుకుంటారు, కలలు నిజమవటం గురించి?'

నిజమౌతాయని కానీ, కావని కానీ నాకు స్థిరమైన నమ్మకాలేమీ లేవు. అనుమానాలు మాత్రం ఉన్నాయి. ఏదన్నా కలొచ్చినప్పుడు - ముఖ్యంగా పీడకల - అది నిజమైతే అన్న అనుమానం. దాని వెంబడి కించిత్ భయం. ఒకట్రెండు సార్లు నాకొచ్చిన కలలు నిజమయ్యాయి. అప్పట్నుండీ ఎప్పుడు పీడకలొచ్చినా అదెక్కడ నిజమౌతుందోనన్న అనుమానం. ఇప్పుడూ అలాంటి అనుమానమే. నేన్నిజంగానే యాక్సిడెంట్ చేస్తే? జైలు గది ఊహించుకోటానికీ ధైర్యం చాల్లేదు. డాక్టర్‌తో సెషన్ ముగించుకునొస్తూ హాస్పిటల్ ఎదురుగా యాక్సిడెంట్ చేసినట్లు కల. ఇప్పుడు వెళుతుందీ అక్కడకే.

ఎందుకన్నా మంచిది, జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యాలి.

**(7:30 AM)**

రెడ్ లైట్ పడటంతో కారాపాను. ఆలోచనల్లోనుండి బలవంతాన బయటికొస్తూ ఇంటర్‌సెక్షన్ ఇరువైపులా పరికించాను. జనం .. ఎక్కడ చూసినా జనం. తండోపతండాలుగా, మందలు మందలుగా. రేపు రాదేమో, అన్నీ ఇప్పుడే చేసెయ్యాలన్నంత ఆత్రంగా .. తోసుకుంటూ, పడుతూ లేస్తూ, పరుగులు తీస్తూ.. జనం. కోట్లాది పారలల్ యూనివర్సెస్‌లో ఈ హడావిడి లేని భూమండలం ఒక్కటైనా ఉంటుందా?

అన్ని కోట్ల విశ్వాల్లో దుమ్మూ ధూళీ కాలుష్యం, అసూయా ద్వేషాలు, అసమానతలూ అనుమానాలూ, రోగాలూ ఘోరాలూ, స్పర్ధలూ  యుద్ధాలూ .. ఇవేవీ లేని భూమండలమూ ఒకటుంటుందా? ఉండొచ్చేమో .. 'సంభావ్యత ఉన్నవన్నీ సంభవిస్తాయి.', డాక్టర్ మాటలు గుర్తొచ్చాయి. మరి యాక్సిడెంటూ సంభవించేనా?

విండో మీద ఎవరో తడుతున్న చప్పుడైంది. తల తిప్పి చూస్తే, ఆ కుర్రాడు. ఏడాది పైబడి రోజూ చూస్తున్నా అతని పేరేంటో తెలీదు. రోజూ ఇక్కడే కనిపిస్తాడు. ఆగిన కార్లు తుడుస్తాడు, ఆపై డ్రైవర్ కిటికీ దగ్గరికెళ్ళి చెయ్యి చాపుతాడు. ఏదన్నా ఇస్తే తీసుకుంటాడు, లేకపోతే లేదు. ఏమిచ్చినా ఇవ్వకపోయినా అదే నవ్వు అతని ముఖంలో. ఆ నవ్వులో .. ఏదో జాలి. అతనికీ అనేక లోకాలుంటాయా? వాటిలో ఏం చేస్తుంటాడో .. ఇలాగే కార్లు తుడుస్తుంటాడా, ఇంత ఆర్తిగానూ నవ్వుతాడా?

గ్రీన్ లైట్ పడింది. హడావిడిగా విండో దించి గ్లవ్ కంపార్ట్‌మెంట్ నుండి ఐదు రూపాయల నాణెం తీసి అతనికిస్తూ కారు ముందుకి కదిలించాను. అప్పటికే వెనకనుండి ఒకట్రెండు హారన్లు. కారు కదులుతుందని వెనక్కి జరగటంతో, నాణెం అందుకోలేకపోయాడతను. కింద పడిపోయింది. ఇంటర్ సెక్షన్ దాటేస్తూ రియర్ వ్యూ మిర్రర్‌లో చూస్తే  కుర్రాడు కిందకొంగి నాణెం ఏరుకోవటం కనిపించింది. ఏం పడుంటుంది - ఇక్కడ అచ్చైతే అక్కడ బొమ్మా, అక్కడ అచ్చైతే ఇక్కడ బొమ్మా?

'చెప్పండి. అచ్చా, బొమ్మా?'

'బొమ్మ'

'ఆల్‌రైట్... చూద్దాం ఏం పడిందో.. కంగ్రాట్స్, బొమ్మే. ఇలా టాస్ వేస్తే బొమ్మ పడటానికి ఎంత అవకాశముందో, అచ్చు పడటానికీ అంతే అవకాశముంది. ఫలితం మాత్రం ఒకే ఒకటి - ఐతే అచ్చు, లేకపోతే బొమ్మ. అవునా?'

*'అంతే కదా మరి'*

'ఒకవేళ అచ్చు, బొమ్మ రెండూ పడితే?'

*'అదెలా సాధ్యం డాక్టర్?'*

'సాధ్యమే .. బహుళ ప్రపంచాల సిద్ధాంతం ప్రకారం'

*'అదేం సిద్ధాంతం!'*

'మెనీ వర్ల్డ్స్ ఇంటర్ప్రెటేషన్ -ఎమ్‌డబ్ల్యూఐ. దాని ప్రకారం, నాణెం గాల్లోకి లేచిన క్షణంలో మనమున్న ఈ ప్రపంచం లాంటిదే మరో ప్రపంచం పుడుతుంది. రెండో ప్రపంచంలోనూ మనం ఉంటాం - ఇదే గదిలో, ఇదే సంభాషణ చేస్తూ. తేడా అల్లా అందులో టాస్ ఫలితం బొమ్మ కాకుండా అచ్చు వస్తుంది'

*'!!'*

'ఒకటికన్నా ఎక్కువ ఫలితాలొచ్చే సంభావ్యత ఉన్న ఏ సంఘటన జరిగినా అప్పుడు మరిన్ని కొత్త ప్రపంచాలు పుట్టుకొస్తాయి. ఒక్కో ప్రపంచంలో ఒక్కో ఫలితం చొప్పున అన్ని రకాల ఫలితాలూ ఎక్కడో ఒక చోట వస్తాయి. వాటిలో మనం ఏ ఫలితాన్ని చూస్తామనేది మనం ఉన్న ప్రపంచం మీద ఆధారపడి ఉంటుంది'

*'గందరగోళంగా ఉంది. సైన్స్ ఫిక్షన్ కథ వింటున్నట్లుంది'*

'ఫిక్షన్ కాదు. సిసలు సైన్సే. సూపర్ స్ట్రింగ్ థియరీ పేరు విన్నారా?'

*'??'*

'అయితే వివరాల్లోకొద్దులే. పాయింటేమిటంటే, మనం తీసుకునే ప్రతి నిర్ణయమూ కొత్త విశ్వాల పుట్టుకకి దారి తీస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే, సంభావ్యత ఉన్నవన్నీ సంభవిస్తాయి - ఒక్కోటీ ఒక్కో విశ్వంలో. పారలల్ యూనివర్సెస్ ఉన్నాయనే వాదనకి శాస్త్రవేత్తల ఆమోదం రానానూ పెరుగుతుంది. వాటి ఉనికి గురించిన ఆధారాలైతే ఇంకా ఏమీ దొరకలేదనుకోండి ..'

ఆధారాల ఆసరా లేనిదే దేన్నీ నమ్మకూడదా? మరి మత విశ్వాసాల మాటేమిటి? మతాల పునాది ఏ శాస్త్ర పరీక్షకీ నిలబడని పురాతన విశ్వాసాలేగా. వేల సంవత్సరాలుగా వందల కోట్ల మంది నమ్మిన విశ్వాసాలన్నిట్నీ ఆధారాల్లేవని కొట్టేయగలమా? గుడ్డిగా దేవుడి ఉనికిని నమ్మటానికి లేని సమస్య సైంటిఫిక్ థియరీలని నమ్మటానికి మాత్రం దేనికి? మల్టీవర్స్ థియరీని అంగీకరించటానికి, నమ్మటానికి అంతకన్నా ఎక్కువ తర్కం అవసరం పడలేదు నాకు.

**(8:00 AM)**

ట్రాఫిక్ జాం. ముందెక్కడో యాక్సిడెంటయిందట. ఎవరో కుర్రాడు, ఫుట్‌బోర్డింగ్ చేస్తూ జారి బస్సు కింద పడ్డాడట. ఇప్పుడే అంబులెన్స్ వెళ్ళింది సైరన్లు మోగించుకుంటూ. దెబ్బలు బాగానే తగిలాయట. ఉంటాడో పోతాడో.

పొద్దుటి కల మళ్ళీ గుర్తొచ్చింది. ఎవరో అతను! ఏదో ఫెమిలియారిటీ. ఏమిటది? ఇంతకీ సమయానికే బ్రేక్ కొట్టానా లేక ఆలస్యమయిందా? యాక్సిడెంటయితే .. ఉన్నాడా, పోయాడా?

పోవటం అంటే .. మనం తప్ప మిగతా అంతా ఉండటం అని ఎక్కడో చదివిన జ్ఞాపకం.

మనిషితో పాటే అతని జ్ఞాపకాలూ గతించి పోతాయా? ఒక జీవిత కాలంలో అతను సంపాదించిన విజ్ఞానమంతా అతనితోటే నశించిపోతుందా?

కాదనుకుంటా. కొన్ని రకాల పక్షులు శీతాకాలంలో వేలాది మైళ్ళ అవతలున్న ప్రదేశాలకి వలస పోతాయట. తాము జన్మలో ఎప్పుడూ వెళ్ళి ఎరగని ప్రాంతానికి అవి అంత తేలిగ్గా ఎలా ఎగిరెళ్ళగలుగుతాయో తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యమేసింది. ఆ పక్షి జాతి, ఆ ప్రాంతానికి సంబంధించిన తమ జ్ఞాపకాన్ని భద్రంగా జన్యువుల ద్వారా తమ తర్వాతి తరానికి చేరవేస్తుందట! ఈ జ్ఞాపకాల బదిలీ అనేదే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతానికి పునాది. ప్రాణులన్నీ తమ జీవిత కాలంలో నేర్చుకున్న అతి ముఖ్యమైన జ్ఞానాన్ని జన్యువుల్లో పొందుపరచి తర్వాతి తరాలకు బదిలీ చేస్తాయి. అది పనిగట్టుకు చేసే పని కాకపోయినా, అదలా జరిగిపోతుందంతే. కాబట్టి, జ్ఞాపకాలు గతించవు. అంటే - మరణం అనేది ఏ జీవికీ అంతం కాదు. అయినా దాని గురించి ఎందుకంత భయం?

హారన్ మోగటంతో ఆలోచనలకు అడ్డుకట్ట పడింది. ట్రాఫిక్ జాం క్లియర్ ఐనట్లుంది. వాహనాలు మెల్లిగా కదులుతున్నాయి. నేనూ కదలబోతుండగా, నా కారు వెనకనుండి కుడి వైపుగా దూసుకొచ్చిందో స్కూటీ. నన్ను కదలమన్నట్లు హారన్ కొట్టింది ఆ స్కూటీ నడుపుతున్న సుందరాంగే. గేర్లు మారుస్తూ ఆమెకేసి చూశాను. హెల్మెట్ లేకుండా టూవీలర్స్ నడిపేవాళ్ళని చూస్తే నాకు మామూలుగానైతే చిరాకేస్తుంది. ఈమెని చూస్తే మాత్రం ఆనందమేసింది. అందాన్ని చూస్తే కలిగే ఆనందం.

నేనలా రెప్ప వాల్చకుండా చూస్తుండగానే స్కూటీ సుందరి నాకేసి చూసింది. చూడగానే నవ్వింది. నవ్వాక తల తిప్పుకోలేదు; తదేకంగా నన్నే చూసింది. అలాగే చూస్తూ నా కారు దాటేసి ముందుకు సాగిపోయింది. ఆ చూపులో .. అదే భావం. రెండు నెలల్లో నాకు పలుమార్లు కొత్తవారితో ఎదురైన అనుభవం .... ఇప్పుడు మరోసారి ఎదురయింది.

ఆమె కళ్ళలో నన్ను గుర్తు పట్టిన భావం - డేజావూ.

'డేజావూ అనేది అందరికీ ఎప్పుడో ఒకప్పుడు, కొందరికి తరచూ ఎదురయ్యేదే. మీరొక్కరే అనుభవించే పరిస్థితి కాదది'

*'అది కలగటానికి కారణం?'*

'మెదడు చేసే మాయ. ఆ ప్రదేశాలకి మీరు నిజంగానే ఎప్పుడో - ఉదాహరణకి, బాగా చిన్నప్పుడు - వెళ్ళి ఉండొచ్చు. అయితే వాటి గురించి గుర్తుపెట్టుకోవాల్సినంత విశేషం ఏదీ లేకపోవటంతో మీ మెదడు వాటిని ఏ మారు మూల సొరుగుల్లోకో తోసేసి ఉండొచ్చు. ఇప్పుడు మీరు మళ్ళీ అక్కడికెళ్ళినప్పుడు ఆ జ్ఞాపకాలే బయటికి తీసి ఉండొచ్చు. ఇదొక వివరణ'

*'అంటే, ఇంకొక వివరణ కూడా ఉందా?'*

'ఉంది. ఎమ్‌డబ్ల్యూఐ ప్రకారం మనకి అనేక నకళ్ళు ఉంటాయనుకున్నాం కదా. వాటన్నిటి మెదళ్ళూ అనుసంధానమై ఉంటాయనేది ఓ ప్రతిపాదన. అదే నిజమైతే, ఏదో ఓ సమాంతర విశ్వంలో మీ నకళ్ళలో ఒకరు చూసే ప్రదేశాలూ, అతని జ్ఞాపకాలూ మీ మెదడు పొరల్లోకి లీక్ అవ్వచ్చు. కొన్నిసార్లు కొత్త ప్రదేశాలనీ, మనుషులనీ చూసినప్పుడు కలిగే ఫెమిలియర్ ఫీలింగ్‌కి కారణం ఇదే కావచ్చు. డేజావూకి ఇదొక వివరణ'

మరేదో ప్రపంచంలో స్కూటీ సుందరి నకళ్ళలో ఒకటి నా నకళ్ళలో ఒకర్ని కలిసిందన్న మాట. నేను ఆమెకి ఫెమిలియర్‌గా అనిపించటానికి అదీ కారణం! ఆ లోకంలో వాళ్ళిద్దరూ ఒకరికొకరు ఏమయ్యుంటారు... ప్రేమికులా?

ఆ ఊహకి నవ్వొచ్చింది. అంతలో నా గమ్యస్థానమూ వచ్చింది.

**(8:21 AM)**

హాస్పిటల్ యాభై గజాల దూరంలో ఉండగా వచ్చిందా ఆలోచన. కలలో యాక్సిడెంటయింది హాస్పిటల్ ఎదురుగా. ఎందుకైనా మంచిది, ఇక్కడే పార్క్ చేసి నడిచి వెళితే?

రోడ్డువారగా కారాపి కిందకి దిగాను. లాక్ చేస్తూ టైం చూసుకున్నాను. ఇంకా తొమ్మిది నిమిషాలే ఉంది. ఇదే ఆఖరి సెషన్. ఉదయం ఎనిమిదికి ఒక స్లాట్, ఎనిమిదిన్నరకి మరొక స్లాట్ ఉన్నాయంటే ఈ టైమ్ ఎంచుకున్నాను. ఈ రోజేవో టెస్టులు చేసి అవసరమైతే మందులవీ రాసిస్తానన్నాడు - డిప్రెషన్ తగ్గటానికీ... నిద్ర పట్టటానికీ.

నిద్ర .. కల .. కలలో తెరుచుకున్న కిటికీ .. నా మరో ప్రపంచానికి. అందులో నేను కారు నడుపుతున్నాను. హాస్పిటల్ నుండి బయటికొస్తున్నాను. సెల్ ఫోన్ మోగింది. కారుకెవరో అడ్డొచ్చారు. బలంగా బ్రేక్ నొక్కాను ..

హాస్పిటల్ గేటులోకి అడుగు పెడుతూ, జనవరి ఉదయపు చలి కాచుకోటానికి లెదర్ జాకెట్ జేబుల్లో చేతులు పెట్టుకోబోతుండగా గుర్తొచ్చిందది. అతనికి సంబంధించినదాన్ని దేన్నో చూసిన ఫీలింగ్. నే తొడుక్కున్న జాకెట్, ఇదే జాకెట్.

మెరుపు మెరిసింది. కారుకి అడ్డం పడింది ఎవరో కాదు, నేనే!!

'మనం తీసుకునే ప్రతి నిర్ణయమూ కొన్ని కొత్త విశ్వాల పుట్టుకకి దారి తీస్తుంది'

డెసిషన్స్, డెసిషన్స్ ..

ఊగిసలాడి తీసుకున్న నిర్ణయం - ఈ రోజు ఎనిమిదికి బదులు ఎనిమిదిన్నరకి అపాయింట్ మెంట్ తీసుకోవాలన్నది.

మరో ప్రపంచంలో నేను ఎనిమిదింటికే డాక్టర్ దగ్గరికెళ్ళి ఇప్పుడు తిరిగొస్తున్నానా?

మొట్టమొదటి సెషన్‌లో డాక్టర్ చెప్పింది గుర్తొచ్చింది చప్పున.

'కలలో మీరేదో పని చేస్తున్నట్లు చూశారనుకోండి; నిజానికి మీరు చూస్తుంది మిమ్మల్ని కాదు - మీకున్న వేలకొద్దీ నకళ్ళలో ఒకదాన్ని. అంటే, మీరు కల అనుకునేది మీ నకళ్ళ లో ఒకతని దినచర్య. అతనికి నిజమయిందే మీకు కలయ్యింది'

అంటే .. కలలో కారు నడుపుతుంది నేను కాదు, నా నకలు!

చిన్నగా మొదలైన అనుమానం. జిగ్‌సా పజిల్‌లో ముక్కలు వాటంతటవే ఓ చోట చేరుతున్నట్లు... అందాకా అస్పష్టంగా సాగిన ఆలోచనలు వేగంగా ఓ రూపు దిద్దుకోనారంభించాయి.

సమాంతర రేఖలు కలిసే అవకాశం ఉన్నప్పుడు సమాంతర విశ్వాలు ఢీకొనే అవకాశమూ ఉండాలిగా! ఆ లోకం ఈ లోకంతో ఢీకొంటే? ఆ నేను ఈ నాకు ఎదురు పడితే?

క్షణకాలం నా బుర్ర తిరిగింది. అర్ధమయ్యీ కాని అయోమయం. నా నకలు నన్ను ఢీకొనటమే నేను చూశానా? అదెలా సాధ్యం? నేనా కలగన్నది మూడు గంటల క్రితం. అక్కడ అది ఆల్‌రెడీ జరిగిపోయింది, ఇక్కడ ఇంకా జరగలేదు!

ఎక్కడో లెక్క తేలటం లేదు .. అంతలోనే వెలిగిందది.

కలలో .. బ్రేక్ వెయ్యగానే మెలకువ వచ్చేసింది నాకు. తర్వాతేమయిందో నేను చూడలేదు. ఆ తర్వాత యాక్సిడెంట్ అయితే గియితే దానికో అర క్షణమన్నా టైముంది.

'ఒక్కో విశ్వంలోనూ కాలం ఒక్కో వేగంతో నడవచ్చు. ఒక చోట క్షణం మరోచోట యుగం కావచ్చు'

అరక్షణం ఈజ్ ఈక్వల్ టు మూడు గంటలు.

పజిల్ పూర్తయింది.

డామిట్. ఇప్పటిదాకా ఇదెందుకు తట్టలేదు?

అంతలో .... చెవులు చిల్లులుపడే శబ్దం. ఆలోచనల్లో పడి తలొంచుకుని నడుస్తున్నవాడిని, కంగారుగా తలెత్తి చూడబోయాను. అప్పటికే ఆలస్యమయింది. కీచుమంటూ పడ్డ బ్రేకులు. నా కారు లాంటి కారే... గాల్లోనుండి ఊడిపడ్డట్లు వేగంగా వచ్చి ఢీకొంది.

జరుగుతుంది అర్ధం కాకముందే ఆరడుగుల పైగా గాల్లో ఉన్నాను. తలకిందులుగా కిందికొస్తుండగా అర్ధమయింది - ఇక్కడ మిగలబోయేదిక నా జ్ఞాపకాలేనని. దేవుడు గుర్తొచ్చాడు, కానీ వేడుకోవాలనిపించలేదు - ఆయన లెక్కలు వేరన్న గ్రహింపుతోనేమో.

ఆ క్షణం .. వళ్ళు తేలికయింది, మనసు భారమయింది. అయినా వింతగా ఆ క్షణం .. భయంగా అనిపించలేదు, బాధగానూ అనిపించలేదు. బాదరబందీలేవీ గుర్తుకు రాలేదు. తర్వాతేమిటనే ఆలోచన లేదు. జీవితం ఇంతటితో ముగిసిపోలేదు. బ్రతికి ఉండటమే ముఖ్యం, ఎక్కడుంటానన్నది కాదు. ఎక్కడో ఓ చోట నేనుంటాననే భావన .. అది తెచ్చిన ప్రశాంతత ఆవరిస్తుండగా - ఆ రోజు జరిగినవన్నీ ఒక్క లిప్తలో నా మదిలో మెదిలాయి.

ఈ ప్రపంచంలో నాకదే ఆఖరిజ్ఞాప్... (రచయిత వివరాలు: anil.s.royal@gmail.com ; AnilRoyal.wordpress.com)

# యత్ర నార్యస్తు పూజ్యంతే

డా.సుధా నిట్టల

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో
'నా మొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

**"కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే"** ఫోనులో రింగ్ టోను మోగుతోంది. నాన్నగారు పలుకుతారని చూస్తూ కిటికినుండి బయటకు చూసాను. అప్పుడే ఆకులు రాల్చిన చెట్లు మరల కొత్త చివురులతో కళ కళ లాడుతున్నాయి. ప్రకృతి ఎంత పద్ధతిగా తన పని తను చేసికొంటుంది, అని నాకు ఎప్పటికి కూడా ఆశ్చర్యమే!

"హలో" అవతల నాన్న గొంతు.

"నాన్నా, ఎలా ఉన్నారు?" అడిగాను.

"మేము బాగున్నాము గాని, నువ్వెలా ఉన్నావు?" నాన్న గొంతులో ఎప్పటిలాంటి మార్దవం.

"బాగున్నాను నాన్న. అమ్మ ఏమి చేస్తోంది?" నవ్వుతు అడిగాను.

"ఏముంది, ఎప్పుడు వంటిల్లె ఆమెకు లోకం కదా, అక్కడే ఏదో సర్దుతోంది." నాన్న మాటల్లో సన్నగా నవ్వుతున్న ధ్వని.

"నువ్వు చెప్పు, చదువు ఎలా సాగుతుంది? ప్రాజెక్ట్ ఎప్పటికి అవుతుంది? నువ్వు ఎప్పుడు వస్తావు అని మీ అమ్మ నా ప్రాణాలు తోడేస్తోంది." నాన్న అడిగారు.

అమ్మ నాన్న బుర్ర ఎలా నములుతుందో నాకు తెలియకనా?

"మరో రెండు నెలలు నాన్నా, దాంతో అయిపోతుంది. అయితే, ఇప్పుడే నాకు రెండు మూడు కాల్ లెటర్స్ వచ్చి ఉన్నాయి. ఇంకా ఏమి అనుకోలేదు" అమ్మ దగ్గర లేనప్పుడే నాన్న చెవిలో వేయాలి, లేకపోతె నానా రభస అయిపోతుంది.

"ఆఫర్ బాగుంటే ఒప్పేసుకో " నాన్న అన్నారు.

"అమ్మ సంగతి" నసిగాను నేను.

"దాన్ని నేను సముదాయిస్తాలే " నాన్న భరోసా ఇచారు

"ఎవర్ని సముదాయిచ్చేది, ఎవరితో మాట్లాడుతున్నారు?" అమ్మ గొంతు వినిపించింది.

"ఇదిగో, అమ్మ వచ్చింది, మాట్లాడు" అంటూ, "నీ ముద్దుల కొడుకు, అక్కడ అప్పుడే ఉద్యోగం వచ్చిందట, ఇంకా చదువే కాలేదు, అపుడే ఉద్యోగం వచ్చిందని మిగత స్నేహితులు కుళ్ళుకుంటున్నారంట. అందుకే ఉద్యోగం వద్దు, ఏమి వద్దు, నువ్వు వచ్చేయి అని సముదయిస్తున్నాను" నాన్న చాలా లౌక్యంగా అమ్మ చెవిలో విషయం వేసేసాడు.

పాతికేళ్ళ సంసార జీవితంలో అమ్మ బలాలు బలహీనతలు నాన్నకి కాక ఎవరికీ తెలుస్తాయి?

నాన్న వేసిన గోళి సరిగ్గా పడింది. "అయ్యో, ఎవరో కుళ్ళుకుంటారని మన అవకాశాలు మనం వదిలేస్తామా ఏంటి? మీ నాయనకి ఏమి తెలిదు కాని, ఉద్యోగం మంచిదయితే, చేరిపో కన్నా" అమ్మ చాలా ఉదారంగా పర్మిషన్ ఇచ్చేసింది. పక్కనే ఉన్న నాన్న పెదాల మీద సన్నని నవ్వు నాకు స్పష్టంగానే కనిపించింది, నాది వీడియో ఫోన్ కాకపోయినా!

"అలా అయితే నీ కొడుకు మరో అయిదేళ్ళు రాలేడు తెలుసా! " నాన్న అమ్మకి వివరించాడు.

"అదేమీ లేదమ్మా, ఈ చదువు ముగిసి ఉద్యోగంలో చేరేటప్పుడు కొన్ని రోజులు ఇండియా వచ్చి ఉంటాను" నేను అమ్మకి భరోసా ఇచ్చాను.

ఆ సరికి అమ్మకి ఆందోళన తగ్గింది. నా భోజనం గురించి, పడక గురించి, బయట తిరగడం గురించి, ఇలా అనేకమైన జాగ్రత్తలు చెప్పింది. అమ్మ, నాన్నల మధ్య అవగాహన గురించి ఆలోచిస్తూ అమ్మ మాటలు కొన్ని మిస్ అయ్యాను.

"అయితే నువ్వు వచ్చేసరికి వాళ్ళని సిద్దంగా ఉండమని చెప్పనా?" అమ్మ అడుగుతోంది.

"ఎవరిని అమ్మా, నాకు సరిగ్గా వినిపించలేదు?" అడిగాను.

"అదేరా, శాస్త్రిగారు మంచి సంబంధం తెచ్చారు. వాళ్ళు నువ్వు ఎప్పుడు వస్తావా అని చూస్తున్నారు. అమ్మాయి కుందనపు బొమ్మంటే నమ్ము. బాగానే చదువుకుంది కూడా. నీకు సరిపోయే చదువే అని నాన్న కూడా అన్నారు. ఆస్తిపాస్తులు కూడా బాగానే ఉన్నాయి. అన్నివిధాలా బాగుంది. మరి నువ్వేమంటావు?" అమ్మ ఆత్రుతగా అడిగింది.

నాన్న కూడా విని సరే అన్నాక నేను అనేది ఏముంది? కాని నాలో ఏదో సంకోచం.

"చూద్దాములే అమ్మా! ఇంకా టైం ఉంది కదా. నాన్నకి ఇవ్వు ఒకసారి" అడిగాను.

"మీరు కూడా చెప్పండి వాడు మీమాట కాదనడు" అమ్మ నాన్నకి చెప్పడం నాకు వినిపిస్తోంది. నవ్వొచ్చింది, అప్పటికి అమ్మ మాట కాదన్నట్లు!

"నాన్నా.. అమ్మ చెప్పేది ఏంటి? మీరు చూసారా?" నాన్నని సూటిగా అడిగాను.

"శాస్త్రిగారు రెండు మూడు సంబంధాలు తెచ్చారురా. కాని ఈ కుటుంబం, అమ్మాయి కూడా బాగున్నట్టు ఉంది. అయిన నీ ఇష్టమే సుమా! నిన్నేమి బలవంత పెట్టం.. సరేనా?" నాన్న నచ్చచెప్పారు.

"అది కాదు నాన్నా, నేను ఉద్యోగంలో చేరాకనే పెళ్ళి. అంతకు మించి మరో అభ్యంతరం లేదు. మీరు ఎవరిని చూసిన సరే!" నాన్నకి స్పష్టంగా చెప్పాను.

"సరే, సరే దాని గురించి వర్రీ అవ్వకు, చదువు సంగతి చూసుకో" నాన్న చెప్పారు.

తరువాత కబురు, ఈ కబురు తో మాటలు ముగించాము. అప్పటికి నాకు అమెరికాలో టైం సాయంత్రం ఏడున్నర. ఇక ప్రాజెక్ట్ గురించి పని చేసుకోవాలి అనుకుంటూ లేచాను. అంతలోనే మరల ఫోన్ మోగింది.

"హాయ్ మామా, ఏంటి బిజీనా?" అటునుండి శశి గొంతు.

శశికాంత్ రెడ్డి నాకు ఒక సెమిస్టరు సీనియర్ గాని కొన్ని పరిక్షలు ఫెయిల్ అవ్వడం వల్ల నాతో కలిసాడు. అమెరికా వచ్చింది ఎంజాయ్ చేయడానికి అన్నట్లు ఉంటాడు. ఎప్పుడు సిగరెట్స్, డ్రింక్స్, అమ్మాయిలతో తిరుగుతాడు. కాకపోతే ఎవరికైనా ఏదైనా హెల్ప్ అంటే ముందుంటాడు. అందుకే ఫ్రెండ్స్ బాగానే ఉంటారు. అదీ కాక, మా జిల్లా వాడే అయ్యేసరికి ఇంకా నాతో క్లోజ్‌గ ఉంటాడు.

"ప్రాజెక్ట్ వర్క్ మామా !"

"అరె ప్రాజెక్ట్ అని, పని అని అస్తమాను తిరిగితే లైఫ్ ఎప్పుడు ఎంజాయ్ చేస్తావు మామా, లాభంలేదు కాని వెంటనే బయలు దేరి నీ ఫ్లాట్ స్పోర్ట్స్ పక్కనే ఉన్న టెలిఫోన్ బార్‌కి వచ్చేయి. అందరం అక్కడే ఉన్నాము" నేను చెప్పేది వినకుండా ఫోన్ కట్ చేసాడు.

ముందు వెళ్ళద్దు అనుకున్నాను కాని, రోజంతా రూం లోనే ఉండి నాకు కూడా విసుగ్గా ఉంది.

మరో అయిదు నిమిషాల్లో బార్ లో ఉన్నాను.

నిండా జనాలతో, వాళ్ళు వదులుతున్న సిగరెట్ పొగలతో, బాటిల్స్, గ్లాసెస్ చప్పుళ్ళతో కోలాహలంగా ఉంది. అది వీకెండ్ అవడం వల్ల మరీ జనం ఎక్కువ ఉన్నారు. మావాడి గ్యాంగ్ ఎక్కడ ఉందో కనిపించక వెతుకుతుంటే గట్టిగా ఈల! వెంటనే " మామా.. ఇక్కడ" అంటూ శశి గొంతు వినిపించాయి. అక్కడ ఒక టేబుల్ నిండుగా అమ్మాయిలు అబ్బాయిలతో శశి కులాసాగా ఉన్నాడు. నేను జాగ్రత్తగా మిగతా టేబుల్ మధ్య నుండి దారి చూసుకుంటూ, ఎవరిని కదపకుండా, పద్మవ్యూహం ఛేదించిన స్టైల్‌లో వాళ్ళ టేబుల్ చేరాను. ఇక్కడ వీకెండ్ లో చిన్ని చిన్ని విషయాలకు కూడా తగాదాలు అవుతాయి, మరి టైం పాస్ కో, లేక అదో సరదానో నాకు ఈ మూడేళ్ళలో అర్థంకాలేదు

"హాయ్ మామా, రారా.. వీకెండ్ లో పని అని గదిలో ఉండడం చాల బాడ్ మానర్స్ మామా, రా.. ఏవి పుచ్చుకుంటావు?" శశి అడిగాడు.

"బీర్ చాలు మామా" చెపుతూ ఒక చైర్ లాగి కూర్చున్నాను.

"ఇంతకాలమైన బీర్ నుండి నువ్వు పైకి ఎదగలేదు మామా, వేరి బాడ్" నా బీర్ కోసం ఆర్డర్ ఇచ్చి విచారం వెలిబుచ్చాడు శశి.

నవ్వేసి ఊరకున్నాను. శశితో ఉన్న వాళ్ళంతా నాకు తెలిసిన వాళ్ళే. అందరిని పలకరించాను. శశిని ఆనుకుని కూర్చున్న అమ్మాయి క్రిస్టి. శశి వచ్చిన మొదట్లో పరిచయం, ఇంకా సాగుతోంది. ఆ అమ్మాయి చదువు ముగించేసి ఉద్యోగం కూడా చేస్తోంది. శశికి ఇంటినుండి వచ్చే దానికన్నా, క్రిస్టి ఇచ్చేదే ఎక్కువ. అది అందరికి తెలుసు. పెళ్ళికాలేదు తప్ప, వాళ్ళు భార్య భర్తలలాగే ఉంటారు.

ఇవ్వాళా క్రిస్టితోపాటు మరో కొత్త అమ్మాయి ఉంది. "అరె మామ క్రిస్టి friend రా, కాథి, kaatherine ". పరిచయం చేసాడు శశి.

"హాయ్!"ఆమెకి చేయి ఇచ్చి మర్యాదగా పలకరించాను. కాథీ చక్కగా ఉంది, అంటే అందం అని కాదు, కాని మిగ తా అమ్మాయిలలాగా కాకుండా ఏదో తేడాగా ఉంది. ఎందుకో అమ్మాయిని చూస్తే పక్కింటి తెలుగమ్మాయిని చూసినట్టుంది. ఒద్దికగా ఒక హుందాతనం ఉట్టిపడుతూ!

శశి, క్రిస్టి చాల చనువుగా ఉంటుంటే ఆ అమ్మాయి కొంచెం ఇబ్బంది పడినట్టు అనిపించింది. కాని అమెరికా అమ్మాయిల కిలాంటి పట్టింపులు ఉండవు కదా!

"ఏమి చదువుతున్నారు?" ఆమె అడిగింది. చెప్పాను. "ఓహో, శశి క్లాస్‌మేట్ అన్నమాట" సంభాషణ ఇంగ్లీష్‌లో సాగుతోంది. కాని శశి పేరు పలికినప్పుడు ఆమె గొంతులో తేలిక స్వరం నాకు బాగానే తెలిసింది. శశికి కాంపస్‌లో ఉన్న చెడ్డ పేరు అందరికి తెలుసు, అతని ఫ్రెండ్ కాబట్టి నన్ను కూడా అలానే అనుకుంటుంది కాబోలు అని మనసులో కొంచెం కష్టం అనిపించింది.

ఆమె చేతిలో గ్లాస్ చూసాను, రష్యన్‌వోడ్కా! ఇంట్రెస్టింగ్, క్రిస్టితో ఉంటుంది కాబట్టి అలాంటి అలవాట్లే, కాని ఎందుకో మరల నా మనసు ఒప్పుకోలేదు.

"మామా, కావాలంటే లైన్ వేసుకో, పిట్ట వలలో పడొచ్చు" శశి కన్ను గీటుతూ శుద్ధ తెలుగులో అన్నాడు. అతని ఉద్దేశ్యం అర్థమైంది కాని, నాకలాంటి ఆలోచన లేదు.

కాథీ మౌనంగా తన గ్లాస్ లోని వోడ్కా తాగుతోంది. మిగతా అందరు ఎవరి గోలలో వాళ్ళు ఉన్నారు. ఎక్కువ, కాదు కాదు, అసలు మాట్లాడనిది బహుశ నేను, కాథీ నే గాబోలు.

"మీరేమి చదువుతున్నారు?" నేను అడిగాను. " ఫోరెన్సిక్ సైన్సెస్, చదువు అయిపోయింది, Internship చేస్తున్నాను" చెప్పింది. మంచి చదువు, ఇంకా మంచి ఉద్యోగ అవకాశాలు!

అందరు కంప్యూటర్స్ అని ఎగబడుతున్న రోజుల్లో ఆ అమ్మాయి ఈ చదువు చదవడం నాకు మంచిగా అనిపించింది.

"మంచి సబ్జెక్టు, గుడ్ సెలక్షన్" అప్రయత్నంగా చెప్పాను.

"థాంక్యూ" ఈసారి ఆమె కళ్ళల్లో కొంచెం తేడా అనిపించింది. బహుశ నా కామెంట్ ఆమెకి నచ్చిందనుకుంటా!

"మామా, నేను క్రిస్టితో వెళుతున్నా, రాత్రికి అక్కడే! నీకుకూడ పిట్ట పడితే జల్సా చేయి. మరల సోమవారం కలుద్దాము" శశి చెపుతూనే లేచి క్రిస్టిని తీసుకోని వెళిపోయాడు.

క్రిస్టి చాల మాములుగా కాథికి బై చెప్పి వెళ్ళిపోయింది. నాకు ఇబ్బందిగా అనిపించింది. శశి కదలడంతో మిగత మూక కూడా వెళ్ళిపోయారు. ఇక నేను, కాథి మిగిలాము.

"నేను వెళతాను, మీరు ఎక్కడికి వెళ్ళాలి?" మర్యాదకి అడిగాను. ఆడపిల్లని వంటరిగా వదిలి వెళ్ళే సాంప్రదాయం మనది కాదు కదా!

"నేను వెళ్ళగలను, పరవాలేదు" తన బాగ్ తీసుకుంటూ అన్నది, కాని ఆమె కళ్ళల్లోని కలవరం నా దృష్టిని దాటలేదు.

"రండి కాబ్ చూద్దాం" అంటూ ఆమెతో బయటకు నడిచాను.

ఇద్దరం మౌనంగా ఫుట్ పాత్ మీద నడవసాగాము. " ఇండియాలో ఎవరు ఉంటారు" కాథి అడిగింది.

"అమ్మ. నాన్న" చెప్పాను.

"తోబుట్టువులు?" మరల అడిగింది.

"ఒక చెల్లి ఉండేది, చిన్నప్పుడే జబ్బు చేసి చని పోయింది" చెల్లి చని పోయి దగ్గర దగ్గర పదిహేను ఏళ్ళు అవుతున్నా, ఆమె గురించి మాట్లాడాలంటే నాకు గొంతు పెగలదు.

"సారీ!" నా చేయి పట్టుకుని కళ్ళలోకి చూస్తూ అంది కాథి.

నా హృదయ వేదనని తను అంత చక్కగా అర్థం చేసుకుంటుందని నేను అనుకోలేదు.

"మీరు?" అడిగాను.

"నేను ఒక్కదాన్నే సంతానం. అమ్మ, నాన్న ఇంకా పనులు చేసుకుంటున్నారు. అమ్మ మెడికల్ సైడ్, నాన్న సంగీతకారుడు. సంపాదన తక్కువే కాని నన్ను ఎలాంటి లోటు లేకుండా పెంచారు." కుటుంబ విషయాలు చెపుతున్నపుడు ఆమె ముఖంలో ఏంటో తృప్తి.

తన కుటుంబంతో తనకి మంచి బంధం ఉందని అనిపించింది.

"మరి ఇప్పుడు వోడ్కా తాగి వెళుతున్నారు కదా, ఇంట్లో ఏమి అనరా?" అప్రయత్నంగా అడిగాను.

ఆమె చిన్నగా నవ్వింది. "మా దేశంలో అలవాట్లు వేరు కదా! ఇక్కడ చలిని తట్టుకునేందుకు అవి తాగడం తప్పని సరి. అలా అని మోతాదు మించిదే, ఏదైనా ప్రమాదమే కదా!" చిన్న పిల్లాడికి చెప్పినట్టు చెప్పింది.

"తాగడం తప్పు కాదు సరే, మరి అబ్బాయిలతో తిరగడం?" నాకు తెలియకుండానే, నా గొంతులో ఉక్రోషం ధ్వనించింది.

మరల నవ్వింది కాథి, "ఇందాకే చేప్పాను కదా, ఏదైనా ఎక్కువగా చేయడం మంచిది కాదు, అది అన్నిటికి వర్తిస్తుంది"

"అయితే, ఇప్పుడు నువ్వు నాతో నా గదికి వస్తావా?" నాలో ఏదో తెలీని పంతం పెరుగుతుంది.

నడుస్తోంది కాస్త కాథి ఆగిపోయింది. నాలో భయం మొదలైంది, కొంపదీసి చెంప పగలుకొడుతుందా?

ఒకసారి నా ముఖంలోకి దీర్ఘంగా చూసింది. చిన్నగా నవ్వుతూ "నువ్వు అలా అడిగినందుకు చాల సిగ్గుపడుతున్నావు, అంటే నీలో అలాంటి భావాలూ లేవు, కాని ఏదో ఆవేశంలో అలా అడిగావు, అది నీ కుటుంబంలో నువ్వు నేర్చుకున్న క్రమశిక్షణ ."

నాలో ఉక్రోషం చప్పగా చల్లారిపోయింది.

"నువ్వు శశితో ఉంటావు అంటే నేను నిన్ను చులకనగా చూసాను, నిజమే, నన్ను క్షమించు, కాని మనం కలిసి ఉండే మనుషులని బట్టి మనలని అంచనా వేస్తారు కదా!" నచ్చచెప్పినట్టు అంది.

"కాని నేను నిన్ను అలా తక్కువ చేయలేదు, నువ్వు క్రిస్టితో ఉన్నా కూడా!" నా వాదన నాకే బలహీనంగా అనిపించింది

కాథి ఏమి మాట్లాడలేదు కాని, తను నన్ను బాగానే అర్థం చేసుకుంది అనిపించింది..

ఇంతలో కాబ్ దొరికింది. "బై, నిన్ను కలవడం బాగుంది" చేయి ఊపి వెళ్ళిపోయింది.

ఫ్లాట్ చేరాకా కూడా కాథి గురించే ఆలోచించాను.

తరువాత వారంలో శశి ఫోన్‌లోనే తప్ప కలవలేదు.

ఒకరోజు, నేను లైబ్రరీలో ఉన్నపుడు ఫోన్ వచ్చింది, శశి నుండి.

"మామా. అర్జెంటుగ ఇండియా వెళుతున్నానురా, సారీ, నీకు ముందు చెప్పే టైం దొరకలేదు." శశి హడావిడిగా చెపుతున్నాడు.

"ఏమిటి అంత అర్జెంటు?" ఆశ్చర్యంగా అడిగాను. అమెరికాలో ఉండే వాళ్ళు ఇండియా వెళ్ళడం ఎంత ప్రహసనంగా చేస్తారో నాకు తెలుసు కదా! అలాంటిది శశి అంత హ ఠాత్తుగా వెళ్ళడం, నా మనసు కీడు శంకించింది. "శశి, ఏమన్నా అయిందా? మీ వాళ్ళంతా బాగున్నారా?"ఆత్రుతగా అడిగాను.

"అదేమీ లేదు మామా, నాకు పెళ్ళి కుదిరింది, అందుకే హడావిడి" నవ్వుతూ అంటున్నాడు శశి.

పక్కలో బాంబు పేలినట్లు అదిరిపడ్డాను. పెళ్ళా?

"నిజమేనా?" సరదాకి అంటున్నాడేమో అని అడిగాను.

"నిజమే మామా, పెళ్ళి విషయంలో వేళాకోళం ఏంటి?" ఎదురు ప్రశ్నించాడు.

"మరి క్రిస్టి సంగతి?" అయోమయంగా అడిగాను.

"ఓహ్ కమాన్ మామా, క్రిస్టి ఇక్కడ కాలక్షేపం కోసం. కొన్ని రోజులు ఎంజాయ్ చేసాం, అంతే. అన్నట్లు, ఈ పెళ్ళి సంగతి క్రిస్టికి నువ్వు చెప్పకు, నేను వచ్చి చెపుతాలే, బై రా మామా " ఫోన్ కట్ అయింది.

నాకు ఇంకా బుర్ర తిరుగుతుంది. ఇదేంటి, శశి ఇలా చేసాడు?

పాపం క్రిస్టి, శశి తోనే లోకం అన్నట్లు ఉంటుంది కదా!

తరువాత చాల రోజుల వరకు క్రిస్టి ఆలోచన నన్ను వేధించింది. క్రిస్టి కన్నా కూడా, కాథి ఎలా రియాక్ట్ అవుతుందో అనిపించింది.

క్రిస్టి కనిపిస్తుంది అనుకున్న ప్రదేశాలకి వెళ్ళడం మానేసాను.

కాని, ఒక రోజు క్రిస్టినే నన్ను వెతుక్కుంటూ వచ్చింది. నాకు తెలియకుండానే, నేను భయ పడ్డాను

"హాయ్, శశి కనిపించటం లేదు, నీకు తెలుసా? ఎక్కడికైనా వెళ్ళాడా?" అమ్మాయి ఆత్రుతగా అడుగుతుంటే నాకు గిల్టీ గా అనిపించింది.

"ఓహ్, తను చాల హడావిడిగా ఇండియా వెళ్ళాడు, మీకు చెప్పలేదా?" తెలినట్లే అడిగాను.

"ఇండియానా?" క్రిస్టి కళ్ళల్లో ఏదో భయం కదిలింది. "ఎందుకు వెళ్ళాడో తెలుసా??" మరల అడిగింది.

"నేనే మిమ్మల్ని అడగాలి అనుకున్నాను, నాకు కూడా చెప్పలేదు" అడ్డంగా బొంకాను, కాని లోపల నా ఆత్మ ఘోషిస్తోంది.

"చెప్పలేదు, ఫోన్ కూడా పనిచేయట్లేదు. మీకు తెలుస్తుందని వచ్చాను" క్రిస్టి ముఖంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

"మరల ఇక్కడికి వస్తాడు కదా?" అడిగింది. ఇక రాడు అని భయం కాబోలు.

"వస్తాడు, ఇంకా పరీక్షలు రాయాలి కదా! ప్రాజెక్ట్ కూడా చేయాలి, తప్పక వస్తాడు" ఆమెకి చెప్పాను కాని, వచ్చాక నిన్ను పక్కన పెడతాడు అని చెప్పలేక పోయాను.

క్రిష్టి వెళ్ళిపోతుంటే, నాకు బాధగా అనిపించింది. శశి చాల తప్పు చేసాడు. ఆమెను పెళ్ళి చేసికోని దానికి ఎందుకు ఆశ పెట్టాలి?

తరువాత పది రోజులకి కాథి వచ్చింది. "హాయ్" ఆమెను చూసి నాకెందుకో సంతోషంగా అనిపించింది.

"శశి ఇంకా రాడు కదా?" ఉపోద్ఘాతం లేకుండా సూటిగా అడిగింది.

తడబడ్డాను, "లేదు వస్తాడు" నా మాట నాకే వినిపించలేదు.

కొంతసేపు మౌనంగా ఉండిపోయింది. "ఎన్నోసార్లు చెప్పాను, అంత గుడ్డిగా నమ్మకు అని, క్రిష్టి వినలేదు" దూరంగా చూస్తూ అంది.

నాకేమి చెప్పాలో తెలిలేదు.

"నిజంగా వస్తాడా?" ఈ సారి నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది.

నాకెందుకో విషయం దాచాలని అనిపించలేదు. "వస్తాడు కాని, పెళ్ళి చేసికుని వస్తాడు" చెప్పేసాను. నా మనసు తేలిక పడింది. కాథి ముఖంలో ఏమి భావం కనిపించలేదు. తను ముందే ఉహించిది అనుకుంటా..

"థాంక్యూ. శశి ఫ్రెండ్ అయినా విషయం చెప్పావు." వెళ్ళడానికి సిద్దపడుతూ అంది.

"క్రిష్టికి ఏమి చెపుతావు?" అప్రయత్నంగా అడిగాను.

ఒకసారి నా ముఖంలోకి చూసి వెళ్ళిపోయింది..

తరవాత నా ప్రాజెక్ట్, కాంపస్ పనులతో కొన్ని రోజులు ఈ సంగతి మర్చి పోయాను.

ప్రాజెక్ట్ యాక్సెప్ట్ అవడం, నాకు మంచి అవకాశం రావడం వెనువెంటనే జరిగిపోయాయి.

కొత్త పని, కొత్త ప్రదేశంలో శశి సంగతి, క్రిష్టి, కాథి సంగతి పూర్తిగా మర్చిపోయాను.

బహుశ ఒక ఆరేడు నెలల తరువాత కాబోలు, వీకెండ్ మాల్‌కి వెళ్ళి ఇంట్లోకి సామాన్లు తీసుకుంటుంటే,

"అరే శశి, ఇటు రారా" అన్న తెలుగు మాటలు నా చెవిని పడ్డాయి.

చటుక్కున అటు చూసాను, ఆశ్చర్యం ! మా శశినే. కాని మనిషికి అసలు పోలికే లేదు. ముఖం అంత పీక్కు పోయి, జబ్బు పడ్డ వాడిలా ఉన్నాడు. దూరంగా ఉన్న ఒక లావుపాటి అమ్మాయి, వాడిని ఉరుముతూ చూస్తూ , "ఏమిటి దున్నపోతులా కదలవు? త్వరగా రా. ఇంకా అమ్మాయిలకోసం వెతుకుతున్నవా?. తోలు వలుస్తా బిడ్డ!" అంటూ భారంగా ముందుకి కదిలింది.

ఆమె వెనగ్గా కార్ట్ తోసుకుంట శశి మెల్లగా కదిలాడు. చేతిలో పాకెట్స్ వదిలి అటు పరుగెత్తాను. "మామా, మామా" రెండు సార్లు పిలిచాక వెనక్కి చూసాడు.

జీవం లేని కళ్ళల్లోకి ఒక వెలుగు వచ్చింది కాని వెంటనే వెలుగు స్థానంలో భయం చోటుచేసుకుంది. "మామా, నీ ఫోన్ నంబర్ ఇవ్వు, తరువాత మాట్లాడతా" హడావిడిగా, నా కార్డు జేబులో కుక్కుకొని పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు.

నాకు అంత అయోమయంగా అనిపించింది. ఏమయ్యింది, శశి అలా ఎందుకున్నాడు?

శశి దగ్గర నుండి ఫోన్ కోసం ఎదురు చూస్తున్నాను, వారం రోజుల తర్వాత వచ్చింది.

"శశి, ఏమయ్యింది? అలా ఉన్నావేమిటి?" నా ప్రశ్నలు ముగియక ముందే

" మా మా, త్వరగా, మాల్ ప్రక్కనున్న బార్‌కి రా రా" అంటూ ఫోన్ కట్ చేసాడు.

బార్‌లో శశిని చూస్తే అసలు పరిచయం ఉన్న మనిషిలా అనిపించలేదు. ఇదివరకు అలా బార్‌లో కలిసినపుడు ఎంత హడావిడి చేసేవాడు!

"శశీ.. ఏమయ్యింది ?" భుజం మీదా చెయ్యి వేసి అడిగాను.

ఒక్కసారి భోరుమన్నాడు. కంగారేసింది. "ఊరుకో, ఊరుకో, ఏమయ్యింది?" మరల అడిగాను.

కొంత సేపు ఏడ్చేసరికి భారం తీరినట్లుంది, కొంచెం తేరుకున్నాడు.

"నీ బ్రాండ్ తెప్పించనా?" అడిగాను.

"వద్దు మామా, నేను తాగటం లేదు" జీవం లేని నవ్వు నవ్వుతూ అన్నాడు.

నాకు దిమ్మ తిరిగింది. శశి తాగాటంలేదా?

నేను నా బీర్ తీసుకుని కూర్చున్నాను.

"చెప్పు" అడిగాను.

శశి చెప్పడం మొదలు పెట్టాడు.

వాళ్ళ ఊర్లో మంచి సంబంధం ఉందని చూసుకోడానికి రమ్మంటే, శశి వెళ్ళి, ఎక్కువ కట్నానికి ఖాయం చేసేసుకున్నాడట. అమ్మాయి సిటీలో పెరిగిన పిల్లయితే కొంచెం లోకజ్ఞానం ఉంటుంది అని పల్లెటూరి పిల్లను కోరి చేసుకున్నాడు. కట్నం కింద అక్షరాల కోటి రూపాయలు, ఇంకా మంచి పెద్ద ఇల్లు, కారు కొనేందుకు డబ్బు మొత్తం మామగారు సమకూర్చి, పిల్ల వంటి మీదా ఇంచుమించు అయిదు కేజీల బంగారం వేసి పెళ్ళి చేసాడు.

"బాగుంది కదా, మరేమిటి నీ బాధ?" బీరు చప్పరిస్తూ అడిగాను.

"ఏమిటి బాగుండేది? పల్లెటూరి పిల్ల బాబు, కొంచెం మోటు అంటే నవ్వుకున్నాను, కాని కొంచెం కాదురా మామా, చాల మోటు" కళ్ళల్లో నీళ్ళు తిప్పుకున్నాడు శశి.

నాకు నవ్వు వచ్చింది, "కొంపదీసి కొట్టలేదు కదా?" సరదాగా అన్నాను.

మళ్ళీ భోరుమన్నాడు. ఈసారి నాకు భయం వేసింది.

"ముందు బాగానే ఉందిరా మామా, ఇక్కడికి వచ్చిన కొత్తలో కూడా మంచిగానే ఉంది" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"మరి?" ప్రశ్నార్ధకంగా చూసాను.

"క్రిస్టి కలిసాక మారిపోయింది" రహస్యం విడిపోయింది.

ఇంతకీ వాడి మాటల సారాంశం ఏమిటంటే, ఒక రోజు ఇలాగే ఏదో మాల్‌లో క్రిస్టి కలిసింది. అప్పుడు క్రిస్టి చంకలో బిడ్డ ఉన్నాడు. వాడిలో మన శశి పోలికలు బాగా స్పష్టంగా ఉన్నాయి. అంతే కాక, క్రిస్టి బిడ్డని శశి భార్యకి చూపించి, వాడి తండ్రి శశి అని చెప్పింది. అంతటితో ఆగిందా అంటే కాదు, శశి బిడ్డకి తండ్రి అని, తనని మోసం చేసి మరలా పెళ్ళి చేసుకున్నాడు అని అమెరికన్ కోర్టులో కేసు వేసింది.

దాంతో అంతవరకూ అణిగి మణిగి ఉన్న భార్య ఉగ్రరూపం ఎత్తింది. ఇండియాకి ఫోన్‌లో విషయం చేరిపోయింది. వెంటనే వాళ్ళ నాన్న అక్కడ. కోర్టులో కేసు వేసి, తన బిడ్డకి పరాయి దేశంలో ఏదన్నా అయితే దానికి అల్లుడే బాధ్యుడు అని ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇక అందరికి అల్లుడు, అమ్మాయి అమెరికాలో ఉన్నారు అని గొప్పలు చెప్పుకున్నారు కాబట్టి వాళ్ళని ఇండియా రమ్మనలేక, శశిని బాగా బెదిరించి వాడిని తోలుబొమ్మ చేసి ఆడిస్తున్నారు. కుప్తంగా జరిగింది అది! ఇక శశి వేసే ప్రతి అడుగు అతడి

భార్య గమనిస్తోంది. అటు అమెరికన్ కోర్టులో క్రిస్టి వేసిన కేసు ఇంకా సాగుతోంది. దానికి కావలసిన సాక్ష్యాలు సేకరించే పనిలో కాథి ఉంది. ఇప్పటికే శశి దగ్గర DNA నమూనాలు తీసుకున్నారు. అవి సరిపోవడమే తరువాయి, శశి పెనం మీదినుంచి పొయ్యిలో పడతాడు. అప్పుడు ఏమి జరుగుతుందో ఊహించడానికే భయంగా ఉంది అని శశి అంటుంటే, నాకేమి జాలిగా అనిపించలేదు.

పెద్దలు చెప్పినట్లు, "యత్ర నార్యస్తు పూజ్యం" అన్న పదాలకి అర్థం దేశం, ప్రదేశం అని కాదు, మన మనసులలో అని శశి లాంటి వాళ్ళు చాలామంది ఇంకా తెలుసుకోవాలి!

## వేపచెట్టు -శివపార్వతి అనంతు

### (వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో ప్రశంసా పత్రం పొందిన కథ)

**అలారం మోగగానే** మెలుకువ వచ్చింది శ్రీధరకు. టైం చూస్తే ఐదు గంటల సమయం అయింది. పక్కనే భార్య నిర్మల, పిల్లలు గాఢ నిద్రలో ఉన్నారు. తనకు కావలిసింది అదే కనుక ఏమి ఆలోచించకుండా పెరటిలోకి వెళ్ళి వేపచెట్టుకు నమస్కరించి వేపపూత కోయడానికి సన్నద్ధుడు అయ్యాడు. వేప చెట్టుకింద నిలబడి రెండుకాళ్ళు ఎత్తి తన చేతులతో అందుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కాని అందటం అతనికి ఆత్రుత ఎక్కువ కాసాగింది. అతగాడి ఆరాటం అంతా భార్య, పిల్లలు నిద్రలేచే లోపు వేపపూత సిద్దం చేసుకుని సర్ ప్రైజ్ ఇవ్వాలని కోరిక.

పిల్లలకు రాత్రంతా ఉగాది పండుగ గురించి, వేపచెట్టుతో తనకు గల అనుబంధం గురించి చెబుతూ ఉన్నాడు. పిల్లలు శ్రద్ధగా వింటు వింటూ నిద్రలోకి జారుకున్నారు. ఆ తరువాత భార్య నిర్మలను బ్రతిమలాడాడు. నిర్మల కూడా 'నాకు నిద్రవస్తుందండి, మీరూ నిద్రపొండి రేపు మాట్లాడుకుందాం' అంటూ చిలిపిగా కసిరింది అలా రాత్రి అసంపూర్ణంగా మిగిలిన బాల్యస్మృతులు వేప చెట్టును చూడగానే తిరిగి గుర్తురాసాగాయి.

శ్రీధర్ తండ్రి పరంధామయ్య ఒక స్కూల్ టీచర్. ఖాళీ సమయంలో వ్యాపకంగా చిన్న పూలమొక్కలు, కూరగాయ మొక్కలను పెంచుతుండేవారు అంతేకాక పొరుగు ఊరికి ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక మొక్కనీ, విత్తనాన్నో వెంట బెట్టుకొచ్చేవారు. దగ్గరుండి మరీ శ్రీధర్ చేత నాటించేవాడు. పర్యావరణం గురించి వివరిస్తుండేవాడు. ఆ మాటలు అన్నీ శ్రీధర్ మనసులో నిలిచిపోయాయి. అందుకే ఒక రోజు స్కూల్ నుంచి వస్తుంటే ఒకతను కొన్ని మొక్కలను రోడ్డుమీద పెట్టుకుని అమ్ముతూ ఉన్నాడు. తన స్నేహితులు అందరు ఆ మొక్కల వద్ద నిలబడి మామిడి చెట్టు, జామచెట్టు, ఉసిరిచెట్టు ఇలాంటివి అడుగుతుంటే రెండురూపాయలని, అతను సమాధానం చెబుతున్నాడు. వెంటనే శ్రీధర్ తన చొక్కా జేబు తడుముకున్నాడు. అందులో ఒక అర్ధరూపాయి కనిపించింది.

మొహంలో ఆనందం వెల్లివిరిసింది, వెంటనే 'నా దగ్గర అర్ధరూపాయి ఉన్నది ఏమి వస్తుంది? ' అని మొహమాటంగా అడిగాడు.

'యాపచెట్టు వచ్చుది ఈ మంటవా? ' అని అతను చెప్పాడు.

'ఊ....' అంటూ తలూపాడు శ్రీధర్.

వేపచెట్టు తీసుకుని వస్తున్న శ్రీధర్ ను చూసి బామ్మ పడిపడి నవ్వింది. 'ఎందుకురా పిచ్చి తండ్రి వేపచెట్టు అంత కష్టపడి మరీ మోసుకొస్తున్నావు. అవి ఏ వేపచెట్టు దగ్గర చూచినా కనబడతాయి. ఏ దిబ్బలపైన చూసినా కనబడతాయి' అని అన్నది.

ఆ మాటలకు కోపం వచ్చిన శ్రీధర్ రెండురోజులు బామ్మతో మాట్లాడలేదు. చివరికి మనవడిని బుజ్జగించింది. అంతేకాదు దగ్గరుండి మరీ తనచేత చెట్టును నాటించింది. తన చిన్ని చేతులతో చెట్టును నాటుతూ ఉంటే బలే అనిపించింది శ్రీధర్‌కు. చెట్టును నాటిన తరువాత అమ్మ దగ్గరకు తీసుకుని 'నువ్వు పెద్దదైన తరువాత ఎప్పుడు ఈ ఇంటికి వచ్చినా మేము ఉన్నా లేకున్నా వేపచెట్టు మాత్రం నీకోసం ఎదురుచూస్తుంటుంది' అని చెప్పింది. అప్పుడు శ్రీధర్ కు తను చేసింది అంత మంచి పని అనుకుని కళ్ళు ఆనందంతో విప్పారాయి. అమ్మ చెప్పింది అక్షరాల నిజమే ఈ రోజు తనకు అమ్మలేదు. నాన్న, వేపచెట్టు మాత్రమే ఉన్నారు. నాన్న ఇంటి రూపు రేఖలు ఎన్ని మార్చిన తన కోసం వేపచెట్టును అలానే ఉంచారు.

వేపచెట్టు పెరటిలోకి వచ్చిన దగ్గర నుంచి ఉదయం నిద్రలేవగానే అమ్మ వేపచెట్టు మహాలక్ష్మి అంటూ ప్రభాత దర్శనం చేసుకునేది. తరువాత ఇంటిల్లపాది ఇదే ఆనవాయితీగా సాగింది. మరుసటి సంవత్సరం ఉగాదికి అమ్మ తన వేపచెట్టునుండే నాలుగు రెబ్బలు కోసి ఉగాది పచ్చడి చేసింది. చెట్టు కొంచెం పెద్ద అయిన కొద్దీ కొమ్మలు బాగా విస్తరించసాగాయి. ఎప్పుడు అయినా నాన్నకు కోపం వస్తే వేప చెట్టుకు ఉన్న కొమ్మలను వంచి మరీ ఒక మెల్లె విరిచేవాడు నాన్న. అలా విరిచినప్పుడల్లా శ్రీధర్ తనకు తగిలే దెబ్బల భయం కంటే చెట్టు కొమ్మలు విరిగిపోతాయేమోనని బాధగా చూసేవాడు. తనను క్రమశిక్షణలో పెట్టడానికి తన వేపచెట్టు కూడా బాధ్యత తీసుకున్నది. చెట్టు గుబురుగా విస్తరించిన దగ్గరనుండి ఆ చెట్టు నీడలోనే చదువుకునేవాడు. అంతేకాదు సెలవులకు చిన్నాన్న కూతురు శైలజ వస్తే చెట్టుకు ఉయ్యాలకట్టి మరీ ఆడించేవాడు ఇలా ఎన్నో రకాలుగా తనకు సంతృప్తి ఇచ్చింది. ఇప్పుడు అమెరికాలో తను ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. చాలా కాలం తరువాత భార్యా పిల్లలతో ఇండియా రావడం ఇలా ఉగాదికి తను పెరిగిన ఇంట్లో ఉండి తను నాటిన వేపచెట్టు పూతతో ఉగాది పచ్చడి చేసుకోవడం ఇవన్నీ తలుచుకుంటుంటే మనసు ఆనందంతో ఊగిపోతూ ఉన్నది శ్రీధర్ కు.

అంతేకాదు తను బి.ఎస్.సి చదువుతున్నప్పుడు పొరుగూరుకు వరద వచ్చి కొన్ని నీళ్ళు శ్రీధర్ వాళ్ళ ఊరిలోకి వచ్చాయి. అప్పుడు ఏమీ ఆలోచించకుండా శ్రీధర్ చెట్టు ఎక్కి కూర్చున్నాడు. కష్టపడి అమ్మను నాన్నను కూడా ఎక్కించాడు. బామ్మను మాత్రం దక్కించుకోలేకపోయాడు. అది వరద మిగిల్చిన విషాదం. ఒకసారి అమ్మవారు, నూగులమ్మ (చికెన్ ఫాక్స్) వచ్చినప్పుడు డాక్టర్ కంటే ముందు గుర్తుకు వచ్చింది పెరటిలోని వేపచెట్టే. అప్పుడు బామ్మ చేసిన వైద్యం ఏమిటంటే వేపాకు పసుపు ముద్ద చేసి సగం పైగా వంటికి రాసి తిమ్మిర బిళ్ళంత మింగించేది. చేదు అనిపించినా కూడా తన వేపచెట్టుమీద ఉన్న ప్రేమతో తినేవాడు. శ్రీధర్. ఈ విధంగా తమ ప్రాణాలను కాపాడింది. ఇప్పుడు ఎంత పెద్దది అయింది! అప్పటికి నాన్న ఇంటికి అడ్డం వస్తుందని విరిచిన కొన్ని కొమ్మలు మధ్యలో నుండి సూర్యుడు తొంగి చూడటం మొదలు పెట్టాడు. ఆ కిరణాలు తన మీద పడగానే తన తల్లి తనను సృజించినట్లుగా అనిపించింది. ఒకసారి తలపైకెత్తి చూసాడు. తన తల్లి నవ్వుతూ చూస్తున్నట్లు అనిపించింది. అంతే కన్ను ఆర్పకుండా చూడసాగాడు శ్రీధర్.

'ఏమండోయ్ ఎంతసేపు చూడాలండీ మీ వేపపూత కోసం?' అన్న నిర్మల గొంతు విని ఈ లోకంలోకి వచ్చాడు.

పెళ్ళిరోజు పట్టుచీర కట్టి తన తల్లి నగలు అన్నీ ధరించి పదహారు అణాల తెలుగుతనం కొట్టొచ్చినట్టు కనబడుతుంది నిర్మల. అమెరికాలో ఇంత భారీ అలంకరణతో ఎప్పుడూ చూడలేదు శ్రీధర్. అంతెందుకు పెళ్ళి అయిన తరువాత ఇదే ప్రథమం. తన తల్లి నగలను శ్రీధర్ ఎన్నిసార్లు బతిమలాడినా కూడా పెట్టుకోలేదు నిర్మల. అటువంటిది ఈ రోజు చెప్పకుండానే అలంకరించుకున్నది. అంత అందంగా ఉన్న భార్యను చూడకుండా ఉండలేకపోయాడు.

అంతలో పరంధామయ్యగారు అక్కడకు వచ్చి

'ఇలా చెట్టు వైపు చూడటమేనా వేపపువ్వు కోసేదేమైనా ఉందా? ' అని అన్నారు.

దానికి నిర్మల కూడా చిలిపిగా వంత పలికింది.

అంతలో పిల్లలు కూడా వచ్చారు 'డాడీ మేమూ వేపపువ్వు కోస్తాము' అన్నారు.

'అలాగే' అని పిల్లలతో పాటుగా వేపపూవు కోసి నిర్మలకు ఇచ్చాడు.

శ్రీధర్ పిలల్లు రెడీ అయి వచ్చేసరికి నిర్మల పూజ ముగించి అందరికి పచ్చడి పంచింది. పెళ్ళి అయిన మొదటి రోజులలో నిర్మల ఆ ఇంటిలో ఒక్కరోజు ఉండటానికి కూడా ఇష్టపడలేదు. అటువంటిది అన్నీ స్వయంగా చేస్తోంది.. అమ్మ నగలు ధరించి, అమ్మలాగానే వేపపచ్చడి చేసిపెట్టడం ఇవన్నీ చూస్తుంటే శ్రీధర్ కళ్ళల్లో ఎంతో సంతృప్తి.

ఇక ఉండలేక దగ్గరకు వచ్చిన నిర్మలను చూసి 'థాంక్స్ నిర్మలా ఒక్కరోజు అయినా నీతో పిల్లలతో నేను పెరిగిన ఈ వాతావరణం మధ్య ఉండాలని కోరిక ఇన్నాళ్ళకు తీరింది. అది ఉగాది రోజు నా వేపచెట్టు పూవుతోటి నా నిర్మల చేతితోటి... ' అని చెప్పుకుంటూ పోతున్నాడు శ్రీధర్. !!

## అధమంలో ప్రథమం

-విశ్వసాహితి

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో
'నా మొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

**రాత్రి భోజనం చేసి** పడుకోబోతూ లాప్ టాప్లో నా జి మెయిల్ ఎకౌంటు ఓపెన్ చేసి మెయిల్స్ చెక్ చేస్తుంటే, ఇన్ బాక్స్లో 'ప్రథమ' అన్న అక్షరాలు కనపడ్డాయి. అంతే నాలో ఉద్వేగం మొదలయ్యింది. "ఔనన్నదో.. కాదన్నదో.." అనే ఆందోళనతో డబుల్ క్లిక్ చేసి మెయిల్ ఓపెన్ చేశాను.

"హలో రవిగారు" అన్న సంబోధనతో నా మదిలో ఆమె రూపం కదలాడింది. నా జ్ఞాపకాల పుటల్లో దాగున్న ఆ సంఘటన తాలూకు అనుభూతులు ఒక్కసారిగా గుర్తుకొచ్చాయి. నెల క్రితం అనుకుంటా.. ఆ రోజు..

ఆఫీసు పని మీద నేను హైదరాబాద్ నుండి చెన్నై వెళ్ళాను. పొద్దున్నే మా ఆంటీ వాళ్ళింట్లో దిగాను. చెన్నై ఎప్పుడూ వచ్చినా వాళ్ళింటికి వెళ్ళటం అలవాటు. ఆంటీ వాళ్ళు మాకు ఫామిలీ ఫ్రెండ్స్. వాళ్ళ ఇద్దరి పిల్లలు ఒకరు అమెరికాలో మరొకరు ముంబైలో స్థిరపడ్డారు. అంకుల్ రిటైర్ అయ్యి ఆంటీతో కలిసి వెళ్ళబుచ్చుతున్నారు.

ఇంట్లోకి అడుగుపెట్టగానే అంకుల్ ముంబై వెళ్ళారంటూ వార్తా కదంబాన్ని మొదలు పెట్టిన ఆంటీ దాదాపు అరగంట వరకు ఆపలేదు. ఆమె అంతే.. నేను ఎప్పుడు కనబడినా ఆప్యాయంగా పలకరిస్తూ బోలెడు కబుర్లు చెపుతారు. మా ముచ్చట్లు అయిన తర్వాత నేను బ్రష్ చేసుకొచ్చి హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ వార్తలు చదువుదామని టీపాయ్ మీద ఉన్న వార్తా పత్రిక చేతిలోకి తీసుకుంటుండగా, ఉన్నట్టుండి పక్క గదిలో మొదలైన గజ్జెల శబ్దం హాల్లోకి వస్తున్నట్లు వినిపించింది. నాకు తెలిసి ఆంటీ గజ్జెలు పెట్టుకోగా చూడలేదు. ఎవరా అని తలపైకెత్తి చూసాను. మొహం మీద పడుతున్న కురులను వెనక్కి సవరించుకుంటూ చిన్నగా నడుస్తూ హాల్లోకి వస్తున్న ఓ అమ్మాయి. వీళ్ళింట్లో ఈ టైములో ఈ అమ్మాయి ఎవరబ్బా అనుకునేంతలో నా గుండె వేగం పెరిగింది.. నా చూపు అమ్మాయినే వెంబడిస్తూ, హాల్లోకి వచ్చి నా ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్న ఆమె చూపుతో కలిసింది. ఒక్కసారి ఒళ్ళు పులకించింది.

"A thing of beauty is joy forever" అన్నాడు జాన్ కీట్స్. దాని భావమేమిటో ఇప్పుడు నా బుర్రకెక్కుతోంది. ఆ అమ్మాయిని చూడగానే మనసులో ఏదో తెలియని ఆహ్లాదం. అందానికి అర్థం తెలియని వాళ్ళకి ఈ అమ్మాయిని చూపిస్తే చాలు ఇక ఏ వివరణ అక్కర్లేదు. స్త్రీ అందాన్ని అక్షరాలుగా మలిచి పద్యాలలో, కవితలలో ఇమడ్చిన కవుల గొప్పతనం నాకు మొదటిసారి తెలిసొచ్చింది. ఈ క్షణం నేనొక కవితనైతే ఎంతబావుణ్ణు అనిపించింది. ఆమెను చూసిన నా మదిలో ఎన్నెన్నో ఆలోచనలు. ఆ అందాన్ని వర్ణించటానికి భాష చాలదు. .. కాదు నాకు తెలియదు. ఏదో సినిమాలో చెప్పినట్లుగా ఆమె కళ్ళు కలువల్లా ఉన్నాయి. ఆమె పెదవులు చూస్తే హాలీవుడ్ నటి అంజలీన జోలీ గుర్తుకొస్తోంది. ముందుకు వాలే కురులు పరదాలై తన చెక్కిళ్ళ నొక్కులు కప్పేస్తున్నాయి. కనిపించీ కనిపించని చిన్న ముక్కుపుడక ఆమె కదలినప్పుడు మెరుస్తూ మురిపిస్తోంది. మెడలో సన్నని ఒంటిపేట గొలుసు.. బంగారంది కాబోలు... తన భుజాల మధ్య కుదురుగా కూర్చుంది. ఆమె చేతి వేళ్ళు ఆమె లాగే పొడుగ్గా ఉన్నాయి. తలస్నానం చేసిందేమో... బారెడు జుట్టు విరబోసుకుని ఒక రబ్బరు బ్యాండ్ పెట్టుకుంది. ఈ మధ్య నేను ఇలాంటి అమ్మాయిల్ని చీర కట్టుకోగా చూడలేదు. కాణి తను ఒంటికి అద్దినట్లుగా ఆకుపచ్చ రంగు చీర కట్టుకుని చూడముచ్చటగా ఉంది. ఆడతనానికి నిలువెత్తు నిదర్శనమా అన్నట్లు అందానికి అద్దం పట్టే కుందనపు బొమ్మలా ఉంది. పెళ్ళంటూ చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే చేసుకోవాలి.. కాదు.. కాదు.. ఈ అమ్మాయినే చేసుకోవాలి... నా పెళ్ళికి సంబంధించి అమ్మ అడిగే ప్రశ్నలకు నాకు ఆ క్షణం సమాధానం దొరికినట్లనిపించింది.

"రవీ.. వెళ్ళి స్నానం చేసిరా.. టిఫిన్ చేద్దువుగాని.." అన్న ఆంటీ పిలుపుతో ఆ మైకం నుంచి తేరుకున్నాను. స్నానం చేసి వచ్చి టిఫిన్ చేద్దామని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను.

"రవీ.. ఈ రోజు టిఫిన్... నీకిష్టమైన జీడిపప్పు ఉప్మా.. ప్రధమ చేసింది.. తనకూ ఈ టిఫిన్ చాలా ఇష్టం.." అన్నారు ఆంటీ.

"ప్రధమ..?!.. ఎవరు..?" అని అడిగేలోపే

"అయ్యో.. నీకు పరిచయం చేయలేదు కదూ.." అంటూ నేను రాగానే నా మతి పోగొట్టిన ఆ అమ్మాయిని చూపించి...

"ఇదిగో.. ఈ అమ్మాయి పేరు ప్రధమ.... అంకుల్ వాళ్ళ ఫ్రెండ్ కూతురు.. ఇక్కడికి ఏదో పనిమీద వచ్చింది.." అన్నారు ఆంటీ.

తను "హాయ్" అంటూ చిరునవ్వుతో పలకరించింది. ఆ నవ్వులో ఏదో కొత్తదనం. మొదటిసారి ఒకమ్మాయి ముఖానికి నవ్వు ఎంత అందాన్నిస్తుందో తెలిసింది.

"ప్రధమ.. ఇతను మా బావగారి కొడుకు .. పేరు రవి... బ్యాంకులో రీజనల్ మేనేజర్ గా పనిచేస్తున్నాడు.." అని ఆ అమ్మాయికి నన్నూ పరిచయం చేసారు.

నేనూ "హాయ్" అంటూ పలకరించాను.

వృత్తిరీత్యా నేను చాలా మందిని కలవటం.. వారితో పరిచయాలు.. నాకు మామూలే.. కానీ ఇవాళ ఎందుకో ప్రధమతో పరిచయం నాకు కొత్తగా అనిపించింది.. ఆ క్షణం నా శరీరంలో ఏదో తెలియని ఉత్కంఠ.. గుండె కొంచెం వేగంగా కొట్టుకుంటున్నట్లనిపించింది...

గబగబా టిఫిన్ తినటం పూర్తిచేసి ఆఫీసులో మీటింగుకి లేట్ అవ్వకూడదని వెంటనే బయటపడ్డాను.

బయటికి వెళ్ళి ఆటో ఎక్కిన నాకు. ఇంట్లో ఆగిపోయిన ఆలోచనలే కొనసాగింపుగా నా మనోఫలకంపై ముద్రపడిన ఆమె రూపాన్నే మరల మరల చూపే ప్రయత్నం చేస్తున్నాయి.

ఒక అమ్మాయిని చూసి ఇవాళ నేను ఎందుకు ఇంత ఆలోచిస్తున్నాను..? ఇప్పటివరకు నేను చాలామందిని చుసాను. నా స్నేహితుల్లో అమ్మాయిలూ ఉన్నారు. ఎప్పుడూ లేని ఆలోచన ఈరోజు ఏంటి కొత్తగా.. ఈ అమ్మాయిలో ఏదో ప్రత్యేకత ఉంది. ఔను .. ఇలాంటి అమ్మాయి కోసమే నేనింత కాలం వెతుకుతున్నది. ఇంతకీ ప్రధమకి పెళ్ళి అయిందా..? ఆ అమ్మాయిని చూస్తే అలా

అనిపించట్లేదే. అయినా ఒక అమ్మాయిని చూసి పెళ్ళి అయిందా లేదా అని చెప్పగలిగే లెక్కలు మనకి చాలా తెలుసు కదా.. నా లెక్క ప్రకారం ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదు. సో.. ప్రథమతో పెళ్ళి ప్రతిపాదన చేయొచ్చు. కానీ తను ఎలా ప్రతిస్పందిస్తుందో..? అయినా నాకేం తక్కువ.? చూడటానికి బావుంటాను. బాగా చదువుకున్నాను. మంచి ఉద్యోగం.. ఆస్తిపాస్తులు అవీ బాగానే ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా నేను మంచి భర్తనవుతానని అమ్మ చెబుతూ ఉంటుంది.. "సర్. మీటర్ 53 రూపాయలైంది" అన్న ఆటో వాడి అరుపుకి ఉలిక్కిపడి తేరుకుని నా ఆలోచనలకి కళ్ళెం వేసి ఒక్క ఉదుటున ఆఫీస్‌లోకి అడుగుపెట్టాను.

నా అదృష్టం కొద్దీ ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుండి త్వరగా బయటపడగలిగాను. ఇంటికొచ్చి హాల్లో కూర్చున్నాను. ఆంటి నాకు కాఫీ ఇచ్చి లోపల పనిలో నిమగ్నమయ్యారు. ఈలోగా ప్రథమ వచ్చింది.. ఎక్కడికో బయటికి వెళ్ళింది కాబోలు... కొద్దిసేపటికి ఫ్రెష్ అయ్యి కాఫీ తీసుకుని తనూ హాల్లోకి వచ్చి కూర్చుంది.

"సారీ అండి.. పొద్దున్న హడావుడిలో చెప్పటం మరిచాను. ... ఉప్మా చాలా బావుంది" అన్నాను.

"థాంక్స్.. కాని ఒక రిక్వెస్ట్..దయచేసి నన్ను అండి అనకండి.. నా పేరు ప్రథమ పేరు పెట్టి పిలవండి.. నాకూ ఇబ్బంది అనిపించదు" అంది.

ఆ మాటలకి ఆమె నాతో చాలా చనువుగా మాట్లాడుతున్నట్లనిపించిద్కి.

"సరే" అని నవ్వాను... తనూ నవ్వింది.... "అవును ప్రథం. ఈ రోజు ఎక్కడికో వెళ్ళినట్లున్నావ్.." అడిగాను.

"అవును... ఒక లోను విషయమై బ్యాంకుకు వెళ్ళి వచ్చాను" అంది

అంతే.. అదే అదనుగా తీసుకుని ఏ బ్యాంకు అయినా, ఎటువంటి లోనైనా నాకు క్షణాలలో పని అన్నట్లుగా నా పరపతి పాండిత్యాన్ని ఆమె దగ్గర ప్రదర్శించాను.

అయినా ఆంటీ పొద్దున పరిచయం చేసినప్పుడు నా గురించి చెప్పారు కదా.. అంతో ఇంతో సాయం చేసేవాడినే కదా.. మా బ్యాంకు కాకపోయినా నాకూ కొన్ని పరిచయాలు ఉంటాయి... నన్ను అడగచ్చు కదా.. అనుకుంటూ ఈ విషయంలో తను నా సలహా అడగనందుకు నేను కొంత నొచ్చుకున్నాను.

ఆమె సుతి మెత్తగా తిరస్కరిస్తూ.. "పర్లేదండి.. అదేమంత పెద్దపనికాదు. అయినా అవసరముంటే తప్పకుండా మిమ్మల్ని అడుగుతాను" అంది.

మా మాటల మధ్యలో "డిన్నర్ రెడీ.. రండి" అన్న ఆంటీ పిలుపుతో ఇద్దరం వెళ్ళి డిన్నర్ కి కూర్చున్నాం.

"గారెలు చేశాను కానీ ఇవాళ ఆయనకు తినే ప్రాప్తం లేదు" అని అంకుల్‌ని తలుచుకుంటూ మాకు గారెలు వడ్డిస్తున్న ఆంటీతో

"ఔను ఆంటీ. అంకుల్ ముంబై ఎందుకు వెళ్ళారు" అడిగాను, ఆంటీని వదిలేసి అంకుల్ ఒక్కరే ఎందుకు వెళ్ళారో తెలుసుకుందామని.

"అంకుల్ ఫ్రెండ్ రావుగారు తెలుసు కదా, వాళ్ళావిడకి అనుకోకుండా ఇవాళ ఏదో ఆపరేషన్ చేయాలన్నారట. రావుగారు ఫోను చేస్తే ఈయన హడావుడిగా వెళ్ళారు. వాళ్ళ పెద్దబ్బాయి సురేష్ అమెరికాలో ఉంటాడు. ఇప్పటికిప్పుడు రాలేడు. ఇక రెండోవాడు భోపాల్ లో ఉంటాడు. అతనికీ ఏదో లీవ్ దొరకలేదట. రేపొద్దునకి గానీ రాలేడట. రావుగారు ఒక్కరే అవుతారని ఆయనకి తోడుగా ఈయన వెళ్ళారు. ఈయనకీ ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదు. ఇక తప్పక బయలుదేరారు. ఏమిటో ఎదిగిన పిల్లలు ఉన్నారనేగానీ, ఇట్లా అవసరం వచ్చినప్పుడు దగ్గర ఉండటానికి ఒక్కరికీ కుదరదు. ఎవరి పనులు వాళ్ళవి.. ఎవరి జీవితాలు వాళ్ళవి." అంటూ పిల్లల నిస్సహాయతని తప్పుపడుతున్నట్లు మాట్లాడారు.

"నిజమే ఆంటీ.. ఏం చేస్తాం.. ఉద్యోగ బాధ్యత.. ఈ రోజుల్లో లీవ్ దొరకటం అంత ఈజీ కాదు. వాళ్ళైనా ఏం చేస్తారు చెప్పండి.. కెరీర్ ఓరియంటెడ్‌గా ఉన్నప్పుడు ఇలాంటి తప్పవు" అన్నాను వాళ్ళని వెనకేసుకొస్తూ.

"అవునులే నువ్వు కూడా ఈకాలం కుర్రాడివేగా అంతకంటే ఏం చెపుతావు" అంటూ వాళ్ళ పిల్లల గురించి చెప్పడం మొదలుపెట్టారు. ఈలోగా మా మాటల్ని వింటూ డిన్నర్ పూర్తిచేసిన ప్రథమ మౌనంగా లేచి వెళ్ళిపోయింది. మా డిన్నర్ కూడా అయిన తర్వాత ఆంటీ మా ఇద్దరికీ పడుకునే ఏర్పాటు చేసి ఆమె నిద్రపోయారు.

ప్రథమ కంప్యూటర్ ముందు కూర్చుని ఏదో వర్క్ చేసుకుంటోంది. నేనూ చేతిలో పుస్తకం పట్టుకుని చదువుతున్నట్లు నటిస్తూ వీలైనప్పుడల్లా ఆమెనే పరికిస్తూ ఆమెతో మాట కలిపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను.

ఈలోగా తనే ఒక పేపర్ నా చేతికిచ్చి "దీనిని చదివి మీకు అభ్యంతరం లేకపోతే ఫిల్ చేసి నాకివ్వండి" అని మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యింది.

ఎందుకు .. ఏమిటి.. అనకుండా తను అడిగిందే తడవుగా, పేపర్లో ఏముందో పూర్తిగా చదవకుండానే, నా డీటైల్స్ ఫిల్ చేసి.. ఆ పేపర్ అందించే వంకతో వెళ్ళి ఆమెకు కొంచెం దగ్గరగా కూర్చున్నాను.

తను ఇ మెయిల్స్ చెక్ చేసుకున్నట్టుంది. మధ్యలో గూగుల్ సెర్చ్ కూడా చేస్తున్నట్లుగా అనిపించింది. కొద్దిసేపటి తర్వాత

"ఏంటి బోర్ కొడుతోందా..?" అని నవ్వుతూ నా వంక చూసి "మీ గురించి చెప్పండి" అంది.

వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లుగా అటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న నేను నా చిన్నతనం నుంచి మొదలుపెట్టి అమెరికాలో నా అనుభవాల వరకు చెప్పుకుంటూ వచ్చాను. శ్రద్ధగా వచ్చాను. శ్రద్దగా వింటోంది అని గమనించి మళ్ళీ...

"ప్రస్తుతానికి అమ్మ నాకు పెళ్ళిచేయాలని తెగ ఆరాటపడుతోంది. నా చదువు .. ఆ తర్వాత అమెరికాలో పైచదువు.. ఆపై అక్కడ ఉద్యోగం.. అమ్మ ఒంటరిదవుతుందని నేను రెండేళ్ళు ఉద్యోగం చేసి తిరిగి ఇండియా వచ్చేసాను. నా చిన్నప్పుడే నాన్నపోయారు. నేను ఒక్కడినేనేమో నన్ను గారాబంగా పెంచింది. నాకు వయసైపోతుందని ఆమెకి దిగులు. నేను పెళ్ళి చేసుకుని స్థిరపడాలని ఆమె కోరిక. నాకు తగ్గ అమ్మాయి దొరకాలి కద" అన్నాను.

"గుడ్ .. ఇంటరెస్టింగ్... ఆ తర్వాత.." అంది పెదవులు విడివడని చిరునవ్వుతో..

"తర్వాత ఏముంది.. నాకు తెలిసి నేను అన్నీ సాధించాను.. నాకు కావలసినవన్నీ సమకూర్చుకున్నాను. దీనికోసం నేను చాలా శ్రమించాను. ప్రతిచోటా గెలవాలి అనే తపనతో పనిచేసాను. చిన్న వయసులోనే నేను చాలా ఎదిగాను అని మా వాళ్ళందరూ అంటుంటారు. ఈ అవకాశం చాలా తక్కువ మందికి వస్తుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని నేను ఈ స్థాయికి వచ్చాను. ప్రస్తుతానికైతే పెళ్ళిచేసుకుని హాయిగా జీవితం గడపటం" అన్నాను.

నాకు ఏ బరువు బాధ్యతలు లేవు, ప్రస్తుతానికి నాకు పెళ్ళిచేసుకుని స్థిరపడటం తప్ప వేరే జీవితాశయాలూ లేవు అన్న ధ్వని ఆమె గమనించ గలిగితే నా మాటలలో ప్రస్ఫుటంగా వినిపిస్తుంది.

అంతా విన్న తను ఒక భారీ శ్వాస వదిలి, మళ్ళీ కంప్యూటర్ వైపు తిరిగి పనిచేసుకోవటం ప్రారంభించింది.

నేను "మీ గురించి చెప్పండి" అని అడిగే లోపల...

"ఓ.. మీరు నాకన్నా ఒక సంవత్సరం పెద్ద" అంది

నేను ఆశ్చర్యపోతూ "అవునా..? ఎలా చెప్పగలిగారు..?" అడిగాను.

"మీ డేట్ ఆఫ్ బర్త్‌ని బట్టి" అంది నవ్వుతూ..

అప్పుడూ అనుకున్నాను నేను ఇందాక తనకి ఇచ్చిన డిటైల్స్‌లో డేట్ ఆఫ్ బర్త్ కూడా ఉందా అని.

"మీరు జిమెయిల్ ఎక్కువగా వాడతారా..?" అని మళ్ళీ ప్రశ్నించింది..

"ఆ.. అవును" అని జవాబిచ్చి

"మీ మెయిల్ అడ్రస్ ఏమిటి" అని అడిగాను.

"మీ జి మెయిల్ చెక్ చేసుకోండి.. నేను ఇప్పుడే ఒక మెయిల్ పంపించాను" అంది.

ఈలోగా నా ఫోన్ మోగింది. నా ఫ్రెండ్ సుబ్బు చేసాడు. నాకు మంచి స్నేహితుడు. రోజుకి ఒక్కసారన్నా ఫోన్ చేసి మేం కబుర్లు చెప్పుకుంటాం.

"ఒక్క నిమిషం ప్రథమ" అని చెప్పి పక్కకొచ్చి వాడితో మాట్లాడుతున్నాను.

వాడితో పిచ్చాపాటీ మాట్లాడుతూ చివరగా ప్రథమ గురించి చెప్పాను.

"పేరు కొత్తగా ఉంది..?" అన్నాడు.

"అవును.. పేరే కాదు అమ్మాయి కూడా కొత్తగా అనిపిస్తోంది" అన్నాను.

"ఏమ్రిటా.. ఎప్పుడూ లేంది ఇవాళ.. ఏంటి సంగతి.. తొలిచూపులోనే ప్రేమా" అడిగాడు నన్ను ఆటపట్టిస్తున్నట్లు.

"ఏమోరా.. తెలియట్లేదు" అన్నాను.

"ఎలా ఉంటుంది" అడిగాడు

"చాలా అందంగా ఉందిరా" అన్నాను

"అంటే.. ఐశ్వర్యా రాయా.." అన్నాడు.

"అలా పోలికలు నేను చెప్పలేనురా" అన్నాను.

"చూడు.. ఒక అమ్మాయి అందాన్ని ఏదైనా సినిమా హీరోయిన్ తో పోలిస్తే ఆ అమ్మాయి అందం బేరీజు వేయటం తేలిక. అందుకని నువ్వు చూసిన అమ్మాయి ఏ హీరోయిన్ లా ఉందో చెప్పు. దాన్ని బట్టి ఆ అమ్మాయి గ్రేడ్ చెప్పచ్చు" అన్నాడు.

"మళ్ళీ ఈ గ్రేడ్ ఏమిటి"

"అదేలేరా.. ఏ, బి, సి అని మూడు గ్రేడ్‌లుంటాయి. ఏ గ్రేడ్ అంటే ఐశ్వర్యారాయ్ రేంజ్.. ఇది సినీ పరిజ్ఞానంలే" అన్నాడు.

"ఆ.. అయితే నీ గ్రేడింగ్ పద్ధతి తిరగరాయాలి.. ఇక్కడ నేను చూసింది 'ఏ' కన్నా ఎక్కువ" అన్నాను.

"అబ్బో.. అయితే ఆలోచించాల్సిందేరా.. ఇంతకీ ఆ అమ్మాయి గురించి ఏమన్నా తెలుసుకున్నావా" అడిగాడు.

"లేదు" అన్నాను.

"కానీ.. మరింక ఆలస్యం ఎందుకు" అన్నాడు.

"నువ్వు ఆపితే  కదరా.. నేను మొదలు పెట్టేది" అన్నాను అప్పటికే అరగంట పైన మాట్లాడిన వాడితో.

సారీ చెప్పి వాడు ఫోన్ పెట్టేస్తాడు. ప్రథమతో మాట్లాడాలి అనే కోరిక వల్ల కావచ్చు లేక తనతో ఎక్కువ సమయం గడపాలి అనే ఆత్రం వల్ల కావచ్చు, సుబ్బుతో మాట్లాడుతున్నప్పుడు మొదటిసారి అనుకున్నాను వీడు ఫోన్ ఎప్పుడూ పెట్టేస్తాడా అని..

"సారీ ప్రథమ .. సుబ్బు అని నా ఫ్రెండ్"

"మీకు ఫ్రెండ్స్ ఎక్కువేనా"

"లేదు.. తక్కువే కాని ఉన్న వాళ్ళు చాలా క్లోజ్ ఫ్రెండ్స్" అన్నాను.

"అవును మీరు సినిమాలు చూస్తారా" అని అడిగాను తన ఇష్టాలు, అభిరుచులు తెలుసుకోవాలనే కుతూహలంతో.

"చుసేదాన్ని.. కాని గత రెండేళ్ళుగా చూడలేదు" అంది.

"మీకు కొత్త ప్లేసెస్ అవీ చూడటం ఇష్టమేనా..?

"ఎస్"

"గత రెండేళ్ళుగా ఏమీ చూడలేదు" అని చెప్పింది

"ఓ అట్లాగా" అన్నాను "ఈ రెండేళ్ళ కాన్సెప్ట్ ఏమిటో!" అని మనసులో అనుకుంటూ.

"మీరు ఏమైనా ఉద్యోగం చేస్తున్నారా.?" అడిగాను.

"లేదు.. చెయ్యట్లేదు..." అంది.

"అంటే మీకు అవసరం లేదా లేక ఇంట్రెస్ట్ లేదా" అడిగాను.

"ఇంట్రెస్ట్ లేదు" అంది.

"అనుకున్నాను.. మీకు ఆ అవసరం కూడా లేదు అని" అన్నాను.

కనుబొమలు పైకెత్తి నా వైపు చూస్తున్న ఆమెని చూసి

"అంటే... మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది" అని "పొద్దున్న మీరు కట్టుకున్న చీరను బట్టి చాలా చెప్పొచ్చు" అనుకున్నాను నాలో నేను.

"ఇంట్రెస్టింగ్.." అని నవ్వింది.

ఈ లోపల పక్కరూం లోంచి ఆంటి "రవి. ఒకవేళ కరెంటు పోతుందేమో, టార్చ్‌లైట్, కొవ్వొత్తి ఆ టేబుల్ పక్క అలమరాలో ఉన్నాయి చూడు" అని అరిచారు.

"సరే ఆంటి" అంటూ

"మీకు చీకటంటే భయమా..?" అప్రయత్నంగా అడిగాను అలమరలోంచి టార్చ్ లైట్ తీసి టేబుల్ పై పెడుతూ.

"భయం లేదు.. చీకటిని పారద్రోలే వెలుగుందనే ధైర్యం" అంది వెంటనే."అబ్బా.. చాలా పాజిటివ్..." అనుకున్నాను మనసులో. ఆమె తీరు చూస్తే ఆత్మ విశ్వాసం కూడా మెండుగానే ఉన్నట్లనిపించింది.

"మీరు ఏం చదువుకున్నారు" అడిగాను.

"జీవితాన్ని చదువుతున్నాను" అంది.

ఆ సమాధానానికి షాక్ అయ్యాను. ఏమిటి అలా అంది అని తదేకంగా తననే చూస్తుంటే అదే నవ్వుతో నా వైపు ఒకసారి చూసి మళ్ళీ తన పని చేసుకుంటోంది. నవ్వుతూనే తను నన్ను "షాక్ అయ్యారా?" అని అడిగినట్లనిపించింది.

"ఏమిటి... వైరాగ్యమా.." అన్నాను.

"అలాంటిదేమీ లేదు.. మీరు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాను" అంది విశ్వాసం తొణికిసలాడే స్వరంతో.

అప్పుడు నేను "ఏమిటి ప్రథం... ఈ వయసులో నువ్విలా మాట్లాడటం.. నాకు ఆశ్చర్యమేస్తోంది. నువ్వు 'ఊ' అను నీకోసం జనాలు లైన్లో నిలబడతారు. నీకేం తక్కువ..? అందంగా ఉంటావు. చదువుకున్నావు.. ఆస్తీ అదీ బానే ఉన్నట్లున్నాయి... హాయిగా పెళ్ళిచేసుకుని లైఫ్ లో సెటిల్ అవ్వక, దేనికి ఈ నిర్లిప్తత" అని అందామనుకుని తమాయించుకున్నాను.

"పెళ్ళి గురించి నీ అభిప్రాయం" అని అడిగాను.

"మీ అభిప్రాయమేంటి?" అంది

"పుస్తకాలు నిర్వచనాలు చెప్పలేను కానీ, నాకు తెలిసి పెళ్ళంటే రెండు కీవితాల కలయిక, ఆడ మగ తోడూ నీడలా కలిసి జీవితం పంచుకోవటం తర్వాత పిల్లలు.. వారిని పెంచి పెద్దవాళ్ళని చేయటం.." అంటూ ఆమె ముఖంలోకి చూసి ఆగాను.

మళ్ళీ అదే నవ్వు. ఈసారి కొంచెం తేడాగా కనిపిస్తోంది కాని ఆ తేడా ఆమె నవ్వులో నా లేక నా చూపులోనా తెలీలేదు.

"ఏమంటావు..? చెప్పు" అన్నాను.

"ఏం చెప్పాలి..?" అంది నిర్వికారంగా.

ఇందాకటి ఆ తేడా ఆమె నవ్వులోనే అని వెంటనే అర్ధమయ్యింది నాకు.

"ఐ యాం సారీ.. ఈ ప్రశ్న మిమ్మల్ని అడిగుండాల్సింది కాదు" అన్నాను.

"అడిగేశారు కద.. వదిలెయ్యండి" అంది అసహనంగా.

నాకప్పుడు అనిపించింది నేను తనతో శృతి మించి మాట్లాడానేమో అని

"ఇంక నాకు నిద్రవస్తోంది.. పడుకుంటాను" అంది.

"సరే ప్రథమ.. గుడ్ నైట్" అన్నాను.

గుడ్‌నైట్ చెప్పి తను వెళ్ళి పడుకుంది. నేను కంప్యూటర్ ఎదురుగా తను ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుని ఆమె క్లోజ్ చేయకుండా వదిలేసిన వెబ్ పేజీ చూస్తున్నాను. ఆమె ఇంతసేపు కంప్యూటర్ ముందు కూర్చుని ఏం చేసిందా అని ఆలోచిస్తుంటే ఎందుకో ఆమె బ్రౌజింగ్ హిస్టరీ చూడాలనిపించింది. అసలు ఆడపిల్లలు ఇంటర్నెట్ లో ఏమి చూస్తారు అన్న కుతూహలం పెరిగింది. తప్పని తెలిసినా ఓపెన్ చూసాను. అందులో ఇండియన్ రైల్వేస్ కి సంబంధించిన హోం పేజి తప్ప మిగతావి అన్నీ నాకు తెలియని కొత్త విషయాలు. ఆ తర్వాత తను నాకు పంపిన మెయిల్ ఏమిటా అని చూస్తే ఏదో ఒక పుస్తకానికి సంబంధించిన లింకు. చదివే ఆసక్తిలేక సిస్టం క్లోజ్ చేసి అటు ఇటు చూస్తుంటే పక్కనే ఉన్న టేబుల్ పైన తన బుక్ కనపడింది. పొద్దున తను ఈ పుస్తకం చదవటం చూసాను. ఏమిటా అని పరికిస్తే అది ఒక యోగి పుంగవుడి జీవిత సారాంశం. పుస్తకం మూస్తూ "ఏమిటి ఈ అమ్మాయి అర్ధం కావట్లేదే" అనుకుంటూ నేనూ వెళ్ళి పడుకున్నాను.

పగలంతా అలసిపోయానేమో వెంటనే నిద్రపట్టింది. తెల్లారి లేచేసరికి ప్రథమ ఇంట్లో లేనట్లు గమనించాను. ఆంటీ దగ్గర ఆరా తీస్తే తెలిసిన విషయం ప్రథమకి పెళ్ళి అయి నాలుగేళ్ళయింది. భర్త చనిపోయి రెండేళ్ళయింది. ఆంటీ చెప్పిన విషయానికి షాక్ అయ్యాను. నా ఆలోచనలతో నాలో నేను నిర్మించుకున్న కలల సౌధం కూలిపోతున్న భావన. నా సొంతమయింది ఏదో నా చేజారి పోతోందన్న బాధ. గత 24 గంటల్లో నా శరీరంలో చోటు చేసుకున్న ఆనందం. ఒత్తిడి, ఉత్కంఠ మటుమాయమైన ఏదో నిస్సత్తువ ఆవహించినట్లనిపించింది. నా కళ్ళు చెమ్మగిల్లి కిందకి రాలుతున్న కన్నీటి బొట్లు నన్ను చూసి జాలిపడుతున్నట్లనిపించింది. ఇది అబద్దమయితే ఎంత బావుణ్ణు అనుకున్నాను. ఇటువంటి మానసిక స్థితి ఇంతకు ముదెన్నడూ ఎరుగను. ప్రథమను మొదటిసారి చూసినప్పుడు కలిగిన ఆనందం ఎంత కొత్తగా ఉందో ఈ బాధ కూడా అంత కొత్తగా ఉంది.

ఆ బాధని మోసుకుంటూ మా ఇంటికి తిరిగి వచ్చాను. అమ్మకి విషయం చెప్పాను. "అయ్యో పాపం, చిన్నపిల్ల ఎంత కష్టం వచ్చింది" అంది తనదైన ధోరణిలో. ఆ తర్వాత ప్రథమ గురించి వాకబు చేస్తే తనకి వాళ్ళ వాళ్ళు మళ్ళీ పెళ్ళి చేయాలనుకుంటున్నట్లు తెలిసింది. ఎందుకో ప్రథమ మీద నా అభిప్రాయం మరుతుందనిపించింది. తొలిసారి చూసినప్పుడు తనంటే నాకు ప్రేమ అనుకుంటే ఇప్పుడూ క్రమేణా అది జాలిగా మారుతోంది. తనకిప్పుడు తోడెవరు.? తన భవిష్యత్తు ఏమిటి..? ఇక తన జీవితం ఇంతేనా.? అన్న ప్రశ్నలకు సమాధానాలుగా ఆమెపై ఏర్పడిన సానుభూతి ఆమెను దక్కించుకోవాలన్న కోరికను నాలో ప్రేరేపించింది.

"తనకు పెళ్ళై భర్తపోయాడు. అయితేనేం .. ఆమె అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. ఆమె దక్కని ఈ జీవితం వృధా అనిపిస్తోంది. ఆమెతోనే నా జీవితం.. ఆమె లేని నా భవిష్యత్తు నాకు శూన్యంలా కనిపిస్తోంది. అదే కాకుండా ఈ పరిస్థితుల్లో నాలాంటి భర్త ఆమెకు దొరకటం అదృష్టం.. నాకేం తక్కువ.? చదువు ఆస్తి.. అంతస్తు... అన్నీ ఉన్నాయి.. మంచి ఉద్యోగం చేస్తున్నాను. ఇద్దరం

దాదాపు ఒకే వయసు వాళ్ళం. పైగా తనకి పిల్లలు కూడా లేరు. కాని ఈ విషయంలో అమ్మకి అభ్యంతరం ఉండచ్చు.. ఒప్పుకోకపోవచ్చు. అయినా ఎలాగైనా ఒప్పించాలి. నా మాట అమ్మ ఎప్పుడూ కాదనదు." అనే సమర్ధింపు మాటలతో "ఈ పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయం చాలా ఉన్నతమైనది. ప్రస్తుత సమాజంలో ఎంతమందికి ఈ ధైర్యం ఉంటుంది. తెలిసి తెలిసి జీవితాన్ని ఎవరూ పాడుచేసుకోరు. కానీ నేను ఈ నిర్ణయం తీసుకుని ఒక భర్త పోయిన అమ్మాయికి మళ్ళీ జీవితాన్ని ప్రసాదిస్తున్నాను. నలుగురిలో ఒక ఆదర్శవాదిగా నిలుస్తాను" అని నన్ను నేను అభినందించుకున్నాను.

ఈ విషయాన్ని ముందు ప్రధమకి ప్రతిపాదించాలి అనుకుని, మదిలో ఉరకలేస్తున్న నా ఆలోచనా దొంతరలని అక్షర రూపంలో ఇ మెయిల్లో ప్రస్తావించాను.

'దానికి జవాబే కాబోలు' అనుకుంటూ ఆ జ్ఞాపకాల నుండి బయటపడి తను పంపిన మెయిల్ చదవటం మొదలుపెట్టాను.

హలో రవిగారు,

జీవితాన్ని చదువుతున్నాను కాబట్టి దాని గురించి నాకు పూర్తిగా తెలియదు. కానీ ప్రతి క్షణం ఒక అనిర్వచనీయమైన అభ్యసనానుభవమే. జీవితం సిద్ధాంతీకరించబడలేదు అని నమ్మే వాళ్ళలో నేనూ ఒకదాన్ని. ఒక సందర్భంలో మీరు పెళ్ళి మీద నా అభిప్రాయం అడిగారు. నాకు తెలిసి వివాహం అంటే భార్గవ్ లాంటి వ్యక్తితో కలిసి జీవించడం. జీవితం ఇదీ అని నాకు నేను గిరి గీసుకుని బ్రతికేస్తున్న సమయంలో నాకు తారసపడిన భార్గవ్ ఆ గీతల్లో బందీగా ఎలా బ్రతుకుతున్నానో బోధించి వాటిని శాశ్వతంగా చెరిపేశాడు. నేనెప్పుడూ అనుభవించని, ఊహించని బాధ్యతాయుత స్వేచ్ఛని పరిచయం చేసాడు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో ఈ పరిచయాలు ఏర్పడతాయి. వాటిని పెంచుకోవటమో లేక తుంచుకోవటమా అనేది మన విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. ఆ విచక్షణ కల్గిన వాడే మనిషి అన్నది నా విశ్వాసం. మన రూపు రేఖల్ని, మనం కట్టుకున్న బట్టల్ని చూసి మన వ్యక్తిత్వాన్ని అంచనా వేయగలిగే గణిత శాస్త్ర పండుతులున్న ఈ సమాజంలో మనిషిగా ఎదగాలంటే ఒక సవాలే.

మనిషికి మనిషి మధ్య అంతరాలు పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో మనసుల మధ్య వంతెనలు నిర్మించే సాహసం ఎవరు చేస్తారు..? మనం ఎదుగుతున్న కొద్దీ మనలోని విలువలు దిగజారుతుంటే ఆకాశమే హద్దని పరిగెడుతున్న మనిషి నేలని చూడగలడా..? తన గతాన్ని స్మరించగలడా..? కొత్త రంగులు పులుముకుంటూ పాతజ్ఞాపకాలని చెరిపే ప్రయత్నంలో తన ఉనికిని కోల్పోతున్నట్లు పసిగట్టలేని మనిషికి ఆ ఆనవాలు ఎవరిస్తారు..? గోరుముద్దలు పెట్టో, ఓనమాలు దిద్దించి, నడక నేర్పిన తన వారినే పరాయి వారిని చేసే మనిషిలోని స్వార్ధ పార్శ్వం ఏ కొలమానం ప్రకారం ఎదుగుదలకి సాక్ష్యం.? తరాల మధ్య అంతరం సహజం. కానీ ఆ అంతరం పూడ్చటం మన శక్తికి మించిన పనైతే మనం ఏం సాధించినా ఏం ప్రయోజనం? మనం పెరిగి పెద్దవాళ్ళమై గూటి నుంచి ఎగిరిపోయిన పక్షుల్లాగా మన ఇంటిని, మనవాళ్ళని వదిలి భవిష్యత్తుకోసం వెంపర్లాడే ప్రయత్నంలో మనం ఏంకోల్పోతున్నామో మనకి తెలియట్లేదు. కనీసం తల్లిదండ్రులని పట్టించుకునే తీరిక లేని జీవితాల్ని గడుపుతున్నాం.

ఉన్నత చదువులు చదివి, పోషించగల స్థాయిలో తమ పిల్లలు ఉన్నప్పటికీ, శారీరికంగా, మానసికంగా అలసిపోయి పిల్లల ఆసరా కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులని పోగొట్టుకున్న భార్గవ్ ఈ విషయంలో చలించిపోయాడు. వీరికోసం ఏదైనా చేయాలనుకున్నాడు. తన సంపాదనలో సగ భాగాన్ని ప్రతి ఏటా కేటాయిస్తూ తను కష్టపడి కష్టాల్లో ఉన్నవాళ్ళని ఆదుకునే ప్రయత్నం చేసాడు. మొదట్లో తను ఒక్కడే. కాని ఇప్పుడు ప్రాంతనికి ఒక్కరు అన్నట్లుగా ముందుకొచ్చి ఈ కార్యాన్ని నడిపిస్తున్నవారు చాలామంది.

కానీ మంచి వాళ్ళకి ఇక్కడ స్థానం లేదు అని మరోసారి రుజువు చేసాడాపైవాడు. రెండేళ్ళ క్రితం నాకు కోలుకోలేని దెబ్బ. తను ప్రమాదంలో నాకు దూరమవ్వటం. భగవంతుడు తనని నాకు దూరం చేసాడు కాని తన ఆశయాల్ని ముందుకు తీసుకువెళ్ళాలి అనే నా

మనోధైర్యాన్ని కాదు. "నీ జీవితాన్ని నీకోసం ప్రేమించు కాని ఇతరుల కోసం జీవించు" - ఈ అక్షర సత్యమే నేను భార్గవ్ దగ్గర నేర్చుకుంది. భార్గవ్ ప్రేరణ అయితే నేను స్పందన. నేను జీవితంలో ఒంటరిదాన్నికాదు. భార్గవ్ ఆశయమే నాకు పెద్ద అండ. తను మానసికంగా నాతోనే ఉన్నాడు. నన్ను ముందుకి నడిపిస్తున్నాడు. అన్నట్టు, వచ్చే వారం బెంగుళూరులో ఒక సెమినార్ ఉంది. దానికి సంబంధించిన వివరాలు, ట్రైన్ టికెట్ తో సహా మీ ఇంటి అడ్రస్ కి పోస్ట్ చేశాను. తప్పకుండా రండి.

ప్రథమ.

"బాబోయ్..!?" అనుకుని వెంటనే పక్కన ఉన్న మంచినీళ్ళ గ్లాసును ఖాళీ చేసేసాను.

ప్రథమ రాసిన ఇ మెయిల్ మొదటిసారి చదివినప్పుడు నాకేమీ అర్థం కాలేదు. మళ్ళీ చదివాను.. మళ్ళీ మళ్ళీ చదివాను. ఆమె రాసిన మెసేజ్ తో పాటు ఆమె కూడా అర్థమవ్వటం మొదలయ్యింది. తను ఔననలేదు.. కాదనలేదు. కానీ ఆమె అభిప్రాయాలతో ఏకీభవించలేనని మొరాయించే నా వ్యక్తిత్వం లోని డొల్లతనం బయటపెట్టింది. నాలో నాకు తెలియకుండా నిద్రాణంగా ఉన్న పురుషాధిక్య మూలాలను ఎత్తిచూపింది. నా అనైతిక భావాల సమాహారం నేను నాలో చూడలేని లోపాల వీక్షణం అని చెప్పకనే చెప్పింది. ఒక్క నిమిషం సావధానంగా ఆలోచించి తానేమిటో తెలుసుకునే ప్రయత్నమైనా చేయని నా మూర్ఖత్వాన్ని నిందించింది. నా ప్రతి ప్రశ్నకూ జవాబుగా, ఆ ప్రశ్నలలోని మానసిక అపరిపక్వతకు అద్దం పట్టింది ఆమె నాకు పంపిన ఈ ఇ మెయిల్.

మేరు పర్వతమంత ఉన్నతమైన తన వ్యక్తిత్వాన్ని, పైకి కనపడని తన హృదయ లోతుల్ని తెలుసుకునే దొడ్డ మనసు నాకు లేదు. నిజమే.. నేను ఆ మనిషిలో "మనీ" ని "షి"ని మాత్రమే చూసాను. మనిషి అంటే అర్థం తెలీని నేను అంతకన్నా మెరుగ్గా ఎలా ఆలోచించగలను. నా ఆలోచన ఎంత దిగజారింది.. కనీస ప్రమాణాల స్థాయి కన్నా తక్కువ. నాకే సిగ్గేసింది. ఆఫీసులో నేనొక మేనేజర్. చాలామమదికి రోల్ మోడల్. ఆ అర్హత ఇప్పుడు ప్రశ్నార్థకం. ఒక వ్యక్తి గురించి.. అదీ ఒక అమ్మాయి గురించి నేను చేసిన తలపుల ప్రేలాపనలు నాకే కంపరం పుట్టిస్తున్నాయి. అగ్నిప్రవేశం చేసి తన పవిత్రతను చాటుకున్న సీత కథను కొలిచే మనం రాముడి కన్నా ఉత్తములం కాలేమా అనిపించింది. అయినా ఆయనతో పోలికా.. ఆయన కారణ జన్ముడు మరి నేనో... ఒక మానసికాధముడిని.. నన్ను నేను సమర్థించుకోలేని ఈ స్థితి నుంచి బయటపడే విజ్ఞతని కోల్పోయాను. నేను నీ ముందు ఓడిపోయాను.

ప్రథమా.. మనుషులుగా నీ ముందు చాలామంది అధములే. బహుశా ఆ అధముల్లో ప్రథముడ్ని నేనేనేమో.!!

✡ ✡ ✡

# ప్రొఫెసరు మూర్తి

- కృష్ణ అక్కులు

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**నా పేరు రాహుల్.** 'రాహుల్ గ్రేట్ అని అందరూ చెప్పుకోవాలనేది' నా ధ్యేయం. ఏదో ఒక ప్రత్యేకత చూపి, అందరు నా గురించి గొప్పగా మాట్లాడుకునేటట్లు చేయడం కోసం, ఎంత కష్టమైన పని లేదా నష్టమైన పని చెయ్యడానికైనా నేను సిద్ధమే.

ప్రస్తుతం నేను ఐ. ఐ. టి చెన్నైలో, సివిల్ ఇంజినీరింగులో, ఎం.టెక్ కోర్సు పూర్తి చేసే దశలో ఉన్నాను.

చిన్నప్పటినుండి కూడా, నాకు గెలుపు అంటే చాలా ఇష్టం. అపజయమంటే పరమ అసహ్యం. అమితమైన కోపం నాకింకొక ఆభరణం. అందుకే నాకు మిత్రులు లేరు. మిత్రులు కావాలని నేనెపుడు అనుకోలేదు. నా స్టయిలే డిఫరెంట్.

స్వతహాగా నేను స్టేట్ ర్యాంకు స్టూడెంట్‌ని. టెన్త్ క్లాసులో మూడవ ర్యాంకు, ఇంటరులో రెండవ ర్యాంకు మరియు ఎమ్ సెట్లో మొదటి ర్యాంకును సాధించాను.

టెన్తు క్లాసు ఫలితాలు వచ్చినప్పుడు, నేను తప్ప మిగతా ర్యాంకుల స్టూడెంట్స్ అందరూ, ఇంటర్వ్యూలివ్వడానికి టీ.వీ స్టేషనులకు పరిగెత్తారు. మా ఇంట్లో కూడా సంబరపడిపోతూ, నా ర్యాంకు గురించి ఫోనులల్లో తెగ మాట్లాడేసుకుంటున్నారు. దానితోపాటు నన్ను టీవీలో చూడాలని చాలా ఆశపడ్డారు. అయితే నేను ఎటువంటి ఉత్సాహం చూపించక, వెళ్ళి హాయిగా పడుకున్నాను.

పలు ఛానళ్ళ వాళ్ళు, టీ.వీ స్టేషనుకి రమ్మని ఫోను చేశారు. నేను రానని చెప్పాను. చివరికి కొన్ని ఛానళ్ళ వాళ్ళు, పేపరు వాళ్ళు ఇంటికొచ్చి, ఇంటర్వ్యూ తీసుకుంటామన్నారు. అసహనంగా రెండురోజుల తరువాత రమ్మని చెప్పాను. నాన్నగారు 'ఏమిటిరా నీ పొగరని' గట్టిగా అరిచారు.

రెండురోజుల తరువాత టీవీవాళ్ళు, పేపరు వాళ్ళు ఇంటికొచ్చారు. 'రోజుకి ఎన్ని గంటలు చదువుతావని, భావి విద్యార్థులకు నీవిచ్చే సందేశమని' రొటీనుగా అడిగే ప్రశ్నలడిగారు. అన్నిటికి నిర్లక్ష్యగా సమాధానమిచ్చాను.

'మూడవ ర్యాంకు వచ్చినందుకు ఎలా ఫీలవుతున్నావని' అడిగారు. 'మొదటి ర్యాంకు రానందుకు చాలా బాధపడుతున్నానని' చెప్పాను. 'ఫ్యూచరులో ఏమి చెయ్యాలనుకుంటున్నావని' అడిగారు. 'ఇంటరు చదవాలనుకుంటున్నానని' చెప్పాను. 'అది సరే, ఇంటరయిన తరువాత ఏమి చెయ్యాలనుకుంటున్నావని' అడిగారు. 'అది ఇంటరయిన తరువాత ఆలోచిస్తానని' చెప్పాను. దానితో ఎక్కువ ప్రశ్నలు లేకుండానే ఇంటర్వ్యూ ముగిసింది. నాన్నగారు 'ఎందుకురా నీకంత గర్వమని' అరిచారు. అలాంటివేవీ నన్ను స్పందింపజేయవు.

మరుసటి రోజు టీవీలో, పేపరులో, 'నాకు చాలా తలబిరుసని, వినయం మర్యాదలు తెలియవని' ఘాటుగా వారి ప్రతాపం చూపించారు. నిజానికి నాక్కావలసినదదే. నేను అనుకున్న పాపుల్యారిటీ సంపాదించాను. ముందే అంతరి విద్యార్థులతోపాటు ఇంటర్వ్యూ ఇచ్చి వుంటే, ఈ మూడోవాణ్ణి ఎవరూ పట్టించుకోరు. అందుకే ఇలా చేశాను.

అలాగే ఇంటరయిన తరువాత, నాన్నగారు ఐ.ఐ.టి ఎంట్రెన్స్ వ్రాయమన్నారు. రాయనన్నాను. ఎంసెట్ లో మొదటి ర్యాంకు వచ్చినందున నేను కంప్యూటరు సైన్సు చదువునని అందరు అనుకున్నారు. కాని రాహుల్ ప్లాను వేరే. అందరిలాగా గొర్రెదాటుగ కంప్యూటరు సైన్సులో చేరడం నాకిష్టం లేదు. అందుకే వెరైటీ కోసం సివిలు ఇంజినీరింగులో చేరి సంచలనం సృష్టించాను. ప్రతిభ

ఉండికూడా విచిత్రంగా ప్రవర్తించి, జీవితాన్ని పాడుచేసుకుంటున్నానని అమ్మా, నాన్నా బెంగపడేవారు. ఐతే ప్రజలు నా గురించి కథలుగా మాట్లాడుకోవటం విని నాకు చాలా ఆనందమేసేది..

తరువాత ఇంజినీరింగులో గోల్డ్ మెడలు, ఎమ్‌టెక్ ఎంట్రెన్సులో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకును సాధించాను. నాన్నగారు అమెరికా వెళ్ళమంటే, వెళ్ళనని చెప్పాను. పోనీ ఎమ్‌టెక్ లోనైనా కంప్యూటరు సైన్సు గాని, స్ట్రక్చరల్ ఇంజినీరింగులో చేరమన్నారు. కానీ నేను ఐ ఐ టి చెన్నైలో, సాయిల్ అండ్ ఫౌండేషను ఇంజినీరింగులో చేరాను. ఎంత గొప్ప స్ట్రక్చరుకయినా పునాది (ఫౌండేషను) చాలా ముఖ్యం. అందువలన నాకీ సబ్జెక్ట్ చాలా ఇష్టమని నాన్నతో వాదించాను. అయితే ఐ.ఐ.టి జీవితం నాలో చాలా మార్పు తెచ్చింది.

బి.టెక్ తో పోలిస్తే ఎమ్.టెక్ లో వర్క్‌లోడు తక్కువుంటుంది. మొత్తం కోర్సు పదునెనిమిది నెలలు. మొదటి పన్నెండు నెలలు కొన్ని కోర్సులు చేసి, చివరి ఆరునెలలు ఏదో ఒక టాపిక్ పైన థీసిస్ వ్రాస్తే కోర్సయిపోతుంది. అందుకే ఎం.టెక్ లో అందరు జాలీగా గడుపుతారు. అయితే నా ఆలోచనలు మరోలా ఉన్నాయి.

ఎమ్‌టెక్ అయ్యేలోపల ఒక గొప్ప ఫౌండేషను డిజైన్ చేసి, మంచి పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అందుకోసమై, ప్రపంచ వ్యాప్తంగా గొప్ప పేరు గడించిన ప్రొఫెసరు శాంతమూర్తిగారిని కలిసి నా కోరిక తెలియజేశాను.

అందుకు ప్రొఫెసరు, ‘పి.హెచ్.డి స్టూడెంట్స్ అయితే మంచి వర్కు చెయ్యడానికి వీలవుతుంది. ఎంటెక్ కోర్సు వ్యవధి తక్కువ. కావున గొప్ప వర్కు చేయడం కుదర‘దన్నాడు.

నేను ఫస్టు సెమిష్టరులో ఉన్నప్పుడే, సదరన్ రైల్వే ఇంజినీర్లు ఒక డిజైను విషయమై, ఐ.ఐ.టీకి వచ్చి మా ప్రొఫెసర్లతో చర్చించారు. విషయమేమిటంటే తమిళనాడులో రెండు ప్రధాన నగరాల మధ్య దూరం ఇరవై కిలోమీటర్లే. అయితే మధ్యలో సముద్ర తీరం వలన, బురద ప్రాంతం ఎక్కువ ఉండడంవల్ల, ప్రస్తుతం ట్రైయిన్ సముద్ర ప్రాంతం చుట్టుకుని వెళ్ళుతూ ఉంది. దానివలన రెండు నగరాల మధ్య దూరం ఎనభై కిలోమీటర్లకు పెరిగింది. అందువలన ఈ బురద ప్రాంతంలో, రైల్వే ట్రాక్ నిర్మించినట్లయితే దూరం తగ్గి, మూడు గంటల ప్రయాణం నలభైనిముషాలకే తగ్గించవీలవుతుందని తెలిపారు. అందుకు ప్రొఫెసర్లు, చక్కని డిజైను చేసి ఇవ్వవలసినదిగా రైల్వే ఇంజినీర్లు విన్నవించారు. అయితే ఎందుకనో, ఏ ఒక్క ప్రొఫెసరు కూడ, ఈ రైల్వే ప్రాజెక్టు పైన ఆసక్తి చూపించలేదు.

నాకు మాత్రం ఆ బురద (మార్ష్‌లాండు) ప్రాంతంలో, రైల్వే ట్రాకు కొరకు, మంచి ఫౌండేషన్ డిజైను చెయ్యాలనిపించింది. ఆ విషయం ప్రొఫెసరు శాంతమూర్తిగారితో చెప్పాను. అందుకు మూర్తిగారు ‘రాహుల్..! ఆ ప్రాంతంలో మట్టి (సాయిల్) చాలా లూజుగా ఉంటుంది. ఫౌండేషన్ డిజైను చేయడం చాలా కష్టం. మరియు ప్రతి మైలుకి, కనీసం ఐదు చోట్ల మట్టి తెచ్చి పరీక్ష చెయ్యాలి. అంటే ఇరవై మైళ్ళ దూరానికి దాదాపు వందకు పైగా మట్టి శ్యాంపుల్స్ టెస్ట్ చెయ్యాలి. అయితే చాలా చోట్ల ఆ బురదలో ఊబిలాగా ఉండి, మనం దిగపడిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల మట్టి శ్యాంపుల్సు తీసుకురావడం, చాలా ప్రాణాపాయంతో కూడిన పని. ఒకవేళ మనం అంత రిస్కుతీసుకొని డిజైన్ చేసినా, రైల్వే వాళ్ళు, బడ్జట్టు తక్కువవుందని మనకేదో ముష్టి పడేస్తారు. అందువలన మనకు శ్రమ తప్ప ప్రయోజనమేమివుండ‘దన్నారు.

అయితే నేను, ‘సార్ ఇది ప్రజలకు ఉపయోగ పడే ప్రాజెక్టు. కావున మనం కష్టపడితే దేశానికి మంచిది కదా. మీరు నన్ను గైడు చేస్తానంటే, నేను ఈ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నాను. మరియు రి స్కు లేకుండా రివార్డు రావుకదా అని‘ ప్రాధేయపడ్డాను.

‘రాహుల్ నీ ఉత్సాహం నాకు తెలుసు. నిజం చెప్పాలంటే ఈ ప్రాజెక్ట్ ప్రాక్టికలుగా ఇంపాజ్‌బుల్. ఎందుకంటే మైలు మైలుకి బంకమట్టి మరియు ఇసక శాతం మారుతూ ఉంటుంది. కావున ఫౌండేషను కూడా మైలు మైలుకు మారే అవకాశముంది. మనం ఎంత ప్రయత్నించినా కూడా డిజైన్ మొత్తం పూర్తి చేయడానికి, దాదాపు మూడు సంవత్సరాలు పడుతుంది. మరి నీ ఎం.టెక్ ప్రాజెక్టేమో ఆరునెలలలో పూర్తి చెయ్యాలి. కాబట్టి ఆ ప్రయత్నం మానుకో‘ అన్నారు.

కష్టమైన పనిచేయడమే కదా రాహుల్ కిష్టం. అందుకే మూర్తిగారితో, ‘అది ఎంత కష్టమైనా పర్వాలేదు. నేను చేస్తాను సార్. మీరు నాకు అండగా ఉండండి చాలు‘ అన్నాను. ప్రొఫెసరు గారు అయిష్టంగానే ‘సరే‘ అన్నారు. ‘వీడేదో ఎగురుతున్నాడు. రెండు వారాల తరువాత వాడే వచ్చి, నేనీ ప్రాజెక్ట్ చెయ్యలేనని చెబుతానని ప్రొఫెసరు గారి అభిప్రాయం.

కాని నేను ప్రాజెక్టును చాలా సీరియస్‌గా తీసుకున్నాను. రైల్వే అధికారుల దగ్గరకెళ్ళి ఆ ప్రాంతం డ్రాయింగ్స్ అడిగాను. వారు నన్ను చూసి, ‘మీ ప్రొఫెసర్లకే ధైర్యం లేదు, నువ్వేమి చేస్తావని‘ హేళనగా నవ్వారు. చివరికి ప్రొఫెసరు ద్వారా ఫోను చేయిస్తే అప్పుడు డ్రాయింగ్సు ఇచ్చారు.

రైల్వే ట్రాకు నిర్మించాల్సిన ప్రాంతం, చెన్నైకి 300 కి.మీల దూరంలో ఉంటుంది. నేను ఒక శుక్రవారం రాత్రి బయలుదేరి శనివారం ఆ ప్రాంతం కెళ్ళి చూశాను. ప్రొఫెసరు చెప్పినట్లు ఆ తీరప్రాంతంలో, తక్కువ శాతం బంక మట్టి ఎక్కువ శాతం ఇసుక ఉండడం వలన, ఆ ప్రాంతమంతా ఊబిలాగా ఉన్నట్లు అనిపించింది. అటువంటి చోట సాయిల్ శ్యాంపుల్స్ కలెక్టు చెయ్యడం చాలా సాహసంతో కూడుకున్న పని. ఎందుకంటే ఎక్కడ ఊబి వుందో తెలియదు. ఒక కి.మీ దూరానికి పది సాయిల్ శ్యాంపుల్స్ చొప్పున, 20 కి.మీలకు కలెక్ట్ చెయ్యడమంటే మాటలు కాదు. అందుకేనేమో ఏ ప్రొఫెసరు కూడా ఇక్కడ ట్రాక్ డిజైనుకు సాహసించలేదు.

ఇదంతా చూసిన తరువాత, మొదట నేనేమీ చెయ్యలేనేమో అని భయమేసింది. అయితే ఏదో ఒకటి సాధించాలనే తపన, నన్ను ఉత్సాహపరిచింది. మట్టి శ్యాంపుల్స్ తెచ్చి, తక్కిన వారమంతా ల్యాబులో పరీక్షలు జరిపేవాణ్ణి. ఇలా దాదాపు నాలుగైదు నెలల్లో, ఇరవై కి.మీ దూరం తిరిగి, మట్టిని తెచ్చి పరీక్షలు జరిపాను.

ఆ సమయంలో ఒక్కసారి కూడా ఇంటికి వెళ్ళలేదు. ఆ బురద ప్రాంతంలో సెల్ ఫోను సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఇంటికి ఫోను చేయలేక పోయేవాణ్ణి. అందువలన నేను ఆ ప్రాంతం వెళ్ళిన సమయంలో, అమ్మా నాన్నా కంగారుపడి, చెన్నై వచ్చి ప్రొఫెసరిని కలిసి వెళ్ళారని తెలిసింది.

డిజైను విషయంలో మట్టి శ్యాంపుల్స్ తీసుకురావడం, టెస్ట్ చేయడం ఒక ఎత్తయితే, టెస్టుల ఫలితాలను విశ్లేషించి, ఆ ప్రాంతంలో సరిఅయిన ఫౌండేషను డిజైన్ చేయడం ఇంకొక ఎత్తు.

ల్యాబు రిజల్ట్సు పరిశీలించిన తరువాత, అక్కడ ట్రాకు నిర్మించడం చాలా కష్టమనిపించింది. అందువల్ల ప్రపంచంలో నిర్మించిన గొప్ప గొప్ప బ్రిడ్జిల డిజైన్సు అన్నీ స్టడీ చేశాను. కాని ఎక్కడ కూడా ఇటువంటి మట్టిలో ఫౌండేషన్సు డిజైను చేసినట్లు కనిపించలేదు. పడిన శ్రమంతా వృధా అవుతుందా అనిపించింది. అయితే ఒకవేళ ఈ డిజైనులో నేను ఉతీర్ణుడినైతే, ప్రపంచంలో ఇటువంటి వర్కు చేసినవాళ్ళలో, మొదటివాడిని నేనే అవుతాను. దానితో ఈ డిజైనుకు రాహుల్ డిజైనని పేరొస్తుంది. మరియు నా డిజైను సాయిల్ ఇంజినీరింగులో క్రొత్త చాప్టరవుతుంది. అంతేకాకుండా పేటెంటుకి కూడా అప్లై చేయవచ్చనిపించింది. ఈ ఆలోచనలు నాలో క్రొత్త ఉత్సాహాన్ని నింపాయి.

తరువాత దాదాపు రెండునెలలు, రేయిపగలు ఈ డిజైన్సు గురించే పనిచేస్తూ, అన్నం, నిద్ర సమయాలు కూడా సరిగా పాటించడం మరచిపోయాను. ఇలా అయితే నీ ఆరోగ్యం పాడవుతుందని, ప్రొఫెసరుగారు చెబుతూ ఈ ప్రాజెక్టును ఇక వదిలేయని చెప్పారు.

అయితే నాకెలాగైనా ఈ డిజైన్‌లో విజయం సాధించి, అందరూ ఇది రాహులు డిజైన్ అనేటట్లు చెయ్యాలనిపించింది. అందువలన ఇంకా పట్టుదలగా పనిచేసి, చాలా రకాల డిజైన్సు చేసి ప్రొఫెసరుకి చూపించేవాడిని. ప్రొఫెసరు వాటిని చక్కగా పరిశీలించి వరదలు, తుఫానులు, సునామీ లేదా తీవ్రగాలులు వీటిలో ఏదో ఒకదానివల్ల ఫౌండేషను వీగిపోతుందని వివరించేవారు.

అందువల్ల 'బుర్ర పాడుచేసుకుని ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. ఈ పై ఇంతటితో 'చాలించన్నారు. అయితే ఏ ఏ కారణాలవల్ల డిజైన్సు ఫెయిలవుతుందో విని, ఆ పరిస్థితుల్ని తట్టుకునేటట్లు ఎలా డిజైను చెయ్యాలని ఆలోచించేవాణ్ణి.

అప్పుడొచ్చింది ఒక చక్కని ఆలోచన. అక్కడ మట్టిని గట్టి పరిచే విధంగా కొత్తరకం కెమికల్సు లేదా సిమెంటు గాని కనుగొంటే, బురద మట్టి మరియు కెమికల్సు కలిపి అడుగు భాగం గట్టిపరిచి, దానిపైన కొంత ఎత్తువరకు పెద్దరాళ్ళతోను, ఆపైన కొంతవరకు చిన్నరాళ్ళతోను, దానిపైన ట్రాకు నిర్మించినట్లైయితే ఈ ఫౌండేషన్ ఒక స్ప్రింగ్ లాగ పనిచేస్తుంది. మరియు ట్రైను ఆ ట్రాకు పైన వెళ్ళినప్పుడు, తక్కువ స్పీడులో, రోలర్ కోస్టరులో వెళుతున్నట్లు, అద్భుతమైన ఫీలింగు కూడా కలగచేయవచ్చు. దానితో ఆ ప్రాంతంలో టూరిజం పెరిగే అవకాశం కూడా ఉందనిపించింది..

ఆ ఆలోచన రావడమే, వివిధ సిమెంటు కంపెనీ ఇంజినీర్లతోను మరియు ఐ ఐ టి కెమికల్ ఇంజినీరింగు ప్రొఫెసర్లతోను చర్చించాను. కాని ఆశించినంత ఉపయోగం కనిపించలేదు. అయితే నిరుత్సాహపడకుండా నేనే వివిధ రసాయనాలు కొని, మట్టితో కలిపి వత్తిడిగా ఒక పైపు ద్వారా నిటి తొట్టిలోనికి పంపి పరీక్షలు జరిపి చివరికి ఏ ఏ కెమికల్సు, ఏ శాతంలో కలిపితే చక్కని ఫౌండేషను డిజైను చేయవచ్చో కనుగొన్నాను. మరియు ఈ ఫౌండేషను అన్ని గడ్డు పరిస్థితులలో గట్టిగా ఉండేటట్లు నిర్ధారించాను.

ఇన్నాళ్ళు శ్రమకు ఫలితంగా, సాయిల్ ఇంజినీరింగులోనే నూతన అధ్యాయం లిఖించబోతున్నందున సంతోషంతో గాలిలో తేలినట్లు అనిపించింది. అంతే ఉద్వేగంతో వెళ్ళి ప్రొఫెసరు మూర్తిగారిని తీసుకొచ్చి, క్రొత్త డిజైను డెమో చూపించాను. వరద, తుఫాను మరియు సునామీ సమయంలో కూడా నిలబడగలదా లేదా అని ప్రొఫెసరుగారు జాగ్రత్తగా పరిశీలించారు. ఎంత పరిశోధించిన అతనికి తప్పులేవీ కనపడినట్లు అనిపించలేదు. అందువలన ఎప్పుడెప్పుడు పొగుడుతాడాయని ఆత్రంగా చూశాను. కాని అటువంటిదేమీ జరగలేదు. 'ప్రస్తుతం నాకు ఏకాగ్రత కుదరలేదు. మరొకసారి తీరికగా పరిక్షిస్తాన'న్నారు.

తరువాత చాలాసార్లు మూర్తిగారిని కలిసి, 'ఈ క్రొత్త డిజైను పైన పేపరు వ్రాద్దామని, మరియు రైల్వే అధికారులకు డెమో చూపిద్దామని' అడిగాను. అయితే 'ప్రస్తుతం నేను బిజీగా ఉన్నానని, పూర్తిగా టెస్టు చెయ్యకుండా పేపరు వ్రాసినా, లేదా డెమో ఇచ్చినా, మనల్ని ఫూల్స్ లాగ చూస్తారని' అన్నాడు. నేను డెమో చూపించిన రోజు నుండి ప్రొఫెసరు గారు అదోలా ప్రవర్తిస్తున్నారు. ఎందుకనో నాతో మాట్లాడేందుకే ఇష్టపడటంలేదు.

ఒక రోజు ప్రొఫెసరు నన్ను వేరే పనిపైన బయటకు పంపి, రైల్వే అధికారులను పిలిచి, నా క్రొత్త డిజైను గురించి గొప్పగా చెప్పారని తెలిసింది. అది విని నాకెక్కడ లేని కోపం వచ్చింది. అయితే మిత్రులు 'కోపం మాని ప్రశాంతంగా వెళ్ళి ప్రొఫెసరిని కలిసి మాట్లాడు, అతనేమైనా రైల్వే వారితో మాట్లాడిన విషయం చెబుతాడేమో చూడు' అని సలహా ఇచ్చారు. ప్రొఫెసరు ఆ విషయం తప్ప అన్నీ మాట్లాడారు. చివరికి నేనే 'రైల్వే వారు వచ్చారట కదా, నా డిజైను చూపించారా?' అని అడిగాను. 'లేదు, వారు వేరే ప్రాజెక్ట్ కోసం వచ్చారని' చెప్పాడు. అబద్ధం చెబుతున్నట్లు అతని ముఖం చెప్పింది. అతన్ని చూస్తుంటే చాలా అసహ్యమేసింది. 'చదువుకున్న దొంగ లేదా కుక్క అని' తిట్టాలనిపించింది.

ఆ సమయంలోనే 'అన్నా యూనివర్సిటీ వారు, ఫౌండేషన్ ఇంజినీరింగు పైన ఇంటరు నేషనలు కాన్ఫరెన్సు నిర్వహిస్తూ క్రొత్తగా రిసెర్చు చేసిన విషయాలపై పేపర్సు పంపించమని' ప్రకటించారు. అది చాలా శుభవార్తలాగ అనిపించింది. ఎందుకంటే ఈ కాన్ఫరెన్సుకు ప్రపంచములోని పితామహులైన ప్రొఫెసర్లు, ఇంజినీర్లు వస్తారు. వారికినా డిజైను చూపించుటకు ఇది చక్కటి అవకాశం. కాబట్టి ఎలాగైన ప్రొఫెసరును ఒప్పించి పేపరు పంపించాలని అనుకున్నాను.

అయితే ప్రొఫెసరు, నాతోటి విద్యార్థులు చేసిన నాసిరకం వర్కుపైన, పేపర్లు వ్రాయనికి అనుమతి ఇచ్చారు. నన్ను మాత్రం 'నీ వర్కు పేపరు వ్రాసేంత గొప్పది కాదు. మనం పేపరు పంపిస్తే కమిటి వారు చెత్తబుట్టలో పడవేస్తారని' అన్నాడు.

ఎన్నోసార్లు పేపరు వ్రాయడానికి అభ్యర్థించాను.. ప్రొఫెసరు అనుమతివ్వక పోగా, విసిగించొద్దని తిట్టాడు. అయితే నేను పట్టుదలగా 'సార్ మనం పేపరు పంపుదాం, ఒకవేళ కమిటి నిరాకరిస్తే అప్పుడు చూద్దామని చెప్పి' ఒప్పించాను. అయితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాన్ఫరెన్సు కమిటివారు నా పేపరును స్వీకరించారు. కాన్ఫరెన్సు మొదలయింది. మొదటి రోజు ప్రసంగించిన పేపర్లంతా చాలా పేలవంగా ఉన్నాయి. నేను రెండవ రోజున ప్రసంగించాలి. నా పేపర్ని అందరు ప్రసంగించినట్లు, లెక్చరిచ్చినట్లు కాకుండా, నేనే ప్రశ్నలు వేస్తూ అందుకు సమాధానాలిస్తూ, మంచి మల్టీమీడియా ద్వారా, వరదలు మరియూ భూకంపాలు వచ్చినప్పుడు, ట్రాకులో ఎటువంటి మార్పులు కలుగుతాయి. మరియు ట్రాక్ ఏ విధంగా పదిలంగా ఉంటుందనే విషయాలు, ఒక సినిమాలాగ చక్కగా వివరించాను. నా ప్రసంగం మధ్యలోనే పనివున్నట్లు ప్రొఫెసరు లేచి వెళ్ళిపోయారు. ప్రసంగం ముగిసిన తరువాత, రెండు నిముషాలవరకు హాల్లో నిశ్శబ్దం ఆవరించింది. ఏదో మత్తు చల్లినట్లు అందరు నిశ్చేష్టులయి ఉన్నారు. తరువాత తేరుకుని చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. ఆ పైన అద్భుతమైన వర్కంటూ అందరూ ప్రశంసలు తెలియచేశారు.

ఆ రోజు సాయంత్రం డెలిగేట్సుకు సవేరా హోటల్లో డిన్నరు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఫౌండేషను ఇంజినీరింగులో పితామహులైన స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసరు స్టీవ్ అర్థర్, యమ్మైటీ ప్రొఫెసరు లారా రాబర్టు నా దగ్గరికి వచ్చి 'చాలా గొప్ప వర్కు చేశావని, ఇది సాయిల్ ఇంజినీరింగులో ఒక కొత్త చాప్టరవుతుందని చెబుతూ, నువ్వు పి.హెచ్.డికి మా దగ్గరకి వస్తే మా అదృష్టంగా భావిస్తామని' అన్నారు.

ప్రపంచంలో ఎంతో మంది ప్రొఫెసర్లు, స్టూడెంట్స్, స్టీవ్ మరియు రాబర్టుల దగ్గర పనిచేయడానికి లేదా మాట్లాడటానికి ఎంతో తపన పడతారు. అటువంటిది, అంతటివారు నాకు పి హెచ్ డి అవకాశమివ్వడం, ఇన్నాళ్ళు నేను పడిన శ్రమకు లభించిన గొప్ప బహుమానమనిపించింది. ఈ విషయం నాకు చాలా సంతృప్తినిచ్చింది.

ఒకప్పుడు డ్రాయింగ్స్ అడిగితే, నన్ను ఎగతాళిగా మాట్లాడిన రైల్వే అధికారులు కూడా డిన్నరుకి వచ్చారు. నాకెందుకో వారితో మట్లాడాలనిపించలేదు. అయితే వారే నా దగ్గరికి వచ్చి, జరిగిన దానికి క్షమాపణ చెపుతూ 'చాలా అద్భుతమైన వర్కు చేశావనియు, వారం రోజుల క్రితం మీ ప్రొఫెసరు, నీ డిజైను గురించి వివరించారని, ఈ డిజైను పైన పేటెంటు తీసుకురావడానికి లాయరుతో సంప్రదింపులు జరుపుతున్నారని' తెలిపారు.

అది విన్న తరువాత ప్రొఫెసరు మూర్తిగారిపైన విపరీతమైన కోపం, ద్వేషం కలిగాయి. 'నాతో రైల్వేవారికి నా ప్రాజెక్టు చూపించలేదన్నాడు. నా వర్కు గొప్పది కాదన్నాడు. అయితే నాకు తెలియకుండా పేటెంటుకు ప్రయత్నిస్తున్నాడు. ఇలాంటి ద్రోహులకు ఏ శిక్ష విధించినా తక్కువే' అనిపించింది. ఎలాగు రెండు పి.హెచ్.డి ఆఫర్లు ఉన్నాయి కాబట్టి, అతని ముఖం చూడకుండా రెండురోజులలో ఇంటికెళ్ళిపోదామని నిర్ణయించుకున్నాను.

అయితే మరుసటి రోజు ప్రొఫెసర్, నన్ను ల్యాబుకు రావలసిందిగా, నా క్లాసుమేట్ రఘు ద్వారా, కబురు పెట్టారు. నేను వెళ్ళలేదు. నా సెల్లుకు ఫోను చేశారు. కాల్స్ అన్నీ కట్ చేశాను అలా పదిసార్లు చేసిన తరువాత కోపంగా 'ఎందుకు విసిగిస్తారు, నాతో మీకేం పని? 'అన్నాను. ప్రొఫెసరు చాలా ప్రశాంతంగా, 'నీ కోపం నేనర్థం చేసుకోగలను. అయితే ఒక్కసారి వచ్చి వెళ్ళు, తరువాత నిన్నెప్పుడు విసిగించను' అన్నారు. సరే వెళదాం. ఇది కూడా మంచి అవకాశమే. ఎలాగు రేపు వెళ్ళిపోతున్నాను. 'అతడు చేసిన ద్రోహానికి, మోసానికి తగినట్లు తిట్టవచ్చు అని నిర్ణయించుకుని' వెళ్ళాను.

అయితే ప్రొఫెసరు ఫోనులో మాట్లాడినంత ప్రశాంతంగా ఉన్నట్లు కనబడలేదు. పైగా 'ఎందుకత పొగరుగా ప్రవర్తిస్తున్నా'వన్నాడు. 'నాకేమీ పొగరులేదు. నేను మామూలుగానే ఉన్నానని' చెప్పాను. అయితే పిలిస్తే ఎందుకు రాలేదన్నాడు.

‘ఒకరి శ్రమని దొంగలించి, సమాజంలో పెద్ద ప్రొఫెసర్లని ముసుగులో తిరిగే, మీలాంటి ఊసరవెల్లి ముఖాలను చూడడం ఇష్టం లేక అలా చేశా‘నన్నాను.

‘మాటలు జాగ్రత్త, ఏమిటోయి నేను దొంగలించింది చెప్పు‘ అన్నాడు.

‘నాతో నా డిజైను గొప్పది కాదన్నారు, కానీ చాటుగా రైల్వే వారికి చూపించారు. మరియు నా వర్క్ పైన పేటెంటుకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇవి చాలా. ఇంకా కావాలా?‘ అన్నాను.

దాంతో ప్రొఫెసరు కోపంతో ఊగిపోతూ ‘ఏంటోయి బోడి డిజైను నువ్వు చేసింది. ప్రపంచంలో నువ్వే గొప్ప ఇంజినీరైనట్లు మాట్లాడుతున్నావు. రెండు ఇంజినీరింగు డిగ్రీలు, పదిహేను డిజైను సబ్జెక్టులు చదివిన తరువాత, కొంత మట్టి తెచ్చి, ఐ.ఐ.టి ల్యాబుల్లో, అధునాతన పరికరాలు, కంప్యూటర్లు ఉపయోగించి, ఏదో ఒక చిన్న డిజైను చేస్తే, దానికంత తలపొగరా నీకు. ఒక కుమ్మరిని చూడు. నీలాగా ఏ కోర్స్ చదవకుండానే, ఏ పరికరాలు వాడకుండానే, కేవలం చేతితో తాకి, ఏ మట్టి కుండలకి సరిపోతుందో నిర్ణయించగలడు. అతనిలో గొప్ప సివిల్ ఇంజినీరు లేడా? ఆ పని నువ్వు చెయ్యగలవా? అలాగే తను చేసిన కుండలను కాల్చటానికి చక్కని కొలిమి (ఫర్నేసు) నిర్మించుకుంటాడు. మరి అతనిలో గొప్ప మెకానికల్ ఇంజినీరు కనపడడా? అంత ఎందుకు.. అల్ప ప్రాణి చీమని చూడు. మట్టిని నున్నగా చేసిదానికి సరియగు శాతం నీరు కలిపి, దానికన్నా ఎన్నో రెట్లు ఎత్తుగల పుట్ట నిర్మించగలదు. ఇవ్వన్నీ నువ్వు చెయ్యగలవా? మరేమిటి నీ గొప్ప అని‘ తిట్టాడు.

నేనెపుడు ఇంత కోపంగా ప్రొఫెసరు మాట్లాడటం చూడలేదు. నేను తిట్టాలని వస్తే అతను నన్ను తిట్టడం నేనూహించని పరిస్థితి. అతడు చెప్పినవన్నీ సత్యాలే. అయితే అతని దగ్గర చులకన కావడం నాకిష్టం లేక ఇలా అన్నాను ‘మీరు చెప్పినట్లు నా డిజైను అంతా చెత్తదయితే, ఇంత మంది ప్రొఫెసర్లు, ఇంజినీర్లు నాది గొప్పవర్కని ఎందుకన్నారని‘ అడిగాను.

అపుడు ప్రొఫెసరు తన కుర్చీలోంచి లేచి, టేబులు కిటువైపు, అంటే నా వైపు వచ్చి, ఆప్యాయంగా నా భుజాలపైన చేతులు వేసి, నిలబడి వున్న నన్ను కుర్చీలో కూర్చోబెట్టి, తను నాకు దగ్గర టేబులుపైన కూర్చుని, జీరబోయిన గొంతుతో మిక్కిలి ఆర్ధ్రతతో, ‘రాహుల్ నువ్వు చేసిన డిజైను చాలా అద్భుతమైనది. మానవాళికి ఉపయోగపడే అతి చక్కని ప్రాజెక్టు. ఎవరూ చేయని సాహసం చేశావు. ఒక సైనికుడులాగా ప్రాణాలను లెక్కచేయక, ఊటీ ప్రాంతంలోకి వెళ్ళి మట్టిని తెచ్చావు. ఆరోగ్యం లెక్కచేయక, నిరుత్సాహపడక రేయి పగలు కష్టపడ్డావు. అటువంటి నువ్వు నా దగ్గర పొగిడించుకోవాలని ఎంత తపన పడ్డావో నాకు తెలుసు. అలాగే నేను నిన్ను అభినందించనందుకు ఎంత వెతచెందావో కూడా తెలుసు. అయితే నిన్ను ఎప్పటికప్పుడు పొగడాలని ఉన్నా, పొగడలేకుండా నటించినందుకు, నేను అంతకు రెండింతలు బాధ పడ్డాననే విషయం నీకు తెలియదు‘ అన్నాడు.

ఆశ్చర్యంగా ప్రొఫెసరు కళ్ళలోనికి చూశాను. అతడి మాటల్లో నిజాయితీ ఉన్నట్లు అనిపించింది. అయితే ఇన్నీ రోజులు ఎందుకిలా ప్రవర్తించాడో అర్ధం కాలేదు. అదే విషయంలో అడిగాను.

రాహుల్ నువ్వు మట్టి శ్యాంపుల్స్ కోసమై, ఊరెళ్ళిన సమయంలో మీ తల్లిదండ్రులు వచ్చారు. నేను వారితో ‘రాహుల్ చాలా బ్రిలియంట్ మరియు డెడికేటెడ్ విద్యార్ధి. అటువటి కొడుకును కన్న మీరు చాలా అదృష్టవంతులని‘ అన్నాను. అయితే వారి ముఖాలలో ఆనందానికి బదులు, వారు ఎందువలనో దిగులుగా ఉన్నట్లు అనిపించింది. అపుడు నేను ‘ఎందుకలా ఉన్నారు, ఏమిటి మీ భయమని‘ అడిగాను. అందుకు వారు ప్రొఫెసరు గారు మావాడి పట్టుదల, తెలివి గురించి మాకు తెలుసు. అయితే వాడు సాధించే విజయాలకన్నా, ఫెయిలయిన సమయంలో ఏ అఘాయిత్యం చేస్తాడనే భయమే మమ్మలని ఎక్కువ పీడిస్తుందని, నీ గతం అంతా చెప్పారు.

దాన్ని బట్టి ‘తెలివి, పట్టుదల, ధైర్యం, కార్యసాధన ఇవి నీలోని మంచి గుణాలయితే, పొగడ్తల కోసం, పేరుకోసం వెంపరలాడడం, అపజయాలను ఒప్పుకోవడం ఇవి నీలోని బలహీనతలని‘ చెప్పాడు.

నేను అందుకు, 'అందులో తప్పేముంది. కష్టపడతాను. పేరుకోసం తపన పడతాను. అది మానవ సహజం' అన్నాను.

'రాహుల్ గొప్ప పని చెయ్యాలనుకోవడంలో తప్పులేదు. అయితే ఆ పని కేవలం పేరుకోసం, కీర్తికోసం, చేస్తే ఆ పనికి ఎక్కువకాలం గుర్తింపు ఉండదు. అలాంటి వాళ్ళ పేర్లు కూడా త్వరగా మాసిపోతాయి. అలా కాకుండా పేరుకి, పదవికి వెంపర్లాడకుండా నిస్వార్థంగా పనిచేసే వాళ్ళు పేర్లు శాశ్వతంగా ఉండిపోతాయి. అందుకు ఉదాహరణ మహాత్మాగాంధీగారు, మదర్ థెరిసా గారు' అన్నారు.

ఇంకో విషయమంటూ, 'పొగడ్త అనేది ఒక మత్తు లేదా వైరస్ లాంటిది. దాన్ని మానేజ్ చేయడం తెలుసుకోవాలి. మనం రోజూ పేపర్లలో, టీవీలో ఎంతోమంది క్రొత్త కళాకారులని, క్రీడాకారులని చూస్తాం. వారంతా భవిష్యత్తులో చాలా గొప్పవారవుతారని అనుకుంటాం. అయితే వారిలో చాలామంది త్వరగా కనుమరుగైపోతారు. కారణం పొగడ్తల మత్తులో పడి, చెయ్యవలసిన పనిపైన ఏకాగ్రత కోల్పోయి పతనమవుతారు. మరికొందరు మందు, డ్రగ్స్ వంటి చెడు అభ్యాసాలకి బలి అవుతున్నారని' చెప్పాడు.

'మీ కాలం పిల్లలకి విలువలు గురించి చెప్పే, సుమతీ శతకం, పెద్దబాల శిక్షవంటివే చదివే టైమే లేదు. అందువలనే మీ తరం వారు చిన్న విషయాలకే చికాకు పడి బారులలో, పబ్బులలో సేద తీర్చుకుంటున్నారు. ఇక నీ విషయానికొస్తే, నీ వొక అద్భుతమైన ప్రతిభగల ఇంజినీరు. నీవెవరి దగ్గర పి హెచ్.డి చేసినా, ఆ ప్రొఫెసర్ల అదృష్టమేగాని నీదికాదు. సర్ ఆర్థర్ కాటన్ మరియు విశ్వేశ్వరయ్య గార్లవలె, నీవల్ల ప్రజలకెంతో ఉపయోగపడే ప్రాజెక్టులు రావలసి ఉంది. అయితే పొగడ్త, నీ బలహీనత అని తెలిసిన ప్రొఫెసర్లు, ఇంజినీర్లు నిన్ను పొగడ్తల మత్తులో ముంచి, నీ ఫోకసు మార్చి, నిన్ను వారి పనులకు ఉపయోగించుకోవడమో లేదా నీ ఎదుగుదలని నివారించడమో చేస్తారు. అందుకే మెలుకువగా' ఉండాలి.

మరొక విషయం,'ఒకవేళ తెలివితక్కువ వాడికి, చెడ్డబుద్ధి పుడితే, వానివల్ల జరిగే నష్టం చాలా తక్కువే. అదే తెలివైన వాడికి చెడ్డ ఆలోచనలొస్తే వాడివల్ల ప్రపంచానికి జరిగే నష్టం తీవ్రంగా ఉంటుంది. ఉదాహరణకి, బిన్ లాడెను తెలివైన సివిల్ ఇంజినీరు. అయితే అతడు నిర్మించడానికి బదులు నిర్మూలించడానికే ప్రాధాన్యత ఇచ్చాడు. అలాగే నువ్వు కూడా, అనుకున్న పేరు రాకపోయి విసుగు చెందిన రోజు, కొంతమంది దుష్ట వ్యక్తులు నిన్ను చెడుకార్యాలకు ఉసిగొల్పే ప్రమాదం లేకపోలేదు' అని చెబుతూ

అందువలన, 'బహుమానం, సన్మానం, అవమానం అన్నిటినీ సమానంగా చూడడం నేర్చుకోవాలి. సత్కారాలకి, పురస్కారాలకి పొంగి పోని, తిరస్కారాలకి కృంగిపోని సంస్కారం అలవాటు చేసుకోవాలి. ఫేం, షేం, పార్ట్ ఆఫ్ ది గేం అని తెలుసుకుని మెలగాలి' అని చెప్పారు.

'ఈ విషయాలు నేను మామూలుగా చెబితే నువ్వు వినవని తెలుసు. అందుకే ఇలా నిన్ను బాధలు పెట్టి చెప్పాల్సివచ్చింది. నన్ను క్షమించు. నేను చెప్పదలచుకున్నది చెప్పాను. ఇకపై నీ ఇష్టం' అని చెప్పి, ముఖ్యంగా నిన్ను పిలిపించింది, 'నీ డిజైను పైన పేటెంటుకి అప్లై చేసేందుకై, లాయరు ద్వారా అప్లికేషను సిద్ధం చేశాను. నీవు చదివి సంతకాలు పెట్టు అని' అప్లికేషనిచ్చాడు.

అప్లికేషను మొత్తం చదివాను. అన్ని చోట్లా నా పేరే ఉంది. ఒక్క చోట కూడా ప్రొఫెసరు పేరు లేదు. ఆ విషయమే అడిగాను. అందుకు 'రాహుల్ ఇది నూరు శాతం నువ్వు చేసిన పని, కావున నీ పేరే ఉండాలి' అన్నాడు.

అంతకు ముందే, ప్రొఫెసరిని దొంగ, ద్రోహి, మోసగాడని తిట్టినవన్నీ గుర్తొచ్చి, సిగ్గుతో భోరుమని ఏడ్చి ప్రొఫెసరు కాళ్ళు పట్టుకున్నాను. ప్రొఫెసరు అందుకు 'రాహుల్ డోంట్ డు దట్' అని పైకి లేపాడు.

'లేదు సార్, నేను చాలా పాపిని, మీలాంటి ఉత్తమ గురువులని తిట్టానని' చెప్పాను.

'దట్స్ ఓకే రాహుల్. నీకు నిజంగా నాపైన గౌరవముంటే, మీ తల్లిదండ్రులను బాధపెట్టకుండా, ప్రజలకి ఉపయోగపడే పనులు చెయ్యి. దానితో నీకు తెలియకుండానే సర్ ఆర్థర్ కాటన్, విశ్వేశ్వరయ్య గార్లలాగ నీ పేరు చరిత్రలో నిలిచిపోతుందని' చెప్పాడు.

నేను 'ఇకపై మంచి ప్రవర్తనతో మెలుగుతానని ఆనందంగా ప్రొఫెసరికి ప్రామిస్' చేశాను.

పాఠాలు చక్కగా చెప్పే ఉపాధ్యాయులెందరో ఉంటారు. అయితే విద్యార్థిలోని చెడును గుర్తించి తగిన పరివర్తన, ప్రవర్తన నచ్చనట్లు గుణపాఠాలు చెప్పే మూర్తిలాంటి గురువులు నూటికి కోటికి ఒక్కరుంటారేమోననిపించింది. నిజానికి అటువంటి ప్రొఫెసరుగారు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

## జమ్మడు - పాలకొల్లు రామలింగస్వామి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

"**గెడ కర్ర నాగ** మనిసివి పెరిగినావు గాని... బుద్దిమాత్తరం పెరగనేదు. నానుగాని సచ్చింతర్వాత ఎలాగ బతుకుతావో... ఏటో అర్దంకాకుంటంది!" అని అంతాది మాయమ్మ ఎప్పుడు నాతోటి.

మా యమ్మ ఎర్రిగాని బతకడానికి తెలివుండాలంతాదేటి..!?

గంపలేని కోడినేదా.... సాల్లోని పసివి నేదా. ఆటికి మాత్తరం పేనం నేదా.. గడ్డిగాదం తిని బతకనేదా.. ఆటిలాగే నానూ అని అంతే ఎర్రోన్ని సూసినట్టిగ నాకాసి సూత్తాది.

"ఒరేయ్ నాయిన! మనిసికి పసివికి పోలికేటిరా.. తేడా నేదా? మనిసి బతకడానికి తిండేకాదు డబ్బులుండాల. అది సంపాదించాలంతే ఏదో ఒక పనిసెయ్యాల. ఎందులో వొకందులో ఇప్పటికి నువ్ కుదరకోకపోయే ఎలాగ సెప్మీ...!? నీ తోటోలంతా నీలాగే ఉన్నారా? సచ్చి ఏలోకానున్నాడోగాని మీయయ్య కూడా నీలాటోడే! తాగొద్దని ఎంత బతిమాలినాను. ఇన్నాడా..!? రిచ్చాలాగి తెచ్చినవే కాదు ఇంటిలోని డబ్బులు కూడా ముండాతాగుడికే పోస్సినాడు. అప్పుడలాగ అతగాన్తోటి, ఇప్పుడిలాగ నీతోటి పడుతన్నాను బడవ.. ఎప్పటికి గేనం తెచ్చుకుంతావో.. ఏటో..!?" అని అన్నాది మాయమ్మ. పొంగుతున్న ఎసర్లాగ గప్పున సిర్రొచ్చినాది నాకు.

"వోస్ యేటే..! అలాగంతావ్!.. ఎవులిక్కడేటి అలీగున్నారా. ఎందికే మనసుల్లలాగ తినేత్తవ్?! నీ బాదపడనేకే గదా. వూల్లోని ఎవులేపని సెప్పినా సేత్తన్నాను. పదో పరకోతెత్తన్నాను. అదిసాలదేటే..!?" అని గట్టిగా కేకలేసినాను.

"వోయబ్బో!.. సెత్తన్నావురా గొప్పోటిపని.. అదిగోటి పన్నుంచి నువ్ తెచ్చిన లచ్చలు లెక్కెట్టడ్డానికి నా జబ్బసత్తువ సాలకుంటందనుకో. ఏటేన అనడం బయ్యం ఇల్లెగిరిపోయినట్టిగ అరుస్తావ్. పరలోకమందునున్న ఓ.. నా పెబువా!.. ఎలాగ ఈడ్ని దార్లోన పెడతావో... అంతా నీ దయ తండ్రీ!"

అని మెడలోని సిలువ తీసి నెత్తిమీదుంచుకుని కళ్ళు మూసుకుని పెదాల్ని టపటపలాడిస్తాది. దాన్నలాగ సూస్సేరికి నవ్వాగనేదు. బకబకమని నవ్వినాను.

"అలాగేన్నేయ్.. నువ్వొకదానివి. పెతీదానికి ఇంటిల వరడ నాగ.. తయారుబడినవ్!"

అని అనీసి కోపంగా బయటికి ఎలిపొచ్చిసీనాను.

ఆ ఎలిపోవడం తిన్నగా బుక్కూరు బండకాసి నడుసుకుని నారాయనపురం మెట్టకాడికి ఎలిపొన్నాను. అక్కడ కర్రాకంపకొట్టి ముట్టినాగ సేసుకుని తలెత్తుకుకొనేసరికి సూరీడు నడినెత్తిమీదికొచ్చినాడు. ఆకలితోటి కడుపు గాలొగ్గేసిన బూరగ నాగ ఏలబడిపోతంది జుఁవాయించిపడిపోతానేటో నన్నంతగా కల్లూ కాలూ పీకేస్తున్నాయి.

"టయిమెంతయ్యిందో ఏటో! మోపును ఆదెమ్మకాడ పడేసి గబీల్న అన్నం తినీయాల.." అని నాలో నానే గునించుకుని పెద్ద పెద్ద అంగలేస్కోని నడుస్తన్ను.

ఇంతకీ –

ఆదెమ్మ ఎవులంతే.. ఆ యమ్మ మా ఊరి బడిలోని వంటమనిసి. రెండొందల మంది గుంటలకి మజ్జేనం బువ్వొండుతాది. నాలాటోలకి అప్పుడప్పుడు లేదనకుంట అన్నఁవెడతాది.

సెప్పక బయమేమిటి...!?

మేస్టులేవులైనా సూసినా పల్లకుంతారు. 'పోన్లేరా... తిన్నిద్దూ!' అని అంతారేగాని ఏటనరు. అంత మంచోలాలు!

మా బడిలోన సాంబారుంతాదీ. మా గొప్ప రుసీగుంతాదనుకో. నెత్తిగొట్టుగొని తినాల. వంకాయ, ఆనబకాయ, ములంకాడ, టమాట పండు ముక్కలేసి సాలా బాగా వండుతాదాయమ. అయితేటంతే –

పొయ్యిమీదికో.. కిందికో.. ఏదో ఒకటి ఆయమ్మకియ్యాల.. ఇత్తేగాని బువ్వెట్టదు.

అవునది నిఁజివేలే!

ఉట్టినే బువ్వెట్టాలంటే ఆయమ్మకైనా ఎక్కడ్నుంచి వస్తాది! మొన్నా మజ్జి ఆనబకాయలు తెచ్చిచ్చినాను.

ఇయ్యాల.. ఇదిగో ఈ కర్రల మోపు!

ఇస్కూల్లోన నాను అడుగెట్టేసరికి గుంటలకి బివ్వొడ్డిత్తందాయమ్మ. ముట్టిని పొయ్యికాడ పడేసి బోరింగు కాడ కెల్లి కాల్లూ సేతులు సుబ్బరంగ కడుక్కున్నాను. బుర్రమీది తువ్వాలిని తీసి అంతా తుడుసుకున్ను – ముక్కు వాసనేత్తందది. మొలకి సుట్టుకున్న పంచి, ఏసుకున్న జుబ్బాది కూడా అదే వోసన..

ఇంటికెల్లాక సావుకారి కాడ రూపాయి సర్పుగుండ కొనుక్కుని గుడ్డలుతుక్కోవాలని అనుకున్ను.

నిదానంగా పక్కనున్న టేకు తోటలోకి తోవదీసినాను. నాలుగాకుల్ని సేత్తో తెంపి రెండు డొప్పల్లాగ సేసుకున్నాను. పిల్లలందరివి తినడాలయ్యాక ఒక డొప్పలో నాకు బువ్వెట్టింది. దాన్ని తినీసేక మరొకదాన్లో అన్నఁవేసి సాంబారు పోసినాది. అది మా యమ్మకి! దాన్నొట్టుకుని ఇంటికెలిపోన్ను.

ఈ ఒక్క ఆదెమ్మకే కాదు ఊల్లోని ఏకతయినా, కార్యమయినా యే కర్రో కంపో తేవాలంతే అది నా వొల్లే అవుతాది. మరెవులివల్లా కాదు.

ఇగ్నేస్పరుడి పూజిలయినా, అయ్యప్పసోమి బజినిలకయినా, దుర్గతల్లి పూజిలయినా అందరికంటే ముందుగా ఊల్లోని పెద్దలు నాకే కఁవురెడతారు.

"వొరేయ్ జమ్మిగా! అడవికెల్లి పత్తిరి పూలు తేరా అనీసో.... తోటలోని అరిటాకుల్ని కోసి తెమ్మనీసో సెప్పుతారు. నానా పనిజేసినందుకు కడుపు నిండా బువ్వెడతారు. సిల్లర డబ్బులు కూడా ఎంతో ఇత్తారు.

రెండు కూరలు, గారిలు, పులావు, పరమాన్నము, సాంబారితో పట్టు పట్టి లాగించేత్తే నా సామిరంగా వోపంతా తీరిపోద్దనుకో... ఒక రోజల్లా ఆకలంతే తెలీనంతగా పీకమొయ్యతింతాను. "జమ్మయ్య.. నీకు జీర్నసెత్తి ఎక్కువురా.. నీ ఈడోలకంటే వొక ముద్ద ఎక్కువే తింతావు!" అనీసి మాయమ్మ ఆడేమాట ఎంతో నిఁజిం!

అదే. వొక్కో సుట్టూ రెండేసి రోజులు తిండినేప్పోతే ఆకలిక్కాత్తాది. ఊల్లోని సంసారుల పెల్లిల్లప్పుడో, అసిరమ్మ పండగప్పుడో, సమర్తకార్యాలప్పుడో పొద్దు గుంకేసరికి మాపేటోలంతా ఆల గుమ్మాల మీదికి సేరిపోతాము గిన్నెలొట్టుకుని!

"ఏలయిపోడం బయ్యం.. మిడతలదండు నాగ వొలిపోతారు.. ముండమంద!" అనీసి నాయురాల్లు మా మీద సీదరించుకున్నా సరే.. సాలల్లోన కాల్లు పీకినంతవరకు నిలబడతాము. మా తోటి పోటాపోటీగా.. మా ముంగటే దెబ్బలాడుకుంటూ టేపులు.. అలాగ ఆల్లిచ్చినవన్నీ బద్దరంగ ఇల్లకొట్టుకొచ్చి పిల్లాది సద్దుకుని తింతాము. యేటి సేత్తాము!!? మా దరిద్దరం నాగే ఎప్పటికీ మమ్ము వొగ్గకుంటంది ఈ ఆకలి! ఎంత తింతన్నా.. తీరని ఆకలి!

ఆకలంతే. ఒక బోగట్టా మీ తోటి సెప్పాల. అదేదో ఊల్లోనట.. పాపము. ఆకలికి వోర్సుకోనేక కడుపునిండా ఇసకని తినీసి, నీల్లు తాగి బతుకు తండట వో మనిసి!. టీవిల్లోన సూపించినారని ఊల్లోని గౌర్నాయుడు మేస్టు ఎవుల్తోనో సెప్పుతుంటే ఇన్నాను. అదేటది.. గొప్ప ఇస్త్రింగా ఉంది..!? అడిగ్గాని తిపారమేటి. ఆకలేత్తే అన్నము పెట్టమని ఎవుల్నేనా అడగాలి గాని అలాగ ఇసక తిండమేటి...!?

అవున్నే.. అది నిఁజిమే!

ఆడిని కూడా తప్పనలేము. తల్లికి పిల్ల పెట్టని రోజులివి!

ఈ కరువుకాలంలో ఎల్లకాలము తిండెట్టడమంటే ఎవుల్ని వల్ల అవుతాది సెప్మీ.. ఎవుడి బాద ఆడిది!

ఒకరకంగా సెప్పాలంతే.. ఇలాగే బాగుంతాది నెద్దు!

మా యమ్మ ఉందా. కొండకెల్లి క్రల్తేవాలా.. ఎవులికైనా ఆటిని అమ్మాలా. ఆవొచ్చిన సోడముప్పాతిక డబ్బుల్తోటి యేటికొంతాది సెప్మీ! పప్పు, ఉప్పు కొంతాడా.. నూన, వర్రా కొంతాదా.. దరలేటి బూమ్మీద ఉన్నాయా.. మరి కూడు మీద కూరటేటొండుతాది.. ఒట్టి గెంజన్నంతోటే దినం తీర్సాల... ఇలాంటివి సూసేగావాల వండుకున్నోడికంటే దండుకున్నోడు మేలని సామిత పుట్టినాది.

అవునట్టిగ... సామితంటే ఒక సంగతి గుర్తుకొస్తంది.

మా యమ్మాలు సిన్నపుడట. పెద్ద పెద్ద కుంబాల్లాగ ఇసుక కుప్పల్ని ముందు ఏసుకుని ఇంతేసి అన్నాలెప్పుడు తినే రోజులొత్తాయో. ఓ ఏసయ్యా!... అని పేర్దించోరట. ఆ ఆశ ఇప్పటికలాగే ఉండిపోనాది. మరి ఎప్పటికి తీరతాదో ఏటో.. ఆ పెబువు దయ!

ఇలాటివన్నీ సిన్నప్పటినుంచీ ఎరిగినోన్ని కాబట్టి మరి నాను ఆలీగుండను. జనువు లొలుపులప్పుడో. నూరుపులప్పుడో.. ఎవులైనా ఇల్లిరగదీసి కడుతున్నపుడో.. ఒకటేటి ఎలాపింటి పనయినా సిన్నతనం పడకంటసేత్తాను. నా ఆకలి తీరిపోతే... అంతేసేన

నా సిన్నప్పటిమాట. నాకు పది పన్నెండేల్లుంతాయి గావాల. సదువబ్బక బడి మానీసిన్తరువాత బక్కల్ని కాసినాను. కొన్నాల్లదిసేసినాక మానీసినాను. ఆ తర్వాత మా పెసిడెంటుకాడ రైతరికం సేసినాను. అతగానివి మాఁవిడి, జీడితోటల్ని కాసినాను. అదీ నప్పనేదు.

దాన్తరవాత కొన్నాల్లు మంటిపనికి ఎల్లినాను. అదీ అచ్చనేదు. అందికే మాయమ్మకి నానంటే ఉడుకు!

'పనయితే సేత్తావుగాని.. సేత్తన్న పన్లోని నీకు నికటముండదురా. అదే నీ తోటి సిక్కు!" అనీసి మాయమ్మ ఎప్పటికప్పుడు ఎర్రెత్తిపోద్ది! వోరము కిందటి మాట.

మా ఊల్లోకి రాకుండా మజ్జిలో బస్సాగిపోయినపుడు గావాల. సావుకారి ఇంటికి కఁవురెట్టినాడు. నానొచ్చి అతనిముందు నిలబడినాను.

"జమ్మయ్యా! టౌనుంచి తెచ్చిన మనసామాన్లన్నీ బండిలో ఉండిపోనాయిరా. ఆటన్నిటిని ఇంటికి పెరిగీమిరా!. నాయిన్నాయినా!" అని బతిమాలినాడు.

సామాన్లన్నీ పెరిగిసింతర్వాత ఊరగాయబద్దతో కడుపునిండా కూడెట్టినాడు.

'సిల్లరనేదురా...డబ్బులు తర్వాత ఇత్తాన్నే!' అని ఎలిపొచ్చీసి ముందు సావుకఁవురు సల్లగా సెప్పినాడు సావుకారు.

మరి నా నేటి అనలేకపొన్నాను.

ఎందికంతే... అతనికాడ నాకు మొగమాటము! అవుసరమొచ్చి అడిగితే... సుట్టో, బీడియో, మాత్తరో ఆ బావుకాదనకుంట ఇత్తాడు. ఇంటిలోని మనిసినాగే కష్టమూ, సుకమూ అన్నీ నాతోటి మనసిప్పి సెప్పుతాడు. అందికే ఆ బావు అంటే అంతిది నాకు!

వోసారి ఏటయ్యిందంతే –

నడేసవి.. అగ్గినిప్పుల్ని గుమ్మరించినట్టిగ కాత్తంది ఎండ!

కర్నాలగోర్జి చాటుకునినా తొందర్లోన నాను ఇంటికి ఎలిపోవత్తన్నాను. ఆటయిములోన ఎత్తయిన అరుగుమీద కైనీ నములుతూ నిలబడినాడు పెసిడెంటు.

"యేట్రోయ్ జమ్మిగా!.. ఈ మజ్జి అలికిరి నేదేటి..!? " పల్లీసి బెట్టి అడిగినాడతగాను.

"నానెటెల్తాను బావ్!.. ఊల్లోనేగదా ఉంతన్నాను." జవాబిచ్చినాను.

"అవునా.. ముసలిదానికి ఆ వోల్దేజి పించనొత్తందిరా!" అని అడిగినాడు. ఆ బావు అలా అప్మానంగా అడిగేసరికి బుజాలు గజాలయిపోనాయి. ఎంతో సరదా పడిపోన్ను.

"నేడు బావ్!... అదెదో తఁవరే పున్నెం కట్టుకోవాల!" అని బతిమాల్నినాను.

"మంచిదేనిరా. అది నువ్ సెప్పాలేటి.. నా బాజ్జిత. అలాగేన్నే కాని ఒక సిన్నమాట. ఇలాగ రమ్మీ!"

సేతుల్తో దగ్గిటికి రమ్మని సైగేసిసి అన్నాడతగాను.

'ఏటి బావ్!' అని మెట్లెక్కి అడిగినాను.

"మరేటికాదురా. ఈ రోజు మనవరాలి బారసాలరా. సుట్టాలంతా వొచ్చినారు. వోడిక్కినీల్లు లేవు. కొంచిం సాయంసేత్తావని పిలిసినాను. అల్లదిగోటి రమ్ము.. దాన్నింపుగా నీలు తోడిమి!" అని ఆగి

"అన్నట్టు సెప్పడం మరిసిపోన్ను.. నువ్విక్కడే తినిరా. మీయమక్కూడా అన్నం వొట్టుకెల్లు. పనిలోబడి మరిసిపోకు..అర్ధమైందా" అని అసలు బోగట్టా సెప్పినాడు పెసిడెంటు.

సెట్టంత మనిసి, పిలిసి మరి అలాగ సెప్పింతర్వాత కాదని యేటంతాము..!? 'అలాగేని బావు' అని అన్నాను.

"అవునే నీకు మతిలేదేటి..!? ఇంత ఎండలోన నీల్లు తేకపోతే యేటినష్టము...!? దార్లోన నీకేటేనయితే ఎవులు దిక్కు సెప్మీ...! " అని కోంపడినాను.

"అది కాదురయ్యా!. తాగనానికి కూడా ఇంటిల సుక్కనీరు నేదు అందికే బాదయినా ఎల్లినాను." అని అన్నాది. జాపోసిపోయి. దాన్నలాగే గోడకి సేరబెట్టి గలాసుతోటి నీల్లు పట్టినాను. తేరుకుంది. వడిసికంపలాగ ఉన్న దాని వంట్లోని కాక ఏమాత్తరం తగ్గనేదు. ఎండనున్న బండిసెక్రం కమ్మునాగ కాలిపోతుంది వొల్లంత.

నేరడిపల్లు గుజ్జులాగ తవతవలాడతన్నాయి దానికల్లు!

మనిసిలోని ఎగ ఊపిరి దాన్ని మాట్లాడనివ్వడం నేదు.

"పెసిడెంటు ఇంటికాన్నుంచి అన్నము, కూరలొట్టుకొత్తాను. అందాక నువ్ తొంగోయే! ఎటెల్లకు. అర్ధమైందా..!? నా నొచ్చితర్వాత రెండు ముద్దలు తినీసి ఈ మాత్తర్లు ఏసుకుందువు. బయ్యం నేదు. జోరము తగ్గుతాదిలే!"

అనీసి మాఅమ్మకి బోదపరిసి దవిర్యం సెప్పినాను. తిండి మాటినీసరికి అంతనీరసలో కూడా ఎంతో సంబరపోనాది అమ్మ.

"అలాగే.. అలాగేన్నేరా నాయినా!" అని అన్నాది. గిన్ని, తోపేలా వొట్టుకుని పెసిడెటింటికి తిరిగొచ్చినాను. సివరి బంతిగావాల... పలపలాసగ జనంవున్నారు.

"జమ్మిగా!... ఇదేలాస్టు బంతిరా.. ఈల తర్వాత తినుదువులే! ఈలోగ నాతోటి రమ్మి! సెట్టుమీది కొబ్బరి బోండాలు దించిద్దువు." అని పురిగొల్పినాడు పెసిడెంటు.

"వొస్సే... సెట్టెక్కడవే గదా... ఎంతసేపు సిటికిలో పని. నడండి బావ్!" అని అన్నాను.

ఆ బావు ముందన ఎల్తుంటే ఆ ఎనకాతలే నాను. అలాగ ఇద్దరము కల్లానికి సేరుకున్న తర్వాత సెట్లని సూపించి ఆ బావునాకెదురుగ నిలబడినాడు.

సెట్టెక్కుదాంవని బుజమ్మీది తువ్వాలిని తీసి తలకి సుట్టుకోబోతే సూదుల్తో గుచ్చేసినట్టు ఎనక బీపికాడ గబుక్కుని సుర్రుమంది. ఇయన్నీ మనికి కొత్తేటిలేననుకుని కాతరు పెట్టుకోనేదు. సెట్టెక్కి గబగబా మీదికి సేరిపొను.

మరక్కడ ఏటయ్యిందేటోగాని బీపి మీద సలుపు అంతకంతకి ఎక్కువవుతుందేగాని తగ్గకుంటుంది. వోరుసుకోలేకపోతన్ను. నొప్పికాడ.. సేత్తో పాంవాలనుకుని ఒక సెయ్యిని మెల్లగా ఎనక్కితోసినాను. అంతే!.. పట్టు తప్పోనాది. కాసుకోలేకపోన్ను. సూత్తండగానే... తారాజువ్వనాగ కిందికి రాలిపొన్నాను. తెలివొచ్చి సూత్తే –

బూంవిని కరుసుకుని ఉన్నాను... బల్లినాగ!

వొల్లంతా.. గునపాలతో పొడిసినట్టు వొకటే నొప్పులు! ఆం.. ఇంతకంటే ఎక్కువ దెబ్బల్నే తిన్నోన్ని.. ఇదేటి నాకు సేత్తాదిలే అని బాదని బరిత్తన్నాను.

నా ముందు అప్పటికే ఎవులేవులో సేనామంది మూగిపోయారు తలకొక మాటిసురుత్తును!

"రామ.. రామ.. యేటీ గోరము..!?.. ఎంత ఎత్తునుంచి పడిపోనాడు. దెబ్బలెక్కడెక్కడ తగిలాయో.. యేటో..!?"

"సెట్లెక్కడం సిన్నప్పటునించి ఈడికలవాటే... ఎందుకిలాగ జరిగిందో సేనా ఆచ్చర్యంగుంది.. అవునరా.. ఆలమ్మకి ఎవులైనా కవురెట్టేరా...!?"

"సూత్తుంటే.. ఇవన్నీ పెసిడెంటు సెట్టుల్లాగ ఉన్నాయి. ఆ బావు ఎక్కమన్నాడో.. ఈడు ఎక్కాడో...!?"

"పెసిడెంటు ఎక్కమంటే ఏ బాదా నేదు. అతగానికి బాజ్జిత ఉంటాది. నేప్పోతే ఈడి బతుకు సూడాల.. కుక్కబతుకు!"

"ఇంకెందుకు ఆలిస్యం... ఆ నూటెనిమిది బండికి ఎవులో ఒకలు పోను సెయ్యండిరా!"

వాళ్ళు అంటున్న వొకొక్క మాట నా సెవుల్లో పడతన్నాయి. బయంతోటి నా బుర్ర గిర్రున తిరిగిపోతంది.

పెసిడెంటు నిల్సున్నసోటు కాసి దీనంగా సూసినాను. ఎక్కడా అతగాడు అలికిరి నేదు. ఒక్కసారిగా గుండెదడ పెరిగిపోనాది.

వొల్లంతా ఒకటే సెంవట్లు. అప్పతికే ఒకొక్కరు మెల్లిగా జారుకుంతన్రు! నా వొంటి కాసి వోపాలి సూసుకున్ను. గతుక్కుమనిపోన్ను.

ఇదేటిది.. కాలొకటి ఎనక్కి తిరిగిపోయిందేటి..!?

కొంపదీసి కాలుగాని ఇరిగిపోయిందా..!?

ఇందాక ఆలేవులో అన్నమాటలు వొక్క సిటం నా మదిలోన – మెదిలినాయి. సిగురాకు నాగ వొడికి పొన్నాను.

"వో.. నా యేసయ్యా!.. ఇప్పుడు నా గతేటి..!"

దేవున్ని తల్సుక్కి దుక్కంతో రెండు కలు సేస్పేపు మూసుకున్నాను. లోపల. బయటా ఒకటే సీకటి!

"బతుకు సీకటైపోయిందని ఇప్పుడేడిత్తే యేటిలాబము..!? మొదటే ఉండాల.. ఆ బుద్ది.. పొన్నే..! ఇది ఒకందుకి మంచిదే. ఎవులు ఎలాటోలో.. ఆల నిజసొరూపమేటో తెలిసొచ్చినాది. మునుముందు ఆలతో ఎలాగుండాలో అలగుంతాను. అయినా ఎల్లకాలము - సీక్టిలాగే ఉండి పోద్దేటి..!? అలాగైతే ఈ పెపంచికం ఏటవ్వాల!" అని నన్ను నాను వోదార్చుకుని దవిర్యం తెచ్చుకున్ను.

గుండి బరువు ఒక్కసారి వొగ్గీసింది. నాకు మరింక సింతనేదు. ఎందికంతే -

లోకానికి ఎల్తురు ఇచ్చే సూరీడు సీకటిని సీల్చుకునే కదా - తూరుపు దిక్కున పైకొత్తాడు.

## గాజుకళ్ళు — పి.వి.ఆర్.రాజశేఖర్

**"పన్నెండేళ్ళ లోపు పిల్లలందరికీ నిర్బంధ విద్య"** అని హెడ్డింగ్ ఉన్న ఆర్టికల్ చదువుతూ బయట జరుగుతున్న అలికిడికి తలెత్తి చూశాను. ట్రైను సామర్లకోట చేరుకుందేమో, జనాలందరూ గాబరా గాబరాగా ఎక్కుతున్నారు. ఎందుకంటే అక్కడ ట్రైను రెండు నిమిషాలకంటే ఎక్కువాగదు.. అప్పటివరకు ఖాళీ ఉన్న కంపార్ట్ మెంటు జనాలతో కిక్కిరిసిపోయింది. అటు జనాలు ఇటు, ఇటు జనాలు అటు కదలకుండా చేసిన లావుపాటి వ్యక్తిమీద నా దృష్టి పడింది. తన సామానులు అన్ని సీట్ల కింద సర్దుతూ ట్రాఫిక్ జామ్ చేసేసి హడావుడి చేస్తున్నాడు.

"అటేపు వెళ్ళాలి.. కాస్త జరగవయ్యా" అని ఎవరో అరిస్తే, వాళ్ళు చెప్పేది వినిపించుకోకుండా "ఆగవయ్యా.. మావి మాత్రం సీట్లు కాదా.. మేము మాత్రం మనుషులం కాదా!" అంటూ అరిచాడు. ఆ మాటకి నాకు నవ్వొచ్చింది.

తను మనిషని తెలుసుకున్నాడు, కానీ ఎదుటివాళ్ళూ మనుషులే అని తెలుసుకోలేకపోయాడు. వాళ్ళకి కొంచెం సైడు ఇస్తే తన పని సులువు అవుతుందిగా, లేటు అయితే ట్రైన్ ఎక్కడికో వెళ్ళిపోతుందన్న గాబరా మనిషికి...

ఇలాంటివాళ్ళు లోకంలో అన్ని చోట్ల ఉంటారు, తమ బాధ తమదేగానీ, పక్కవాళ్ళ భాధ పట్టించుకోరు..

మళ్ళీ న్యూసు పేపరులో ఆర్టికల్ చదవడం మొదలుపెట్టాను. పిల్లలందరికీ నిర్బంధ విద్య అని చదివినప్పుడు, నాకు రాఘవయ్య మాష్టారు గుర్తుకొచ్చారు. అతనే గనక నన్ను ప్రోత్సహించి ఉండకపోతేనో లేదా ఇంట్లో నాన్నని ఒప్పించి ఉండకపోతేనో, నేను ఈ రోజు సాఫ్ట్వేరు ఇంజినీర్ని అయ్యుండేవాడిని కాదు....!

"మనకెందుకురా ఈ సదువులు.. ఏ కూలో నాలో చేసుకోక.... అదేవన్నా తిండెట్టుద్దా? గుడ్డెట్టుద్దా..?" అంటూ నాన్న తిడితే ఏడుస్తూ కూర్చున్న నన్ను రాఘవయ్య మాష్టారు ప్రోత్సహించి ఇంతవాడిని చేశారు.

ఇప్పుడు సాఫ్ట్వేరు ఇంజినీర్ని అయ్యి నాన్న చేసిన అప్పులన్నీ తీర్చేసాను. ఊర్లో సొంత ఇల్లు, మంచి పేరు వచ్చింది. రాఘవయ్యగారి కూతురి పెళ్ళికి కూడా సహాయం చేశాను. అది కృతజ్ఞత మాత్రమే...

"ఎంతవరకు వెళుతున్నారు మాష్టారు?" అని వినిపించేసరికి ఆలోచనలోంచి తేరుకుని చూశాను. సామాన్లన్నీ సర్ది అలిసిపోయి సీట్లో కూర్చుని కర్చీఫ్ తో చెమటలు తుడుచుకుంటూ నా వైపు చూస్తూ అడిగాడా లావుపాటి వ్యక్తి.

"మద్రాస్ వరకు" అని ముక్తసరిగా సమాధానం చెప్పి ఊరుకున్నాను. మొదటిసారి చూసినప్పుడే వీళ్ళు మంచివాళ్ళా? చెడ్డవాళ్ళా అని చెప్పడం కష్టం, కానీ మొదట్లోనే అతనిమీద సదభిప్రాయం కలగలేదు నాకు.

నా సమాధానానికి తెగ సంబరపడిపోయి "ఔనా! నేనూ అక్కడికే. అక్కడ మా అక్క కొడుకున్నాడు. వాడు టి.సి.యస్‌లో పనిచేస్తున్నాడు. వాడితో చిన్న అవసరం వుండి వెళుతున్నా. యాభైవేలు జీతం వాడికి, కంపెనీ వాళ్ళు ఫారెన్ కూడా పంపించారు ఈ మధ్య..." ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు..

సక్సెస్ రాగానే చుట్టరికం వాల్యూ పెరుగుతుంది సాధారణంగా.. అతను కష్టపడి సంపాదించుకుంటే... ఇతను గొప్పలు చెప్పుకుంటున్నాడు.!!

ఆ డిస్కషన్ అక్కడితో ఆగిపోతే బాగుణ్ణు అనుకున్నాను.. కానీ "మీరేం చేస్తుంటారండి?" అంటూ మళ్ళీ అడిగాడు అతను.

"నేను కూడా టి.సి.యస్ లోనే పనిచేస్తున్నానండి" అన్నాను.

మా మాటలన్నీ ఎదురు సీట్లో కూర్చున్న మరో ఇద్దరు వ్యక్తులు కూడా వింటున్నారు. నేను చెప్పిన సమాధానం విని "అవునా!" అంటూ కేకపెట్టి, "అయితే మా శీనుగాడు తెలుసేవిటండీ మీకు.. అదే శ్రీనివాసరావ్ వాడిపేరు!" అన్నాడీ లావుపాటి వ్యక్తి.

అతని ప్రశ్నకి నాకు చిరెత్తుకొచ్చింది.. "టి.సి.యస్ చాలా పెద్ద కంపెనీ, దానికి చాలా బ్రాంచ్ లు కూడా ఉన్నాయి. అయినా శ్రీనివాసరావులు కూడా చాలామంది ఉన్నారు..." అని మీవాడు నాకు తెలీదు అనే అర్థం వచ్చేలా ఆపుచేశాను.

దానికి అతనొక నవ్వు నవ్వి "అవునండోయ్.... కరెక్టే" అన్నాడు.

ఇంతలో నా ఎదురు సీట్లో ఉన్నాయన కలుగజేసుకుని "మాష్టారూ.. మా అబ్బాయిని ఇంజినీరింగ్ లో ఎలెక్ట్రికల్ జాయిన్ చేశాను. కానీ వాడికి కంప్యూటర్స్ అంటే ఇష్టం, నా బలవంతం వల్లే ఎలక్ట్రికల్‌లో జాయినయ్యాడు. దీనికి లైఫ్ ఎలా ఉంటుందంటారు.?" అనడిగాడు. దానికి సమాధానం చెప్పేలోపే అతని పక్కనే వున్న వ్యక్తి కలుగజేసుకుని "ఈ కంప్యూటర్ ఎక్కువకాలం ఉండదు సార్. ఎలక్ట్రికల్ చాలా మంచిది. మీరు చాలా మంచిపని చేసారు" అన్నాడు తన తెలివినంతా ఉపయోగించి.

ఆ ప్రశ్న అడిగిన వ్యక్తికి ఈగో శాటిస్ఫై అయినట్టుంది, నవ్వుతూ ఊరుకున్నాడు. కానీ కొడుకు ఇష్టాయిష్టాలు తెలుసుకోలేకపోయాడు.

నా పక్కనే కూర్చున్న లావుపాటి వ్యక్తి కూడా ఆ డిస్కషన్‌లో దిగి తనకి తెలిసినవి, తెలియనవి, తన దూరపు బంధువుల గురించీ.. అన్నీ చెపుతూ, మధ్య మధ్యలో జోకులేస్తూ నవ్వుకుంటున్నారు.

మనుషులెప్పుడూ ఇంతేనేమో తనకి తెలిసిన జ్ఞానాన్నంతా పక్కవాడి మీద రుద్దడానికి ప్రయత్నిస్తారేమో.

వాళ్ళ డిస్కషన్ మీద అంత ఇంట్రెస్టు లేక వీళ్ళందరికీ మధ్యలో నేను అసెంబ్లీలో స్పీకరులా నవ్వు మొహం ఒకటి పెట్టుకుని కూర్చున్నాను. వాళ్ళ టాపిక్‌లన్నీ కంప్యూటర్స్ మీద నుంచి సినిమాల మీదకి, సినిమాల మీద నుంచి చిరంజీవి మీదకి అక్కడినుంచి పాలిటిక్స్ మీదకి అలా సాగిపోతూనే ఉన్నాయి. వీళ్ళకి మాట్లాడటానికి మనిషి దొరికితే చాలు ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు.

మెల్లగా నా దృష్టి విండో సీట్లో కూర్చున్న అమ్మాయి మీద పడింది. చక్కగా ఉంది. కిటికీలోంచి చూస్తూ మధ్యలో వీళ్ళవైపు చూస్తోంది. అమ్మాయి ముఖంలో మంచి కళ ఉంది. ఇంటర్ అయిపోయి డిగ్రీలోకి వచ్చిన పిల్లలా ఉంది చూడటానికి... ఇంతలో నా ఎదురుగా తలుపు దగ్గరగా నిల్చుని ఆమెనే చూస్తున్న కుర్రాడి మీద పడ్డాయి నా చూపులు. అతడు ఆమెనే తదేకంగా చూస్తున్నాడు. ఆ అమ్మాయి కూడా మధ్య మధ్యలో అతనివేపు చూస్తోంది..

ఆమెని ఇంప్రెస్ చెయ్యడానికి అతను మాత్రం పట్టు వదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నాలు తాను చేస్తూనే ఉన్నాడు.

అమ్మాయిలు సెన్సాఫ్ హ్యూమర్ ఉన్నవాళ్ళని ఎక్కువ ఇష్టపడతారని తొందరగా తెలుసుకున్నట్టున్నాడు. అందుకే అక్కడున్న ఫ్రెండ్స్ తో జోకులేస్తూ వాళ్ళని నవ్విస్తూ, అతనూ అతిగా మధ్య మధ్యలో ఈమె వంక చూస్తున్నాడు తను కూడా చూస్తోందా లేదా అని తెలుసుకోవడానికి. అతని ప్రయత్నాలకి నాకు నవ్వొచ్చింది.

ఏదైనా రైలు ప్రయాణానికి, జీవితానికి కొంచెం దగ్గర సంబంధం ఉంది. రైలులో లాగానే జీవితంలో కూడా చాలామంది ఎదురవుతూ వుంటారు. ఎవరి గమ్యం రాగానే వాళ్ళు దిగిపోతూ ఉంటారు.

ట్రైను కాసేపటి తరువాత రాజమండ్రి చేరుకుని, గోదావరి మీదుగా వెళుతోంది. రైల్లోంచి వెళుతున్నప్పుడు గోదావరిని చూడటం అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే సాయంకాలపు సంధ్య వెలుగులో గోదావరి ఒంపులు, చల్లటిగాలి, నది మీద పడవలు, వలసపోతున్న పక్షుల గుంపులు.. చూడచక్కగా ఉంటాయి.

వెన్నెల వెలుగులో అయితే గోదావరి ఇంకా బాగుంటుంది. ఆ క్షణం అక్కడే అలా నిలిచిపోతే ఎంత బాగుణ్ణు అనిపిస్తుంది ఒక్కోసారి. గోదావరిని ట్రైను దాటేవరకు అలా చూస్తూ తలుపు దగ్గరే నిలబడ్డాను. అక్కడా కుర్రాడు చేసే అల్లరి కూడా చూశాను. అమ్మాయి కూడా మెల్లగా ఇతని వంక చూడటం మొదలుపెట్టిందేమో, అతను ఇంకాస్త ఎక్కువ చేస్తున్నాడు. ఇతని చేష్టలు తనకీ నచ్చాయేమో.

ఒక్కోసారి మనం చేసే పనులన్నీ ఆ స్టేజి దాటిపోయిన తరువాత చూసుకుంటే సిల్లీగా అనిపిస్తాయి... నాకు ప్రస్తుతానికి అలానే అనిపించింది.

ట్రైను గోదావరిని దాటగానే నా సీట్లోకి వెళ్ళి కూర్చున్నాను. అక్కడ వాళ్ళ సంభాషణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈసారి రక్తసంబంధాల గురించి మాట్లాడుకుంటున్నారు. నా పేపరు కోసం చూశాను, అది వేరెవరి చేతుల్లోనో ఉంది. వాటరు బాటిల్ కోసం చూస్తే ఆ లావుపాటి వక్తి నా బాటిల్ నాకు అందిస్తూ "కొంచెం దాహం అయితే వాటరు బాటిలు దొరక్క మీవి తీసుకున్నాను.. ఏమి అనుకోరుగా" అన్నాడూ. కొంచెం కోపం వచ్చినా "ఫరవాలేదు" అని నవ్వి ఊరుకున్నాను. పక్కవాళ్ళ గురించి ఆలోచించకుండా వాళ్ళకి కావాల్సిన పనులన్నీ చేసేసి అది వాళ్ళ లౌక్యం అని గొప్పగా ఫీల్ అయిపోతూ ఉంటారు కొందరు.. పాపం!.

కొంచెం ఆకలి అవుతుండేసరికి అమ్మ కట్టి ఇచ్చిన బాక్సు గుర్తొచ్చింది. బయలుదేరుతున్నప్పుడు మా బావా వాళ్ళ ఇంటికి వెళ్ళాను, నాకిష్టమని చెల్లి బొబ్బట్లు, పులిహోర ప్యాక్ చేసిపెట్టింది.

ఇప్పుడు రెండూ నా చేతిలో ఉండేసరికి ఏది తినాలా అన్న ఆలోచనలో పడ్డాను.

అంతేమరి.. ప్రత్యామ్నాయం దొరికితేనే ఆలోచనలో పడతాం, లేకపోతే అస్సలు కన్ఫ్యూజన్ ఉండదు.

అలా ఆలోచిస్తూ అమ్మ కట్టిన అన్నం, చెల్లి కట్టిన బొబ్బట్లు పూర్తిచేశాను ఏదీ వదిలెయ్యడం ఇష్టంలేక. పులిహోర మాత్రం మిగిలిపోయింది.

తిన్న తరువాత చల్లగాలి పీలుద్దామని అలా వెళ్ళి తలుపు దగ్గర నిల్చున్నాను. నాకు ఎదురవ్వబోయే సంఘటన నా జీవితానికో మలుపు కాబోతోందని ఆ క్షణంలో తెలియలేదు.

అక్కడ నిల్చుని ఉన్న ఎనిమిదేళ్ళ పిల్లాడి మీద పడింది. రైలు కంపార్ట్ మెంట్లు తుడుస్తూ అడుక్కుంటున్నాడు. ఎవరికి తోచింది వాళ్ళు వేస్తున్నారు, లేనివాళ్ళు పొమ్మని తిడుతున్నారు. నాకు జాలేసింది.

వీళ్ళంతా పాపం విధి వంచితులు...!!

కాసేపటికి ఆ కుర్రాడు నా ఎదురు సీట్లో కూర్చున్న వ్యక్తులని కూడా అడిగాడు. లేదు పొమ్మని కసిరేసారు. నాకు చాలా కోపం వచ్చింది. రైలు ఎక్కినప్పుడు కనీసం పేపరు కూడా తెచ్చుకోలేదు వీళ్ళు, పక్కవాళ్ళ బాటిల్‌లో నీళ్ళు కూడా అడిగి తీసుకోవాలని ఇంగిత జ్ఞానం కూడా లేదు వీళ్ళకి.... వీళ్ళు పాపం ఆ కుర్రాడిని కసిరిపారేసారు. ఏమైనా అంటే "ఇలాంటి వాళ్ళని ఎంకరేజ్ చెయ్యకూడదు సార్.. వీళ్ళు ఆడేది నాటకం.. మనం ఎన్ని సినిమాల్లో చూడటం లేదు. వీళ్ళ వెనక ఎవడో ఉంటాడు, వాడూ వీళ్ళతో ఈ పని

చెయ్యిస్తుంటాడు. కాళ్ళు లేనట్టో, కళ్ళు లేనట్టో నటిస్తే ఎక్కువ డబ్బులు పడేస్తామని డ్రామా ఇదంతా...దేశం పాడైపోతోంది సార్" అంటారు.

అందులో ఎంత నిజం ఉంది అన్నది పక్కన పెడితే వాడి ఆకలి, జానెడు పొట్ట మాత్రమే నాకు కనిపించాయప్పుడు. నన్ను దాటుకుని వెళ్ళిపోతున్న వాడిని ఆపి "పులిహోర తింటావా?" అని అడిగాను. తింటాను అన్నట్టు తలూపాడు. నా దగ్గర మిగిలివున్న పులిహోర ఇచ్చేశాను. నా వంక చూసి చిన్న నవ్వు నవ్వాడు.

నా మనసు చాలా తేలికగ అనిపించింది. ఆ అబ్బాయి అక్కడినుంచి వెళ్ళిపోయుంటే నా జీవితం ఇంకోలా ఉండేది. నేను ఇచ్చిన పులిహోర తీసుకుని వెళుతూ రెండు కంపార్ట్మెంట్ల మధ్య నడుస్తూ అక్కడ నిద్రపోతున్న మరో పిల్లాడిని చూసి ఆగి "ఒరేయ్! నువ్విక్కడ ఏమి చేస్తున్నావ్..?" అని అడిగాడు. నిద్రపోతున్నవాడు కాస్త లేచి "ఒంట్లో బాగోలేదురా... జొరం" అన్నాడు నీరసంగా...

ఇంతలో ఇంకోడు చేరుకున్నాడు అక్కడికి. వాడికో పన్నెండేళ్ళు వుంటాయేమో. వాడి బట్టలూ పూర్తిగా మాసిపోయున్నాయి. వీళ్ళ ఫ్రెండ్ అనుకుంటా. నిద్రపోతున్న పిల్లాడి నుదురు మీద చెయ్యి పెట్టి "అవునురా.. జొరం... ఒళ్ళు కాలిపోతుంది" అని ఈ కుర్రాడి వంక చూసి చెప్పాడు.

"ఒరేయ్! వచ్చే విజయవాడ టేసనులో దిగిపోయి, అక్కడ ఆసుపత్రికి పోరా... లేకపోతే సచ్చిపోతావ్.. అసలే ఇయన్నీ మంచి జొరాలు కాదు.." అన్నాడు ఈ కుర్రాడు. "అవునురా.. మంచియి కాదు.. " నాకు మనస్సు చివుక్కుమంది... అయ్యో పాపం అని జాలివేసింది... ఇంకా వాళ్ళ సంభాషణ ఎటు వెళుతుందా అని చూస్తున్నాను.

వెంటనే ఈ కుర్రాడు "ఏమైనా తిన్నావేరా?" అని ఆ జ్వరంతో బాధపడుతున్న వాడిని అడిగాడు. లేదన్నట్టు నీరసంగా తలూపాడు వాడు. ఏమిచేస్తాడా అని నేను వాడివంకే చూస్తున్నాను. చటుక్కున వాడిచేతిలో ఉన్న పులిహోర ప్యాకెట్ వీడికి అందించి, జేబులన్నీ వెతికి కొన్ని చిల్లర పైసలు తీసి లెక్కపెట్టకుండానే వాడికిచ్చి "ఇదిగో ఇందు... ఈ డబ్బులతో ఏమైనా మందులు కొనుక్కుని, టీతాగి, ఏదైనా తిని నిద్రపో... వచ్చే టేసనులో దిగిపోయి ఆసుపత్రికి వెళ్ళు... మళ్ళీ టి.సి వస్తే తిడతాడు" అంటూ అక్కడనుంచి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. ఒక్కసారిగా నాకు తల తిరిగిపోయింది ఆ కుర్రాడి ఆలోచనకి.

మనదగ్గర లక్షరూపాయలు ఉన్నప్పుడు ఒక వంద దానం చేస్తేనే దాన్ని దానం అంటే.. మరి దీనిని ఏమనాలి..? ఏదీ సొంతం కాదని ఇంత చిన్న వయసులోనే తెలుసుకున్నాడు. నిజంగానే ఇది మానవత్వానికి పరాకాష్ట అనిపించింది. ఒకడి ఆకలి తీరుతున్నందుకు కాబోలు తరవాత తన పరిస్థితి కూడా ఆలోచించలేదు..! అది తను ఎలాగైన బతకగలడు అన్న నమ్మకమో, లేక స్నేహితుడూ కష్టంలో ఉన్నాడన్న బాధో మరి..? అలా చెయ్యడం అందరివల్లా కాదనిపించింది నాకు. అది ఇస్తున్నప్పుడు కూడా వాడి గాజుకళ్ళవెనకాల ఆనందం చూశాను.

జ్వరంతో బాధపడుతున్నవాడు నీరసంగా పైకి లేచి పులిహోర తినడం మొదలుపెట్టాడు. అన్నం తిని చాలారోజులయ్యిందో లేక నాలికకి పులిహోర రుచి బాగా తగిలిందో గానీ ఆవురావురంటూ తింటూ మధ్యలో మెతుకులు అడ్డుపడి ఎక్కిళ్ళు వస్తున్నా అలానే తింటున్నాడు.

నాలాగే పక్కనే నుంచుని చూస్తున్న మరొకతను వాడికి వాటర్ బాటిల్ అందించాడు. మొత్తం తినేసి కవర్ బయటపడేసి, కాస్త ఓపిక తెచ్చుకుని వాడు కూడా వెళ్ళిపోయాడు. కానీ నా ఆలోచనలన్నీ అక్కడే తిరుగుతున్నాయి...! ఎక్కడ పండిన బియ్యం, ఎక్కడ వండిన అన్నం, ఎన్ని చేతులు మారి.. ఎక్కడికి చేరి ఒక కడుపు నింపింది. ఆశ్చర్యమేసింది..!! అందుకే తినే ప్రతి గింజ మీద కూడా మనపేరు ఉంటుంది అంటారు. మనసులోనే సంతోషిస్తూ మా చెల్లికి థాంక్స్ చెప్పుకున్నాను...! కొందరు విజయవాడలో దిగిపోయారు. సీట్లలో అందరూ నిద్రకుపక్రమిస్తున్నారు. విండో సీట్లో కూర్చున్న అమ్మాయికీ, తలుపుదగ్గర నిల్చున్న అబ్బాయికీ బాగా కుదిరినట్టుంది.

దొంగచూపులు చూసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఎదురుసీట్లలో కూర్చున్నవాళ్ళు పడుకుని కూడా భారతదేశంలో జరుగుతున్న విషయాల గురించి మాట్లాడుకుంటూ, మధ్య మధ్యలో వీళ్ళ గొప్పతనాల గురించి మాట్లాడుకుంటున్నారు.

నాకు మాత్రం ఆలోచనలన్నీ ఆ సంఘటన మీదే ఉండిపోయాయి. తిండి ఎక్కువైపోయి కొందరు, తినడానికి తిండి కూడా లేక కొందరు..! ఓ గాడ్..! ఏంటి నీ సృష్టి అనుకున్నాను. పొద్దున్నే పేపర్లో చదివిన ఆర్టికల్ గుర్తొచ్చింది... వీళ్ళందరికీ నిర్బంధ విద్య, సరైన పోషకాహారం అందిస్తే వీళ్ళనుంచి ఒక్కొక్క అబ్దుల్ కలాం తయారయేవారేమో...! అయినా మన గవర్నమెంటుకి అంత ఖాళీ లేదు. ఎంతసేపూ ఎలక్షన్ గొడవే తప్ప...!

ఇలాంటి వాళ్ళ గురించి ఆలోచించే తీరికేలేదు ఎంతమందికుంటుంది... ఏదో నా జీవితం గడిచిపోతే చాల్లే అనుకునేవాళ్ళే అందరూ. ఒకదాని తరవాత ఒకటి ఆలోచనలన్నీ నన్ను కమ్మేశాయి...

జీవితంలో మనకి చాలా సంఘటనలు ఎదురవుతయి, కానీ కొన్ని మాత్రమే దిశానిర్దేశం చేసి మన జీవిత గమనాన్ని మార్చేస్తాయి...! ఇంకా ఆ గాజుకళ్ళలోని తడి నన్ను వదిలిపెట్టలేదు.. ఆలోచిస్తూ మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

పొద్దునే లేచి చూసేసరికి మద్రాస్ వచ్చేసింది. కిందసీట్లలో ఉన్నవారందరూ గాబరా గాబరాగా ట్రైను దిగుతున్నారు. ఎందుకో అంత గాబరా.. ఎక్కేటప్పుడూ అంతే... దిగేటప్పుడూ అంతే..!

విండో సీట్లో అమ్మాయికేసి చూశాను... దూరంగా ఉన్న అబ్బాయికి ఏవో నంబర్లు సైగలు చేస్తోంది. కుర్రాడు రాత్రి అంతా జాగారం చేసి పడ్డ కష్టం ఫలించినట్టుంది. ఆ లావుపాటి వ్యక్తి బయట నుంచుని ఎదురుచూపులు చూస్తున్నాడు. శ్రీనివాస్ కోసమేమో.. అప్రయత్నంగా నవ్వొచ్చింది.

అంతా దిగిపోయాక మెల్లగా రైలు దిగి ఇంటికి వెళ్ళి రెడీ అయ్యి ఆఫీసుకి వెళ్ళాను. మనసంతా చాలా దిగులుగా ఉంది. రైలులో జరిగిన సంఘటన బాగా గుర్తుండిపోయింది. ఏమిచేస్తే తీరుతుంది దిగులు...!

మంచి, మానవత్వం, జాలి... ఇలాంటి ప్రాధమిక ప్రశ్నలన్నీ తలెత్తాయి. నా జీవితం ఏ దిశలో సాగుతోందా అని ఆలోచిస్తున్నాను.! రాఘవయ్య మాస్టారు గుర్తొచ్చారు.

ఏదో నేను కోల్పోయాను అన్నట్టుగా ఉంది. ఆ రోజు జరిగిన సంఘటన నాలో ఆలోచనని రేకెత్తించింది. నేను తీసుకున్న నిర్ణయం అంత ఆనందం కలిగిస్తుందని ఒకరోజు అనాధాశ్రమంకి వెళ్ళేవరకు తెలియలేదు.

నా ఎదురుగా నిల్చుని ఉన్న పాపవంక చూశాను. ఎంతముద్దుగాఉందో...! దగ్గరికి పిలిచి నా చేతుల్లోకి ఆమెని తీసుకున్నాను. అవే గాజుకళ్ళు..! నేను రైల్లో చూసిన పిల్లాడి కళ్ళలానే మెరుస్తున్నాయి... కల్మషం లేకుండా..!

ఒక్కసారి గుండెలకి హతుకున్నాను. ఎపుడూ ఎవరి ప్రేమకి నోచుకోలేదేమో ఆమె కూడా తన చిట్టి చేతులతో నా మెడని గట్టిగా పట్టుకుంది. నాకు అనుకోకుండా కళ్ళు చెమర్చాయి. గుండె బరువెక్కింది. ఈమెలాగే అనాధలుగా ఉండి ఎక్కడెక్కడో పనిచేసుకుంటున్న పిల్లలందరూ గుర్తొచ్చారు. వీళ్ళంతా పని పిల్లలు కారు... పసిపిల్లలు.. ఎంతమంది ఆలోచిస్తారది.

ఆ పాప బట్టలకి, భోజనానికి, చదువుకి అయ్యే ఖర్చు భరిస్తానని చెప్పి అనాధాశ్రమంలో కొంత డబ్బు కట్టి, ఆ పిల్లని దత్తతు తీసుకున్నాను.

మిగిలిన పిల్లల భోజనానికి కూడా ఏర్పాటు చేసాను. వాళ్ళు చాలా హ్యాపీగా ఫీలయ్యారు.

నేను దత్తతు తీసుకున్న పిల్ల కళ్ళలోకి చూసాను. తన కోసం ఒకరునారన్న ఆనందం కనపడుతోంది.

నన్ను ఏమని పిలవాలో తెలియక చెయ్యిపట్టుకుని లాగింది. ఆమె వైపు చూశాను.

కిందకి వంగోమన్నట్టు సైగ చేసింది...

నా మోకాళ్ళమీద కూర్చున్నాను....

నా మొహాన్ని తన చిట్టిచేతుల్లోకి తీసుకుని...

బుగ్గమీద ముద్దుపెట్టి... ఛెంగు ఛెంగున ఎగురుకుంటూ అనాథాశ్రమంలోని స్కూల్లోకి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది... ఆమె పరిగెడుతున్న వైపే చూస్తూ నిలబడ్డాను.

ఆ గాజుకళ్ళ వెనకాల సంతోషం, ఆమె పెట్టిన ముద్దు నా దిగులుని అనంతదూరాలకి తరిమేశాయి.....

# వలసపక్షులు ప్రగతి

**చెంబూర్ స్టేషన్‌లో** ట్రైన్ దిగి గబగబా బైటకి వచ్చాను. మార్కెట్ హడావిడి చూసి ఆశ్చర్యం వేస్తుంది.. ఇంత మంది జనం ఎక్కడినుంచి వచ్చారు , ఎక్కడికి వెడుతున్నారు చెప్మా అని.! ఎప్పుడూ చిన్న రోడ్డు రద్దీగానే వుంటుంది గబగబా నడిచి ముందుకు వెడుతుంటే నా ముందు వున్న ఒక పంజాబీ సూట్ అమ్మాయి ఏమైందో కానీ తూలి ముందుకు పడబోయింది. యాదృచ్ఛికంగానే నా చెయ్యి అమ్మాయి భుజం మీద పడింది పట్టుకునే ఉద్దేశ్యంలో. కానీ అప్పటికే సమయం మించిపోయింది. అమ్మాయి పడనేపడింది .... ఆమెతో పాటూ నేను కూడ......

వెంటనే లేవలేకపోయాను కాలు బెణికిందేమో అనిపించింది.

ఇంతలో ఆ అమ్మాయి గట్టిగా అరిచింది పొట్టమీద చెయ్యి వేసుకుని.

నాకు అర్థం కాలేదు ఏమైందో!

"క్యా హువా?" అని మెల్లగా లేపబోయాను. కానీ అమ్మాయి లేచే ప్రయత్నం చేయలేదు సరి కదా ఇంకొంచం వొంగిపోయింది. ఇదేమిటిరా భగవంతుడా! అసలే ఇంటికి తొందరగా వెళ్ళాలి అనుకుంటే ఈ సమస్య అనుకుని మెల్లగా లేపబోయాను. ఎలాగోలా నిలబెడదామని నా ప్రయత్నం.కానీ అమ్మాయి ప్రయత్నమే చేయట్లేదు.

"క్యా హువా?" మళ్ళీ అడిగాను.

"పేట్ మే దర్ద్ హో రహా హై" అంది ఏడుస్తూ....

ఇంత చిన్నదానికే అని ఆశ్చర్య పోయాను.

"ఐయాం ప్రెగ్నెంట్."

"ఓ గాడ్"

"ఇప్పుడెలా?" అని కంగారు పడుతూ చుట్టూ చూశాను.

ఎవరూ దీనితో తమకు సంబంధం లేనట్టు తమాషా చూసి వెళ్ళిపోతున్నారు. ఒకళ్ళిద్దరు అడిగారు కానీ ఒక దృష్టి వేసి

వెళ్ళిపోయారు. ఇప్పుడు కనీసం ఒక డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి కదా!

ఏదైతే అదే అయ్యింది నేను పక్కనే వున్న ఆటో వాడ్ని పిలిచి మెని మెల్లగా ఎక్కించి నాకు తెలుసున్న లేడీ డాక్టర్ క్లినిక్ పేరు చెప్పి అక్కడికి పొమ్మన్నాను.

వాళ్ళ ఆయన పేరు అడుగుదామని అమ్మాయి వైపు తిరిగితే స్పృహ తప్పినట్టుంది, ఎంత తట్టినా లేవలేదు. నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

ఓరి భగవంతుడా! ఎక్కడ ఇరికించావయ్యా! అని వాపోతూ ఆటో వాడిని తొందరగా పోనిమ్మని కంగారు పెట్టాను.

*****

"ఏమైంది డాక్టర్? ఎనీథింగ్ సీరియస్?" కంగారుగా అడిగాను.

"వన్ మినిట్, లెట్ మీ చెకప్"

డాక్టర్ ఆమెని చెకప్ చేస్తూనే "మీ వాళ్ళా?" అని అడిగింది.

"కాదు డాక్టర్.." అని జరిగిన విషయం వివరించాను.

"అరే! అలాగా! ముందు వాళ్ళ వాళ్ళకి కబురు చెయ్యాలి."

"ఏనీథింగ్ సీరియస్ డాక్టర్?" నేను మళ్ళీ కంగారుపడ్డాను.

"నథింగ్ టు వరీ.. కాని వాళ్ళవాళ్ళకి చెప్పాలి కదా"

ఏమి చేయాలో తెలియక డాక్టర్ కేసి, ఆమె కేసి చూసాను.

"ఆమె హ్యాండ్ బ్యాగ్ చూడనా? ఆమె మొబైల్.... సంథింగ్..?".......సందిగ్ధంగా డాక్టర్ కేసి చూసాను.

ఇంతలో భగవంతుడే సహాయం చేస్తున్నట్టుగా ఆమె మొబైల్ మ్రోగింది.

ఇద్దరం ఉలికిపడ్డాం.!!

నేను గబగబా ఆమె హ్యాండ్ బ్యాగ్ వెదికి సెల్ ఎత్తాను.

"హలో.." ఒక మగగొంతు.

భర్త ఏమో అనుకుంటూ "ఎవరూ?" అని అడిగాను.

అవతలి వ్యక్తి కొత్త గొంతు విని ఆశ్చర్య పోయాడేమో ఒక్క నిముషం ఏమీ మాట్లాడలేదు.

"హలో!" నేను మళ్ళీ పలకరించాను.

"హూస్ దేర్?" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

నేను మెల్లగా జరిగిన విషయం హిందీలో వివరించాను. క్లినిక్ పేరు, అడ్రెస్ వివరించి సెల్ డాక్టర్ చేతికిచ్చాను.

ఆమె కంగారు పడవలసినది ఏమీ లేదని, టైముకి నేను తీసుకొచ్చి మేలు చేసానని, నాకేసి బొటను వేలెత్తి చూపిస్తూ నవ్వింది.

"థాంక్ గాడ్!" అని కళ్ళు మూసుకుని గుండెలమీద చెయ్యేసి అనుకున్నాను.

నేను గబగబా మా ఇంటికి ఫోన్ చేసి కొంచం లేటవుతుంది కంగారు పడద్దని,మా ఫ్రెండ్ ఇంటికి వెడుతున్నాని చెప్పాను.

ఇంతలో ఆమె మెల్లగా కళ్ళు తెరిచింది.

నేను ఆమె దగ్గరికి వెళ్ళి "ఎక్కడుంటావు?" అని నాలుక్కరుచుకుని "ఎలా వుంది?" అన్నాను.

"ఐయాం ఓ కే!" అని మెల్లగ లేవబోయింది.

నేను వారించి "మీ వాళ్ళకి కబురు చేయవా?" అన్నాను.

"నా సెల్" అని హ్యాండ్ బ్యాగ్ కోసం చూసింది.

డాక్టర్ ఆమె సెల్ చేతికిచ్చింది.

మెల్లగా ఆమె డయల్ చేసి నెమ్మదిగా "హలో!" అంది.

నేను ఆమెకి దూరంగా వెళ్ళబోయాను ఆమెకి ప్రైవసీ ఇచ్చే ఉద్దేశ్యంలో.

ఆ మాటలు నా చెవిన పడ్డాయి " శ్రీ తొందరగా రావా! ఏం జరిగిందంటే.." అని ఏడుస్తూ ఏదో చెప్పబోయే ఆమెని అతను వారించి ఏదో చెప్పాడు. ఈమె "సరే" అని ఫోన్ పెట్టేసింది.

బహుశా అతను మాతో మాట్లాడిన విషయం చెప్పి వుంటాడు.

నేను ఆశ్చర్యంగా "మీరు తెలుగు వాళ్ళా?" అని అడిగాను.

ఈ సారి ఆశ్చర్యపోవడం ఆమె వంతైంది.

నేను డాక్టర్ తో "వీళ్ళు తెలుగు వాళ్ళే" అని సంతోషంగా అన్నాను.

"ఓ కే. ఇంకేం! కానివ్వండి. కానీ కాస్సేపు ఆమె ఏమీ మాట్లాడకుండా వుంటేనే మంచిది" అని నవ్వి ఆమె రూం లోంచి బైటికి వెళ్ళిపోయింది.

నేను మెల్లగా అక్కడ వున్న స్టూల్ లాక్కుని ఆమె దగ్గరగా కూర్చున్నాను.

"మీరు ఎక్కడివాళ్ళు?" అడిగాను.

"మేము హైద్రాబాద్ వాళ్ళమండీ."

"ఇక్కడ మీరొక్కరే వుంటారా?"

"అవునండీ" అంటుంటే ఆమె మొహం కొంచం కమిలిందా అనిపించింది.

అమ్మ గుర్తుకొచ్చిందేమో అనిపించి "మీ అమ్మకి కాల్ చెయ్యి రమ్మని. ఐనా ఈ విషయం ఇంకా ఇంట్లో వాళ్ళకి చెప్పారా లేదా?" నవ్వుతూ అడిగాను.

ఇంతలో ఒక యువకుడు కంగారుగా లోపలికి అడుగు పెట్టాడు. అచ్చం రాకుమారిడిలా వున్నాడు. అతని ముందు ఆమె కొంచం చామనచాయగా వుంటుంది అనిపించింది. అతన్ని చూస్తూనే ఆమె కట్టలు తెంచుకున్న గోదావరి అయ్యింది.

"అరే, ఇప్పుడేమైంది? డాక్టర్ ఇందాక అంతా బాగానే వుంది అని చెప్పింది" అన్నాడు.

"అవును. కానీ నాకు భయంగా వుంది" అంది అతని చెయ్యి పట్టుకుని.

"ఈవిడే నన్ను ఇక్కడకు తీసుకుని వచ్చింది"

అతను కృతజ్ఞతగా చూస్తూ చేతులు జోడించి " ఆప్‌కా ఎహసాన్ ...."

"శ్రీ వాళ్ళు తెలుగు వాళ్ళే"అంది వారిస్తూ.

"అలాగా" అతను సంతోషంగా అన్నాడు.

"చాలా సంతోషమండీ! మీకు ఋణపడిపోయాం." అన్నాడు.

"అదేం ఫరవాలేదు కానీ బహుశా తనకి రెస్ట్ అవసరమేమో వాళ్ళ అమ్మగార్ని కానీ మీ అమ్మగార్ని కానీ పిలిపిస్తే బాగుంటుందేమో!" అన్నాను.

ఇంతలో డాక్టర్ మళ్ళీ రూంలోకి వచ్చింది.

అమె అతన్ని భర్తగా డాక్టర్కి పరిచయం చేసింది.

డాక్టర్ "ఇఫ్ యు డోంట్ మైండ్, నేను ఆమెని ఒకసారి చెకప్ చేయాలి."

మేమిద్దరము రూం బైటకి వచ్చాము.

విజిటర్స్ కూర్చునే కుర్చీల్లో కూర్చున్నాం. అతను హఠాత్తుగా నా ముందు మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

"అరే! ఏమిటిది! లేవండి. లేవండి ప్లీజ్!" అని అతని భుజం మీద చెయ్యి వేసి లేపబోయాను.

"మీకు తెలియదు మేం, మేము పెద్దలని ఎదిరించి ఫ్రెండ్స్ హెల్ప్ తో పెళ్ళి చేసుకుని ఇక్కడకు వచ్చాము. నేను ఇక్కడ ఘాట్‌కోపర్ లో ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాను. తను ఇక్కడ ఒక స్కూల్లో టీచర్ గా పని చేస్తోంది.

అంతా సవ్యంగా వుంది అని అనుకుంటే ఇలా అయ్యింది." అతని కళ్ళల్లో నీళ్ళు.

"డోంట్ వర్రీ! కాల్ చేసి నువ్వే ఈ సంగతి మీ వాళ్ళకి, వాళ్ళ వాళ్ళకీ చెప్పు. సంతోషిస్తారు." అనునయంగా అన్నాను.

"అలాంటిదేం జరగదండీ! వూళ్ళో అడుగుపెడితే కాళ్ళు విరగ్గొడతామని వాళ్ళ నాన్న బెదిరించారు."

"పోనీ, మీ వాళ్ళకి చెప్పు. పెద్దవాళ్ళకి కొన్నాళ్ళు పట్టింపులున్నా మళ్ళీ క్షమించేస్తారు. అదీ గాక ఇలాంటి విషయం వింటే ఎలాంటి వాళ్ళయినా సంతోషిస్తారు. మనవల్లో అంత పవరుంది." నవ్వుతూ అన్నాను.

"అదీ అయ్యిందండీ! మా నాన్నకి ఫోన్ చే సి ఈ విషయం చెబితే 'మీరెవరండీ! మాట్లాడేదీ. మావాడు చచ్చిపోయాడండీ!' అని ఫోన్ పెట్టేసారు." తల వంచుకుని చెప్పాడు.

"అయ్యయ్యో!" అన్నాను బాధగా.

మనిషికి అన్నీ మంచిగా జరిగితే పరవాలేదు. ఏదైనా తేడా వస్తే అప్పుడు తెలుస్తుంది ఏమి పోగొట్టుకున్నామో!

ప్రేమించి పెళ్ళి చేసుకోవడం తప్పు కాదు. పెద్దవాళ్ళని నొప్పించి చేసుకోవడం తప్పు.

పిల్లలు మనకి వ్యతిరేకంగా ఏదైనా చేస్తే బాధ కలగడం సహజమే.కానీ దాని కోసం జీవితాంతం వాళ్ళని శిక్షించడం ఎంత దారుణం? ఇందులో ఎవరిది తప్పు? ఉత్త జనరేషన్ గాప్ తప్పు.

ఇష్టపడి పెళ్ళి చేసుకుని అందరికీ దూరమై వలస పక్షుల్లాగా వున్న ఇద్దర్నీ చూస్తే జాలేసింది.

"డాక్టర్ ఇందాక సీరియస్ ఏమీ లేదు కానీ కొన్నాళ్ళు బెడ్ రెస్ట్ కావాలని అంది. మరి ఎలా మేనేజ్ చేస్తారు?"

"చూస్తాను. నేను కొన్నాళ్ళు శలవు పెడతాను."

నేను కాస్సేపు ఏమీ మాట్లాడలేకపోయాను.

ఇంతలో డాక్టర్ బైటకి వచ్చి, "మీరు సాయంకాలం ఆమెని ఇంటికి తీసుకువెళ్ళచ్చు. కానీ, టేక్ కేర్!"

అతను లేచి నిలబడి, " డాక్టర్! ఇఫ్ యు డోంట్ మైండ్ షల్ ఐ టేక్ హర్ టుమారో, ప్లీజ్!"

"వై?" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"నేను రేపు కంపెనీ మానేజర్ తో మాట్లాడి ........."

ఇంతలో నేను కల్పించుకుని "డాక్టర్, మీరు ఎవరైనా నర్స్‌ని ఏర్పాటు చేయగలరా? ఆమెని ఇంటిదగ్గర చూసుకునేలా. ఎందుకంటే ఎంత బాగా చూసుకున్నా అతను మగవాడు కదా! నర్స్ బెటరేమో! ఎవరైనా నమ్మకమున్న ఆమెని..." నేను అర్థోక్తిలో ఆ-పేసాను.

"ఓ కే. నో ప్రాబ్లం! ఒకటి రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాను."

"థాంక్యూ, డాక్టర్!" అతను ఎంతో కృతజ్ఞతతో చేతులు జోడించాడు.

డాక్టర్ వెళ్ళాకా, నేను కూడా అతనికి రేపు వస్తానని చెప్పి డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్‌కి నిద్దరపోతున్న ఆమెని దూరంనుంచే

చూసి నా సెల్ నెంబరిచ్చి ఏదైనా అవసరముంటే ఫోన్ చేయమని చెప్పి మెల్లగా బయలుదేరాను.

నేను కూడా వలస పక్షినే కనక నాకు తెలుసు బాధ. మా వాళ్ళు మమ్మల్ని క్షమించడానికి పదేళ్ళు తీసుకున్నారు. ఎందుకంటే మా పాప మాకు పెళ్ళైన పది సంవత్సరాలకి పుట్టింది.

ఇప్పుడు మా పాప టెంత్ క్లాసులో వుంది.

రేపు మా పాప వలస పక్షి కాకుండా చూసుకోవాలి.

ఎందుకంటే అప్పుడు నేను తల్లిని కదా!.........

ఏమిటీ? ఇలా ఆలోచిస్తున్నాను? అమ్మో! రమ్యని విడిచి వుండడమే!

ఇంటల్లుడుని తెచ్చేసుకుంటాను.

ఈ విషయం హరికి తెలిస్తే ఏమంటారు? "నీకు వెర్రి ముదిరింది." అని వెక్కిరించి కూతురితో "మీ అమ్మ చూడు ఏమంటోందో!" అని చెప్తారు. అప్పుడు తండ్రీ కూతుళ్ళిద్దరూ కలిసి నన్ను ఆట పట్టిస్తారు.

నవ్వుకుంటూ బైటికొచ్చాను.

******

## లోకరీతి — అపర్ణ మునుకుట్ల గునుపూడి

**క్రిస్మస్ శలవలకి** దగ్గరలోనే ఉండే మావయ్య ఇంటికి వచ్చింది మాలిని.

మావయ్యకి సుమారుగా తన ఈడు కొడుకు మిత్ర, తనకంటే చిన్నది కూతురు స్నేహ ఉన్నారు. వాళ్ళు కూడా కాలేజీ నుంచి శలవలకి ఇంటికి వచ్చేరు. మావయ్య తను పుట్టడానికి మునుపే అమెరికా వచ్చెయ్యడంతో అప్పుడప్పుడు ఇండియా వచ్చినప్పుడు చుట్టపు చూపుగా చూడడమే తప్ప పిల్లలతో చనువుగా తిరిగేంత పరిచయంలేదు మాలినికి. అయినా తన తోటివాళ్ళే కనక వాళ్ళతో కాలక్షేపం చెయ్యడం పెద్ద కష్టం కాదులే అనుకుంది. వాళ్ళిద్దరూ రాంగానే పరిచయం చేసేక, "Hi how is it going?" అనేసి వాళ్ళవాళ్ళ గదుల్లోకి వెళ్ళిపోయేరు. పరీక్షలకి చదువుకోడంతో అలసటగా ఉన్నారు కాబోలు, రెండురోజుల్లో సర్దుకుంటారని సర్దిచెప్పుకుని అత్తయ్య వెనకాల తిరుగుతూ సాయంచేస్తూ ఉండిపోయింది.

మన పండగ కాకపోయినా christmas అంటే అందరికీ సరదాయే. ఇంట్లో పెద్ద పార్టీ. దానికి అన్నీ ముందుగానే తయారుచెయ్యడంలాంటివి చేసింది అత్తయ్య. పార్టీకి ఎవరెవరో వచ్చారు. మావయ్య అందరికీ విధిగా తనని పరిచయం చేస్తూ ఇక్కడ చదువుకోడానికి వచ్చిందని చెబుతూంటే కొంచెం గర్వంగా అనిపించింది మాలినికి. ఆ తర్వాత స్నేహ తన స్నేహితుడని జేక్ అనే కుర్రాడిని పరిచయం చేసింది. ఆ అబ్బాయి వాలకం చూస్తే అతనికి ఆ ఇల్లు కొత్త గాదనిపించింది. ఇంట్లో మనిషిలా తిరుగుతున్నాడు. అత్తయ్యతో ఆమాటే అంటే

" ఆc మరి జేక్ స్నేహ చిన్నప్పటినుంచీ స్నేహితులు. వాడికి ఎంచక్కా ఇడ్లీలు, కారప్పొడి, ఆవకాయ అన్నం అన్నీ అలవాటు చేసేం. ఇంట్లో మనిషిలాగే తిరుగుతాడని" అంది.

భోజనాలకి అన్నీ సర్దుతూంటే మాలినిని డబ్బాలో వడలన్నీ పళ్ళెంలో సర్దమంది. ఆ పనే చేస్తూంటే స్నేహ వచ్చి ఓలా చూస్తూ సొరుగులోంచి టాంగ్స్ తీసి ఇచ్చి " Use the tongs" తనేదో పెద్ద తప్పు చేస్తున్నట్టుగా చూస్తూ అంది.

"I washed my hands " అంది మాలిని.

" Still, people will not eat it if you touched with your hands'' అన్నమాటలకి మనసు చివుక్కుమన్నా అదే పద్దతి కాబోలు అని టాంగ్స్ అందుకుని పని ముగించింది.

భోజనాలప్పుడూ, అయ్యేక స్నేహ, జేక్ ఇద్దరూ మామూలు స్నేహం కంటే ఎక్కువగానే ప్రవర్తించేరు. స్నేహ తన పళ్ళెంలోంచి తింటూ మధ్యలో అతని నోట్లో పెట్టడంలాంటివి చేసింది. సర్దడానికి చేత్తో ముట్టుకుంటే పనికి రాదు గాని ఎంగిలి పనికి వస్తుంది కామోసు అనుకుంది. అందరూ వెళ్ళిపోయేక కూడా జేక్ ఉండిపోయేడు. పనులయ్యేక కూర్చుని కబుర్లు చెబుతోంటే, స్నేహ సుమారుగా జేక్ ఒళ్ళో కూచున్నట్టుగా కూర్చుని మాటల మధ్యలో ఇద్దరు ముద్దులు పెట్టేసుకుంటున్నారు. తనేమన్నా అందామన్నా మావయ్య అత్తయ్య అక్కడే ఉన్నారుకదా అని ఊరుకుంది.

దాచుకుందామన్నా దాగని తన మనో భావాలు అత్తయ్య కనిపెట్టి " వాళ్ళిద్దరూ చాలాకాలంనుంచీ boy friend and girl friend గా తిరుగుతున్నారు. ఇది ఇక్కడి లోక రీతి. " అంది.

మొత్తానికి శలవల్లో వింతలూ విశేషాలూ చూసి రకరకాల మనుషుల్ని కలిసి వెనక్కి బయలుదేరింది.

***

మాలిని చదువు ముగించి వెంటనే ఉద్యోగం కూడా తెచ్చుకుంది. ఉద్యోగంలో చేరడానికి ముందు ఇండియా వెళ్ళి మళ్ళీ మావయ్య వాళ్ళ ఊరు వచ్చింది. కులాసా కబుర్లు అయ్యేక "మిత్రా, స్నేహ ఎలా ఉన్నారు?" అనడిగింది.

"బాగానే ఉన్నారు. మిత్రా రిసెర్చిలో చేరిపోయేడు. స్నేహ మళ్ళీ major మార్చింది. దీనికి డిగ్రీ ఎప్పటికి వస్తుందో అర్థం కావడంలేదు" విసుక్కుపోతూ అంది అత్తయ్య

"అలాగా! ఇప్పుడేం చేస్తానంటోంది"

"ఏదో చెప్పడానికి పనికొచ్చేదేంకాదు"

"ఇంతకు ముందు ఏమిటి చేస్తానంది"

"అదీ గొప్పదేంకాదు. anthropology. ఏదన్నా అన్నావంటే ఇంత చిన్నప్పటి నుంచీ ఏం చేస్తే మంచిదో ఎలా తెలుస్తుందీ, అందరూ ఇలాగే చేస్తారు అంటుంది" మూతి విరుస్తూ చెప్పింది. అందులో స్నేహ మీద కోపంకన్నా తను M.S. ముగించి ఉద్యోగం తెచ్చుకోవడంలో ఈర్ష్య కనిపించినట్టనిపించింది మాలినికి. మాట మారుస్తూ

"జేక్ ఎలా ఉన్నాడు" అనడిగింది.

"ఓ! నీకు తెలీదు కదూ.. ఇప్పుడు జేక్ లేడు. వాళ్ళిద్దరికి మాటా మాటా తేడా వచ్చింది. కొత్తగా స్టీవ్ అని ఓ కుర్రాడితో తిరుగుతోంది. ఇది gym కి వెళితే అక్కడ కలిసేరుట. ఆ పిల్లాడు డిగ్రీ ముగించి lifegaurd గా చేరేడుట. పై చదువులకి ముందర peace corps లో చేరుతాడట. వాడంత good citizen ఇంకెవ్వరూ ఉండరంటుంది. కుర్రాడు చూడడానికి మహ బాగున్నాడులే. ఎంత తిరిగినా కడుపూ కాలూ తెచ్చుకోకుండా మాత్రం చూసుకోమన్నాను. సరే నీ సంగతి చెప్పు. చదువయ్యింది, ఉద్యోగం కూడా వచ్చింది. పెళ్ళిమాటేం చేస్తావు?" అంది.

తన పెళ్ళిమాటకన్నా ముందర చెప్పినమాటలు బుర్రకెక్కడానికి ఒక్క అర నిముషం పట్టింది మాలినికి. విన్నది ఏమిటో అర్థం అవడానికి ఇంకా కొంచెంసేపు పట్టింది. వెంటనే సర్దుకుని "ఇంకా ఏం అనుకోలేదు అత్తయ్యా, అన్నీ ఎలా జరిగాయో అదీ అలాగే జరుగుతుంది. దాని గురించి తీవ్రంగా ఆలోచించి మనసు పాడు చేసుకోదలుచుకోలేదు."

"అంటే నువ్వు చూసుకుంటావా లేక మమ్మల్ని చూడమంటావా"

"అదీ కూడా తెలీడం లేదు"

"ఏదో ఒకటి చెబితే, మాకు చేతనయినదేదైనా ఉంటే చేస్తాం. ఎవరైనా అడిగితే నీకు చెప్పమంటావా?"

"చెప్పు. కానీ అలా అని వెంటనే ఒప్పేసుకుంటానని మాత్రం అనుకోకు"

"అలాగెందుకనుకుంటానే తల్లి. ఈ తరం పిల్లల్ని చూసూనే ఉన్నానుగా".

నన్నుకూడా తన పిల్లలతోపాటూ కలిపి మాట్లాడ్డం కొంచెం బాధకలిగించినా, తనుకూడా అమ్మా నాన్నలనెదిరించి అమెరికాకి పై చదువులకి రావడం గుర్తుకొచ్చి ఏం మాట్లాడకుండా ఊరుకుంది. మరో రెండు రోజులు గడిపి ఉద్యోగంలో చేరడానికి వారం ఉందనగా బయలుదేరింది.

***

ఫోను మ్రోగుతూంటే ఈ వేళప్పుడు ఎవరు పిలుస్తారా అని ఆశ్చర్యపోతూ ఎత్తి హలో అంది.

"Could I talk to Malini"

"This is she"

వెంటనే అవతలి మనిషి తెలుగులో "నా పేరు సుందరి. మేం ఈ మధ్య చుట్టాలింట్లో పెళ్ళికి ఇండియా వెళితే అక్కడ అనుకోకుండా మీ నాన్నగారిని కలిసేం. మీ నాన్నగారు మావారూ చిన్నప్పుడు మంచి స్నేహితులు. మాటల్లో నువ్వు ఇక్కడ ఉన్నావని వీలయితే మాట్లాడమని ఫోన్ నెంబరు ఇచ్చేరు. నువ్వు ఎక్కడ ఉంటున్నావు, ఏం చేస్తున్నావు, స్నేహితులు ఎవరైనా ఉన్నారా, వంట వగైరా వచ్చా" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

మాలిని కొన్నిటికి క్లుప్తంగానూ కొన్నిటికి దీర్ఘంగానూ జవాబులు చెప్పి కాసేపు మాట్లాడేక

"నీకు కారుందా? ఉంటే వీలున్నప్పుడు ఎప్పుడైనా ఇంటికి రా' అన్నారు ఆవిడ.

"ఆఁ! ఉందండీ. తప్పకుండా వస్తాను. మీకు ఎప్పుడు వీలో చెప్పండి"

"ఇప్పుడు అప్పుడని ఏం లేదు. నీకు వీలున్నప్పుడు పిలిస్తే, మేం కూడా ఖాళీగా ఉంటే కలుసుకోవడమే. మా నెంబరు రాసుకుంటావా?" అంటూ ఆవిడ నెంబరు ఇచ్చేరు.

అన్నట్టుగా ఓ మూడువారాల తర్వాత ఓ రోజు ఏం తోచక సుందరి గారింటికి వెళ్ళొచ్చునేమోనని ఆవిడని పిలిచింది మాలిని. ఆవిడ ఆ రోజు కుదరదు కానీ ఆ వచ్చే ఆదివారం వాళ్ళింట్లో ఏదో పార్టీ ఉంది, అప్పుడు వచ్చెయ్. తను పనిలో ఉన్నా అందరినీ కలుసుకోవచ్చునంటూ వాళ్ళింటికి దారి చెప్పింది. అలాగేనని పెట్టేసింది.

ఆదివారం రానే వచ్చింది. అక్కడికి ఎలాంటివాళ్ళు వస్తారో, తనతోటివాళ్ళు ఎవరైనా ఉంటారో లేదోననుకుంటూ కొంచెం బెరుకుగానే బయలుదేరి వాళ్ళిల్లు చేరింది. కారు ఇంటిముందు ఆపుతూ పెద్ద ఇల్లే అనుకుంటూ దిగి తలుపు కొట్టింది. ఒకతను తలుపు తెరిచేరు. "I am Malini, my father is . . . " అంటూండగా

"ఓ! రా రా నువ్వు నారాయణరావు కూతురివికదూ! మీ నాన్న నేను హైస్కూల్లో ఒక్క బెంచి మీదే కూచునే వాళ్ళం. తర్వాత పై చదువులకి వేరే ఊళ్ళకి వెళ్ళి పోయేం. ఇన్నేళ్ళకి మళ్ళీ మొన్న ఏదో పెళ్ళిలో కలిసేం." అంటూ గలగలా మాట్లాడుతున్న ఆయనతో ఏం మాట్లాడాలో తెలియక చూస్తూ ఉంటే" మళ్ళీ ఆయనే "రా, లోపలికి రా కూర్చో. ఇదిగో, సుందరీ, మా నారాయణ కూతురు వచ్చిందోయ్. అంటూ అక్కడనుంచే ఓ గావుకేక వేసి, నీ పేరేమిటన్నావ్?" అన్నారు.

"మాలిని Uncle"

ఈ లోపల ఆవిడలోపల్నించి వచ్చేరు.'' రామ్మా రా! నేనే సుందరిని. ఇవాళ రావడం మంచిపనె చేసేవు. సరదాగా అందరినీ కలవొచ్చు. మధ్యాహ్నం ఏమైనా తిన్నావా? రా. ఏదైనా తింటావా?'' అంటూ వెనకవైపుకి దారి తీసింది. వెళ్ళేక వంటింట్లోకని తెలిసింది మాలినికి.

''ఆc తిన్నానండీ. sandwich చేసుకుతిన్నాను''

''అయ్యో! పెందరాడే వచ్చుంటే మాతో కలిసి లంచ్ చేసి ఉండవచ్చును. సరేలే, నాకు కొంచెం వంట పని మిగిలిపోయింది. ఇక్కడే కూచుని మాట్లాడుతోంటే ముగించేస్తాను''

''పర్వాలేదండి. నేను కూడా సహాయం చేస్తాను. నే చేసేదేమైనా ఉంటే చెప్పండి.''

''ఏం చెయ్యగలవు చెప్పు. వంట చెయ్యడం నేర్చుకున్నావా?''

''ఏదో కొంచెం వచ్చును. manage చెయ్యగలను. ఒక్కర్తికి చేసుకోవడానికి బధ్ధకంగా ఉంటుందండి. అందుకని బయట sandwiches తినేస్తాను.''

''మరి ఆలశ్యం ఏమిటీ. ఎంచక్కా పెళ్ళి చేసేసుకుంటే ఇద్దరూ కలిసి చేసుకోవచ్చును''

మాలిని మొహంలో ఆశ్చర్యం తొంగి చూసింది. అయిదు నిముషాల పరిచయంలోనే పెళ్ళిమాట తిసుకువచ్చేరంటే, అమ్మా నాన్న ఏదైన చెప్పేరా? అన్న అనుమానం వచ్చింది.

అంతలోనే ''ఏం మాట్లాడవేం. చదువయి ఎన్నాళ్ళయింది? ఇదే మొదటి ఉద్యోగమా? మీ వాళ్ళు పెళ్ళిమాట ఎత్తలేదా? లేక నీకు చేసుకోవాలని లేదా?'' ఆవిడ ఆ విషయం అంత సుళువుగా వదిలేట్టు లేదు.

''అలాగని ఏం లేదు. క్రితం జూన్‌లో డిగ్రీ వచ్చింది. వెంటనే ఈ ఉద్యోగంలో చేరేను, పెళ్ళి ఆలోచనమీద పెద్దగా సమయం పెట్టలేదు.''

''అలాగంటే ఎలా. ఇదిగో ఈ cauliflower & carrots తరిగి ఈ పళ్ళెంలో పెట్టు. టమేటో పచ్చడి పెరుగులో కలిపి మధ్య bowl లో పెడదాం అంటూ తన ముందుకి cutting board కత్తి ఆ కూరలు తోసి, ''మనం తీరికగా ఆలోచించడంకోసం పెళ్ళి ఆగదుకదా! ఏదో ఒకటి నిర్ణయం చేసుకుని దాని ప్రకారం నడవాలి. అయినా అవలేదంటే అది వేరే విషయం'' అన్నారు.

ఆవిడ చెప్పింది మంచి సలహాయే అనుకుంటూ కత్తి అందుకుని తరగడమ్మొదలుపెట్టి సర్దుతూ ఉండగా స్నేహ జ్ఞాపకం వచ్చింది. స్నేహ ఎలా ఉందో, అత్తావాళ్ళని పిలవాలి అనుకుంచి. అలానే ఏవో కబుర్లు చెబుతూ అంతా సర్దేసేరు.

''పని చక్కగా వచ్చు. ఏవండీ! మీ స్నేహితుడి కూతురు ఎంత పనిమంతురాలో చూసేరా! ఇంట్లో పిల్లలా సాయం చేసింది'' అంటూ మెచ్చుకుంటూంటే ఆ రోజు మావయ్య ఇంట్లో స్నేహ చేసిన రాద్ధాంతం గుర్తుకివచ్చింది. అది తలుచుకుంటేనే ఏదోలా ఉంది.

సాయంత్రం చాలామంది ఎవరెవరో వచ్చేరు. తను అనుకున్నకన్నా పెద్ద పార్టీయే. మొదట్లో కొంతమందికి ఆవిడ స్వయంగా పరిచయం చేసేరు. ఆ తర్వాత హడావిడిలో పడి వదిలేసేరు. కాని మాలినికి మొత్తమ్మీద అంతమందిని చూడడం రకరకాల కబుర్లూ సరదాగానే అనిపించింది. చివరికి వాళ్ళకి ధన్యవాదాలు చెప్పి బయలుదేరింది. అప్పుడప్పుడు వస్తూండు. జాగ్రత్తగా drive చెయ్యి అంటూ వీడ్కోలు చెప్పేరువాళ్ళు.

***

ఇది జరిగిన ఓ నెలరోజులకి అత్తయ్య పిలిచింది. స్నేహకి engagement అని తప్పకుండా రమ్మనమని చెప్పింది. డిగ్రీ కూడా రాకుండా engagement ఏమిటి. అదీ ఆ lifegaurd స్టీవ్‌తో అనుకుంటూ ఎందుకైనా మంచిదని '' స్టీవ్ తోనేనా'' అనడిగింది.

"కాదే. స్టీవ్ peace corps లో చేరిపోయేడు. ఇప్పుడు మార్టిన్. దాని కాలేజీలో M.S. చేసి ఏదో ఉద్యోగంలో చేరేడు. T.A. గా ఉండగా పరిచయం అయిందిట. క్రితం వారం propose చేసేడు.. ఇది ఎగిరి గంతేసి ఒప్పేసుకుంది. దీనికి డిగ్రీ అయిపోవచ్చింది. దానికి నచ్చినవాడు విద్యాబుద్ధులున్నవాడిని పెళ్ళి చేసుకుంటాననంటోంది. దానికి మేం ఎలా అడ్డు చెప్పగలం చెప్పు"

అత్తయ్య తనతో ఎందుకలా మాట్లాడుతోందో అర్థం కాలేదు మాలినికి. స్నేహ పెళ్ళి చేసుకుంటొందని సంతోషిస్తోందో లేక విచారపడుతోందో తెలీడంలేదు. సరే తప్పకుండా వస్తానని చెప్పింది.

అన్నట్టుగానే ఓ రోజుముందుగానే మావయ్య ఊరు చేరింది. అత్తయ్య మామూలే హడావిడిగా పనులు చేసేసుకుంటూ తోచినంత నాకు చెబుతూ తిరుగుతోంది. ఎందుకైనా మంచిదని పని తొందరకి ముందుగానే tongs ఎక్కడున్నాయో చూసిపెట్టుకున్నాది మాలిని. మర్నాడు మార్టిన్ వాళ్ళూ, మావయ్యకి ఇద్దరు ముగ్గురు స్నేహితులు అంతా కలిసి ఓ పది పన్నెండు మంది వచ్చేరు. ముందుగానే propose చేసినప్పుడే ఉంగరం ఇవ్వడం అదీ జరిగింది కనక పెద్దగా తంతులవీ ఏం లేకుండా కుటుంబ పరిచయాలకన్నట్టుగా క్లుప్తంగా జరిగిపోయింది. అందరూ మామూలుగా అడిగే ప్రశ్న పెళ్ళెప్పుడూ అన్నది వచ్చింది. వెంటనే ఇంకా ఏం అనుకోలేదన్న జవాబూ వచ్చింది. భోజనాలయి అందరూ వెళ్ళేవేళ, స్నేహ ఇంట్లో పనంతా తల్లికి వదిలేసి "Me and Martin are going out for drinks" అంటూ వెళ్ళిపోయింది. పోనీలే ప్రేమ పిచ్చిలో ఉన్నాదని పట్టించుకోలేదు.

మర్నాడు అంతా సర్దుమణిగేక మాలిని ఇంటికి వచ్చేసి తన పనిలో పడిపోయింది.

***

ఆఫీసునుంచి తిరిగొచ్చి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూండగా సుందరిగారు ఫోన్ చేసేరు. ఆవిడ ఎందుకు పిలిచేరో అర్థం అవడానికి ఎక్కువసేపు పట్టలేదు. వాళ్ళింట్లో తననిచూసినవాళ్ళకి తెలిసిన అబ్బాయి మంచి పెళ్ళికొడుకు ఉన్నాడుట కలుస్తావా! అన్నది దాని సారాంశం. ఆలోచించుకుని రెండురోజుల్లో చెబుతాని ఆలోచనలో పడ్డది. కలుసుకోడానికి అభ్యంతరం ఏం లేదు కానీ చూసేక తీరా తనకి నచ్చేసి ఆ తర్వాత అతను కాదంటే తను తట్టుకోగలుగుతుందా? స్నేహ అంత సులువుగా ఎలా boy friends మార్చగలుగుతోంది. జేక్ని స్టీవ్ని మళ్ళీ కలిస్తే ఎలా ఉంటుంది. స్నేహని పిలిచి మాట్లాడితే? తనకి పరిచయం అయిన మూడేళ్ళలో ముగ్గురిని మార్చిన స్నేహకి తన బాధ అర్థం అవుతుందా? సుందరిగారు ఇంతకుమునుపు చెప్పినట్టు ఏదో ఓ నిర్ణయం తీసుకుని దాని వెనకాల నిలబడాలి అన్న మాటలు గుర్తుకి వచ్చేయ్.

సుందరిగారిని పిలిచి కలుస్తానని చెప్పివెంటనే అమ్మనాన్నలకి ఫోన్ చేసి ఈ విషయం చెప్పింది. వాళ్ళు అన్నీ తన ఇష్టానికి వదిలేసేరు. ఆ అబ్బాయి పేరు సుభాష్. అతన్ని ఏ ముహూర్తాన కలిసిందో కాని కలిసిందెగ్గరనుంచి అతన్ని వదలానిపించలేదు. మాలినికి ఇప్పుడర్థం అయింది స్నేహ పరిస్థితి. కాని సుభాష్ ఏం అంటాడో అన్న ఆత్రంతో ఏం చెయ్యాలో తోచక కొట్టుమిట్టాడిపోయింది. కొన్ని రోజులదాకా పిలవకపోతే ఇక పిలవడనుకుంది. తను దేనికి భయపడ్డదో అదే జరిగిందని అనుకుంటూ ఉండగా ఎవరో తలుపు కొట్టేరు. ఎవరా! అని తెరిచి చూస్తే ఎదురుగుండా సుభాష్ చేతిలో స్టార్ లిల్లీస్ బొకే పట్టుకుని నిల్చున్నాడు. అవి చూడగానే పువ్వులందుకుంటూ అప్రయత్నంగా అతన్ని వాటేసుకుంది. మొదట కలిసినప్పుడు మాటల్లో తనకి గులాబీలకన్నా స్టార్ లిల్లీస్ ఎక్కువ ఇష్టం అని చెప్పడం బాగా గుర్తు. తర్వాత సంఘటనలు పెద్దవాళ్ళు మాట్లాడడం, పెళ్ళి, హనీమూన్ వగైరాలన్నీ గబాగబా అయిపోయేయి.

సుమారుగా అదే హడావిడిలో స్నేహ పెళ్ళి జరిగింది. రెండేళ్ళలో తనకీ స్నేహకి ఇద్దరికి చెరో అబ్బాయి పుట్టడం కూడా జరిగింది. అత్తయ్య ఆనందానికి అవధుల్లేనట్టే. ఆ మనవడితోనే లోకం. పిల్లలకి అయిదేళ్ళు వచ్చేయి, ఇంక స్కూల్లో వేసే వయసువచ్చింది హమ్మయ్య అనుకున్న సమయంలో అత్తయ్య దగ్గరనుంచి ఫోన్. మామూలు పలకరింపులయ్యేక ఎలాఉన్నావని అడిగింది.

అంతా బాగానే ఉన్నాం అన్నాక ఏమిటి విశేషం అనేప్పుడికి అత్తయ్య వెంటనే ఆపుకోలేని దు:ఖంతో స్నేహ మార్టిన్ డివోర్స్ తీసుకుంటున్నారుట అంది. అదేమిటి అసలేం జరిగింది. ఏవైనా మనస్పర్థలు వచ్చేయేమో, కొన్ని రోజుల్లో సర్దుకుంటాయిలే అత్తయ్యా, అనబోతూంటే ఇప్పటికి ఏడాదినుంచీ వాళ్ళు విడిగా ఉంటున్నారనీ ఇదే వాళ్ళ నిర్ణయం అనీ చెప్పేసింది స్నేహ అంది. ఏం చెప్పాలో తెలియక నోటమాట రాలేదు మాలినికి.

నన్ను మాట్లాడమంటావా అని అడిగితే,

"ఏం లాభం లేదు. అతనితో ఉండడంకన్నా విడిగా ఉండడం నయం. నాకేం భయం లేదు. నచ్చనివాడితో కాపురం చెయ్యడం మీ ఇండియాలో కానీ అమెరికాలో కాదు అని వాదిస్తోంది. ఏమిటో చిన్నప్పడినుంచీ దానికి కావల్సినట్టు చేసింది. కాదూ కూడదు అంటే లోకరీతని నోరు మూయించేది. ఇవాళరోజున దాని బ్రతుకు ఇలా అయితే దానికి చీకూ చింతా లేదు. పిల్లాడిని ఏంచేస్తావ్ అంటే, నేనే చూసుకుంటాను. ఇక్కడ ఒంటరి తల్లులు మిలియన్లలో ఉన్నారు. పైగా మీ రామాయణంలో సీతకి ఏం జరిగిందో చూడు. మొగుడొదిలెయ్యలేదా, ఇద్దరు పిల్లల్ని ఒక్కర్తీ పెంచి పెద్ద చెయ్యలేదా అని వాదిస్తోంది".

అత్తయ్య తనతో ఇవన్నీ ఎందుకు చెబుతోందా అన్న ఆశ్చర్యం కొద్దిగా కలిగినా దాన్ని బయటపెట్టకుండా ఆవిడ చెప్పినమాటలు వింటూ ఆలోచనలో పడింది మాలిని. చిన్నప్పుడు మావయ్యావాళ్ళు ఇండియా వస్తే స్నేహని కాలు కింద పెట్టనివ్వకుండా ఇంటిల్లిపాదీ దానిని రాకుమారిని చూసుకున్నట్టు చూసుకునేవారు. అందుకు ప్రతిఫలం ఇదేనా? వడలు చేత్తో ముట్టుకుంటే తన మడికి పనికిరాలేదు కాని తను చేసిన పనేమిటి? జేక్‌తో మూతులు కలిపి, స్టీవ్‌తో శరీరం కలిపి, మార్టిన్‌తో పిల్లల్ని కని ఇప్పుడు సీతతో పోలికలు చెబుతోంది. తనకి తోచినవిధంగా చేస్తూ సమయానుకూలంగా లోకరీతిని పట్టుకుని సమర్థించుకోవడం. ఇదా వీళ్ళ విజ్ఞానం?

"ఆ రోజుల్లో మేం అమెరికా వెళుతున్నామని అందరూ ఎంత గొప్పగా అనుకున్నారో ఎందరు ఈర్ష్య పడ్డారో అలాంటిది ఇప్పుడు వాళ్ళందరూ దివ్యంగా ఉన్నారు. నాకు చూడు ఇది ఎంత గుండెకోత తెచ్చిపెట్టిందో. అమెరికా వస్తే విజ్ఞానం పెంచుకుంటామనుకున్నాం. కానీ విలువలన్నీ మర్చిపోతామనుకోలేదు." ఇంకా చెప్పుకుంటూ పోతోంది అత్తయ్య. ఆవిడ ఈర్ష్య పడేవారని ఎవరి గురించి అంటోందో మాలిని గ్రహించింది.

అత్తయ్య తన బాధ ఎంత నర్మగర్భంగా చెప్పినా భావం మాత్రం బాహాటంగా తెలిసిపోయింది, కాని ఆవిడని ఎలా సముదాయించాలో తెలీలేదు మాలినికి.

******

# సిటుక్కు సిటిక్కు వాన సుక్కా - శ్రీనివాస్ ప్రభల

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**"నీ బిడ్డను ఎందుకు** అమ్ముకున్నావు?" అరిచాడు ఆఫీసరు శంకరరావు.. అటువైపునుంచి కాసేపు ఏమీ సమాధానం లేదు...

"ఉష అసలు మీ ఇద్దరి బిడ్డేనా?" అడిగాడు శంకరరావు.. ఇంకా ఏమీ సమాధానం రాలేదు..

"చెప్పు?" మళ్ళీ అరిచాడా ఆఫీసరు... అవునన్నట్టు తలూపారు లలితమ్మ, రాములయ్య.

"మరి పాపని సుద్దయ్యకు ఎందుకు అమ్మేసారు?" గద్దించాడు.

"దాన్నీ అమ్మకపోతే... అదిగో ఆయనేలేడు.. నేను లేను.. మీతో మాట్లాడడానికి ఇక్కడ అసలు ఎవరూ మిగిలేవోళ్ళం కాదు...." నెమ్మదిగా ఏడుపాపుకుంటూ చెప్పింది లలితమ్మ.

అయోమయంగా చూస్తూ ఆమె పక్కనొచ్చి కూర్చున్నాడు రాములయ్య.. కుంటుకుంటూ వచ్చాడేమో, తన కర్ర గోడ పక్కకి పెట్టాడు.

"డబ్బుల్లేకపోతే మాత్రం.. అయిదేళ్ళ బిడ్డను అమ్ముకుంటారా? ఏం తల్లితండ్రులమ్మా మీరు? ఛీ! అసలు మీ బిడ్డ మీద మీకు ప్రేమా జాలి అయినా లేవా?" పెదవి విరిచాడు ఆఫీసరు...

"దాని మీద ప్రేమ ఉంది కాబట్టే అమ్మేసాము.. చెప్పినా మీకు అర్థం కాదు.. దానిమీద చాలా ప్రేమ ఉంది కాబట్టే అమ్మేసాము.. " అంటున్న లలితమ్మకి ఏడుపు ఆగలేదు...

శంకరరావుకి కాని, అతనితో కార్లల్లో వచ్చిన మంది మార్బలానికి కాని, ఆమె చెప్పినది నిజంగానే ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు..

ఇంటిముందర జనం చేరి ఉన్నారు.. వాళ్ళవైపు ఇబ్బందిగా చూసి కళ్ళు తుడుచుకుంటోంది లలితమ్మ.

కుంచేరు పాలెం అనే ఊరు ఒకటి ఉందని ఆ ఊరి వాళ్ళకి తప్ప ప్రపంచంలో ఎవరికి తెలిసుండదేమో.

ఆ మారుమూల కుగ్రామంలో ఈ రోజు బోలెడు సందడి మరి..

ఓ నాలుగు గవర్నమెంటు ఎంబాసిడరు కార్లు ఒకటి తరువాత వస్తే అదేమన్నా మామూలు విషయమా?

ఎప్పుడు అలాంటివి చూడలేదేమో.. సందుల్లో ఆడుకుంటున్న కుర్రాళ్ళు.. వాటిమీద మెరుస్తున్న ఎర్రలైట్లు వాటి వెంట పరిగెట్టారు..

అవి చేసిన సైరను శబ్దాలు... సరిగ్గా వినపడని ముసలమ్మలను తట్టిలేపి.. ఆ కార్లు వెళ్ళిన దిశగా, వీళ్ళనీ తీసుకెళ్ళాయి.

బళ్ళన్నీ లలితమ్మ,రాములయ్య పూరి గుడిసెకు కాస్త దూరంగా ఒకటి వెనుక ఒకటి ఆగాయి.

ఎవరో పెద్ద పెద్ద ఆఫీసర్లు, పోలీసులు, రాజకీయవేత్తలు.. విలేఖర్లు ఒక్కొక్కరే ఆ కార్లోనుంచి దిగారు..

తిండిలేక ఆ ఊళ్ళో రైతులు, వారి కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు ఎవరూ రాలేదు...

అనేక రోగాలతో రొష్టులతో ఆ ఊరు వల్లకాడవుతున్నప్పుడూ ఎవ్వరూ రాలేదు.. కాని.. ఈ రోజు ఆ చిన్న ఊరులోని చిన్నోళ్ళని చూడడానికి ఎక్కడినుంచో పెద్దపెద్దోళ్ళందరూ వచ్చేసారు.

"పెద్దోళ్ళొచ్చారంటే.. అది పెద్ద విషయమే అయి ఉంటుంది.."

జనం గుసగుసల మధ్యలోనుంచి ఆఫీసరు శంకర రావు గొంతు మాత్రంమళ్ళీ గట్టిగా వినిపించింది...

"ఇది మామూలు విషయం కాదు? మీకు అర్థం అవుతోందో లేదో?" అంటున్నాడు శంకరరావు.

"సిగ్గులేక నీ బిడ్డను అమ్ముకున్నావు సరే ... ఆ విషయం పత్రికలోళ్ళకి చెప్పుకోవడం దేనికి? ఆళ్ళు మా మీద, ప్రభుత్వం మీదా దుమ్మెత్తిపొయ్యడానికా?" అన్నాడు శంకరరావుతో వచ్చిన ఇంకో ఆఫీసరు పళ్ళు కొరుకుతూ...

"పత్రికలోళ్ళకి చెప్పుకోడం.." ఆ మాట మాత్రం చెవుల్లో రింగుమన్నాయి లలితమ్మకి..." తను ఎవరికి ఏమీ చెప్పలేదు కదా?" అనుకుంటున్న లలితమ్మ మెల్లగా అన్నీ గుర్తుకొచ్చాయి...

కొన్నాళ్ళ క్రితం ఓ కుర్రాడొచ్చి గుడిసె బయటనుంచి పిలిచాడు.

ఎవరో కుర్రాడు.. పొట్టిగా కళ్ళద్దాలు పెట్టుకుని ఉన్నాడు.

ఆ ఊరిలో వాళ్ళ బంధువుల ఇంటికి వచ్చానని చెప్పాడు.

"నీ కూతురేమయిందంది?" అని మాటల మధ్యలో పరామర్శించాడు.

అది చిన్న ఊరు ... అక్కడ దాచాలన్నా ఏ విషయం దాగదు.." అందరికి ఉష సంగతి తెలిసిపోయింది కామోసు!" అనుకుంది లలితమ్మ...

అప్పటికి ఇంకా బిడ్డని పంపించి ఓ రెండు నెలలు కూడా కాలేదేమో. ఎంత బాధ మనసులో దాగుందో పాపం. ఉండబట్టలేక తన కథంతా చెప్పుకుంది. ఆమెకేం తెలుసు ఆ కుర్రాడు ఒక విలేఖరి అని... "ఫలానా కుంచేరుపాలెంలో జనాలు బ్రతకలేక పిల్లలని అమ్ముకుంటున్నారహో!" అని కథ తయారు చేసి మరునాడు లోకల్ సెక్షనులో అచ్చువేయించాడు.. అంతే! అదో పెద్ద సంచలనం సృష్టించింది...

ఆ వార్త లోకల్ సెక్షను నుంచి మెయిన్ పేజికి ఎప్పుడు వెళ్ళిందో.. మెయిన్ పేజి నుంచి అసెంబ్లీ వరకూ ఎలా పాకిందో ఆ విలేఖరికి కూడా అర్థం కాలేదు..

కుంచేరు పాలెం అధికార పార్టీ నియోజక వర్గం కింద ఉన్న ఊరాయే. దానితో ఆ వార్త అసెంబ్లీలో పెద్ద దుమారానికి నాంది పలికింది.. ప్రతిపక్షాలు పెద్ద గొడవ చేసాయి.. తమ భవిష్యత్తుకి ఆ దుమారం ఎక్కడ ముప్పు తెస్తుందోనని భయపడి శంకర రావు తదితర ఆఫీసర్లు, రాజకీయనాయకులు, వాళ్ళకి వంత పాడే విలేఖర్లు అనేక మంది ఆ మారుమూల ఊరికి బయలుదేరి వచ్చారు. పిల్లని అమ్ముకున్న ఆ నీచులైన తల్లితండ్రుల దుమ్ము దులిపెయ్యడానికి ఏ.సి బళ్ళేసుకుని వచ్చేసారు..

"చెప్పు! చెప్పు! ఎందుకు చేసావో చెప్పు?" అని అరిస్తే తన కథ ఎక్కడినుంచి మొదలుపెట్టాలో అర్థంకాలేదు లలితమ్మకి..

నాలుగేళ్ళ క్రితం వరకూ ఉన్న ఎకరం భూమిదున్ని రాములయ్య తెచ్చిన జొన్న పంటతో, రాములయ్య, లలితమ్మ, ఉష ఎలా బ్రతికారో తెలియదు కాని మొత్తానికి కాలం గడిపేవారు. తరువాతి ఏళ్ళల్లో వానదేవుడు కరుణించలేదు కాని కరువు దేవత వాళ్ళని తెగ ప్రేమగా దీవించి పీడించింది.

దిక్కులేక సొంత ఊరు వదిలి పట్నంలో ఓ పెద్ద ఆఫీసు కట్టేచోట కూలి పనికి చేరారిద్దరూ.. ఆ స్థలం పక్కనే చిన్న గుడిసెలో మకాం పెట్టారు. ఇంకో కుర్రాడు పుట్టాడు. శ్యాం అని పేరు పెట్టుకున్నారు. అంతా బాగానే ఉందని చెప్పలేం కాని సాఫీగానే నడుస్తున్న సమయంలో ఓ రోజు.. లలితమ్మ శ్యాం తల మీద పెద్ద కురుపొచ్చిందని గమనించింది. కొన్నాళ్ళకి ఆ కురుపు ఇంకాస్త పెద్దదయింది. భయమేసి అక్కడి ఆసుపత్రికి పరుగెత్తారా ఇద్దరు తల్లితండ్రులు. పెద్ద వైద్యం చెయ్యాలని.. చాలా ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు..

దిక్కులేక మళ్ళీ తమ ఊరు తిరిగొచ్చి అక్కడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ శ్యాంకి ఆపరేషను చేసారు. లలితమ్మ, రాములయ్య ఎన్నోయేళ్ళు కూడబెట్టుకున్న అయిదువేలు క్షణంలో వదిలాయి..

కొడుక్కి నయమయ్యింది అదే పదివేలనుకున్నారు వాళ్ళిద్దరు.

పెళ్ళాం పిల్లల్ని కుంచేరు పాలెంలో వదిలి మళ్ళీ కూలి పనిచెయ్యడానికి పట్నం వెళ్ళాడు రాములయ్య.

ఓ రోజు రాములయ్య ఎందుకో తిరిగొచ్చాడు. బక్క చిక్కి సగమయిపోయాడు. విపరీతమైన జ్వరంతో వచ్చాడేమో గుడిసెలోకి వచ్చినవాడు వచ్చినట్టే కుప్పకూలిపోయాడు.. లలితమ్మకి చాలా భయమేసింది.. ఆ ఊరి హెల్త్‌కేరు సెంటరు నర్సు, న్యుమోనియా జ్వరం వచ్చిందని.. ఇంజెక్షనులు ఇవ్వాలని చెప్పింది.మళ్ళీ డబ్బు కావాలి.

చేసేది లేక సుద్దయ్య సేటు ఇంటికి పరుగెత్తింది. సుద్దయ్య వాళ్ళకి దూరపు బంధువే. పట్నంలో వ్యాపారంలో వచ్చిన డబ్బులు మిగుల్చుకుని, ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు సుద్దయ్య.

అప్పటినుంచి అందరు "సుద్దయ్య సేటు! సుద్దయ్య సేటు!" అని పిలవడం మొదలుపెట్టారు. సుద్దయ్య లలితమ్మ చెప్పినదంతా విన్నాడు కాని "ఇదివరకు చేసిన అప్పులే చాలా ఉన్నాయి కదా!" అని చిట్టా చదివాడు. రాములయ్యకి నయమయి కూలిపనికి వెళ్ళగానే తీరుస్తామని బ్రతిమాలుకుంది లలితమ్మ. "ఇదే ఆఖరు సారి!" అని గట్టిగా చెప్పాడు సుద్దయ్య సేటు. డబ్బు తీసుకొచ్చి రాములయ్యకి వైద్యం చేయించింది లలితమ్మ. కొన్నాళ్ళకి కాస్త నయమయింది కాని రాములయ్య పూర్తిగా ఇంక కోలుకోలేకపోయాడు. కాలు కదపలేనంతగా నీరసించిపోయాడు . పనికి వెళ్ళలేకపోయాడు. ఎన్ని రోజులు పస్తులున్నారో తెలియదు. పిల్లలు మలమలా మాడిపోయారు.

ఓ రోజు ఎక్కడినుంచో అరువు తెచ్చి గుప్పెడు బియ్యం నీళ్ళల్లో రాత్రంతా నానపెట్టి పొద్దున్నే ఉడికించి జావచేసింది.

ఆ రోజుపిల్లలు దానిని తాగి ఎంత సంబరపడిపోయారో. ఆ వారంలో వాళ్ళు ఆ రోజు మాత్రమే ఎంగిలి పడ్డారని లలితమ్మకి తెలుసు.. చాలా దుర్భరంగా రోజులు గడుస్తున్నాయి.

అసలు సంగతి అటుంచి వడ్డీ కూడా కట్టడం లేదని సుద్దయ్య గొడవ చెయ్యడం మొదలుపెట్టాడు..

ఇక వీళ్ళు కట్టలేరని సుద్దయ్యకి గట్టి నమ్మకం వచ్చేసింది. వాళ్ళ పిల్ల ఉషని తనకు దత్తత ఇమ్మని సలహా ఇచ్చాడు. దానికి బదులుగా వాళ్ళ అప్పు మాఫీ చేస్తానని చెప్పాడు..

లలితమ్మ ఆలోచనలో పడింది. రాములయ్య పరిస్థితి చూస్తేనా అస్సలు బాగా లేదు. సుద్దయ్యకా పిల్లలు లేరు. పిల్లని చూసుకుంటానంటూ ముందుకొచ్చాడు. "కొడుకునయితే ఎలాగైనా పెంచొచ్చు. ఓ లాగు వేసి సందులో ఆడుకోడానికి పంపొచ్చు. కూతురంటే అలా కాదు." ఆలోచించింది లలితమ్మ. చేసేది లేక సుద్దయ్య షరతుకి ఒప్పుకుంది. స్టాంపు కాగితం మీద ఏం రాసుందో తెలియదు కానీ. వేలి ముద్రలు వేసారు రాములయ్య, లలితమ్మ. ఆ స్టాంపు కాగితాన్ని, పిల్లని తీసుకుని వాళ్ళింటికి బయలుదేరారు సుద్దయ్య సేటు దంపతులు.

అది జరిగిన కథ.

"కడుపు నిండా తినే ఈ పట్నం మూకకి తమ బాధలేం అర్థమవుతాయి?" ఆలోచిస్తోంది లలితమ్మ. ఎదురుగుండా కూర్చుని ఏదో ప్రశ్నలు అడుగుతూనే ఉన్నారు ఆఫీసర్లు. లలితమ్మని, రాములయ్యని తిట్టిన తిట్లు తిట్టి నేరుగా సుద్దయ్య ఇంటికి వెళ్ళారు. ఉషని తీసుకొచ్చి రాములయ్యకి, లలితమ్మకి అప్పగించారు. "మీరు కన్నారు కాబట్టి. మీరే పెంచాలని" గట్టిగా చెప్పారు.

తిరిగొచ్చిన కూతురిని చూసి ఆనందించి నవ్వాలో, రేపట్నించి ఇంకో కడుపుకి కూడు ఎలా పెట్టాలో తెలియక ఏడవాలో అర్థంకాలేదు వాళ్ళకి. సుద్దయ్యను అరెస్టు చెయ్యించి పట్నం తీసుకువెళ్ళారు ఆఫీసర్లు. సరైనా నేరమేది రుజువు చెయ్యలేక ఒక

పదిరోజుల్లో విడుదల చేసారు. ఇంక జరిగిన గొడవ చాలనుకున్నాడేమో సుద్దయ్య కూడా మళ్ళీ ఉష సంగతి కాని, వీళ్ళ అప్పు సంగతి కాని ఎత్తలేదు.

ఇది జరిగి ఓ మూడు నెలలు గడిచాయి. వీళ్ళ కథని పత్రికలకెక్కించిన విలేఖరి అనుకోకుండా వేరే పనిమీద మళ్ళీ కుంచేరు పాలెం వెళ్ళాడు. ఇదివరకు రాసిన కథ అతనికి ఎంతో గుర్తింపు తెచ్చిందన్న విషయాన్ని తలుచుకుంటూ బస్సు దిగి నడుస్తున్నాడు.

ఇంతలో ఉన్న పళంగా పెద్ద వాన మొదలయింది. నీడ కోసం పరిగెడుతున్నాడు. అనుకోకుండా లలితమ్మ, రాములయ్య గుడిసె వైపుకి కాళ్ళు పరుగుతీసాయి. ఆ గుడిసె ముందు ఓ చిన్న గుంపు చేరి ఉంది. పెద్ద ఏడుపులు వినిపిస్తున్నాయి. లలితమ్మ గొంతు గుర్తుపట్టి తొంగి చూసాడు. లోపల చూసిన దృశ్యం షాక్ తిన్నాడు.

ఉష శవం చుట్టూ చేరి పెద్దగా ఏడుస్తోంది లలితమ్మ. ఆమెను ఓదార్చడానికి ఒకరిద్దరు ఊరివాళ్ళు వృధా ప్రయత్నం చేస్తున్నారు. వృధా ప్రయత్నం చేస్తున్నారు.

ఓ మూల కూర్చుని తువ్వాలతో కళ్ళు తుడుచుకుంటున్నాడు రాములయ్య. తల్లి ఏడుపులకి బెంబేలెత్తిపోయి శ్యాం చూస్తున్నాడు. బయటకొచ్చి అక్కడున్న ఒకతన్ని ఆరాతీశాడు.

"ఏవుంది బాబు! పట్నం ఆఫీసర్లొచ్చి ఆ సుద్దయ్య దగ్గర సక్కంగా ఉండే పిల్లని తీసుకొచ్చి లలితమ్మకిచ్చారు. సచ్చినోళ్ళు. ఈళ్ళకి ఈళ్ళ కడుపులు నింపుకునే దిక్కేలేదు. ఇంకో కడుపు ఎట్టా నింపగలరు? ఈ మధ్య పిల్లకి పచ్చకామెర్లు వచ్చింది. మందు మాకు లేక. ఇదిగో. గిలాగిలా కొట్టుకుని పసిప్రాణం అలా సల్లంగా పోయింది." అని ఏదో చెప్పుకుంటూ పోతున్నాడు.

విలేఖరి చుట్టూ చూసాడు. ఇప్పుడక్కడ పోలీసుల్లేరు, విలేఖర్లు లేరు, నాయకులు లేరు, ఆఫీసర్లు లేరు. ఒక శవం... భోరున ఏడుస్తున్న తల్లితండ్రులు ఉన్నారు. అంతే..!!

ఇందాక మాట్లాడుతున్న అతను కోపంగా అంటున్నాడు. "ఏవడో దొంగ నాయాలు పేపరులో ఏదో రాసాడట. లేకపోతే ఆ పిల్ల బ్రతికుండేదే బాబు పాపం"

వానలో ఇప్పటికి బాగానే తడిసిపోయాడు విలేఖరి. తడిసిన తలమీదనుంచి కళ్ళమీదకి నీళ్ళు కారాయి.

తలదించుకుని రుమాలుతో తల తుడుచుకుంటున్నాడు. లేదు. లేదు. అవి వాన నీళ్ళు కావు. కంటిలో నుంచి వచ్చిన నీళ్ళే. నెమ్మదిగా తుడుచుకున్నాడు.

గుడిసె సూరు మీద నుంచి "సిటుక్కు సిటుక్కు" శబ్దం చేస్తూ కింద పడుతున్న వాన చుక్కలని చూస్తూ మెల్లగా నడవడం మొదలుపెట్టాడు విలేఖరి. ***

# కిన్నెరసాని ఒడ్డున... - మధురవాణి

**"ఏంటి నాన్నా.. మీరనేది?** నిజంగా మీరేనా ఇలాంటి నిర్ణయం తీసుకుంది. నేనసలు నమ్మలేకపోతున్నాను. నిజంగా మనకు డబ్బు అంత అత్యవసరమైతే వేరే ఏదన్నా మార్గం ఆలోచిద్దాం నాన్నా. కావాలంటే నా ఆఫీసులో కూడా లోను తీసుకోవచ్చు. మీ నిర్ణయాన్ని ఒప్పుకోడానికి మాత్రం నాకు మనస్కరించట్లేదు.." అంటూ చాలా ఆవేశంగా మాట్లాడేశాను ఫోనులో.

"అరే కార్తీక్.. ముందు నువ్వు ఉద్రేకపడకుండా ప్రశాంతంగా ఉండు. యీ నిర్ణయం నిన్ను కలత పెడుతుందని నాకు ముందే తెలుసు. కానీ, నాకింతకంటే సరైన మార్గం కనిపించలేదు. సర్లే, నువ్వో పని చెయ్యి. యీ వీకెండ్ నువ్వు ఇంటికి రా. మనం అన్ని విషయాలూ తీరిగ్గా చర్చించుకుని అప్పుడే ఓ నిర్ణయానికి వద్దాం. అప్పటిదాకా యీ విషయం గురించి తీవ్రంగా ఆలోచించి నీ మనసు పాడు చేసుకోకు. సరేనా!?" అని చెప్పి ఫోన్ పెట్టేశారు నాన్న.

ఫోన్ కాల్ తరువాత ఏ పని చేస్తున్నా నా మనసులో యీ విషయం ఓ పక్క తొలుస్తూనే ఉంది. ఎలాగైనాసరే నాన్న నిర్ణయాన్ని మార్చాలని, అందుకోసం ఏం చెయ్యాలా అని నాలో నేనే తర్జన భర్జనలు పడుతూ ఉండగానే శుక్రవారం వచ్చేసింది.

శుక్రవారం రాత్రికి ఇంటికెళ్ళడానికి బస్సెక్కాను. ఆ రాత్రి వేళ బస్సులోనూ, బయటా కూడా అంతా కాటుకలా నల్లగా పరుచుకున్న చీకటి. బస్సులో వాళ్ళందరూ చల్లగా నిద్దర్లోకి జారుకోవడం చేత బస్సు పరిగెడుతున్న శబ్దం మినహా ఇంకే సవ్వడీ వినిపించట్లేదు.

నాకు మాత్రం ఎడతెరిపి లేని ఆలోచనలతో అస్సలు నిద్ర పట్టడం లేదు. కిటికీ కాస్త తెరవగానే చల్లటి గాలొచ్చి హాయిగా తాకింది. అలా రెప్పలు వాల్చగానే నా గుండె లోపలి పొరల్లో భద్రంగా కొలువై ఉన్న చిన్ననాటి జ్ఞాపకాల్ని తట్టి లేపుతూ మనసు గతంలోకి పరుగుతీసింది.

దాదాపు పన్నెండేళ్ళ క్రితం నాకు పదకొండేళ్ళ వయసున్నప్పుడు నాన్నతో పాటు మొదటిసారి ఊరెళ్ళాను. అది నాన్న పుట్టి పెరిగిన సొంత ఊరు. మేం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే ఊరొదిలి వచ్చేయడం మూలానా మాకు ఊరితో అనుబంధం తక్కువే కానీ, నాన్న మాటల్లో మాత్రం రోజుకి కనీసం పదిసార్లైనా, వాళ్ళ ఊరికి సంబంధించిన ఏదో ఒక విషయమో, పోలికో రాకుండా ఉండేది కాదు. మొదటిసారి నాన్నతో ఊరెళ్ళినప్పటి జ్ఞాపకం ఇంకా నా మదిలో తాజాగా ఉంది.

❋❋❋

ఓ చిన్న టౌన్నుంచి బయలుదేరి అటూ ఇటూ దట్టంగా చెట్లున్న ఎర్రమట్టి రోడ్డులో అరగంట ప్రయాణించిన ఎర్రబస్సు దుమ్మురేపుకుంటూ ఓ చోట ఆగింది.

దిగి చూస్తే, బస్సాగిన దగ్గర నుంచీ ఓ వందడుగులు మాత్రం దారి కనిపిస్తూ, అక్కడ నుంచి ఓ చిన్నపాటి లోయలా ఉందనిపించింది. ఆ చిన్నలోయ ఓ కిలోమీటరు పొడవునా ఉండచ్చనుకుంటా! ఆ లోయకటు పక్కన ఇప్పుడు నుంచున్న చోటుకి సమాంతరంగా ఉన్న ఓ మట్టిబాట కనిపిస్తోంది.

వందడుగులూ వేసాక చూస్తే.. నే లోయనుకున్న జాగాలో ఎడమవైపు నుంచి కుడివైపుకి గలగలా పారుతున్న వాగొకటి కనిపించింది. ఏ పక్కకి చూసినా కనుచూపుమేరా వంపులు తిరిగి ప్రవహిస్తున్న వాగే కనిపిస్తోంది. మధ్య మధ్యలో చిన్న చిన్న ఇసుక

తిన్నెలతో వేరు చేయబడుతూ సన్నటి పాయలుగా చీలిపోతూ, మళ్ళీ అంతలోనే కలసిపోతూ భలే గమ్మత్తుగా ఉంది చూడ్డానికి. పొద్దుటి పూట నీరెండ నీళ్ళ మీద పడి మెరుస్తుంటే, నక్షత్రాలు దిగొచ్చి వాగు పైన తేలుతున్నట్టుంది.

నేను కళ్ళు విప్పార్చుకుని వాగునే చూస్తుండగా "ఇప్పుడు నీ కళ్ళెదురుగా నువ్వు చూస్తోందే కిన్నెరసాని వాగు" అని చెప్పారు నాన్న.

ఆ మాట వినగానే నా కళ్ళు మెరిశాయి. మరుక్షణంలోనే పరిగెత్తుకుంటూ ఇసుక మేటను దాటుకుని నీళ్ళకి దగ్గరగా వెళ్ళాను. నీళ్ళెంతో లోతున్నట్టు లేదు. నీళ్ళడుగున ఉన్న రంగురంగుల గులకరాళ్ళు, చిన్ని చిన్ని శంఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నిరంతరాయంగా ప్రవహిస్తున్న నీటిపైన తేలే అలల మీద సూర్యకాంతి పడి, ఆ అలల కదలికల ఛాయ ఎక్కడో అడుగునున్న గులకరాళ్ళ పైన ప్రతిఫలిస్తోంది. బోలెడన్ని బుజ్జి బుజ్జి చేపలు హడావిడిగా అటూ ఇటూ తిరిగేస్తున్నాయి.

నేను దీక్షగా ఆ నీళ్ళనే పరిశీలిస్తుండగా నాన్నొచ్చేశారు నేన్నించున్నచోటికి.

"మన ఊరు కిన్నెరసానికి ఆవలి ఒడ్డునుంది. మనం వాగుని దాటుకునెళ్ళాలి. ఓసారి దోసిట్లో నింపుకుని యీ నీళ్ళ రుచి చూడు" అన్నారు.

ఎంత స్వచ్ఛంగా ఉన్నాయో ఆ నీళ్ళు! దోసిట్లో నీళ్ళు నింపుకుంటే అరచేతిలో రేఖలు స్పష్టంగా కనపడుతున్నాయి. తాగి చూస్తే అచ్చం తియ్యటి కొబ్బరి నీళ్ళు తాగినట్టుంది. అంత రుచికరమైన నీళ్ళు మళ్ళీ నేనిప్పటిదాకా తాగనేలేదు.

కాసేపు కిన్నెరసాని నీళ్ళలో ఆటలాడుకుని, కాసిన్ని రంగు రంగుల గవ్వలేరుకుని మెల్లగా ఆవలి ఒడ్డుకి చేరాం. ఒడ్డుకి కుడివైపున దూరంగా చిన్న కొండలాగా ఎత్తుగా ఉన్న ఎర్రమట్టి దిబ్బల పైన వరుసగా పెద్ద పెద్ద చెట్లు కనపడుతున్నాయి.

అటువైపు చూపించి "అక్కడే మన పొలం, మావిడి చెట్లు ఉన్నాయి. అక్క పుట్టకముందు నాటాం ఆ చెట్లని. అప్పట్లో నేనూ, మీ అమ్మా కలిసి అంతెత్తు నించి దిగొచ్చి యీ కిన్నెరసానిలోంచి నీళ్ళు బిందెలతో పైకి తీసుకువెళ్ళి చాలా అపురూపంగా పెంచాం ఆ మావిడి తోటని" అని చెప్పారు నాన్న. నేను వెంటనే అక్కడికెళ్ళి చూద్దాం అంటే నాన్న వారించి మధ్యాహ్నం తీసుకువెళతానన్నారు.

అలా నడుస్తూ కిన్నెరసాని ఒడ్డెక్కాక ఎత్తులూ, పల్లాలూ ఉన్న ఓ ఎర్రమట్టి బాట వెంట ఓ రెండు కిలోమీటర్లు పైన నడిచాక ఊరు కనిపించింది. నాన్నా, నేనూ ఊర్లోకి వెళుతుంటే అడుక్కి ఒకరు పలకరిస్తున్నారు నాన్నని. అలా అలా మాట్లాడుకుంటూ దార్లో నాన్న చిన్నప్పుడు చదువుకున్న స్కూలు, ముత్యాలమ్మ గుడి అన్నీ దాటుకుని వెళ్ళాం.

నాకు మొత్తం ఆరుగురు పెదనాన్నలూ, ఇద్దరత్తలూ, ఓ బాబాయి ఉన్నారు. వాళ్ళందర్లో సగం మందికి పైగా ఊర్లోనే ఉన్నారు. అందరిళ్ళకీ తిరుగుతూ కాఫీలూ, ఫలహారాలూ చేస్తూ మధ్యాహ్నందాకా తిరిగేసాం. అంతమంది అన్నయ్యలూ, అక్కలూ, బావలూ, వదినలూ అందర్నీ కలుస్తూ భలే సందడిగా గడిచిపోయింది సమయం.

సరిగ్గా భోజనం సమయానికి రెండో పెదనాన్నింటికి వెళ్ళాం. నానమ్మ, తాతయ్య కూడా అక్కడే ఉంటారు. మమ్మల్ని చూడగానే నానమ్మ చాలా సంతోషించింది.

అసలా ఇల్లెంత పెద్దగా ఉందనీ! అక్క పుట్టక ముందు దాకా నాన్నావాళ్ళ పెద్ద కుటుంబమంతా కలిసి ఉమ్మడిగా యీ ఇంట్లోనే ఉండేదట. నేను ఇల్లంతా తిరుగుతూ ఆశ్చర్యంగా చూస్తుండగానే భోజనాల వేళయిందని త్వరపెడుతూ నానమ్మ మమ్మల్ని పెద్దింటి వెనకాలున్న ఓ చుట్టింట్లోకి తీసుకువెళ్ళింది. గుండ్రంగా గుడిసె లాగా ఉన్న పెంకుటిల్లే వాళ్ళ వంట గదీ, భోజనాల గదీ అన్నమాట.

నన్ను పీట మీద కూర్చుబెట్టి వేడి వేడి అన్నంలో టమాటా పప్పు, ఆవకాయ పెట్టిచ్చి, గడ్డ పెరుగు మీద మందంగా తేరుకున్న మీగడ పొరని తీసుకొచ్చి వేసింది. కొంచెం అయోమయంగా చూస్తున్న నన్ను "కమ్మగా ఉంటుంది తినరా.." అంది నానమ్మ. ఆ కమ్మటి రుచి నేనింకా మర్చిపోలేదు.

భోజనాల తరవాత అందరితో కాసేపు కబుర్లయ్యాక నాన్న నన్ను ఒక ఇంటి దగ్గరికి తీసుకువెళ్ళారు. ఆ ఇంట్లో వాళ్ళని పలకరించాక ఆ ఇంటిని నాకు పరిచయం చేశారు.

"కార్తీక్.. ఉమ్మడి కుటుంబంలోంచి వేరుపడ్డాక నేనూ, మీ అమ్మా యీ ఇంట్లోనే మా జీవితాన్ని మొదలుపెట్టాం. తర్వాత్తర్వాత యీ మారుమూల పల్లెటూర్లోనే ఉంటే మీ చదువులు సాగవని యీ ఇల్లమ్మేసి, యీ ఊరొదిలేశాం. నాకూ, మీ అమ్మకీ యీ ఇంటితో ముడిపడిపోయిన కష్టసుఖాల జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. స్వయంగా మా చేతులతో యీ పూరిల్లు కట్టుకున్నాం. యీ ఇంటికున్న ప్రతీ గోడా మీ అమ్మ స్వయంగా అలికి ముగ్గులు పెట్టేది. యీ ఇంట్లోనే అక్కా, నువ్వూ తొలి అడుగులేశారు. అదిగో వేప చెట్టు కిందే మీరిద్దరూ చిన్నపుడు ఆడుకునే వాళ్ళు. ఇదిగో యీ పందిరి కిందే చిన్నప్పుడు అక్కా, నువ్వూ మట్టి తినాలని చూస్తే అప్పుడు మీ అమ్మ యీ పందిరిలోంచి కందిమెల్లొకటి లాగి దెబ్బలు పడతాయని భయం చెప్పేది. అదిగో అక్కడ ఓ చిన్న పశువుల పాక ఉండేది. అందులో ఉండే మన చుక్క గేద్దూడ చుట్టూనే తిరుగుతుండేవాడివి నువ్వు చిన్నప్పుడు. యీ ఇంటి వెనకాలున్న బావిలోంచే మేం రోజూ నీళ్ళు చేదకొచ్చి యీ తొట్టిలో నింపుకునేవాళ్ళం. అప్పట్లో యీ ఇంటి వెనకాలంతా మీ అమ్మ చాలా పూల మొక్కల్ని పెంచేది" అంటూ చిన్నప్పటి మధుర స్మృతుల్ని నాకు పంచారు నాన్న.

కొన్ని సంవత్సరాల క్రితం అదే ప్రదేశంలో నేను బుడి బుడి అడుగులేస్తూ తిరిగాననుకుంటే మాటల్లో చెప్పలేని, మనసంతా చిక్కగా అలుముకున్న ఓ గమ్మత్తైన భావం కలిగింది నాకారోజున.

కాసేపటి తర్వాత అక్కడి నుంచి నాన్నా, నేనూ కలిసి చాలా దూరం నడిచి పెదనాన్నల పొలాలన్నీ దాటుకుంటూ మా పొలం దగ్గరికెళ్ళాం.

చేను గట్టు మీద నడుస్తూంటే ఎటు చూసినా పచ్చగా మెరిసిపోతూ, గాలికి సన్నగా ఊగుతూ ఎంతందంగా ఉన్నాయో వరి మళ్ళు.

మా పొలం ఎక్కడి నుంచీ ఎక్కడి దాకా అని నాన్న చూపిస్తూ ఉండగా ఒక చోట వరిమడి మధ్యలో ఓ చిన్న చెట్టేదో ఉన్నట్టు కనిపించింది. అదేంటని అడిగితే ఎప్పుడో మావిడి టెంక పడి దానంతటదే మొలిచిన మావిడిచెట్టన్నారు నాన్న.

దగ్గరికెళ్ళి చూద్దును కదా.. నడిచే గట్టుకి ఓ పదడుగుల లోపలికి వరి మొక్కల మధ్యలో నిండా మావిడి కాయలతో ఠీవీగా నించున్న రెండు కొమ్మల మావిడి చెట్టు. అంత చిన్న చెట్టుకి అన్ని కాయలా అని నేనాశ్చర్యపోతుంటే నాన్న చెప్పారు వాటిని కోతి ముట్టె కాయలనీ, కలెక్టరు కాయలనీ అంటారట. ఆ చెట్లు అలానే కాపుకొస్తాయట.

ఆ చెట్టు నుంచి పచ్చి మావిడి కాయలు ఓ రెండు తెంపుకుని అలా నడుస్తూ పొద్దున్న నాన్న కిన్నెరసాని ఒడ్డు నుంచి చూపించిన మా మావిడి తోట దగ్గరికెళ్ళాం.

మొత్తం మీద ఓ ఇరవై చెట్లే ఉన్నాయి గానీ ఒక్కోటీ ఎంత పెద్దవో.. ఒక్కో చెట్టు వెయ్యి పైన కాయలు కాస్తుందట. అలా వాటి మధ్యన తిరుగుతూ ఇది బంగినపల్లి, ఇది ఆవకాయ పెట్టుకునే కాయల చెట్టు అని చూపిస్తూ వాటిల్లో కొన్ని చెట్లకి అమ్మా నాన్నా పెట్టుకున్న సరదా పేర్ల గురించి చెప్పుకుంటూ అన్నీటినీ పేరుపేరునా పరిచయం చేసారు నాన్న.

"అరే కార్తీక్.. ఇప్పుడంటే యీ చెట్లన్నీ పెద్దవైపోయాయి గానీ, వీటిని అంట్లుగా నాటినప్పటి నుంచీ కాపుకొచ్చేదాకా చాలా అపురూపంగా అచ్చం మిమ్మల్ని పెంచినట్టే పెంచాామురా నేనూ, మీ అమ్మా కలిసి" అని నాన్న చెపుతుంటే ఆయన కళ్ళల్లో పల్చగా కదలాడిన తడి తెర నా దృష్టిని దాటిపోలేదు.

ఇంక పొలం నుంచి తిరిగొచ్చేద్దామనుకుంటుండగా "నీకో ప్రత్యేకమైన చెట్టు చూపిస్తానంటూ" చేయి పట్టుకుని ఓ వైపుకి తీస్కెళ్ళారు నాన్న.

అక్కడ ఓ మోస్తరు పెద్దగా ఉన్న నిమ్మ చెట్టుంది. దాని ప్రత్యేకతేంటంటే, చెట్టు మీద ఆకులున్నంత దట్టంగా నిమ్మకాయలున్నాయి. నేను అబ్బురంగా ఆ చెట్టునే చూస్తుండిపోయాను కాసేపు.

"అరే.. కార్తీక్, యీ నిమ్మ చెట్టు మీ అమ్మ చాలా శ్రద్ధ తీసుకుని పెంచింది. ఇది చిన్నగా ఉన్నప్పుడు దీనికేదో తెగులొస్తే బోలెడు సపర్యలు చేసి మరీ దీన్ని బతికించింది. యీ పొలం మొత్తంలో మీ అమ్మకి చాలా ఇష్టమైన చెట్టు యీ నిమ్మ చెట్టేరా!" అని చెపుతుంటే భలే సరదాగా అనిపించింది నాకు.

నిమ్మచెట్టునుంచి పచ్చటి పసిమితో మెరిసిపోతున్న నిమ్మకాయలు కొన్ని కోసుకుని ఇంక పొలంలో విహారం చాలించి ఇంటికి బయలుదేరాం.

ఇంటికెళ్ళగానే పెద్దమ్మ కిన్నెరసాని నీళ్ళతో నిమ్మకాయ షర్బత్ చేసిచ్చింది. ఆ రుచి అద్భుతం అంటే అది చాలా చిన్నమాట!

ఆ రోజు సాయంత్రమే మళ్ళీ వెనక్కి బయలుదేరి మా ఊరొచ్చేసాం. ఇంటికొచ్చాక అమ్మ ప్రతీ చెట్టు గురించీ క్షేమ సమాచారాలడిగి తెలుసుకుంది. ఆ రోజున నాన్న బదులు నేను చెప్పాను అమ్మకి వివరాలన్నీ.

❁❁❁

అలా ఒక్కరోజులో నాన్న చూపించిన అమూల్యమైన జ్ఞాపకాల ముత్యాలనేరుకుని గుండెల్లో భద్రంగా దాచుకున్నా ఇప్పటిదాకా.

తరవాత మళ్ళీ నేనెప్పుడూ మా పొలం చూడకపోయినా, కొన్నిసార్లు శుభాశుభాలకి హాజరవడానికి ఆ ఊరికి మాత్రం వెళ్ళాను. కాలేజీ చదువులకొచ్చాక అదీ తగ్గిపోయింది. ఇప్పటికి నేనా ఊరెళ్ళక దాదాపు ఏడెనిమిదేళ్ళ పైనే అయింది. నేను స్వయంగా వెళ్ళకపోయినా అమ్మా, నాన్నా వెళుతుంటారు కాబట్టి అక్కడి సంగతులన్నీ ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటాయి.

"ప్రపంచమంతా శరవేగంగా మారిపోతుంటే ఆ ఊరు మాత్రం దాదాపుగా ఏం మారలేదురా.. మనవాళ్ళ పిల్లలందరూ కూడా మెల్లగా ఊరొదిలి వలసపోతున్నారా" అని నాన్న ఓసారి చెప్పారు.

"నానమ్మ, తాతయ్యా పోయాక ఆ ఊరితో ఉన్న అనుబంధం బలహీనపడినట్టు అనిపిస్తోందిరా కార్తీక్! ఏంటో యీ రోజుల్లో అందరికీ తోడబుట్టినవాళ్ళన్న అనుబంధం కన్నా కూడా డబ్బు, స్వార్ధం ముఖ్యమైపోతున్నాయి" అంటూ చూచాయగా పరిస్థితుల గురించి నాన్న అప్పుడప్పుడూ చెపుతూనే ఉన్నారు.

నీళ్ళు సమృద్ధిగా ఉండి సంవత్సరానికి రెండు పంటలు పండే బంగారంలాంటి పొలమైనప్పటికీ ఊళ్ళో ఉన్న పొలం గురించి గత ఐదారేళ్ళుగా ఏదో ఒక సమస్య వస్తూనే ఉంది. పొలం కౌలుకి చేస్తోంది దగ్గరి బంధువులే అవడం లాభం కన్నా నష్టాన్ని ఎక్కువ కలిగిస్తోంది. ఆ పొలం మీద ఏదో ఒక రూపంలో పెట్టుబడి పెట్టడమే గానీ, రాబడి మాత్రం ఉండట్లేదు.

"ఎంత విసిగిపోయినా పొలాన్ని మాత్రం వదల్లేనురా కార్తీక్! ఊరికీ నాకూ మధ్యన మిగిలిపోయిన బంధం అదొక్కటేరా!" అన్నారు నాన్న మూడేళ్ళ కిందట ఓసారి.

నాన్న అంతగా ఇష్టపడే పొలాన్ని ఇప్పుడు అకస్మాత్తుగా అమ్మెయ్యాలని నిర్ణయించుకున్నారంటే నేనస్సలు నమ్మలేకపోతున్నాను. ఎలాగైనా సరే నాన్న నిర్ణయాన్ని మార్చాలని మరోసారి గట్టిగా అనుకుని బలవంతంగా నిద్రకుపక్రమించాను.

మర్నాడు పొద్దున్నే బస్సు దిగి ఇంటికెళ్ళాక స్నానం చేసి ఊరెళ్ళొస్తానని ఒంటరిగా బయలుదేరాను.

ఇన్నేళ్ళ తరవాత కిన్నెరసాని వాగునీ, ఊరినీ, ఇంటినీ, పొలాన్నీ చూడబోతున్నానని ఎంతో ఉత్సాహంగా బయలుదేరిన నాకు ఆదిలోనే నిరాశ ఎదురయింది.

కిన్నెరసాని స్థానంలో నల్లగా బూడిద నీళ్ళు పారుతున్న వాగు కనపడింది. దగ్గరలో ఉన్న బొగ్గు ఫ్యాక్టరీ నించి వచ్చే వ్యర్థాల వల్ల కిన్నెరసానిలో నీళ్ళు ఇంతకు ముందులా లేవని నాన్న చెప్పారు గానీ అది ఓ తియ్యటి తేనె జల లాంటి వాగుని ఇలా మురిక్కాలవలా మార్చేసి ఉంటుందని నేనూహించలేకపోయాను.

నీళ్ళల్లో చేపలని వెతికే వ్యర్థ ప్రయత్నం చేస్తూ నేను వాగు దాటేసరికి నా కాళ్ళ మీద బూడిద మరకలని కానుకగా ఇచ్చిందా వాగు. ఇకపై యీ వాగుని కిన్నెరసాని అని పిలవలేను. దీనికి బూడిద వాగే సరైన పేరనిపించింది. బూడిద వాగు మీద వంతెన నిర్మించే పనులు కూడా జరుగుతున్నాయక్కడ.

ఉస్సూరంటూ నానమ్మ వాళ్ళున్నప్పటి పెద్దిల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. అదక్కడుంటేగా నాక్కనబడ్డానికి! స్థానంలో ఓ కొత్త డాబా ఇల్లుంది. ఇల్లు చూడ్డానికి ఎంతందంగా ఉన్నా నా కంటికి మాత్రం అస్సలు ఇంపుగా అనిపించలేదు.

నే చిన్నప్పుడు పెరిగిన మా ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. అక్కడ కూడా రూపు రేఖలు మారిపోయిన మరో డాబా ఇల్లు కనబడింది.

చిన్నప్పటిలా అన్నయ్యలూ, అక్కలూ, బావలూ, వదినల సందడి లేనే లేదు. ఏ ఇంటికెళ్ళినా ఒంటరిగా మిగిలిపోయిన పెద్ద తరం వాళ్ళే కనిపిస్తున్నారు.

చివరి ప్రయత్నంగా పొలం దాకా వెళ్ళొద్దామనుకుని బయలుదేరేలోపు ఏదో మాటల్లో పెద్దమ్మ చెప్పింది. మా పొలంలో నిమ్మచెట్టుకి ఏదో తెగులొచ్చి పోయినేడాదే చచ్చిపోయిందట. ఆ మాట విన్నాక మరి ఇక పొలానికి వెళ్ళాలనిపించలేదు.

ఇన్నేళ్ళ తరవాత ఎంతో ఆశగా నా జ్ఞాపకాల జాడలు చూసుకుని మురిసిపోదామని వెతుక్కుంటూ వచ్చిన నాకు అన్ని చోట్లా ఆశాభంగమే ఎదురయింది.

చివరిగా నా మదిలో మిగిలిన పొలం తాలూకు స్మృతి చిత్రాన్నైనా కాలం తెచ్చిన మార్పుల మరకలు పడి మాసిపోకుండా అలాగే ఉండనిద్దాం అనిపించింది. పొలం చూడకుండానే వెనుదిరిగాను.

❁ ❁ ❁

ఊరునించీ తిరిగొచ్చాక పొలం గురించి ఉన్న రకరకాల సమస్యలన్నీటి గురించి అమ్మ వివరంగా చెప్పింది. "మనం దగ్గరుండి చూసుకోలేనప్పుడు, సరిగ్గా చూసిపెట్టే వాళ్ళు లేనప్పుడు, పొలం అమ్మెయ్యడమే సరైన నిర్ణయమనీ, కనీసం కొనుక్కున్న వాళ్ళైనా జాగ్రత్తగా చూసుకుంటారని నాన్న అనుకుంటున్నారు" అని చెప్పింది.

ఇంతా చూశాక పొలం అమ్మెయ్యాలనుకున్న నాన్న నిర్ణయానికి నేను అభ్యంతరం చెప్పలేకపోయాను.

కానీ.. అమూల్యమైన నా జ్ఞాపకాలన్నీ చేజారిపోయాయన్న నిజాన్ని మాత్రం అంగీకరించలేకపోతున్నాను. అదే ధ్యాసలో ఉండిపోయి రెండు రోజులు గడిచేసరికి కూడా ముభావంగానే ఉండిపోయాను.

అది గ్రహించిన నాన్న రోజు సాయంత్రం ఇంటి ముందు పూల మొక్కల మధ్య కూర్చుని పేపరు చదువుకుంటూ నన్ను పిలిచారు. నే వెళ్ళి నిశబ్దంగా కూర్చున్నాను.

"అరే.. కార్తీక్, నీ బాధ నాకర్థమయిందిరా. నీకో విషయం చెపుతాను చూడు. ఇదిగో యీ గోడ పక్కన పోయినేడాది ఓ పెద్ద గులాబీ తీగని పెంచాం గుర్తుందా! నీకు చాలా నచ్చేది ఆ పూతీగ. యీ ఏడాదికి ఆ గులాబీ మొక్కే లేకుండా పోయింది. కానీ, అదే స్థానంలో వచ్చిన యీ సన్నజాజి తీగని చూడు ఎంతందంగా ఉందో!

అలాగే, మన జీవితంలో కూడా కొన్ని వస్తుంటాయి, మరికొన్ని పోతుంటాయి. దేని విలువ దానిదే! నా మటుకు నాకు నేను పుట్టిన ఊరితో ఒకలాంటి అనుబంధం ఉంది, ఇప్పుడు ఇరవయ్యేళ్ళు యీ ఊళ్ళో ఉన్నాక ఇదీ నా సొంతదే అనిపిస్తోంది.

కార్తీక్.. యీ ప్రపంచం ఓ సముద్రం లాంటిది. సముద్రంలో నిత్యం ఎగసిపడే అలలు సముద్రంలోంచి కొన్ని గవ్వల్ని ఒడ్డుకి చేరుస్తుంటాయి. మరి కొన్నింటిని ఒడ్డు మీదినుంచి సముద్రంలోకి లాక్కెడుతుంటాయి.

మన జీవిత ప్రయాణం సముద్రపు ఒడ్డున సాగిపోయే నడక లాంటిది. ఒడ్డున నడక సాగిస్తూ దారిలో మన చేతికి దొరికిన రకరకాల రంగురంగుల గవ్వల జ్ఞాపకాల్ని ఏరుకుని భద్రంగా దాచుకుంటూ ముందుగు సాగిపోవడమే!" అంటూ నాన్న చెప్పిన మాటలు నా చెవులకు వినిపిస్తున్నాయి..కానీ నా మనసుని చేరడం లేదు.! ఎందుకంటే.. కిన్నెరసాని ఒడ్డున, మావిడి తోటలో గూడు కట్టుకుని ఉన్న నా అపురూప జ్ఞాపకాల నిధి అంత సులువుగా నా మదిని వీడిపోనంటోంది.!!

❋ ❋ ❋

# టిప్పూ -ఆయేషా-నేను

-వి.బి.సౌమ్య

**"కలయో నిజమో వైష్ణవమాయో**...తెలిసీ తెలియని అయోమయములో.." - పాట వినిపిస్తోంది. ఉలిక్కిపడ్డాను. అరక్షణం పట్టింది, సెల్లు మ్రోగుతోందని అర్థమవడానికి. నాకేదో ప్రపంచ మార్పిడి జరిగినట్లనిపించింది. అరక్షణం తేడాలో ప్రపంచం కూలిపోయినా ఆశ్చర్యం లేదు. కానీ, మారిపోవడం? "కలయో నిజమో వైష్ణవ మాయో... " మళ్ళీ సెల్లు పాటందుకోవడంతో ఎత్తాను.

"హే! ఏమైపోయావ్? ఉన్నట్లుండి కనపడకుండా పోయావేంటి?"

"......"

"మాట్లాడవేంటి? ఎక్కడున్నావసలు?"

".............."

"ఓహ్! కనిపించావు. వస్తున్నా ఉండు." - ఫోన్ పెట్టేసిన శబ్దం.

ఫోన్ ఎత్తానే కానీ, నాకు కలిగిన గందరగోళం నుండి తేరుకోలేకపోయాను. ఎదురుగా చూస్తే ఏముందీ - గబగబా మెట్లు ఎక్కుతున్న అన్వేష్!

"ఏమిటి? ఫోన్‌లో ఏం మాట్లాడవే? నాకెంత కంగారు పుట్టిందో తెల్సా!" అన్వేష్ నన్ను పట్టుకుని ఊపేస్తున్నాడు.

"......" - నాకేమిటో రెండు ప్రపంచాల మధ్య మారుతున్నప్పటి సంధికాలంలో ఉన్నట్లుంది.

"మధూ...మధూ.." అన్వేష్ మరోసారి గట్టిగా చేతిని లాగడంతో ఈతరాక గిలగిలాకొట్టుకుంటున్న మనిషిని ఒడ్డుకు చేర్చితే ఎలా ఉంటుందో అలా, ఉన్నట్లుండి, నేనింకా బ్రతగ్గలను, బ్రతుకుతున్నా - అన్న స్పృహ కలిగినట్లయింది.

ఎదురుగుండా అతని కళ్ళలో ఖంగారు, భయం స్పష్టంగా తెలుస్తున్నాయి.

"మధూ, ఏమిటలా చూస్తున్నావ్?"

"అన్వేష్!" - నా అరుపు నాక్కూడా గట్టిగానే వినిపించింది.

"ఏమైంది మధూ?"

"అన్వేష నువ్విక్కడ.... ఇంతసేపూ ఏమైపోయావ్? వాళ్ళేవరూ? వాళ్ళేరీ?"

"ఎవరు? ఎక్కడ?" అటూ ఇటూ చూశాడు అన్వేష్.

టూరిస్టులతో నిండి ఉంది ప్రదేశమంతా. పిల్లలు ఆడుకుంటున్నారు. జంటలు ఏదీ పట్టించుకోక కబుర్లాడుకుంటున్నారు. జట్లు జట్లుగా మిత్ర బృందాలు కూడా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. అసలు నేనిక్కడున్నానేమిటి?

"ఎవరు మధూ? ఏమైంది నీకు?"

"నేను-ఇక్కడికెలా వచ్చాను అన్వేష్?" -నా మాటల్లోని నిస్సహాయత అన్వేష్‌కి తన నిస్సహాయతను గుర్తుచేసినట్లుంది.

"నాకేం తెలుసు మధూ? అసలు నాకు నువ్వు ఎక్కడికెళ్ళావో తెలిస్తేగా..."

"మరి, బామ్మగారేరీ?"

"ఎవరు?"

"అదే, ఈ భవనం యజమానురాలు."

"ఈ కుటుంబంవారెవరూ ఇక్కడ ఉండరుగా..ఇది టూరిజం వాళ్ళు దత్తత తీసుకుని చాలా సంవత్సరాలైందే.."

"మరిందాక ఆ కథంతా చెప్పినావిడో?"

"ఏ కథ?" అడిగాడు అన్వేష్ విసుగ్గా. ఇంతలో మాతో కూడా వచ్చిన మిగితావారు కూడా అటువైపు నుండి వస్తూ కనిపించడంతో ఇక, వాళ్ళతో కలవక తప్పలేదు.

కానీ, ఆవిడెక్కడ? ఆయనెక్కడ? అన్న సందేహం నన్ను వదల్లేదు.

అప్పటికే చీకటి పడుతోంది. దానితో అందరం కారెక్కేశాం. బయట చల్లటి మంచు. ఏమీ తోచక, కారు కిటికీపై మంచు బొమ్మలు వేయడం మొదలుపెట్టాను.

"ఏయ్! ప్లీజ్! తుడిపేయ్! ఇటీజ్ స్కేరీ!" - రేఖ అరుపుకి వెనక్కి తిరిగాను.

కారు అవతలి కిటికీలో టిప్పుసుల్తాన్ - మిస్టర్ రేఖ కూడా నాపనిలోనే ఉన్నట్లు ఉన్నాడు. నావైపు కిటికీని చూస్తే, ఇందాకటి బామ్మగారిలా అనిపించింది.

"వీళ్ళిద్దరూ మళ్ళీ ఒకర్నొకరు ఇలా పులుకూ పులుకూమని చూసుకోవడం మొదలుపెట్టారన్నమాట!" - నాలో నేనే గొణుక్కున్నాను.

ఇంతలో రేఖ వచ్చి రెండు బొమ్మల్నీ తుడిపేసింది. మళ్ళీ ప్రపంచ మార్పిడి. ఈసారి తుడిచిపెట్టుకుపోయిన ప్రపంచంలోకే మళ్ళీ.

"ఏంటి మధూ ఆలోచిస్తున్నావ్?"

"వీళ్ళిద్దరూ మళ్ళీ కనిపించారేంటా? అని" - మనసులో అనుకుంటున్నది పైకే అనేశాను.

"ఏ ఇద్దరూ?"

- కార్లో ఉన్న ముగ్గురూ ఒకేసారి అన్నారు. డ్రైవ్ చేస్తున్న అన్వేష్ ఉన్నట్లుండి కారు ఆపేశాడు. ఏమైందా? అని బయటకు చూస్తే - పంజాబీ డాబా!

అందరం లోపలికెళ్ళి, కూర్చుని ఆర్డర్లు ఇచ్చేశాక - మళ్ళీ రేఖ అడిగింది

"ఇంతకీ ఇద్దరెవరో చెప్పావు కాదు"

"తనకేదో అయింది. ఇందాకటినుంచీ అదో మాదిరిగా ఉంది." - అన్నాడు అన్వేష్

"నాక్కూడా చెప్పుకుంటే కాస్త రిలీఫ్‌గా అనిపించి బీపీ డౌనవుతుందేమో అనిపిస్తోంది..." అన్నాన్నేను వెంటనే.

"...." - అందరూ ఆతృతగా నావైపే చూస్తున్నారని అర్థమైంది. ఇక చెప్పడం మొదలుపెట్టాను. మనసు దాదాపు ఒక గంటన్నర వెనక్కెళ్ళింది.

❋❋❋

ట్రెకింగ్ అంతా అయాక, కాసేపు అలా తిరుగుదాం అని పరిసరాన్వేషణ మొదలుపెట్టాము. అలా నడుస్తూ నడుస్తూ ఒక భవనం వైపుకి వచ్చాన్నేను. "టిప్పు సుల్తాన్ యూజ్డ్ టు కం హియర్" విదేశీ టూరిస్టులకి స్వదేశీ గైడు కన్నడ యాస ఉన్న ఇంగ్లీషులో చెప్పుకొస్తున్నాడు. అది విని, కుతూహలం కలిగి, ఆగాను. అది చూస్తే, పాడుబడ్డ ఎగువ మధ్య తరగతి ఎర్రరాతి ఇల్లులా ఉంది. ఇప్పటికే రకరకాల మొలకలతో ఆకుపచ్చగా మారింది. ఆ గైడు ఒక పక్క వాళ్ళకి ఊదరగొడుతున్నాడు - "టిప్పు ఈజ్ దిస్...దట్..వాట్నాట్..." అని. మళ్ళీ భవనం వైపుకి తిరిగాను.

ఒక చక్రవర్తి వచ్చి అక్కడ నివసించే మాట అటుంచితే, కనీసం ఆయనొచ్చి చూసేంత దృశ్యం కూడా లేదీ భవనానికి, అనిపించింది.

"అంతా ట్రాష్, టిప్పూ అసలు వచ్చే ఉండడు ఈ భవనానికి..." అనుకున్నా. తరువాత తల్చుకుని నవ్వుకోడానికి పనికొస్తుందని, ఫొటో తీశాను. కెమెరా కిందకు దించగానే, ఎదురుగ్గా ఒక ముసలావిడ రుసరుసలాడుతూ బయటకొస్తోంది. వెనుక ఒకాయనెవరో - వీజీపీ గోల్డెన్ బీచ్‌లో -చాలా సేపు కదలకుండా బొమ్మలా ఉండి, ఉన్నట్లుండి కదిలి భయపెట్టే అతన్లా ఉన్నాడు. మొహం చూస్తే ఎక్కడో చూసినట్లుంది - టిప్పూ సుల్తాన్ గుర్తొస్తున్నాడు - సంజయ్ ఖాన్ గుర్తొస్తున్నాడు...

"ఇతగాడెవరో, వేషం బానే వేశాడు.." అనుకున్నాను.

ఇక, ఇటు వస్తున్న పెద్దావిడ - హిందీ సినిమా బామ్మగారు జోరా సెహగల్‌లా ఉంది. రావడమైతే రుసరుసలాడుతూ వచ్చింది కానీ, నన్ను చూడగానే నవ్వుతూ - "తెలివైనదానివే!" అన్నది.

నేను కాస్త అవాక్కైన మాట నిజం.

"ఇన్నాళ్ళలో ఇలా చూసీ చూడగానే ట్రాష్ అన్నవారు లేరు..." - అందావిడ.

"నేను మాత్రం, ఎక్కడన్నా? ఎప్పుడన్నా? మనసులో అనుకున్నదేగా..." - అనుకున్నాను.

"ఆయన్ని చూశావా? ఆయనదీ ఇదే గోల - ఇదంతా బూటకమని..." అందావిడ.

"అసలు ఆయనెవరండీ?" అన్నాన్నేను.

"నిజం చెప్పమంటావా? భయపడకూడదు మరి. పారిపోకూడదు. నాకు అంతా చెప్పేయాలని ఉంది. ఏళ్ళ తరబడి నాలో దాచిన నిజాన్ని బయటపెట్టాలని ఉంది."

"చెప్పండి" అన్నాను నిబ్బరంగా.

"ఇదంతా నిజంగా అబద్ధమే. టిప్పూ ఇక్కడెప్పుడూ నివసించలేదు. అసలు ఈ భవనం చూడనైనా చూడలేదు."

"మీకెలా తెలుసు?"

"ఈ భవనం నాదే  కథ నేను సృష్టించిందే!"

"వ్వాట్?"

"హహహ...నమ్మడం కష్టం కదూ...."

"నమ్మడం కష్టం కాదు - నమ్మించడం కష్టం. అయినా, ఇది కథ అని నమ్మడం కష్టం కాదు. భవనం మీదంటే నమ్మడమే కాస్త అనుమానాస్పదం" - అన్నాన్నేను సీరియస్‌గా.

"ఏం?"

"మొదట - మీరెంత ముసలివారైనా ఇన్ని వందల ఏళ్ళు బ్రతకడం కష్టం. రెండు - దయ్యాలైతే ఇలా పట్టపగలు - ముందున్న కాళ్ళతో కనబడవంటారు కదా. మూడు - మీకిదంతా చేయడం, ఇప్పుడు నాకు చెప్పడం వల్ల ఒరిగేదేమిటి? ఈసరికి మీ బోటి వాళ్ళకి నేను భయపడను అని అర్థమై ఉండాలి..." - అన్నాన్నేను.

"నువ్వు నమ్మినా, నమ్మకున్నా, నేను ఈ భవనం యజమానురాలిని. కావాలంటే ఆయన్నడుగు."

"పిల్లికి ఎలక సాక్ష్యం అంటే ఇదే కాబోలు - ఆయనెవరు? టిప్పు సుల్తానా?" అన్నాన్నేను.

"ఆయనే!" అందావిడ.

ఆయనింకా అక్కడే నిలబడి మా ఇద్దర్నీ చూస్తూ నిలబడి ఉన్నాడు.

"ఆయేషా! ఎవరీ అమ్మాయి? ఏమిటి ఆమెతో మాటలు?"

- ఈయన టిప్పు అట, ఆమె ఆయేషా అట. ఈ భవనం ఈవిడదట.  వీళ్ళకి నన్ను చూస్తే ఆటలా ఉంది కాబోలు. అంత వెర్రిదానిలా కనిపిస్తున్నానా?

నా అసహనం అర్థమైనట్లు ఉంది ఆవిడకి -

"అమ్మాయ్! నమ్మడం కష్టమే, నాకు తెలుసు. కానీ నమ్మాలి."

"ఏవిటది నమ్మేది?, సరే....చెప్పండి.." అన్నాను, ఏదో, టైంపాస్, అనుకుని. పిచ్చివాళ్ళ మాటల్లో కూడా ఒకోసారి గొప్ప సంగతులు తెలుస్తాయంటారు కదా..

ఆవిడ చెప్పడం మొదలుపెట్టింది:

"కొన్ని వందల ఏళ్ళ క్రితం, ఇదో పల్లెటూరు. మాదో ఉన్నత మధ్యతరగతి కుటుంబం. ఆసరికే నాకు కొంచెం వయసు మీద పడింది. మాదా పెద్ద కుటుంబం. నేను వితంతువును. మగదిక్కు లేని సంసారం. పేరుకి చెట్టంత కొడుకులు ముగ్గురున్నారు కానీ, వట్టి అప్రయోజకులు. వయసు మీద పడే కొద్దీ వాళ్ళ గురించి దిగులు మొదలైంది. ఉన్నదల్లా ఈ భవనం. ఇది అమ్ముకున్నా, ఎన్నాళ్ళు బ్రతుకుతారు వీళ్ళు? మనవల కాలానికి ఇక ఏం మిగులుతుంది?"

"ఏమిటీ, అప్రయోజకపు కొడుకులకి పెళ్ళిళ్ళు కూడానా!" - అన్నాన్నేను ఎకసక్కెంగా.

"అదేంటమ్మా అలా అంటావ్! పెళ్ళి చేయమా ఏమిటి ప్రయోజకుడు కానంత మాత్రాన?"

"ఏం పెట్టి పోషిస్తాడేమిటి పెళ్ళాం పిల్లలను?"

"ఆస్తుంది కదా అని...."

"మరిప్పుడు మనవళ్ళకుండదంటున్నారు?"

"ఇదిగో, అదంతా నీకెందుకు? ఆవిడ చెప్పేదేదో వినక? అది విని, అసలు కథ జనానికి చెబితే, నాకు ఆత్మశాంతి" - మధ్యలో వెనుక నుండి నాటకాలాయన గోల.

"ఇలా అయితే, నే వెళ్ళిపోతా" - నాక్కూడా కోపం వచ్చింది ఆ దబాయింపు చూసి. టిప్పు వేషమేస్తే టిప్పు ఐపోతాడా ఏం?

"ఇదిగో, అంత అనుమానించకు. ఆయన నిజంగానే టిప్పు. కోపం వస్తుంది మళ్ళీ" - ఆయేషా గారన్నారు నాతో.

"యముండ!" లాగా అరుస్తాడు కాబోలు అనుకుని ఊరుకున్నాను. కానీ, ఏమాటకామాటే చెప్పాలి, అవతల మనిషిలో రాజసం ఉట్టిపడుతోంది. అయినా, ముసలావిడ పిల్లలు యూజ్‌లెస్ అయితే ఏం? లూజైతే ఏం? మనకేం సంబంధం లేదుగా, అనుకుని..

"సరే చెప్పండి. తరువాతేమైంది?" - అని అడిగాను.

"ఎక్కడున్నాం...? ఆ...... మా పరిస్థితి చెప్పా కదా. అందువల్ల వీళ్ళకేదో ఏర్పాటు చేసి పోవాలనుకున్నా. ఏం చేయాలో తోచింది కాదు. ఇలా ఉండగా ఒక రోజు సుల్తాన్ గారి ఆస్థాన ముద్ర ఉన్న బండొకటి మా ఇంటి ముందాగింది. సుల్తానంటే - టిప్పు సుల్తానన్నమాట. నాకు భూమ్మీద కాలునిలవలేదు. సుల్తాన్..మనింటికి....! అని మురిసిపోయాను. ఎందుకా? అని భయమేసింది కూడా. ఇంతలో, బండిలోంచి సైనికుడు ఒకడు దిగాడు.

"సుల్తాన్ సేన ఒకటి ఈ ఊరి బైట ఆగి ఉంది. వారితో తెచ్చుకున్న పానీయాలు, మంచి నీరు అయిపోవచ్చాయి. ఈ ఊర్లో కాస్త పెద్దిల్లు మీదొక్కటే కనుక, ఏవన్నా ఏర్పాట్లు చేయాలి" అన్నాడు.

"ఓస్, ఇంతేనా!" అనుకుని, ఆ ఏర్పాట్లేవో చూసి, పంపానతన్ని.

అతను వెళ్ళిపోయిన కాసేపటికే పక్కింటావిడ వచ్చింది - "సుల్తానంతటి వాడు మీ ఆతిథ్యం స్వీకరించాడా? బండిలో సుల్తానొచ్చి తన సేన కోసం ఏర్పాటు చేయమన్నాడట కదా! ఎంత గొప్ప సంగతి కదా!" అంటూ మొదలుపెట్టింది. "సుల్తాన్ బండి వచ్చింది - సుల్తాన్ రాలేదు.." అని నేను చెప్పేంతలో - ఆమె తన కథనం పొడిగించుకుంటూ పోయింది. నిజం చెప్పినా నమ్మేలా అనిపించలేదు. దాంతో నాకో ఆలోచన వచ్చింది. అదే నా కుటుంబాన్ని కొన్నేళ్ళ పాటు ఆదుకుంది." అని చెప్పి ఆమె ఆగింది.

"ఏంటది?" ఆ సరికి ఆమె చెప్పదలుచుకున్నది కొంతదాకా అర్థమైంది. అయినా అడిగాను.

"నువ్వు తెలివైన దానివి ...ఈపాటికి అర్థం చేసుకునే ఉంటావు" - అన్నారు టిప్పుగారు. ఏమిటో, ఈ మనిషిని చూస్తూంటే, టిప్పు ఇలాగే ఉండేవాడేమో అనిపిస్తోంది. ఆ మధ్య దరియా దౌలత్ బాగ్ మ్యూజియంలో చూసిన టిప్పు చిత్రపటం పదేపదే గుర్తొస్తోంది.

"మీకాలపు తెలివితేటలు మాకెక్కడివండీ ఎంతైనానూ..." అనేశాను, ఉభయతారకంగా ఉండేలాగా.

దానికి వాళ్ళిద్దరూ కాస్త సిగ్గుపడ్డం నేను గమనించలేదనుకున్నారేమో..

❖❖❖

"అదే, అలా చుట్టుపక్కల ఇళ్ళ వారికి కలిగిన అపోహనే నేను నా కుటుంబానికి భవిష్యత్తులో ఆదాయంగా మార్చాలని నిర్ణయించుకున్నాను" - అని ఇంకా ఆవిడేదో చెప్పబోతూ ఉండగా

"అదే, అదే నాకు నచ్చనిది" - అంటూ టిప్పు అడ్డొచ్చాడు.

"అసలు మీలో మీరు గొడవ పడ్డం ఆపి, సంగతేంటో చెబితే బాగుంటుందని నా అభిప్రాయం.." అన్నాన్నేను.

"ఇంతచెప్పాక, అదొక్కటీ చెప్పడానికేం, చెప్పు ఇక.." అన్నాడు టిప్పు, ఆమె వైపుకి తిరిగి.

"హుం...సరే, నేను చెప్పేది విను, నమ్మినా, నమ్మకున్నా జరిగిందిది..." అనేసి ఆయేషా చెప్పడం మొదలుపెట్టింది.

"టిపూ వచ్చి వెళ్ళిన ఇల్లు అని అప్పటికి మా ఇల్లు గురించి వార్త బాగా ప్రచారంలోకి వచ్చేసింది. జనంలో మాకు కొంత పేరు పెరిగింది. ఇంతలో టిప్పూ యుద్ధంలో మరణించాడు. అందుకే ఈ చుట్టుపక్కల జనాలలో - "టిప్పూ వచ్చిన ఇల్లు.." నుండి... "టిప్పూ వచ్చి కొన్నాళ్ళు ఉండి ఇల్లు.."... "టిప్పూ తరుచుగా వచ్చేవాడట వీళ్ళింటికి.." - ఇలా ఎన్నో కథనాలు వ్యాపించాయి.

నేను ఈ జనాల టిప్పూ అభిమానాన్ని నా కుటుంబానికి జీవనాధారంగా మలచాను. మా ఊరు చుట్టుపక్కల పది ఊర్లకి పెద్ద ఊరని చెప్పా కదా. ఇక్కడ సంత జరిగినప్పుడల్లా చాలామంది వచ్చేవారు. అలాంటప్పుడు మా ఇంటిని ఒక పర్యాటక స్థలంగా మార్చాను. "టిప్పూ కొన్నాళ్ళూ ఉండిన స్థలం" - అన్న ప్రచారం ఎలాగో జరిగిపోయింది కనుక, లోపలికొచ్చే వారికి నామమాత్రపు ప్రవేశ

రుసుం పెట్టాను. ఇక దశ తిరిగింది. కొన్నాళ్ళలోనే, క్రమం తప్పకుండా ఆదాయం రావడం మొదలై, మా పరిస్థితి మెరుగుపడ్డది. ఇంటి కింది భాగం ఇలా వచ్చేవారికి వదిలేసి, మేము పై భాగంలోకి మారిపోయాము.

నేను పోయాక కొడుకులూ, కోడళ్ళూ దీనిపై ఆధారపడి కొన్నాళ్ళు బ్రతికారు. అయితే, తరాలు గడిచేకొద్దీ, కాలక్రమంలో - చదువులనో, పట్నవాసాలనో - ఏదో ఒక కారణంతో మావాళ్ళు ఒక్కొక్కరూ ఇల్లు వదిలారు. చివరికి ఎవరూ మిగల్లేదు. కానీ, సుల్తాన్ వచ్చి వెళ్ళిన చోటన్న పేరు మాత్రం ఉండిపోయింది. అది జనం నోళ్ళలో నానీ నానీ, ప్రభుత్వం దృష్టికి వెళ్ళి - ఇదిగో, ఇలా పర్యాటక ప్రాంతమైంది." అని చెప్పి ముగించిందావిడ.

"అప్పట్లో ఆత్మరూపంలో మనశ్శాంతిలేక, నా రాజ్యం ఏమైందో, అని తిరుగుతూ ఉన్నప్పుడు, ఇలాగే జనం ఒకచోట దీని గురించి మాట్లాడుకుంటూంటే విని ఇక్కడి కొచ్చాను. తీరా చూస్తే, అసలు నేనెప్పుడు ఈ భవనంలోకే రాలేదు. ఇంట్లో వాళ్ళని నిలదీయాలనుకుని, వెళ్ళినా, వాళ్ళకి నేను కనిపించే శక్తి నాకు రాలేదు. ముసలమ్మ పోయి, తాను కూడా ఆత్మయ్యేదాకా నాకు అవకాశం దొరకలేదు. ఇక ఇప్పుడేం చేస్తాం? ఇలా గొడవపడుతూ ఉండటం తప్ప?" - అని సుల్తాన్ నిట్టూర్చాడు.

"నిజమేనా!" నాకు ఆశ్చర్యం.

"నిజమేనమ్మా! ఇదే మొదటిసారి నేనిదంతా బహిరంగంగా ఒప్పుకోవడం" అంది ఆయేషా!

"కనుక నువ్వే అసలు కథ జనానికి చెప్పి నిజం బయటపెట్టాలి..." అన్నాడు సుల్తాన్.

"మీ బాధ నేనర్థం చేసుకోగలను కానీ, ఈకాలంలో, నేనొచ్చి ఇదంతా చెబితే, ఎవరు నమ్ముతారు?" అన్నాన్నేను.

"నే చెప్పలా...అబద్ధం నిజమై కూర్చుంటే, అది అబద్ధమని నిజం చెబితే ఎవరూ నమ్మరని?" ఆయేషా చురకంటించింది.

దానితో సుల్తాన్ ఏమీ మాట్లాడలేదు.

❖❖❖

-ఇక్కడిదాకా కథ చెప్పి నేను ఆపాను. మిగితావారంతా - "తరువాతేమైంది?" అన్నారు.

"తరువాత జరిగిన సంభాషణ సరిగా గుర్తు లేదు. కాసేపటికి సెల్లు రింగవడం, అన్వేష్ కనబడ్డం గుర్తుంది. ఇక్కడిదాకా గుర్తున్నది, నా భాషలో చెప్పాను. వాళ్ళు హిందీలో మాట్లాడారు...."

- అందరూ ఒక్కసారిగా నవ్వు, డాబాలో అందరూ ఇటే చూడ్డంతో ఆపారు.

"బాగా చెప్పావే కథ..." అంది రేఖ.

"ఇందాక రేఖ - భయం వేస్తోంది అనేసరికి కథని ఆత్మలతో నింపేసావా?" - అన్వేష్ నవ్వులు.

"ఎంతైనా నీది మంచి ఫర్టైల్ ఇమాజినేషన్" -మిస్టర్ రేఖ.

- ఇదంతా నిజమని చెబితే వీళ్ళు నమ్మరని అర్థమైపోయింది. దాంతో చేసేదేం లేక, వాళ్ళ నవ్వులతో శృతి కలిపాను. మరోసారి అక్కడికెళ్తే, ఆయేషా-సుల్తానూ కనిపిస్తుంది - వాళ్ళకి ఈ కథని జనానికి చెప్పడంలోని ప్రాక్టికల్ లిమిటేషన్స్ గురించి చెప్పాలని నిర్ణయించుకున్నాను.

జనం ఇప్పుడీ కథ నిజమని నేను చెప్పినా నమ్మడం కల్ల కనుక, నిజాన్ని కథ చేసి చెబుతున్నాను... :)

❖❖❖

# దేశ ఆస్త్ర ప్రయోగాలు - పిన్నమనేని శ్రీనివాస్

**నేను ఈ కథ** చెప్పేముందు నేను ఎవరో తెలిస్తే కొంచెం బాగా అర్థం అవుతుంది అనుకుంటున్నాను. నేను ఒక ప్రవాస జీవిని. నా చదువు, పెళ్ళి కూడా భారత దేశంలో జరిగినా నాకు మన గురించి పెద్దగా తెలియదు. భయపడద్దు, నా జీవిత చరిత్ర కాదు ఈ కథ.

మూడు సంవత్సరాలుకు ఒకసారి జన్మభూమి, తల్లి దండ్రులను కలవడము నాకు సాంప్రదాయము అయిపోయింది. విషయానికి వస్తే వచ్చిన ప్రతిసారి చుట్టాలు, స్నేహితులు మరియు తల్లి దండ్రులు భారత దేశం పర్మనెంటుగా ఎప్పుడు వస్తావు అనే ప్రశ్న రావడము. నేను ఆలోచిస్తున్నాను అనడము సాంప్రదాయము అయిపోయింది. కానీ నాకు వున్న సందేహాలు నాకు ఉంటున్నాయి ప్రతిసారి.

అందుకని నేను ఎవరికీ తెలియకుండా (గుప్తంగా) కొన్ని పరీక్షలు చేసుకోవడము, దారుణంగా తప్పడము జరిగాయి.

మీరు నవ్వుకోవచ్చు తెలిసిన తరువాత, ఇప్పుడు ఆ విషయాలు తెలిసిన మా చుట్టాలు, స్నేహితులు నవ్వుకుంటున్నట్లు. పరీక్షలు తప్పడాలే ఈ కథ. కావాలంటే మీరూ పరీక్ష చేసుకోవచ్చు నా లాటి ప్రవాసి ఐతే.

నేను బ్రతుకుతున్న దేశంలో సామాన్యుడికి సామాన్యమయిన పనులు సామాన్యంగా జరగడం సామాన్యం. ఎవరి పనులు వారే చేసుకోవడం అలవాటు. ఈ అలవాటు వంట బట్టిన తరువాత ప్రతి పని సామాన్యము గానే కనపడటం మొదలవుతుంది.

నేను పుట్టిన దగ్గర నుండి దేశం దాటే వరకూ చదవడం, స్నేహితులతో తిరగడం తప్ప పెద్దగా ఇంటి పనులు చేసిన గుర్తు లేదు. నా తల్లి దండ్రులు టీచర్లు కావడం, నేను ఇంట్లో చిన్న వాడిని కావడం మూలంగా, నా దాకా పనులు వచ్చేవి కావు. నేను భారత దేశం దాటాకే నేను నా పేరుతో (సొంతంగా) పనులు చేయడం మొదలెట్టాను.

తరువాత నేను గమనించినది లేక నేర్చుకున్నది, నేర్చుకుంటోంది ఏమిటంటే, భారత దేశంలో ప్రశాంతంగా బ్రతకాలంటే లేక పనులు చక్కగా కావాలంటే ఈ మూడు తరగతుల్లో బాగా మార్కులు వుండాలి అనుకున్నా. అవి డబ్బు, అధికారం పరిచయం, స్థానబలిమి. ఈ తరగతుల్లో మార్కులని బట్టి నీ జీవితం సాగుతుంది అని.

బాగా మార్కులు వున్నా చాలదు. ఈ మూడు తరగతుల అస్త్ర ప్రయోగాలు తెలవాలని.

చిన్నపుడు రామయణ, మహాభారత సినిమాలు చూసేటప్పుడు బాణాల యుద్దం చాల బాగుండేది. తరువాత కొంతకాలానికి ప్రశ్నలు బయలు దేరాయ్ - ఏ అస్త్రం ఎప్పుడు వేయలో ఎల్లా తెలుసు అని. నాకు తెలిసిన ఎవరినయినా (అప్పట్లో గూగుల్ లేదు ) అడుగదామంటే బాణాల యుద్దాలు ఈ కాలంలో చేయడం లేదు. అందుకే ఆ విషయం సమాధానం దొరకని ప్రశ్నలాగ మిగిలిపోయింది. ఇన్నిరోజులకు అలాటి ప్రశ్నకు సమాధానం దొరికినట్లు వుంది.

అంటే భారతదేశంలో పనులు జరగటం లేదా అనే విషయానికి వస్తే. నేను సామన్యుడి పనుల్లో ఇంకొక వర్గీకరణ చేస్తాను.

తప్పని పనులు - గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ప్రయాణ రిజర్వేషన్స్, కరెంటు బిల్ కట్టడం లాంటివని. వీటికి రద్దీ ఎక్కువ కూడా. ఇవి తప్పనివి, మరి డిమాండ్ (పైన చెప్పిన మూడు వాడటం) కూడా అంతే వుంటాయి.

డిమాండ్ లేని పనులు - పాస్‌పోర్ట్ అప్లై చేయడం, బ్యాంకు ఎకౌంటు అప్లై చేయడంలాంటివి అని నా అభిప్రాయం.

నేను, నా కుటుంబం భారతదేశం లో బ్రతకాలంటే. నాకు వీటిలో అన్నీ నేనే చేసుకోవాలి. ఇంకొకరి మీద ఆధార పడకుండా పనులు చేసుకోవడం. దానికి గుప్తంగా మూడు పరీక్షలు (డిమాండ్ లేని పనులు) చేసుకుందామని బయలు దేరాను మూడు ప్రదేశాలలో.

నాతో మొదలు పెడితే నా విషయములో డబ్బు - పరవాలేదు మధ్య తరగతి కంటే పైన వుంటాను.

స్థానబలిమి - నేను పుట్టి పెరిగిన వూరు గుంటూరు. తల్లి దండ్రులు స్కూల్ టీచర్లుగా పదవి విరమణ చేసి వున్నారు. వారికి వూరు నిండా స్నేహితులే.

☆☆

**కొంచెం డిమాండ్ లేని పని**

పరీక్ష - DSL ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవడం. ఒక్క పనిని (ఇంటర్నెట్ కనెక్షన్, డ్రైవర్స్ లైసెన్స్‌లాంటి డిమాండ్ లేని పనులు) సొంతముగా ఎవరి సహాయము లేకుండా( పైన చెప్పిన మూడు వాడకుండా) చేసుకోవడం.

వెళ్ళే ముందు సలహా ఏమిటంటే DSL కనెక్షన్ తీసుకోవచ్చు లేకపొతే కేబుల్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవచ్చని చెప్పాడు వొక మిత్రుడు.

పరీక్ష ప్రదేశం - B S N L కార్యాలయం. B S N L కార్యాలయం ఇంటి ప్రక్కనే వుంది కదా, వారు మోడెం ఇవ్వడము లేట్ అయితే కేబుల్‌వారిని కాల్‌చేద్దామని అభిప్రాయము.

వెళుతున్నట్టు ఎవరికీ చెప్పలేదు ఒక్క మా మామయ్యకి తప్ప. ఎందుకంటే ఆయనే డ్రాప్ చేసారు కాబట్టి. ఆయనకు ప్రక్కనే బ్యాంకులో పని వుంది అని వెళ్ళారు.

ఇంటర్నెట్ DSL కనెక్షన్ ఆఫీసులో నలుగురు ఉద్యోగులు ఖాళీగా కుర్చుని వున్నారు. నేను మొదటి వారితో

"నాకు DSL కనెక్షన్ కావాలండి. మోడెం ఎన్ని రోజులకి ఇస్తారు."

"రెండు రకాలు వున్నాయండి. మీకు వెంటనే ఇచ్చేస్తాము. ఈ ఫారం నింపండి" .

నేను అక్కడే కూర్చుని నింపి, ఆయనకి ఇచ్చాను. ఆయన ఫారం చూసి సంతకము చేసి పక్కన పెట్టారు.

నాకు తరువాత ఏమి చేస్తారో తెలేయలేదు. ఆయన ప్రక్కన ఒక లేడీ ఉద్యోగి వుంది. ఎవరూ ఏమి చేయడము లేదు నా వంక చూడడము తప్ప.

ఇరవయి నిమిషాలు అయ్యాయి. తట్టుకోలేక నేను మొదట మాట్లాడిన ఆయనతో

"నేను ఇంకా ఎమన్నా చేయాలా? డబ్బు ఎక్కడ కడతారు?" ఆయన్ని కబుర్లలో దింపాను.

"లేదు. ఆవిడ సంతకము చేయాలి. తరువాత ప్రక్కన వున్న వారు సంతకం చేస్తే ఆచివర వున్న కౌంటర్‌లో డబ్బు కట్టాలి".

ఆ రూంలో మా ఐదుగురు తప్ప ఎవరూ రాలేదు ఇంకొక ఇరవయి నిమిషాలు. ఆవిడ నా వంక చూడడం తప్ప ఏ పని చేయడం లేదు.

ఇంకొక ఇరవయి నిమిషాల తరువాత ఆవిడ స్లో మోషన్లో కదిలి పేపర్ తీసుకొని చిన్నగా ఒక మూల సంతకం కెలికి పక్కన పెట్టింది.

వెంటనే నేను లెక్క కట్టాను ఇంకొక నలభయి నిమిషాలకి గాని పేపర్ కదలదని పక్క మనిషి దగ్గర నుండి వెంటనే లేచి బయటికి వచ్చాను. అప్పుడే మా మామయ్య కారు లోపలికి వచ్చింది.

అయన కథ ఏమిటంటే సమయం 11 : 30 AM. బ్యాంకు తెరిచారు గాని స్టాఫ్ రాలేదని. నేను నా పరిస్థితి చెప్పాను. ఆయన ఒక నవ్వు నవ్వి ఇక్కడ అవి మామూలే అన్నారు.

బ్యాంకు గురించి ఒక జోక్ కూడా చెప్పారు. ఈయన వెళ్ళిన బ్రాంచ్ అన్నిటికంటే బద్దకం బ్రాంచ్ అంట. ఎవరో తెలివిగల మేనేజర్ గుంటూరులో వున్న వారి బ్రాంచ్‌లలో వున్న బద్దకస్తులని ఒక బ్రాంచ్‌లో వేసారట.

దాని వల్ల ఒక బ్రాంచ్‌కే కష్టాలు ఉంటాయని వారి అభిప్రాయం. ఆ బ్రాంచే ఈయన వెళ్ళిందట. ఇంటి దగ్గరగా వుంది, రిటైర్ అయ్యాను నాకు ఎలాంటివి వుంటే బాగుంటుంది అని ఆనందంగా చెప్పారు.

ఆయన కూడా నాతో పాటు లోపలి వచ్చారు. అప్పటికి నా ఫోరం ఇంకా కదలలేదు ఇరవయి నిమిషాలు అయినా.

ఇప్పుడ ఆరుగురం కూర్చొని వున్నాము, ఇద్దరు ఫోరం పని కోసం నలుగురు ఫోరం పని చేయడానికి. వొక గంట తరువాత నా ఫోరం కాష్ కౌంటర్ అనే తీగల గదిలోకి నెట్టబడింది.

ఈ టైం లో ఎవరూ  రూం లోకి అడుగు పెట్టలేదు. డబ్బు కట్టమంటే కట్టి, కౌంటర్‌లో వున్న ఆయనతో

"మోడెం ఎవరు బిగిస్తారు, ఎప్పుడు వస్తారు?"

"మోడెంలు లేవండి, ఒక రెండు నెలల తరువాత మీకు ఫోన్ చేసి ఇంటికి వచ్చి బిగిస్తారు".

ఆయన ఏమి చెబుతున్నాడో ఒక్క సారి అర్థం కాలేదు. తరువాత

"మొదట కూర్చున్న ఆయన వున్నాయని, డబ్బు కట్టగానే ఇస్తారని అన్నారు".

"అయితే అయన దగ్గరకే వెళ్ళండి."

తిరిగి మొదటి ఆయన దగ్గరికి, ఈ సారి నాకు సహాయంగా నా మామయ్య.

"మీరు మోడెంలు వున్నాయి అన్నారు. అందుకే డబ్బు కట్టాము. డబ్బు వెనక్కి తీసుకోవాలి‘‘

"డబ్బు ఈరోజు ఇవ్వరు, రేపు రండి" అన్నాడే గాని మోడెం విషయము మాట్లాడటం లేదు.

ఇక్కడ పైన చెప్పిన మూడింటిలో ఏ అస్త్రం వాడాలో తెలియలేదు. ఇక నేను వోడి, రథ సారథ్యం మామయ్యకి ఇచ్చేశాను.

ఇక అయన మొదటి అస్త్రం పరపతిని ప్రయోగించారు.

"అలా అంటే ఎలాగండి. నేను కూడా సెంట్రల్ గవర్నమెంట్‌లో రిటైర్ అయిన వాడినే.".

"అల్లగా, నేను వెతికిస్తాను. ఏమన్నా వుంటే రెండు వారాల్లో కనపడండి".

అంతటితో ఆగలేదు మామయ్య. 'మీరు ఇక్కడ కూర్చోండి, నేను ఇప్పుడే వస్తాను. మన చుట్టాలు ఒక ఆవిడ ఇక్కడ పని చేస్తోంది' అని ఒక అరగంటలో ఒక ఆవిడతో వచ్చి నాకు పరిచయం చేసారు.

ఆవిడ "మీరు ఎందుకు ఆఫీసుకి రావడం, ఫోన్ చేస్తే ఇంజనీర్ని పంపే దానిని కదా".

నా దగ్గర సమాధానం ఎక్కడ వుంటుంది. నేను హోం డైరెక్టరీ వెతకలేదు, మీరూ ఎవరో నాకు తెలియదు అని చెప్పలేను.

నవ్వి అబద్ధం చెప్పడం తప్ప. "హి హి !! ఊరుకే అప్లై చేస్తే ఇస్తారేమో అని".

చివరకు తెల్సింది ఏమిటంటే. ఆవిడే ఈ డిపార్టుమెంటు హెడ్ అని. మేము బ్యాంకు నుండి ఇంటికి గంటలో వెళ్ళేటప్పటికి ఇంజనీర్ మోడెం బిగించి మా కోసం వెయిట్ చేస్తున్నాడని.

☆☆

**ఇంకా కొంచెం డిమాండ్ లేని పని**

పరీక్ష - డ్రైవర్స్ లైసెన్స్ రెన్యూ చేసుకోవడానికి. నేను భారతదేశంలో వుండగా ఒక 18 ఏళ్ళ క్రితం మా నాన్నగారు ఇప్పించిన / తెప్పించిన లైసెన్స్.

పరీక్ష ప్రదేశం - డ్రైవర్స్ లైసెన్స్ రెన్యువల్ కార్యాలయం. కుదరక పోతే లంచం ఇచ్చి పని చేయించుకుందామనే కుళ్ళు - ఆలోచనతో డబ్బు అనే అస్త్రాన్ని బాగా జేబులో పెట్టుకుని.

రహస్యంగా వూరు చూసి (భార్య, పిల్లలు వెంట పడుతున్నా) వస్తాను అని.

టైం 11 గంటలు. డ్రైవర్స్ లైసెన్స్ రెన్యువల్ కార్యాలయంలోకి వెళ్ళాను. ముసుగు వీరుడులాగా. కౌంటర్‌లో ఎవరూ లేరు. మనుషులు తెగ తిరుగుతున్నారు.

ఒక రూం దగ్గర వున్న అటెండరు దగ్గరికి.

"డ్రైవర్స్ లైసెన్స్ రెన్యూ చేయాలి. ఎక్కడ అప్లికేషను ఫిల్ చేయాలి".

" అప్లికేషన్స్ లేవు. రేపు రండి."

డబ్బు అనే అస్త్రాన్ని వదులుదామని అనుకుంటుంటే. ఎలా కనిపెట్టాడో (రోజు నా లాటి కొత్త పిచ్చోళ్ళని తెగ చూసినోడికి మల్లె) -

"అప్లికేషన్స్ ఇక్కడ దొరకవు. బయట రోడ్ ఎదురుగా వున్న మేడ మీద దొరుకుతాయి. నేను చెప్పానని చెప్పు.".

వెంటనే వొక 50 రూపాయల కాగితం పెట్టా. ఎంతో గర్వంగా మొదటి అస్త్రాన్ని ప్రయోగించినందుకు.

ఎదురు బిల్డింగ్‌లోకి వెళితే. అదే RTO ఆఫీసు లాగ వుంది. నాకు తెగ ఆనందము వచ్చి అచ్చం లోకల్ మనిషిలాగ అక్కడ కూర్చున్న మనిషితో

"డ్రైవర్స్ లైసెన్స్ రెన్యూ చేయాలి. ఎక్కడ అప్లికేషన్ ఫిల్ చేయాలి?".

పెద్ద మనిషి నా వంక చూసి వొక్క నిమిషములో పట్టాడు నేను ఎవరో - నా పాత లైసెన్స్ (చక్కగా నలగకుండా వుంది, వాడింది తక్కువ) చూసి.

లోపలకి వెళ్ళి ఇంకొక మనిషిని తెచ్చాడు (ఇతనికి బాస్ అనుకుంటా).

"మీరు మాస్టర్ గారి అబ్బాయి కదా ? "

టెంపరేచరు మొత్తం నార్మల్‌గా వచ్చేసింది. మళ్ళీ నాకు తెలియకుండా పరిచయ అస్త్రం బయట పడింది.

"మీరు రావడం దేనికి? నేను మీ ఇంట్లో ఇస్తాను రేపు" అని టీ తెప్పించి తాగించి వదిలాడు.

తరువాత తెలిసింది. అతనే నా అసలు డ్రైవర్స్ లైసెన్స్ తెప్పించాడని. మా పక్క వీదిలో ఉంటాడని. మా నాన్న స్టూడెంట్ అని.

అల్లాగా రెండో పరీక్ష తప్పాను. నేను అక్కడకు వెళ్ళినట్లు ఇంట్లో తెలిసింది. నా మీద నిఘా పెరిగింది.

☆☆

**అసలు డిమాండ్ లేని పని**

పరీక్ష - పోలీసు కమిషనరు ఆఫీసు - మా పిల్లల US పాస్‌పోర్టు సంతకాలు తీసుకోవడం.

PIO / OCI కార్డులు రాక ముందు US పాస్ పోర్టు వాళ్ళు ఎక్కువగా ఇండియాలో వుంటే పోలీసు కమిషనరు ఆఫీసులో సంతకాలు తీసుకోవాలి.

పరీక్ష ప్రదేశం - పోలీసు కమిషనరు ఆఫీసు. మా ఇంటికి అతి దగ్గర.

నాకు తెలిసినది ఏమిటంటే జనరల్‌గా ఈ పని మాకు తెలిసిన ట్రావెలతను చేస్తాడు అని. అతనికి వున్న పరపతిని వాడి.

ఈ సంతకాలకి కూడా పరపతి వాడాలా అనిపించి. ఈ పని నేను చేస్తాను అని నాన్నతో అన్నాను.

అయన నా వంక చూసి - "ఎందుకు? ట్రావెలతను తొందరగా చేస్తాడు. అతనికి అలవాటు".

"మనకు కూడా తెలియాలి కదా. ఎలా చేస్తారో. కమిషనరు ఆఫీసు కూడా ఇంటి దగ్గరే కదా. నాకు మార్నింగ్ వాక్ లాగ. మీరు కూడా రండి".

"నేను ఒకసారి వస్తాను. తరువాత నీవే వెళ్ళాలి. అలా అయితే వెళదాము".

"మీరు నాకు  బిల్డింగ్‌లో ప్లేస్ చూపించండి. మిగిలిన వన్ని నేను (క్షణ క్షణము సినిమాలో బ్రహ్మానందంలాగా) నేను చూసుకుంటా".

ఈయన వస్తే ఎవరో వొకరు తెలిసిన వాళ్ళు కనపడతారు, దాంతో పని వాళ్ళ చేతిలోకి వెళ్ళి పోతుందేమో, పని నా వల్ల అవుతుందో లేదో తెలియదనే భయముతో.

పొద్దున్నే కాగితాలు తీసుకొని వెళ్ళాము. అక్కడ బిల్డింగ్ చూపించి వెళ్ళి పోయారు నాన్న.

పది గంటలకు ఒక ఉద్యోగి వచ్చాడు. నేను పరిచయం చేసుకొని documents ఇచ్చాను.

ఆయన ఎదురుగ వున్న కుర్చీలో కూర్చో పెట్టి, అటెండర్‌తో టీ తెప్పించి, US లో ఎక్కడ ఉంటామో కనుక్కొని, ఆయన చుట్టాలు ఎవరో వున్నారని చక్కగా మాట్లాడి.

"మీరు ఎల్లుండి రండి. కమిషనరు గారు అప్లై చేసిన వారి ముందు సంతకం చేస్తారు".

ఆయనకి నమస్కారాలు కొట్టి. గర్వంగా ఇంటికి వచ్చాను. పని అయ్యేవరకూ ఎవరికీ చెప్పద్దు అనుకున్నాను.

చెప్పిన రోజుకి వెళితే - కమిషనరు గారు చాలా బిజీగా వున్నారు, సాయంత్రం రమ్మని చెప్పారు.

సాయంత్రం వెళితే రేపు రండి, అని లూప్‌లోకి తీసుకు వెళ్ళిపోయాడు.

ఒకరోజు పొద్దున్నే వెళితే, ఇంకా ఎవరూ రాలేదు. అందుకు బయట నిలబడ్డాను చెట్ల దగ్గర. నాకు టీ ఇచ్చిన అటెండర్ చెప్పిన విషయము విన్నాక బుర్ర బ్లాంక్ అయ్యింది.

"సారూ, మీరు రోజు తిరిగినా మీ పని కాదు. కమిషనరు గారు వూళ్ళో లేరు వారం నుండి. అయన వచ్చే వారం చివరిలో వస్తారు. మీరు అప్పుడు రండి".

నేను ఇంటికి వచ్చి పొద్దున్నే నా కమిషనరు ఆఫీసు వాక్ జరగక పోవడంతో జరిగిన విషయం నాన్నకు, తరువాత కుటుంబంలో చాలామందికి తెల్పింది.

తరువాత  పని నా వద్దనుండి తరలి పోయింది.

☆☆

ఇలాగ చాలా తెగ ఫేమసయి పోయాను చుట్టాలు, స్నేహితులలో. అందువల్ల మా వాళ్ళు తెగ మోస్తారు నేను ఏ పని గురించి మాట్లాడినా ఇండియాలో.

☆☆

# అబద్ధంలో అతడూ ఆమె - శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో ప్రశంసాపత్రం పొందిన కథ

**ఏ ఒడిదుడుకులూ లేకుండా,** మౌనంగా, మోక్షంకోసం తపస్సు చేసే ముముక్షువు మదిలా, స్థితప్రజ్ఞతతో, ఏకాగ్రతతో ముందుకు సాగిపోతోంది రైలు. ఆ ఏ.సీ పెట్టెలోని చలువద్దాల కిటికీలోంచి, ఆ చీకట్లో, బయట ప్రపంచాన్ని చూడడమే కష్టం. చూస్తూ కాలనిర్ణయం చేయడం మరీ కష్టం. అతనివాచీ పదిగంటల పది నిముషాలు చూపిస్తోంది. కళ్ళు ఏదో పుస్తకంలో కూరుకుపోయి వున్నాయి. తను చదువుకుంటున్నా ననుకుంటున్నాడతను. ఎదురుగా పై బెర్త్‌మీద ఆమె. చాలా అలసిపోయాననీ, తనకి నిద్ర పట్టేస్తోందనీ అనుకుంటోంది. ఆమెకి మళ్ళా దాహం వేస్తే బాగుండుననిపించింది అతనికి. ఆమెకి దాహం వేసింది. ఎప్పటిలాగే ఇటుతిరిగి, వేలాడదీసిన వాటర్ బాటిల్ పైనించే అందుకుంది. ఇందాకటిలాగే ఆమె జడ సురగంగలా కిందకి దూకింది. దేవలోకంలో ఊయలలూగుతున్న అప్సర తను ప్రేమించిన రాజకుమారునికి పంపిన వర్తమానంలా వున్నదా వాల్జెడ. అతను రెప్ప వేయకుండా తదేకంగా ఆమెనే చూస్తున్నాడు. ఆమె అతనిని చూడకపోయినా అతను తననే చూస్తున్నాడన్న విషయం ఆమెకు స్పష్టంగా తెలుసు. అర క్షణంలో నీళ్ళు తాగేసి, వాటర్ బాటిల్ పెట్టేసి అటు తిరిగిపోయింది. తిరిగి , నవ్వుకుంది. పాపం అనిపించింది. పోనీ, ఓ మాటు గిరుక్కున వెనక్కి తిరిగి చూస్తే, దొంగ దొరికిపోతాడుగా అనుకుంది. మళ్ళీ అతనేమనుకుంటాడోనని వూరుకుండిపోయింది.

అతనింకా రెప్పవెయ్యలేదు. తపస్సిద్ధి పొందిన భగీరథుని కళ్ళలా మెరిసిపోతున్నాయతని కళ్ళు. నిజంగా ఆమె అంత అసమాన సౌందర్య రాశియో, లేక తన వూహే ఆమెకి లేని అందాలని ఆపాదిస్తోందో అతను ఇతమిత్థంగా నిర్ణయించుకోలేకపోయాడు. ఆమెతో ఎలాగైనా మాట్లాడాలి. "ఆ తరువాత?"

ఏముంది. రేపు ఉదయం రైలు దిగి ఎవరిదారి వారిది.

"అంతేనా?"

తెలియదు. కానీ ముందు మాట్లాడాలి. ఇప్పుడే మాట్లాడెయ్యాలి. ఈ బోగీలో అవతలా ఇవతలా ముసుగుతన్ని పడుకున్న జీవాలు లేచి మాసీట్లలోకి రాకముందే మాట్లాడాలి.  అవును అదే చెయ్యాలి. అరే, ఇదేవిటీ, నాకిటూ, అటూ ఎవరూ లేరు. అంతా ఖాళీ. అంటే ఇటువైపునున్నది నేనూ, ఆమేనా ! మరి వెనకాతల సీట్లలో ఎవరున్నారో చూసొస్తే. ఆ, అక్కడ ఎవరుంటే ఏవిటిలే. ఇక్కడ లేరుగా. ఇక్కడ మేమిద్దరం హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు. ఇంతకీ ఆమెని ఎలా అడగటం? మీతో మాట్లాడాలనుందంటే ఏమనుకుంటుందో. వాటర్ బాటిల్ కాస్తా నెత్తిన గుమ్మరిస్తే?ఎంత నామర్దా! అతనింకా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఆమె ఆల్‌రెడీ ఇవన్నీ ఆలోచించేసి కిందకి దిగి అతని ఎదురుగా కూర్చుని వుంది.

"హాయ్. నమస్తే. నా పేరు మాయ. మీ పేరు?" తేరుకోవడానికి ఒక నిముషం పట్టిందతనికి.

"మా..మానవ్".

"భలేవుంది పేరు.."

"మీ పేరు కూడా చాలా బావుంది.." అన్నాడు మెల్లిగా సంశయిస్తూ.

"నిజం చెప్పనా, ఇలా మాట్లాడుకుంటే చాలా ఫార్మల్‌గా, నార్మల్‌గా ఉంది. మీకు?"

"అవును, కానీ ఇంకా పరిచయం కూడా కానివాళ్ళతో ఫ్రీ గా మాట్లాడాలంటే కష్టం కదా?"

"అదేంటి? మనపరిచయం అయ్యి ఒకటి కాదు, రెండు కాదు అరవై సెకన్లయిందిగా" అంది నవ్వుతూ.

"యా, యు ఆర్ రైట్. చెప్పండి, ఏం మాట్లాడుకుందాం."

"ఒకటి మాత్రం నిజం. ఏం మాట్లాడుకున్నా చాలా ఫ్రాంక్ గా మాట్లాడుకోవాలి. సరేనా?"

"వద్దండీ, మన ఫ్రాంక్‌నెస్ తో తెలియకుండానే ఎదుటివాళ్ళని హర్ట్ చేస్తాం, ఒక్కోసారి..."

"ఏం ఫరవాలేదు, ట్రై చేద్దాం. పొడిపొడిగా పైపైన మాట్టాడేసుకుంటే చాలా బోరు కొడుతుంది, ఇంకా ఈ రాత్రంతా ఉంది ప్రయాణం.." అంది నవ్వుతూ. ఒక్క సెకను ఆగి తనే అంది..

"ఒకవేళ పొరపాటున హర్ట్ చేసినా ఏముంది, తెల్లవారితే ఎవరికి వారమై పోతాం, మీరెవరో మానవ్, నేనెవరో మాయ.."

"సరే అయితే. నేను మొదలుపెట్టనా?" అడిగాడు కుతూహలంగా.

"ఆగండాగండి. ఒక చిన్న గేం ఆడదాం. మీరు అన్నీ అబద్ధాలే చెప్పాలి. ఎప్పుడైతే నిజం చెబుతారో, అప్పుడు మీ టర్న్ అయిపోతుంది. తరవాత నా టర్న్, నేను నిజం చెప్పేంతవరకూ. ఎవరు ఎక్కువ సేపు అబద్ధాలాడితే వాళ్ళు గెలిచినట్టు."

"మరి పందెం ఏవిటి?"

"ఓడినవారు గెలిచిన వారు ఏమడిగితే, అదివ్వాలి. "

"సరే, నేను గెలిస్తే ఏమిస్తారు?" అన్నాడు అతను.

"మళ్ళీ పైనించి మంచినీళ్ళు తాగుతాను" అంది అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఓ, చూసేసారా, అయాం సారీ..అలా చూడకుండా ఉండాల్సింది.." అన్నాడు మెల్లిగా.

"ఏమీ పరవాలేదు. మీరు చూడకపోతే, నేను సారీగా ఫీలయ్యేదాన్నేమో.." అంది నవ్వుతూ.

"సరే మరి నేను గెలిస్తే?" అందామె చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ.

"మీరు వద్దనేదాకా మిమ్మల్నే చూస్తూ, హాయిగా మీతో మాట్లాడుతూ ఉండిపోతాను.." అన్నాడు మంత్రముగ్ధుడిలా.

" ఓకే, డీల్. మొదలుపెట్టండి, మైగాడ్, ఇది చాలా ఎక్సయిటింగా ఉంది."

మానవ్ మొదలుపెట్టాడు.

"మాది రాజవంశం. మాకు గ్వాలియర్‌లో ఒక పేలస్ ఉన్నా, మా నాన్నగారు విజయనగరం పేలస్‌నే ఇష్టపడతారు. అందుకని అక్కడే సెటిలయ్యాం. నేను ఐ.ఐ.ఎం అహ్మదాబాదులో చదివాను. ఈ మధ్యనే ఐ.ఏ.ఎస్. టాపర్‌గా వచ్చాను. ఒరిస్సా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడికే వెడుతున్నానిప్పుడు."

"ఆగండాగండి. అబ్బా. భలేగా చెబుతున్నారుగా. సరే నేనడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పండి. మీకు పెళ్ళయ్యిందా? "

"అయ్యింది"

"మీ భార్య ఎలా ఉండాలి?"

"నల్లగా, పొట్టిగా, చాలా లావుగా వుండాలి. అచ్చం మీలా ఏమాత్రం ఉండకూడదు."

"మీకు పెద్ద జడ ఇష్టమా?"

"అసహ్యం"

"...చాలా లేటయినట్టుంది, ఆట ఆపేద్దామా?" అంది అమాయకంగా.

"ఆపేద్దాం."

"టైమెంతయింది.."

అతను వాచీ చూసుకుని చెప్పాడు "పదీ పది.."

వెంఠనే ఆమె కళ్ళు తళుక్కుమని మెరిసాయి. "ఓడి పోయారు, నిజం చెప్పేసారు అంది వాచీ చూసుకుంటూ.."

"అమ్మ దొంగా, నేనింకా నిజమనుకున్నాను. సరే, ఇప్పుడు మీరు మొదలెట్టండి, చూద్దాం..."

"నా పేరు అభిసారిక. మా నాన్నగారు ఓ పేద్ద రియలెస్టేట్ మాగ్నెట్. నిజం చెప్పాలంటే, మన రాష్ట్రంలో మూడొంతుల భూమి మా కన్స్ట్రక్షన్ కంపెనీలదే . మాకింకా మైనింగ్ బిజినెస్‌లు కూడా ఉన్నాయి. నాకు హ్యూమన్ సైకాలజీ అంటే అస్సలిష్టంలేదు. అందుకే దాంట్లో పీ.హెచ్.డీ చెయ్యలేదు. ట్రావెలింగ్ అన్నా, అనుకోకండా ఎదురయ్యే థ్రిల్ అన్నా, వెరైటీ అన్నా నాకు నచ్చదు. "

అతనికి ఉన్నట్టుండి పొలమారింది. అతను చిన్నగా దగ్గుతూ తన మంచినీళ్ళ సీసా బైటికి తీసాడు.అది ఖాళీగాఉంది. వెంఠనే ఆమెని అడిగాడు."మీ బాటిల్లో నీళ్ళున్నాయా?"

ఆమె కొంచెం కంగారుగా బాటిల్ తీసి "ఉన్నాయండీ, ఇవిగో గబగబా తాగండి.." అంటూ అందించింది. అతను తాపీగా అందుకుని తాగి, "హమ్మయ్యా, మీరూ ఓడిపోయారు" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"హమ్మ మాయల మరాఠీ. భలే ప్లాన్ వేసారుగా.."

"లేకపోతే మిమ్మల్ని గెలవగలనా?" అంటూ "సరే సరే టైమెంతయిందో చూడండి, అప్పుడు తెలిస్తుంది గెలుపెవరిదో.." అన్నాడు నవ్వుతూ.

ఆమె వాచీ చూసి చెప్పింది.."సరిగ్గా పదీ పది".

ఒక్కక్షణం నిశ్శబ్దం.

ఒక్కసారి తలెత్తి ఒకర్నొకరు చూసుకున్నారిద్దరూ.

"ఇందాకా మీరు ఓడిపోయినప్పుడూ పదీపదే అయ్యిందికదా?. మళ్ళీ ఇప్పుడూ అంతే అయ్యిందేమిటీ?" అంది కాస్త ఆందోళనగా.

"కాలమిలా ఆగిపోనీ, కల నిజమై కదలిరానీ.." పాడుతున్నాడతను.

"మానవ్. నిజంగానే అడుగుతున్నా, మనిద్దరి వాచీలు పాడైపోయాయి. పోనీ సెల్ ఫోన్‌లో చూడండి," అంటూ బేగ్ లోంచి సెల్ తీసింది.

అందులోనూ పదీపదే చూపిస్తోంది. ఇద్దరికీ ఆందోళన ఎక్కువైంది. "పోనీ ఎవర్నేనా అడుగుదాం పదండి" అంటూ లేచి ఇద్దరూ అటూ ఇటూ చూసారు. పెట్టె అంతా ఖాళీ... "ఇదేవిటి? ఈ పెట్టెలో మనం ఇద్దరమే వున్నావేవిటీ?"

"నాకూ అదే అర్థం కావటంలేదు."

ఆమె ఒక్కసారి బైటికి పరీక్షగా చూసింది.

"మానవ్..రైలు కదలటంలేదు, ఆగిపోయింది.." ఖంగారుగా చెప్పింది.

"వాటార్యూ టాకింగ్..?"

ఇద్దరూ తలుపు తీసి చూసారు.

రైలు నిజంగానే కదలటం లేదు...

"అదేవిటి? ఎవరివో కేకలూ, ఏడుపులూ వినిపిస్తున్నాయి?"

"ఆ శబ్దాలేవిటి? అయ్యో, ఆ మంటలేవిటి? మన పెట్టె ఇలా అంటుకుపోతోందేవిటి? అయ్యో, మాయా, నువ్వు పై బెర్త్‌లోనే ఇరుక్కుపోయావు. నేను ఇక్కడే ఉండిపోతాను, నీకోసం, అదేవిటీ మన అందమైన శరీరాలు ఇలా కాలిపోతున్నాయి, బూడిదైపోతున్నాయి.., అయ్యో, నీ జడేదీ? అసలు నువ్వేదీ? అయ్యో నేనెక్కడున్నాను? ఇంత జరుగుతున్నా మనకి నొప్పి తెలియట్లేదేవిటి? వుండు నేనింటికి ఫోను చేస్తాను. హలో..అమ్మా, అమ్మా నేను..నేనమ్మా..అయ్యో నా మాట వాళ్ళకి వినిపించటం లేదు. లైను బాలేదేమో. పోనీ నువ్వు మీ యింటికి ట్రై చెయ్యి. "

"ఎవ్వరూ ఫోనెత్తట్లేదు మానవ్.."

"అయ్యో, ఇంత ఘోరం జరిగినా మనం మిగిలిపోయాం, ఇప్పుడేంచేద్దాం?"

"మనం ఇక్కడే వుందాం. మనల్ని కాపాడడానికి మనవాళ్ళు వస్తారు. వారికి మనం సేఫ్‌గా ఉన్నామని చెబుదాం. ఇంతకష్టంలో నాకు తోడున్నారు. మీకిష్టమైతే మనం పెళ్ళి చేసుకుందాం..."

"అవును, నాకిష్టమే.."

"మనవాళ్ళు రేపు పొద్దున్న వచ్చేస్తారు కదా.."

"అవును వచ్చేస్తారు మాయా.."

"ఇదేమిటీ ? టీవీల వాళ్ళూ న్యూస్ చానళ్ళ వాళ్ళూ వచ్చేస్తున్నారేమిటి? "

స్పెషల్ న్యూస్ కరెస్పాండెంట్..

**"ఇక్కడ నిన్న రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో నాలుగు బోగీలు పూర్తిగా అంటుకుపోయాయి. వాటిల్లో ఎవ్వరూ ప్రాణాలతో బైటపడలేదు. ఈ ప్రమాదం సుమారుగా రాత్రి పదిగంటల ప్రాంతంలో జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు..."**

"అయ్యో మానవ్..ఎదురుగానే వున్నా మనం వాళ్ళకి కనపడటంలేదు.. "

"మేమిద్దరం బతికున్నాం. ప్లీజ్ మాకోసం మావాళ్ళని రమ్మని చెప్పండి..ప్లీజ్ "

దూరంగా ఏగుడిలోనో తెలవారుఝామునే పెట్టిన అన్నమాచార్య కీర్తన వినిపిస్తోంది లీలగా..

**"దేహి నిత్యుడు, దేహములు అనిత్యాలు, ఈహల నా మనసా ఇది మరువకుమీ.."**

❁❁❁

# స్వర్గంలో ఓ సాయంకాలం -కె.జయశంకర్ రెడ్డి

(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన నా మొట్టమొదటి కథ పోటీల్లో ప్రశంసా పత్రం పొందిన కథ)

**లాంగ్ వీకెండ్‌కి** దేవలోకం అంతా ఓ క్రూజ్ షిప్ లో విహారయాత్రకు బయలుదేరారు. మెయిన్ ఫ్లోర్‌లో దేవదూతలు, పెంట్‌హౌస్‌లో త్రిమూర్తులు సోషియలైజింగ్‌లో నిమగ్నమై ఉన్నారు. ఎప్పుడూ సెలెస్టియల్ కేటరింగు కంపెనీ వారి భోజనము తిని మొహమ్మొత్తుతోందని త్రిమూర్తులు అంటున్నారని మధ్యాహ్నం హాఫ్ డే ఆఫ్ పెట్టి త్రిమూర్తిణులు ముగ్గురూ తలో కూరా వండుకొచ్చారు. మహాశివుడికిష్టమని ఉమాదేవి గోరు చిక్కుడు వేపుడు తేగా, బ్రహ్మగారి కొరకు కాకరకాయ పులుసూ, శ్రీ మహావిష్ణువుకిష్టమని కందగడ్డ చిప్సూ వారి వారి గృహిణులు వండుకొచ్చారు. దేవదూతలంతా అందమైన స్టీవార్డెస్‌లు అందించే రంగు రంగుల వైన్ గ్లాసులు అందుకుంటూ సురాపానం నిరాటంకంగా సాగిస్తున్నారు. క్రిందహాల్లో సౌండ్ కాసింత తగ్గించమని త్రిమూర్తులనుండీ వార్నింగ్ భటుల ద్వారా అప్పటికే ఓ సారి వచ్చింది. రంభా, ఊర్వశి, మేనకల నృత్యంతో పాటు, లెక్కకు మించిన దేవకన్య బెల్లీ డాన్సర్లు ఒక్కో దేవదూతనూ ఇండివిడ్యువల్‌గా కూడా ఎంటర్టైన్ చేస్తున్నారు.

బ్రహ్మకేముంది పుట్టించి పారేస్తాడు, మహాశివుడికి కోపమొస్తే మంటగలిపేస్తానంటాడు, మధ్యలో మెయింటినెన్స్ చేయలేక చస్తున్నాను బాబూ అని అనుకుంటున్న తరుణంలో మధ్యాహ్నమే శ్రీ నారద మహాముని భూమిమీద అన్యాయమెలా రాజ్యమేలుతోందని వేసిన కుళ్ళు జోకులు గుర్తొచ్చి మహా విష్ణువు లోలోపనే మథన పడి పోతున్నాడు. మందలించినా తగ్గని క్రింది ఫ్లోర్‌లో అల్లరి పుండు మీద కారం చల్లినట్టైయి శ్రీ మహా విష్ణువు కోపంతో మెట్లు దిగి వస్తుంటే బ్రహ్మేశ్వరులిద్దరూ ఆయననుసరించారు. త్రిమూర్తులే స్వయంగా క్రిందిహాల్లోకి రౌద్రావేశాలతో రావడం గమనించిన మ్యూజిక్ సిస్టం ఆటోమేటిక్‌గా పాజ్‌లోకి వెళ్ళింది. రంభా ఊర్వశి మేనకలు వారి నృత్యభంగిమలలో అలా ఫ్రీజ్ అయిపోయారు. దేవదూతలు వారి వళ్ళోంచి బెల్లీ డాన్సర్లను పక్కకు జరిపి ఒక్క లగువున లేచి అటెన్షన్‌లో నించున్నారు. శ్రీ మహా విష్ణువు "మీరు దేవ దూతలా? లేక యమదూతలా? రోజురోజుకీ మీ న్యూసెన్స్ ఎక్కువై పోతూ ఉంది" అని రుద్రనేత్రుడై మండి పడ్డాడు. బ్రహ్మేశ్వరులు పైకేమీ అనకపోయినా వారి కళ్ళళ్ళో కూడ కోపం ప్రస్ఫుటిస్తూ ఉంది. దేవదూతల తలలు భయంతో వంగాయి, వారి కంటి చూపు నేల వైపుకు మళ్ళింది.

వెనుతిరిగి కిరీటం సవరిచుకుంటూ పై ఫ్లోర్ మెట్లెక్కుతున్న శ్రీ మహా విష్ణువు సడన్‌గా ఆగి వెనక్కి తిరిగి " అదిగో మనసులో - ఆ సణుగుడే వద్దన్నాను" అని దేవదూతల వైపు మరోసారి మండి పడటం బ్రహ్మ ఈశ్వరుల ఇద్దరికీ షాక్ తినిపించింది. అప్పుడా ఇద్దరూ విష్ణువు వైపు తిరిగి "మా కేమీ వినపడలేదే! ఒక్కరూ దించిన తల ఎత్తనే లేదు" అని ముక్త కంఠం తో అన్నారు.

"మీరు గానీ 'మైండ్ బీపర్' టర్న్ ఆఫ్ చేయడం కాస్త మరిచిపోలేదు గదా?" అని బ్రహ్మ దేవుడాయన్ని ప్రశ్నించారు.

"మీకేమి సార్ పుట్టించి వదిలేస్తారు.. మెయింటెయిన్ చేసేటప్పటికి నా తల ప్రాణం తోకకొస్తోంది" అని బ్రహ్మదేవుడికి ఆయన బదులిస్తుండగా ఒకదేవదూత మనసున నిరసన ఇలా మాటల రూపం దాల్చింది. 'త్రిమూర్తులు మా బాధలూ, మా పని వత్తిడులూ పట్టించుకున్న వారు కాదు'.

అప్పటికే శ్రీ మహా విష్ణువుకి సపోర్ట్‌గా సింపతీ ఫీలవుతున్న పరమశివుడు, 'మహా విష్ణూ వీణ్ణి భస్మం చేస్తా!' అంటూ ముందుకురికాడు. అంతలో బ్రహ్మ, శివుణ్ణి కాస్త వెనక్కి లాగుతూ "ప్రతీ సమస్యకీ భస్మం పరిష్కారం కాదు పరమేశ్వరా! ఒక్క

క్షణమాగు నాయనా! విషయం ఏవిటో కనుక్కుందాం" అన్నారు. అంతలో శ్రీ మహావిష్ణువు కలగ చేసుకుని "పరబ్రహ్మా! వీళ్ళకేమి తక్కువ చేశామండీ? నెల నెలా జీతం బాంక్ అకౌంట్‌లోకి వచ్చిందా రాలేదా అని చెక్ చేసుకోవాల్సిన అవసరం లేదు, నిత్యావసర ధరలు పెరుగుతాయన్న వర్రీ లేదు. పెళ్ళాల పోరు లేదు, ముసలితనం అసలే రాదు, సాయంకాలం కాగానే ఇష్టమొచ్చిన దేవకన్యతో తంకుతమారం జరిపినా ఏ సమస్యా రాకుండా చూసుకుంటున్నాం. వీళ్ళకేం బాధలండీ?"

ఒక దేవ దూత ధైర్యం చేసి అన్నాడు. "ప్రభువులారా! చిత్ర గుప్తుడు చిట్టాలు సరిగా వ్రాస్తున్నాడో లేదో తెలియదు గానీ ఆయన నుంచీ హైలీ రెకమెండెడ్‌గా స్వర్గానికి వచ్చిన వాళ్ళల్లో కూడా మితిమీరిన స్వార్థం, ద్వేషం, అసూయలు అగుపిస్తున్నాయి. అతని చిట్టా ప్రోగ్రాంకు ఈ మానవులేమైన ఓ వైరస్ అంటిచ్చి కరప్టెడ్ చేసారో లేక బిల్ గేట్స్ విండోస్‌లాగ దాన్ని కూడ అప్‌డేట్ చేయాలో ఏమిటో? మా కేమీ అర్థం కావడం లేదు. వీరు మన స్వర్గమేతెంచి కుళ్ళు బుద్ధులు ప్రదర్శించి స్వర్గలోక వాతావరణమునే కలుషితము చేయుచున్నారు". అంతలో, మరో దేవదూత ఇలా అందుకున్నాడు. "విష్ణువు సార్ చెప్పినట్లు మాకు ముసలితనం రాదు, జబ్బులు రావంటిరి కదా! దేని గురించి బాధ పడవలసిన అవసరము లేదంటిరి కదా! అదే మాకు పెద్ద బాధ! రేపైనా, రేపు సంవత్సరమయినా, రేపు శతాబ్దమైనా ఇంతే! ఇలానే ఉంటుంది. ఎపుడూ ఇంతే! మోనాటనీ సార్! మోనాటనీ!!".

"వీళ్ళ బోర్‌డం సంగతి నేను చూసుకుంటాను. మీరేం వర్రీ గాకండి. వీరికి భూమి మీద ఓ జన్మ ఇస్తే సరి. అక్కడ ప్రాసెస్‌డ్ ఫుడ్స్ తిని డయబేటిస్ వచ్చి గట్టిగా డెబ్బైయ్యేళ్ళు కూడా బ్రతకరు. కానీ, ఇలాంటి క్లిష్టమయిన సమస్యలు వచ్చినపుడు భూలోకంలో మానవులు వాళ్ళ భార్యల నడిగి సలహా తీసుకుంటారట. మనమూ అలా చేస్తే పోలా! " అంటూ విష్ణు, ఈశ్వరులను పెంట్‌హౌస్ వైపు బయలుదేరదీసాడు బ్రహ్మ దేవుడు.

అలా త్రిమూర్తులు వారి అర్ధాంగుల చెంతకు చేరిన పిమ్మట విష్ణుమూర్తి మొదలుగా తన భార్యామణి శ్రీలక్ష్మీదేవి వైపు చూస్తూ, "దేవీ! భూలోకాన ప్రజలలో అరాచకము పెరిగి పోతుందట, మీరు కాసిన్ని ఎగ్‌స్ట్రా కాసులు వాళ్ళకు కుమ్మరించకూడదూ? పాపం బీదతనం వలన అన్యాయం పెరిగి పోతున్నదేమో?" అని అనగా శ్రీదేవి బదులిచ్చింది. "అదేమీ కాదు ప్రభూ! నేను పుష్కలంగా ధనమిచ్చిన చోట, లేని చోట కూడా సమానంగా పోరాడుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే, ధనము పుష్కలంగా ఉన్న మనుషులే ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నారు. డబ్బు కురిపించే కొలదీ వీరు అడవులన్నీ నరికేసి పెద్ద పెద్ద నగరాలను నిర్మించి ఆయిల్ కొరకు బావులు, చెత్త నింపను ల్యాండ్ ఫిల్స్ త్రవ్వి మీ భూదేవిని అపరిశుభ్రం చేస్తూ వేడిని పెంచుతున్నారు. అంటే 'గ్లోబల్ వార్మింగ్' అన్న మాట. నన్నడిగితే ఇంకా సరస్వతీ దేవి గారే మానవులకు కాసింత విజ్ఞానం పెంచితే వారు ప్రకృతితోనూ మరియూ ఒకరితో నొకరూ సఖ్యముగ సహజీవనం చేయడం నేర్చుకుంటారేమోనని అనుకుంటున్నాను".

అంతలో బ్రహ్మ అందుకుని "అవును, దేవీ! విద్య వివేకాన్నిస్తుంది అంటారు, మానవ జాతి అంతటికీ విద్య విజ్ఞానాలు పెంచితే ఈ గొడవలు తగ్గుతాయేమో?" అని శారదమ్మను అభ్యర్థించారు.

అపుడు సరస్వతీ దేవి, "దేవా! భూమిపై చదువు లేని ఉత్తములూ ఉన్నారు, విద్యాధికులయిన అధములూ ఉన్నారు. బడికి వెళ్ళకండని బాలికలపై బాటరీ యాసిడ్ పోస్తున్న నీచులు నేలపై ఉంటే నేను క్షేమంగా చదువెలా పంచేది. మీరేమో శరవేగంతో భూమిపై మానవులను పుట్టిస్తున్నారాయె. శ్రీ మహా విష్ణువుగారు లా అండ్ ఆర్డర్ మెయింటెయిన్ చేస్తే కదా చదువులయినా మరే వనరులైనా మందికి చేరేది?"

మాటతో తల వంచుకున్న బ్రహ్మ విష్ణువుల వైపు చూసి శివుడిలా అన్నాడు. "ఆధునీకరణ, గ్రోత్, ఎకానమీ, ప్రోగ్రెస్ పేరిట అందమైన శిరోజాలను పోలిన అడవులను నరికేస్తూ భూమాతను అందవిహీనము చేస్తున్నారు. ఆ మహాతల్లి వేడిని పెంచుతున్నారు.

చిత్రగుప్తుని చిట్టాలను సైతం కరప్ట్ చేయగల ఈ అతి తెలివి మానవాధములను, మీరు అనుమతిస్తే, నేనూ నా పిన సతీమణి గంగాదేవీ వెళ్ళి అంతం చేశి, భూమాతను కడిగి వచ్చేస్తాం. ఏమంటారు? "

"ఒక్క నిమిషమాగండి మహేశ్వరా! మీకు అన్నిటికీ ఆవేశమే. సరే! మీరు వెళ్ళి భూమి మీద మానవజాతిని అంతం చేసి వస్తారనుకొందాం. తర్వాతేమి చేస్తాం? మనం ఒకరి మొహాలొకరు చూసుకుంటూ ఉండిపోదామా? మాట్లాడుకోను కూడా విషయలు లేక బోరు కొట్టి చస్తాం!

కష్టం లేనిది సుఖం విలువ తెలియదు,

నష్టం లేనిది లాభం విలువ తెలియదు,

చీకటి లేనిది వెలుగు విలువ తెలియదు,

ఆకలి లేనిది అన్నము విలువ తెలియదు.

అన్నం ఎంత అవసరమో ఆకలీ అంతే అవసరం. ఎదురొచ్చే ఒక్కో సమస్యకూ పరిష్కారం వెదుక్కుంటూ, మరో కొత్త సమస్య వైపు ధైర్యంగా నడుస్తూ తీపి చేదుల రుచి చూడటమే జీవితం. అది మరులైన నరులకే కాదు అమరులైన మనకూ వర్తిస్తుంది. ఆవేశం తగదు నాయనా!! మీరందరూ అక్కడ సోఫామీద తాపీగా కూచుని రిలాక్స్ కండి. నేనిప్పుడే ఓ స్ట్రాంగ్ ఇరానీ చాయ్ చేసి తీసుకొస్తా. తాగుతూ నిదానంగా ఈ సమస్యకి ఓ పరిష్కారం ఆలోచిద్దాం" అని బ్రహ్మగారు అంటూండగా, అంతలో "నారాయణ! నారాయణ!" అంటూ ఎంట్రీ ఇచ్చారు నారద మహాముని.

"రండి! రండి! మహర్షీ!! మీ గురించే అనుకుంటున్నాము. అపుడపుడూ మీ ఎత్తిపొడుపులే లేకపోతే, అవి లేని సమయాన అనుభవించే సుఖం విలువ తెలియదని ఇప్పుడే బ్రహ్మగారు సెలవిస్తున్నారు". అని శ్రీ మహావిష్ణువు అనగానే అందరి మధ్య నవ్వు వెల్లి విరిసింది.

"ప్రభో! శ్రీ మహా విష్ణూ! నన్నలా ఇరికించకయ్యా మహాను భావా! "

"మహామునీ! మీరు టీ లో ఒక స్పూను షుగర్ వేసుకుంటారా లేక రెండా?" అని బ్రహ్మ నారదుణ్ణి అడుగుతూ తనూ అందరితో కూడి హాస్యామృతాన్ని ఆరగించారు. ◈ ◈

## భోగి పిడక — వాసు ముళ్ళపూడి

(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన నా మొట్టమొదటి కథ పోటీల్లో ప్రశంసా పత్రం పొందిన కథ)

**'వచ్చారా! ప్రయాణం** బాగా జరిగిందా." అరుగెక్కుతున్న మమ్మల్ని ఆప్యాయంగా అడిగింది మా అమ్మమ్మ.

"ఆ పెట్టెలు అవీ లోపల పెట్టు" అని మా పాలేరు వెంకటరత్నాన్ని ఆజ్ఞాపించి అందరినీ చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు తాతయ్య.

"బోలెడు ప్రయాణం చేసొచ్చారు. మొహం కడుక్కుని కాఫీలు తాగుదురుగాని" అంటూ కుశల ప్రశ్నలయ్యాకా అందరికీ కాఫీలు పట్టుకొచ్చి, "నువ్వు వంకలు పెడతావని నీకు మాత్రం మీ అమ్మమ్మే పెట్టారు." అని నన్ను చూసి నవ్వుతూ అంది మా అత్తయ్య.

నాకు ఊహ తెలిసినప్పటినుంచీ ఏ ఏడాదీ సంక్రాంతికి ఊరెళ్ళకుండా లేను. పుట్టినూరు కావడం వల్ల ఏడాది తిరిగేసరికి మనసు పీకేస్తుంది ఎప్పుడు వెళదామా అని. కోనసీమలో అయినాపురమని అదొక చిన్న పల్లెటూరు. పచ్చని పంటపొలాలు, వాటి గట్టు వార

కొబ్బరి చెట్లు, సైడ్ కాలువలు, ఒక చెరువు, చెరువు ఒడ్డున పెద్ద మర్రిచెట్టు, దానికింద రచ్చబండ, చెరువుకి ఒకవైపు గ్రామ దేవత నీలాలమ్మ గుడి, ఇంకో వైపు విష్ణాలయం, శివాలయం - ఊరు చూడముచ్చటగా ఉంటుంది. మేము వెళ్ళేటప్పటికే మా దొడ్డమ్మ, మావయ్యలు, పిన్నిలు కుటుంబ సమేతంగా వచ్చేసారు. కాఫీ నోట్లో పోసుకుని, మా బావలతో కలిసి ఊరుమీద పడ్డాను నేను.

ఇంటి బయటకి రాగానే మా పక్కింటి రాజుగారు దర్శనమిచ్చారు.

"ఏం బాబు ఎలా ఉన్నారు. మీకేంటి మీరు బాగా చదువుతారు. ఫస్టుగా మార్కులు తెచ్చుకుంటారు. మా అబ్బాయి చూడు.. ఏమీ లాభం లేదు.. మేమేదో ఇలా గడిపేస్తున్నాం. పోనీలే మీరు బావున్నారు." అని ప్రశ్న సమాధానం ఆయనే చెప్పేసుకున్నారు.

ఆయన్ని ఊరిలో అందరూ ఏడ్పుల రాజుగారు అంటారు. ఆయన ప్రతీ మాట ఏడుస్తున్నట్టు ఉంటుందని - స్వరంలోనూ, భావంలోనూ. ఆయన బహు పీనాసి. ఇరవై ఎకరాలదాకా భూముంది - పది ఊడ్పు, పది కొబ్బరి తోటలు. తాతల నాటి ఇల్లు. అయినా ఇప్పటికీ ఆయన పూర్తిగా బట్టలు వేసుకోవడం ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడూ అర్ధ దిగంబరం..! అది కూడా రెండే పంచెలు. మార్చి మార్చి (ఏప్రిల్ నుంచి మార్చి ఒకటి మార్చి నుంచి ఏప్రిల్ ఇంకొకటి) కట్టేవారు. వారానికొకటే రోజు కూరలతో తినేవారు. మిగతా వారమంతా చారో, ఊరగాయతోనో గడిపేవారు. చాలాకాలం పిల్లలు లేరు. వాళ్ళ బంధువులలో ఎవరో పిల్లాడిని దత్తత తెచ్చుకున్నారు. వాడికి పెద్దగా చదువు ఎక్కేది కాదు. రాజుగారిని వాడు ముప్పతిప్పలు పెట్టేవాడు.

మేము వెళ్ళిన నాలుగు రోజులకి భోగి. సంక్రాంతి హడావిడి ఊరులో బాగా కనపడుతోంది. పండగకి అందరూ కొత్త బట్టలు కొనుక్కోవడం, ఇళ్ళని ముత్యంలా కడుక్కోవడం, ముంగిళ్ళలో ముగ్గులు, ఇళ్ళలో చుట్టాలు పెళ్ళి వాతావరణం తలపిస్తోంది. మహా సందడిగా ఉంది. ఊళ్ళో అందరూ అప్పుడే భోగి దండలు కూడా తయారు చేసేసుకున్నారు. ఇక మేము కూడా త్వరపడాలి అని నిర్ణయించుకున్నాం. ఆవు పేడ వెతికి పట్టుకుని, పిడకల తయారీకి నడుం కట్టాం. పేడని ముట్టుకోవడం, దాని వాసన కొంచెం చికాకుగా అనిపించినా, భోగిమంట సరదా ముందు అవి పెద్ద లెక్కలోకి రాలేదు. మా తాతయ్య వాళ్ళ ఇంటిచుట్టూ కోట గోడలాటి ఒక గోడ ఉండేది. దాని మీద రకరకాల ఆకారాలతో పిడికలు వెయ్యడం మొదలెట్టాం. దండ కట్టడానికి కావాల్సిన గారె లాగా కన్నం ఉండే పిడకలతో పాటు, అరటి పండు, బస్సు, యాపిల్ పండు, ఇలా మా ఊహ శక్తికి పదును పెట్టి రకరకాల పిడకలతో గోడను నింపాము. ఇక రోజూ మూడుపూటలా పిడకల పర్యవేక్షణ చేసేవాళ్ళం. ఎండ బాగా రావాలని పూజలు చేసేవాళ్ళం. అవి ఎందుకు త్వరగా ఎండట్లేదో కోర్ కమిటీతో సమావేశాలు జరిపేవాళ్ళం. రాత్రిళ్ళు వర్షం పడి పిడకలు కరిగిపోయినట్టు పీడకలలు కరిగిపోయినట్టు పీడలకలు కూడా వచ్చేవి. ఇలా అవి మా ఇంటెన్సివ్ కేర్‌లో మూడొంతులు ఎండాయి భోగిముందు రోజుకి. ఆ తరువాత వాటిని మంట మీద వేడి చేసి ఇంచు మించు ఎండాకా దండ కట్టి దాచిపెట్టుకున్నాం మర్నాటి మంటకి.

మర్నాడే భోగి. ఊళ్ళల్లో భోగి ఎంత బాగా చేస్తారంటే, ముందు రోజు రాతిరి ఊళ్ళో ఉన్న ఎడ్ల బళ్ళు, పాకల్లో వాసాలు (పక్కింటి, పొరుగింటి వాళ్ళవని వేరే చెప్పక్కర్లేదు) ఇవన్నీ ఎత్తుకుపోయి పోగేసి భోగేస్తారు. అందుకని ఆ రాత్రంతా పెరట్లో పాకకైే, ఎడ్ల బళ్ళకి బోలెడు కాపలా కావాలి. అలా ఆ రాత్రి మా తాతయ్య నైట్ షిఫ్ట్ చెయ్యాల్సొచ్చింది. మేము కూడా మహా సరదా పడి మా తాతయ్యతో పాటు పెరటి అరుగు మీద గూర్ఖాగిరిలో ఉత్సాహంగా పాల్గొన్నాం. సాధారణంగా కథలు చెప్పడంలో బామ్మలు, అమ్మలు ప్రసిద్ధి. కానీ మా తాతయ్య అదంతా స్త్రీవాదులు చేసిన కుట అని నిరూపించేంత బాగా కథలు చెప్పేవారు. ("తాత కథలు" అని మా తాతయ్య చెప్పిన కథలతో ఒక సంకలనం విడుదల చెయ్యాలి అనుకునేవాడిని ఇదివరలో), కాకపోతే ఒకటే షరతు, చెపుతూ ఉన్నంతసేపు ఆయన కాళ్ళు పట్టాలి. ఆయన చెప్పే కథలకి, చెప్పే తీరుకి వీరభిమానులమయిన మేము అవి వినడానికి ఏం చేయడానికయినా సిద్ధపడేవాళ్ళం. ఇక కాశీ మజలీ కథలైతే ఒక్క కథే మా వేసవి శెలవులు మొత్తం ఆక్రమించేది. సాయంత్రం వీధి అరుగు మీద కూర్చుని, మా చేతులరిగిపోయేలా కథలు చెప్పించుకునేవాళ్ళం భోగి ముందు రోజు రాత్రి కూడా అలాగే కథలు వింటూ

మెలుకువ ఉండచ్చులే అనుకున్నాం. కానీ ఆయన మాకు ఒక కొత్త విద్య నేర్పించారు. అదే మన జాతీయ క్రీడ - హాకీ అనుకునేరు (సినిమా పరిజ్ఞానం బొత్తిగా లేనివాళ్ళు), కాదండీ బాబూ - చతుర్ముఖపారాయణం. దీన్నే కొంతమంది ముద్దుగా పేక అనికూడా పిలుచుకుంటారు. ఆ రోజు మాకు సీక్వెన్స్ (రమ్మీ), క్లియరెన్స్ లాటి జీవితానికి పనికొచ్చే ఆటలన్నీ నేర్పారు. దాంట్లో మాకు నేర్పు వచ్చేసింది కానీ సమయం గడవట్లేదు. సూరీడు ఇంకా డీప్ స్లీప్ లో ఉన్నాడు చంద్రుడి షిఫ్ట్ కదా అని. ఇంకా ఆయన నిదురలేవాలి, బయలుదేరాలి, రావాలి. మాకు విముక్తి కలగాలి.

"శ్రీ సూర్యనారాయణ మేలుకో" అని మృదువుగా మొదలెట్టి "రా దిగిరా, దివి నుండి భువికి దిగిరా" స్థాయి వరకూ మా నిరీక్షణ సాగింది సూరీడు కోసం. ఆయన రాలేదు కానీ మాకు నిద్దర కుమ్ముకుంటూ వచ్చేసింది. లేచి చూసేసరికి బారెడు పొద్దెక్కింది. పక్కన చూస్తే పక్కలో మత్తుగా పడుకున్న మా బావలు, తాతయ్య ఎప్పుడో వెళ్ళిపోయి స్నానం చేసి పూజ కూడా చేసేసుకున్నారు. మా బావలని నాలుగు తన్ని లేపి, పరుగు పరుగున భోగి మంట వెయ్యడానికి బయలుదేరా. పిడకల దండలు, ఒక లీటరు కిరోసిను, అగ్గిపెట్టె తీసుకుని మా పెరట్లోకి పరుగులు తీసాము.

అన్నీ సిద్ధ చేసుకుని మంటెయ్య బోతుంటే మా తాతయ్య అక్కడ వద్దు, అసలే తాటాకు పాక నిప్పంటుకుంటుంది అని వారించాడు. సరే కదా అని ఇంకో వైపు కెళ్ళాం. అక్కడేమో గడ్డిమేట్లు. పాకకి పావుమైలు దూరంలో మంట వెయ్యనివ్వని మా తాతయ్య గడ్డిమేటు దగ్గర వెయ్యడానికి ఒప్పుకుంటాడా. ససేమిరా అన్నాడు. మేము భోగిమంటలో కిరసనాయిలు జల్లుదామనుకుంటే మా తాత మా ఉత్సాహం మీద నీళ్ళు చల్లారు. లాభం లేదని మా పొరుగింటి రాజుగారింటికి వెళ్ళాం. దీనికి మాత్రం మా తాతయ్య అడ్డుచెప్పలేదు. కానీ ఏమీ లేకుండానే ఏడ్చే రాజుగారు ఈ మంటంటే ఏమంటారో ఊహించం. అనుకున్నట్టే రాజుగారు తనదయిన బాణిలో "బాబూ! నాది అసలే చిన్నపాక, ఒకటే ఆవు, చిన్న గడ్డిమేటు, ఒకర్తే భార్య, ఒకడే పిల్లాడు" అని ఏడుపు మొదలెట్టాడు. ఆయన మొహం చూసి కాకపోయినా వారానికోసారి గడ్డి తిని, డైటింగ్ చేస్తున్నట్టున్న దూడల మొహం చూసి అక్కడ నుంచీ వచ్చేసాం.

ఇక ఇలా కాదని రోడ్డు మీదకెళ్ళాం మంట వెయ్యడానికి. అక్కడ అప్పటికే మంటలు చల్లారి, జన సంచారం మొదలైపోయింది. మా నాలుగు రోజులు శ్రమ వృధాకానివ్వం. మా రకరకాల పిడకలకు నిప్పంటించే దాక నిద్రపోమని నిర్ణయించుకుని మా తాతయ్యతో పెద్ద యుద్ధం చేస్తే, ఇంట్లో ఒక గాడిపొయ్యి చూపించి - అందులో వెయ్యండి, భోగిమంట ఐపోయాక నీళ్ళు కూడా కాచుకోవచ్చు ఎంచక్కా అని సర్ది చెప్పాడు. చేసేది లేక అయిష్టంగా అందులోనే వేశాం మా భోగిపిడకల దండలు. అవి ఏకంగా గంట మండాయి. పోనీ ఇది ఇలా అయ్యింది మిగతా రోజన్నా సరదాగా గడుపుదాం అని అనుకున్నాం. ఇంతలోనే తలంటు పోయించుకోవాలని మా గొంతులో వెలక్కాయ వేసారు అమ్మావాళ్ళు. దానికి ముందు నలుగు. ఏంటో అపురూపంగా పెంచుకున్న మా వంటిని అయిష్టంగా మా పాలేరు వెంకటరత్నం చేతిలో పెట్టాం. అతను గేదల్ని పీచెట్టి తోమినట్టు మమ్మల్ని తెగతోమేసాడు. (పెద్దగా తేడా తెలియదేమో పాపం). అతని చేతి నలుగులో మేము నలుగురం నలిగిపోయాం. మేము గోలపెడుతుంటే మా అమ్మవాళ్ళు "శుభ్రమా నలుగు పెట్టించుకోండి, మట్టంతా పోయి వళ్ళు నిగనిగలాడే రంగొస్తుంది" అంటూ మా వెంకటరత్నానికి ఊపుని, మాకు సలుపుని పెంచారు. మట్టిపోయి రంగు కాదు, తోలు పోయి రక్తం వచ్చేటట్టు ఉంది అని నసుగుకున్నాం. మాకైతే గత ఏడాది చేసిన అల్లరంతటికీ ఒకసారి పగ తీర్చుకుంటున్న ఫీలింగ్ వచ్చింది. ఆ పగకి ఫినిషింగ్ టచ్ ఆ తరువాత కుంకుడు రసంతో తలంటు పరిగెడుతున్న మమ్మల్ని బలి ఇచ్చే పశువుల్లా కాళ్ళూ చేతులు తలోకరూ పట్టుకుని బలవంతంగా కుంకుడు పులుసుతో తలంటేశారు. పైగా తల వెనక్కి పెట్టండి లేకపోతే పులుసు కళ్ళల్లో పడుతుందని ముందు జాగ్రత్తలొకటి కళ్ళల్లోకి పడకుండా పులుసు పొయ్యడం, తెలుగు టీవీ యాంకర్లు తెలుగు మాట్లాడడం, తెలుగు టీవీ న్యూస్ ఛానళ్ళలో తప్పులు లేకుండా చదవడం సాధ్యమేనా? ఆ తంతు పూర్తికాగానే, ఉప్పురాళ్ళతో సిద్ధంగా ఉన్నాడు మా మావయ్య, ఆర్య 2 లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌తో ఉన్న అల్లు అర్జున్ లాగ.

ఎరుపెక్కిన కళ్ళతో, ఉప్పెక్కిన నోటితో, బరువెక్కిన హృదయంతో బట్టలేసుకుని మత్తుగా నిదరపోయాం మేమందరం. ఆ కొత్త బట్టలు మాకు అతికినట్టు సరిపోయాయి (స్పైడర్ మ్యాన్ కాస్ట్యూమ్ లాగ అన్నమాట). అన్నట్టు ఆ బట్టలు కుట్టింది మా ఊరిలో ఏకైక (లేడీస్) టైలర్ కాంతారావు. ఇంట్లో ఉన్న ఆడ లేడీస్ అక్కడే కుట్టించేవారు, వాటితోపాటు పనిలో పని మావి కూడా అక్కడే కుట్టించేసేవారు డెడ్ చీప్ అని.

ఏ మాట కా మాట చెప్పాలి. నలుగుపెట్టి, వేన్నీళ్ళతో తలంటుకుంటే మత్తు మందిచ్చినట్టూ నిద్రపడుతుంది. ఆ గాఢనిద్రలో పులిహోర, బొబ్బట్లు తింటున్నట్టు ఒకటే మెరుపు కలలు. ఉలిక్కిపడి లేచాను. పులిహోర ఘాటు, నేతి బొబ్బట్టు కలగలిపిన ఒక కమ్మటి సువాసన నను పిలిచింది రా రమ్మంటూ. పట్టాను ఒక పట్టు. వంటలో మా అమ్మమ్మకి సాటి లేదంటూ. కవిత్వం పొంగింది కదూ నాలో దాన్ని తలుచుకుంటూ.

ఆ రోజు మా ఇల్లు చుట్టాలతో, మా పెరటి సావిడి పేకాటరాయుళ్ళతో నిండిపోయింది. సాధారణంగా పేకాట సరదాగా ఆడేవాళ్ళు ఉంటారు, డబ్బులకి ఆడే వాళ్ళుంటారు, క్లబ్బుల్లో ఆడేవాళ్ళూ ఉంటారు. కానీ మా ఊరిలో పేకాటే వృత్తిగా ఆడేవాళ్ళు ఉన్నారు. వాళ్ళు కేవలం పేకే ఆడతారు. అదే వారి జీవిత లక్ష్యం, ఆశయం, కర్తవ్యం. ఈ బ్యాచ్ మా ఊరిలో ఏ శుభకార్యానికెళ్ళినా, చుట్టాలు దండిగా ఉన్న ఏ ఇంటికెళ్ళినా కనపడేది. ఇలా పండగలు, పెళ్ళిళ్ళు ఏవీ లేనప్పుడు వీళ్ళ పరిస్థితి ఏంటని నాకు బోలెడు జాలివేసేది. ప్రభుత్వం పేకాటని స్వయం ఉపాధి పథకంగా ఎప్పుడు గుర్తిస్తుందో, పావలా వడ్డీ రుణాలు ఎప్పుడిస్తుందో అని నేను బెంగ పెట్టుకునేవాడిని.

మొత్తానికి నేను నిద్రలేచి, కాస్త ఎంగిలి పడి, మా గ్యాంగ్‌తో కలిసి, గుడికి బయల్దేరా, అరుగు దిగుతూండగానే ఎక్కడినుంచో ఒక ఘాటయిన సువాసన ముక్కులదిరిపోయేలా వచ్చింది. ఈయనెవడ్రా బాబూ అత్తరులో బట్టలుతుక్కున్నట్టు ఉన్నాడు. ముక్కులదిరిపోయే ఈ ఘాటేంటి అనుకునేంతలోపు మా తాతయ్య స్నేహితుడు సూర్యనారాయణగారు ప్రత్యక్షమయ్యారు. ముసలోడే కానీ మహానుభావుడు అనుకుని అరుగు దిగుతున్నాం.

ఆయన నన్ను చూసి "ఏరా అబ్బీ, ఎలా ఉన్నావా. మీ నాన్న నా కళ్ళ ముందు పుట్టి పెరిగిన వాడు. నేనంటే వల్లమాలిన గౌరవం. ఎరుగుదువా?" అని అడిగాడు. ఆయన వ్యవహారం, పిలుపు కూడా నాకు నచ్చలేదు.

నాకు వళ్ళు మండి "అయితే మీరు ఈ శతాబ్దంలో పుట్టలేదా తాతయ్యా?" అని అన్నాను.

అందరూ పుసుక్కున నవ్వేసరికి ఆయనకి చిర్రెత్తి నన్ను "ఔరా అబ్బీ నీ బట్టలేంటి బాగా బిగ్గా ఉన్నాయి, మీ తమ్ముడివా?" అనడిగి తిక్క కుదిరిందా అన్నట్టు నవ్వి లోపలికి వెళ్ళిపోయారు.

నాకు మా కాంతారావు టైలర్ గాడిని కాలికింద పురుగులా నలిపేయాలనిపించింది మా అమ్మ మీద కూడా పీకల దాకా కోపం వచ్చింది.

ఆ కోపంలో అరుగు మెట్లు గబగబా దిగుతున్నా. ఆఖరిమెట్టు దిగగానే స్కేట్ బోర్డు మీద కాలేసినట్టు రోడ్డుమీద జారడం మొదలెట్టాను. ఆ జారడం మా పక్కింటి కరణం గారింటి దగ్గర ఆగాను.. కాదు పడ్డాను.. ఇంచుమించు నడ్డి విరిగేడట్టు పడ్డాను. ఒక పక్కనే తొక్కిన గొబ్బిళ్ళు, ఇంకోపక్క మా వీధిలో వాళ్ళ వెకిలి నవ్వులు, గుండె భోగి మంట మండింది. అప్పుడు తెలిసింది నాకు. కాలు జారిన మగాడంటే ఈ సంఘానికి ఎంత కామెడీనో, సిగ్గుతో మొహం చొక్కాలో దాచుకుని, కాలికున్న గొబ్బిళ్ళను తుడుచుకుని ఇంటికి పరిగెత్తాను. అవమానంతో, ఇంటికెళ్ళగానే కాంతారావు కుట్టిన ప్యాంటుని గాడిపొయ్యిలో పడేసి, బ్రెడాంకి గడేసి ఆ సాయంత్రం వరకూ అక్కడే పడుకున్నాను.

సాయంత్రం అయ్యేసరికి ఇంట్లో మా బుల్లి తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి కలిపి సామూహిక భోగి పళ్ళు పొయ్యడానికి అంతా సిద్ధం అయ్యింది. పేరంటాళ్ళు ఒక్కొక్కళ్ళూ వంటినిండా బంగారాలు దిగేసుకుని దర్జాగా వస్తున్నారు. బొమ్మనా బ్రదర్స్‌లో పట్టుచీరలు, చందనా బ్రదర్స్‌లో బంగారు ఆభరణాలు అన్నీ అక్కడే ఉన్నాయా అనిపించింది నాకు. ఆడవాళ్ళకి బంగారమంటే ఎందుకింత పిచ్చో అని ఆలోచిస్తున్నాను. ఒకపిల్లగాలి తెమ్మెర నాజూకుగా నా మొహాన్ని తడిమింది. ఇది ఏ 'పిల్ల' గాలో అని అనుమానం వచ్చి చట్టుక్కున గుమ్మం వైపు తిరిగాను. మెరుపు తీగకు పరికిణీ కట్టినట్టు ఒక ఆకారం కనిపించింది. మా ఇంటి గుమ్మం మెట్లెక్కుతూ నా వైపే వస్తున్నట్టు ఉంది. చూడడానికి ఇంకో రెండు కళ్ళు ఉంటే బావుండు అనిపించింది ఆ రూపాన్ని చూడగానే. ఆ నుదుటి నునుపుకి పాపిడి బిళ్ళ కుదురుగా కూర్చోలేకపోతోంది. మెరిసిపోతున్న నల్ల జెర్రి పిల్లల్లా పరిగెడుతున్న కనుబొమలను ఎర్రటి గుండ్రటి బొట్టు రెడ్ లైట్‌లాగ ఆపుతోంది. సరస్సులో ఆడుకుంటున్న మీనాల్లా అటు ఇటు తిరుగుతున్నాయి కళ్ళు. అందరినీ పరీక్షిస్తూ, గాలికి బొట్టునుండీ రాలిన కుంకుమ రేణువులు ఆ సంపంగి పువ్వులాటి ముక్కుమీద జారుబండ ఆడుకుంటున్నాయి. ఆమె క్షణం మాట్లాడినా ఎడబాటు భరించలేనట్టు గాఢ ఆలింగనం చేసుకున్నాయి ఆమె ఎర్రటి పెదాలు, మెడలో ముత్యాల హారం గర్వతో మెరిసిపోతోంది ఆ స్థానం లభించినందుకు పరికిణీ తనకు ఇంత అందం తెచ్చిన ఆమెకు కృతజ్ఞతగా ఆమెకు వీలుగా నడుచుకుంటోంది. లక్ష్మీదేవి చిన్నప్పుడు ఎలా ఉంటుందో ఏ పటంలోనూ చూడలేదు నేను. కానీ ఇలాగే ఉంటుందని నమ్మకం కుదిరింది. ఆ రూపాన్ని అలా చూస్తూ ఉండిపోవాలనిపించింది. ప్రపంచమంతా స్థంభించిపోయినట్టు ఉంది. ఏమీ కనపడట్లేదు ఆమె తప్ప. ఆ గొంతు వినాలని చెవులు ఉవ్విళ్ళూరుతున్నాయి. ప్రపంచమంతా స్థంభించిపోయినట్టు ఉంది. ఏమీ కబపడట్లేదు ఆమె తప్ప. ఆ గొంతు వినాలని చెవులు ఉవ్విళ్ళూరుతున్నాయి. నా కోసమే అన్నట్టు ఎవరో పేరడిగినట్టున్నారు. "నీలిమ అండీ" అంది. ఆ పలుకు సుస్వర సంగీతం. అంతే.. ఇక డన్లప్ దిండులాటి నా గుండె తొలి ప్రేమనే శాటిన్ గలీబు గొడుక్కున్నట్టనిపించింది. ఒక తెలియని మైకంలో తూలిపోతున్నాను నేను, చిలిపి ఊహల్లో తేలిపోతున్నాను నేను. ఇంతలో ఓ రాగాయుక్తమయిన త్యాగరాజ కృతి వినపడ్డట్టు అనిపించి ఈ లోకంలోకి వచ్చాను. అదీ ఆమె మాట్లాడుతోంది. "ఇక్కడే జెడ్పీ స్కూల్ లో చదువుతున్నానండీ" అంది. ఆమె యాస తెలుగు భాషకు కొత్తసొగసులు తెచ్చినట్టు అనిపించింది. ఆ గోదావరి యాసలో ఇంత మాధుర్యముందని అప్పుడే తెలిసింది నాకు.

నీలు (ఇలా పిలుస్తుంటే ఏదో హాయి) వాళ్ళ అమ్మ మా అమ్మని చూసింది. అంతే మా అమ్మని గట్టిగా కావలించుకుని "ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి" అని తెగ ఆనందపడ్డట్టయింది నాకు. "పది" తప్ప ఇంకేది పట్టించుకోలేదు నా మెదడు. ఎక్కక ఎక్కక మొదటి సారి ఎక్కినవాడి విమానం ఎగరగానే హైజాక్ ఐనట్టు తోచింది నా పరిస్థితి. మా అమ్మ నీలుని దగ్గరకి తీసుకుని "చిలకలా ఉంది పిల్ల. ఒక రెండేళ్ళు ఆలస్యంగా పుట్టుండకూడదటే, కోడల్ని చేసుకుందును" అని నవ్వేసింది. అమ్మ సరదాగా అన్నా నిజంగా నా మనసులోని మాట చెప్పింది.

నేను వెళ్ళి గదిలో కూర్చున్నాను. రేడియోలో దాసరి రాఘవేంద్రరావుగారిది పాటేదో వస్తోంది.

"పేడ ఎండితే పిడక అవుతాది. ప్రేమ పండితే పెళ్ళవుతాది.

అది ఎండనీడు ఆ పై వాడు. ఇది పండనీరు ఈ పెద్దోళ్ళు"

ఆ పాట ఎందుకో నా కోసమే వచ్చినట్టు అనిపించింది. గుండె హీటర్‌లా మండింది. ఆ వేడి కళ్ళకి పాకనే కలల మంచుముక్కలు కరిగి, కన్నీళ్ళయి పొంగి పొర్లాయి. బాధ భరించలేక ఇక నుయ్యో, గొయ్యో చూసుకుందామని అనుకున్నాను. నుయ్యయితే పెరట్లోనే ఉందని వెళ్ళబోతుంటే మాడు మీద ఎవరో ఒక బలమైన డిప్పకాయి వేసినట్టు అనిపించింది.

ఉలిక్కిపడి లేచాను. కళ్ళు నులుపుకుంటూ నీలు ఏదీ? నీలు ఎక్కడ అని అంటున్నాను. "నీలూ ఏమిట్రా ఆ సినిమాలు ఎక్కువ చూడద్దురా అంటే వినవాయే. మధ్యాహ్నమనగా అలిగి పడుకున్నావ్. నీ అలక తీర్చడానికి నాన్న అమలాపురం వెళ్ళి కొత్తబట్టలు తీసుకొచ్చారు. ఇదిగో జీన్స్ ప్యాంటు, టీ షర్టు. వేసుకో."

అంతే ఆనందంతో గంతులేశాను. అమ్మా నాన్న కొత్త బట్టలకి నా అలక తీరింది అని ఊపిరి పీల్చుకున్నారు. అసలు సంగతి తెలియక, ఎప్పుడో అప్పుడు నా నీలు దొరికే వీలు ఉందని సంబరపడిపోయి మిగిలిన పండుగని ఆనందంగా జరుపుకున్నా. ఈసారి మాత్రం పెద్దదయినా సరే నా నీలుని వదలకూడదని నిర్ణయించుకున్నాను.

## శ్రీకారం — బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్

**గాఢాంధకారం !**

చక్షువులు ఆకర్ణాంతములు చేసి చూసినా ఏమీ కానరావటం లేదు !

ఏమిటిది ?

ఎక్కడున్నాడు తను ?

వెలుగు రేణువులు లేశమాత్రమైనా లేని ఈ ప్రదేశమేది?

మరుక్షణం కళ్ళుమిరుమిట్లు గొలిపే ప్రచండతేజం అక్కడ ఆవరించింది. అంతటి ప్రకాశాన్ని భరించలేక అతని నేత్రాలు చిట్లిపోయేలా ఉన్నాయి. చప్పున కళ్ళు మూసేసుకున్నాడు. అంతలోనే ఎవరో తన మొర ఆలకించినట్లుగా పంచేంద్రియాలకూ శక్తి సమకూరింది. కళ్ళు విప్పారాయి. కలయజూశాడు.

ఆశ్చర్యం!..అద్భుతం!

శ్వేతవర్ణం చిక్కగా కుమ్మరించినట్లుగా చుట్టూ వెలుగురేఖల జిలుగులు. ఆ జిలుగులు మెల్లగా చెదరిపోతూండగా దివ్యఘంటారావములు మంద్రంగా మ్రోగుతూ ఓంకార నాదం వినిపించింది. మబ్బుల చాటు నుండి మెల్లగా చంద్రుడు ద్యోతకమైనట్లు ఏవో మూర్తులు మొదట అస్పష్టంగా కనిపించి తరువాత పూర్తిగా వెల్లడయ్యాయి.

తొలుత పాదాలు కనిపించాయి. వాడియైన గోళ్ళతో నాగజాతిని చీల్చిచెండాడి, రక్కసి మూకల పాలిట యమపాశాలుగా పరిణమించి, యజమాని దగ్గర వొద్దికగా మెలిగే గరుత్మంతుని పచ్చని పాదాలవి. దిక్కుల పర్యంతం వ్యాపించిన అతని బలమైన రెక్కల మీదుగా జాలువారుతూ, నీలవర్ణశోభితమై, అరుణారుణ ప్రభాసితమై, కస్తూరి చందన జవ్వాది పరిమళభరితమై వొప్పారుతున్నాయి దివ్యపాదాలు. వొక పాదయుగళం గగనాన్ని తన్ని బలిచక్రవర్తికి కైవల్యం ప్రసాదించినదైతే, మరొక జంట సకలసంపదలకూ నిలయమైనది. కొద్దిగా పైన..ఎర్రని కొనదేలిన ముక్కు, నొసటన తిరునామాలు, అగ్నిసమాన ముఖవర్చస్సుతో విలసిల్లుతున్న గరుడుడి ముఖబింబం, వెనుకగా దివ్యకోటీరకాంతులతో శోభాయమానంగా వెలుగుతున్నారు లక్ష్మీనారాయణులు. అమూల్య వజ్రాభరణాలు మేనదాల్చి, రత్నరాశుల జరీకూర్చిన అపరంజి చీర ధరించి కపిలవర్ణకాంతులతో చిరునగవులు చిందిస్తూ జగదేకలలితాంగి, లోకమాత శ్రీదేవి, వామభాగమున

ఆమెను దాల్చి, వొక కరముతో ఆమె నెన్నడుమును చుట్టి,మరో హస్తమున సహస్రాంచుల సుదర్శనం దాల్చి,కుడివైపు చేతులలో పాంచజన్యం,అభయముద్ర కలిగి పీతంబరవస్త్రధారియై సుహాసదీప్తులు విరజిమ్ముతూ శ్రీమహావిష్ణువు. నల్లని కలువరేకుల కళ్ళలో నిఖిలగ్రహరాశులు నిక్షిప్తమై ముత్యాల్లా మెరుస్తున్నాయి. గళసీమను అలంకరించిన కౌస్తుభహారం సూర్యుని కాంతితో పోటీ పడుతూంటే వనమాల విలాసంగా ఊగుతూ వింత సౌరభాలు వెదజల్లుతోంది.

సంభ్రమాశ్చర్యాలతో రెప్పలల్లార్చకుండా అప్పటిదాకా చూస్తున్న తను, వెంటనే తేరుకొని అమందానందసందోహభరితుడై పవిత్రమూర్తులకు సాష్టాంగ ప్రణామాలు చేసి, పైకిలేచి పలువిధాలుగా స్తుతించాడు.

జగదాధారభూతుడైన స్వామి చిద్విలాసంగా నవ్వి

"రాయా!మాకొక ముచ్చట ఉన్నది. తీరుస్తావా? " అన్నాడు.

విస్మయం చెందాడు తను.

"స్వామీ ! సకలజీవకోటి కష్టనష్టాలు తీర్చే దేవాధిదేవుడు నువ్వు. నీ అభయహస్త ఛత్రచ్ఛాయలోనే విశ్వమంతా మనుగడ సాగిస్తోంది. త్రివిక్రముడవైన నీకు తీరని ముచ్చట కూడానా? మానవమాత్రుడనైన నేను ఆ కోర్కె చెల్లించగలనా? అనుజ్ఞ ఇవ్వండి. శక్తివంచన లేకుండా కృషి చేస్తాను."

"మా కోర్కెచిన్నదే రాయా! నువ్వు బహుభాషాకోవిదుడవు. సకలవిద్యావిశారదుడవు. సంస్కృత భాషలో మదాలస చరిత్ర, సత్యభామా పరిణయం, జ్ఞాన చింతామణి, సకల కథాసార సంగ్రహం, రసమంజరి మొదలైన అపూర్వ కావ్యాలు వ్రాశావు. తెలుగులో కూడా ఒక ఉత్తమ కావ్యం వ్రాయి. అదేమంత కష్టసాధ్యం కాదు."

"తెలుగులోనా?!"

"అవును! తెలుగులోనే కన్నడరాయా! తెలుగే ఎందుకంటావేమో, నీవున్నది తెనుగుదేశం. నేను తెలుగు వల్లభుడను. ఇక్కడ భాష తెలుగు. అటువంటి తియ్యని భాష అదొక్కటే. వేరొకటి లేదు. సమస్త సామంతరాజులు, హితులు, సన్నిహితులు, ప్రజలు నిన్ను కొలుస్తూండగా, సభా వ్యవహారాలు నడుపుతూండగా నువ్వు వినే ఉంటావు. దేశభాషలందు తెలుగులెస్స."

" ఆజ్ఞస్వామీ! కానీ నాదొక సందేహం. అనంతమైన నీ లీలావిలాసాలు వర్ణించడం వేయిపడగలుగల ఆదిశేషునికే సాధ్యం కాదు. వాటిలో దేనిని కూర్చి నన్ను కావ్యం వ్రాయమంటావు?".

పన్నీరు చిందిస్తున్నట్లుగా మనోహరంగా నవ్వాడు పరంధాముడు.

"రాయా! చెబుతాను విను! ముందు శ్రీరంగంలో తాను వాడిన మాలలు నాకొసగి నన్ను పెండ్లాడిన చిన్నది గోదా. ఆమె కథను వ్రాయి. ద్వాపరయుగంలో వొక మగవాడు ఇచ్చిన మాలను ఏవతో గ్రహించాను. దానికి పరిహారంగా ఇప్పుడొక జవ్వని, ప్రియురాలు తాను అనుభవించి, విడిచిన మాలలు సంతోషంగా స్వీకరించి, పూలతో బాటూ, పూబోడినీ పరిగ్రహించాను. మాకు ప్రియమారగా, కథను కావ్యంగా మలచి నీ ఇష్టదైవమైన వెంకటేశునికి అంకితమివ్వు. అర్చనారూపాలు, నామాలు వేర్వేరైనా ఇరువురమూ వొక్కటే. నీకు ఉత్తరోత్తరాభివృద్ధి కలుగుతుంది." అని ఆశీర్వదించాడు.

శిరోధార్యమన్నట్లుగా తను భక్తిప్రపత్తులతో తలవంచి ప్రణమిల్లాడు.

పైకిలేవబోతూండగా రెక్కల చప్పుడు వినిపించి అంతలోనే దూరమయ్యింది.

లేచిచూసేసరికి ఎవ్వరూ లేరు !

ప్రణవనాదం ఆగిపోయింది !

సతీసేవకులతో కలిసి ఆంధ్రజలజాక్షుడు అంతర్హితుడైపోయాడు !

తను స్తంభీభూతుడైపోయాడు !

అప్పటిదాకా అక్కడ పరచుకున్న కాంతిపుంజం కనుమరుగైపోయి వడివడిగా చీకట్లు కమ్ముకుంటున్నాయి.తను నిశిథిలోకి నెట్టివేయబడుతున్నాడు.

నిశిథిలోకి..

వడివడిగా..

......

......

విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు దిగ్గున నిద్రలేచి కూర్చున్నాడు. తను ఎక్కడో దివ్యలోకాలలో తేలిపోవటంలేదు.

ఆంధ్రదేశంలోని శ్రీకాకుళాంధ్రమహావిష్ణువు ఆలయ మంటప మధ్యంలో శయ్యాగతుడై ఉన్నాడు. ఇంతవరకూ తను కన్నది విన్నది అంతా స్వప్నమందేనని అతనికికవగతమైంది. తన్మయత్వంతో కన్నులు మూసుకొని చేతులు జోడించి సర్వాంతర్యామియైన రమారమణుడిని మనసారా స్మరించుకున్నాడు. స్వామివారే సాక్షాత్కరించి అనేకమైన తన లీలలు, గాథల్లోంచి ఒకదాన్ని ఏరి, కావ్యంగా మలచమని ఆదేశిస్తే అంతకంటే తన జన్మకు సార్థకత ఏముంది? ఎన్ని జన్మల పుణ్యఫలమిది? ఎందరికి దక్కే భాగ్యమిది?

రాత్రి నాల్గవజాము గడుస్తోంది. నల్లని వేణీభరముపై నిగనిగలాడే చుడామణిలా విశాలగగనంలో వెన్నెలరాజు వింతసోయగాలు పోతున్నాడు. ఆలయ మండపమంతా ఆక్రమించి మెత్తని పడకలు, తలగడలు పరచుకుని అమాత్యులు,ఇతర ముఖ్యపరివారం గాఢనిద్రలో ఉన్నారు. రాయలు మంటపం దాటి బయటికి వచ్చాడు. అతని నిద్ర పటాపంచలైపోయింది. అవ్యక్తానుభూతి అతని మనస్సుని పట్టి ఊపేస్తోంది. నిన్నమొన్నటి దాకా జరిగిన సంఘటనలన్నీ వనమయూరాలై అతని మనోఫలకంపై పురివిప్పి నాట్యమాడాయి.

కళింగ దండయాత్రలో భాగంగా అనేక దుర్గాలను జయిస్తూ వచ్చి బెజవాడ చేరుకున్నాడు తను. కొద్దిరోజుల్లో వైకుంఠ ఏకాదశి. వైష్ణవులకు పరమపవిత్రమైన పండుగ. తను స్వయంగా విశిష్టాద్వైతి. పూజాదికాలు సల్పి ఉపవాసం చెయ్యడానికి వీలుగా దగ్గర్లోని వైష్ణవాలయం గురుంచి వాకబు చెయ్యగా సమీపానే కృష్ణానది తీరానగల శ్రీకాకుళం గ్రామాన్ని, అక్కడ వెలసిన ఆంధ్రమహావిష్ణువు ప్రాభవాన్ని పూసగుచ్చినట్లు వివరించారు దండనాథులు. వల్లభదేవుడనే రాజు పూర్వం ప్రాంతాన్ని సర్వజనరంజకంగా పరిపాలించాడట. రాజు సాక్షాత్తూ నారాయణాంశే అని నమ్మిన జనులు, ఆయన తదనంతరం ఒక ఆలయం నిర్మించి ఆ మూర్తిని ఆంధ్రమహావిష్ణు అని పిలుచుకున్నారట. అందుకే ఎక్కడాలేని విధంగా ఆ గుడిలో విష్ణుమూర్తి విగ్రహానికి మీసాలుంటాయి. కథ విన్నాక మరో ఆలోచనకు తావీయకుండా తన పరివారాన్ని అటువైపు నడిపించాడు తను. మహామంత్రి తిమ్మరుసు విడది ఏర్పాట్లను పర్యవేక్షించాడు.

మరుసటిరోజు వైకుంఠ ఏకాదశి. తను వేకువజామునే నిద్రలేచి వొళ్ళంతా నువ్వులనూనె పులుముకొని, చాలాసేపు కత్తిసాము, గుర్రపుస్వారీ చేసి, స్వేదంతో తడిసిముద్దైన మీదట స్నానమాచరించి మంగళవస్త్రధారియై దేవేరులైన తిరుమలదేవి, చిన్నాదేవిలను తోడ్కొని, అప్పాజి ఇతర ఆంతరంగిక పరివారం వెంటరాగా ఆలయానికి బయలుదేరాడు. మంగళవాయిద్యాలు మ్రోగుతూండగా, బ్రాహ్మణోత్తములు శాస్త్రోక్తంగా దీవిస్తూండగా, పురజనులు, ప్రముఖులు వీధులలో బారులు తీరి ఘనస్వాగతం పలికారు. తను ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శనం చేసుకొని, మేలిమి పట్టువస్త్రాలు, తులసిమాలలు, ఫలపుష్పాదులు సమర్పించాడు. గుడిమాన్యంగా ఐదు గ్రామాలను దానం చేశాడు. పండితోత్తములు నటగాయకుల నడుమ పగలంతా పురాణప్రవచనం వింటూ, భక్తిగీతాస్వాదనం చేస్తూ ఉపవాసం ఉన్నాడు. రాత్రి బాగా పొద్దుపోయాక, పాలూ పళ్ళు సేవించి అందరూ మండపంలోనే నిద్రకుపక్రమించారు.

చతుర్థయామంలో కలవచ్చింది.

రాయలు పచార్లు చేస్తూ ఆలోచనాస్రవంతిలో మునిగిపోయాడు. ఎన్నో ప్రశ్నలు ఉత్తుంగతరంగాలై అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆంధ్రమహావిష్ణు స్వయంగా పరతెంచి వచ్చి తెలుగులో కృతి సల్పమనడానికి కారణమేమిటాయని వితర్కించాడు. గడుసుగా స్వామివారు తనను 'కన్నడరాయా' అని సంబోధించారు కానీ, తెలుగు తనకు అన్యభాషేమీ కాదే మాతృభాషే కదా! తల్లి నాగులాంబ అచ్చమైన తెలుగింటి ఆడపడుచు. శ్రీకాళహస్తి దగ్గర్లోని ఓ కుగ్రామం ఆమెది. వీరాగ్రేసరులైన తన తాతతండ్రుల మూలాలు కన్నడసీమలోని తుళునాడుకు చెందినవైనా, వారు కొలువు చేసి వినుతి కెక్కింది చంద్రగిరి సింహాసనాధీశుడు సాళువ నరసింహరాయలు దగ్గరే. అన్నదమ్ములతో తను ఆడుకున్నది, సాముగరడీలు చేసి, శస్త్రవిద్యలు నేర్చినది చంద్రగిరిలోనే. సకల రాజవ్యవహారాలు తెలుగుభాషలో నడుస్తున్నాయి. అల్లసాని పెద్దనాది కవివరేణ్యులు అష్టదిగ్గజాలై భువనవిజయంలో కొలువుదీరి పదకవితా పారిజాతాలతో ఆంధ్రసరస్వతిని ఆరాధిస్తున్నారు. తెలుగుభాష గురించి, ఆ భాష యొక్క తియ్యందనము గురించి తనకు తెలియదా? చూడగా చూడగా ఇది ఆంధ్ర మధుమథనుడు తనకు సుతిమెత్తగా వేసిన చురకలా ఉంది.'సంస్కృత భాషలో కావ్యాలు వ్రాసిన నువ్వు మాతృభాషైన తెలుగును విస్మరించావా? ఆ భాషలో ఒక మనోజ్ఞమైన ప్రబంధం లిఖించే తీరికా వోపికా నీకు లేవా? ' అని నిష్ఠూరమాడినట్లు ఉంది. అందుకే ఆ దిశగా మార్గదర్శనం గావించారు. కోరినవారికి కోరిన రూపంలో వరాలొసగే వేలుపు వరాహమూర్తిని ఆరాధించే తనకు వరాహక్షేత్రమైన శ్రీవిల్లిపుత్తూరు గాథనే కథావస్తువుగా అనుగ్రహించారు.

వైష్ణవమతంతో తుళువంశీయుల హృదయసంబంధం ఈనాటిది కాదు. తన తండ్రి నరసనాయకుల కాలంలో, అహోబిలమఠం తొమ్మిదవ పీఠాధిపతి పరాంకుశదేశికన్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శ్రీవైష్ణవాన్ని ఆయనకు ప్రసాదించాడు. గురుతుల్యులైన తాతాచార్యుల వారు, వ్యాసతీర్థుల వారు పరమాత్మతత్వాన్ని బోధిస్తూ ఈనాడు తనకండగా నిలబడి తండ్రి అడుగుజాడల్లో తనను నడిపిస్తున్నారు. అసలు శ్రీవైష్ణవాన్ని వేదాల రూపంలో గానం చేసి దానికి ప్రాచుర్యం కల్పించిన వారు ఆళ్వారులు. ఆళ్వారు అంటే ఐహికమైన విషయాలపై తృణీకారభావం కలిగి, సదా పరాత్పరుని భక్తిసేవాతత్పరతలో మునిగి ఉండేవారని అర్థం. వారిది తమిళదేశం. మొత్తం పన్నెండు మంది. ఆదిమధ్యాంతరహితుడైన శ్రీమహావిష్ణువు ఆయుధాలు, కౌస్తుభం, వనమాల, వక్షంపై వెలసిన శ్రీవత్సమనే మచ్చ, భూదేవి, పరివార ప్రముఖులు గరుడుడు, విష్వక్సేనుడు....వీళ్ళే ఆళ్వారులుగా ప్రభవించి వైష్ణవాన్ని సముసముద్ధరించారని అంటారు. వీరిలో ఇద్దరి చరిత్రే గోదాకళ్యాణం. కథానాయకుడు శ్రీరంగనాథుడు,నాయుక గోదా.

శ్రీవిల్లిపుత్తూరులో గరుడాంశలో జన్మించిన హరిభక్తుడు విష్ణుచిత్తుడనే బ్రాహ్మణుడు. అతనికి తులసికోట వద్ద లభించిన పాపాయి గోదాదేవి. ఆమె భూదేవి అవతారం. భగవత్ కైంకర్యం కోసం తండ్రి సిద్ధం చేసిన పూమాలలు తను ముందుగా ధరించి, నూతిలో తన ప్రతిబింబం చూసుకుని మురిసిపోయి మళ్ళీ వాటిని పూలసజ్జలో పెడుతూంటుంది. ఈ విషయం తెలియని విష్ణుచిత్తుడు అవే మాలలు స్వామివారికి అర్పిస్తూ సేవిస్తూంటాడు. ఒకనాడు కూతురి నిర్వాకం ప్రత్యక్షంగా చూసి ఆమెను మందలిస్తాడు. అపచారం జరిగిందని క్రుంగిపోతాడు. రాత్రి శ్రీరంగనాథుడు అతని కలలో కనిపించి గోదాదేవి వాడిన పూమాలలే తనకు సమర్పించాలని, అవి తనకు అత్యంత ప్రీతిపాత్రమని, ఆమె కారణజన్మరాలని వివరిస్తాడు.

కృష్ణభక్తురాలైన గోదా, అతనినే వరునిగా భావించి ధనుర్మాసంలో ముప్పది పాశురాలు గానం చేస్తుంది. ఆమె కోర్కెవిని విష్ణుచిత్తుడు 108 దివ్యదేశాలు, అక్కడి అర్చనామూర్తుల కళ్యాణ గుణగుణాలు వర్ణిస్తాడు. ఆమె శ్రీరంగనాథున్ని కోరుతుంది. విష్ణుచిత్తుడు చేష్టలుడిగిపోగా, ఆ రంగడే అతనికి ధైర్యవచనాలు చెప్పి, తన సేవకులను పంపి, ఆమెను పెండ్లాడి తనలో ఐక్యం చేసుకుంటాడు. నవభక్తిరీతులకు ప్రతీకైన అటువంటి ఉత్కృష్టమైన కథను సూచించడంలోనే స్వామివారి ఆంతర్యం బోధపడుతోంది.

అయితే, చిన్నకథతోనే మహాకావ్యం వ్రాయటం అసాధ్యం. ఎన్ని పరిమళభరిత పుష్పాలు గుచ్చినా దారం చిన్నదైతే హారానికి విలువుంటుందా?అలాగే ఎన్ని ఉత్ప్రేక్షలు, ఉపమానాలు జోడించినా కథావస్తువు చిన్నదైనప్పుడు కావ్యం పలుచనవుతుంది. దుర్నిరీక్ష

విజయాలు లభ్యమై సామ్రాజ్యం సుసంపన్నమవడంతో ప్రజలలో భోగలాలస పెరిగి మెల్లగా పెడదారుల ఊబిలో కూరుకుపోతున్నారు. వారిని రక్షించి మోక్షమనే ఆవల తీరానికి చేర్చాలంటే బలమైన తాడులాంటి ఆధారం అవసరం. ఆ తాడు తన కృతి ఎందుకు కాకూడదు? కానీ గట్టి తాడు తయారవ్వాలంటే ఎన్ని పురికొసలు ముడిపడాలి? తన దగ్గర గోదాకళ్యాణమనే పురికొస వొకటుంది. అటువంటివే మరికొన్ని కలిస్తే శక్తివంతమైన కావ్యం రూపొందుతుంది. రాయలు పర్యాలోచించాడు. వరాహపురాణంలో పంచముడై జన్మించి కేవలం హరినామసంకీర్తనతో బ్రహ్మరాక్షసి బారి నుండి బయటపడి దివ్యత్వం పొందిన మాలదాసరి కథ అతనికి జ్ఞప్తికి వచ్చింది. అంతర్లీనంగా మానవశరీరాలలోకి చొచ్చుకుపోయి అనర్థాలకు దారితీస్తున్న జాత్యహంకార జాడ్యానికి ఇదే సరైన ఔషదం. ఇటువంటి దివ్య ఔషదాలే విష్ణుపురాణంలో అష్టాంగయోగాన్ని వివరించే ఖాండిక్యకేశిధ్వజ సంవాదం, గురుపరంపరలో భగవంతుని పంచస్వరూపాలు పరిచయం చేసి విశిష్టాద్వైతాన్ని విపులీకరించిన యామునాచార్యుని వృత్తాంతాలు. వీటినన్నిటినీ ప్రధాన కథతో మేళవించి భగవదనురక్తిని రగిలించే అమూల్యమైన కావ్యం వ్రాస్తే ఇటు కావ్యౌచిత్యం అటు సమాజశ్రేయస్సు రెండూ పెంపొందుతాయి.

కథావస్తువు కుదిరింది సరే! మరి పేరు? ఎన్ని ఉపకథలున్నా ముఖ్యకథ గోదాపరిణయమే. శ్రీమహావిష్ణువే ఎన్నుకున్న కథ అది. తమిళంలో గోదాను 'సూడికుడుత్తు' అంటారు. దానినే అనువదించాడు రాయలు.'ఆముక్యమాల్యద'. ఆహా! అమోఘమైన పేరు. తన కృతికి చక్కని నామధేయం కుదిరింది.

అనుమానాల అడ్డుకట్టలు తొలగిపోయి కృష్ణరాయల హృదయాంతరంగం ఉత్సాహంతో పరవళ్ళు త్రొక్కింది. ఉద్విగ్నతతో శరీరం పూలతెప్పలా తేలిపోతుండగా అతనొక నిర్ణయానికి వచ్చాడు.

భానోదయమైంది. రాయలు కృష్ణతీరం చేరి నదిలో మునక వేశాడు. శీతాకాలపు ప్రత్యూషాన విచ్చుకత్తుల్లా గుచ్చుకొని వొళ్ళు ఝల్లుమనిపించాల్సిన ప్రవాహజలాలు విచిత్రంగా గోర్వెచ్చగా ఉన్నాయి. అతను అచ్చెరువొందాడు. అంతలోనే అతని పెదవులపై చిరునవ్వు లాస్యం చేసింది. లోక కళ్యాణార్థం ద్వాపరయుగాన దేవదేవుడైన శ్రీకృష్ణుడు నిశిరాత్రి వేళ, తండ్రి వసుదేవుని శిరస్సుపై గోకులానికి బయలుదేరి, యమునాతీరం చేరుకున్నప్పుడు, ఆజ్ఞాబద్ధురాలైన యమున కెరటాలన్ని లోనికి లాక్కొని దారినిచ్చిందట. అలాగే ఉపవాసదీక్షతో కాస్త నీరసించి, భగవత్ ప్రేరిత కృత్యారంభ సంసిద్ధమైన తన దేహాన్ని శీతలజలాలతో వేధించకుండా, లేలేత సూర్యకిరణాలతోనే నీటిని వేడి చేసి కృష్ణమ్మ కూడా తనకు ఇతోధిక సాయం చేసింది. స్నానం చేసి, సంధ్యావందనమాచరించి గట్టు చేరేసరికి ధవళ వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, ఆభరణాలు సిద్ధం చేసిన పరిచారకులు, వారితో పాటూ దండనాథులు, మహామంత్రి తిమ్మరుసు కనిపించారు.

తిమ్మరుసును చూడగానే కృష్ణరాయల ముఖం వికసించింది. తండ్రి తర్వాత అంతటి వాడాయన. ఆయన దగ్గర తను దాచిన రహస్యాలు ఏమీ లేవు.

రాయలు ముఖారవిందం చూసి ఏదో మార్పునూహించిన ఆయన

"రాయా! ఏమిటీ పరధ్యానం ? ఏదైనా విశేషమా ?" అని ఉత్సుకతతో అడిగారు.

కృష్ణరాయల మోముపై దరహాసవీచిక వీచింది. ఉత్తరీయంతో మేను తుడుచుకుంటూ "భగవంతుని సాక్షాత్కారం లభించింది అప్పాజీ " అని జరిగినదంతా తెలియజేశాడు.



సాహితీ సమరాంగణ అక్షర కృషికి సాక్ష్యం..
ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని ఆముక్తమాల్యద మండపం

అప్పాజీ సంతోషించి "శుభం ! ప్రభాతాన వచ్చే కల ఫలిస్తుందంటారు. హిత పురోహిత పండిత సమావేశం ఏర్పాటు చేసి వారి ఆశీర్వాదం కూడా పొందు" అన్నారు.

"సరిగ్గా మా మనస్సులోని మాట చెప్పారు అప్పాజీ!ఈ రోజు ద్వాదశి. విష్ణువుకు ప్రియమైన తిథులలో ఇదీ ఒకటి. స్వామిని అర్చించి నిండుకొలువు దీర్చి, పండితుల దీవెనలు పొంది ఆలయమండపంలోనే కావ్యాన్ని ప్రారంభిస్తాను. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయండి" ఆనందంతో అన్నాడు రాయలు.

అన్నట్లుగానే మరోసారి ఆంధ్రమహావిష్ణువును భక్తిప్రపత్తులతో పూజించి, విద్వజ్జనులు, కవిపుంగవులతో సభను సమావేశపరచి స్వప్నవృత్తాంతమంతా తెలియజేశాడు రాయలు.

అందరూ హర్షాతిరేకాలు వెల్లిబుచ్చారు. రాయలు వంశచరిత్రను కీర్తించి, యుద్ధసమయాన తెలవారుతూండగా వచ్చిన దివ్యస్వప్నం రాబోయే దిగ్విజయాలకు శుభసూచకమని,అంతా మేలు జరుగుతుందని దీవించారు అష్టైశ్వర్యాలు కలగాలని ఆశీస్సులు పలికారు.

శ్రీకృష్ణదేవరాయలు పరమానందభరితుడై సభాసదులకు వినమ్రంగా నమస్కరించి, తన ఇలవేల్పైన వేంకటరమణున్ని స్తుతిస్తూ కావ్యారంభం చేశాడు.

అతని జీవితంలో ఒక మధురఘట్టం అది !

ఆంధ్ర సాహితీ చరిత్రలో అపురూప క్షణం అది !

భావితరాలు గర్వించే ఒక మహత్తర కావ్యానికి శ్రీకారం అలా జరిగింది.

❁ ❁ ❁



**లోకేష్ శ్రీకాంత్‌గారు** బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ప్రవృత్తి కథలు, కవితలు వ్రాయడం. వ్రాసిన ఐదుకథల్లో ప్రచురణకు నోచుకున్న మూడవ కథ ఇది. మొదటి కథ ఆంధ్రభూమి మాసపత్రికలో, రెండవ కథ తెలుగురత్న.కామ్‌లో ప్రచురితం అయ్యాయి. **http://bhava-nikshipta.blogspot.com/** అనేబ్లాగులో తన మనసులోని భావాలని పంచుకుంటూ ఉంటారు.

# ప్రాయశ్చిత్తం -ఎమ్.రమేష్ కుమార్

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**సమయం మధ్యాహ్నం** రెండు గంటలవుతోంది. బస్ దిగిన కృష్ణమూర్తికి ముందుకు అడుగువెయ్యాలంటే బెరుగ్గా అనిపించింది. ఇది తన సొంత ఊరు.. తను ఎన్నో ఏళ్ళు గడిపిన ఊరు.. అవన్నీ ఇప్పుడు పాత జ్ఞాపకాలు.. మళ్ళీ ఎంతోకాలం తర్వాత సరిగ్గా చెప్పాలంటే పన్నెండేళ్ళ తర్వాత మళ్ళీ తనిక్కడికొచ్చాడు. కృష్ణమూర్తి నెమ్మదిగా ఊళ్ళోకి నడక సాగించాడు.

నడుస్తూంటే దారి పొడవునా ఎవరెవరో ఎదురొస్తున్నారు. కానీ కృష్ణమూర్తి తననెవరూ గుర్తుపట్టకూడదు అన్నట్టుగా తలొంచుకుని నడుస్తున్నాడు. "అయినా తన పిచ్చిగానీ తననెవరు గుర్తుపడతారు? ఊరి దృష్టిలో తనెపుడో చనిపోయాడు. అందరూ ఎప్పుడో మర్చిపోయి ఉంటారు. బహుశా.. తన కుటుంబ సభ్యులు కూడా.." అనుకున్నాడతను.

"ఒక్కసారి భార్యాబిడ్డల్ని కళ్ళారా చూడాలి. వాళ్ళ పరిస్థితి ఏమిటో, ఎలా బ్రతుకుతున్నారో తెలుసుకోవాలి. వాళ్ళు బాగుంటే అంతే చాలు. తను మళ్ళీ పాత స్థానానికి వెళ్ళిపోతాడు. మరింక ఎప్పుడూ ఇక్కడికి రాడు..!" కృష్ణమూర్తి ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు. పెరిగిన గడ్డాలు, మీసాల్తో అతనో స్వామీజీలా ఉన్నాడు.

సందు మలుపు తిరగ్గానే రోడ్డుకి అవతలి పక్క ఎదురుగా తనిల్లు కనబడింది. అదే ఇల్లు.. పన్నెండు సంవత్సరాల్లో ఏ మార్పూలేదు. సున్నం వేయించక రంగు వెలిసిపోయినట్టుంది. అంతే. రెండు పోర్షన్లలో కుడివైపు పోర్షన్ అన్నయ్యది.. ఆ పోర్షన్ అతనెప్పుడో అమ్మేసుకుని వెళ్ళిపోయాడు.

రోడ్డుకి ఇవతల తనింటికెదురుగా ఉన్న బడ్డీ కొట్టు దగ్గర చెక్కబల్ల మీద కూర్చున్నాడు కృష్ణమూర్తి. ఓ సోడా అడిగి తీసుకుని నెమ్మదిగా తాగసాగాడు. మధ్య మధ్యలో తనింటి వైపు చూడసాగాడు. ఎవరైనా బైటకొస్తారేమోనని అతని ఆశ.

సోడా తాగడం పూర్తయినా ఇంకా అక్కడే కూర్చున్నాడు కృష్ణమూర్తి. అతని నిరీక్షణ ఫలించింది. సుధ బైటకి వచ్చింది. బైట కట్టి ఉన్న తీగ మీద చీర ఆరవేయసాగింది. కృష్ణమూర్తి ఎదురుగా కనిపిస్తున్న భార్యవైపు తదేకంగా చూడసాగాడు.

సుధను చూస్తూంటే ఎవరో కొత్త మనిషిని చూస్తున్నట్లుగా ఉందతనికి. బొట్టులేని ఆమె మొహం కళావిహీనంగా ఉంది. మనిషి బాగా సన్నబడింది. జీవిత పోరాటంలో అలిసిపోయినట్టుగా కనబడుతోంది.. అవును.. జీవితాంతం తోడుగా ఉండాల్సిన తాను ఆమెని ఒంటరిని చేసి అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు.

అపరిచితంగా కనిపిస్తున్న కృష్ణమూర్తిని ఎవరితను అన్నట్లుగా చూస్తున్న బడ్డీ కొట్టు వాణ్ణి గమనించి అక్కణ్నుంచి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడై లేచాడు కృష్ణమూర్తి.

సరిగ్గా అదే సమయంలో ఇంటిలోపల్నుండి "అమ్మా!.." అని పిలుస్తూ వచ్చిందో అమ్మాయి. కృష్ణమూర్తి సంభ్రమంగా చూసాడామె వంక. సందేహం లేదు.. అమృత .. తమ పాప.. పదేళ్ళ వయస్సులో చూశాడు... మళ్ళీ ఇప్పుడు! ఎంత పెద్దదైంది..! కొన్ని క్షణాలు అలాగే చూస్తూ ఉండిపోయిన కృష్ణమూర్తి తెప్పరిల్లి అక్కణ్నుంచి కదిలిపోతూ.. వెనుతిరిగి మళ్ళీ మళ్ళీ వాళ్ళ వంకే చూస్తూ, కళ్ళనిండుగా వాళ్ళని నింపుకుని, వచ్చిన దారి వెంటే నడకసాగించాడు.

కృష్ణమూర్తి మనసు నిండా ఎన్నో ప్రశ్నలు.. తన ఉద్యోగం ఏమైందో? సుధకి ఇప్పుడు ఆధారం ఏమిటి? తనెలా జీవిస్తోంది? అమృత చదువు ఏమైంది? తనకి పెళ్ళైందా! అయితే తన జీవితం ఎలా ఉంది? అన్నీ ప్రశ్నలే.. సమాధానం లేని ప్రశ్నలు.. ఎవర్నైనా అడుగుదామన్నా తన అవతారం చూసి ఎవరికైనా అనుమానం వస్తుంది. ఈ వివరాలన్నీ నీకెందుకు.. నువ్వెవరంటూ అడుగుతారు. ఎవరైనా తనని గుర్తుపట్టే ప్రమాదం కూడా ఉంది.

"సుధతో పదమూడేళ్ళ కాపురం తర్వాత ఆమెని, పాపని విడిచి వెళ్ళిపోయాడు తాను. తను వెళ్ళి పన్నెండు సంవత్సరాలు గడిచాయి. తనకిప్పుడు యాభై ఏళ్ళుదాటాయి. సుధ, అమృతల జీవితాల్లో వచ్చిన మార్పులేమిటో తనకి తెలీదు.." నడుస్తూనే ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి. ఎదురుగా రామమందిరం కనబడింది. మెట్లెక్కి విశాలంగా ఉన్న ఆ మందిర ప్రాంగణంలో ఓ స్థంభం చాటుగా ఎవరూ గమనించని విధంగా కూర్చున్నాడు స్థంభానికి చేరబడి విశ్రాంతిగా కళ్ళుమూసుకున్న అతనికి పాతరోజులు కళ్ళముందు కదలాడాయి.

తన చిన్నప్పుడే అమ్మా నాన్నలు గతించారు. ఇద్దరు అన్నదమ్ముల్లో తనే చిన్నవాడు. అన్నయ్య దగ్గరే పెరిగాడు. తల్లిదండ్రుల ఆలనాపాలనా లోపించడం వల్లనో ఏమిటో తను చిన్నప్పటినుండే మొండిగా, పొగరుగా తయారయ్యాడు. ఇంటర్ పూర్తయినాక డిగ్రీ చదవడం కోసం పట్నంలోని హాస్టల్లో జాయినయ్యాడు. అక్కడే చెడుస్నేహాలు మొదలయ్యాయి. ఆ వయసులోనే సిగరెట్, తాగుడులాంటి వ్యసనాలు అలవడ్డాయి. దాంతో డిగ్రీ పూర్తికాలేదు. తన పరిస్థితి చూసి అన్నయ్య తనను గట్టిగా మందలించి, మండల కేంద్రంలో ఆయన పనిచేస్తున్న రెవిన్యూ ఆఫీసులోనే తనను కాంట్రాక్ట్ గుమస్తాగా చేర్పించాడు. అన్నయ్యకీ, తనకీ వయసులో ఎనిమిదేళ్ళ తేడా ఉండడంతో తను అన్నయ్యకి భయపడేవాడు.

రెండు సంవత్సరాల తర్వాత ఆ ఉద్యోగం పర్మినెంట్ అయ్యింది. అయితే తాగుడు అలవాటు మాత్రం పోలేదు. అన్నయ్యకి తెలియకుండా తాగేవాడు. ఉద్యోగం పర్మనెంట్ అయ్యాక జీతం పెరగడంతో తాగుడు మోతాదు పెరిగి అన్నయ్యకు దొరికిపోయే పరిస్థితి ఏర్పడింది.

పెళ్ళిచేస్తేనన్నా వీడు దార్లోకి వస్తాడని భావించి, తనకు సంబంధం చూసి పెళ్ళిచేసాడు అన్నయ్య. సుధ తన జీవితంలోకి వచ్చింది. రెండో పోర్షన్‌లో అద్దెకుంటున్న వాళ్ళని ఖాళీ చేయించి, తనను సుధను అందులో ఉండమన్నాడు. దాంతో తనకి స్వేచ్ఛ వచ్చినట్టయ్యింది. పెళ్ళయిన కొద్దికాలం తాగుడికి దూరంగా ఉన్న తను మళ్ళీ మొదలుపెట్టాడు. ఈసారి ఆ అలవాటు మరీ ఎక్కువైపోయింది. అన్నయ్యకు కూడా భయపడడం మానేశాడు. ఒక్కొక్కసారి తాగి పడిపోయేవాడు.. ఎవరో ఇంటికి మోసుకొచ్చేవారు. సుధ ఏడ్చింది.. మొత్తుకుంది.. అన్నా వదినలు ఎంతగానో నచ్చజెప్పారు.. ఫలితం శూన్యం..

ఒకసారి తాగిన మత్తులో అన్నయ్యని "నా విషయంలో కలగజేసుకోవడానికి నువ్వెవడివని" అడిగాడు... దాంతో అన్నా వదినల మనసు విరిగిపోయింది. తను తాగి పడిపోతుండటంతో ఊళ్ళో తిరగడానికి అన్నయ్యకి అవమానంగా అనిపించేది. కొద్దికాలానికే ఆయన కావాలని ట్రాన్స్‌ఫర్ చేయించుకుని, తన పోర్షన్ ఇల్లమ్మేసుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు మళ్ళీ జీవితంలో ఎప్పుడూ తన మొహం చూడననీ, ఈ ఊరి వైపుకు కూడా రాననీ చెప్పివెళ్ళిపోయాడు.

ఆ సమయంలోనే అమృత పుట్టింది. పాప పుట్టాక కూడా తనలో ఎటువంటి మార్పూ రాలేదు. అప్పుడే బదిలీ మీద వచ్చిన కేశవరావు తమ ఆఫీసులో జాయినయ్యాడు. తన పక్క సీటే కావడంతో స్నేహం కలిసింది తనతో తాగుడు మాన్పించాలని కేశవరావు ఎంతో ప్రయత్నించేవాడు. పట్నంలో ఉన్న అతను అద్దెలు భరించలేక తమ ఊరికే వచ్చి ఓ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డాడు.

కేశవరావు అప్పుడప్పుడు తమ ఇంటికి వచ్చేవాడు. సుధని చెల్లెమ్మా.. అంటూ ఆప్యాయంగా పిలిచేవాడు. సుధ కూడా అతనిని ఎంతో గౌరవించేది. అమృతని ఎంతో ముద్దుచేసేవాడు.

కాలం గడుస్తున్నాగానీ తన ప్రవర్తనలో ఎటువంటి మార్పూ రాలేదు. చివరికి కేశవరావు, సుధ కలిసి తనను బైట తాగొద్దనీ, ఆ తాగేదేదో ఇంటికే తెచ్చుకుని తాగమని చెప్పి ఒప్పించారు. అప్పుడప్పుడు తను బైట తాగి పడిపోతుండడం సుధకెంతో అవమానంగా ఉండేది. తను కూడా వాళ్ళు చెప్పినదానికి ఒప్పుకున్నాడు. కొంతకాలం పాటు అలాగే సాగినా మళ్ళీ పాతమిత్రుల ఒత్తిడితో బైట తాగిరావడం మొదలయింది. సుధ వద్దని చెప్పే కొద్దీ తను మరింత రెచ్చిపోవడం మొదలుపెట్టాడు.

జీతం డబ్బులు సరిగ్గా ఇంటికి ఇవ్వకపోవడంతో సుధ ఇంటి ఖర్చులకి చాలక ఇబ్బంది పడేది. తనను అడిగి అడిగి విసిగిపోయిన ఆమె, ఒకసారి తనపై అధికారిని కలిసి పరిస్థితి చెప్పింది. సుధ చెప్పింది విని, ఆయన జాలిపడి ఆ నెల నుంచి జీతం తీసుకొనే రోజున సుధను కూడా తీసుకుని వస్తేనే జీతం ఇమ్మని, అదికూడా ఆమె చేతికే ఇమ్మని ఆదేశాలు ఇచ్చాడు. దాంతో తను ఇరుకున పడ్డాడు. ఆ నెల నుంచి తనకు చాలా ఇబ్బందైంది. తన చేత దెబ్బలు తిన్నాగానీ సుధ డబ్బులు మాత్రం ఇచ్చేదికాదు.

ఇలాక్కాదని చెప్పి ఆఫీసుకు వెళ్ళడం మానేశాడు తను. కేశవరావు తనకు ఎంతో నచ్చచెప్పాలని చూశాడు.. కానీ తను మొండిపట్టు వీడలేదు. సెలవు లేకుండా ఉండిపోవడంతో ఆ నెల జీతం రాలేదు. ఇదేమని అడిగిన సుధను ఇష్టమొచ్చినట్టు కొట్టేడు. ఇదంతా చూస్తూ అమృత అల్లల్లాడిపోయేది. కానీ తాగుడుకు బానిసనై తను అదేమీ పట్టించుకోలేదు.

సుధ ఇంక తన ప్రవర్తన సహించలేక ఊరి పెద్దల ముందు తన గోడు చెప్పింది. ఊరి ఆనవాయితీ ప్రకారం పంచాయితీకి పిలిచారు. ఊళ్ళో చాలామందితో పాటు సుధ తల్లిదండ్రులు కూడా పంచాయితీకి హాజరయ్యారు. "నా దురలవాటు మానితే చాలనీ, విడిపోవాలనుకోవడం లేదనీ" సుధ చెప్పింది.

పంచాయితీ పెద్దలు తనను తీవ్రంగా మందలించి బుద్ధిగా ఉద్యోగం చేసుకొమ్మనీ, మళ్ళీ సుధ ఒంటిమీద చేయి చేసుకుంటే తగిన శాస్తి జరుగుతుందనీ, ఊళ్ళో చెట్టుకు కట్టి చెప్పుదెబ్బలతో సత్కరిస్తామని చెప్పి తీవ్రంగా హెచ్చరించారు.

జరిగిన దానికి తను అవమానంతో రగిలిపోయాడు. కోపంతో నిలువెల్లా దహించుకు పోయాడు. ఆ కోపం ఎవరిమీద చూపించాలో అర్థంకాలేదు. ఊరి  పెద్దలిచ్చిన భరోసాతో కాబోలు.. ఆ రోజు సుధ నిశ్చింతగా నిద్రపోతోంది. తనకు మాత్రం అది కాళరాత్రే అయ్యింది. అనేక రకాల ఆలోచనలు. కోపంలో అసహనంలో తన ఆలోచనలు వక్రంగానే సాగాయి. అర్ధరాత్రి దాటాక ఒక నిశ్చయానికొచ్చాడు. తను చావాలి.. అంతే! చస్తేనే సుధకు తెలిసొస్తుంది. ఇంత అవమానం తను భరించలేడు. రేపట్నుంచి ఊళ్ళో తిరగలేడు. ప్రతివాడూ తననే హేళన చేస్తున్నట్టూగా ఉంటుంది.

తన గురించి కానీ, తన శవం గురించి కానీ వెతకవద్దని, తను లేకుండా ఇంక హాయిగా బ్రతకమనీ రాసిన ఉత్తరం టేబుల్ మీద పెట్టాడు. ఏం చేస్తున్నాడో తెలీని ఉద్రేకంతో ఇంటినుండి బైటపడి చీకట్లోకి బయలుదేరాడు. గమ్యం లేకుండా నడుస్తూ రైలు పట్టాల దగ్గరికి వచ్చాడు. రైలు కిందపడి చావాలనే ఆలోచన రాలేదు. ఎందుకంటే తను ఆ ఊళ్ళో చావాలనుకోలేదు.. తన చావు గురించి ఎవరికీ తెలియకూడదు. తన శవం కూడా ఇక్కడికి రాకూడదు.. అదీ తన ఆలోచన.

అదే సమయంలో ఓ గూడ్సు రైలు సిగ్నల్ లేక కాబోలు అక్కడ ఆగింది. తనకోసమే అన్నట్టుగా ఆగిన గూడ్సు మీదకి ఎక్కాడు. మూడు గంటల ప్రయాణం తర్వాత తెల్లవారు ఝాము అవుతుండగా బండి ఓ వంతెన మీదగా ప్రయాణించింది. ఆ వెంటనే వచ్చిన స్టేషన్లో బండి బాగా స్లో అవడంతో దిగిపోయాడు. అప్పటికే ఏం చేయాలో తను నిర్ణయించుకున్నాడు. స్టేషన్ బైటకొచ్చి నడవడం ప్రారంభించాడు. ఓ అరగంట నడక తర్వాత మొత్తానికి రోడ్ బ్రిడ్జి మీదకు చేరగలిగాడు.

బ్రిడ్జి పై నుంచి క్రిందకు చూసాడు. నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దూకితే శవం కూడా దొరకదు అనుకుంటూ అంచుకు చేరుకున్నాడు. అయితే అప్పటికే తనలో భయం ప్రవేశించింది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం పట్టు జారిపోవడం మొదలైంది. బ్రిడ్జి అంచున నిలబడి క్రిందకు చూస్తూ తటపటాయిస్తున్న తన భుజం మీద వెనకనుంచి ఎవరిదో చేయి పడింది!

వెనక్కి తిరిగి చూసేసరికి కాషాయ దుస్తుల్లో ఒకాయన కనబడ్డాడు. "ఏం చేస్తున్నావ్ నాయనా..?" అడిగాడు.

"చావాలనుకుంటున్నాను." విసుగ్గా చెప్పాడు తను.

ఆయన నవ్వి "నీ సమస్య ఏదైనా కానీ... చావకుండానే నిన్ను మరో జన్మలోనికి తీసుకువెళతాను.. నాతో వస్తావా..?" అడిగాడు.

తనకర్థంకాలేదు..

"నా పేరు శంకరానంద. నేను కూడా ఒకప్పుడు నీలా చావాలనుకున్నవాడినే.. ఇప్పుడు ప్రశాంతంగా బ్రతుకుతున్నాను.. నాతో రా నాయనా.. మా గురువుగారు ఆత్మానంద స్వామివారిని పరిచయం చేస్తాను.." అంటూ తన చేయిపట్టుకున్నాడు.

స్వామి ఆత్మానంద ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ దేశంలో పర్యటిస్తున్న కాలం అది. తనను ఆత్మానందకు పరిచయం చేసాడు శంకరానంద. స్వామి శిష్యకోటిలో ఒకడిగా చేరిపోయాడు తను. భవబంధాలను వదిలివేయగలిగితే అంతా ఆనందమేనన్న ఆధ్యాత్మిక తత్వంతో కృష్ణానందస్వామిగా మారాడు.

స్వామితో పాటే తిరుగుతూ, చివరికి చెన్నై దగ్గరలో ఉన్న వారి ఆశ్రమానికి చేరుకున్నాం. అక్కడ ఎవరికీ ఎటువంటి హద్దులూ లేవు. ఉండాలనుకుంటే ఉండొచ్చు. కుటుంబం పట్ల మమకారం కలిగి వెళ్ళిపోవాలంటే వెళ్ళిపోవచ్చు. కానీ అక్కడి కొచ్చాక వెనక్కి వెళ్ళిన వాళ్ళు చాలా తక్కువ.

ఆత్మానంద ఆశ్రమంలో నివాసం. మధ్య మధ్యలో ఆధ్యాత్మిక యాత్రలు.. తను పూర్తిగా మారిపోయాడు. తాగుడు అన్న పదం తన జీవితంలోంచి తొలిగించబడింది. నియమబద్ధమైన జీవితం, ప్రకృతి ఆహారం, నిరంతరం ఆధ్యాత్మిక చింతన. చావకుండానే మరో జన్మలోనికి వెళ్ళడమనే శంకరానంద మాటలకి అర్థం బోధపడింది.

తను చనిపోయి మరో జన్మ ఎత్తినట్టుగానే భావించుకున్నాడు. తన ఊరు, భార్యాపిల్లల దృష్టిలో తను చనిపోయాడు.. అంతే.. అంతా అలాగే అనుకోవాలి. మళ్ళీ వెనక్కి వెళ్ళాలనే కోరిక కలగలేదు.

స్థిరంగా సాగుతున్న తన జీవితంలో ఆత్మానంద స్వామి మరణం ఓ పెద్ద కుదుపు. ఆత్మానంద మరణించాక ఆ స్థానంలో శంకరానంద గురువుగా అవతరించారు. అయితే ఆత్మానంద మరణం నిశ్చలంగా ఉన్న కొలనులో రాయివేసినట్టుగా తనలో కొత్త ఆలోచనలు కలిగించింది. ఎప్పటికైనా చావు తప్పదు. తను చచ్చేలోగా ఒకసారి తన భార్యా కూతురు ఎలా ఉన్నారో తెలుసుకుంటే..?! ఈ ఆలోచన తనకసలు కలగనే కలగకూడదు - కానీ కలిగింది. ఒకసారి మనసులోకి వచ్చాక దాన్నించి తప్పించుకోవడం అసాధ్యమైపోయింది! అదే ఈ రాకకి కారణం! వాళ్ళని చుశాడు. వాళ్ళ స్థితిగతుల గురించి తెలుసుకుంటే బాగుణ్ణనిపిస్తోంది.. అంతకు మించి వేరే ఆలోచన లేదు.. అదయ్యాక వెంటనే బయల్దేరిపోతాడు - అంతే!

"ఏయ్.. ఎవరు నువ్వని అడుగుతూంటే పలకలేం..?" కృష్ణమూర్తి ఆలోచనల ప్రవాహం నుండి బైటపడి ఎదురుగా చూసేసరికి ఎవరో తనను గద్దిస్తూ కనిపించారు.

అతన్ని పరిశీలనగా చూసిన కృష్ణమూర్తి గతుక్కుమన్నాడు. అనుమానంలేదు - ఎదురుగా ఉన్నది తన స్నేహితుడు కేశవరావు.. కొంపదీసి తనను గుర్తుపట్టాడా..? కృష్ణమూర్తి గుండె గుబగుబలాడింది. సమాధానం చెప్పకుండా అక్కణ్ణుంచి బైటపడి గబగబా ముందుకు అడుగువెయ్యసాగాడు.

పదడుగులు వేసి వెనక్కి తిరిగి చూసిన కృష్ణమూర్తికి వెనకే తనను అనుసరిస్తూ వస్తున్న కేశవరావు కనిపించాడు. ఏం చేయాలో తోచలేదతనికి.

అంతలోనే కేశవరావు గబగబా అడుగులేసుకుంటూ కృష్ణమూర్తి దగ్గరికొచ్చాడు.

"నీలో కృష్ణమూర్తి పోలికలు కనిపిస్తున్నాయి. నిజం చెప్పు! నువ్వెవరు?" ఎదురుగా నిలబడి సూటిగా ప్రశ్నించాడు.

కృష్ణమూర్తి తత్తరపడి "కృష్ణమూర్తెవరు? నేనో సన్యాసిని.." అన్నాడు.

ఎదుటి వ్యక్తి తత్తరపాటును గమనించిన కేశవరావులో అనుమానం మరింత బలపడింది. గబుక్కున అతని కుడిచేయి పట్టుకుని మణికట్టు మీద చూశాడూ. అక్కడో పెద్ద పుట్టుమచ్చ!

కృష్ణమూర్తికి అర్థమైపోయింది - తను దొరికిపోయాడు. మరింక తప్పించుకోలేడు.

కేశవరావు కృష్ణమూర్తి చేయి పట్టుకుని గబగబా ఓ పక్కగా తీసుకెళ్ళాడు. ఓ చెట్టు కింద పచ్చికలో ఇద్దరూ కూర్చున్నారు.

"చెప్పు.. ఇంతకాలం ఏమైపోయావ్? ఎక్కడున్నావ్?!"

కేశవరావు మొహంలో ఆశ్చర్యం, కోపం మిళితమై కనబడుతున్నాయి.

కృష్ణమూర్తి కళ్ళల్లో దొరికిపోయానన్న ఆందోళన.. కొద్దిక్షణాల మౌనం తర్వాత అన్నాడు.. "అంతా చెపుతాను. ముందు సుధ, అమృతలు ఎలా ఉన్నారో చెప్పు?"

"ఇన్నాళ్ళకు నీకు భార్యా పిల్లలు గుర్తొచ్చారా..? వాళ్ళు బ్రతికున్నారో లేదో చూద్దామని వచ్చావా?.. అసలంతా నువ్వు చనిపోయావనే నమ్ముతున్నారు. నాకు మాత్రం ఏ మూలో ఓ నమ్మకం.. చనిపోయేంత ధైర్యం నీకుంటే పిరికివాడిలా ఎక్కడికో పారిపోవు కదా.. నా నమ్మకమే నిజమైంది!"

కృష్ణమూర్తి తలవంచుకున్నాడు.

"నువ్వు వెళ్ళిపోయాక కొన్ని సంవత్సరాల పాటు సుధ దుర్భర - దారిద్ర్యం అనుభవించింది. ఆదాయం లేదు.. పుట్టింటి స్థితిగతులు కూడా అంతంత మాత్రమే అని నీకు తెలుసు. అప్పులు పెరిగి ఇల్లు అమ్మాల్సి వచ్చింది. కొనుక్కున్న వాళ్ళు దయతలచి తక్కువ అద్దెకే వాళ్ళని తిరిగి ఆ ఇంటిలోనే ఉండనిచ్చారు. కుట్టుమిషన్ సహాయంతో నెట్టుకొచ్చేది. అమృత చదువు మధ్యలోనే ఆగిపోయింది. కొన్ని సంవత్సరాల తర్వాత నువ్వు చనిపోయినట్లు పరిగణించి డిపార్టుమెంటు ఆమెకు పెన్షన్ సౌకర్యం కలిగించింది. నీ సర్వీసు తక్కువ కావడంతో పెద్దగా బెనిఫిట్స్ ఏమీరాలేదు. వచ్చినవి తిరిగి అప్పులకే చెల్లిపోయాయి. అమృత టెన్త్ కట్టి పాసయ్యాక ప్రయివేటుగా బి.ఏ కట్టిపాసైంది. ఇవన్నీ ఇలా ఉండగా ఇప్పుడో పెద్ద సమస్య వచ్చింది. రాక రాక అమృతకి ఓ మంచి సంబంధం వచ్చింది. కుర్రాడు బ్యాంకు ఉద్యోగి. అమృతను ఏదో పెళ్ళిలో చూసి ఇష్టపడ్డాడు. అతను కట్నం లేకుండా చేసుంటానన్నా వాళ్ళమ్మగారు ఒప్పుకోలేదు. వేరే ఏ సంబంధం చేసుకున్నా లక్షల్లో కట్నం వస్తుందని, కనీసం రెండులక్షలైనా ఇవ్వందే చేసుకోలేమన్నారు. చివరికి పెళ్ళికొడుకు బలవంతం మీద ఓ ఒప్పందం కుదిరింది. కట్నం అక్కర్లేదనీ, పెళ్ళయ్యాక వేరుకాపురం పెట్టిస్తాం కాబట్టి అందుకు కావలసిన వస్తువులు ఫ్రిజ్, డబుల్ కాట్, వాషింగ్ మెషిన్ లాంటి వన్నీ ఇవ్వాలనీ, పెళ్ళిఖర్చులు పూర్తిగా భరించాలనీ, పెళ్ళి మాత్రం సింపుల్ గానే చేస్తామనీ చెప్పారు. అలా చూసిన లక్షరూపాయల వరకు ఖర్చు కనబడుతోంది. ప్రస్తుతానికి సుధ అప్పులన్నీ తీర్చేయగలిగినా చేతిలో మాత్రం డబ్బేమీ లేదు. ఏం చేయాలో అర్థంకాని స్థితి. స్థిరాస్తులేమీ లేకుండా ఈ రోజుల్లో అంత మొత్తం అప్పిచ్చేది ఎవరు? ఇక నా పరిస్థితి చూస్తే నా భార్య రమకు గుండెజబ్బని తేలడంతో ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. లక్షరూపాయలపైనే అయింది. నేను కూడా అప్పుచేయాల్సి వచ్చింది. పెళ్ళైన పన్నెండేళ్ళకు లేక లేక పుట్టిన మా పాప సింధు ఇప్పుడు హైస్కూలు చదువుకి వచ్చింది. అయినా ఈ గొడవలన్నీ నీకెందుకు? ఇవన్నీ తెలుసుకుని మాత్రం నువ్వు చేసేదేముంది? ఇంతకీ ఈ సన్యాసి అవతారమేమిటి? ఇంతకాలం ఎక్కడున్నావు? ఏం చేశావు?"

కృష్ణమూర్తి సమాధానం చెప్పలేదు. అతని మొహంలో బాధావీచికలు.. మనసులో ఆలోచనా తరంగాలు. తను నడిసముద్రంలో వదిలేసి పోయిన సంసార నావని ఒడ్డుకు చేర్చడానికి సుధ ఎన్ని కష్టాలు పడుతోంది..? తను మాత్రం అన్ని బంధాల్నీ త్యజించానని - భ్రమపడుతూ, తనను తనే నమ్మించుకుంటూ బాధ్యతల్ని వదిలేసి గడిపాడు.

"చెప్పు.. ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్?"

కేశవరావు మాటలకు తెప్పరిల్లి తన కథంతా కుప్తంగా వివరించాడు.

కృష్ణమూర్తి చెప్పింది విన్నాక అతని మీద కోపం తెచ్చుకోవాలో, జాలిపడాలో అర్థంకాలేదు కేశవరావుకి.

సుధనీ, అమృతనీ ఒక్కసారి చూడాలనుకున్నాననీ, చూశాననీ, తను వచ్చినట్టు, బ్రతికే ఉన్నట్టు సుధతో సహా ఎవరికీ చెప్పొద్దనీ, తను మళ్ళా ఈ జీవితంలోకి రాలేననీ, తనను చనిపోయినవాడిగానే ఉండనిమ్మనీ, ఈ అసమర్థుణ్ణి క్షమించమనీ అనేక విధాలుగా చెప్పి కేశవరావు దగ్గర మాట తీసుకున్నాడు కృష్ణమూర్తి.

పలాయన వాదిగా మారిపోయి, ఇంకా అలాగే ఉన్న కృష్ణమూర్తిని చూసి కేశవరావుకి అతణ్ణి మనిషిగానే గుర్తించాలనిపించలేదు.

"తను రాత్రి బండికే బైల్దేరి వెళ్ళిపోతున్నానంటూ.. తనను క్షమించమని" మరోసారి అడుగుతూ అతని దగ్గర శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు  కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి వెళ్ళిన రెండువారాలకు అతని దగ్గర్నుంచి కేశవరావుకి ఓ ఉత్తరం వచ్చింది. అందులో ఇలా ఉంది.

**కేశవరావుకు,**

కుటుంబం నుంచి అవమానకర పరిస్థితుల్లో పారిపోయిన నేను సన్యాసిననీ, భవబంధాలను త్యజించాననీ ఆత్మవంచన చేసుకుంటూ బ్రతికాను. నా కుటుంబం గురించి ఆలోచించడానికే ఇష్టపడలేదు. ఇప్పుడు వాళ్ళని చూసిన తర్వాత మనశ్శాంతిగా ఉండలేకపోయాను.

ఇలాంటి సమయంలో భగవంతుడు నాకో అవకాశం కల్పించాడు. చెన్నైలో ఒకరికి కిడ్నీ అత్యవసరమనీ, దాతలెవరైనా ఉంటే సంప్రదించమన్న వార్త పేపర్లో నా కంట బడింది. బ్లడ్ గ్రూప్ కూడా నా గ్రూపే, వెంటనే వాళ్ళని ఫోన్లో సంప్రదించి, తర్వాత వెళ్ళి కలిశాను.

స్వామీజీ ఆశ్రమంలో ఉన్నందువల్ల ప్రకృతి ఆహారం, నియమబద్ధమైన జీవితం ప్రభావంతో యాభైదాటినా నేను ఆరోగ్యంగానే ఉన్నాను. డాక్టర్లు పరీక్షించి సరేనన్న తర్వాత నా కిడ్నీ దానమిచ్చాను. ఆపరేషన్ విజయవంతమైంది. ఆశ్రమ జీవితం గడపడానికి నాకున్న ఒక్క కిడ్నీ చాలు.

వారిచ్చిన మొత్తాన్ని డి.డి. రూపంలో నీకు పంపిస్తున్నాను. ఇది నేను నా కుటుంబానికి చేయగలిగిన సహాయం అనో త్యాగమనో అనుకోవడంలేదు. అన్ని బాధ్యతల నుండి పారిపోయిన నేను వారికి నా శక్తిమేరకు చెల్లించుకోగలిగిన మూల్యం అని మాత్రమే భావిస్తున్నాను. ఈ మొత్తం అమృత పెళ్ళి సక్రమంగా జరగడానికి ఉపయోగపడితే నాకంతేచాలు.

ఈ డబ్బు ఉద్యోగరీత్యా నాకు గవర్నమెంటు నుండి ఇంకా రావలసిన బకాయిలు వడ్డీతో సహా వచ్చాయనో.. లేక నా దూరపు బంధువెవరో వారసులు లేకపోవడం వల్ల తన చివరి దశలో ఓ మొత్తం నా పేర రాశాడనో... ఏం చెప్పి సుధకు అందజేస్తావో నాకు తెలీదు... ఆ బాధ్యత నీదే.!

ఈ అసమర్థుణ్ణి క్షమించమని మరోసారి ఏమీ కాలేకపోయిన...

**కృష్ణమూర్తి**

లోపల ఉత్తరంతోపాటు జతచేసిన లక్షరూపాయల డి.డి. ఉంది. ఆత్మవంచనతో కుటుంబం దృష్టిలో, సంఘం దృష్టిలో ఏనాటికీ దోషిగానే మిగిలిపోయిన కృష్ణమూర్తి మీద ఇప్పుడు కేశవరావుకి కోపం లేదు. ఆ స్థానంలో జాలి మాత్రమే మిగిలింది.

***

# అంతర్మథనం -దీప్తి కనుపర్తి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**చిక్కటి వెన్నలతో** తలంటుకుని నక్షత్రాలనే మల్లెలుగా తలలో తురుముకున్నట్లు పున్నమి చంద్రునితో పోటీపడుతున్న భార్య సుశీల ముఖారవిందాన్ని చూసి చిరునవ్వుతో పెరటిలోని పడక కుర్చీలో సుఖాశీనులయ్యారు సుబ్రమణ్యం మాష్టారు. ఈ మధ్యనే రిటైర్ అయిన ఆయన రోజూ ఏదో ఒకటి చెప్పడం, భార్య సుశీలమ్మ చకచకా దాన్ని వ్రాసిపెట్టడం, వాళ్ళు గత 20 సంవత్సరాలుగా అనుసరిస్తున్న ఆచారం. అది చూసిన కొందరు ముచ్చట పడితే కొందరు పైత్యం, చాదస్తం అనుకుంటారు.

వేసవికాలపు సాయంత్రపు గాలి గోదావరి నీటి చల్లదనాన్ని మోసుకొస్తుంది. భోజనాది కార్యక్రమాలు ముగిసాయి. చుట్టిన ఆకులు ఒక చేత, మంచినీళ్ళు మరో చేత తీసుకుని వచ్చి మాష్టారికి అందించి చకచకా లోపలికి వెళ్ళిపోయింది సుశీలమ్మ. ఈసారి చిన్న మోకాళ్ళ పీట, ఒక రైటింగ్ పేడ్, పెన్‌తో సిద్ధం అయింది. భర్తకి అభిముఖంగా ఒక అడుగు దూరంలో పీట మీద కూర్చుని రాయడానికి సిద్ధం అయింది.

చుట్టూ ఎటు కలియ చూసిన కొబ్బరి, మామిడి పనసాది చెట్లు పసిపిల్లల్ని భుజం మీద వేసుకుని నిద్రపుచ్చడానికి ప్రయత్నిస్తున్న తల్లిలా ముందుకీ వెనక్కీ ఊగుతున్నాయి నిర్విరామంగా. వారి నివాసాన్ని ఇల్లు అనే కన్నా పొదరిల్లు అని అభివర్ణించవచ్చు.

అనంత విశ్వాంతరాళంలోకి గమ్యం చేరలేని చూపులు చూస్తున్న మాష్టారు బరువుగా కళ్ళు మూసుకుని నుదిటిపై తన మునివేళ్ళతో నిమురుకుంటూ చెప్పసాగారు.

***

అధోఃముఖ గమనం, విపరీతమైన వేగంతో పడిపోతున్న నేను ఆ చీకటి కుహరంలో ఆధారం అందిపుచ్చుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాను. పిచ్చిపట్టినట్లు కాళ్ళు చేతులు అసహాయంగా కోరుకుంటున్నాను. కాళ్ళకింద ఆధారం లేదు శరవేగంగా కదిలిపోతున్నాను. అవయవాలన్నీ నా శరీరం నుండి ఒక్కొక్కటిగా జారిపడిపోతున్నట్లు, గుండె నా గొంతులోకి వచ్చేసినట్లు విచిత్రమైన విపరీతమైన భావన. గొంతు పెగలడం లేదు - ఏడవడం చేతకావడంలేదు. బాధ ఇసుమంతైనా తగ్గే మార్గం కనపడటం లేదు. నేను పడుతున్న ఆ వేగానికి గాలి శరీరంలో తూట్లు పొడుస్తుంది. అర్ధాంతరంగా ఆగిపోయాను - భారరహితంగా (భావరహితంగా). ఆ స్థితికి అలవాటు పడేలోగా ఊయల ఊగినట్లు అటూ ఇటూ శరీరం కదలడం మొదలుపెట్టింది. కుడి నుండి ఎడమకి, ఎడమ నుండి కుడికి, కుడి నుండి.. వేగం హెచ్చింది తల తిరిగిపోతుంది. మరో విచిత్రమైన బాధ మొదలైంది. భయానకమైన ఆ చీకటిలో సున్నటి వెలుగు రేఖ, కాని నిశ్చలంగా కనపడదేం? ఎలా కనపడుతుంది అతి వేగంగా ఊయలలో ఊగుతుంటే!

"నీ పాపాల చిట్టా చూస్తా?"

సన్నటి ధ్వని చెవులకి చేరిందా అది లేక అది మెదడులో మొదలైందా ఎప్పటికీ అర్థంకాదు.

ఆ వెలుగు రేఖ దగ్గరకి చేరే కొద్దీ సన్నని వణుకు వెన్నులో మొదలైంది..

గుంపుగా వెళుతున్న అమ్మాయిలు. వేగంగా బైక్ మీద వచ్చి వారికి అడ్డంగా ఆపి "రాధా! ఐ లవ్ యు" అన్నాడా నవయువ ప్రేమికుడు. చిటపట చూసి ఆగకుండా వేగంగా నడుస్తోంది ఆ అమ్మాయి.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం. నువ్వు లేకుండా నేను బ్రతకలేను చాలా సిన్సియర్‌గా లవ్ చేస్తున్నాను. నీ కోసం ఏమన్నా చేస్తాను. నీ కోసం ఏమన్నా చేస్తాను. ప్లీజ్ నా మాట విను.. నువ్వు కాదంటే చచ్చిపోతాను. నిజంగా!"

ఎటువంటి స్పందనా ఆ రాధనుండి లేకపోవడంతో.

"కావాలంటే చూడు", అంటూ బెల్టు తీసి కస కసమని తన ఎడంచేతి మణికట్టుని రక్తసిక్తం చేసుకున్నాడు. ఛాతీ విశాలం చేసి గర్వంగా చూసాడు రాధవైపు. ఆ అమ్మాయి ఆవేశంగా అరవసాగింది. "నీకు పిచ్చా? నాకు ఇష్టం లేదు అని చెప్పాను కదా!" ఉబికి వస్తున్న దుఃఖం, రోషం ఏమీ చేయలేని అసహాయత, రక్తం చూసిన జుగుప్స, భయాలతో పరిగెడుతూ వెళ్ళిపోయింది.

ఒకటి రెండు నెలలు వేధించిన 'ప్రేమ' ఇక ఓపిక పట్టలేక, ఓటమై సహించలేక, చాలా ఇష్టం అయిన ఆ రాధపైన యాసిడ్ దాడి చేసింది. "ఇది ప్రేమా?" దివ్యవాణి ఏదో నన్ను ప్రశ్నించింది, "మోహం బాహ్య సౌందర్యాన్ని చూసి శరీరాన్ని చూసి వయసుని చూసి వాంఛించింది అసలు హృదయం చేరే ప్రయత్నం ఆ 'ప్రేమ' ఎప్పుడైనా చూసిందా? ఆ ప్రయత్నాలకి ఆ వికాసానికి మీ సహాయం ఏది? మీరు విఫలం అయ్యారు."

ఆ ప్రశ్నలకి నా బుర్ర గిర్రున తిరిగింది. నాలో నాకు సవాలాక్షా సందేహాలు. ఆ రాధ బ్రతికి బయటపడిందా? ఎలా ఉంది? కాని నా ప్రశ్నలు గొంతు పెగిలి పైకి రావడం లేదు. ఈ లోగా లోలకంలా నా గమనం మళ్ళీ చీకటిలోకి మొదలైంది.. రెండవ మజిలీ ఇది..! మన దేశంలా అనిపించదేం!

అందమైన ఇల్లు ఖరీదైన కాపురం భార్యాభర్త ఇద్దరు పిల్లలు. పిల్లలు తల్లి మీద పడి ఆడుతున్నట్లున్నారు. ఛంగు ఛెంగున ఎగురుతున్న లేడి - పిల్లలు తలపించేలా! ఆ నవ్వుల కౌగింతలు ప్రతిధ్వనికి నా చెవుల్లో చిల్లులు పడిపోతున్నాయి. ఆనందంలో కూడా నా గుండె ఇలా మూలుగుతుంది ఎందుకు?

ఈ లోగా తండ్రి అనుకుంటా.. లోపలికి వచ్చాడు. అతని ముఖంలో విషాదం..!బాధ..! ఓడిన సామ్రాజ్యాధిపతి అవమాన భారంతో కుంగినట్లు వంగిపోయి వడలిపోయి ఉన్నాడు.

దారుణ ఆర్థిక పరిస్థితులు. భార్యా ఉద్యోగం పోయి ఆరునెలలైంది. తనది పోయి రెండు నెలలు! అనుభవిస్తున్న భాగ్యాలన్నీ అప్పుల బాపతే. విపరీతమైన ఒత్తిడి. ఈ ఉచ్చునుండి బయటపడాలి పిల్లల్ని ఒడ్డున చేర్చాలి ఎలా ఎలా?

భార్య అతని దగ్గరగా వెళ్ళింది సపర్యలు చేసింది. దిగులు వద్దంది. ధైర్యంగా ఉండమంది. అతను ప్రసన్నం చెందడేం? ముఖం మరింత రౌద్రంగా మారింది. పెద్దపులి లేడిని వేటాడినట్లు భార్యని పిల్లల్ని పొట్టన పెట్టుకుని తను తనువు చాలించాడు.

ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళు మూసుకుందామంటే కనుపాపలు బిగుసుకొనిపోయాయి. నా ఇంద్రియాలు నా ఆధీనంలో లేవు. "సమస్యలకు పరిష్కారం చావా? చంపడమా? ఏ అధికారంతో వారి ప్రాణాలు తీసాడు అతడు? అష్టైశ్వర్యాలతో పెంచాలి అని పూచికత్తు రాయించుకుని పుట్టారా ఆ పిల్లలు? మనసావాచా కరుణ నేను నీకు తోడు అని చేసిన ప్రమాణానికి బహుమతి ఈ అర్థాంతర మరణం అతడి అర్ధాంగికి?"

మళ్ళీ దివ్యవాణి నా మనసులో ప్రకంపనాలు రేపింది "అబద్ధపు ఐశ్వర్యం, విపరీతమైన ఆశ, బలహీన మనస్తత్వాల ఫలితం ఇది. ఏది నేటి యువతలో పరిపూర్ణ వ్యక్తిత్వం? మరోసారి మీ బాధ్యతలో విఫలం అయ్యారు"

నా శరీరంలోని జవజీవాలు అన్ని ఆవిరైపోయినట్లున్నాయి. ఈ ఘోర చీకటి తోడు రక్తం గడ్డకట్టించే చలి. అచేతనంగా ఉన్న నేను రోదశీలో దూసుకుని పోతున్న రాకెట్‌లా ఒకదాని తర్వాత ఒకటి ఎన్ని మజిలీలు చేసాను ఎన్నెన్ని వికృతాలు చూసాను. చిన్నపిల్లల్ని పైశాచికంగా హింసించే మృగాల్ని, ఇంటిని నరకప్రాయంగా మార్చే మూర్ఖపు మగువల్ని, ప్రపంచ భారం అంతా తామే మోస్తున్నాము అనుకునే నజ్జు మగవాళ్ళని ఎన్నింటినో - మరెన్నింటినో ఆ వేగానికి నా శరీరం రక్తశిక్తమైంది కాని అణుమాత్రపు శారీరక బాధ లేదు కాని మనసు... ఊపిరాడనివ్వకుండా గుండెని ఎవరో నొక్కుతున్నట్లు ఒకటే బాధ - గుబులు - బరువు. ఎందుకు నాకీ బాధ నా అంతరాంతరాలు ఘోషించసాగాయి. "ఈ పాపపు చరిత్ర నాది కాదు. దానితో నాకు సంబంధం ఏమిటి? ఈ పశుత్వ వైఖరి నేను కనీసం చూసి తట్టుకోలేకున్నాను ఈ బాధ ఇక భరించలేను" అని ఏడ్వసాగాను.

దివ్యవాణి ఈసారి గుసగుసలాడలేదు. గాండ్రించినట్లు నవ్వింది వికృతంగా. "విద్యార్థులను తీర్చిదిద్దవలసిన అధ్యాపకుడవు నీ శిష్యగణం నిర్వాకాలకు నీ బాధ్యత లేదా? సంస్కారం, సహనం, సమాజం పట్ల బాధ్యత, సాటివారియెడ దయ సహజీవనానికి ఓర్పు ఎన్ని నేర్పాలి అధ్యాపకులు!? అటువంటిది మనిషి పుట్టింది మొదలు ఆస్పత్రిలో అపహరణలు, పసిపిల్లలపై అత్యాచారాలు, కౌమారంలో విపరీతమైన నడవడికలు, యవ్వనం రావడంతోనే ఎంత సంపాదన, ఎన్ని ఆస్తులు, నాకేంటి, నా కది సొంతం. ఎదుగుతున్నప్పుడు అంటుకున్న తెగుళ్ళు చచ్చేదాకా నిలిచిపోయే జబ్బుతో ఈ స్వార్ధం సంకుచిత స్వభావం.

అందుకే తెలియకుండా సమాజం పొరలు పొరలుగా కుళ్ళిపోయింది. ఆ దుర్గంధం మీ ముక్కుపుటాల్ని అదిరిస్తున్నా మీరు దాన్ని పట్టించుకోకుండా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఇది కొనసాగితే కుళ్ళుకూపంలో జీవితం క్షణక్షణం దుర్భరంగా సాగుతుంది.. "

***

వడివడిగా వినపడుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాలను బట్టి సుశీల గుండెలు తీవ్రస్థాయితో ఎగిసి పడుతున్నట్లు ఊహించారు మాష్టారు. కళ్ళు తెరచి చూస్తే వెన్నెలలో ఆమె బుగ్గలపై జాలువారిన కన్నీళ్ళు ముత్యాల్లా తళుక్కుమన్నాయి.

"ఆపకండి చెప్పండి! మీ బాధ నాకు అర్ధమయ్యింది. ఈ రోజు మీ మనసుతేలిక పడాలి" అన్నారు కళ్ళు తుడుచుకుంటూ సుశీలమ్మ.

"అవును సుశీల! ఎన్నాళ్ళ నుండో నాలో సాగుతున్న అంతర్మథనం ఇది. నా ఆత్మ దివ్యవాణిలా ఘోషిస్తున్నట్లు నేను కావాలని దాని గొంతు మూసి నా జీవితం సాగించినట్లు నా భావన. నాకు తెలుసు ఏదో ఒకరోజు నా మనసు నాకు విధించి శిక్ష ఎంత భాధాకరంగా ఉంటుందో, కాదు కాదు ప్రతిరోజు విధిస్తున్న - అనుభవిస్తున్న దుస్థితి ఇది. మన చదువుల్లో ఎంతకీ ఎన్ని మార్కులు వస్తున్నాయి, ఎలా సీట్లు వస్తాయి, దానివల్ల ఎన్ని వేలు ఆర్జించి ఉద్యోగం సంపాదిస్తాం. హోదా ఎంత ఇవే ఇవే ముఖ్యంగాని మనోవికాసానికి, మానసిక పరిణితికి కావలసిన చేయూత పిల్లలకి అందివ్వలేదేమో అనే బాధ నల్లని మబ్బులా నా విజయాలన్నింటినీ మూసేస్తోంది. 34 సంవత్సరాలు నా బాధ్యతలు పిల్లలకి, వాళ్ళు తల్లిదండ్రులకి, విద్యాసంస్థ వాళ్ళకి తద్వార సంఘానికి కావలసిన మార్కుల మెషిన్‌లా నిర్వహించాను తప్ప నా మనసుకోరుకున్నట్లు కాదు.. సమాజం మొత్తం ఉద్దరించడానికి నేనొక్కడినో లేదా ఉపాధ్యాయులు అధ్యాపకులే మూలం అనికాదు నా అభిప్రాయం.. ముఖ్యమైన భాగం అని మాత్రం నా విశ్వాసం. అందరం తప్పు చేస్తాం, నిత్యజీవితానికి - బరువు బాధ్యతలకి తలవంచుతాం, పొరపాటు జరిగిందేమో మన వల్ల? అని కొందరమే బాధపడతాం, ఆ తప్పు దిద్దుకునే ప్రయత్నం చేసేవాళ్ళు మాత్రం మహనీయులుగా మిగిలిపోతారు. రోజు రోజు జరుగుతున్న దారుణాలు తెలుసుకున్నప్పుడల్లా వీటిని ఆపలేమా? కారకులు ఎవరు? వారిని మార్చలేమా? అనే ప్రశ్నలు తలెత్తుతుంటాయి ఎంతోమందికి. వాటిలో నా బాధ్యత కూడా ఉంది అని ప్రాయశ్చిత్తానికి నడుం బిగించాలనుకుంటున్నాను. స్వచ్ఛందంగా జీవితంపట్ల సరైన అవగాహన కలిగించడానికి శిక్షణా

తరగతులు నిర్వహించాలనుకుంటున్నాను. నా అంతర్మధనంలో నుండి పుట్టిన అమృతాన్ని నీతోపంచుకున్నాను సుశీలా నువ్వు ఏమంటావు? " అని ముగించారు మాష్టారు.

"చాలా సంతోషం! మీలాగే ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యత నిర్వర్తించగలిగితే ఈ సమాజం ఏదో ఒకరోజు పూలవనంలా కళకళలాడుతోంది. ఈ బృహత్కార్యంలో మీ వెంట నేను" అని చేతిలో చేయివేసి జాబిలి సాక్షిగా ప్రమాణం చేసారు సుశీలమ్మ.

***

# ఇద్దరు అభిసారికలు - రెండు సెలయేర్లు
## శ్రీధర్ అయ్యల

**"హే! సూర్య భగవాన్ ! ఇక ఎంతకాలం ఈ నిరీక్షణ తండ్రీ! వృద్ధ మండలాధీశ్వరుడైన పూర్ణ ప్రభుని జీవిత భానుడు, అస్తమించేదెప్పుడు ప్రభూ ?!"**

పిపాసా తప్తములైన దృక్కులతో, అనుదినం సూర్యభగవానుని సమాధానం కోసం వేధించే ఈ వేదనా భరిత విలాపం, సోమపురీ మండలాంతర్గతమైన ఉద్యానవనంలో వసించే ఇద్దరు అభిసారికలది.

సోమపురీ మండలం సస్యశ్యామల భరితమే కాక, బౌద్ధులకు తీర్థయాత్రా స్థలం కూడ. ఇక్కడే జగత్ప్రసిద్ధమైన "సోమపురీ మహా విహారం" ఉన్నది. పుణ్య సంచయార్థం వచ్చే యాత్రికుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవుతూండడం చూసి, మాండలిక ప్రభువైన పూర్ణప్రభుడు రాజధాని నుండి మహావిహారం వరకు విశాల రాజమార్గాన్ని నిర్మించాడు.

"పూర్ణప్రభుడు ప్రజానురంజకుడైన పరిపాలకుడే కాక దయాళుడు. వ్యక్తిగతంగా కూడా ఎవరికీ అపకారమూ చేసి ఎరగడు. అంతెందుకు, యాత్రికులు ఆ విశాల రాజమార్గ మధ్యంలో విశేషధనంతో నిశ్చింతగా నిద్రించ గలరంటే, అతని పరిపాలన ఎంతటి శాంతియుతమైనదో ఒక్క మాటలో చెప్పినట్లవుతుంది.

ఆ రాజమానికి ఒక ప్రక్కగా, దగ్గర దగ్గరగా పెంచబడిన రెండు ఉద్యానవనాలు, వాటిలో లతా పుష్పాచ్ఛాదితములైన రెండు భవంతులు చూపరుల కంటిని ఇట్టే ఆకర్షిస్తాయి. ఒకదానితో ఒకటి పోటీపడి కట్టించినట్లుండే ఆ భవనాలు సమాన రూప వయో లావణ్యాలు కల ఇద్దరు నర్తకీమణుల నివాస గృహాలు.

సౌందర్యంలోనూ, సంగీతంలోనూ, నాట్యకళా ప్రావీణ్యంలోనూ, మనసు మెచ్చే విధంగా పూలమాలలు కట్టడంలోనూ, వారిద్దరూ ప్రతిద్వంద్వులే ! మహారాజు పూర్ణప్రభుని నుండి సామాన్య పౌరుల వరకూ, వారిరువురి నాట్యకళా ప్రౌఢిమని శ్లాఘించేవారే ! వారిరువురి రూపజాలంలో చిక్కి, మిధ్యాంగిక విన్యాసాలకి ముగ్ధులయి, సన్నిధిని సాధించలేక పరితపించే ప్రముఖులు కూడ లేక పోలేదా నగరంలో !

వారిలో ఒకరి పేరు సనక. రెండవ తరుణి పేరు మేనక. సూర్యాస్తమయ సమయంలో, ఏకాకిగా ఉద్యానవన ప్రాంత సరోవర తటం నుండి, సంధ్యారుణ కాంతులతో మెరిసిపోయే రాజభవనం వంక దృష్టి సారిస్తూ, తనలో తనే మురిసిపోయేది సనక, ఆ రాజమందిరంలో మహారాణి హోదాలో తిరుగాడ గలిగే భాగ్యం త్వరలోనే తనకి పట్టబోతుందనే ఆనందంతో ! కారణం యువరాజు పుణ్యరత్నుడు ఆమెను తన హృదయ రాజ్ఞిగా స్వీకరిస్తానని ఇచ్చిన వాగ్దానమే. అయితే వృద్ధ మండలాధీశ్వరుడైన పూర్ణప్రభుని మరణానంతరమే తన ప్రతిన నెరవేర గలదనే షరతు కూడా సూచిస్తూ.

సరిగా "మేనకకి" కూడా అటువంటి వాగ్దానాన్నే ఇచ్చాడు యువరాజు పుణ్యరత్నుడు. అందుకే అనుదినం సూర్యభగవానునికి అంజలి ఘటిస్తూ, "హే ! సూర్య భగవాన్ ! ఇంకా ఎంత కాలం ప్రభూ, ఈ దుస్సహ నిరీక్షణ," అంటూ ప్రార్థిస్తారా అభిసారికలు.

ఇరువరి హృదయాలలోని వేదనా కాంక్షా ఒకటే కావడం వల్ల ఒకరి పొడ అంటే మరొకరికి గిట్టదు.

నిత్యమూ, కళ్ళు మిరమిట్లు గొలిపేలా అలంకరించు కొనడంలోనూ, చూపులు నిలిపి వేసేలా పూలమాలలు కట్టడం లోనూ, వారిరువురి పోటీ చెప్పశక్యం కాదు !

కాని చీలి రెండు పాయలై ప్రవహించే నది, చివరకు ఒకే సముద్రాన్ని ఆశ్రయించేటట్లు, ఆ అందాన్ని చూసి ఆనందించే హక్కు ఒక్కరిదే !

అతడే యువరాజు పుణ్యరత్నుడు !!

సముద్రుడు అన్ని నదులనూ ఒక్కలాగే ఆదరిస్తాడు. తన గంభీరమైన హృదయంలో దాచుకొంటాడు. అలాగే పుణ్యరత్నుడు కూడా రెండు ప్రేమ వాహినులను తనలో కలుపుకొన్నాడు. అతడి ప్రేమ సముద్రుని ప్రేమ వలె గంభీరమైనది కాదు. అసలది ప్రేమ అని చెప్పడానికే వీలు కాదు. "అతడు వారివురినీ ప్రేమించినట్లు నటిస్తున్నాడు", అని చెప్పినా ఆవగింజంత అబద్ధం చెప్పినట్లే అవుతుంది !

ఇద్దరి నర్తకీమణుల ఆకాంక్షా, ఉచ్చాభిలాషా, పుణ్యరత్నుని మాటలనే నాగస్వరం విని నాట్యం చేసేవి. ఆ రెండు నాగినులనూ "మహారాణి పదవి" అనే బుట్టలో పడవేసి, మిథ్యా ప్రేమ కలాపాలనే నాగస్వరంతో ఆడించేవాడు, పుణ్యరత్నుడు.

ప్రణయ కేళి, కాదు కాదు పాములాట రోజుకో విధంగా ఉండేది.

ఒక రోజు - అపరాహ్న వేళ ఇంటి ముందర వృక్షచ్ఛాయలో, విశ్రమించిన, "సనక" చల్లని చందన స్పర్శతో పులకితురాలై వెను తిరిగి చూసింది. ఎదుట మధుర భావనలే మూర్తి దాల్చినట్లు, చేత చందనపు గిన్నెతో ప్రత్యక్ష మయ్యాడు పుణ్యరత్నుడు. ప్రొద్దు రెండు ఝాముల వరకు కూర్చి కట్టిన పూలమాల అతని కంఠానికి అలంకరిస్తూ, "ఇంకా ఎన్నాళ్ళీ దుస్సహ నిరీక్షణ ప్రభూ !" గోముగా అడిగింది సనక, అతని హృదయం మీద వాలిపోయి.

"ఏం చెయ్యమంటావో ఆజ్ఞాపించు దేవీ !"

"మహామండలేశ్వరుల నిర్యాణం వరకు ఎదురు చూడక వారి అనుమతి తోనే మన వివాహం జరగదా ప్రభూ?!"

"వీలు పడదు సనకా ! అతని అనుమతి లభించడం అసాధ్యం !"

ఆ మాటలకి దిగజారి పోయిన సనక విషణ్ణ వదనం చూస్తే నవ్వు వచ్చేది పుణ్యరత్నునికి. ఆమెనింకా మాటలతో రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో, "ఒక ఉపాయం ఉంది సనకా !" అన్నాడు హఠాత్తుగా.

"ఏమిటది ప్రభూ ?!" ఆతృతతో ధ్వనించింది సనక కంఠం.

"మహారాజుని మన ప్రణయ పథం నుంచి అపసారితం చెయ్యడమే!"

"మాట పూర్తి కాకుండానే అడ్డు పడింది సనక. "అంతటి భయంకరమైన ఆలోచనలకి తావివ్వకండి యువరాజా!" అంటూ.

"అయితే దినాలపై దినాలు, యుగాలపై యుగాలుగా ఈ దుస్సహ నిరీక్షణ లోనే గడుపుతావా సనకా ?"

ఆ ప్రశ్నకు సనక బదులివ్వలేదు. మౌనంగా యువరాజు ముఖం వంక చూస్తూ ఉండి పోయింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా తీసుకొని,

"అందుకే విష ప్రయోగం చేత పూర్ణ ప్రభుని అంతమొందిస్తే మన మార్గం సుగమ మవుతుంది, ఏమంటావు సనకా?"

సమాధానంగా సనకకు "ఊ" అనడం తప్పని సరి అయింది.

అంతే, అదే కావాలి పుణ్యరత్నునికి. "ఒక అసాధారణ రూపవతి అయిన యువతి తన కోసం ఎంతటి భయానక కార్యానికి ఒడికట్టింది !" అనే ఆలోచనే అతన్ని ఉక్కిరి బిక్కిరి చేసేది. వికటంగా నవ్వుతూ ఆమె నుండి సెలవు తీసుకొని నిష్క్రమించాడు పుణ్యరత్నుడు, ఆనాటి ఆటని ముగించుకొని. ఆ యువరాజు నవ్వుకి అర్థం తెలియక, కాతర నయనాలతో అతను వెళ్ళిన వైపే చూస్తూ ఉండి పోయింది సనక.

ఆమె నుండి సెలవు తీసుకొని మేనక మందిరానికి వెళ్ళాడు యువరాజు.

కక్ష్యాంతర్భాగం నుండి యువరాజు గమనాన్ని గమనించిన మేనక గాలిని మించిన వేగంతో పరుగు పరుగున వచ్చి, అతని గళసీమలో ఉన్న పూలమాలని చూసి, ఠక్కున ఆగి పోయింది. ఆ మాల సనక కట్టినదేనని గ్రహించి, ఈర్ష్యతో ఆమె కండ్లు కెంపుల్లా ప్రకాశించాయి. తనకు రాబోయే మహద్భాగ్యాన్ని, ఆ సనక ఎక్కడ తన్నుకు పోతుందో అనే అనుమానంతో, అభిమాన స్వరంతో, "సనకతో మీ ఈ చర్యకి అర్థమేమిటి ప్రభూ? " అని ప్రశ్నించింది. ఆమె ముఖభావాలలో అంతరంగాన్ని చదవ గలిగిన పుణ్యరత్నుడు " నేనీ మాలని మనస్ఫూర్తిగా గ్రహించ లేదు మేనకా! కాని------"

"ఏమిటది ప్రభూ ? "

"చెపుతాను విను," అంటూ, ఆమెనతి దగ్గరగా తీసుకొని, పరమ రహస్యం చెప్పే వానిలాగ స్వరం తగ్గించి, "సనక నీకు విష ప్రయోగం చేసి, తన ప్రణయ పథాన్ని నిష్కంటకం చేసుకోవాలని అనుకొంటోంది" అన్నాడు.

"మీరీ విషయం తెలిసి కూడా ఉపేక్ష వహిస్తారేం ప్రభూ !?"

"ఏం చెయ్యమంటావో చెప్పు మేనకా ?"

"ఆమె నీ దేశం నుండి బహిష్కారం చేయించండి రాకుమారా !"

"నువ్వు ఒప్పుకొంటే ఆమె నీ గేహం నుండే బహిష్కారం చేయిస్తాను మేనకా!"

"అదెలాగ ప్రభూ ?"

"మనమే రహస్యంగా విష ప్రయోగం చేసి ఆమెని------"

"శివ, శివ !" అంటూ అతని నోటిని తన చేతితో మూసింది మేనక.

"సరే ! అలాగే కానీ, మరికొన్నాళ్ళకి సనక చేత విష ప్రయోగం చేయబడి, మరణించే వరకు ఇలాగే భజన చేస్తూ ఉండు" అంటూ తెచ్చి పెట్టుకొన్న కోపంతో అక్కడ నుంచి లేచి పోవడానికి ఉద్యుక్తుడయ్యాడు యువరాజు.

వెళ్ళిపోతున్న యువరాజుని వారిస్తూ, "మీ ఇష్టం వచ్చినట్లే కానివ్వండి యువరాజా ! మీ మాటకి నే నెన్నడూ ఎదురాడను" అంది గోముగా. బిగ్గరగా నవ్వుతూ అక్కడ నుండి నిష్క్రమించాడు పుణ్యరత్నుడు, అంతటితో ఆనాటి వినోద కేళిని ఉపసంహరించుకొని.

ఆవిధంగా సాగుతూ ఉండేది పుణ్యరత్నుని ఆట ! ఇద్దరు లావణ్యవతులు, తమ మిథ్యాంగిక విన్యాసాలతో ఎంత మందికో పిచ్చెత్తించిన, ఇద్దరు నటనా లలామలు, కేవలం తన కుహనా ప్రేమకి వశవర్తులై, తన ఇచ్చ వచ్చినట్లు ఆడడం అతనికి గర్వకారణమయేది.

❋❋❋

యువరాజు ప్రస్తావన వినగానే సనక మొదట కంపించి పోయింది. ధర్మ వ్రతుడైన మహారాజుకి విష ప్రయోగం అన్న మాటలే ఆమె సహించలేక పోయింది. కాని ఆమె అంతరంగంలోని ప్రేమ, ఉచ్ఛభిలాష దానిని అణచి వేసాయి.

మహారాజు చావు వెనక కలగబోయే మహాద్భాగ్యాన్ని తలపుకి తెచ్చుకొని తనకు తానే ఊరడిల్లేది సనక.

మరికొంత కాలం గడిచినాసరే అతని ప్రస్తావన అలాగే ఉండిపోవడం, ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. అందుకే ఒకనాడు, చిక్కని లతా నికుంజంలో యువరాజు హృదయంపై తల వాల్చి, విశ్రమించిన వేళ "ఊరకనే అంతటి భయంకర ప్రస్తావన ఎందుకు ఎత్తారు ప్రభూ?!" అని అడిగింది.

సమాధానంగా పుణ్యరత్నుడు వికటంగా ఆమె గుండెలు పగిలేలా నవ్వాడు. "మరేం లేదు సనకా ! నా ప్రేమ కోసం నీవు ఎంతటి హైన్య స్థితికి దిగజారావో తెలుసుకొందామని" అంటూ.

అతని మాటలు సనక హృదయ తాపాన్ని రెచ్చగొట్టాయి. ఆమె నవనాడులూ ఒక్కసారిగా స్తంభించి పోయినట్లయింది. కొంత సేపటికి, "నిజమే ప్రభూ ! మీ ప్రేమలో పడి పిచ్చి దాన్నయిపోయాను" అంది గద్గద కంఠంతో.

పుణ్యరత్నుడు జవాబు విని విపరీతమైన ఆనందం పొందాడు.. అసలా దినం అతనొక క్రొత్త పథకం ఆలోచించి వచ్చాడు. దానిని సనక ముందు బయట పెట్టాడు.

"నీలాగ మేనక కూడ నన్ను ప్రేమిస్తోందన్న విషయం నీకు తెలుసునా సనకా?"

అతని ప్రశ్న సనకకి ఆశ్చర్యాన్ని కలిగించింది.విషయం నిజంగానే తెలియదు.

అప్పుడప్పుడు మేనక దినచర్యలు ఆమెకట్టి సందేహాన్ని కలిగించినా, మరుక్షణం దానిని మరచి పోయేది. విప్పారిత నేత్రాలతో అతని వంక చూస్తూ, "నా కా విషయం తెలియదు ప్రభూ ! కాని అనుమానం మాత్రం ఉంది," అంది.

"నాకు మీ ఇద్దరిపట్ల సమానమైన ఆప్యాయతే ఉంది. అందుకే మీ ఇద్దరి మధ్య ఎవరి ప్రేమ గొప్పదో తెలుసుకోవడానికి చిన్న పరీక్ష పెట్ట దలచాను."

"పెట్టి ------"

"అందులో ఎవరు ఉత్తీర్ణులవుతారో వారినే నా జీవిత భాగస్వామినిగా చేసుకొంటాను."

నిర్మేఘ జలపాతం లాంటి ఈ వార్త సనకను కొంతకాలం చైతన్య రహితంగా చేసింది. మరుక్షణం తేరుకొని, "ఏమిటా పరీక్ష ప్రభూ?!" అన్నది గద్గద కంఠంతో.

"మరేమీ లేదు, నీవు మేనక ఇద్దరూ రెండు పుష్ప మాలలు తయారు చేసి, రేపు ఉదయం "నందన మంటపానికి" తీసుకొని రావాలి. ఎవరి చేత కట్టబడిన పుష్ప మాలిక ఎక్కువ సుందరంగా ఉంటుందో, ఆమెయే నా అర్థాంగి అవుతుంది."

సనక దానికేమీ జవాబివ్వలేదు. అసలామె ఏ ప్రశ్నకీ సమాధానం చెప్పే స్థితిలో లేదు. రాజకుమారుని పరీక్షా విధానం - ఆమెను అప్రతిభురాలిని చేసింది. "మనసుని బట్టి తెలుసుకోలేని ప్రేమని పుష్పమాలలు చూసి ఏం తెలుసుకొంటాడీ యువరాజు !!" అన్నదే ఆమెకి అర్థం కాని విషయమయి పోయింది.

మౌనం అర్థాంగీకారంగా భావించి ఆ చోటు వదిలి వెళ్ళి పోయాడు పుణ్యరత్నుడు, నేరుగా మేనక మందిరానికి.

❋❋❋

మరునాడు -

రాత్రి మూడవ ఝాము నుండి మేలుకొని మిక్కిలి ప్రయాసతో రచించిన పుష్పమాలికలు సజ్జలలో ఇమిడ్చి, కళ్ళు మిరమిట్లు గొలిపే అలంకరణతో ఆ అభిసారికలు ఇద్దరూ "నందన మంటపం" వైపు ఉషోదయానికి స్వాగతం చెప్పడానికా అన్నట్లు దారి తీసారు.

గమ్యమూ, లక్ష్యమూ ఒకటే అయినందువల్ల ఇద్దరూ, ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరి చూపులూ నిమేష కాలం సంధించుకొని, పరస్పర హస్తగతాలైన పూలసజ్జల మీద నిలిచాయి.

ఎంత చిత్రమైన ప్రేమ పరీక్ష అది !!

శాశ్వతమూ, సౌభద్రమూ అయిన భావి మహారాజ్ఞి పదవి, సామాన్యమూ, సామయికమూ అయిన పూదండ మీదనా ఆధార పడేది !!

పుణ్యరత్నుని పాములాటకి అణుగుణంగా తల ఒగ్గిన ఆ నాగినులిద్దరూ ఒక్కొక్కటిగా మెట్ల నధిగమించి, నందన మంటపం చేరుకొన్నారు. నందన మంటపం మహావిహారానికి ప్రక్కనే ఉన్న నందన పర్వత మధ్యభాగంలోని సమతల ప్రదేశంలో మహారాజు పూర్ణప్రభువు చేత నిర్మింపబడి ఉంది.

అక్కడికి చేరుకొన్న తరువాత, వారెదుర్కొన్నది యువరాజు పుణ్యరత్నుని కాదు. మంటపం మధ్యభాగంలో పద్మాసనం వేసి కూర్చొని, అరమోడ్పు కనులతో ధ్యానంలో మునిగి ఉన్న, సోమపురీ విహారానికి గురుపాదులైన "ఆచార్య ఆనంద శ్రమణకులని."

సనక మేనకలిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు. ఆనంద శ్రమణుకులని వారెన్నడూ చూసి ఎరుగరు ! వారి దృష్టిలో అతనొక సామాన్య బౌద్ధభిక్షువు.

"ఈ భిక్షువు ఇక్కడెందుకున్నట్లు ? ఇతని ధ్యానం ఎప్పటికి ముగిస్తుంది ?" అన్న సందేహం ఇద్దరిలోనూ ఒకేసారి పొటమరించింది.

"భిక్షువుని ధ్యానభంగం కలిగించే నిమిత్తం ఇద్దరూ అతని ముందు మోకరిల్లి, "స్వామీ !" అని పిలిచారు.

ఆనందులు ఆకర్ణాంతములయిన కళ్ళు తెరచి. "ఎవరమ్మా ! మీరు?" అని అడిగారు.

"మేమొక లక్ష్యసిద్ధిని ఆశించి, పరీక్షార్థులమై ఇక్కడికి వచ్చి ఉన్నాము. స్వామీ ! విజయం కలగాలని ఆశీర్వదించండి," సనక మేనకలు ఇద్దరూ అతనికి సాష్టాంగ పడ్డారు.

ఆనందులు వారి ముఖాల వంక ప్రసన్న దృక్కులతో చూసారు "మీ లక్ష్యం నాకు అర్థమయింది తల్లీ ! ప్రేమ సామ్రాజ్యానికి పట్టమహిషులు కావాలని కదా మీ కోరిక ! విజయం తప్పక లభిస్తుంది. కాని మీరు తప్పుదారిలో పయనిస్తున్నారు తల్లీ!" అన్నారు గంభీరంగా. సనక మేనకలు విస్మయంతో ఆనందుల ముఖం వంక చూసి, చేష్టలుడిగి పోయారు. వారి చూపులలో "ఏం చేయాలి స్వామీ ?" అన్న ప్రశ్న గోచరించింది .

ఆనందులు వారి చూపులలో తన చూపులు నిలిపి, "అసూర్యంపశ్యలు, అపురూప లావణ్యవతులు అనురాగవతులు అయిన మీరు, అహంకారి, మదోన్నత్తుడు అయిన ఒక ప్రభు సత్తమునికి మీ ప్రేమ సుమాన్ని అర్పింప బూనడం అవివేకం కాక మరేమిటి తల్లీ ! విలువైన బహుమతి అర్హత గలవారికే ఇవ్వాలమ్మా!" అని ప్రభోదించారు.

ఆనందుల చూపులు వారి అంతరాత్మలలో ఏం తుఫాను లేవదీసిందో ఏమో ! వారి చేతులు అప్రయత్నంగానే తమ తమ సజ్జలలోని పూలమాలలని బయటికి తీసాయి. వెనువెంటనే ఆనందుల తర్జని మంటపం లోని "తథాగతుల" విగ్రహం వంక సూచించింది. అతని మేఘ గంభీర ధ్వని వారిద్దరినీ ఈ విధంగా ఆదేశించింది.

"మీ ప్రేమ సుమాంజలి, ప్రేమ మూర్తులయిన "బుద్ధ భగవానినికే" లభించాలి తల్లీ ! అతని ప్రేమ వలెనే మీ ప్రేమ కూడ విశ్వవ్యాప్తం కావాలి. వెళ్ళండి, వత్సలారా ! మీకు తప్పక విజయంలభిస్తుంది" అంటూ అతను మంటపం విడిచి, విహారం వైపు దారి తీసారు.

సనక మేనకలు చాల సేపటి వరకు చేత పూలదండలతో, అలాగే నిల్చి పోయారు. వారి మనస్సులలో ఆలోచనా తరంగాలు, పెరిగి, విరిగి హృదయపుటంచులు తాకి నురగ పర్వతాలుగా రూపొంది చివరకి చెలియలి కట్టని చేరుకొన్నాయి..

క్రింద నుండి వారిని హెచ్చరిస్తున్నట్లుగా, బౌద్ధ బిక్షువుల "త్రిశరణాల" గానం ఉత్కంఠస్వరంతో వినబడింది.

"బుద్ధం శరణం గచ్ఛామి,<br>
ధర్మం శరణం గచ్ఛామి,<br>
సంఘం శరణం గచ్ఛామి"

అభిసారికలిరువురిలోనూ చైతన్యం వచ్చింది. ఇద్దరి అడుగులూ సన్నని మంజీర ధ్వనులతో ఒకే దిక్కుగా పయనించాయి. విహారాన్ని దాటి, మంటపాన్ని దాటి, పర్వత శిఖరాన్ని దాటి, అనంత విశ్వంలోని ప్రేమ సామ్రాజ్యం లోకి--

అశ్వారూఢుడై మంటపం వైపు, వారిద్దరి ప్రేమ పరీక్షార్థం వస్తున్న పుణ్యరత్నుడు, దూరం నుండే వారిద్దరూ చేత పూమాలలతో, పర్వత శిఖరాగ్రం నుండి, దూకడం చూసి, స్తబ్ధుడై పోయాడు.

సోమపురి మహావిహారం, నందన మంటపం, ధర్మ ప్రభువైన పుణ్య ప్రభుని కోట, శిథిలావస్థలో ఈ నాటికీ నిలిచి ఉన్నాయి !

విహారానికి చెరొక వైపు శతాబ్దాలుగా, త్రిశరణాలని త్రికారణాలతో నమ్మి, ఆచరించే బౌద్ధభిక్షువుల పిపాశోపమనానికే కాబోలు, సజీవ ప్రేమ వాహినులైన రెండు జలధారలు, కొండ క్రిందికి దూకుతూ, ఈ నాటికీ ప్రవహిస్తున్నాయి.

ఇరు వాగులలో ఒక దాని పేరు, "సనక', రెండవ దాని పేరు "మేనక."

# అమ్మ – కోరాడ సాయిలక్ష్మి



రచయిత్రి

**అమ్మ, ఎందుకు** ఎప్పుడూ ఏడుస్తూ ఉంటుంది? ఇది నాకెప్పుడూ అర్థం కాదు.

నేను పుట్టినప్పుడు నన్ను శుభ్రంచేసి తన పక్కన పడుకోపెట్టగానే అమ్మ ఏడిచిందట, అది విన్నప్పుడు నాకు భలే ఆశ్చర్యం వేసింది, తొమ్మిది నెలలు మోసి కన్న బిడ్డని చూసి ఎవరైనా నవ్వుకుని సంతోషిస్తారు కానీ ఏడుస్తారా..!? ఏంటో మా అమ్మ..!!

నాకు టీకాలు ఇచ్చినప్పుడు, నా చెవులు కుట్టినప్పుడూ, నా పుట్టి వెంట్రుకలు తీస్తుంటే, నేను మొదటిసారి అమ్మా అన్నప్పుడు, నేను మొదటి అడుగు వేసినప్పుడు, ఆఖరికి నేను మొదటిసారి బడికి వెళ్ళినప్పుడు కూడా అమ్మ ఏడ్చింది. అసలు మా అమ్మకి నవ్వటం రాదా, ఏడవటం తప్ప అని నాకో పెద్ద డవుటు.

ఆరోజు నాకింకా గుర్తుంది, మేము అప్పటి వరకూ చిన్న ఇంట్లో ఉండేవాళ్ళము, నాన్న కాంపులనీ అదనీ ఇదనీ తిరుగుతూ ఉండేవాళ్ళు. నేనేమో అమ్మ పక్కన పడుకునేదాన్ని. అప్పుడు మేము పెద్ద ఇంట్లోకి మారాము, నాకు కూడా ఒక పెద్ద గది. గదినిండా బోల్డు బొమ్మలు, నాకో పెద్ద మంచం అన్నీ ఉన్నాయి, చెప్పద్దూ నాకు భలే ఆనందం వేసింది నాకు కూడా ఒక గది ఉందని. ఆ రోజంతా నేను ఎంత సంతోషంగా ఉన్నానో, రాత్రి నా గదిలో నేను నా మంచం మీద హాయిగా పడుకుంటానని. అమ్మ మేడ మీద చేతులు వేసి చెప్పా "అమ్మా ఈ రోజు నుండి నేను నా గదిలో పడుకుంటా" అని, అంతే అమ్మ కళ్ళల్లో మళ్ళా కన్నీళ్ళు. ఎందుకమ్మా ఏడుస్తున్నావు? అంటే ఏమీ మాట్లాడదు, ఏమీ లేదు అని దాటేస్తుంది. అంతోటి దానికి ఏడవటం ఎందుకో అర్థం కాక నాకు ఎంత చిరాకు వచ్చిందో.

నేను పెద్దదాన్ని అయ్యానట, చాప మీద కూర్చోపెట్టి అత్తలూ వాళ్ళూ హడావిడి చేస్తున్నారు. నాకు అంతా కొత్తగా, వింతగా, సంతోషంగా ఉంది. కొత్తగా కొన్న పట్టులంగా వోణీ వేసుకుని అమ్మ ఎదురుగా నుంచున్నా, ఎంత ముద్దుగా ఉన్నావే అని దగ్గరికి తీసుకుంటుందేమో అనుకుంటే షరా మామూలుగా కన్నీళ్ళు. దేవుడా అమ్మకి బదులు నాకు నీళ్ళ టాంకర్‌ని ఇచ్చావేంటి అని దేవుడిని ఒకసారి తిట్టేసుకున్నా.

తర్వాత నా జీవితం నాది అయిపోయింది, నా చదువు, నా స్నేహితులూ, నా సినిమాలూ-షికార్లూ, అప్పుడప్పుడూ అమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు కనపడ్డా పట్టించుకోవటం మానేసా. నా దృష్టిలో అదంతా వొట్టి "ట్రాష్ " అనిపించింది, మనుషులు "ప్రాక్టికల్"గా ఉండాలి కానీ ఇలా చీటికీ మాటికి ఏడుస్తూ ఉండటం "నాన్‌సెన్స్" అనిపించింది. నేను తన గురించి కానీ, తన కన్నీళ్ళ గురించి కానీ పట్టించుకోకపోయినా అమ్మ నన్నెప్పుడూ ఏమీ అనలేదు, " ఏమంటుంది, మహా ఐతే ఇంకో నాలుగు కన్నీటి చుక్కలు కార్చటం తప్ప" అనుకుని నా బాటలో నేను సాగిపోయాను.

❋❋❋

"అమ్మా, నాన్నా నేనొక అబ్బాయిని ప్రేమిస్తున్నా, మీకు ఇష్టమైతే మీ అందరి సమక్షంలో పెళ్ళి చేసుకుంటా, లేకపోతే..." ఇంట్లో అల్టిమేటం జారీ చేసేసా, కానీ ఆశ్చర్యం అమ్మ కళ్ళల్లో నేను ఊహించినట్టు కన్నీళ్ళు రాలేదు, నాకు అర్థం కానీ భావన ఏదో తొంగి చూసింది. అదేంటో తెలుసుకోవాలని కానీ, తెలుసుకుని చర్చించాలని కానీ నాకు ఆసక్తి లేదు, అందుకే చూసీ చూడనట్టు వదిలేసా.

నా పెళ్ళి సందీప్‌తో అంగరంగ వైభవంగా జరిగిపోయింది. పెళ్ళి జరుగుతున్నంతసేపూ నేను అమ్మనే గమనిస్తున్నా. తను చాలా గంభీరంగా ఉంది, ఎక్కడా చాటుకి వెళ్ళి కూడా కన్నీరు కార్చలేదు. కనీసం అప్పగింతల సమయంలో కూడా తను ఏడవలేదు, నాకెందుకో అమ్మ ఏడవకపోతే చాలా అసహజంగా అనిపించింది, ఎందుకంటే ఆరోజు మొదటిసారి నేను ఏడుస్తున్నా.

అత్తారింటికి వెళ్ళేముందు అమ్మ దగ్గరికి వెళ్ళి తన వడిలో తల పెట్టుకుని వస్తున్న కన్నీరుని దిగమింగుకుంటూ "అమ్మా నాతో ఏదైనా మాట్లడవా" అన్నా. మెల్లిగా తల నిమురుతూ అమ్మ ఒకే ఒక్క మాట అంది, "కోరుకున్నవాడితో మనసైన కాపురం చేస్తూ కలకాలం హాయిగా ఉండు". నాకెందుకో అమ్మ ఇంకొంచం మాట్లాడితే బాగుండు అనిపించింది, ఒక్క సారి నన్ను పట్టుకుని ఏడిస్తే బాగుండు అనిపించింది, కాని అమ్మ మాత్రం ఇవేవీ పట్టనట్టు మాములుగా చాలా మాములుగా ఉండిపోయింది.

❋❋❋

సందీప్‌తో నా జీవిత నౌక ఏ ఒడిదుడుకులూ లేకుండా హాయిగా సాగిపోతోంది. నిజానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను, ఎంత సంతోషంగా అంటే అప్పుడప్పుడు అమ్మ, అమ్మ కన్నీళ్ళు గుర్తుకు వచ్చినా సందీప్ సాంగత్యం వల్ల వాటిని వెంటనే మరిచిపోయేదాన్ని. నేను నెల తప్పాను అని తెలిసి అమ్మ మళ్ళా కన్నీళ్ళు పెట్టుకుంది, కానీ ఈసారి అమ్మ మీద నాకు కోపం రాలేదు ఎందుకంటే అమ్మతో పాటు నా కనుకొలుకుల్లో కూడా ఒక నీటి చుక్క నిలవనా జారనా అని ఊగిసలాడి చివరికి మెల్లిగా జారిపోయింది. నేను అమ్మని అవుతున్నా అంటే ఆ కన్నీళ్ళేమిటో ఇదమిద్ధంగా అర్థం కాలేదు, నాలో నాలాంటి ప్రాణి రూపుదిద్దుకుంటోందనా లేక నేను ఒక్కసారిగా పెద్దదాన్ని అయిపోయాననా? ఏమో మరి, నా కన్నీళ్ళకి నా దగ్గరే సమాధానం లేదు.

❋❋❋

"అమ్మలూ పాప అచ్చం నీలా ఉందిరా, కళ్ళు తెరిచి చూడు" అన్న అమ్మ పిలుపుతో మెల్లిగా కళ్ళు తెరిచి చూసా. పక్కన చంటిది ఎంత ముద్దుగా ఉందో ఎర్రటి మూతి, నల్లటి జుత్తు, చిన్ని చిన్ని వేళ్ళు, ఇదేంటి కళ్ళు మసకబారిపోతున్నాయి, అరే నా కళ్ళల్లో

కన్నీళ్ళా? నా గర్భసంచీ ఇంతకాలం తను మోసిన బిడ్డ కోసం వెతుకుతున్నట్టుగా అనిపిస్తోంది, ఆ బిడ్డ నా పక్కనే ఉన్నా సరే తను నా నుండి దూరంగా అయిపోయిన భావన, అదేనా నా కన్నీళ్ళ కి కారణం? ఏమో మరి.

నా చిట్టి తల్లితో రాక నా ఆలోచనా విధానాన్ని చాలా మార్చేసింది అనే చెప్పవచ్చు. ఇంతకు ముందు "నాన్‌సెన్స్ " అనిపించినవి ఒక్కసారిగా ఎంతో విలువైనవిగా అనిపించసాగాయి. తనతో గడిపే ప్రతిక్షణం ఎంతో అపురూపంగా అనిపిస్తోంది, తనతో పాటు నేను కూడా నా జీవితాన్ని మొత్తం ఆస్వాదిస్తూ పెరుగుతున్నట్టు అనిపిస్తోంది. తనతో ఎంతగా అనుబంధం పెనవేసుకుపోయిందంటే తను పాకితే మోకాళ్ళు నొప్పి పుడతాయేమో, తను నడిస్తే పాదాలు కందిపోతాయేమో అని నా ప్రాణం విలవిలలాడిపోయింది.

తర్వాత అమ్మ కన్నీరు పెట్టిన ప్రతి సందర్భంలో నేను కూడ కన్నీరు పెట్టాను. కొన్నిసార్లు నా చిట్టి తల్లి బాధ పడుతోంది అన్న బాధతో, కొన్నిసార్లు అది నా నుండి దూరం గా వెళ్ళిపోతోంది అన్న వేదనతో, మరికొన్ని సార్లు అది ఎంత ఆరిందా అయిపోయిందా అన్న ఆనందంతో. కానీ ప్రతి సారి చూసేవారికి మాత్రం అవి మామూలు కన్నీళ్ళలాగానే అనిపించాయి తప్పితే తేడా తెలియలేదు.

❖❖❖

అదేంటో విచిత్రంగా బాధతో గుండె బరువెక్కినా, ఆనందంతో ఎద ఎగిసిపడినా ఆ భావాలు ఉప్పెనలాగ నీటిరూపం కంటి నుండి బయటపడాల్సిందే కానీ వాటికి ఇంకొక మార్గంలేదా అనిపించేది. కానీ ప్రతి కన్నీటి చుక్కకి వెనక మాటల్లో చెప్పలేని ఎన్నో భావాలు దాగున్నాయని అర్థం అయ్యింది. ఇవన్నీ చాలా ఆలస్యంగా తెలిసాయి, ఎంత ఆలస్యంగా అంటే అమ్మ దగ్గిర ఒక్కసారి కూర్చుని "అమ్మా నువ్వెందుకమ్మా ఆరోజు అలా కంటతడి పెట్టావు?" అని అడగలేనంత ఆలస్యంగా. అమ్మ నా ప్రశ్నలు అందుకోలేనంత దూరంగా వెళ్ళిపోయే వరకూ నాకు అమ్మ కన్నీళ్ళ విలువ తెలియలేదు, తెలుసుకునే సమయానికి అమ్మ లేదు.

ఒక్క సారి మళ్ళా పసి పాపాయిగా మారిపోయి అమ్మ కన్నీరు పెట్టిన ప్రతిసారి వాటి వెనక ఉన్న భావన తెలుసుకోవాలి అని ఉంది, అమ్మ మనసు లోతుల్లోకి తొంగి చూడాలి అని ఉంది, అమ్మని నిర్లక్ష్యం చేసిన బిడ్డగా కాక తన మనసు తెలిసిన స్నేహితురాలిగా పెరగాలని ఉంది. అమ్మ కన్నీళ్ళని చూసి చిరాకు పడడటం కాక వాటి వెనక ఉన్న ప్రేమలో తడిసిపోవాలని ఉంది.!!

❖❖❖

# కలకరిగింది ఏయోగి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**"సార్! మిమ్మల్ని అయ్యగారు** స్టేషన్‌కు రమ్మంటున్నారు." సీరియస్‌గా పనిచేసుకుంటున్న సుబ్బారావు ముందు నిలబడ్డ కానిస్టేబులు కనకారావు చెప్పాడు.

"ఎందుకు?" చిరాగ్గా అడిగాడు సుబ్బారావు.

"మీ కేసు విషయం మాట్లాడాలిట -"

"రేపు వస్తాలే"

"కాదు - అర్జెంటుట - తమర్ని ఇప్పుడు ఉన్నపళంగా తోలుకు రమ్మన్నారు." కానిస్టేబులు చెప్పాడు.

"చూడు కనకారావు - నాకు చాలా అర్జెంటు పని ఉంది. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతున్నది - ఇప్పుడు కుదరదని చెప్పు." సుబ్బారావు మొహం చిట్లించి చెప్పాడు.

"మీ ఇష్టం - మా దొరకు కోపం వస్తుంది."

"రానియ్యవయ్యా! ఇక్కడ నాకు చచ్చేదానికి కూడా తీరిక లేనంత పని ఉంది." అని విసుక్కున్నాడు.

కనకారావు ఓ వంకర చూపు చూసి నిష్క్రమించాడు.

ఓ పదిహేను నిమిషాలు గడిచిందో లేదో - సుబ్బారావుకు మేనేజరు నుండి కబురు వచ్చింది.

"సుబ్బారావు! నీ కోసం యస్సైలైన్లో ఉన్నాడు." చెప్పాడు.

"హలో - సుబ్బారావును మాట్లాడుతుండా - ఎవరు?"

"ఏరా - కళ్ళు నెత్తిమీద కొచ్చాయా? రానన్నావుట! ఇక్కడ మేం గాజులు తొడుక్కుని కూర్చున్నామా? అవసరం నీదా మాదా? అస్సలు నీ ఇంట్లో దొంగతనం జరిగిందా? మా ఇంట్లో జరిగిందా? అంతగాడికి కంప్లైంటు ఎందుకిచ్చావు?"

సుబ్బారావుకు చెమటలు పట్టాయి. అతను మర్యాదస్తుల కుటుంబంలో పుట్టి పెరిగాడు. అందరిని సారు అని - ఏవండీ అని గౌరవించడమే తెలుసు. కనీసం స్నేహితుడినైనా నువ్వని - ఒరే అని పిలవడానికి భయపడతాడు. ఆ మాటల్లోని తీవ్రతకు - పదజాలానికి చాలా బాధపడ్డాడు.

"అది కాదు సార్! ఇక్కడ ఇన్‌స్పెక్షన్ జరుగుతున్నది - రేపొద్దున్నే వస్తాను." భయపడుతూ చెప్పాడు.

"అంటే ఏంటిరా నీ ఉద్దేశం - మేమంతా పనిలేని వాళ్ళం - నువ్వొక్కడివే పెద్ద పనిచేసే మొగాడివా? రేపటి దాకా నీకోసం కళ్ళల్లో ఒత్తులేసుకుని కూర్చోవాలా? ఒరేయ్! మాతో పెట్టుకో మాకు. తిక్కరేగిందంటే ఎన్ కౌంటరు చేసేస్తా!"

"అంత మాటెందుకు లెండి సార్ - ఇప్పుడే వస్తాను."

అవతల ఫోన్ పెట్టేసిన శబ్దమయింది.

"సార్! కొంచెం పోలీసు స్టేషనుకు పోయి రావాలి సార్!" చెప్పాడు మేనేజరుకు.

"అవసరమనుకుంటే లీవు పెట్టిపో!" మేనేజరు కోపంగా అన్నాడు.

"అదికాదు సార్! ఆఫీసులో వర్కు చాలా ఉంది - లీవు పెడితే అది ఆగిపోతుంది." సుబ్బారావు చెప్పాడు.

"అరే! లీవు పెట్టమన్నా గాని - వర్కు చేయవద్దని చెప్పానా? లీవు పెట్టి అక్కడికి పోయిరా. వచ్చి రాత్రల్లా కూర్చుని నీ పని నువ్వు పూర్తి చెయ్యి." మేనేజరు చెప్పాడు.

"అంత దానికి లీవు ఎందుకు పెట్టాలి సార్?"

"డిసిప్లిన్ అయ్యా డిసిప్లిన్! అసలే ఇన్‌స్పెక్షన్ జరుగుతున్నది - బ్యాంకుకు మాట రాకూడదు. నేను గాబట్టి ఈ మాత్రం కన్‌సెషన్ ఇచ్చాను." నవ్వాడు మేనేజరు.

"అలాగే లెండి సార్!" సుబ్బారావు గత్యంతరం లేక లీవు లెటరు రాసి బయటపడ్డాడు. స్టేషనుకు చేరుకున్నాడు సుబ్బారావు.

టేబుల్ మీద బూటు కాళ్ళు పెట్టుకుని యస్సై ఫణిభూషణం లాఠీ తిప్పుతూ ఉన్నాడు. ఇతడ్ని చూసి కనీసం కూర్చోమని కూడ చెప్పలేదు.

"ఏదో ఇన్‌స్పెక్షన్ అన్నావు? అప్పుడే వచ్చావేంటి?"

"తమరు పిల్చారుగా - చెప్పండి - ఎందుకు పిల్చారు?"

"ష్! ఏమిటా తొందర! రైలు కెళ్ళాలా?"

"కాదండి - కాస్త పని ఉంది.."

"అదే నాకు మండేది - అంటే మాకు పనిలేదనా? ఇదిపనికాదనా? డ్యూటీలో వున్న గవర్నమెంటు సర్వెంటును అవమానిస్తే ఏ సెక్షన్ కింద కేసు పెట్టచ్చో చెప్పు కనకారావు?"

"అయ్యా తమరికి తెలియంది ఏముంది - ముందు మూసేద్దాం. ఆ పైన తీరిగ్గా క్రిమినల్ కోడు చూద్దాం -" కనకారావు సలహా ఇచ్చాడు యస్సై ఫణిభూషణానికి.

"క్షమించండి! ఇంతకీ మీకు నేనేం సేవచేయగలను?" సుబ్బారావు భయపడ్డాడు.

"ఆ సెల్ లో కొందర్ని వేశాం - వాళ్ళను నువ్వు గుర్తుపట్టగలవా?" అంటూ ఓ సెల్ వంక చూపించాడు.

సుబ్బారావు ఆ జైలు దగ్గరకు పోయి లోపలికి చూశాడు ఇద్దర్ని బాగా తన్నినట్లున్నారు - మూలుగుతూ పడున్నారు కడుపులో దేవినట్లయింది.

"చూడలేదు సార్!" చెప్పాడు.

"సరే! ఈ నగలు గుర్తుపట్టగలవా?" ఓ మూట విప్పుతూ అడిగాడు యస్సై ఫణిభూషణం.

సుబ్బారావు ఆ నగలను పరిశీలించాడు - పాత నగలు లాగా ఉన్నాయి - తన భార్య నెక్లెసును పోలినట్లు ఒక నెక్లెసు ఉంది. గాజులు మటుకు వేరేగా ఉన్నాయి.

"నెక్లెసు అదే మోడల్ గాని - గాజులు మటుకు వేరేగా ఉన్నాయి. "

"'అంటే నెక్లెసు నీదేనా?"

"అబ్బే! అలా ఉంది!"

"అబ్బ! నీదే అనుకోవయ్యా! ఈ కేసు పెండింగు పడి చాలాకాలమైంది. మాకు పైనుంచి చచ్చే ఫోన్లు వస్తున్నాయి ఇంకా క్లోజు చెయ్యలేదేమని.."

"సారీ సార్! నాది కాని దాన్ని నాదని చెప్పడం భావ్యం కాదు"

"ఒరే కనకారావు - అయ్యగారికి ట్రీట్ మెంటు ఇవ్వరా?" ఫణిభూషణం అన్నాడు. కనకారావు లాఠీతో అతని వెన్నుమీద ఒక్కటిచ్చాడు "సార్ నన్నెందుకు కొడతారు!?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు కన్నీరు ఆపుకుంటూ.

"దొంగ కంప్లైంటు ఇచ్చిందానికి నీ నగలు పోకుండానే పోయినయ్యని మా ప్రాణాలు తీస్తున్నావు? నిజంగా పోయిఉంటే ఇవి నీవని చెప్పేవాడిని!" యస్సై కస్సుమన్నాడు.

"సార్! నా భార్య నగలు పోయిన మాట వాస్తవం సార్! ఓ నెక్లెసు - జత గాజులు - నాలుగు పట్టుచీరలు - ఇంకా పదివేల దాకా క్యాష్ అయిపోయింది సార్! ఇవి చూస్తే వేరే వాళ్ళవి లాగా ఉన్నాయి - వీటిని నేనెలా తీసుకోను సార్!" సుబ్బారావు దీనంగా చెప్పాడు.

"నువ్వొద్దులే గాని - నీ పెళ్ళాన్ని స్టేషనుకి తీసుకురా? అదన్న గుర్తుపడుతుంది." కరుగ్గా అన్నాడు ఫణిభూషణం.

సుబ్బారావుకు పచ్చి వెలక్కాయ గొంతులో అడ్డుపడింది.

"సరేలెండి సార్ - మావే లెండి ఇవి." చెప్పాడు.

"అలారా దారికి - రేపు కోర్టులో సాక్ష్యం చెప్పాలి. ఇవి నీవే అని ఒప్పుకోవాలి - వాళ్ళే దొంగతనం చేశారని ఒప్పుకో -"

సుబ్బారావు మళ్ళీ సెల్ దగ్గరికి పోయి తొంగిచూశాడు, బక్క ప్రాణులు - అతి బీదవాళ్ళు - గుర్తుపట్టాడు.

"సార్! వీళ్ళు సాయిబాబా దేవళం దగ్గర అడుక్కుతినే వాళ్ళు కదు సార్! పాపం వాళ్ళేం దొంగతనం చేస్తారు సార్!"

"అయితే మేం చేస్తామటయ్యా? ఎవరు ఎటువంటి వాళ్ళో మాకు తెలియదనుకున్నావా? షటప్! వాళ్ళు ఒప్పుకున్నారు."

"పాపం! అమాయకులు సార్! వాళ్ళని ఎందుకిరికిస్తారు?"

"ఒరే! కనకారావు - వీడెవుడురా నాకే నీతులు చెబుతాడు - వాళ్ళే 'నీ ఇంట్లో దూరాం' అని ఒప్పుకుంటే నువ్వేవడివయ్యా కాదనడానికి. ఇన్నాళ్టికి ఈ కేసు క్లోజు చెయ్యవచ్చని నే సంతోషపడుతుంటే - నక్షత్రకుడిలా అడ్డుపడుతున్నావ్! ఒరే! ముందు వీడ్ని బొక్కలో తోసెయ్యి - తరువాత ఆలోచిద్దాం -" యస్సై చెప్పాడు.

"అయ్య బాబోయ్! నా ఉద్యోగం ఊడుద్ది - నా కెందుకు సార్! మీరెవరు దొంగతనం చేశారని చెప్పమంటే వాళ్ళ పేరే చెబుతాను. ఆఖరికి నా బామ్మర్ది దొంగతనం చేశాడని చెప్పమన్నా చెబుతాను." లెంపలు వేసుకున్నాడు.

"ఇందాకేమైందయా ఈ బుద్ధి?"

"బుద్ధి గడ్డితింది.." సుబ్బారావు పశ్చాత్తాప పడ్డాడు.

"సరే! జేబులో పైసలు ఎంతున్నా ఏంటి?" యస్సై అడిగాడు.

"ఓ యాభై రూపాయలున్నాయి సార్ - టీ తెప్పించమంటారా!"

"ఛీ ఛీ! సిగ్గులేదు - నే తెప్పించలేనా టీ! దానికి నువ్వే కావాలా! రేపు మా బాసు వస్తున్నాడు. వాడికి అన్ని అలవాట్లు ఉన్నాయి. ఏ లోటు లేకుండా చూసుకోవాలి.. ఎంతలేదన్నా ఓ అయిదువేలు ఖర్చవుతుంది. ఓ పదివేలు సర్దు సాయంత్రం లోగా..." ఆర్డరు వేశాడు యస్సై.

"సార్! నేను బీదవాడిని సార్! నా దగ్గర అంతలేదు సార్! రెండొందలు సర్దుతాను సార్!" బిక్క మొహంపెట్టాడు.

"ఏం బే! నఖరాలు చేస్తున్నావ్! ముష్టి ఇస్తావా ముష్టి! బ్యాంకులో పని చేస్తూ లేదంటావ్. నాకేం ఊరికే ఇస్తున్నావా? రేపు కోర్టులో ఆ నగలు నీకిప్పిస్తాగా!" ఉరిమాడు యస్సై.

"సార్! నాకా నగలు వద్దు - నే డబ్బు ఇవ్వడమూ వద్దు" సుబ్బారావు చెప్పాడు. '

'అంతా నీ ఇష్టమేనా? - ఒరే కనకారావు - వీడిపైన కేసు బుక్ చెయ్యరా -"

"ఏమని సార్!" కనకారావు అడిగాడు.

"వీడు నక్సలైట్ల మనిషి. మొన్నటి హత్యలకు వీడికి సంబంధం ఉంది.. రాసుకో - మొన్న కాల్పులకు - వీడికి -"

సుబ్బారావు పూర్తిగా భయపడిపోయాడు.

"సార్! సార్! నేను అమాయకుడ్ని సార్! నేను అగ్గిపుల్లను కూడ కాల్చలేను సార్ - అటువంటిది తుపాకులు ఎలా కాలుస్తాను సార్! నేను గౌరవంగా బ్యాంకులో జాబ్ చేస్తూ బ్రతుకున్నా సార్!" దీనంగా చెప్పాడు సుబ్బారావు. ':ఒరే! నిన్న లాడ్జీలో దొరికిన గుంటను తీసుకురారా!" యస్సై ఆర్డరు వేశాడు.

కనకారావు ఓ యువతిని పట్టుకొచ్చాడు.

"ఒసే! నిన్ను రేపు చేసింది వీడేనా?" అడిగాడు.

ఆమె భయపడుతూ తలూపింది.

"కనకరావు! రేపుకు ఎన్నేళ్ళురా శిక్ష? అర్జెంటుగా దీన్ని - వీడిని డాక్టరు దగ్గరికి తీసుకు పోరా - కేసు బుక్ చేద్దాం -" యస్సై నవ్వాడు భీకరంగా.

"సార్! దయచూపండి - సాయంత్రంలోగా ఐదువేలు పట్టుకోస్తాను - అంతకు మించి నాకు చేతకాదు." కాళ్ళ మీద పడ్డాడు సుబ్బారావు.

"సరే ఏడు! పోలీసులంటే మరీ భయం లేకుండా పోతున్నది - మా తడాఖా ఏంటో చూపిస్తాం - జాగ్రత్త!" వార్నింగు ఇచ్చాడు యస్సై.

ముచ్చమటలు పడుతుంటే బయటకొచ్చాడు సుబ్బారావు. బ్యాంకుకు పోయి వాళ్ళ కాళ్ళు వీళ్ళ కాళ్ళు పట్టుకుని పదివేలు పోగేసి పరుగెత్తుకుంటూ వచ్చి యస్సై కిచ్చి - దండం పెట్టాడు.

సుబ్బారావుకు జీవితం మీద విరక్తి పుట్టింది. సీత మీద కోపం వచ్చింది.

అసలేం జరిగిందంటే - ఓ రోజు మధ్యాహ్నం సుబ్బారావింట్లో దొంగతనం జరిగింది. సీత స్కూలుకి వెళ్ళింది. సుబ్బారావు బ్యాంకుకు వెళ్ళాడు.

దొంగలు తాళం రాక - గడియను రంపంతో కోసి లోపల జొరబడ్డారు. అన్ని గదులు - అన్ని బీరువాలు గాలించారు. విలువైన వస్తువులను మూటలు గట్టడం మొదలెట్టారు. ఆ టైంలో సీతకు ఆరోగ్యం బాగో లేక తన స్టూడెంటులను, కొలీగును తీసుకుని ఇంటికి వచ్చింది.

ఆ గేటు చప్పుడుకు ఆ దొంగలు మేడపైకి పోయి - మేడ మీద వాలిన చెట్టుమీంచి ప్రక్కింట్లోకి దిగిపారిపోయారు. మేడ మెట్లు ఇంటిలోంచే ఉన్నాయి కాబట్టి వీరు తెరచిన తలపుల నుండి లోపలికి వస్తూ ఉంటే వారు పైకి పారిపోయారు. ఇద్దరు వీపులను మటుకు సీత చూసింది.

తెరచిన తలుపులు - కోయబడిన గడియ - వేసిన తాళం వేసినట్లే ఉండటం - చూసి ఆమె నివ్వెర పోయి నిశ్చేష్టురాలైంది.

ఆ షాకు నుండి తేరుకోవడానికి కొన్ని గంటలు పట్టింది.

ఈ లోపు స్నేహితులు కొన్ని కార్యాలు నిర్వహించారు.

సుబ్బారావు ఇంటి కొచ్చి చూసి ఘొల్లుమన్నాడు. ఆ వీధిలోని పెద్ద మనుషులు వచ్చి విచారించారు.

ఎంతపోయిందో అంచనా వేశారు. ఒక నెక్లెసు - గాజులు - కొన్ని బట్టలు - కెమెరా పోయాయి కొంత క్యాష్. ఓ యాభై వేలు నష్టం!

కొందరు పోలీసులకు కంప్లైంటు ఇమ్మన్నారు - సుబ్బారావు ముందు ఒప్పుకోలేదు. పోయినవేవో పోయాయి - మళ్ళీ నలుగురి నోట్లో నానడం ఎందుకనుకున్నాడు. పైగా పోయినవి వస్తాయన్న నమ్మకం అతనికి లేదు.

కాని సీత పట్టుపట్టింది "ఆ నెక్లెసు మా బామ్మది... నాకదంటే ప్రాణం - దాని ఖరీదు ఎంతని కాదు - ఆమె లేదు కాని, ఆమె గుర్తు నాకు మిగిలింది. నా గొలుసు నాకు కావాలి." అని ఏడ్చింది. ఏదైనా అనుభవంతో గాని తత్వం బోధపడదని తెలుసుకుని సుబ్బారావు చేసేది లేక కంప్లెయింటు ఇచ్చాడు.

అక్కడి నుండి అతనికి కష్టాలు మొదలయ్యాయి.

ఒకసారి క్యూ ఆర్‌టి వాళ్ళు వచ్చి చూశారు. ఆ పైన యస్సై వచ్చాడు.

ఆ పైన బీరువాలోని చీరల్ని - వస్తువుల్ని - వెండి గ్లాసులు - కంచాల్ని పోలీసులు సీజ్ చేసి తీసుకు పోయారు.

కంప్లయింట్ రాయడానికి చేతులు తడపాల్సి వచ్చింది. ఆ తరువాత అడపాదడపా వాళ్ళు పిలిచినప్పుడల్లా పోవాల్సి వచ్చింది. దీనికే బోల్డు సెలవలై పోయాయి.

మా కేసు ఏమయిందని విచారించడానికి వెళ్ళినప్పుడల్లా జేబులు ఖాళీ అయిపోయేవి. రోడ్డు మీద కానిస్టేబుళ్ళు కనిపించినా ఖర్చులకని డబ్బులు వసూలు చేసే వాళ్ళు.

అంతేగాక అప్పుడప్పుడు ఇల్లు పరిశీలించాలని పోలీసు బలగం వచ్చేవాళ్ళు వారందరికి టిఫిన్లు - అప్పుడప్పుడు భోజనాలు ఏర్పాటు చేయాల్సి వచ్చేది.

ఈ లోగా యస్సై మారిపోయాడు. అతను తిన్నంత తిని వెళ్ళిపోయాడు. మళ్ళీ 'రెడ్డొచ్చె మొదలాడు' లాగ మళ్ళీ కొత్త యస్సై ఫణి భూషణంకు భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చింది. పైగా నోటి దురుసు - 'మానవ హక్కులకు భంగం కలిగించే ప్రవర్తన భరిచాల్సి వచ్చేది.

ఇలా ఒక సంవత్సరం దాటిపోయింది.

తీరిగ్గా కూర్చుని లెక్కలు వేసుకుంటే అసలు దొంగలకంటే దొరల ముసుగు వేసుకున్నవాళ్ళే ఎక్కువ దోచుకున్నట్లు అర్ధమయింది సుబ్బారావుకు కేసు ఓడిపోయిన వాడు కోర్టులో ఏడుస్తాడని ఎందుకన్నారో అర్ధమైంది.

మినిష్టర్లను పట్టుకుని రికమెండేషన్ చేయించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది.

దానికి తోడు ఇంటికి బందో బస్తు చేయడానికి కొత్త గడియలు, గ్రిల్లు గేటు, ఆ గ్రిల్లుకు మెష్షు వగైరా చిన్ని చిన్ని మార్పులకు వేలకు వేలు అయిపోయింది. సుబ్బారావు అవసరం చూసి రూపాయి పనికి పది రూపాయలు డిమాండు చేశారు.

గడియ వేసే వడ్రంగి దోచుకునే వాడే -

గ్రిల్లుకు రేకు బిగించే ఐరన్ వాడు దోచుకునే వాడే -

గేటు కూర్చోబెట్టే గౌండా దోచుకునే వాడే -

ఇసుకతోలే బండి వాడు దోచుకునే వాడే -

కూలికి వచ్చే పనోళ్ళు దోచుకునే వాళ్ళే -

వాస్తు సలహాలు సూచనలు ఇచ్చే ఇంజనీరు - వాస్తు శాస్త్రులు దోచుకునే వాళ్ళే -

సానుభూతితో చూడ్డానికి వచ్చిన బంధువులు రోజులు తోజులు తిష్టవేసి దోచుకునేవాళ్ళే -

ఇంట్లో కాదు దొంగలు పడింది - దేశంలో దొంగలు పడ్డారు అనుకున్నాడు.

ఒక్క కేసు కోసం ఎన్ని సెలవలు క్షవరం చేసుకోవాలో - ఎంత మానసి క్షోభ అనుభవించాలో సీతకు కూడా అర్ధం కాసాగింది. కేసు విత్ డ్రా చేసుకుందామమటే కుదరదన్నారు పోలీసులు. పైవాళ్ళ నోటీసుకు పోయింది ఇప్పుడేం చెయ్యలేమన్నారు. కావాలంటే అటువంటి నగలు - వస్తువులు తీసుకొచ్చి ఇవ్వండి - దొంగలనుండి రికవరీ చేశామని చెప్పి కేసు క్లోజు చేస్తామన్నారు అయిన క్షవరం చాలక మళ్ళీ అదొక తిరు క్షవరం ఎందుకని కిమ్మనకుండా కూర్చున్నారు దంపతులు.

మరునాడు కోర్టుకు హాజరయ్యారు ఇదరూ. జడ్జిగారి ఎదుట ఆ నగలు తమవే అని చెప్పారు.

సాయిబాబా గుడి దగ్గర అడుక్కునేవాళ్ళు కూడా తామే దొంగలమని ఒప్పుకున్నారు.

అందులో కొంత వారి స్వార్ధం ఉందిట. ఉచితంగా రెండు పూటలా జైలులో భోజనం దొరుకుతుందని వాళ్ళు ఆడ పడ్డారుట.

చివరికి కేసు క్లోజ్ అయింది.

ఆ నగలు సుబ్బారావు, సీతలకు హ్యాండ్ ఓవర్ చేశారు. కొన్ని బట్టలు - వెండి వస్తువులు కూడా అప్పుడు పట్టుకు పోయినవిచ్చారు. కాని బయట కొచ్చిం తర్వాత ఫణి భూషణం బేరం పెట్టాడు.

"కేస్ సెటిల్ చేసినందుకు మాకు ఇవ్వాల్సింది ఇవ్వలేదు -"

"ఎంత సార్!" భయపడుతూ అడిగాడు.

"ఓ పదిహేను వేలు- సరిపెట్టుకుంటా!" ఔదార్యం చూపించాడు.

"ఓమ్మో! అంత లేదు సార్ - ఓ వెయ్యి ఇస్తాను." బేలగా అన్నాడు.

"వెయ్యి ఇస్తావా - వేసెయ్యండిరా వీడ్ని!" అని గర్జించాడు ఫణిభూషణం

టపటపమ అతని వీపు మీద లాఠీ దెబ్బలు తగిలాయి. రాజుగారు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా?

"సార్ నిజంగా నాదగ్గర డబ్బులేదు" ఏడ్చాడు సుబ్బారావు.

"సరే ఆ నగలు ఇక్కడ పెట్టిపో -" యస్సై చెప్పాడు రాజీగా.

"మా బామ్మ నగలండి అవి - ఆమె గుర్తుగా ఉంచుకుంటా - "సీత ఏడుపు గొంతుతో చెప్పింది. ఇంత కష్టపడి మళ్ళీ పోగొట్టుకో బుద్ధికాలేదు.

"బామ్మ నగలా! బామ్మే శాశ్వతం కాదు - నగల దేముందే! మొగుడుంటే ఎన్నయినా చేయిస్తాడు - ఈ కేసు పెట్టి మమ్మల్ని నానా తిప్పలు పెట్టించాడు - ఇనెఫిషియంటు అని నా ప్రమోషన్ కూడా పోగొట్టాడు. మరి నేనెవరితో చెప్పుకోవాలి - నగలు కావాలా? మొగుడు కావాలా తేల్చుకో?" రౌద్రంగా అన్నాడు ఫణిభూషణం - లాఠీని చిత్రవిచిత్రంగా తిప్పుతూ, వస్తుందనుకున్న ప్రమోషన్ రాజకీయాలతో మిస్సు కావడంతో - అసలే కోతి - ఆపైన కల్లు తాగింది - ఆపై తేలుకుట్టింది - చందాన ఈ మధ్య అందరి మీదా ఎగిరెగిరి పడుతున్నాడు పాపం!

"ఒసే! నగలు నే చేయిస్తాలేవే! లేకపోతే నేను మీ బామ్మను వెతుక్కుంటూ పోవాల్సి వస్తుంది." ఏడ్చాడు సుబ్బారావు, సీత తలూపింది.

వెంటనే సీత - సుబ్బారావులు ఆ నగలు అక్కడ విచేసి బయటపడ్డారు.

ఇప్పుడు వారిద్దరికి చాలా ఆనందగా ఉంది. ఇంక ఏ కేసు కోసం తిర్గనక్కరలేదు. భవిష్యత్తులో దొంగల గురించి భయపడాల్సిన అవసరం లేదు - వాళ్ళు పడ్డా ఇప్పుడు ఇంట్లో విలువైన వస్తువులేమీ లేవుకదా మరి. ఇప్పుడు చేసిన అప్పులు తీర్చుకోవడానికే ఉన్నవన్నీ అమ్మివేసినా చాలవు. అందుకే జీవితంలో మళ్ళీ కంప్లైంటు ఇవ్వకూడదని నిశ్చయించుకున్నారు.

"ఏవండీ! మా బామ్మ నగలు పోతే పోయాయి కాని - నాకు చాలా అనుభవం వచ్చింది. లోక జ్ఞానం పెరిగింది." సీత నవ్వింది, చాలాకాలం తరువాత.

"మరి అనుభవంతోనే తత్వం బోధపడుతుంది. బతికుంటే బలుసాకు తిని బ్రతకొచ్చు. ఇంకెప్పుడూ పొరపాటు పనులు చెయ్యను" సుబ్బారావు అన్నాడు.

పాపం! ఎరక్కపోయి ఇరుక్కుపోయాడు! దేవుడి దయవలన చివరికి బయట పడగలిగాడు సుబ్బారావు.

"సారూ! సుబ్బారావు సారూ! ఇంకా నిద్ర ఏంటి? ఎనిమిది దాటింది. ఇవ్వాళ స్టేషన్‌కు పోయి పోలీసు కంప్లైంటు ఇవ్వాలన్నారు!" సీత సుబ్బారావును నానా కష్టాలు పడి లేపి గుర్తుచేసింది.

"సీతా! అయితే ఇదంతా కలేనా? నీ నగలు దొరికాయా?"

"మీరింకా కంప్లైంటు ఇవ్వలేదుకదా? ఎలా దొరుగుతాయి?"

"పోనీలే సీత! ఏ జన్మలోనో మనం వాడికి ఋణపడ్డాం! దానికోసం కంప్లైంటు ఎందుకులే!" అంటున్న సుబ్బారావు వైపు సీత ఆశ్చర్యంగా చూసింది.

ఒక రోజులో సుబ్బారావు ఎందుకలా మారిపోయాడో సీతకు అర్థం కాలేదు.

***

# సభాపర్వం అల్లూరి గౌరీ లక్ష్మి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**ప్రముఖ పత్రికా** సంపాదకుడు, గొప్ప రచయిత శ్రీవేణి రాజు కామేశంగారు ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. వారి మరణం పత్రికా ప్రపంచానికి తీరని లోటు. మొత్తం సాహితీ లోకానికి ఓ శరాఘాతం. ఈ విషయం విని పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. ఇలా మూడు రోజుల నుండీ వస్తున్న వార్తా విన్యాసాల్ని మీడియాలో గమనిస్తున్న 'జనం' దినపత్రిక ఎడిటర్ శ్రీకృష్ణకి, ఆ వార్త విన్నప్పుడల్లా కల్లోలితమవుతున్న అంతరంగాన్ని అదిమి పెట్టాల్సి వస్తోంది.

❁ ❁

సీరియస్‌గా ఎడిటోరియల్ రాస్తున్న శ్రీ కృష్ణ సెల్ మోగింది. వెంకట్ ఫోనది. "రేయ్ కృష్ణా! సాయంత్రం ఆరింటికి సిటీ సెంట్రల్ లైబ్రరీలో వేగిరాజుగారి సంతాప సభ ఏర్పాటు చేశారు. అందరం పోతున్నాం నువ్వూ రావాలి" వెంకట్ పిలుపు.

"సంతాపం ఎందుకు? దేశాన్ని ఉద్ధరించాడనా?" శ్రీకృష్ణ ప్రశ్న.

"పోన్లేరా! పెద్దాయన! నలుగురితో కలిసి నివాళి అర్పించి వస్తే పోయిందేముంది!" వెంకట్ బుజ్జగింపు.

"వచ్చేదేముంది?" శ్రీకృష్ణ విసురు.

"అరె, రారా! అంతా ఓ రెండు గంటలు కలిసి గడపొచ్చు. తర్వాత డిన్నర్ చేద్దాం మనిద్దరం. మనవాళ్ళు నలుగురైదుగురు వస్తున్నారు. నువ్వొస్తున్నావంతే" అని ఫోన్ పెట్టేశాడు వెంకట్.

శ్రీ కృష్ణకి రాసే మూడ్ పోయింది. వేగిరాజుతో తనకున్న అనుభవాలన్నీ అతని మెదడులో రీలు కట్టాయి. పదేళ్ళ క్రితం వేగిరాజు ప్రముఖ వారపత్రికకి చీఫ్ ఎడిటర్గా ఉన్నప్పుడు తానక్కడ సబ్ - ఎడిటర్ గా ఉండేవాడు. అప్పుడు వేగిరాజు రాస్తున్న నవల అదే పత్రికలో సీరియల్గా వస్తూ ఉండేది.

సాయంత్రం ఏడుగంటలకి అంతా పనులు ముగించుకున్న తర్వాత వేగిరాజు అందర్నీ తన ఛాంబర్కి పిలిపించుకుని పిచ్చా పాటీ మీటింగు పెట్టేవాడు. లోకంలో వార్తలన్నీ వడపోశాక "నా సీరియల్ పై చర్చించండయ్యా" అని అందర్నీ ఉత్సాహపరిచేవాడు. టీలు తెప్పించేవాడు, సమోసాలతో పాటు.

అంతా ఆ సీరియల్ గురించి చర్చించే పనిలో పడేవాళ్ళం. తను గమనించలేదు కానీ అందరూ అతని సీరియల్ని అన్యాపదేశంగా పొగిడేవారు. ఇలాంటి సబ్జెక్టు సీరియల్గా ఇంతకు ముందు రాలేదని ఒకరూ, ప్రజెంటేషన్ బావుందని ఒకరూ, టెంపో భలే ఉందని కొందరూ అంటూండేవారు. తనకసలు ఆయన తీసుకున్న థీమే పరమ పాతది అనిపించేది. తను ఒకరోజు అనేశాడు.

"సార్! అందులో ఒకపాత్ర "మా అమ్మ నెయ్యమ్మేది. ఇంటికివచ్చి పోయే బంధువులకి రోజల్లా వంచిన నడుం ఎత్తకుండా వడ్డించేది" అంటుంది. నిజానికి ఆడవాళ్ళు నెయ్యిమ్మి సొమ్ముచేసుకోవడం మొదలెట్టాక చుట్ట పక్కాలకి వండి వార్చే కార్యక్రమాలకి స్వస్తిపలికారు. అది అసహజంగా ఉంది".

"భలే సునిశితంగా ఆలోచిస్తావయ్యా కృష్ణా నువ్వు" అని అప్పటికి తనని మెచ్చుకున్నాడు. కాదు కాదు అలా నటించాడు అందరి ముందూ. ఆ తర్వాత తనపై పగబట్టి, ఆ పత్రికలో తను రిజైన్ చేసేదాకా వెంటాడు. విమర్శని జీర్ణించుకోలేని కుసంస్కారి.

తనా పత్రిక వదిలి మరో దినపత్రికలో చేరాక కూడా తన మీద కన్నేసే ఉంచాడు. మలేషియాలో జరిగే తెలుగు మహా సభలకు తను అన్ని ఏర్పాట్లూ చేసుకుని బయలుదేరే తరుణంలో తన పేరుని ఆఖరి నిమిషంలో తొలిగించేలా తన పరపతినంతా వినియోగించాడు వేగిరాజు.

వాడి పత్రికలో కథపడాలి అనుకుంటూ ఆశగా వచ్చే పిల్ల రచయిత్రులందరూ గోపికలన్నట్టూ, తను శ్రీకృష్ణుడన్నట్టు వాళ్ళందరికీ లైన్లు వేసేవాడు వేగిరాజు.

సాధనా సదస్సుల పేరుతో వర్ధమాన రచయిత్రుల్ని పిల్చి తనకు తెలిసిన నలుగురు రచయితల చేత సూచనలిప్పించేవాడు వాళ్ళకి. ఈ సందట్లో తనకు పడే అమ్మాయిల కోసం పాట్లు పడుతూ అందమైన పిల్ల కనబడితే చాలు. ఆ పిల్ల రాసే అవకతవక తింగరి రచనల్ని ప్రచురించేవాడు. రెండు పేజీల కథ రాసిన ఆ పిల్ల పరిచయం, ప్రశ్నోత్తరాలు మూడు పేజీలు వేసేవాడు. అలా ఆడపిల్లకి దగ్గరయ్యేవాడు.

తన పత్రికలో కథల పోటీ పెట్టి డబ్బులిచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులిచ్చి మిగిలినవారికి చిన్న బహుమతులిచ్చేవాడు.

వారానికో బూతు కథతో దానికి తగిన బూతు బొమ్మతో కొత్త వరవడి దిద్ది సర్క్యులేషన్ బాగానే పెంచడంతో ఎం.డి. వేగిరాజుని మెచ్చుకునేవాడు.

పొరుగు రాష్ట్రాలతో సహా అన్ని ప్రాంతాలకీ సాహితీ సమావేశాలకి తన అనుంగు శిష్యురాళ్ళని పంపి తాను రైటర్స్‌ని తయారు చేశానని చెప్పుకునేవాడు. సాహితీ సేవ చేస్తున్న పెద్దమనిషిలా బిల్డప్ ఇచ్చి అక్కడా ఇక్కడా మానేజ్ చేసి రాష్ట్ర సాంస్కృతిక శాఖ చేత "కళాబంధు" అని సన్మానం కూడా చేయించుకున్నాడు.

"సార్! టీ!" అంటూ అటెండరిచ్చిన టీ కప్పు చూసి ఈ లోకంలోకి వచ్చాడు. శ్రీకృష్ణ ఆలోచనలకు స్వస్తి పలికి టీ తాగుతూ ఇప్పుడా సంతాప సభలో వాణ్ణి ఇంద్రుడు, చంద్రుడు అని అంతా పొగుడుతుంటే నేను వెర్రి మొహం వేసుకుని అందరి మధ్యా కూర్చోవాలా? అప్పుడు వాడి ఆత్మకూడా నా మీద గెలిచానని మీసాలు తిప్పుకుంటుంది. నేను ఆ సభకి పోయేదేలేదు అనుకున్నాడు. ఆ తర్వాత పనిలో పడిపోయాడు పూర్తిగా.

మరో గంటలో శ్రీకృష్ణ మనసులో మెరుపులా ఒక ఆలోచన మెరిసింది. పని ముగించుకుని సంతాప సభకి బయలుదేరాడు.

శ్రీకృష్ణ లైబ్రరీ హాలుకి చేరేసరికి, అక్కడి జనం బాగానే చేరుకున్నారు. ఓ మూలగా కూర్చున్నాడు శ్రీకృష్ణ. వేదికపై మాట్లాడే వాళ్ళ పేర్లు రాసుకోవడానికి వచ్చిన వెంకట్ "మనవాళ్ళంతా అక్కడున్నారురా" అన్నాడు.

"ఫర్వాలేదు కానీ నా పేరు కూడా రాసుకో" అన్నాడు శ్రీకృష్ణ.

ఆశ్చర్యంగా చూసిన వెంకట్ చూపుకి జవాబుగా "పెద్దాయన కదరా" అన్నాడు"ఫర్వాలేదు కానీ నా పేరు కూడా రాసుకో" అన్నాడు శ్రీకృష్ణ. తలూపుతూ వెళ్ళాడు వెంకట్.

స్టేజ్ మీద వేగిరాజువి నాలుగు పెద్ద పెద్ద ఫోటోలు పెట్టారు. వాటికి పెద్ద పెద్ద దండలేశారు. వేగిరాజు కుటుంబసభ్యులు అటూ ఇటూ తిరుగుతూ తమని పలకరించినవారి పేర్లు, వివరాలు రాసుకుంటున్నారు. సభ మొదలైంది.

ఎనభై ఏళ్ళశ్రీపాద శాస్త్రిగారు వచ్చి వేగిరాజు జీవన ప్రస్థానం ఎలా సాగిందీ చెబుతూ నవలా రచయితగా, వీక్లీ ఎడిటర్‌గా ఆయన చేసిన సాహితీ సేవను వివరించి అతని మరణానికి సంతాపం వెలిబుచ్చారు. సభికులెవరైనా వేగిరాజుతో పరిచయానికి సంబంధించి క్లుప్తంగా మాట్లాడమని కోరుతూ శలవు తీసుకున్నాడాయన.

ఒకరొకరూ స్టేజి ఎక్కి ఆశువుగా కొందరూ, రాసుకుని కొందరూ వేగిరాజు మృతికి దుఃఖాన్ని తెలుపుతూ ప్రసంగించారు. అందరూ ఆయన పనిచేసిన వీక్లీ గురించి, ఆయనను కలిసిన సందర్భం తెలుపుతూ ఆయన రచనల గురించి పదే పదే చెప్పి విసిగించారు. అతనంత గొప్ప రచయితా, ఎడిటరూ, మనిషీ మరొకరు లేరన్నారు. అంతా కలిసి అక్కడొక దుఃఖపు వాతావరణాన్ని తేవడంలో కృతకృత్యులయ్యారు.

"చివరగా జనం పత్రిక చీఫ్ ఎడిటర్ శ్రీకృష్ణగారు" అంటూ మైకులో పిలవగానే చకచకా స్టేజ్ ఎక్కి జనానికి నమస్కారం పెట్టి మొదలు పెట్టాడు శ్రీకృష్ణ.

"ఈ రోజు ఈ సంతాపసభకి ఇంతమంది హాజరవడానికి కారణం వేగిరాజుపై ప్రేమకాదనీ, సాహితీ మిత్రులంతా సరస్వతీ మాత గౌరవార్థం వచ్చారనీ నేను అనుకుంటున్నాను. ఎందుకంటే ఈ వ్యక్తి సరస్వతి పేరు చెప్పుకుని బ్రతికినవాడవడం వల్ల మీరు తప్పనిసరిగా వచ్చి ఉంటారనుకుంటున్నాను. నేను చిన్నతనం నుండీ ఒక విషయం గమనిస్తున్నాను. పోయినోళ్ళందరూ మంచివాళ్ళని ఎవరు ఎందుకన్నారోగానీ అది చాలా పొరపాటు అభిప్రాయం. చావు అనేది ఒకవ్యక్తి మురికితనాన్ని శుభ్రపరిచే డిటర్జెంట్ కాదుకదా! మొక్కుబడిగా అతన్నంతా పొగిడినంత మాత్రాన అతడు పవిత్రుడైపోడు కదా! "

అనాసక్తిగా వింటూ ఉన్నవాళ్ళమా చెవులు రిక్కించి సర్దుకుని కూర్చున్నారు. హాలుమొత్తం శ్రీకృష్ణవైపు చూపుసారించిద్ది.

"వేగిరాజు దివంగతుడైనంత మాత్రాన నిన్నటివరకూ తనకు గిట్టని వారిపై ప్రతీకార ద్వేషాగ్నులు కురిపించి కనీస మానవత్వ విలువలు పాటించని వ్యక్తి గొప్పవాడైపోయాడా! చిత్రంగా ఉంది.

ఆయన గురించి నాకు తెలిసింది నిజాయితీగా చెబుతాను. ముందుగా ఆయనసలు రచయితకాడు. ఏదో కాలక్షేపం సినిమాల కోసం రాసిన రెండు కథల్ని ఎవరూ తీసుకోకపోవడం వల్ల వాటిని కష్టపడి నవలలుగా మలిచి తన పత్రికలో వేసుకున్నాడంతే. రెండు నాన్‌ఫిక్షన్ పుస్తకాలు రాశాడు కదా అంటారా! అవి కూడా నాలుగు ఇంగ్లీష్ నాన్ ఫిక్షన్ పుస్తకాల్ని అడ్డదిడ్డంగా అనువాదం చేయించుకుని వాటికి కొంత సొంత పైత్యం జోడించి తయారు చేసిన గ్రంథ చౌర్యం బాపతే తప్ప సొంత రచనలు కావు.

ఆ వీక్లీని ఒకలాంటి బూతు పత్రిక స్థాయికి దించి ఏ ఎడిటరూ దిగకూడనంతగా దిగజారి పత్రికని నడిపిన ఖ్యాతి ఆయనది. తన పత్రికాఫీసులో పనిచేసే ఉద్యోగుల మధ్య కుల, మత, ప్రాంతీయ తత్వాన్ని పెంచుతూ వీడిగురించి వాణ్ణి, వాడి గురించి వీణ్ణి అడుగుతూ వాళ్ళంతా అనారోగ్య వాతావరణంలో ఉండేట్టు చేశాడు. కేవలం అడ్డదారిలో పాఠకుల బలహీనతని సొమ్ముచేసుకుంటూ సర్క్యులేషన్ పెంచుకుంటూ నాలుగుకాలాలు బతికాడు. ఇదీ ఇతని చరిత్ర.

అయితే ఇతని నుంచి మనం నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. ఇతనిలా ఎవరూ సరస్వతీ దేవిని అవమానించకూడదు. నిజమైన రచయితల్ని వెలికితెచ్చి ప్రోత్సహించాలి. రచనలు మనిషి జీవితసారం నుండి వస్తాయి. జీవితం ఎక్కడుందో అక్కడే కళామతల్లి ఉంది. ఆ తల్లిని గౌరవించాలి. అన్నటికీ మించి సాహితీ రంగంలో ఉన్న మనం మానవీయ విలువలున్న మనుషులుగా ఉండడం ముఖ్యం. దానికోసం కృషి చేద్దాం. నాకీ అవకాశం ఇచ్చిన వారికి కృతజ్ఞతలు శలవ్."

హాలంతా భయంకరమైన నిశ్శబ్దంలో మునిగి ఉండగా శ్రీకృష్ణ స్టేజ్ దిగాడు. కొందరి కళ్ళలో ఆశ్చర్యం, ఆనందం కనబడితే మరికొందరి కళ్ళలో అతనిపై ఆరాధనా భావం తొణికిసలాడింది. వేగిరాజు ఫాక్టరీలో తయారయిన యువ రచయితలు మొహాలు చిన్నవిగా చేసుకున్నారు. ఛోటా రచయిత్రులు అతని ప్రసంగం అర్థంకానట్టు మొహాలు సెట్ చేసుకున్నారు. ఓ నలుగురు మిత్రులు శ్రీకృష్ణ వీపు తట్టివెళ్ళిపోయారు మౌనంగా.

"ఇలా మాట్లాడడంవల్ల నువ్వు ఏం సాధించాననుకుంటున్నావ్?" మౌనంగా సూప్ తాగుతున్న శ్రీకృష్ణని మొండిపిల్లవాణ్ణి తండ్రి అడిగినట్టు అడిగాడు వెంకట్.

"వేగిరాజు దారిలో నడుస్తున్న లేదా నడవాలనుకుంటున్న పత్రికాధిపతులు, సంపాదకులు అక్కడెవరైనా ఉంటే వారిలో పరివర్తన రావాలన్న ఆకాంక్షతో మాట్లాడాను. ప్రతిభగల రచనలకి పట్టం కట్టి సాహితీ విలువలు పెంచమని అభ్యర్థించాను. ఆ పని నేను చేస్తున్నానన్న ఆత్మ విశ్వాసమే నా ప్రసంగానికి కారణం. నాలా మరెవరూ వేధించబడకూడదన్న ఆవేదనకూడా అందులో ఉంది." అన్నాడు శ్రీ కృష్ణ.

"నీ ఘోష అక్కడ ఎవరికైనా అర్థం అయిందని నేను అనుకోను" అన్నాడు వెంకట్ శ్రీ కృష్ణ తలమీద కొడుతూ.

మౌనంగా భోజనం ప్రారంభించాడు శ్రీ కృష్ణ.

❀❀

మర్నాడు దినపత్రికల సాహితీ పేజీల్లో ఈ సంతాప సభవిషయం అన్యాపదేశంగా చర్చకు తెరలేపింది. లోకల్ టి.వి. ఛానెలొకటి చర్చనీయాంశం చేసింది. పనీపాటా లేని ఉద్దండులంతా ఫొన్‌లలో అభిప్రాయాల్ని ఆనందంగా వివరించారు. మరీ తోచని వాళ్ళు చర్చలో ప్రత్యక్షంగా పాల్గొని సాహిత్యం - విలువలు - యువత అంటూ మొదలుపెట్టి ఎక్కడికో వెళ్ళిపోయి ఆపైన దిక్కు తోచక బిక్కమొహాలేశారు. అలా ఆ సంతాపసభ ఒకచిన్న సంచలనం కలిగించింది. తర్వాత మరో వార్తతో జనం ఆ సంగతి మరిచిపోయారు.

అయితే సీనియర్ రచయిత(త్రు)లు, స్త్రీ, పురుష పత్రికా ఎడిటర్లు ఈ విషయాన్ని సులువుగా మర్చిపోదల్చుకోలేదు. శ్రీకృష్ణలాంటి ఆవేశపరులెవరైనా తమగురించి కూడా ఇలాగే మాట్లాడే అవకాశం ఉందా అని పరి పరివిధాల భుజాలూ, వీపులూ

తడుముకున్నారు. తమ చుట్టూ ఉన్న శత్రువర్గాన్ని గుర్తించి అటు దృష్టి సారించారు. ఆపై ఆత్మావలోకనం చేసుకున్నారు. ఆఖర్న వాళ్ళపైవాళ్ళే జాలిపడి తేరుకున్నారు.

వీరంతా ఒకరోజు రహస్యంగా సమావేశం అయ్యారు. అంతా గుంపుచింపీలు పడి ఒక తీర్మానం చేసుకున్నారు. కాలం కలిసి రాక తమలో ఎవరైనా కాలం చేస్తే తమ సంతాప సభలకి యువరచయితల్నీ, ప్రాతికేయుల్నీ పిలవరాదనీ కేవలం మిత్రులచేత అదీ నమ్మకస్తులయిన వాళ్ళచేతనే మాట్లాడించాలనే లేదనుకుంటే అసలు మాట్లాడే అవకాశం ఎవరికీ ఇవ్వకుండా రెండు నిమిషాలు మౌనం పాటించి సభను ముగించాలనీ గట్టి నిర్ణయం తీసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

***

# అంతర్వాహిని నాగేంద్ర కాశి

<u>శ్రీరామ్ చెప్పిన కథ</u>

**ఉదయం టైం** పదవుతోంది. గేటు వేయడానికి వాచ్‌మేన్ అక్కడే ఉన్నాడు. మూడో బెల్లు కొట్టడానికి ఇబ్రహీం యోధుడిలా వెళుతున్నాడు. అందరూ హడావుడిగా తరగతి గదిలోకి వెళుతున్నారు. "ఏంటి! ఇవాళ రాలేదు?" అంటూ నాలో నేనే గొణుక్కుంటూ తరగతి గదిలోకి వెళ్ళిపోయాను. వెయ్యి ప్రశ్నల పేపర్‌ని పాతిక మార్కులకు రాయమంటే వచ్చే నవరసాలతో మిళితమయిపోయింది నా మొహం.

"ఏరా! మీ తాలూకూ జనాలు రాలేదా ఇవాళ?" పక్కన రవిగాడు పిడతకింద పప్పు నములుతూ పకపకా నవ్వుతున్నాడు.

పదో తరగతంటే ఏదో ఒక్క పెద్ద అలొకటి వెనకనుంచి వచ్చి ముంచేస్తుందన్న భయాన్ని, హడావుడిని సృష్టించే పనిలో ఉన్నాడు పదోతరగతిని ఐదోసారి రాస్తున్న మా ఊరి వెంకటేశ్వర్లు. ఇక సందేళ పూట గుడి దగ్గర రాయి చెట్టుకింద కూర్చున్న పెద్దోళ్ళంతా "ఏంట్రా! అబ్బాయ్ ఎలా సదువుతున్నావు?" అంటూ లంక పొగాకు చుట్టలు నోట్లో పెట్టుకుని పొగని గుప్పున ఊదుతూ ఒకటే ఆరాలు. గోదావరి పక్కన చిన్న పల్లెటూరు మాది. చదువుకున్న వాళ్ళు పెద్ద లేకపోవడం వల్ల ఇలాంటి ప్రశ్నలతో ప్రతీవాళ్ళూ పలకరించేవారు బాగా చదువుతానని. అలాంటి వాతావరణం మధ్య సీరియస్‌గా చదువుతున్న శీతాకాలం రోజులవి.

ఆ రోజు జానకి రాలేదు. జానకి.. గుమ్మడి పూవులా ఉంటుంది. కొబ్బరాకు మీద వెన్నెల పడ్డట్టు నవ్వుతుంది. ఆ రోజు ఆరు పిరియడ్‌లు అరణ్యకాండంలా అనిపించాయి నాకు. తర్వాతి రోజు కలెక్రటు మామిడికాయ రంగు మిడ్డీ వేసుకుని పెద్ద చెరువులో కలగపూవులాంటి షర్ట్ వేసుకుని స్కూల్లో కనపడేసరికి, బట్టలన్నీ తీసేసి పరిగెట్టుకెళ్ళి కాలవలో ఈతకొట్టినంత ఆనందంగా అనిపించింది. బాగా ఉప్పు, కారం అద్దిన నారింజ తొనలు ఎదురెళ్ళి ఇస్తుంటే "ఏం! బుద్ధిలేదా?" అంటూ భయంగా 'బి' సెక్షన్ లోకి వెళ్ళిపోయింది. మనసు చివుక్కుమంది బట్టలన్నీ తీసేసి పరిగెట్టుకెళ్ళి కాల్లో దూకి ఈత కొడుతుంటే జలగ ఎక్కడో పట్టుకునంత బాధగా ఉంది.

రాత్రి ఎనిమిదవుతోంది. పల్లెసీమలు కార్యక్రమం అయిపోయాక వాతావరణ సమాచారం వినబడుతోంది రేడియోలో. ఓ జోన్ పొర గురించి ఊపిరి బిగపట్టి చదువుతున్నాను. ఆ రోజు ఆకాశం పొయి దగ్గర పొగలా నల్లగా ఉంది. వర్షం వచ్చేలా ఉంది. కానీ.. ఉరుములు మెరుపులు ముందుగా మా ఇంట్లో మొదలయ్యాయి. "ఒరే! ఇటురా" నాన్న గట్టిగానే పిలిచాడు. ఏం కాదులే అన్న అమ్మ భరోసాతో వరండాలోకి వెళ్ళాను.

"ఏంటి బళ్ళో ఆ పిల్లని ఏదో అన్నావంట, వాళ్ళ నాన్నగారు ఊళ్ళో కనపడి చెపుతున్నారు." వర్షం మొదలయింది. ఎడతెరిపి లేకుండా ఓ అరగంటసేపు. కొంచెం సేపటికి మేఘాలు తేలిపోయాయి. తెరిపిచ్చింది. నాన్న కాళ్ళకి కొబ్బరి నూనె రాస్తుంటే ఒకటే మాట అన్నాడు "నేను పది మంది దగ్గర పనిచేసేదీ నీ దగ్గర పదిమంది పనిచేసే స్థాయికి నిన్ను తీసుకెళ్ళాలని. " అంతే.! ఇంకేం లేదు. అలిసిపోయి పడుకున్న నాన్న దగర చాలాసేపు కూర్చుండిపోయాను.

ఆ రాత్రంతా ఆలోచించి IAS అయి పోదామనుకున్నాను. పొద్దునే బడికెళ్ళేదారిలో కనకాంబరాలు పెట్టుకుని యస్సెల్లార్ సైకిల్ మీద జానకి వస్తుంటే రాత్రంతా జరిగింది ఏ క్రీస్తు పూర్వంలోనో, క్రీస్తు శకంలోనో జరిగిన చరిత్ర పాఠంలా అనిపించింది. అప్పుడప్పుడూ ఓరగా చూసేది. ఎప్పుడో ఒకసారి నవ్వేది. రెండు కొబ్బరుండలు మా ఇద్దరి మధ్యా మొదటి మాటలు. అయస్కాంత ధర్మాలు మా ఇద్దరి మధ్యా పనిచేయడం మొదలు పెట్టాయి. పరీక్షలు దగ్గరయ్యాయి. జానకి ఇంకా బాగా దగ్గరయింది.

తర్వాత అన్నీ చకచకా జరిగిపోయాయి. చాలా మంచి మార్కులు. ఇంటర్మీడియట్ ఆ ఊర్లోనే ఓ కాలేజీ - తను. దూరం బాగా పెరిగింది. మనసు చాలా దగ్గరయింది. ఎంతలా అంటే ఏటి గట్టు కిందకెళ్ళి దొంగచాటుగా మాట్లాడుకునేంత. అప్పుడే ఒక్క కుదుపు. అది నా జీవితంలో పెద్దమలుపు. ఆరోజు ... మాట్లాడి మూణ్ణెళ్ళు అయిందని జానకి కాలేజ్ దగ్గర ఆతృతగా అటూ ఇటూ తిరుగుతున్నాను. పక్కనే స్కూటర్ ఆగింది.

"పదినిమిషాలు నీతో మాట్లాడే పనుంది బండెక్కు". కొంచెం కోపంగానే, ఆ స్వరం వినే సరికి కదలకుండా కూర్చున్నాను.

"లక్ష్మీ! రెండు కాఫీ తీసుకురా." మూర్తి అంకుల్ హాల్లో నన్ను కూర్చోబెట్టి వంటింట్లో ఉన వాళ్ళావిడకు ఆర్డరేశారు. ఈ అమ్మాయి పేరు జానకి. వీళ్ళమ్మ పేరు లక్ష్మి. ఖచ్చితంగా వీళ్ళ చిన్నమ్మ పేరు సరస్వతైయుండుంటుంది అని మనసులో అనుకుంటున్న నన్ను కాఫీతో పలకరించింది జానకి వాళ్ళమ్మగారు. మొదలైంది మహాభారతం.

"ఏం బాబూ! " మూర్తిగారు అడుగుతున్నారు. తలెత్తి చూశాను. "బాగా చదువు కుంటున్నావ్, ఇదే జీవితం అనుకుంటున్నావా? మా అమ్మాయి జీవితం నాశనం చేద్దామనుకుంటున్నావా? " ఇంక ఆగేలా లేరు. "నిన్నక్కడే రోడ్డుమీదే కడిగేద్దును. మీ నాన్న మొహం చూసి ఆగాను."

మూర్తిగారు తిడుతూనే ఉన్నారు.

"జీవితం చాలా ఉంది. ఇంతకంటే అందంగా ఉంటుంది. నీ కాళ్ళ మీద నువు నిలబడు. నీ బాధ్యతల్ని నువు నెరవేర్చు. అప్పుడు ప్రేమ గురించి నీకెవ్వరూ చెప్పనవసరం లేదు. అప్పుడురా మా ఇంటికి. కాళ్ళు కడిగి నెత్తినేసుకుంటాను." అలా అంటుంటే ఆయన బుగ్గలు అదురుతున్నాయ్. స్వతహాగా మూర్తిగారు సున్నిత మనస్కులు. "మీ వయసులో మీకు నచ్చని పదం ఆకర్షణ. ఇప్పుడు ఆకర్షణ, ప్రేమ అంటూ విడదీసి వివరించను. వెళ్ళు" అన్నారు.

కాఫీ చల్లారిపోయింది. ఖైదీ సినిమా మధ్యలో ఉర్దూ వార్తలు చూస్తున్నట్టుంది, ఆ అరగంటా నాకు. ఏదేమయినా నాన్న, అమ్మ తిడితే సొంతంగా అనిపించేది. పరిచయం లేని వాళ్ళు ఇంటికి తీసుకెళ్ళి నేనేదో ఘోరమైన పాపం చేస్తున్నట్టు, నేను మంచి వాడ్నికాదు అని నిరూపించే ప్రయత్నం చేసేసరికి తట్టుకోలేకపోయాను. అదే చివరి సారి. నరసాపురం గోదారి దాటడం, జానకికి సంబంధించిన జ్ఞాపకాలన్నీ ఆ ఒడ్డున పడేసి. అప్పుడు జరిగిన విషయాలన్నీ డిగ్రీలో రాసుకున్న డైరీ ఇది. డైరీ అనరేమో! ఆలోచిస్తుంటే ఆ జ్ఞాపకాలలో దాక్కున్న సంఘటనలకి వయసు పదేళ్ళ పైమాటే. జీవితం చాలా మారిపోయింది. జీవితం నాలా నేర్పింది కూడా. పస్తులుండటం నేర్పింది. పాయసం తాగడం నేర్పింది. చిరిగిన చెప్పుకి సూది పిన్నీసు పెట్టుకోవడం నేర్పింది. ఖరీదైన కోటుకి గుండీలు పెట్టుకోవడం నేర్పింది.

ముఖ్యంగా బతకడానికి, జీవించడానికి మధ్యనున్న అంతరాన్ని అద్దంలా చూపించింది.

పెద్దతరహా వచ్చిందంటున్నారు అంతా. నన్ను సలహాలు అడుగుతున్నారు కొంతమంది పెద్దలు. నాకూ అలానే అనిపించింది. కష్టానికి, సుఖానికి తేడా తెలిసింది. బరువుకి, బాధ్యతకి అర్ధం తెలిసింది. కానీ ఆనందమే రోజు రోజుకీ దూరమై పోతుంది.

ఒక స్వచ్ఛమైన బాధలో కూడా అంతకు మించి ఆనందముంటుందనీ, ఒక విలువైన కష్టంలో కూడా వంద గెలుపుల బలముంటుందనీ కాలం నా చేయి పట్టించి దిద్దిస్తున్నది జీవితంలో తెలియని ఓనమాల్ని.

ఆఫీసుకి బయలుదేరాను. కొలీగ్స్‌తో పిచ్చాపాటీ మాట్లాడి పనిలో లీనమై పోయాను.

" శ్రీరాం! షి ఈజ్ మిస్ జానకి... ".

తలెత్తి చూశాను. జా...జానకి. ఇంక వాడు చెపుతున్నదేమీ వినిపించడంలేదు.

నాగార్జున సాగర్ గేట్లన్నీ ఒకేసారి ఎత్తేస్తే వచ్చే ఆనందం... మిట్టమధ్యాహ్నం మండుటెండులో నడుస్తుంటే వర్షం నా ఒక్కడి మీదే కురిసినంత ఆనందం...

తిరుపతి వెంకటేశ్వర స్వామిని అడుగు దూరంలోంచి చూస్తే వచ్చే ఆనందం... ఆ రాత్రి నాకళ్ళు చీకటిని చూడలేదు జానకి మీద ప్రేమ నాలో అంతర్వాహినిలా సాగుతూనే ఉంది. అది నా కనులు దాటి ఉప్పొంగింది. ఆ విషయం ఆ రాత్రే, నాకు తెలిసింది.

రోజులు గడుస్తున్నాయ్. జానకిలో ఏ మార్పూలేదు. ఏదన్నా మాట్లాడితే అంతవరకూ మాత్రమే జవాబు చెపుతుంది. అసలు పరిచయమే లేనట్టు నా ముఖమే ఎరగనట్టు. బాగా మారిపోయింది జానకి. పెళ్ళికి తయారయ్యింది. తెల్లవారుఝామున వెన్నెల్లాగా ముఖం, లేత అరిటాకుమీద మంచుబిందువులా ఆ ముక్కుపుడక, విశాలమైన కళ్ళు. రోజు రోజుకి కొత్తగా అనిపిస్తుంది. రోజుకో అందం. ఎలాగైనా ఈ రోజు మాట్లాడాలి. అన్ని విషయాలు పెళ్ళి విషయంతో సహా.

సాయంత్రం ఆఫీస్ బయట ఆమె కోసం చూస్తున్నాను. జానకి వస్తోంది. శరదృతువులో వెన్నెల లాగ.. గోదారి అలమీద మెరుపులాగ నన్ను గమనించింది. నేనేం మాట్లాడతానో ఆ కళ్ళకి ముందే తెలిసినట్టుంది. కొంచెం కోపంగానే చూస్తోంది..

"జానకీ! నీతో కొంచెం మాట్లాడాలి. ఒక్క పదినిమిషాలు ఉండగలవా?" నేను పూర్తి చేయకముందే అవతలి నుంచి జవాబు మొదలయ్యింది.

"మీరేం చెపుతారో, మీరేం ఆశిస్తున్నారో నాకు తెలుసు"అంది "ఎప్పుడో పరిచయం ఇప్పుడు కనబడే సరికి ప్రేమగా రూపాంతరం చెంది పెళ్ళి అనే ముగింపునిస్తుందని నేననుకోవడం లేదు. మీకు అలాంటి అభిప్రాయమే ఉంటే అది సరైంది కాదు అని చెపుతున్నాను. " అంది మొహం ఒకవైపు పెట్టుకుని. "థాంక్స్. బయట అడిగారు. ఆఫీసులో అడిగుంటే ఈ విషయాలేవీ చెప్పలేక పోయేదాన్ని. ఇంక వెళ్ళమంటారా?" అంది కోపం, ఆవేశం కలిపిన ఒక భావంతో ఊఁ అనక తప్పలేదు.

జానకి వెళ్ళిపోయింది. ఏదేదో మాట్లాడింది. ఆమెకు తెలిసిన తెలుగులో, ఆమెకున్న పరిజ్ఞానంతో.

నన్ను తిట్టాలన్న కాంక్ష, కసి తప్ప ఆమె మాటల్లో అంత అర్ధవంతమైన భావాలు గాని పరుష పదజాలంగానీ నాకు కనిపించలేదు. కానీ ఒక్కటి అర్ధమైంది. ఇక ఆమె నన్ను అంగీకరించదని.

***

**<u>జానకి చెప్పిన కథ</u>**

చాలా కాలం అయింది అతన్ని చూసి. ఇంక చూస్తాననుకోలేదు. బాగా మారిపోయాడు. శ్రీరామ్‌ని చూడగానే నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఇతను శ్రీరామ కృష్ణేనా. ఆనందం కట్టలు తెగిన గోదారయ్యింది. అతను పరిచయమైనప్పటి నుంచి అతనంటే ఇష్టం. నవ్విస్తాడు, ఏడిపిస్తాడు. కోపాన్ని ప్రేమగా మార్చి చూపిస్తాడు. కానీ పరిచయమైన రెండేళ్ళకే పారిపోయాడు, కనబడలేదు. ఇన్నాళ్ళ

తర్వాతగాని. నేనంటే ఇష్టం చావలేదని ఆఫీసులో మొదటిసారి అతణ్ని చూసేసరికి నాకర్ధమైంది. చచ్చేంత వరకూ నాతో నడిచొచ్చే ప్రేముంది ఆ కళ్ళలో. ఆ కళ్ళ వెలుగులో వంద సంవత్సరాలు హాయిగా బతికేయొచ్చన్న భావన ఉంది.

కానీ ఈ రోజు అలా మాట్లాడకుండా ఉండాల్సింది. లేదు ఉండాలి. నాలో నేనే నాకు నేనే మాట్లాడుకున్నాను ఆ రాత్రంతా.

నాన్నతో పోట్లాడి పెళ్ళి ఆలోచనల్ని ఓ పంచన పడేసి ఈ సాఫ్ట్ వేర్ కంపెనీలో జాయిన్ అయ్యాను. నాన్నకూ స్టేటస్ సింబల్ కాబట్టి ఏమీ అనలేకపోయాడు. కానీ ఆ తర్వాత రోజు ఆ షాక్ తగులుతుందని నేనూహించలేదు. ఆఫీస్‌కెళ్ళే సరికి సీట్లో లేడు తను. ఆ రోజంతా చూసాను. రాలేదు. వాళ్ళ కొలీగ్‌ను అడిగాను ఉండబట్టలేక. ఇన్ఫర్మేషన్ ఏమీలేదు. లీవ్ అనుకుంటా అన్నాడు ముక్తసరిగా. రెండురోజులు... మూడురోజులు సీట్ అలా ఖాళీగానే ఉంది. ఎలాగొలా రూం ఎక్కడో కనుక్కొని ఆఫీసవగానే బయలుదేరాను. రూం తాళం వేసి ఉంది. మనసులో ఎక్కడో బాధ. అది క్షణాల్లో కన్నీరవుతుందని నేననుకోలేదు. మనసు కీడు శంకిస్తోంది.

ఇంక కనిపించదు అనుకున్న నా మనసు కనిపించినట్టయింది అతన్ని చూశాక. కన్నీళ్ళాగడం లేదు. ఇన్నాళ్ళు అంతర్వాహినిలా ఉన్న ప్రేమ కళ్ళుదాటి ప్రవహిస్తోంది, గుండెల్లో పుట్టి.

సరిగ్గా వారం రోజులయ్యింది. అతని మొబైల్ స్విచ్చాఫ్. నాకు ఆఫీసులో ఉండాలనిపించలేదు. రెండురోజులు సెలవు పెట్టి ఆ రాత్రికి మా ఊరి బస్సెక్కాను.

ఇంట్లో కొంచెం హడావుడి. ఏం పట్టించుకోకుండా లోపలికి వెళ్ళాను.

నాన్న "నీకు ఫోన్ చేసి వెంటనే రమ్మందాం అనుకున్నాం. నువ్వే వచ్చావ్." అన్నాడు. నాకేం అర్ధంకాలేదు. అర్ధం కావడానికి అరగంట కూడా పట్టలేదు. అమ్మ చెప్పింది. తర్వాత రోజు పెళ్ళిచూపులని.

❋❋❋

అనుకోకుండా ఏం జరిగిందో తెలుసుకునేలోపే జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు జరిగిపోతుంటాయ్ వాటికి సాక్ష్యంగా నిలబడడం తప్పించి మనమేమీ చేయలేం.

❋❋❋

నెలరోజులు తిరిగేసరికి పెళ్ళయిపోయింది. తిరుగు ప్రయాణం. ఇంకా ఆ ఆలోచనల్లోనే ఉన్నాను.

"ఇప్పుడన్నా మాట్లాడవా? " నరసాపురం గోదారి మధ్యలో లాంఛీ మీద నా భుజం మీద చెయ్యివేసి నా దగ్గరగా కూర్చుని అడుగుతున్నారు మా శ్రీవారు సిగ్గులేకుండా.

"ఎలా ఒప్పించావ్ మా నాన్నని.. చెప్పు.?"

"సంవత్సరానికి ఒకరు చొప్పున ఐదారు సంవత్సరాలు ఆడుకోవడానికి పిల్లలిస్తాన"ని చెప్పాడు నవ్వుతూ శ్రీరామకృష్ణ.

బుంగమూతి పెట్టేసరికి జరిగిందంతా చెప్పాడు. చెప్పటం పూర్తవకుండానే. ఎవరూ చూడకుండా బుగ్గమీద అలలాంటి ముద్దు. కొంతమంది చూస్తున్నా ఇచ్చింది తిరిగిచ్చేశాను నేను. ❋❋❋

**శ్రీరామ్ చెప్పిన చివరిమాట**

ఈసారి గోదారి దాటాను. ఎప్పుడో ఒడ్డునొదిలేసిన తీపి గురుతుల్ని ఏరుకుని జీవితాంతం గుర్తుండిపోయే అందమైన అనుభవాల్ని మోసుకుని. ❋❋❋

# కొత్త బంగారులోకం ఎ.విజయకుమార్

**పాత కంపెనీ నుంచి కొత్త కంపెనీకి వచ్చిన మొదటి రోజు.** అమాయకరావుకి అన్నీ ఆత్రంగా అడిగి తెలుసుకోవాలని వుంది. కాని ఏమడిగితే ఏమౌతుందో ఎవరు ఏమనుకుంటారో?. అందులోకి కొత్తేమో ఎవరు ఎలాంటి వాళ్ళో తెలియని మాలోకం. ఇంతకూ ముందెన్నడూ మల్టీ నేషనల్ కంపెనీలలో పని చెయ్యని అమాయక లోకం పాపం మన అమాయకరావుది, కాని కాస్త జీతాలు ఎక్కువని ఈ కాల్ సెంటర్ కాలుష్యం లోకి అడుగుపెట్టాడు.

సీనియర్ మేనేజర్ వచ్చి "మిస్టర్ అమాయకరావు కం విత్ మీ, ఐ విల్ టేక్ అప్ యు టు యువర్ రిపోర్టింగ్ మేనేజర్ ". అన్నాడు.

"యస్సార్ " అంటూ మిలిటరీ లెవెల్లో అటెన్షన్ అయి ఆ పెద్ద మనిషిని ఫాలో అయిపోయాడు.

పెద్ద మనిషి ఓ రూం లోకి తీసుకెళ్ళి " యు సిట్ హియర్ , ఐ విల్ సెండ్ యువర్ మేనేజర్ హియర్ " అని చెప్పి వెళ్ళి పోయాడు.

"అబ్బ! ఎంతో రిచ్‌గా అనిపించింది గది".

ఒకామె తలుపు తోసుకుని "ఎక్స్‌క్యూజ్ మీ, హూం డు యు వాంట్? " అడిగింది.

"అబ్బ...ఏముందిరా బాబు! మేనేజర్ అంటే ఏ అరవయ్యో పడిలోనో ఉంటుందనుకున్నాను. అదిరిపోయే ఏజ్, కళ్ళు చెదిరిపోయే ఫిగర్ ".

"హలో, మిమ్మలనే, ఎవరు కావాలి?" రెట్టించి అడిగింది.

"కాస్త డిగ్నిఫైడ్‌గా విషయం చెప్పాలనుకున్నాడు". కాని ఇంతలో తన స్నేహితుడు మహేష్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"ఒరేయ్ అమాయకరావు! నువ్వసలే అమాయకుడివి ఎవరేమడిగిన లొడ లొడ వాగేయకు. ఆచి తూచి మాట్లాడాలి. మొదటి రోజు నుంచి బాస్‌లను ఎలా కాకా పట్టాలి అనే విషయం మీద కొన్ని టెక్నిక్‌లు నేర్చుకో. ఎందుకంటే 'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్!'"

"మగ బాస్‌లు అయితే వాళ్ళకున్న విషయ పరిజ్ఞానాన్ని (లేకపోయినా ఉందనే అనాలి!) అదే ఆడ బాస్‌లు అయితే వాళ్ళ అందాన్ని పొగడడం ఓ టెక్నిక్. అసలు నీకో విషయం తెలుసా? (అవును...ఒకటేమిటి ఎన్నో విషయాలు తెలీవు!) కాకా పట్టడమూ ఒక కళే. గొప్ప అని కాదు కాని దీని మీద నేను ఒక ఆర్టికల్ కూడా రాసాను". అని తన ఆర్టికల్ అమాయకరావుకి ఇచ్చాడు.

రెండు రోజుల నించి ఆ ఆర్టికల్ చదివి బాగా బట్టీ పట్టి మరీ అర్థంచేసుకున్నాడు కాకా ఎలా పట్టాలో?

"హలో మిస్టర్ ఐ యాం ఆస్కింగ్ యు ఓ ప్లీ, హూం డు యు వాంట్ ?" ఇక సహనం పట్టు తప్పి పోయింది. వచ్చినామెకు!

వెంటనే తేరుకుని " యాక్చుల్లీ ("ఎం మాట్లాడినా...మాట్లాడకపోయినా... యాక్చుల్లీ అనే పదం మాత్రం మాటి మాటికి వాడడం ప్యాషన్ కి కొలబద్ద అని చెప్పనే చెప్పాడు" సలహాలరావు మహేష్ ).

"... యాక్చుల్లీ వాట్ ?"

"దట్స్ వాట్ ... యాక్చుల్లీ"

తరువాత ఎలా మొదలెట్టాలో అర్ధం కాలేదు.

"కమాన్ యాక్చుల్లీ...వాట్ " ?

ఇహ లాభం లేదనుకుని కాకా పట్టే విషయం లోకి వచ్చేద్దామనుకున్నాడు స్థిరంగా.

"మేడం, యు ఆర్ రియల్లీ సో బ్యూటిఫుల్ మేడం."....హమ్మయ్య!! ధైర్యంచేసి ఒక గొప్ప వాక్యం అనేసాను అనుకున్నాడు మనసులో.

"రియల్లీ..?" కాస్త సిగ్గుతో కూడిన తన్మయత్వంతో అడిగింది.

"అయ్యబాబోయ్ వర్క్ అవుట్ అవుతున్నట్లే వుంది ఒరేయ్ మహేష్ థాంక్స్ రా బాబాయ్ .... "మనసులో అనుకున్నాడు. ఇహ రెచ్చిపోయాడు.

"యు...యు నో యాక్చుల్లీ..."

"ఇంత చిన్న వయసులో అంత పెద్ద పోజిషన్ కలిగి వుండడం అంటే యాక్చుల్లీ అరుదు. ఇట్ ఇజ్ నాట్ ఏ జోక్ . యాక్చుల్లీ.. ఈ పనికి యెంత అనుభవం వుండాలి. అనుభవం మాట సరే...!"

"అనుభవమా...?" ప్రశ్నార్ధకంగా అడిగింది.

"యు.. అనుభవమే..!"

"యు మీన్ experience" మళ్ళీనొక్కి అడిగింది.

"యు... exactly మీన్ ఇట్ ".

"అసలు అనుభవమేమిటి... యాక్చుల్లీ, యాక్చుల్లీ మాట్లాడితే అనుభవంతో పాటు విషయం, అవగాహన, అన్నిటికి మించి అందం...! యు నో బ్యుటి, స్మార్ట్‌నెస్ ఎంత అవసరమనుకున్నారు".

"ఏంటి ఈ పనికా....?"

"య యాక్చుల్లీ .. మీ మటుకు మీకు గొప్ప అనిపించక పోవచ్చేమో గాని చూసేవాళ్ళకి తెలుస్తుందండి. యాక్చుల్లీ యు ఆర్ సో గ్రేట్ ..తెలుసా..!"

"థాంక్ యు సో మచ్ ...." కృతజ్ఞతలు తెలుపుకుంది.

ఇంతలో వచ్చాడు. ఓ బట్టతల వ్యక్తి. వస్తూనే అన్నాడు.

"డిడ్ యు చేంజ్ ది లిక్విడ్ సోప్ ఇన్ ది వాష్ రూం....?" అడిగాడు.

"వాట్ ఇస్ దిస్ సర్ , వై డు షి చేంజ్ ది లిక్విడ్ సోప్ ఇన్ ది వాష్‌రూమ్స్. డోంట్ యు హేవ్ హౌస్ కీపింగ్ గర్ల్ అట్‌లీస్ట్ ..?"

"యు నో మేడం. నా తలకాయంత కంపెనీలు కడతారు గాని అట్‌లీస్ట్ హౌస్ కీపింగ్ గర్ల్ కూడా వుండరు. అన్ని పనులు మేనేజర్‌తోనే చేయిన్చుకోవాలనుకుంటారు. దే డోంట్ నో సచ్ ఎ సిల్లీ థింగ్ ".

"షట్ అప్ . హూ ఆర్ యు?" అడిగాడు బట్టతల వ్యక్తి కోపంగా.

"హూ ఈజ్ హి మేడం. ..?" అమ్మాయి పక్కగా వెళ్ళి అడిగాడు.

"హి ఈజ్ మేనేజర్ ."

"దెన్ యూ..."?!!!

"హౌ స్ కీపింగ్ గర్ల్ ".

"సరిపోయింది".

********

అప్పటికి గాని అర్థం కాలేదు అమాయకరావుకి ఆమె హౌస్‌కీపింగ్ పిల్ల అని!. ఈ మాత్రానికేనా తను అందం అనుభవం, అన్ని కావాలి అని పొగిడింది.

మహేష్ చెప్పనే చెప్పాడు. మొట్టమొదట ఏర్పడే అభిప్రాయం బాగుండేలా చూసుకోమని. అంతా రివర్స్ అయింది. బాస్ మొహం కంద గడ్డలా మారిపోయింది.

"వేడుకోవడం. బతిమలాడడం, గడ్డం పట్టుకోవడం, కాళ్ళు పట్టుకోవడం, పొగడడం, లెంపలేసుకోవడం, గుంజీలు తియ్యడం ఇలాంటి ఎన్నో ప్రక్రియలతో తన బాస్ ప్రసన్నోద్యాయం పూర్తి చేసే ప్రయత్నం చేసాడు అమాయకరావు".

ఇవన్ని మహేష్ ఇచ్చిన "కాకా పట్టడము ఒక కళే" లో లేనివి. కాని అనుభవం నేర్పిన పాఠాలు. కాని ఎలాగైనా తనకప్ప చెప్పిన మొదటి ప్రాజెక్ట్‌లో మంచి రిజల్ట్ చూపించి తన సత్తా నిరూపించుకుని బాస్‌కి దగ్గరయ్యే ప్రయత్నంలో గెలిచాడు అమాయకరావు

ఆ రోజు నించి బాస్‌తో సముఖత ఏర్పడింది. రోజు బాస్ తన టీం మొత్తానికి టీం ఫండ్‌తో టీం లంచ్ ఏర్పాటు చేసి అమాయకరావుని పొగడ్తలతో ముంచెత్తాడు.

"డియర్ ఫ్రెండ్స్ , ఈ రోజు అమాయకరావు సాధించిన విజయం మన టీం విజయంగా ఫీలవ్వాలి, గర్వపడాలి, " యు నో రియల్లీ స్పీకింగ్ , హి ఇజ్ నాట్ అమాయకరావు, హి ఇజ్ మాయకరావు" అంటూ, బిగ్గరగా నవ్వాడు, పెద్ద జోకేసిన ఫీలింగ్‌తో, కాని ఓ లిప్త కాలం పాటు, ఎవ్వరికి, నవ్వు రాలేదు, అది గమనించి బాస్ తన నవ్వు ఆపేసాడు, అయ్యో బాస్ ఫీల్ అయ్యాడనుకుని అంతా అదే రేంజ్‌లో నవ్వారు, బాస్ తన గొంతు కూడా కలిపాడు

"మిస్టర్ అమాయకరావు, ఈ రోజు నీకు ఇంకొక కొత్త ప్రాజెక్ట్ ఇస్తున్నాను, ఆ ప్రాజెక్ట్‌కి నువ్వైతే న్యాయం చెయ్యగలవని నా నమ్మకం..."

"ఏదో సర్ .... అంతా మీ అభిమానం..."నవ్వుతూ చెప్పాడు.

"ఓహ్ ..ఓహ్ .. వాట్ ఎ ఓబిడియన్స్ ..నువ్వు నాకు నచ్చావోయ్ ....."అంటూ వెళ్ళిపోయాడు.

"ఏం అమాయకరావు, బాస్‌ని బాగానే గ్రిప్ లో వుంచుకున్నావే..." అన్నాడు ప్రక్కనే వున్న నవీన్ .

"మనం వాళ్ళని గ్రిప్‌లో ఉంచుకోవడం కాదు, మనమే వాళ్ళ గ్రిప్‌లో వుండాలి అప్పుడే మనం ఎఫెక్టివ్‌గా పని చెయ్యగలం..." ఉపన్యాస ధోరణిలో చెప్పాడు.

"ఎన్నాళ్ళయింది సర్ మీరు ఈ కంపెనీకి వచ్చి?"

"నాలుగు నెలలు!"

"ఒక్క సారైనా లీవ్ అప్లై చేసారా?"

"లేదు ఏం?".

"అదీ సంగతి. కొన్నాళ్ళాగితే నువ్వే ఒపీనియన్ మార్చుకుంటావ్ ".

"నాన్సెన్స్ ..!" అనుకుని తన పనిలో నిమగ్నమైపోయాడు.

*******

"మిస్టర్ అమాయకరావు....!!?" స్లాబ్ ఊడిపోయేలా అరిచాడు బాస్ .

అంతే..! తన బే దగ్గర మాయమై బాస్ బే దగ్గర ప్రత్యక్ష్యమయ్యాడు.

"ఏమిటిది..? వాట్ ఇజ్ థిస్ అని అడుగుతున్నాన్నేను?"

"ఓహ్ ...ఇదా..లుక్ ఫ్లోర్ అని అటెండన్స్ ఆపెరేటింగ్ సిస్టం..." కూల్ గా చెప్పాడు.

"చ..మరే మాకు తెలీదు."

"నిజంగానా సర్ ...?" క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టాడు.

"షట్ అప్, నేనడుగుతుంది ఇదేమిటి అని..ఇలా నాకు చెప్పకుండా. కనీసం మాట మాత్రానికైనా ఒక్క మాట కూడా చెప్పకుండా ఇలా ఆన్ లైన్లో లీవ్ అప్లై చేస్తే ఎలా..? ఏమిటి దానర్థం నేనేమనుకోవాలి?"

"ఇందులో అనుకోవడానికేముంది సర్. చాలా రోజుల నుంచి సింహాచలం మొక్కు వుంది సర్ , ఎలాగు శని, ఆదివారాలు వున్నాయి, వాటితో పాటు ఈ ఒక్క రోజు లీవ్ కలుపుకొని ఒకసారి వెళ్ళి వద్దామని అనుకున్నాను".

"అనుకోవలిసింది నువ్వు కాదు నేను ! నేను పంపించాలి అనుకోవాలి. కనీసం నాతో మాట వరసకైనా ఒక్క మాట కూడా అనకుండా ఇలా అప్లై చేస్తే దానర్థం ఏంటి. నువ్వు ఇచ్చినా ఇవ్వకపోయినా నేను వెళ్ళి తీరతాను అని నీ మటుకు నువ్వు డిసైడ్ అయిపోయినట్లేగా.."

"అయ్యో...! నా ఉద్దేశం అది కాదండి.."

"నీ ఉద్దేశాలు, భారత దేశాలు ఎవరికీ కావలయ్య.. it implies that !..నువ్వు చేసిన పని అర్థం చెప్పకనే చెపుతూంది ంది. గో అండ్ కాన్సల్ యువర్ లీవ్ .. no more arguments in that ".

అంతలా ఎందుకు అరిచాడో అర్థం కాలేదు అమాయక రావుకి కంపెనీ ఏమో లీవ్ ఆన్ లైన్లో అప్లై చేసుకోమంటుంది పాలసీ. మరలాంటప్పుడు అప్లై చేసే ముందర ఇతనికి చెప్పాలంటాడేంటి?

"ఎలాగు అది అప్ప్లే కదా..అతనికి రెజెక్ట్ చేసే అవకాశం వుంది కదా..రెజెక్ట్ చెయ్యచ్చు కదా..ఈమాత్రానికే అరవాలా..? ఛీ ఛీ, షాప్ ఫ్లోర్లో అందరూ నన్నే చూసారు. ఓహో..అది రెజెక్ట్ చేస్తే ఆన్ లైన్లో రికార్డు అవుతుంది. దానికి ఎక్స్ప్లనేషన్ రాయాలి, అదే నేను కాన్సిల్ చేసుకుంటే ఎక్స్ప్లనేషన్ తో పనిలేదు.

అంతే కాదు చివరిలో మిగిలిన లీవులన్నీ ఎన్కాష్ చేసే పనిలో కాస్ట్ కట్టింగ్. ఏ టీం నుంచి, ఏ మేనేజర్ నుంచి ఎంతవరకు అనే విశ్లేషణ వుంటుంది.

అపుడు బాస్ని అడిగే ఛాన్స్ వుంటుంది మీ టీంకి లీవ్స్ఎందుకు ఇవ్వలేదు అని. అది ఈయన మెడకు చుట్టుకుంటుందని! లోతుగా ఆలోచిస్తే చాల విషయాలు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయి. అయినా నా కెందుకీ బాధ, నా క్కావాల్సింది లీవ్. అదేదో ఆయన చెప్పినట్టుగా ఒక మాట ముందుగా అడిగేస్తే పోలా..ఆయన ఇగో కూడా దెబ్బ తినదు అని సరిపెట్టుకున్నాడు.

అలా రోజులు గడిచాయి. సంవత్సరం దాటింది తను మల్టీనేషనల్ కంపెనీలో చేరి. చాలా నేర్చుకున్నాడు. ముఖ్యంగా చాడీలు చెప్పి చెంచా గిరి చేసే చపలత్వం చొచ్చుకు పోయింది. తప్పు ఒప్పులను ఎంచే సామర్థ్యం నశించింది. ఆ రక్తంలో చైతన్యం చితి పేర్చుకుంటోంది. ఇంతకు ముందు అమాయకరావు ఇప్పుడు మాయక రావు అయ్యాడు. ఇంకా చెప్పాలంటే డిప్లమసి అలవాటయ్యింది. అన్యాయాన్ని ఎదిరించాలన్న తపన అటకెక్కింది.

కాని ఇంకా హిపోక్రసికి మాత్రం అలవాటు పడలేదు.

"గుడ్ మార్నింగ్ అమాయక రావు..."ఎక్కడినించో బాస్ గొంతు.

ఆశ్చర్యం వేసింది, అమాయకరావు కి ఎప్పుడు తను ముందర గుడ్ మార్నింగ్ చెపుతాడు, ఈ రోజు ఏంటి బాసే ముందర చెప్పాడు. బహుశా మారాడేమో? అనుకున్నాడు.

ఓ దగ్గిర టీం హర్డల్ మీటింగ్ జరుగుతుంటే అక్కడికి వెళ్ళి మరి "గుడ్ మార్నింగ్ ఎవ్విరి బడీ.."చెప్పాడు. అందులో నించి నవీన్ అడిగాడు." ఏంటి సర్ , మీరే గుడ్ మార్నింగ్ చెపుతున్నారు?".

"ఎస్ ..మళ్లి గుడ్ మార్నింగ్ కూడా చెప్పట్లేదని ఆడిపోసుకుంటారు అందుకని". ఆ టీం అంతటికి ఆశ్చర్యం. ఒక్క సారిగా ఈ మార్పేంటి?. ఏమో రియలైజ్ అయ్యుంటాడు. అతనిలో ఈ మార్పుని అందరు స్వాగతించారు.

అమాయకరావు తన సీట్లో కూర్చుని మెయిల్ బాక్స్ ఓపెన్ చేసాడు. ముఖ్యమైన మెయిల్స్ అన్ని ముందర ఆన్సర్ చేస్తాడు. తను ఈ సంస్థలో చేరి సంవత్సరం అయిందనటానికి గుర్తుగా పెర్ఫార్మన్స్ ప్లాన్ విషయమై వచ్చిన మెయిల్ అది. మొదటి నెలంతా ఎవరికీ వారు రేటింగ్ వేసుకోవాలి. రెండో నెలంతా ప్రతి మేనేజర్ వారి వారి టీం మెంబెర్స్ కి రేటింగ్ ఇస్తారు. తరవాత మూడో నెలలో ఒకరికి ఒకరు కార్యక్రమం, ఫైనల్‌గా నాలుగో నెలలో ప్రమోషన్, డిమోషన్, ఊస్టింగ్ , ఇంక్రిమెంట్ వగైరా....!

ఇప్పుర్థమైంది అమాయకరావుకి బాస్ ఎందుకు గుడ్ మార్నింగ్ చెప్పాడో? తన టీంకి తన మీద వున్న దురభిప్రాయలన్నిటిని మసి పూసి మారేడు కాయ చెయ్యాలి కదా! అవును "కాకా పట్టడము ఒక కళే" మై డియర్ టీం, మనమంతా ఔటింగ్ వెళ్ళబోతున్నాం. suggest me a good place. టీం ని ఉద్దేశించి చెప్పిన మాట.

ఇది కూడా పెర్ఫార్మన్స్ ప్లాన్ లో భాగమే అయ్యుంటుంది. అవును "కాకా పట్టడము ఓ ...అదే."

"ప్లేస్ సంగతి తరవాత సర్, ముందర బడ్జెట్ చెప్పండి" అన్నాడు నవీన్

"బడ్జెట్ ది ఏముందయ్యా నవీన్, డబ్బులకి నేను లేనా".

షాక్ మీద షాక్ అమాయకరావు కి అవును "కాకా......ఓ...కళే"

"అలా కాదు సర్, బడ్జెట్ చెపితే దాని బట్టి ప్లాన్ వుంటుంది కదా అందుకని". అన్నాడు అమాయకరావు

"అల్‌రైట్, కంపెనీ మనిషికి 750 /- దాకా ఇస్తుంది". కాని వెయ్యి దాకా వేసుకోండి.

"మిగతా 250 /- మీరు పెడతారా?"

"ఎగ్జాట్లీ...! మిగతా 250 /- నా పాకెట్ లోంచి మనిషికి అదనంగా పెట్టి నా టీంని తృప్తి పరచాలనుకుంటున్నాను"

మై గుడ్ నెస్ , ఈ సారి అమాయకరావు కి ఆ000 వోల్టుల హైపెర్ టెన్షన్ వైర్స్ తెగి పడ్డట్లయింది. విపరీతమైన షాక్ . అవును. "అది పట్టడమూ ఓ కళే" .

*******

"సర్, మిమ్మల్ని సీనియర్ మేనేజర్ గారు పిలుస్తున్నారు" వచ్చి చెప్పాడు ఆఫీసు బాయ్ అమాయకరావు బాస్‌తో.

బాస్ సీనియర్ మేనేజర్ రూంలోకి వెళ్ళాడు. వెళ్తూనే "గుడ్ మార్నింగ్ సర్ ". చెప్పాడు.

"బాడ్ మార్నింగ్ , వేరి బాడ్ మార్నింగ్ ".

"వాట్ హప్పెండ్ సర్ ...?"

"ఇంకా ఎం జరగాలాని....?"

"టీం ని సాటిస్ఫై చెయ్యలేకపోతే అది గుడ్ మార్నింగ్ ఎలా అవుతుంది". అరిచాడు.

"చూడు. నీ టీం లో ఒక మెంబెర్ ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ఇది. నువ్వసలు ఎప్పుడూ మెచ్చుకోలుగా ఉండవని, కనీసం పలకరించవని, చాలా ఇగోఇష్టిక్ బిహేవియర్ అని, వాళ్ళకి లిబెర్టి, ఫ్లెక్సిబిలిటి లేకుండా అన్ని ప్రాజెక్ట్స్‌లో వేలు పెడుంటావని చూడు నీ కళ్ళతో నువ్వే చూసి తరించు".

"అదేమిటి, సర్ , ఏ ఒక్కడో ఇచ్చిన ఫీడ్ బ్యాక్ పట్టుకుని..."

"డోంట్ టాక్ !...ఒక్కడిచ్చినా అది విలువైనదే అని నా నమ్మకం. మిగతా అందరికి కూడా అదే ఫీలింగ్ ఉండవచ్చు కాని అందరూ బయటపడరు. స్టాటిక్స్ ప్రకారం అగ్రెసివ్ పీపుల్ ఏ ఒక్క శాతమో వుంటారు. అందుకే వారిచ్చే ఫీడ్ బ్యాక్ నేను పట్టించుకుంటాను. ఇంకోసారి ఇలాంటి ఫీడ్ బ్యాక్ వస్తే మాత్రం నేనూరుకోను"

అరుస్తూ అన్నాడు.

"ఫీడ్ బ్యాక్ ఇచ్చిందెవరో అర్ధం కాలేదు ..నవీన్ అయ్యుంటాడా..? అవును వాడే అయ్యుంటాడు.ఎప్పుడూ తన మీద సెటైర్ వేసేది అతనే...ఏమైనా వుంటే బయటికి నాతో చెప్పొచ్చుగా..అంతేకాని ఇలా వెనక పోటు దేనికి...? ఛి ఛి..అందుకే ఎక్కడ ఉంచాల్సిన వాళ్ళని అక్కడే ఉంచాలి...అయినా ఈ ఫీడ్ బ్యాక్ ఇచ్చింది ఎవరో ముందర తెలుసుకోవాలి".

"ఎలా తెలుసుకోవడం..? చాల కాన్ఫిడెన్షియల్ విషయమే అది.."

శతకోటి అపాయాలకి అనంత కోటి ఉపాయాలు అని... తనకున్న పలుకుబడితో నెట్వర్క్ డిపార్ట్‌మెంటు సహాయం తీసుకొని ఫీడ్ బ్యాక్ వచ్చిన వారి సిస్టం ఐ. పి అడ్రస్ తెలుసుకున్నాడు. కాని ఖంగు తిన్నాడు.. సిస్టం అమాయకరావుది. "అమ్మ..! ఎంత పని చేసాడు?..తడి గుడ్డతో గొంతులు కోసే రకం. చెప్తా వీడి పని". అనుకున్నాడు మనసులో.

కాకి వాల్లింది పండు పండింది అని..అమాయకరావు టీం ఔటింగ్‌కి రానసటం ఓ కుంటిసాకు దొరికింది.

"ఏంటయ్యా..అమాయకరావు? టీం ఔటింగ్‌కి రానన్నావటగా...? నీకు అస్సలు టీం స్పిరిట్ లేదయ్యా..! వస్తున్నావా..లేదా..?" అరిచాడు.

"ఈ బలవంతపు బ్రాహ్మణత్వం ఏమిటి సర్ నేను రాలేను." తెగేసి చెప్పాడు.

"రాలేవా..చూసుకో నీ పెర్ఫార్మన్స్ ప్లాన్ ఇంకా రేట్ చెయ్యల్సింది నేనే.."

గొంతులో పచ్చి వెలక్కాయ్ పడ్డట్లయింది..అందరితో పాటు నోర్మూసుకుని బయలుదేరాడు.

"అదేంటయ్యా..అందరూ ఫార్మల్స్ వేసుకోవాలి, ప్రొఫెషనల్ లుక్ కావాలి అని చెపితే కుడా..కాలర్ లేని టి షర్ట్ ఎందుకు వేసుకున్నావ్ ."అడిగాడు అమాయకరావుని.

"నేనొక్కడనే కాదు సర్, నవీన్ కూడా వేసుకున్నాడు..వాణ్ణి అడగరే...?" కంప్లైనింగ్ ధోరణిలో అడిగాడు.

"అవునా...నవీన్ కూడా వేసుకున్నాడా...? నాకనిపించటంలేదు..నాకు నీదే ఇంఫోర్మల్‌గా కనిపిస్తోంది.."

తన ప్రతి పనికి బాస్ అడ్డు తగులుతున్నాడు. అమాయకరావుకి ఇదంతా ఫీడ్ బ్యాక్ మహత్యమేనని అర్ధమవుతోంది.

"మిస్టర్ అమాయకరావు..ఏమిటి ఏమిటి ఈ మెయిల్ డ్రాఫ్టింగ్ ..ఇలాగేనా చేసేది.?."

"గత సంవత్సరం పాటుగా ఫాలో అవుతున్న ఫార్మాట్ ఇది ..." ఒద్దికగా చెప్పే ప్రయత్నం చేసాడు.

"షటప్ ..పడిన పాటనే..పాడర..పాసిపళ్ళ అని..అప్పట్నించి ఇదే ఫాలో అవుతున్నారు. కనీసం కొత్తగా, డిఫరెంట్‌గా, చెయ్యాలి అని అనిపించలేదు. మనిషికి వయసు కాదయ్యా కావలిసింది..మనసు బుద్ది క్రియేటివిటి చూపించే ప్రయత్నం చెయ్యండి." అరిచాడు.

ఈ మధ్య తననే టార్గెట్ చేసుకున్నాడు విషయం బాగా అర్ధమవుతోంది అమాయకరావుకి.

ఇహ లాభం లేదు అనుకుని మళ్ళీ "కాకా పట్టడమూ ఒక కళే" ఆర్టికల్ చదివి రక్తంలోకి కొత్త చైతన్యం తెచ్చుకోవాలని మళ్ళీ ఆర్టికల్ చదివాడు.

ఈ సారి ఇంకొన్ని కొత్త విషయాలు భోదపడ్డాయి. ఇంతకూ ముందు చదివినప్పుడు ఇవన్ని స్పురించలేదు. ఇదేం విచిత్రమో ఇప్పుడు అం తా కొత్తగా అనిపిస్తుంది.

అదే ఆర్టికల్ కాని, ఆ అనుభవాలు కొత్తవి, ఆలోచనలు కొత్తవి, అక్షరాలూ అవే అయినా, అర్ధాలు కొత్తవి. అందుకే ఇంతకూ ముందు కనిపించనివి, అనిపించనివి, ఓ కొత్త నగ్న సత్యం ఇప్పుడు అర్ధమవుతోంది. తన తలకాయంత అక్షరాలతో సత్యం గోచరిస్తోంది.

" "If your manager wants to screw you , you can not escape from it" ("రాజు గారు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కరువా..?"(తెలుగు ప్యూర్ ట్రాన్స్‌లేషన్ )

# ఆశ - భువనచంద్ర

**"పడుకోటానికి కొంచెం చోటివ్వనా?" ఆమె ..**

"చాలా సంతోషం... బాగా అలసిపోయాను!" నేను.

సంభాషణ అంతా హిందీలో జరిగింది.

వయసు చాలా చిన్నది... పోనీ వయసు కంటే చిన్నదిగా కనిపిస్తోంది.

బుగ్గల్లో అదోరకమైన మెరుపు. వాలుగా జరిగింది.

ట్రైన్ బెర్త్ మీద అటువైపు ఆమె తల.. ఇటోవైపు నా తల వచ్చేట్టు ఒదిగి పడుకున్నాం. మధ్యలో ఓ చిన్న బెడ్

"మీ కాలివేళ్ళు ఎర్రగా ఉన్నై!" వేలితో స్పృశించి రహస్యం చెప్పినట్టు అన్నది.

"బూట్లు వాడితే అలాగే ఉంటాయి ..." నవ్వాను.

"నేను నలుపు కదూ?"

"నలుపంటే నాకిష్టం.. ఓ కాంతిని విరజిమ్ముతుంది.!"

ఫక్కున నవ్వింది.

జోగుతున్న ఎదుటి బెర్త్ ముసలమ్మ కళ్ళు తెరిచి, "ఛీ...పోయేకాలం వచ్చింది.. ఇట్లా పబ్లిగ్గా పడుకుంటారా ఎవరైనా?" అన్నట్టు చూసి ఇక చూడలేనట్టు మొహం తిప్పుకుని కళ్ళుమూసుకుంది.

'ఆమె' నవ్వడం ఆపేసినా.. నవ్వుతాలూకు 'తరంగాలు' నా చెవుల్ని అంటిపెట్టుకునే ఉన్నాయి.

ఓ జలధార రాళ్ళమీద పడి మరుక్షణమే మౌనంలోకి జారిపోయినట్లనిపించింది' "ఎందుకూ నవ్వింది?" అడిగా.

"నలుపు కాంతి విరజిమ్ముతుందంటేనూ.!" ఈ సారి చిరునవ్వుతో సరిపెట్టింది.

"నీలి నీలి మొహంలో చంద్రకాంతి!" అన్నా.

"ఎలా?"

"ఇంకోసారి నవ్వండి.. అప్పుడు చెబుతా!" అన్నాను.

తలకింద ఓ చెయ్యి పెట్టుకుని ఇంకో చెయ్యి నా పాదం మీద పాకించి మెల్లగా నిమురుతోంది.

కొంచెం చక్కిలి గింతలు.. ఎన్నో పులకరింతలు......

"జీవితం ఓ ప్రయాణం..! అంతే కదూ?" అడిగింది.

"అవును.. కానీ గమ్యం ఎప్పుడు - ఎలా చేరతామో తెలీదు!" నవ్వాను.

"ఇలా మీ పాదం నిమురుతుంటే.. ఏ జన్మో గుర్తుకొచ్చినంత సరదాగా హాయిగా ఉంది.." బొటనవేలిని తన వేళ్ళ మధ్య బిగించింది.

"ఎందుకూ?"

"జవాబు లేదు.! కొందరు తెలియకుండానే 'నా' అనిపిస్తారు. కొందరు దగ్గరుండీ ఆకాశమంత దూరమౌతారు. ఎందుకలా అనిపిస్తుందో ఎవరూ చెప్పేదీ?" ఆమె నిశ్వాసాలు నా పాదాల్ని వెచ్చగా తాకుతున్నై.

"ఇలా ఒంటరిగా పయనించాలని ఎన్ని యుగాలుగా కలకంటున్నానో తెలుసా? Far From Every Thing and Every one!" గంభీరంగా అని పకపకా నవ్వింది.

లక్ష మల్లెపూలు వానలా కురిశాయి.

ఆమె పాదం పట్టుకుని చక్కిలి గిలిపెట్టాను.

మెల్లగా లేచి కూర్చుంది. ఆమె శరీరపు వెచ్చదనం నా పొట్టలోకి పాకుతోంది.

సడన్‌గా నా వేపు తిరిగి "నిద్రొస్తోందా?" అంది.

"ఉహూ"

"మేరెతొ గిరిధర్ గోపాల్ దూస్ రాన కోయీ" అంటూ మెత్తగా మంద్రంగా నా చెవిదగ్గర తన నోరుంచి పాడుతోంది.

"ముసలమ్మ వింటే?"

"నాకు భయం లేదు!"

"ఎందుకు?"

"ఎందుకంటే.. నా పేరు ఆశ!" నవ్వింది.

నేనూ నవ్వి అన్నాను, "నా పేరు భయం!."

"ఆశ ఎప్పుడూ భయాన్ని ఆశ్రయిస్తుంది తెలుసా?"

మెల్లగా నా మోచేతి మీద పెదాలానించింది.

విడీవిడని ఓ పనితనపు అల్లరి.! తనలోంచి ఏదో సువాసన మెత్తని మంచులా ఆ సువాసన నన్నాక్రమించింది. పెదవుల్లో ఎర్రదనం... పై పెదవి అంచున సన్నటి ఒంపు...అతి చిన్న ముక్కుపుడక తళతళలు.. మెల్లగా నా మీద చెయ్యివేసి మీదకి వాలింది.

"చెవికొరకనా?" తన మాటలో ఓ చిలిపిదనం.

"ఏం.? ఆకలి వేస్తోందా?"

మెత్తగా మత్తుగా నిద్రలో నుంచి లేచిన దానిలాగా బద్ధకంగా నవ్వింది.

"నేను ఎన్నికలలు కంటానో తెలుసా?"

"చెప్పండి!"

"ఊహూఁ!"

"ఏం?"

"చెబితే కలలు కరిగిపోతాయి!"

"చెప్పక పోయినా కరిగి పోతాయి!" నవ్వి అన్నాను.

"అదివేరు.!"

"ఎలా?"

మెల్లగా తన తల నా గుండెమీద ఆన్చింది. నా చేయిని తన చెక్కిళ్ళ మీద పెట్టుకుంది. కళ్ళుమూసుకుంది.

సున్నితంగా ఆమె బుగ్గలూ కళ్ళూ.. నుదురూ తలా నిమరసాగాను. కళ్ళు విప్పి నా వంక చూసి.. దగ్గరగా జరిగి.. పెదాల దగ్గరగా పెదాలు చేర్చి.." ఇప్పుడేం చెయ్యాలో చెప్పండి !" అంది. ఆమె పెదాలు తియ్యగా మండుతున్నై. నిశ్వాసాలు నా మొహాన్ని కాల్చేస్తున్నాయి. నీలాకాశపు నీలంలో కల్సిపోయిన తెల్లని వెన్నెల.. ఆ రెండూ కలిసి పోగా ఉద్భవించిన సరికొత్త రంగు.. సముద్ర మధ్యాన కదలని మెదలని నీటిపై ప్రతిఫలించిన చంద్రబింబం..

రెండుపూల తీగలు ఒకదాన్నొకటి పెనవేసుకుని కౌగిలి బిగిస్తున్న భావన..

ఎక్కడో అగ్ని పర్వతం బద్దలై ఎర్రటి లావాని చిమ్ముతున్న ఉద్వేగం..

ప్రతిక్షణమూ మరోక్షణంతో కలిసి కాలంలో కలిసిపోతున్న దృశ్యం...

రైలు పరుగెడుతున్న శబ్దం ఏ యుగం తరువాతో వినిపించింది. తుఫాను గాలికి ఒణికిన ప్రకృతి సేదదీరింది.! పచ్చని చేతుల్ని ప్రాణంగా చాచింది! కమ్మని కలని అమ్మ కడుపులోని శిశువులా దాచుకుంది.

"మేరేతో గిరిధర్ గోపాల్.. దూస్ రాన కోయీ.."

"యహీజీనా యహీ మర్నా.."

"ఏ మేరే ఆంఖోంకి పెహలేసపనే.. రంగీన్ సప్‌నే మాసూమ్ సప్‌నే.. పల్‌కోంకి పల్ నా ఝులావూతుఝే గాగాకె లోరీ సునావూతుఝే.."

మంద్రంగా.. మెల్లగా.. చెవిలో వెచ్చని తేనె పోస్తున్నట్టు పాడుతూనే ఉంది.. తనలోంచి.. తన శరీరం లోంచి ఓ మధురమైన పరిమళాన్ని నా నరనరానికీ చేరుస్తూనే ఉంది.. ఎప్పుడో.. బాగా తెల్లారాక మెలుకువ వచ్చింది.

ట్రైన్ పూనా `పూనా` దాటేసింది.

ఆమె లేదు.. `పూనా`లో దిగిపోయి ఉండాలి.

సిగరెట్ కోసం ఏర్‌బేగ్ తీశాను.

సిగరెట్ల పక్కనే రెండు గాజులూ.. ఓ చాక్లెట్ ఉన్నాయి. ఆ గాజుల్ని తడిమి గుండెకు ఆనిచ్చుకున్నా. కళ్ళవెంట గిర్రున నీరు తిరిగింది.

`కడుపునిండా` వెక్కి వెక్కి ఏడవాలనే కోరిక.

చెవి దగ్గర ఆమె అన్నమాట లీలగా వినిపించింది....

"నా పేరు ఆశ!."

*(రచనా కాలం: సెప్టెంబర్ 30, 1982)*

# రైలుబండి

ఆర్.శ్యామల

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**పట్టణానికి దూరంగా** రైల్వే ట్రాక్ వెలివేసినట్లు ఉంది. ముప్పై, నలభై దాకా చిన్న చిన్న పాకలు. కాలవలో, నడిచే దారో తెలియనంత ఇరుకైన సందులుతో మురికి కూపంలా ఉంది. అక్కడ అందరూ కూలినాలి చేసుకునే వాళ్ళే. అక్కడ పిల్లలు కొంతమంది ఇంటిపట్టున ఉంటే, మిగిలిన వారు ఏదో కూలి చేయడమో లేదా భుజాన సంచులు తగిలించుకుని ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల చెత్తా చెదారాల్లో ఏరుకుని, అవి అమ్మటమో చేస్తుంటారు. రోజుకి రెండు, మూడు గూడ్సు రైళ్ళు ఆ రైల్వే ట్రాక్ మీదుగా వెళతాయి. అంతకు మించి అటువైపు ఇంకే అలికిడి లేదు.

సాయంత్రం అయిదవుతుంది. ఛుక్..ఛుక్.. మని రైలు వస్తున్న శబ్దం. గంగ చెవులకి వినసొంపైన, ఇష్టమైన సవ్వడది. అంతే, చేతిలో చీపురు పడేసి పట్టాల దగ్గరకు పరిగెత్తింది.

సరిగ్గా అప్పుడే ఆ మురికి పేటలోకి రిక్షా ఒకటి వచ్చింది. ఆ సందుల్లో ముందుకి పోలేక "ఇంక ముందుకు పోదు" అన్నాడు రిక్షావాడు.

"సర్లే ఇక్కడే దిగుతాను" అని దిగిందో ఆడమనిషి. ఆమె వెంట పోలియో సోకి చేతికర్రలతో నడుస్తున్న ఓ పద్నాలుగు, పదిహేనేళ్ళ అబ్బాయినూ.

"నీకేం పనిలేకపోతే ఉండు. అరగంటలో వచ్చేస్తానయ్యా!" రిక్షావాడితో అంది ఆమె.

"ఎవరది?" అనుకుంటూ పాకల్లోని ఆడవాళ్ళు బయటకు వచ్చి చూసారు.

"రాజమ్మొదినా! నువ్వేనా! ఇంకెవరో అనుకున్నాను" అంటూ ఒకామెనవ్వుతూ అంది.

"ఓసీ రిక్షాలో ఎలిపొచ్చువే. ఏందీ దారి మచిపోనావా" ఓ ముసిల్ది అంది.

"లేదే అత్తా! నాను ఒక్కత్తిని అయితే నడిచే ఎలిపొద్దును. కాని ఎనకాలే ఈ తోక ఉన్నాడాయె." అంది.

అంతలో పిల్లలు బిలబిలమంటూ "ఒరే సూరి వచ్చాడ్రా.. సూరి అన్న వచ్చాడ్రా" అంటూ ఆ పిల్లాడి చుట్టూ చేరిపోయారు.

"రాయే రాజమ్మ! కూకో, బొత్తిగా నల్లపూసయిపోనావే!" అందొక నలభైఏళ్ళావిడ.

"ఉప్పుడు కాదే! మళ్ళా వత్తాను. నర్సింగన్న ఇంటికి ఎల్లాలి."

"పెరామరసకి వచ్చావా.. ఆ తల్లి రాములమ్మ అదృష్టవంతురాలు. సచ్చిపోయి సుఖపడిపోనాది. నేదంటే ఆ తాగుముచ్చి నా కొడకడు దానికి రోజూ నరకం చూపించేవోడు. ఆ పిల్లల్ని సుత్తే బాదేత్తాది. ఏం సేత్తాం. అంతా దేవుడిదే భారం. ఎళ్ళు - ఎళ్ళు మళ్ళా సీకటైపోతాది" అంది ముసలామె.

తన చుట్టూ చేరిన పిల్లలతో నవ్వుతూ కబుర్లు చెపుతున్న కొడుకుని చూసి "సూరిగా నాను గంగాలింటికి ఎళుతున్నా. అక్కడికి వచ్చేయ్" అంది

"ఇది నిజంగా పెరామరసకే ఎలుతుందా?" అనుమానంగా అంది ముసలామె.

"ఏమో అత్తా.. నాకూ అనుమానమే.. దాని కడుపులో ఏముండాదో." వడివడిగా పోతున్న రాజమ్మని చూసి అనుకున్నారు.

ఆ సందువెంట నడిచి ఒక మలుపు తిరిగి ఒక పాకముందు ఆగింది. బయట నుండి "గంగా..గంగా" అని పిలిచింది.

"ఎవరూ..?" అంటూ పాకలోనుంచి తొంగి చూసాడో శాల్తి.

"రాజమ్మా! నువ్వేనటే.. రా!" అని లోపలికి పిలిచాడు.

"నర్సింగన్న.. బాగున్నావా..?" అంది.

"ఏం .. బాగో.. ఏటో" అన్నాడు పేలవంగా.

"గంగేది.."

"నువ్వు.. ఇన్లేదా అదిగో ట్రెయిన్ సప్పుడూ. అది ఇంకా ఎక్కడెందుకుంటాది. వాకిలి తుడుస్తున్నదాయి సీపురు అక్కడ పడేసి పారెత్తింది. ట్రైను చూడ్డానికి. "

రాజమ్మ నవ్వుకుంది. తనకు తెలుసు. తనకే కాదు ఇక్కడందరికీ తెలుసు. గంగ ట్రయిన్ వచ్చేటయానికి పట్టాల దగ్గరకి వెళ్ళిపోయి, బండి ఎల్లిపోయేదాకా చూస్తూనే ఉంటుంది.

రాజమ్మ అయిదారు నెలల కిందట వరకు ఇక్కడే ఉండేది. భర్త చాన్నాళ్ళ క్రితమే ఎటో వెళ్ళిపోయాడు. అప్పటినుండి కూలి చేసుకుంటూ ఇద్దరు కొడుకులతో కలిసి ఉండేది. ఆరు నెలల కిందట ఇక్కడ పాక ఖాళీ చేసి, రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రైల్వే గేటు దగ్గరలో చిన్న ఇంట్లోకి అద్దెకి దిగింది. రైల్వే గేటు పడగానే పెద్దకొడుకు, ఆమె కలిసి శనక్కాయలు, నువ్వుండలు, చేగోడీలు బస్సులు, ఆటోలో ఉన్న పాసింజర్స్‌కి అమ్మడం మొదలు పెట్టారు. నెమ్మది నెమ్మదిగా వ్యాపారం పుంజుకుంది. అయితే చిన్నోడు సూరిగాడు సరిగ్గా పని చేయలేకపోవడం, పెద్దాడు పైడ్రాజు సరిగ్గా ఇంటిపట్టున ఉండకపోవడము రాజమ్మకి పని ఎక్కువై సతమతమైపోయింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే రాజమ్మకి గంగ గుర్తుకొచ్చింది.

"పెద్దాడికి, గంగని ముడిపెడితే.. ఆడూ తిరుగుళ్ళు మాని బుద్ధి గుంటాడు. గంగని కోడలుగా చేసుకుంటే తనకు చేదోడు వాదోడుగా ఉండడమే కాదు. దాని ఆకర్షణీయమైన రూపం, ముద్దుమాటలతో వ్యాపారం బాగా జరుగుతుంది." అని మనసులో అనుకుంది. గంగ తల్లి సచ్చి నెలకావొస్తుంది. కబురు తెలిసినా ఇంతవరకూ ఎల్లలేదు. ఇదే వంకతో ఎల్లి, అన్ని ఇసయాలు మాట్లాడాలి" అనుకున్నదే తడువుగా కొడుకుని వెంట బెట్టుకుని వచ్చింది.

***

గంగ కళ్ళింత చేసుకుని ట్రైన్‌ని ఆనందం, ఆశ్చర్యం కలబోసినట్లుగా చూస్తుంది. ఆమెకు అంత పెద్ద రైలు పట్టాల మీద దడదడమని పరిగెడుతుంటే అద్భుతమనిపిస్తుంది. రైలు పూర్తిగా కనుమరుగు అయ్యేవరకూ చూసింది. రైలు కనుమరుగయ్యాక ఉస్సురుమంటూ పాక దగ్గరకు వచ్చి గబగబా వాకిలి తుడిచి లోపలికి వచ్చింది.

"ఎవరూ! రాజమ్మత్తా.. బాగున్నావా?" చాలానాళ్ళకి చూసానన్న సంతోషం గంగ ముఖంలో.

నవ్వింది రాజమ్మ. గంగనొకసారి కిందనుంచి మీదివరకు తేరిపార చూసింది. "రంగు తక్కువైనా గుంట మంచి ఆకర్షణగా ఉంది" మనసులో అనుకుంది.

"రాయే.. గంగా నీకోసమే చూస్తుండా" అని తన దగ్గరగా కూర్చుండబెట్టుకుంది. తను తెచ్చిన పప్పుండలు, చేగోడీలు చేతికిచ్చింది. కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుతూ "ఇదిగో నర్సింగన్నా.. అసలు ఇసయం సెపుతున్నాను. గంగని నా కోడలు సేసుకుంతాను. నా పెద్దకొడుకు పైడిరాజుకి, గంగనిచ్చి పెళ్ళి చెయ్యాల్రా." అంది.

అనుకోని ఈ ఘటనకి "అదేంటే అప్పుడే పెళ్ళంటే ఎలాగే" ఆశ్చర్యంగా అన్నాడు నర్సింగ

"నాను పెళ్ళి చేసుకోను అత్తా" అయిష్టంగా మొఖం పెట్టి అంది గంగ.

రాజమ్మ చాలా తెలివైంది. ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలో తెలుసు. గంగకి ఏది ఇష్టమో బాగా తెలుసు. అందుకే "ఓసే.. పిచ్చి గంగా.. మావు ఉప్పుడు ఎక్కడ ఉంటున్నామో తెలుసా. రైల్వే గేటు కాన. మావుండే కాడికి పొద్దస్తమానం రైళ్ళు ఎళతాయే. మావున్న ఇంటికాడి నుండే బళ్ళన్నీ చూడొచ్చు. ఉదయం మొదలు అర్ధరేతిరి దాకా .. ఓహో.. బళ్ళు ఎల్తానే ఉంటాయి.." అభినయించి మరీ చెప్పింది.

"నిజంగా..!" గంగ కళ్ళు ఒక్కసారిగా సంతోషంతో విచ్చుకున్నాయి.

"నిజమేనే.. నీతో అబద్దాలెందుకు ఆడతాను. బయిట సూరిగాడు ఉన్నాడు. పోయి ఆడ్నే అడుగు.."

"ఏందీ.. సూరిగాడూ వచ్చాడా..?" ఉత్సాహంగా బయిటకు ఉరికింది.

"ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందామూ.." నర్సింహతో అంది.

"అది సేసుకోనంతంది.. కదే"

"దాని మొఖం.. అది చిన్నదాయి. దానికేం తెలుసు. దాని మంచి, సెడు మనమే చూసుకోవాలా.."

"అది.. చిన్నపిల్ల.. అదే ఆలోసిస్తున్నానే.."

"చిన్నపిల్లా.. ఇంకా సిన్నపిల్లేంటీ.. పన్నిండేళ్ళు వచ్చాయి. నువ్వు ఉదయం ఎల్లి సాయింత్రం వరకూ గాని రావు. అంతవరకు అది, తమ్ముడిని ఎట్టుకుని ఇంట్లోనే ఉంటుంది. ఏ పాపిష్టి కళ్ళు ఎప్పుడు పడతాయో తెలీదు. అదే పెళ్ళి సేసేత్తే నా దగ్గర భద్రంగా ఉంటాది. అదే కాదురా.. నువ్వూ మళ్ళా మనువాడొచ్చు. నీకు నచ్చిన దానితో.

"నా దగ్గర పైసా లేదే. ఆలమ్మ పోయిన దగ్గరినుండి అదే వంటా, పెంటా సూసుకుంతంది. అదే మాకు దిక్కు కదే దానికి ఉప్పుడే పెళ్ళి చేసేత్తే ఎట్టాగే.." నసుగుతూ అన్నాడు.

అతని ఉద్దేశం పూర్తిగా అర్ధమైంది రాజమ్మకి. "ఇదిగో... చూడు నర్సింహన్నా.. అయిదువేలు నీకిత్తాను. గంగని నాకియ్యి అందాక ఈ అయిదొందలు ఉంచు. పదిరోజుల్లో పెళ్ళి జరిగిపోవాలి." గట్టిగా అంది.

తాగుబోతు నర్సింహకి అయిదొందలు చూడగానే కళ్ళు మెరిసిపోయాయి.

పాకనుండి బయిటకు వచ్చిన గంగ సూరిగాడి కోసం చుట్టూ చూసింది. సూరిగాడు తనచూట్టూ ఉన్న పిల్లలతో ఏదేదో మాట్లాడుతున్నాడు. గంగని చూడగానే అందరిని వదిలి గంగ దగ్గరకు గబగబా వచ్చాడు.

"బావున్నావా.. గంగా..?" ఆప్యాయంగా అడిగాడు.

బాగానే ఉన్నానని తలూపింది. వెంటనే "సూరిగా నాకో ఇసయం సెప్పు. రైలు గేటుకాడ ఉంటున్నారా..?" నిజామా.. కాదా అన్నట్లుగా అడిగింది.

"అవునే.. ఏమయితే.."

"మరే.. రాజమ్మత్త చెప్పింది.. ఉదయం నుండి అర్ధరేతిరి వరకు బోల్డు రైల్లు వస్తాయంట కదా.."

"అవును.. ఆడ ఈ గూడ్స్ రైల్లు కాదు, మనుషులు ఎక్కే రైల్లు ఎక్కువ వస్తాయి. గంగా.. నేను, మా అన్న రైలెక్కినాం.. తెలుసా.."

"నిజం.. నిజంగా.. ఎలా ఉంది.." ఆశ్చర్యంగా అడిగింది.

"అందులో పెద్ద, పెద్ద బల్లలు ఉన్నాయే. ఈ ఊరినుండి, ఇంకోకాడికి పోవాలంటే టిక్కట్టు తీసుకుని ఎళ్ళాలి. చాలా బాగుందే." ఉత్సాహంగా చెపుతున్నాడు.

వాడు కాశీగంగలో మునిగినంత పవిత్రంగా కనిపించాడు గంగ కళ్ళకు. తనూ ఎప్పటికైనా రైలు ఎక్కాలని మనసులో గట్టిగా అనుకుంది. సూరిగాడంటే గంగకు అందుకే ఇష్టం. తెలియని విషయాలు ఎన్నో విసుక్కోకుండా చెపుతాడు.

"కొత్త ఇంటికాడ నీకు బాగుందా.."

"నా కయితే అక్క నచ్చలేదు. ఇక్కడ పేనానికి హాయిగా ఉండేది. అక్కడ రోజంతా పనేనే." కాస్త విచారంగా అన్నాడు.

"మరే.. నీ అన్న పైడ్రాజుని మనువాడమని మీ అమ్మ అంటున్నాది. ఏటంటావురా?" ప్రశ్నార్థకంగా అడిగింది.

"ఏటీ.. ఆడా.. వద్దే. ఆడీ మధ్య బాగా పాడయిపోనాడు. రాత్రిల్లు సరిగ్గా ఇంటికి రాడు. అయినా ఆడు నీ పక్కన కోతిలాగా ఉంటాడే. వద్దు. ఆడ్ని చేసుకోమాక" ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

అంతలో రాజమ్మ అక్కడికి వచ్చింది. "వస్తానే గంగా.. అన్ని ఇసయాలు నీ అయ్యితో మాటాడాను" అని "పదరా" అంటూ సూరిగాడిని తీసుకుని వెళ్ళిపోయింది. రాజమ్మకు చాలా సంతోషంగా ఉంది తన పాచిక పారినందుకు.

సూరిగాడు వెళ్ళిపోతూ, వెనక్కి తిరిగి చూసి "వద్దు.. చేసుకోకు" అని సైగ చేస్తూ చెప్పాడు.

చీకటి పడ్డాక గంగ పొయ్యి దగ్గర కూర్చుని అన్నం వండుతుంటే, నర్సింహ వచ్చాడు.

"గంగా.. మీ రాజమ్మత్త, పదిరోజుల్లో పెళ్ళిచేసేద్దాం అంది. నువ్వు రెండు జతలు బట్టలు కుట్టించుకోయే.."

"నాను.. పెళ్ళిసేసుకోనయ్యా!"

"ఏందే..? అలా మాటలాడుతున్నావు..?"

"అవునయ్యా! సూరిగాడే చెప్పాడు. ఆడి అన్న మంచోడు కాదంట. చేసుకోవద్దన్నాడు." అమాయకంగా అంది.

"ఎవరూ.. ఆ తింగరి సచ్చినోడా.. ఆడిమాటలు ఇనకు. పైడ్రాజు మంచోడు. ఆడ నీకు బాగుంటాదే నీ అత్త నిన్ను బాగా సూసు.." అతని మాటలు పూర్తవ్వకముందే

"వద్దు నాను సేసుకోను" స్థిరంగా అంది.

"ఏమే ఒళ్ళు కొవ్వెక్కిందా నువ్వు ఆ పైడ్రాజునే పెళ్ళి సేసుకోవాలి. రాజమ్మకి మాటిచ్చాను." కర్ర తీసుకుని కొట్టడం మొదలెట్టాడు.

ఆ దెబ్బలు తట్టుకోలేక ఆ పసిప్రాణం "అయ్యా కొట్టకయ్యా! నువ్వు చెప్పినట్టాగానే ఇంటాను" ఏడుస్తూ అంది.

గంగ ఏడుపు విని చుట్టు పక్కన ఉన్న ఆడాళ్ళు చేరారు. ఇందాక రాజమ్మతో మాట్లాడిన ముసలామె గబగబా ఎల్లి నర్సింహ చేతిలోని కర్ర లాగిపడేసింది.

"నువ్వు మనిషివా! పశువ్వారా! ఎదవ సచ్చినోడా! దాన్ని గొడ్డుని బాదినట్టు బాదేస్తున్నావు. ఏం సేసిందిరా అది" గట్టిగానే అంది.

"నేకపోతే సూడు దానికి ఒళ్ళు ఎంత కొవ్వెక్కినాదో. మంచి సంబంధం వచ్చింది. సేసుకోదంట" కోపంగా గంగవైపు చూస్తున్నాడు.

"ఏం సంబంధం" ఆశ్చర్యంగా అంది

"రాజమ్మ కొడుకు పైడ్రాజుతోని.. రాజమ్మ మాటలు అయిపోయింది!

"అదా సంగతీ! ఆ కిలాడీ ముండ వచ్చినప్పుడే అనుకున్నా. అయినా ఒరే దానికి బుద్దిలేదు సరే. నీ బుద్దేమయిందిరా! ఆ పెద్దోడి కన్నా, ఆ కుంటోడికి ఇచ్చిసేసినా నయంరా! ఆ రాజమ్మ నాభంలేనిదే ఏదీ సెయ్యదురా. నా మాటిని ఆ సంబంధం వద్దురా. రాజమ్మకి సెప్పిరా.."

"ఏటి సెప్పేదే ముసలిదానా! నాకు తెలవదా నాను రాజమ్మకి మాటిచ్చాను. నా ఇష్టం. దానికి ఎవడితో చెయ్యాలో చేస్తాను. మద్దిన నీకేటి? అయినా అన్నిట్లోకి ఊపుకుంటూ దూరిపోతావు. నీకిప్పుడు ఎవుడే పిలిసాడు"

ముసలమ్మకి కోపం నషాళానికి అంటింది. "సేసుకోరా ఎదవ సచ్చినోడా కట్టం వత్తే అమ్మా! అని పారొత్తావు. ఉప్పుడు నేను కాని దాన్ని అయిపోనాను కదా! థూ: తప్పునాదే మళ్ళా ఈపాలి నీ గుమ్మానికొస్తే సెప్పు తీసి కొట్టు ముందు దీని అమ్మని తినీసావు ఉప్పుడు దీన్నీ తినెయ్ నీ కడుపు సల్లబడతాది"

కళ్ళు నీళ్ళు వొత్తుకుంటూ విసవిసా అక్కడ నుండి వెళ్ళిపోయింది.

మిగిలిన వాళ్ళు కూడా ఇంక చేసేదేమి లేదని వారి తోవన వారు వెళ్ళిపోయారు.

***

పది రోజుల్లో గంగకి, పైడిరాజుకి పెళ్ళి జరిగిపోయింది. పైడిరాజుకి ఇరవై ఏళ్ళుంటాయి. చుట్టానికి బాగానే ఉంటాడు. కాని, అతడికి లేని వ్యసనం లేదు. ఎప్పుడూ రుసరుసలాడుతూ, పెడసరంగా ఉంటాడు.

గంగని ఇంటికి తీసుకు వచ్చేసింది రాజమ్మ. పైడిరాజు వెకిలిచేష్టలు, వాడి మాటలు గంగకు నచ్చలేదు. అతడ్ని చూడగానే గంగకు భయం పట్టుకుంది.

రాజమ్మ అది గమనించి, "ఒరే అదింకా సిన్నపిల్లరా కొన్నాళ్ళు ఆగు. అది ఈడ మన మద్దెన అలవాటు పడనీ నువ్వు దాన్ని భయపెట్టకు" కొడుకుతో అంది.

రాజమ్మ నెమ్మది, నెమ్మదిగా గంగకి పన్లు పురమాయించింది. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పదిగంటలవరకూ పనే. మజ్జిగ నీళ్ళు పేకెట్‌లు చెయ్యడము, శనక్కాయిలు అమ్మడము ఇదే పని.

రాజమ్మకి ఇపుడు కాస్త హాయిగా ఉంది.

అమ్మకాలు సరిగ్గా లేకపోతే రాజమ్మ కొడుతుంది. అమ్మే పనిలో పడి వచ్చే రైలుని కూడా చూడలేకపోయేది. మొదట్లో బాధపడినా క్రమేపీ అలవాటు అయిపోయింది గంగకు.

ఆ ఇంట్లో సూరిగాడు ఒక్కడే గంగకి సహాయం చేసేవాడు. విశ్రాంతి లేకుండా పనిచేస్తున్న గంగ మీద జాలి కలిగేది.

నాలుగు నెలలు గడిచిపోయాయి. ఒకరోజు రైల్వే గేటు పడగానే గంగ ఎప్పటిలా "శనక్కాయలు, నువ్వుండలు.." అని అరుస్తూ అమ్మకం కొనసాగిస్తుంది. సూరిగాడు నీళ్ళు, మజ్జిగ పేకెట్లు అమ్ముతున్నాడు.

ఇంతలో ఎర్రటి మారుతీ కారు ఒకటి వచ్చి ఆగింది. అందులోని వాళ్ళు గంగనే చూస్తున్నారు. రెండు రోజుల నుండి ఆ కారు రావడం, గంగని చూడ్డం జరుగుతుంది. కాని ఎవరూ గమనించలేదు. కాని, ఈ రోజు కార్లో నుండి ఒకడు దిగి గంగ కోసం ఎంక్వైయిరీ చేస్తూ, పైడ్రాజుని కలిసాడు. పైడ్రాజుని కారులో తీసుకెళ్ళారు. గంగ, సూరి ఇద్దరూ వాళ్ళని చూసారు గాని, ఆ విషయాన్ని పట్టించుకోలేదు.

ఆ రాత్రి సూరికి మధ్యలో ఎందుకో మెలుకువ వచ్చింది. పైడ్రాజు అప్పుడే వచ్చినట్లున్నాడు. రాజమ్మతో మాట్లాడుతున్నాడు. ఇద్దరి మధ్య గంగ ప్రస్తావన రావడంతో నిద్ర నటిస్తూ చెవులు రిక్కించి విన్నాడు.

"అదికాదే అమ్మా! మనం ఎంత కట్టపడితే యాభైఏలు వస్తాయి సెప్పూ! చూడు ఆలు మనకి పదేలు అడ్డవాన్సు ఇచ్చారు" డబ్బు రాజమ్మ చేతిలో పెట్టాడు.

అంత డబ్బు చూసేసరికి రాజమ్మ కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి.

"అదికాదురా గంగ వచ్చాక యాపారం బాగుంది. ఉప్పుడు దాన్ని అమ్మేస్తే ఎలాగా?"

"అబ్బా ఒక్కపాలి ఇంత సొమ్ము వస్తుంటే ఇంకా యాపారం అంటావేందే కాకపోతే ఇంకో పిల్లతో మనువాడేస్తాను. అప్పుడు మళ్ళా నీ యాపారం భాగుంటుంది సరేనా?" వెకిలినవ్వు నవ్వాడు.

"దాని అయ్యకి తెలిస్తే?" నసిగింది రాజమ్మ

"ఆడి మొఖం ఆడొక తాగుబోతు సచ్చినోడు. మనకే ఐదేలకి అమ్మేశాడు. ఆడు ఏం మొఖం పెట్టుకుని అడుగుతాడు. అది ఎవుర్తోనో లేచిపోయిందని సెప్పేద్దాం. సరేనా! ఉదయం దాన్ని టౌనులోకి తీసుకెళతాను. అక్కడ ఆలకి వప్పజెప్పేస్తే మిగిలిన నలభై ఏలు ఇచ్చేత్తారు" సంతోషంగా అంటున్నాడు పైడ్రాజు.

అంతా వింటున్న సూరికి దుఃఖం ముంచుకొచ్చింది. అన్నని ఎడాపెడా తన్నాలనిపించింది. కాని తను అశక్తుడు. గంగని చూసాడు. రాజమ్మ పక్కన అమాయకంగా నిద్రపోతుంది. ఎలాగైనా గంగని కాపాడాలని పడుకోకుండా తీవ్రంగా ఆలోచిస్తూ ఆలోచిస్తూ తెల్లవారు ఝామున రెప్పపడిపోయింది సూరిగాడికి. మాంచి నిద్రలోకి జారుకున్నాడు.

గంగ తెల్లవారి ఎప్పటిలా లేచి తన పన్లు చేసుకుంటుంది.

"గంగా అయి అలా ఉన్నీ నువ్వు సక్కగా తలకి స్నానం సేసి, మంచి బట్టలు ఏసుకో. పైడ్రాజు నిన్ను టౌనుకి తీసుకెళ్తాడే" ఆప్యాయం నటిస్తూ అంది రాజమ్మ.

ఎందుకో రాజమ్మ వంక అనుమానంగా చూసింది. "నాను ఎల్లను అత్తా!" అంది.

పైడ్రాజు గతుక్కుమన్నాడు. అది గమనించి రాజమ్మ" అదికాదే! నువ్వు రైలు బండిలో ఎలతావే. నానే సెప్పాను. దానికి రైలుబండి అంటే పాణంరా. ఒకపాలి దానిని రైలు బండి ఎక్కించు అని ఈయాల ఆడికి టయం ఉంది. అందుకే నిన్ను తీసుకెళతాడు" ఇదంతా నీ కోసమే అన్నట్లు మాట్లాడింది.

పైడ్రాజు ఔనన్నట్లు పళ్ళికిలిస్తూ తల ఊపాడు. గంగలో తన చిరకావాంఛ తీరబోతుందన్న సంతోషం కనిపించింది.

"సూరిగాడు వస్తాడా?" ఆశగా అడిగింది.

"ఆడెందుకే మద్దెలో మనిద్దరం సరదాగా తిరిగొద్దాం. ఇటునుండి ట్రైయిన్‌ల ఎల్లి, అటునుండి ట్రైయిన్‌ల వద్దాం." పైడ్రాజు అన్నాడు.

పైడ్రాజుతో వెళ్ళడం ఇష్టం లేకపోయినా, ట్రైయిన్‌లో వెళతాం అనేసరికి ఎక్కడలేని సంతోషం కలిగింది. తన కోరిక తీరబోతుందని ఆనందంలో పులకరించిపోయింది గంగ.

గబగబా స్నానం చేసి తయారయింది. చక్కగా పౌడరు రాసి, కాటుక, బొట్టు పెట్టుకుంది. పెళ్ళికి కుట్టించుకున్న లంగా, జాకెట్టు వేసుకుంది. చూడముచ్చటగా ఉంది గంగ ఆ కొత్తబట్టల్లో.

పైడ్రాజుకి మాత్రం గంగ మొఖంలో యాభైవేలు కనిపిస్తున్నాయి. "పదవెళదాం" అన్నాడు బయలుదేరుతూ. పాక బయటకు వచ్చిన గంగకు చప్పున స్ఫురించింది.

"సూరికి చెప్పొస్తాను" అని లోపలికి పరిగెత్తింది.

చిర్రెత్తు కొచ్చింది పైడ్రాజుకి. అది చూసి రాజమ్మ" ఊరుకోరా.. ఆఖరిసారి కదా. ఆడికి చెప్పిరానీ.." అంటూ సర్ది చెప్పింది.

సూరి మంచి నిద్రలో ఉన్నాడు. వాడిని కుదిపి లేపింది. నిద్రపోగొట్టినందుకు గంగ వైపు చూస్తూ "ఏంటీ" అన్నాడు కోపంగా.

"సూరిగా నాను టౌను ఎలతున్నాను" సంతోషంగా అందు.

"ఏట్లోకి ఎల్లు నాకేంటీ " ముసుగు తన్ని పడుకున్నాడు.

"నాను మీ అన్న రైలుబండిలో ఎలతాము"

సూరిగాడి కోపం, నిద్రమత్తు అంతా వదిలిపోయింది. రాత్రి విన్నదంతా గుర్తుకొచ్చింది. వెంటనే లేచి గంగ నోరు మూసి, ఇంటి వెనక్కి తీసుకెళ్ళాడు.

"గంగా ఎల్లమాకే ! అన్న నిన్ను అమ్మేస్తున్నాడు " అంటూ రాత్రి విన్నదంతా చెప్పాడు. "నిన్న మనం చూసాం కదా. ఎర్రకారులో అన్నని తీసుకెళ్ళారు. ఆలే డబ్బిత్తారంట నిన్ను బొంబాయి తీసుకెళతారంట." నెమ్మదిగా చెప్పాడు. ఏడ్చేసింది గంగ.

"గంగా ఏడకే నేనున్నాను కదా. ఈ రైలు పట్టాలకి అవతల పోలీస్ స్టేషన్ ఉండాది. అక్కడికి ఎల్లి పోలీసోళ్ళకి సెపుదాం పద"

లోపలికి వెళ్ళిన గంగ ఎంతసేపటికీ రాకపోయేసరికి రాజమ్మ లోపలికి వెళ్ళిచూసింది. అక్కడెవరూ లేరు. వెనక్కి వెళ్ళింది. పట్టాలవైపు సూరి, గంగ ఇద్దరూ పరిగెడుతున్నారు.

"పైడిగా ఆలిద్దరూ పారిపోతున్నారు" గట్టిగా అరిచింది.

రాజమ్మ, పైడ్రాజు వాళ్ళ వెనకాలే పరిగెత్తారు. రైల్వేగేటు అప్పుడే పడింది. అటు, ఇటు నెమ్మదినెమ్మదిగా ఒక్కొక్కటే వాహనాలు ఆగుతున్నాయి.

ఒకేసారి ఎక్స్‌ప్రెస్, గూడ్సు వస్తున్నాయి. రైల్వే లైన్లు ఎక్స్చేంజ్ అయ్యాయి. సరిగ్గా అప్పుడే పట్టాలు దాటుతున్న గంగ కాలు జారి పట్టాలలో ఇరుక్కుంది. బాధతో ఒక్కసారి గట్టిగా అరిచింది. సిగ్నల్ ఇచ్చేసారు. ట్రైయిన్ వచ్చేస్తుంది. గంగ కాలు రావడం లేదు. సూరిగాడు కాలు లాగాలని ప్రయత్నిస్తున్నాడు.రైల్వే గేటుకి రెండువైపులా ఉన్న ప్రయాణీకులు దృష్టి పట్టాల మీద ఉన్న గంగ, సూరి మీద పడ్డాయి. వాళ్ళు పరిగెత్తుకుంటూ వస్తున్నారు.

"సూరిగా రైలొచ్చేస్తుంది నువ్వెళ్ళిపోరా" గంగ ఏడుస్తూనే అంది.

"లేదే! నిన్నిడిసి ఎల్లను వచ్చేస్తాది. ఉండు" తానూ ఏడుస్తూనే కాలు బయటకు తీయాలని ప్రయత్నిస్తున్నాడు. రైలు రావడం ఇద్దరిని ఢీకొనడం వెంటనే జరిగిపోయింది. పైడ్రాజు, రాజమ్మ, అక్కడ చేరిన వాళ్ళంతా అవాక్కయ్యారు.

రెండు పసిప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వారి దేహాలు రైలు బండి రక్కసి కింద నలిగిపోయాయి. అక్కడికి చేరినవారంతా తలో రకంగా అనుకుంటున్నారు.

"పాపం లేచిపోదామనుకున్నారు. కుదరలేదు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు"

కాని, నిజమేమిటో ఆ పైవాడికే ఎరుక.

***

# ప్రవాహం

కె.వరలక్ష్మి

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**తూర్పున ఎక్కడో సూర్యోదయం** కాబోతున్న సూచనగా చీకట్లు మెల్లమెల్లగా విచ్చుకుంటున్నాయి.

కార్తీక పూర్ణిమ. గుడిగంటలు అదేపనిగా మోగుతున్నాయి. అప్పటివరకూ బంగారు వన్నె వెన్నెల కాంతిని విరజిమ్మిన చందమామ మొహం తెల్లబోతోంది. ఆ ఉదయ సంధ్యలో పొగమంచు దట్టంగా అలుముకుని ఉంది.

తెల్లవారు ఝామున మూడు గంటల నుంచీ జనం నాటుపడవల్లో పట్టిసీమ రేవునుంచి వీరభద్రేశ్వరాలయం ఉన్న పట్టిసం లంకలోకి పోటెత్తినట్టు వస్తున్నారు. ఇసుక మేటలు వేయడం వలన లాంచీలు రాలేవు. అందుకే పడవల వాళ్ళు మంచి హుషారుగా ఉన్నారు. అద్దరి నుంచి ఇద్దరికి నిమిషాల్లో తెడ్డు వేసేస్తున్నారు. ఏడాదికోసారి అరుదుగా వచ్చే అవకాశం. పడవలనిండా జనాన్ని కుక్కేసి తీసుకొస్తున్నారు. జనం వచ్చినవాళ్ళు వచ్చినట్టే గోదావరిలో మూడు మునకలేసి తడి బట్టల్తో తపతపలాడుతూ ఆలయం వైపు దారి తీస్తున్నారు. పూజలు, దర్శనాలు ముగించుకున్నవాళ్ళని తిరిగి ఇద్దరి నుంచి అద్దరికి చేరవేస్తున్నారు పడవలవాళ్ళు.

అలా జనంతో కలిసి మొదటి పడవలో వచ్చి లంకలో దిగాడు భద్రుడు. అందరితో బాటే అసంకల్పితంగా గోదాట్లో మునకలేసాడు. కాళ్ళకింద ఇసుక తగుల్తోంది. ముందుకు పోనీకుండా రక్షణ వలయం ఉంది. గుడివైపు వెళ్ళబుద్ధికాక ఎడమవైపు నిర్జన ప్రదేశంలోకి నడిచాడు. పాదాలు నీళ్ళలోకి వేళ్ళాడేసి ఇసుకలో కూర్చున్నాడు. కార్తీక దీపాల వెలుగులో మెరుస్తున్న గోదారి అతని పాదాల్ని కురుస్తోంది. ఓపలేక చటుక్కున పైకి లాక్కున్నాడు. వెన్నులోని మజ్జ మొత్తాన్ని ఎవరో పీల్చేసుకున్నంత బలహీనత. ఆగలేక వెల్లకిలా వెనక్కివాలేడు. చల్లని ఇసుక తడికి ఒక్కసారి వజవజా వణికేడు. అతని లోపలి వ్యాకులత త్వరలోనే చలిని జయించింది. రెండు రోజులుగా తిండి నిద్రలేని అతని శరీరం అలసి సొమ్మసిల్లిపోయింది. నిద్రాదేవి కరుణించి అతని కళ్ళమీదకి పాకి వచ్చింది.

దుఃఖంతో నిండిన ఏదో చీకటి లోకంలో విహరిస్తోంది భద్రుడి ఆత్మ. దుఃఖాన్ని భరించలేక మౌనంగా రోదిస్తోంది.

"బతికున్నాడంటావా? "

"ఏమో మరి!"

స్రరున నీటిని కోస్తున్న చప్పుడు.

"ఎగువనించి కొట్టుకొచ్చినట్టుంది శవం, మొన్నీ మద్దెనిలాగే కాదా పాపికొండల కాడ అడిపోయిన మనిసి ఈ లంక కొడ్డుని తేల్త"

"ఛా, ఊరుకో. పేణం ఉన్నట్టన్పిత్తంది"

"మరి, పూటుగా తాగేసడిపోయేడంతావా ఇంత పొద్దున్నే? దగ్గరికెల్లకయ్యోయ్, పోలీసోళ్ళు మనమీదెట్టెయ్ గల్రు"

టక్కున కళ్ళు విప్పేడు భద్రుడు, తల తిప్పి చూడగానే ఎడమవైపు పదడుగుల కవతల నిక్కరు మాత్రమే వేసుకున్న బక్కపల్చని మనిషి, అతని వెనక నుంచి తొంగి తొంగి చూస్తున్న ఆడమనిషి కనిపించారు. వాళ్ళ వెనక చిన్న నాటుపడవ ఒడ్డు మీదకి సగం చేర్చి ఉంది. చటుక్కున లేచి కూర్చున్నాడు భద్రుడు.

వాళ్ళలా అనుకోవడంలో పొరపాటు లేదు. నిద్రలో ఎప్పుడు కిందకి జారిపోయాడో తను, సన్నని నీటి అలలు వచ్చి తనని నడుము వరకూ తడిపి వెళుతున్నాయి.

తెల్లవారు ఝామున మసక కట్టిన దృశ్యాలన్నీ ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. టైం తొమ్మిదికీ పదికీ మధ్య అయిఉంటుంది. ఎండ తీక్షతని సంతరించుకుంటోంది. అవతలి ఒడ్డున పాపికొండల సందర్శన కోసం జనాన్ని నింపుకున్న ఏడెనిమిది లాంచీల రణగొణ ధ్వని గాలివాలుకి లంకలో కొస్తోంది. వెనక, ఆలయంలో రద్దీ కొంత తగ్గినట్టుంది, గుడిగంటలు ఆగి ఆగి మోగుతున్నాయి.

గోదావరి నీళ్ళ మీద ఎండపడి కళ్ళలోకి బాణాలు గుచ్చుతోంది. భరించలేక తలవాల్చుకున్నాడు భద్రుడు. ఇసుక పొర మీదుగా వచ్చి తనని తాకి వెళుతున్న పారదర్శకమైన గోదారి నీటిని చూస్తున్నాడు.

నిద్రతో కొంత తేలికైన మనసులోకి గాయం తాలుకు బరువులు, దుఃఖం ప్రవేశించబోతూండగా అతనొచ్చి పక్కన బొత్తన కాళ్ళ మీద కూర్చున్నాడు. "ఆ ఒడ్డుకి దిగబెట్టమంటారేటి నా పడవలో?" అన్నాడు చొరవగా.

ప్రశ్న అర్థం కానివాడిలా బ్లేంక్‌గా చూసాడు భద్రుడు.

"నా పేరు సిన్నోడండి, మా యాడది లచ్మి" అన్నాడు.

ఆమె కొంచెం ముందుకొచ్చి సిన్నోడి పక్కన ఇసుకలో చతికిలపడింది.

"లచ్మీ, పడవలోంచి గళాసట్టుకెల్లి గుడికాడ సింవాసెలం కొట్లో టీయ్యటా" అన్నాడు సిన్నోడు.

లచ్మి వెంటనే లేచెళ్ళింది.

సిన్నోడు అనునయంగా భద్రుడి చేతిమీద చెయ్యి వేసి

"అలాగ పాపికొండలదాకా వత్తారేటి బావూ నా పడవలో? సీకటడీ యేలకి వొచ్చేద్దాం" అన్నాడు.

పాపికొండలు! ఎక్కడ చూసినా అందరినోటా ఇదేమాట. అక్కడ గోదావరి సుడులు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తుందట. చివరిగా ఆ కొండల అందాల్ని చూసేసి అక్కడే గోదార్లో దూకేస్తే.. కాని, ఈ పడవ వాడికేమివ్వాలి?...

"నా దగ్గర డబ్బుల్లేవ్" అన్నాడు భద్రుడు చికాకు నిండిన గొంతుతో, భారతదేశంలోని పేదలు డబ్బు పీల్చే జలగలని సంపన్నులెందరి లాగానో అతనికీ ఒక చులకన భావం.

"అన్నన్నా.." అని ముక్కుమీద వేలేసుకున్నాడు సిన్నోడు." డబ్బులడిగేనా మిమ్మల్ని?" అన్నాడు. "తవరిదేవూరేటండి, సూత్తుంటే ఇటేపోరిలాగ కనపట్టంలేదు"

భద్రుడు అతనివేపు ఆశ్చర్యంగా చూసాడు. గంటలకి విలువ కడుతూ ఇంతకాలం తను జీవించిన జీవితం, తను బలంగా నమ్మిన సిద్ధాంతం తనకి నేర్పినదేదో ఈ సిన్నోడి ముందు వీగిపోబోతోందా? కాదు కాదు, లోకంలో స్వార్థం తప్ప మరోటి లేదు. తన నుంచి ఏదో ఆశించే వీడు తనతో మాట్లాడుతున్నాడు - లచ్మి టీ గ్లాసు మీద అడ్డాకు ముక్కొకటి కప్పి పట్టుకొచ్చింది. "పుచ్చుకోండి బాబయ్యా, ఏడేడి టీ సుక్కలు గొంతుకులోకెళ్తే కుంత ఓపికొత్తాది" అన్నాడు సిన్నోడు.

ఒక్క నిముషం తటపటాయించి గ్లాసు అందుకున్నాడు భద్రుడు. ఈలోగా సిన్నోడు, లచ్మి కలిసి పడవని ఒడ్డు నుంచి నీళ్ళలోకి నెట్టి పట్టుకుని నిల్చున్నారు.

"రండి బాబూ, వచ్చి పడవెక్కండి" అన్నాడు సిన్నోడు.

భద్రుడు మంత్రముగ్ధుడిలాగా లేచెళ్ళి పడవ ఎక్కేడు. పడవ మధ్యలో ఉన్న బల్ల చెక్కమీద కూర్చున్నాడు. కాళ్ళ కింద పరిచినట్టున్న చేప పొలుసులు చూసి పాదాలు పైకి తేల్చుకోబోయి మానేసాడు. చెప్పులెటు కొట్టుకుపోయాయో, నీటిలో నాని నాని పాదాలు ఒరిసిపోయి తిమ్మిరిగా ఉన్నాయి.

సిన్నోడు పడవలోంచి పొడవైన గెడకఱ్ర తీసుకుని పడవని లోతు నీటిలోకి మళ్ళించాడు. తర్వాత గెడని పడవలో పెట్టి చెరో తెడ్డూ తీసుకుని నడపడం మొదలుపెట్టారు. నదికి కుడివైపు నుంచి పడవ నెమ్మదిగా ఎగువకి ప్రయాణం సాగించింది. భద్రుడు మెడ వెనక్కి తిప్పి పట్టిసీమ ఆలయ సముదాయాల వైపు చూసాడు. వివిధ పరిమాణాల ముత్యాలు గుండ్రంగా పేర్చినట్టు మెరుస్తున్నాయి.

'ఇదే చివరి చూపు' అనుకున్నాడు.

ఎక్కడి చికాగో నగరం!, ఎక్కడి పట్టిసీమ! భద్రుడు. వి. మేచినేని. మేచినేని వీరభద్రుడు. ఐ.ఐ.టి. గోల్డ్ మెడలిస్ట్, ప్రముఖ అమెరికన్ కంపెనీలో కొద్దికాలంలోనే మేధావిగా పేరొందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, హాఫ్ మిలియన్ డాలర్స్ పర్ యానమ్ సేలరీ, అందమైన అమెరికన్ భార్య ముద్దులు మూటకట్టే కొడుకు, రాజభవనం లాంటి ఇల్లు, ఒక బి.ఎమ్.డబ్ల్యు, మరొక బెంజి - కార్లు. జీవితమనే పరమపదసోపాన పటంలో చాలా తొందరగా నిచ్చెనలెక్కి, ఒక్కసారిగా పెద్దపాము నోట్లో కెళ్ళిపోయి బయలుదేరిన చోటికి తిరిగొచ్చాడు. ఆర్థిక సంక్షోభం కారణంగా చాలా కంపెనీల్లాగా తమ కంపెనీ మూతపడింది.

ఉద్యోగం ఊడిపోయిన నెల తర్వాత తెలిసింది తను ఎంత లగ్జోరియస్ లైఫ్‌కి అలవాటు పడిపోయిందీ!

'జీవితమే ఒక మహానుభూతి. దాన్ని ఒక అద్భుతమైన అనుభవంగా మలచుకుందాం' అంటూ బ్రౌనీని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు, దేశాన్ని, మతాన్ని, తనదనే అన్నిట్నీ వదిలేసాడు. ఇక్కడైతే అన్నీపోయినా భార్య అయినా మిగిలుండేది. ఆర్జన ఉంటేనే భార్య, కొడుకు, లేకుంటే ఏదీ నీది కాదు అని నిరూపించింది బ్రౌనీ. అప్పుడే తనకి జీవితం మిధ్య అనిపించింది, చచ్చిపోవాలనిపించింది. ఆ చావేదో దేశం కాని దేశంలో ఎందుకు అనామకంగా..? నాది అనే పుట్టిన గడ్డపైకొచ్చి, తనవాళ్ళు నలుగుర్నీ చూసి... ఒక్కరోజులో ఆ నిర్ణయం బలపడి, తన దగ్గర మిగిలిన వేవో అమ్ముకుని ఫ్లైటెక్కి ఇక్కడికి వచ్చిపడ్డాడు. తీరా తన ఊరికెళితే తను ఇన్నాళ్ళుగా పట్టించుకోని తల్లి ఎప్పుడో పైలోకం చేరుకుందని తెలిసింది. అంత పెద్ద ఆస్తీ, దివాణం లోగిలీ అన్నీ అమ్మేసి రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టి నష్టపోయి తనలాగే దీన స్థితిలో ఉన్న అన్నగారు. లక్ష్మీదేవిలా ఉండే వదినా, చిలకల్లాంటి పిల్లలూ అంతా రెండు గదుల అద్దె ఇంట్లో పెద్దమ్మవారు ఆవహించిన దీన స్థితిలో.. చూడలేక వెంటనే బస్సెక్కి రాజమండ్రిలో దిగాడు, చచ్చిపోవాలనే లోపలి కాంక్ష చావక.

"అన్నయ్య తర్వాత పన్నెండేళ్ళకి పట్టిసం వీరభద్రేశ్వరుణ్ణి దర్శించుకున్నాక నువ్వు పుట్టావు. అందుకే నీకా పేరు పెట్టుకున్నాం" అనేది తల్లి. చివరిసారిగా గోదావరి బ్రిడ్జి మీద నుంచి ఆ ఆలయ శిఖరాన్ని చూసి గోదారి ప్రవాహంలో దూకెయ్యాలని ఒక నిర్ణయానికొచ్చాడు. రాత్రి మనసంతా నిండిన నిర్వేదంతో బ్రిడ్జి మధ్యవరకూ నడిచి, గొప్ప ఆవేశమేదో కమ్ముకొచ్చి దూకెయబోతూండగా, వెనక రెయిలింగ్ మీద లారీ చప్పుడు, గార్డు కేకలు వినిపించాయి. పూర్తిగా వెనక్కి తిరిగి చూడకుండానే పరుగులాంటి నడకతో బ్రిడ్జికీవైపున్న కొవ్వూరులో వచ్చిపడ్డాడు.

అప్పుడర్థమైంది తనెంత పిరికివాడో! అక్కడి నుంచి పట్టిసీమకీ, పట్టిసం లంక మీదకీ తన ప్రమేయం లేకుండానే వచ్చిపడ్డాడు.

"బాబూ, తవరికి పెళ్ళైందా, పిల్లలా?"

"......"

"అయ్యే ఉంటాదిలే, ఇద్దరు పిల్లలై ఉంటారు. అవునా బాబూ?" మొహం తిప్పుకున్న భద్రుడికి ఎడమవైపు ఇసుక తిన్నెల కవతల లోతైన నీటిలో నెమ్మదిగా ఒకదానివెనక ఒకటి వెళుతున్న లాంచీలు...

"ఆ బాబేటో ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాడు, నువ్వేమో లొడ లొడా ఒకటే వాగుడూ" అని విసుక్కుంది లచ్చి.

"ఓలూరుకోయే, మెల్లిగా మాటల్లో దింపి ఆ బాబుని మనుసులోకి మళ్ళించాలని కదా నా పాట్లు. మొకం సూత్తే తెల్వం లేదా, ఏదో గొప్ప బాధలో ఉన్నాడని" అని లచ్చి చెవిలో గుసగుసలాడేడు సిన్నోడు.

"అవునా..?" అని కళ్ళు రెపరెపలాడించింది లచ్చి.

"మాకిద్దరికీ ఈమద్దినే పెళ్ళయ్యిందండి. సేసుకుంటేగాని ఒల్లకాదని కూకున్నాడండి మాయయ్య. సేపలు పట్టుకుని బతకమని ఈ పడవిచ్చేడనుకోండి. నేను సేసుకోపోతే ఈ నల్లపిల్లకి మొగుడెక్కడ దొరుకుతాళ్ళే అని జాలితో సేసుకున్నాడండి. ఇంకా పిల్లా జెల్లా కలగలేదండి"

"ఓయ్ బాబో, ఏటి మరీ! నువ్వు సేలా తెల్లగా మెరిసిపోతన్నావ్, అందగాడివి. రోజూ ఏదో ఒకొకని మా ఇంటి సుట్టూ తిరుగుతున్నావని కాదేటి మాయయ్య నిన్నల్లుణ్ణి సేసుకున్నాడు"

"మాటననివ్వదు దొంగనా పొలస. మాగోలకేం గాని బాబూ! ఎడం పక్క కొండమీద ఆ పెద్ద కరంటు తంబం పక్కని ఉన్నదే పాండురంగడి గుడి. అక్కణ్నుంచి గోదారికీయేపు తంబం మీదకి లాగేరండి కరంటు. గొప్ప సిత్రం కదా బాబూ!" సిన్నోడి గొంతులో సంభ్రమం.

ముభావంగా కూర్చున్న భద్రుడి మొహంలోకి నువ్వు రాబోయి ఆగింది. అజ్ఞానంలోనూ ఆనందమున్నట్టుంది.

ప్రకృతి భద్రుడి చూపుల్ని పట్టి తనవేపు లాక్కోసాగింది. గోదావరికిరువైపులా ఉన్న కొండల హరితవర్ణం అతన్ని చూపు తిప్పుకోనివ్వడంలేదు -

ఏటి కెదురీదుతున్న గూటి పడవ. మేటలు వేసి మెరుస్తున్న బంగారు ఇసుక, గంభీరంగా ప్రవహించి వస్తున్న గోదావరి. కొండకోనల్లోంచి వచ్చికలుస్తున్న పిల్లకాలువలు -

ఈ లౌకిక ప్రపంచంతో సంబంధాలు తెంచేసుకున్న అనుభూతి. గొప్ప తాదాత్మ్యంలో మునిగిపోయాడు భద్రుడు మనసు తేలికై మౌనంగా నర్తిస్తోంది.

నెమ్మదిగా నీటిని చీల్చుకుని వెళుతున్న పడవలాగే బాధల జ్ఞాపకాల బరువుల్ని చీల్చుకుని వెళుతోంది మనసు.

"ఆ కుడేపు కనపడీదే పోశమ్మగండి" అన్నాడు సిన్నోడు.

లాంచీలన్నీ కుడివైపు మళ్ళి ఒడ్డు కెళ్ళి ఆగుతున్నాయి. జనం బిలబిలమంటూ దిగి ఎత్తైన గట్టు పైకెక్కి పోచమ్మ గుడివైపు వెళుతున్నారు. పడవ ఒడ్డుకు చేరింది. "అమ్మోరి దరిశనం సేసుకుందారి ఒత్తారా బాబూ" అన్నాడు సిన్నోడు. దుకాణాల పాకల వెనకనుంచి ఆలయ శిఖరం మీది కలశం, కొమ్ములు మెరుస్తున్నాయి.

భద్రుడు కదలకపోవడం చూసి తెడ్లు పడవలో పడేసి, గెడ నీటీ అడుగుకు గుచ్చి లచ్మికి అందించి, వొడ్డుకి దూకి గుడివేపు పరుగెత్తాడు సిన్నోడు. లచ్మి గెడను చంకలో ఇరికించుకుని, చెంపలేసుకుని, చేతులు జోడించి కళ్ళుమూసుకుంది.

భద్రుడు మొదటిసారి ఆమె వైపు పరిశీలనగా చూసాడు. ఏ మాత్రం ఆకర్షణ లేని సాదా సీదా ఆడమనిషి, ఒత్తైన జుట్టుని నెత్తిపైన సిగలా చుట్టీ ప్లాస్టిక్ క్లిప్పేదో పెట్టింది. సిగలో ఓ పక్కన నిర్లక్ష్యంగా తురిమిన పేరు తెలియని పసుపు రంగు పువ్వు. సిగకు అందని ముంగురుల్లు చెవుల మీదా, ముఖం మీదా పొరాడుతున్నాయి. సాదా చీర, తెడ్డు వెయ్యడం వలన చెమటకు తడిసిన ఎర్రని జాకెట్టు. ఆమె ముఖం నవ్వుతో వికసించడం చూసి, అటు చూసాడు. గట్టుమీంచి పరుగెత్తుకొస్తున్నాడు సిన్నోడు.

పడవెక్కినప్పట్నుంచి చూస్తున్నాడు - వాళ్ళిద్దరి మధ్యా నవ్వులు, గుసగుసలు, కువకువలు, దొంగచూపులు, దోరస్పర్శలు. వైవాహిక జీవితంలోని ఇలాంటి ఆనందం ఎప్పుడైనా తనకి అనుభవంలో కొచ్చిందా? ఏం బతుకు అది? రోజులో ఏ రెండు గంటలో నిద్రకు కేటాయించుకుని కంప్యూటర్‌కి, సంపాదన పెంచుకునే వ్యాపకాలకీ అతుక్కుపోయిన జీవితాలకి ఈ ఆనందం, ఈ ప్రేమ ఎలా అనుభూతికొస్తుంది? సిన్నోడు కొబ్బరి చెక్కని పడవ అంచుమీద చితక్కొట్టి ఒక ముక్కని భద్రుడికి అందించాడు. మరో ముక్కని లచ్మి నోటికందించి, పొట్లంలో తెచ్చిన కుంకుమ బొట్టు పెట్టాడు. చెంపలేసుకుని గుడివేపు చూస్తూ, "గండి పోశమ్మ తల్లే, అందర్నీ సల్లగా సూడు తల్లే" అని ఒక కేక పెట్టాడు.

తెడ్డు చేతిలోకి తీసుకుంటున్న లచ్మి సిన్నోడి వీపు మీద ఒక్కటి చరిచి కొంటెగా నవ్వింది.

సిన్నోడు వీపు తడుముకుంటూ "ఏటే, పెద్ద మణిసి పడవలో ఉండగా మోటు సరసాలు!" అని కోప్పడుతూ నవ్వేడు. "బావా" అని కేక వినబడి ఒడ్డుకేసి చూసాడు.

సింతాలు చంకల్లో కర్రల్తో కుంటుకుంటూ వచ్చాడు. చెయ్యి చాపి నిల్చున్నాడు. నిక్కరు జేబులోంచి రూపాయి బిళ్ళ తీసి వాడి చేతిలో వేసాడు సిన్నోడు.

"బావా! అట్నుంచొటేటప్పుడు సిన్న సేపలేవన్నా దొరికితే ఒక గుప్పుడూ ఇక్కడడేసిపోవా పులుసు తినాలనుంది" అన్నాడు సింతాలు.

"సర్లే, ఎవరి సేతైనా నేనంపిత్తాన్లే. సలిలో నువ్విక్కడ కూకునుండకు, పొద్దోత్తాది మేవొచ్చేతలికి"

కృతజ్ఞతగా చూస్తూ నవ్వేడు సింతాలు.

"ఈడి కతేటో తెలుసా బాబూ?" అంటూ మొదలుపెట్టాడు సిన్నోడు -

"పోలారం ఆనకట్ట గురించి అనుకుంటున్న తొలిరోజుల్లోనే కొన్ని గూడేలోళ్ళకి ఇళ్ళకీ, బూవులికీ ఇంతా అని లెక్కకట్టి డబ్బులిచ్చేసేరు గవుర్మెంటోళ్ళు. ఈ సింతాలుగాడికి లచ్చా పాతికేలు వచ్చేయి.

ఈడు పుట్టేక అన్ని డబ్బులెప్పుడైనా కళ్ళసూసున్నాడా?! అందుకే ఆ డబ్బులేం సేసుకోవాలో ఈడికర్ధం అవలేదు. ముందు ఒక మోట్రసైకిలు పెద్దది కొనేసేడూ ఈ ఎదవకి నడపడం వొచ్చంటలెండి. సేలా స్పీడు నడిపీవోడు. ఇంకవో... సూసుకోండి జెల్సా... ఈడికీ, పెళ్ళానికీ, పిల్లలకీ రంగు రంగుల గుడ్డలు, ఈడికి వాసీ, ఉంగరం. రోజూ బండేసుకుని రాజిమండ్రంపోటం, వొటేల్లో పులావులూ గట్టా తింట, కరీదైన బ్రేండీ కాయలు కడుపునిండా పుల్లుగా పట్టించటం, సినిమాలు సూట్టం. ఒక రోజులా గొత్తావొత్తా లారీని గుద్దేసేడు. పెళ్ళాం పిల్లలక్కడే ప్రేణాలొదిలేసారు. ఈనా కొడుకు సావు తప్పి కన్నులొట్టోయి ప్రేణాల్తో మిగిలేడు, అదిగో అలాగ రెండుకాళ్ళూ సకం సకం పోగొట్టుకుని. అప్పుడికే డబ్బులు కడకొచ్చేసేయి. మిగిలిం డబ్బులు ఆస్పటలు కర్సుల కిందెల్లిపోయేయి. అప్పణ్ణించీ ఇదిగో ఇలాగ గండిపోశమ్మ గుడికాడ అడుక్కుతింటా బతుకు బండిని లాక్కొత్తన్నాడు"

సింతాలు అతికష్టం మీద ముందుకి కదులుతున్నాడు. అతనితో పోలిస్తే తనకష్టం ఏపాటిది? ఒక జీవన సత్యమేదో మెరుపులాలోపలికి ప్రవేశించి భద్రుడి విషాదాన్ని కోస్తోంది.

ఎండ నడినెత్తికొచ్చింది. చెమటలు కక్కుతూ త్వరత్వరగా తెడ్లేస్తున్నారు సిన్నోడు, లచ్మి.

"బాబూ, మీరా గూట్లోకెల్లి కూకోండి, ఎండ బరించలేరు" వాళ్ళిద్దరూ అంత కష్టపడుతూంటే తను హాయిగా కూర్చున్నాడనే స్పృహకలిగి భద్రుడికి సిగ్గనిపించింది. మొదటిసారి మనసు విప్పి "లక్ష్మిని వెళ్ళి కూచోమను, నేను తెడ్డువేస్తా" అన్నాడు.

ఏం విన్నారో మొదట అర్ధంకాక, అర్ధమయ్యాక ఫక్కున నవ్వారిద్దరూ.

"ఈ పని మీవల్లవ్వద్దేటండి, అవ్వదండి" అన్నాడు సిన్నోడు. పడవ దేవీపట్నం చేరుకుంది. గట్టుపైన దూరంగా కనిపిస్తున్న పాత చిన్న పెంకుల లోగిలిని చూపించి "ఆకాళంలో అల్లూరి సీతారామరాజు గారు పితూరీ సేసిన దేవీ పట్నం పోలీస్టేసను అదేనండి" అన్నాడు సిన్నోడు. అతని మొహంలో ఒక అద్వితీయమైన పులకింత.

అప్పటికి సిన్నోడి తండ్రి కూడా పుట్టివుండడు. కాని, విదేశీయులకి వ్యతిరేకంగా పోరాడిన సీతారామరాజు శౌర్యాన్ని తల్చుకుని ఇప్పటి సిన్నోడు పులకించిపోతున్నాడు. ఇదేనా దేశం మీది ప్రేమ అంటే - అనుకున్నాడు భద్రుడు.

# కాలం తెచ్చిన మార్పు

మధురవాణి

నదికి ఎడమవైపు ఇసుక తిన్నెల ఒడ్డున లాంచీలు ఒకొటొకటిగా వెళ్ళి ఆగుతున్నాయి. ఇటు దేవీ పట్నం వైపు పదిపన్నెండు పడవలు ఉన్నాయి. ఉన్నట్టుండి ఊళ్ళోంచి పెద్ద పెద్ద డ్రమ్ముల్తో, కేనుల్తో అన్నం, కూరలులాంటి వంటకాలు మోసుకొచ్చి పడవల్లోకి ఎక్కిస్తున్నారు కొందరు. పడవలు నదికి అడ్డంగా అవతలి వొడ్డుకెళ్ళి లాంచీలకు ఈ ఆహార పదార్థాల్ని అందించి వస్తున్నాయి.

భద్రుడిని ఒడ్డున దింపేసి సిన్నోడు ఒకసారి అందించి వచ్చాడు. రెండోసారి అతన్నిపడవలో ఎక్కించుకుని తీసుకెళుతూ కొంతదూరంలో ఒడ్డుకి దగ్గరగా అక్కడక్కడ నీటిపైన తేలుతున్న ఖాళీ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ని చూపించాడు. "ఆ కనిపించే సీసాల అడుగుని మా వలలున్నాయండి. ఆ పక్కనుంచి ఈ లాంచిలన్నీ ఎల్లిపోయాక పడవలోళ్ళందరం వలలెత్తి, సేపల్ని పడవల్లో ఏసుకుని, మల్లీ వల్లలు పన్నేసి, రాజమండ్రం కేసి ఎల్లిపోతావండి. సందేళ బజారుకి సేపలందించాల. తవరి గురించి లాంచీవోళ్ళతో మాటాడేనండి. తవరికి బోయినం ఆళ్ళే ఎడతారు. ఈ లాంచీలన్నీ ఆ దూరంగా కనపడతన్నాయి పాపికొండలు - దూరపు కొండలు నునుపులెండి - ఆట్నీ దాటుకుని ముందుకి పేరంటాలపల్లి దాకా ఎల్లి రాత్రికి ఎనక్కొచ్చేత్తాయండి." అన్నాడు. కొంత ఆగి "బాబూ, ఈ పడవని సూత్తున్నారా, ఉప్పుడు దాకా కష్టంగా ఏటికెదురీడుకొచ్చిందండి. ఉప్పుడు ఏటిని కోసుకుని అడ్డంగా ఎల్తందండి. ఎల్లీటప్పుడు జయ్యమని నల్లేరుమీద నడకలా గెలిపోద్దండి, పడవకైనా మనిసికైనా ఎప్పుణ్ణడక అప్పుడిదేనండి. ఎత్తైన పాపికొండల్నీ, అక్కడ లోతైన గోదారమ్మనీ సూసేక మనవెంత సిన్నోళ్ళవో మన కర్ధవౌతాదండి. తవరు తప్పకుండా అక్కడిదాకా ఎల్లి ఎనక్కి రావాలండి. మీ గురించి నాకు తెల్దుగానండి, ఒక్క ముక్క సెప్తానండి. మీకు సెప్పేటంతోణ్ణికాననుకోండి, మీరేదో కష్టంలో ఉన్నారని మాత్రం నాకర్ధమైందండి. కష్టాలు మనుసులికి కాక మానులకొత్తాయా అనీవోడండి మాయయ్య. ఆడు అంతరవేది కాడ సంద్రంలో సేపలు పట్టేవోడండి. వీరి సిన్నోడా! ఇంత పెద్ద సంద్రంలో మనిసి ఒక్క నీటి బొట్టుకన్నా తక్కువేరా. ఒకేల పడవ మునిగిపోతే మనవూ మునిగిపోకూడదు. మనకి సేతనైనంత వరకూ ఈదాల. పేణం కాపాడుకోవాల. ఉంకో పడవ సంపాదించుకోవాల' అనీవోడు"

సిన్నోడి కళ్ళల్లోని మెరుపుని చూస్తున్నాడు భద్రుడు.

తన హృదయంలోని బరువుని సిన్నోడు చేతితో తీసేసినట్టనిపించింది. ఆవేశంలోనైనా చావడం, చంపడం పరిష్కారం కాదని అర్థమైంది.

లాంచీ ఎక్కడానికి బల్లకట్టుమీద ఒక అడుగు వేసినవాడు హఠాత్తుగా వెనక్కి తిరిగి సిన్నోణ్ణి కౌగిలించుకున్నాడు భద్రుడు. సిన్నోడు ఆనందంగా కలిపి వదిలిన చేతిని చూసుకుంటే కొన్ని నలిగిన నోట్లూ, చిల్లరా ఉన్నాయ్. కంగారుగా పట్టుకోబోతే అప్పటికే సిన్నోడు లాంచీ మీంచి నదిలో ఛెంగున చేపలా దూకి బారలు వేసుకుంటూ పడవ దగ్గరకి ఈదుతున్నాడు.

నాలుగు బారలు అవతలకి పడవను పోనిచ్చిన లచ్మి వాణ్ణి చూస్తూ ముత్యాలొలకబోసినట్టు నవ్వుతోంది.

***

**"కిరణ్ .. కాలేజ్‌లో ఉన్నప్పుడు** ఒకసారి ఏమైందో తెలుసా! మా ఫ్రెండ్స్ అందరం కలిసి మధ్యాహ్నం క్లాసులు ఎగ్గొట్టి నాగార్జున సినిమాకి వెళ్ళాం. అప్పుడు.." అంటూ కళ్ళు చక్రాల్లా తిప్పుతూ ఉత్సాహంగా చెపుతున్న నీలిమ మాటలని మధ్యలోనే

ఆపి "సినిమా చూసినంతసేపూ మీ అనంతకి ఒకటే కంగారు, కాలేజీ ఎగ్గొట్టి సినిమాకి వెళ్ళారని. దాంతో సినిమా చూస్తున్నంత సేపూ తను భయపడుతూనే ఉంది. అంతే కదా నీలూ!" అన్నాడు కిరణ్ .

"అంతే అంతే! అంత ఖచ్చితంగా ఎలా చెప్పావ్ కిరణ్?"

"ఎలానా? మన పెళ్ళయిన దగ్గర్నుంచీ యీ విషయం నువ్విప్పటికే నూట డెబ్బై ఆరు సార్లు చెప్పావ్. ఇంక గుర్తులేక ఛస్తుందా! అయినా యీ ప్రపంచంలో నీకొక్కదానికే స్నేహితురాలు ఉన్నట్టు అస్తమానూ వసంతలక్ష్మి గురించే చెప్పి చెప్పి చావగొడితే ఎలా నీలూ!" బ్రతిమాలే ధోరణిలో అడిగాడు కిరణ్ .

"వసంతలక్ష్మి కాదు అనంతలక్ష్మి. ఏదో ప్రాణస్నేహితురాలిని ఆరేళ్ళ తరవాత చూడబోతున్నానన్న ఆనందంలో తెలిసిన విషయాన్నే రెండోసారి చెప్పానే అనుకో. అంత మాత్రానికే ఇంత విసుగా!" అంటూ బుంగమూతి పెట్టింది నీలిమ.

"అదేలే.. ఏదో ఒక లక్ష్మి. ఏంటీ.. రెండోసారి చెపున్నావా? నీలూ నాదో సందేహం. అసలు నువ్వు లెక్కల్లో ఎలా పాసయ్యావు? రెండుకీ, నూట డెబ్బై ఆరుకీ బొత్తిగా తేడా తెలీట్లేదు నీకు" ఎద్దేవా చేస్తున్నట్టుగా అన్నాడు కిరణ్ .

"కిరణ్ .. ఇవ్వాళ నువ్వేమన్నా నేనస్సలు కోప్పడను. ఎందుకంటే ఆరేళ్ళ తరవాత మా అనంతని కలవబోయే ఉత్సాహంలో ఉన్నాను కాబట్టి. అయినా నీతో కబుర్లు పెట్టుక్కూర్చుంటే నాకు కుదరదు. నా బ్యాగ్ సర్దుకోవాలి" అంటూ వేరే గదిలోకి దారి తీసింది నీలిమ.

"ఏంటీ! నువ్వింకా బ్యాగు సర్దుకోవాలా? రెండు రోజుల నుంచి బ్యాగు సర్దడం తప్ప వేరే పనే చేయలేదు నువ్వు. అయినా ఏదో సంపూర్ణ భారతదేశ యాత్రలకి వెళుతున్నట్టు తెగ సర్దేస్తున్నావే! నువ్వు ఊరెళ్ళేది మూడు రోజులకే బుజ్జీ" అన్నాడు కిరణ్ కాస్త వెటకారంగా.

"మూడు రోజులకంటే ఒక్క నిమిషం కూడా ఎక్కువ ఉండడానికి నీ ఆమోదముద్ర లేదుగా!" అంటూ కిరణ్ కేసి దీనంగా చూసింది నీలిమ.

"మరీ అంత దీనంగా మొహం పెట్టకు నీలూ. పోనీ, నీకెన్నాళ్ళు ఉండాలనిపిస్తే అన్నాళ్ళు హాయిగా మీ అనంతతోనే ఉండిపో. సరేనా! నేనసలు ఫోన్‌లో కూడా డిస్టర్బ్ చేయను. ఇప్పుడు హ్యాపీనా!" బుజ్జగిస్తున్నట్టు చెప్పాడు కిరణ్ .

"నిజంగానా కిరణ్ .." అంటూ చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది నీలిమ.

"అయినా నీలూ, నాదో సందేహం. ఇన్నేళ్ళు గడిచాక కూడా నీలాగా మీ స్నేహితురాలు కూడా ఇలాంటి చిన్న చిన్న విషయాలని గుర్తు పెట్టుకుంటుందంటావా?"

"ఎందుకు గుర్తు పెట్టుకోదు. కాలేజీ రోజుల్లో మేమిద్దరం ఒకే ప్రాణం అన్నట్టు ఉండేవాళ్ళం. అసలు కాలేజీలో మమ్మల్నిద్దరినీ అక్కాచెల్లెళ్ళేమో అనుకునేవారు తెలుసా! తప్పకుండా అనంత కూడా నాలాగే ఇవన్నీ తలచుకుంటూ ఉండి ఉంటుంది."

"అలా అయితే మంచిదేలే. నువ్వు హ్యాపీ.. నేనూ హ్యాపీ!" అన్నాడు కిరణ్ .

❖ ❖ ❖

మర్నాడు తెల్లవారుఝామునే లేచి ప్రయాణమైంది నీలిమ. నీలిమ అత్తగారి ఊరు నుంచీ అనంత ఉండే ఊరికి మొత్తం నాలుగు గంటల కారు ప్రయాణం. ఎంత తొందరగా స్నేహితురాలిని చూద్దామా అనే ఆరాటంతో తెల్లవారు ఝామున నాలుగింటికే బయలుదేరిపోయింది నీలిమ.

ఇంకా చుట్టూ చీకటి తెరలు అలముకునే ఉండటం చేత కిటికీలోంచి బయటికి చూసే వీలు లేదు. కాసేపు కునుకు తీద్దామంటే ఇన్నేళ్ళ తరవాత స్నేహితురాలిని కలవబోతున్నానని లోలోపల ఉరకలేస్తున్న ఉత్సాహం నీలిమని స్థిమితంగా కూర్చోనివ్వడం లేదు. వెళ్ళగానే అనంతతో ఏమేమి కబుర్లు చెప్పాలో తనలో తనే ఆలోచిస్తూ కూర్చుంది నీలిమ.

కాలేజీ రోజుల్లో చేసిన అల్లరంతా గుర్తు చేయాలి. ఎప్పుడూ ఇద్దరం కలిసే తిరిగే వాళ్ళమని క్లాస్మేట్స్ అందరూ సరదాగా జంటకవులు అని పిలిచేవారే, విషయం గుర్తు చేయాలి. అనంతకి ఉన్న పెద్ద జడ చూసి కాలేజీలో అందరూ 'జడ.. దడ' అని ఆటపట్టించేవారే, అది గుర్తు చేయాలి. పరీక్షలకి వెళ్ళేప్పుడు దారిలో ఆటోలో కూర్చుని కూడా హడావిడిగా టెస్ట్ పేపర్లన్నీ తిరగేస్తూ ఉండేది కదా! అది కూడా గుర్తు చేయాలి. ఇంకా, అనంత వైపు ఆరాధనగా చూడడమే తప్ప ఎప్పుడూ మాట్లాడి ఎరుగని ఉంగరాల జుట్టు శ్రీముని గుర్తు చేయాలి.

కాలేజీ రోడ్లో రోజా గులాబీలు కొనుక్కున్న 'రోజ్ గార్డెన్', ఇంకా, కాలేజీ దగ్గర ఉన్న సాయిబాబా గుళ్ళో చేసిన పూజలూ, వర్షాకాలమంతా దగ్గరుండి కాల్పించుకు కొనుక్కున్న మొక్కజొన్న పొత్తులు, ఐస్క్రీం బండి వాడి దగ్గర చిన్నపిల్లలతో పోటీ పడి కొనుక్కు తిన్న చాకోబార్లు, కాలేజీ పిక్నిక్కులు, కలిసి చూసిన బోలెడు సినిమాలు.. ఇద్దరం కలిసి చదువుకున్న మూడేళ్ళలో ఇంకా ఎన్నెన్ని సరదాలూ, అల్లరి పనులు.. అవన్నీ అనంత సమక్షంలో మరోసారి గుర్తు చేసుకోవాలి. అంతే కాదు, ఇప్పుడు అనంత ఉంటున్నది మేము చదువుకున్న ఊర్లోనే కాబట్టి ఇద్దరం కలిసి ప్రదేశాలన్నీ చుట్టేసి రావాలి.

ఏవిటో.. అంతటి ప్రాణస్నేహితులమే అయినప్పటికీ తరవాత కలుసుకోడానికే కుదరలేదు. అసలు మేమిద్దరం ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళం పెళ్ళే చేసుకోకూడదు అనుకునేవాళ్ళం. కానీ, విధి వక్రించి ఇద్దరమూ ఒకళ్ళ పెళ్ళికి ఒకళ్ళు వెళ్ళలేకపోయాం.

డిగ్రీ అయ్యాక ఇద్దరం చెరో దిక్కున 'పీజీ' లో చేరాల్సి వచ్చింది. ఆ రోజుల్లో కలవడానికి కుదరకపోయినా కనీసం ఫోనుల్లో అయినా తరచూ మాట్లాడుకునేవాళ్ళం. 'పీజీ' అయిపోతూనే నాకు ఒక మంచి కంపెనీలో ఉద్యోగం రావడంతో వెంటనే మూణ్ణెల్లు ట్రైనింగుకి వెళ్ళాల్సి వచ్చింది. సరిగ్గా ఆ సమయంలోనే మంచి సంబంధం కుదిరిందని అనంతకి పెళ్ళి చేసేశారు వాళ్ళింట్లో వాళ్ళు. అలా అనంత పెళ్ళికి నేను వెళ్ళలేకపోయాను.

పెళ్ళయ్యాక ఓ రెండేళ్ళ దాకా అనంత వాళ్ళ అత్తగారింట్లోనే ఉండాల్సి వచ్చింది. వాళ్ళ ఊరులో ఫోన్ సిగ్నల్ కూడా సరిగ్గా ఉండదు. పైగా వాళ్ళది కాస్త సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కువ పాటించే కుటుంబం కావడం మూలానా రెండేళ్ళలో అనంతతో మాట్లాడడానికి ఎక్కువ కుదిరేది కాదు. ఎప్పుడో ఒకసారి క్షేమ సమాచారాలు మాత్రం తెలుసుకుంటూ ఉండేవాళ్ళం.

ఆ సమయంలోనే కిరణ్తో నా పెళ్ళి నిశ్చయమైంది. అనంతకి ఫోన్ చేసి చెప్పాను. అనంత వాళ్ళ మామగారి తమ్ముడి భార్య ఎవరికో సుస్తీగా ఉందని వాళ్ళత్త గారు ఊరు వెళ్ళారట. అంచేత తను పెళ్ళికి రావడానికి కుదరడం లేదంది అనంత.

ఏవిటో.. అమ్మాయిల జీవితం పెళ్ళి తరవాత చాలా మారిపోతుంది. చాలాసార్లు నిర్ణయాధికారం వాళ్ళ చేతుల్లో ఉండదు, పరిస్థితులకి తగ్గట్టు నడుచుకోవడం తప్ప. ఏ పని చేయాలన్నా పెళ్ళి కాక మునుపులా కాకుండా, తన కంటే ముందు తనకంటూ ఏర్పడిన కుటుంబం గురించి ఆలోచించాల్సి వస్తుంది. అంతదాకా పుట్టింట్లో హక్కులనే అనుభవించిన అమ్మాయిలకి ఇప్పుడు కొత్తగా బాధ్యతలు వచ్చి పడతాయి. అదంతే!

తర్వాత కొన్నాళ్ళకి అనంతకి ఓ బాబు పుట్టాడని కబురు తెలిసింది. అప్పటికి మేము ఉద్యోగరీత్యా వేరే రాష్ట్రంలో ఉండటం మూలానా అప్పుడు కూడా అనంతని కలవలేకపోయాను. మరి కొన్ని రోజులకి అనంత వాళ్ళాయన ఉద్యోగరీత్యా యీ ఊరు వచ్చి కాపురం పెడుతున్నామని అనంత చెప్పింది. సరిగ్గా అప్పుడే కిరణ్ , నేనూ ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్ళాల్సి వచ్చింది. అలా వెళ్ళి ఇప్పటికి

రెండున్నరేళ్ళు గడిచిపోయాయి. ఇన్నేళ్ళలో ఎవరి జీవితాలతో వారు తలమునకలై ఉండటం వల్ల అడపాదడపా క్షేమసమాచారాలు తెలుసుకోవడం మినహా అనంతతో ఎక్కువ మాట్లాడింది లేదు.

ఇన్నేళ్ళయినా కనీసం అనంత పెళ్ళి ఫోటోలు గానీ, బాబు ఫోటోలు గానీ నేను చూడనేలేదు. అలాగే నా పెళ్ళి ఫోటోలు కూడా అనంత చూడలేదు. ఇప్పుడు ఇద్దరం కలిసి యీ ఊసులన్నీ పంచుకోవడం ఎంత సంబరంగా ఉంటుందో తలచుకుంటేనే మనసు ఉప్పొంగిపోతోంది.

మొత్తానికి ఏదయితేనేం.. ఇన్నేళ్ళు కలవలేకపోయాం అనే బాధ, ఇన్నేళ్ళ తరవాత మళ్ళీ స్నేహితురాలిని కలవబోతున్నానన్న ఆనందం రెండూ కలిసిపోయి ఓ చిత్రమైన మనఃస్థితిలో ఉంది నీలిమ.

అలుపన్నది లేకుండా పరిగెడుతోన్న నీలిమ ఆలోచనలకి కళ్ళెం వేస్తూ డ్రైవర్ చెప్పాడు ఊళ్ళోకి వచ్చేశామని. "ఆలోచనల్లో పడి గమనించనే లేదు.. అప్పుడే నాలుగు గంటల ప్రయాణం అయిపోయిందా!" అని ఆశ్చర్యపోయింది నీలిమ. నీలిమ చెప్పిన అడ్రస్ గురించి వాకబు చేస్తూ వెళ్ళి డ్రైవర్ ఓ ఇంటి ముందు ఆపాడు కారు.

❋❋❋

ఇన్నేళ్ళ తరవాత అనంతని చూసిన సంతోషంలో ఆనందబాష్పాలు వచ్చాయి నీలిమ కళ్ళల్లో. హాల్లో గోడకి ఉన్న అనంత ఫ్యామిలీ ఫోటో చూసి చాలా ముచ్చట పడింది నీలిమ. ఇన్నేళ్ళలో అనంత పెద్దగా ఏం మారలేదు, కొంచెం బొద్దుగా మాత్రం అయిందనిపించింది. ఇరువురి మధ్యా కుశల ప్రశ్నలు అయ్యాక, అమెరికా నుంచి తెచ్చిన బహుమతులు ఇచ్చాక, వేడి వేడిగా ఇడ్లీలు పెట్టింది అనంత. ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం ముగించారు.

ఈలోపు అనంత శ్రీవారనుకుంటా హాల్లోకి వచ్చారు. "అమెరికా నుంచి వచ్చిన నా ఫ్రెండు" అంటూ నీలిమని పరిచయం చేసింది. చాలా ముభావంగా ఉండే మనిషల్లే ఉంది. నీలిమని పరిచయం చేయగానే నమస్తే చెప్పి క్షణంలో వెళ్ళిపోయాడు. "మా అత్తగారి వైపు అంతా బాగా సాంప్రదాయక కుటుంబం. పరాయి ఆడవాళ్ళతో ఎక్కువగా మాట్లాడరు నీలూ" అంటూ వాళ్ళాయన ప్రవర్తనకి వివరణ ఇచ్చింది అనంత.

కాసేపు ఆ మాటా యీ మాటా చెప్పుకుని పెళ్ళి ఫోటోలు చూసుకునే కార్యక్రమం మొదలెట్టారు. అనంత తన పెళ్ళి ఫోటోలు చూపిస్తూ వాళ్ళ అత్తింటి వైపు వాళ్ళని పరిచయం చేయడం కన్నా ఎక్కువగా వాళ్ళ ఆస్తిపాస్తుల వివరాలు, నగా నట్రాకి సంబంధించిన కబుర్లే ఎక్కువగా చెప్పింది. వాళ్ళ బావగారి కన్నా తన భర్త సంపాదించిన ఆస్తే ఎక్కువనీ, చుట్టాలందరిలోనూ వాళ్ళాయనకి చాలా గొప్ప పేరుందని ఎంతో మురిపెంగా చెప్పింది. నీలిమ పెళ్ళి ఫోటోలు చూపిస్తున్నప్పుడు కూడా అనంత ప్రశ్నలన్నీ పట్టుచీరలు, పెట్టుపోతల గురించో, నగల గురించో, లేకపోతే ఆస్తుల చుట్టూనో తిరిగాయి.

బాబు ఫోటోలు చూస్తూ చాలా ముద్దుగా ఉన్నాడంది నీలిమ. "బాబు మా అత్తగారి దగ్గరే ఉంటాడే! అక్కడ అందరికీ ఎంత మురిపెమో వాడంటే. అందరం చాలా గారాబంగా చూసుకుంటాం వాడిని. అసలే ఇంతటి ఆస్తికి ఏకైక వారసుడాయే!" చిత్రంగా చేతులు తిప్పుతూ చెప్పింది అనంత.

టిఫిన్ చేయడానికి డ్రైవరుని పిలుద్దామని అనగానే, "మీ కారు కొత్తదా? మా పెళ్ళప్పుడే కారు తీసుకున్నారు నీలూ ఈయన" అంటూ కాసేపు వాళ్ళ కారు ఘనతని గూర్చి వివరించింది అనంత.

స్నేహితురాలి ప్రవర్తన నీలిమకి చాలా చిత్రంగా అనిపించింది. భర్తంటే ఉన్న అమితమైన ప్రేమ కొద్దీ అతని ప్రయోజకత్వాన్ని గొప్పగా చెపుతుందేమోలే అని తనకు తానే సర్దిచెప్పుకుంది.

వెంటనే ఆలోచనల్లోంచి తేరుకుని "అనంతా, మన కాలేజీ దగ్గర సాయిబాబా గుడి గుర్తుందటే నీకు. ఎలా తిరిగేవాళ్ళమో కదా గుడి చుట్టూ" అడిగింది నీలిమ.

"అవునే.. అన్నట్టు సాయిబాబా గుడికి దగ్గరలోనే ఒక ఫ్లాటు ఉంది మాకు. ఇప్పుడు ఆ ఏరియాలో ఎంతెంత రేట్లనుకున్నావ్ ! అయిదు సెంట్లు భూమి ఇరవై లక్షలు అయిందే! అక్కడొక పెద్ద సొంతిల్లు కట్టుకోవాలని అనుకుంటున్నాం. యీ ఇల్లు అద్దెకే అయినా, ఊర్లో మా అత్తగారు వాళ్ళుంటున్న ఇల్లు ఈయన కట్టించిందే. ఇది కాక ఇంకా మూడు ఫ్లాట్లు, ఐదెకరాల పొలం కూడా ఉంది. పేరుకి గవర్నమెంటు ఉద్యోగమే అయినా గానీ పై రాబడి చాలానే ఉంటుందే ఈయనకి. సాఫ్ట్‌వేరు వాళ్ళకంటే కూడా ఎక్కువ సంపాదిస్తున్నారని చుట్టాలందరూ ఒకటే దిష్టి పెట్టేస్తున్నారనుకో!" అంటూ గట్టు తెగిన గోదారిలా చెప్పుకెళ్ళిపోతోంది అనంత.

విషయం ఎటో వెళ్ళిపోతోందని గమనించిన నీలిమ "కాలేజీలో ఉన్నప్పుడు మొక్కజొన్న పొత్తులు తెగ తినేవాళ్ళం కదా అనంతా.." అనగానే "ఇప్పుడసలు బయట కొనుక్కుని తినట్లేదే మా పొలంలో పండినవే పంపిస్తారు మా అత్తగారు వాళ్ళు" అని గొప్పగా బదులిచ్చింది అనంత.

ఏ ప్రస్తావన తెస్తే ఏమంటుందో తెలీక "ఇంకా.. ఎలా సాగుతోందే జీవితం?" అంది నీలిమ. "నాకేంటే.. బ్రహ్మాండంగా ఉన్నాను. పీజీ చేసినా గానీ నీకు ఉద్యోగం చేయాల్సిన ఖర్మేం పట్టింది అంటారు ఆయన. ఏ లోటూ లేకుండా హాయిగా ఉన్నాను. అన్నట్టు నీలూ, మీ ఇద్దరికీ కలిపి ఎంతొస్తాయే? బాగా మిగుల్తాయా? నెలకి ఎన్ని లక్షలు వెనకేస్తారేంటి?" అని గడగడా అడిగేస్తోన్న అనంత ప్రశ్నలకి ఎలా బదులివ్వాలో తెలీక మహా ఇబ్బంది పడిపోయింది నీలిమ.

యీ వివరాలన్నీ అడిగిందని ఏమీ తప్పనిపించలేదు గానీ, ఇలా ఆస్తులు, గొప్పలు చెప్పుకోవడం తప్ప వేరే ఏ ఆలోచనా, అనుభూతి లేనట్టు ప్రవర్తిస్తున్న అనంత తీరు చాలా ఇబ్బందికరంగా అనిపించింది నీలిమకి. విడిపోయిన ఎన్నో ఏళ్ళ తరవాత మళ్ళీ స్నేహితురాలితో కలిసి కాలేజీ జ్ఞాపకాలు గుర్తు చేసుకుందామని ఎంతో ఆశగా వచ్చిన నీలిమకి అక్కడి పరిస్థితి చూసి చాలా నిరుత్సాహంగా అనిపించింది.

మూడేళ్ళు కలిసి చదువుకున్న రోజుల్లో కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించైనా కనీసం మాటవరసకి కూడా ఎప్పుడూ మాట్లాడుకోలేదు. అలాంటి నా స్నేహితురాలు అనంతలో ఇప్పుడెంతటి మార్పు చూస్తున్నాను? అంత చదువుకున్న అనంతేనా ఇలా ప్రవర్తిస్తోంది! అని ముక్కున వేలేసుకుంది నీలిమ.

ఇలాంటి అతిశయాలు, భేషజాల కబుర్లతో రోజంతా గడిచిపోయింది. సాయంత్రమయ్యేసరికి నీలిమ ఇబ్బంది కాస్తా చిరాకుగా రూపాంతరం చెందుతోంది. వెంటనే తిరిగి వెళ్ళిపోవాలని నిర్ణయించుకుని అనంత నొచ్చుకోకుండా ఎలా చెప్పాలా అని ఆలోచించింది.

"అనంతా.. అసలైతే నీ దగ్గర కనీసం నాలుగు రోజులైనా ఉందామనుకున్నానే! కానీ, ఎల్లుండి ఆఫీసుకి సంబంధించిన ఒక అర్జెంటు మీటింగ్ ఒకటి వచ్చి పడింది. అందుకని తొందరగా వెళ్ళాల్సి వస్తోంది" అని అబద్ధం చెప్పింది నీలిమ వేరే గత్యంతరం లేక.

దానికి స్పందిస్తూ అనంత "అందుకేనే నేను మాత్రం ఉద్యోగం, సద్యోగం అంటూ పెట్టుకుని తిప్పలు పడదల్చుకోలేదు. ఆయన కూడా చాలా బిజీగా ఉంటారు ఎప్పుడూ. అస్తమానూ ఆఫీసు నుంచి ఒకటే ఫోన్లు వస్తుంటాయి. స్థిమితంగా పదినిమిషాలైనా కూర్చోడానికి లేదనుకో!" అంటూ మళ్ళీ మొదలు. మరిక ఆలస్యం చేయకుండా స్నేహితురాలి దగ్గర సెలవు పుచ్చుకుని తిరుగు ప్రయాణమయ్యింది నీలిమ.

కనీసం వారం దాకా తిరిగి రానన్న నీలిమ ఒక్క రోజులోనే తిరిగి వచ్చేసరికి కిరణ్ చాలా ఆశ్చర్యపోయాడు. చిన్నబోయిన నీలిమ మొహం చూసి ఏదో అడగబోయేంతలో నీలిమ కిరణ్ భుజం మీద తల వాలుస్తూ "ఏంటో కిరణ్ .. అన్నీటికీ ఉన్నట్టే స్నేహానికి కూడా

కాలపరిమితి ఉంటుందేమో అనిపిస్తోంది. కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాలాతీతమైనవి గానీ, వ్యక్తులు కాదేమో!" అంటూ వేదాంత ధోరణిలో చెప్పుకుపోతోంది నీలిమ.

## బంగారు కలలు

**మాధవ్ దుర్భా**

**"సుధీర్! నిన్నే! ఏలోకంలో ఉన్నావ్?" శిల్ప మాటలకి ఆలోచనల్లోంచి బయటపడ్డాను.**

"కాం కార్డర్ రడీ చెయ్యి. ఇంకాసేపట్లో మాచ్ మొదలౌతుంది" అంటుంటే అలాగేనని తలూపి బాగ్ ఓపెన్ చేశాను. మిత్ర సాకర్ ప్రాక్టీస్ మొదలెట్టి ఎనిమిది నెలలయ్యింది. ఇప్పటి దాకా శిల్ప వాడ్ని తీసుకురావడమే. నేను రావడం మాత్రం ఇదే మొదటిసారి. ఎప్పుడూ ఉద్యోగ రీత్యా ఊళ్ళు తిరగడమో, లేక ఏ డెడ్ లైనో ఉందని ఆఫీసు నుంచి లేటుగా రావడమో జరగడంతో ఇన్నాళ్ళకి గానీ నాకు ముహూర్తం కుదర్లేదు. ఈ రోజు కూడా వచ్చి ఉండేవాడిని కాదు. కానీ...

గంట క్రితం... ఇంట్లో..

"పోనీలే సుధీర్! ఈసారి కాకపోతే వచ్చేసారన్నా నీకు తప్పకుండా ప్రమోషన్ వచ్చి తీరుతుందనే నా నమ్మకం. మెరిట్‌కి ఎప్పటికన్నా రికగ్నిషన్ ఉండకుండా పోదు" శిల్ప ఊరడింపు...

" లేదు శిల్పా! నాకెందుకో ఆ నమ్మకం కలగడంలేదు. ఛార్లీ డిస్క్రిమినేషన్ చూపిస్తున్నాడనే అనిపిస్తోంది! నన్ను పక్కన పెట్టి మార్క్‌ని ప్రమోట్ చెయ్యడంలో అతని ఉద్దేశ్యం నాకేం తెలీడంలేదు. ఇలా జరుగుతుందనుకోలేదు. నా మనసేం బాగోలేదు శిల్పా!" అన్నాను.

"కాసేపు ఆ సంగతి మర్చిపోయి హాయిగా బైటకెళ్ళొద్దాం. మిత్ర సాకర్ ప్రాక్టీస్ ఉంది కదా? నువ్వు కూడా వస్తే కాస్త నీకూ మాకూ కూడా ఛేంజ్ గా ఉంటుంది సుధీర్!" అంది శిల్ప. నా కెక్కడికీ కదలాలని లేదు. కానీ శిల్ప నన్ను రమ్మని అడగడం విన్నాడేమో, మిత్ర కూడా వచ్చి "డాడీ! నువ్విప్పటిదాకా ఎప్పుడూ సాకర్‌కి రాలేదు. ఇవాళ రావల్సిందే" అని పేచీ పెట్టాడు. వాడి వెనకే దివ్య కూడా అర్థం అయినా కాకపోయినా వచ్చి నా చెయ్యి పట్టుకు లాగడం మొదలు పెట్టింది. ఇక వాళ్ళని నిరాశపరచడం ఇష్టంలేక, తలదువ్వుకుని బయలుదేరదామని బాత్రూంలో కెళ్ళాను.

సక్సెస్‌కి నిర్వచనం పెద్ద చదువూ, రెండు చేతులా సంపాదనా, అనుకూలవతీ రూపవతీ ఐన భార్య, రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలూ ఐతే అవన్నీ నాకున్నాయి. కానీ ఏదో అసంతృప్తి. పొద్దుట లేచినప్పటినుంచీ రాత్రి పడుకునే వరకూ రోజంతా ఒక మెషీన్ లాగా పనిచేస్తూనే ఉంటాను. ఊపిరి సలపని పని. పిల్లలు పుట్టాక శిల్ప ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటిపట్టున ఉండడంతో ఇంటి పనులన్నీ

తనే చూసుకుంటుంది. అందువల్ల నేను నా ఉద్యోగంలో ఇంకా బాగా నిమగ్నమైపోయాను. కానీ ఈ రోజు తలనొప్పిగా ఉందని తొందరగా ఇంటికి చేరుకున్నాను. వస్తుందనుకున్న ప్రమోషన్ చెయ్యి జారిపోయిందనేమో, ఇవాళ ఈ మధ్య కాలంలో ఎప్పుడూ కలగని వింత ఆలోచన మొదలైంది నాలో. ఏమిటీ జీవితానికి పరమావధి? ఎందుకిలా రోజూ ఒక గమ్యం లేకుండా ఉరకలూ... పరుగులూ..? అసలు ఒక లక్ష్యం అనేది మనసులో పెట్టుకుని, అది సాధించడం కోస్మ ఎన్నో కలలు కంటూ గడిపిన రోజులెప్పుడున్నాయి అని ఆలోచిస్తే ఇంచు మించు ఇరవై సంవత్సరాల క్రితానికి వెళ్ళిపోవాల్సొచ్చింది. అప్పట్లో ఇంజనీరింగ్‌లో మంచి రాంక్ రావాలని ఒక రకమైన తపన. దానికోసం పగలూ, రాత్రీ శ్రమించినా ఎందుకో అసలు శ్రమ అనిపించేది కాదు. ఒక రకమైనటువంటి కిక్ ఉండేది కూడా. ఇప్పుడు కూడా అంతే బిజీగా ఉన్నా ఎందుకో పొద్దుట "తప్పదురా బాబూ" అన్నట్లు నిద్రలేవడం.. ఒక యంత్రంలా రోజంతా పని చెయ్యడం.. ఇల్లు చేరడం... తినడం, పడుకోవడమే జీవితధ్యేయం అన్నట్లు ప్రవర్తించడం..........

"సుధీర్! సాకర్‌కి టైం ఐపోతోంది. ఇంకా ఏమిటి ఆలస్యం?" అన్న శిల్ప పిలుపుకి ఆలోచనల్లోంచి బయటపడి "వస్తున్నా" అంటూ బయల్దేరాను.

సాకర్ ఫీల్డ్‌కి వెళ్ళే దారంతా మిత్ర, దివ్య కబుర్లు.

మిత్ర స్కూల్లో వాళ్ళ టీచర్ అడిగిందట "పెద్దయ్యాక ఏమవుతావ్?" అని.

"నువ్వేం చెప్పావ్?" అంది శిల్ప.

"పైలట్" అన్నాడు మిత్ర. ఆ మాట అంటూంటే వాడి గొంతులో ఉత్సాహం, వాడి కళ్ళలో మెరుపూ... స్పష్టంగా తెలుస్తోంది. ఆరేళ్ళు లేవు వీడికి...... ఇంకో ఇరవై ఏళ్ళ తర్వాత ఏం చేస్తాడన్నదాని గురించి వీడికి ఇప్పట్నించీ ఎంత ఆలోచన? ఆ ఆలోచనలోనే వాడికి ఎంతో ఆనందం కనిపిస్తోంది. మరి నేనేమిటి? ఇరవై ఏళ్ళు పక్కన పెడితే.. ఇరవై రోజుల తర్వాత గురించి ఆలోచించడం మానేసి ఈరోజు గడిస్తే చాలన్నట్లు ప్రవర్తిస్తున్నాను? ఎప్పుడూ ఇలాగే ఉన్నానా? అని ఆలోచిస్తే... మిత్ర వయస్సులో నేను కూడా ఎన్నో కలలు కన్న సంగతి గుర్తుకొచ్చింది. కలెక్టరౌదామని కొన్నాళ్ళుండేది కొంచెం పెద్దయ్యాక డాక్టరౌదామనుకునేవాడిని. ఇది సాధ్యమా కాదా? నా వల్ల అయ్యేదేనా? అనే ఆలోచన ఎప్పుడూ రాలేదు. ఇంకొన్ని ఏళ్ళు గడిచి హైస్కూల్‌లో కొచ్చేసరికి.. ఇంజనీరింగ్ చదువుదామని డిసైడయ్యాను... కారణం, మెడిసిన్‌లో సీట్లు తక్కువ. అందువల్ల మనకి వస్తుందో లేదో అని అనుమానం. పసితనంలో ఎరగని అనుమానాలూ, భయాలూ వయసు పెరిగే కొద్దీ మొదలయ్యాయి. ఊహ తెలిసొచ్చాక పెద్దయ్యాక ఏమౌదామా అని ఆలోచించే నా ఆలోచనా పరిధీ, దూరదృష్టీ పదో తరగతికొచ్చేసరికి ఇంటర్ పూర్తిచేసి మంచి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సంపాదిస్తే చాలు అన్నట్లు రెండేళ్ళకే పరిమితమైపోయింది. కానీ అదే ధ్యేయంగా ఆ రెండేళ్ళూ పగలనకా, రేయనకా కష్టపడ్డాను.

అనుకున్న ప్రకారం ఇంజనీరింగులో సీటు సంపాదించేసరికి జీవితంలో ఏదో సాధించేశానని తృప్తి. అందరూ అనేవాళ్ళు... మంచి ఇంజనీరింగ్ కాలేజీలో, మంచి బ్రాంచిలో చేరావు. ఇక నీ ఉద్యోగానికే ఢోకా లేదని. ఆ మాటలు బాగా వంటబట్టాయేమో, అప్పట్నించీ ఇంజనీరింగులో ఉన్నంత కాలం రేపనేదాని గురించి ఆలోచనే ఉండేది కాదు. అసలు గీతాంజలి సినిమాలో "నేడేరా మనకు నేస్తమూ... రేపేలేదూ... నిన్నంటే నిండు సుందరా.. రానే రాదూ" అని నా గురించే వ్రాశారేమో?! ఇవాళ ఏ సినిమా కెళదాం, ఫ్రెండ్స్‌తో కలిసి ఏ రకంగా జల్సా చేసుకుందాం అనే ఆలోచించేవాణ్ణి. హాస్టల్‌లో ఉండడం వల్ల ఎప్పుడు బైటకెళ్ళినా, ఏవేళ తిరిగొచ్చినా ఎవరూ అడ్డు చెప్పే వాళ్ళు కాదు. నేను డబ్బుల కిబ్బంది పడకూడదని అమ్మా, నాన్నా అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బులు పంపడంతో ఇంకా హాప్పీగా

గడిపేశాను ఆ రోజులు. ఆలోచిస్తే అనిపిస్తుంది... నా జీవితంలో అటు బరువూ బాధ్యతా... ఇటు అడ్డూ అదుపూ.. ఏవీ లేకుండా బతికేసిన రోజులవేనేమోనని!

అలా బాల్యం నుంచి యవ్వనానికి నా వయస్సు ముందుకు ఉరకలు వేసుకుంటూ వెడితే, నా ఆలోచనలూ.. కలలూ.. ఊహలూ..... అన్నీ కూడా భవిష్యత్తు నుంచి మెల్లగా వర్తమానానికి పరిమితమయ్యాయి. ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ మిడ్ సెమిస్టర్ సెలవలకి ఇంటికెళ్ళినప్పుడు నాన్నగారు అడిగారు "గ్రాడ్యుయేట్ అయ్యాక ఏం చేస్తావ్ సుధీర్!" అని. ఇంజనీరింగ్‌లో చేరాక తర్వాత ఏం చేద్దాం అనే ఆలోచన రావడం అదే మొదటిసారేమో! నాకు ఫలానాది చేద్దాం అని ఉద్దేశ్యం లేదు. ఐ.ఏ.యస్. చేద్దామన్న ఆలోచన ఏ ఆరో క్లాసులోనో మర్చిపోయాను. ఏమీ చెప్పకపోతే బాగోదని, "మా సీనియర్స్ చాలా మంది GRE, TOFEL వ్రాసి స్టేట్స్ వెడుతున్నారు డాడీ! అదే చేద్దామని!" అని సమాధానం చెప్పాను. తథాస్తు దేవతలుంటారన్న మాట నిజమే కాబోలు.. అదే వాస్తవ మయ్యి అలాగే వచ్చి ఈ అమెరికాలో యూనివర్సిటీలో పడ్డాను తెగిన గాలిపటంలా!

"వావ్! మీ అబ్బాయి భలే గోల్ చేశాడు" పక్కనున్న పేరెంట్ ఎవరో అన్నమాటకి ఒక్కసారిగా గతంలోంచి వర్తమానానికొచ్చాను.

"థాంక్యూ!" అన్నా మెల్లిగా!

నా ఆలోచనల్లో నేను నిమగ్నమైపోయి ఉన్నప్పుడెప్పుడో ఆట మొదలైనట్లుంది. నేను గమనించనేలేదు. మిత్ర ఇప్పుడు స్కోర్ చేసిన దాంతో పాటు వాళ్ళ చీటాస్ టీం ఖాతాలో రెండు గోల్స్‌చేరాయి. ఆపోజిట్ టీం హాక్స్ ఇంకా స్కోర్ బోర్డ్ మీదకెక్కలేదు. మిత్ర చాలా గర్వంగా నాకేసీ, శిల్ప కేసీ చూశాడు. లేచి వాడికేసి చెయ్యి ఊపి చప్పట్లు కొట్టాను! ఛా! నా ఆలోచనల్లో పడిపోయి వాడి గోల్ చూడడం మిస్సైపోయాను. కాంకార్డర్ చేతిలోనే ఉంది గానీ రికార్డ్ బటన్ నొక్కడం మర్చిపోయాను. ఒక్క రెండు నిమిషాలు కాలాన్ని రివైండ్ చెయ్యగలిగితే ఎంతబాగుండును? వాడు స్కోర్ చేసిన గోల్... వాడి మొహంలో ఆనందం శాశ్వతంగా ఆ కాంకార్డర్‌లో బంధించేవాడిని కదా! కాదు...కాదు... రెండునిమిషాలు కాదు.. రెండు దశాబ్దాలు వెనక్కి రివైండ్ చేసి నేను తీసుకున్న నిర్ణయాలు కొన్నిటిని మారిస్తే ఎలా ఉంటుందా! అని ఆలోచన వచ్చింది, కలెక్టరో, డాక్టరో అవుదామన్న ఆలోచనలు వదులుకోకపోతేనో? అమెరికాకి రాకుండా ఇండియాలోనే ఉండి ఉంటేనో? నా జీవితం ఎలా ఉండేది? కాం కార్డర్ రికార్డ్ బటన్ నొక్కాను. "గో మిత్రా! గో! గో!" అని మిత్రని ఛీర్ చేస్తూ ఉత్సాహంగా అరుస్తున్న శిల్పనీ, పక్కనే అర్థం ఐనా కాకపోయినా చప్పట్లూ, కేరింతలూ కొడుతున్న దివ్యనీ చూశాను.

మాస్టర్స్ పూర్తిచేసి Y2k ప్రవాహంలో కొట్టుకుపోతూ, చదివిన ఇంజనీరింగ్ చదువుతో ఏ మాత్రం సంబంధం లేకపోయినా నలుగురితో నారాయణా అన్నట్లు ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరిపోయాను. ఉద్యోగ నిమిత్తం న్యూజెర్సీకి మారాను. అప్పుడు పరిచయమయింది శిల్ప. మా గ్రూపులోనే, నాతో పాటే జాబ్‌లో చేరింది. అందానికి అందం... చదువుకి చదువూ.. అన్నిటికన్నా వయసుకి మించిన మెచ్యూరిటీ.. నన్ను చాలా ఆకట్టుకున్నాయి. పరిచయం ప్రణయమై, ప్రణయం పరిణయమై ఇద్దరం ఒక్కటయ్యాం. కాలాన్ని రివైండ్ చేస్తే ఎన్నో నిర్ణయాలు మార్చుకుంటాను. కానీ ఒక్కటి మాత్రం నిజం! శిల్పని పెళ్ళి చేసుకునే నిర్ణయం మాత్రం మారదు. ఈ జన్మకే కాదు! మరెన్ని జన్మలెత్తినా అన్నిటా నాతో సమానంగా చదువుకున్న శిల్ప.. ఉద్యోగం చేసి మూడు సంవత్సరాలూ నాతో పోటాపోటీగా ముందుకు సాగిన శిల్ప... మిత్ర పుట్టగానే ఉద్యోగం మానేసింది. తర్వాత బంధుమిత్రులు చాలా మంది ఉచితంగా సలహాలిచ్చేవారు.

"ఇంత చదువు చదువుకుని ఇంటిపట్టున ఉండడమేమిటి శిల్పా! చక్కగా ఉద్యోగం చేసుకోవచ్చుకదా?" అని.

నేను కూడా అదే అడిగేవాడిని.

"ఇవాళ పడుకున్న మిత్ర, రేపొద్దుట లేచేసరికి ఒక రోజు పెద్దవాడైపోతాడు సుధీర్! ఈ క్షణం మళ్ళీరాదుకదా! వాడితో గడిపే ఈ మధురక్షణాలు, వాడి ముద్దు మాటలూ, బుడి బుడి నడకలూ ఎన్ని నెలల జీతాలు పోసి కొనుక్కోను? వాడు స్కూల్లో చేరనీ.. మెల్లిగా ఉద్యోగం మొదలెట్టుకుంటాను" అంటూ నవ్వేసేది. ఏనాడూ ఉద్యోగం మానేసాననేటటువంటి విచారం తనలో కనిపించలేదు నాకు. ఆలోచిస్తే శిల్పకి జీవితంలో ప్రయారిటీస్ నా కన్నా ఖచ్చితంగా తెలుసనిపిస్తుంది. అలా కొన్నాళ్ళు గడిచేసరికి దివ్య పుట్టడంతో శిల్పకి రెండు చేతులా పని. ఇక ఉద్యోగమనే ప్రసక్తి ఎప్పుడూ రాలేదు.

హాక్స్3.. చీటాస్3

నా ఆలోచనల్లో నేను ఉండగా ఎప్పుడో చాప కింద నీరులా ఈ హాక్స్ స్కోర్ సరి సమానం చేసేశారు. చీకటి పడుతుందేమో.. ఫ్లడ్ లైట్స్ వెలిగించారు. శిల్పలో ఇందాకటి ఉత్సాహం కనబడడం లేదు. ఆకాశంలో చీకట్లతో పాటు దివ్య ముఖంలో నిద్ర అలుముకుంటోంది. నాలో మాత్రం ఈ ఆలోచనలూ... పాత జ్ఞాపకాలూ, ఈ ఇంట్రాస్పెక్షన్... కొత్త ఉరవడులు సృష్టిస్తున్నాయి. అలాగే ఆలోచనలు సాగదీశాను. పిల్లలకీ, నాకూ దగ్గరవ్వడం కోసం శిల్పకీ, పిల్లలకీ రాను రాను దూరమౌతున్నానని పిస్తోంది. మేనేజర్ నుంచి, డైరెక్టర్గా, ఇంకా డైరక్టర్ నుంచి వైస్ ప్రెసిడెంట్గా ప్రమోషన్ అందుకున్నాను. కానీ బాధ్యత పెరిగే కొద్దీ, దానికి తోడు పని వత్తిడీ, దానికి తగ్గట్టు ప్రయాణాలూ.. నాకు పదవులూ, జీతాలూ పెరిగే కొద్దీ వాటి మీద ఆశా, వ్యామోహం కూడా పెరుగుతోంది. ఇంకా ఏదో నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలన్న తపనా, అంతకు మించి నా సబార్డినేట్స్, నా తోటివాళ్ళు, నా సుపీరియర్స్ నా గురించి ఏమనుకుంటున్నారో అని ఒక విధమైన ఇన్సెక్యూరిటీ రోజు రోజుకీ ఎక్కువౌతున్నాయి. దాని వల్ల పనిలో ఏకాగ్రత తగ్గుతోంది. ఇంట్లో కూడా విసుగూ, చికాకూ ఎక్కువయ్యాయి. ఒకొక్కప్పుడు శిల్ప నాతో సమానంగా చదువుకుంది, బహుశా మా అందరి కోసం తన కెరియర్ వదులుకోకుంటే నాతో సమానంగా ఉండేదేమో అనే విషయాన్ని కూడా మర్చిపోయి ప్రవర్తించే వాడిని. తన మనసుని పాపం... ఎంత కష్టపెట్టానో కదా?!

శిల్ప చెయ్యి నా చెయ్యి చుట్టూ బిగుసుకోవడంతో నా ఆలోచనలు తమ పట్టు సడలించాయి. తన కేసి చూశాను. బాగా టెన్షన్లో ఉందేమో బైట చల్లగాలి వీస్తున్నా నుదుటి మీద చెమటలు పట్టాయి. దివ్య కూడా నిద్రంతా మర్చిపోయి ఏకాగ్రతతోఆట చూస్తోంది. స్టాండ్స్లో అందరూ "గో చీటాస్..గో" అని అరుస్తున్నారు. స్కోర్ బోర్డ్ చూశాను. హాక్స్ 5... చీటాస్ 4. ఇక ఐదు సెకన్లు మాత్రమే ఉంది... మిత్రా గోల్ కి ఐదే అడుగుల దూరంలో ఉన్నాడు.. బాల్ ని గోల్ కేసి గురిచూసి తన్నాడు మిత్రా. ఒక్కసారిగా నేను కూడా అన్నీ మర్చిపోయి ఊపిరి బిగబట్టి చూశాను. ఏమౌతుందా అని!

ఇంటికి డ్రైవ్ చేస్తూ ఆలోచన కంటిన్యూ చేశా! ఏమిటో..... నేనూ, నా ఆఫీసూ, నా ఉద్యోగం ఇదే నా ప్రపంచమైపోయింది. గత మూడు రోజులుగా చెయ్యి జారిపోయిన ప్రమోషన్ గురించి ఆలోచనలు కూడా వీటికి జతచేరాయి. కానీ ఇప్పుడు కాస్త ఓపెన్ మైండెడ్ గా ఆలోచిస్తే అనిపిస్తోంది. మార్క్ కి నా కంటే పది సంవత్సరాలు ఎక్కువ అనుభవం ఉంది. ఈ మధ్యనే చైనాలో మా కంపెనీ ఎక్స్పాన్షన్ కోసం ఒక సంవత్సరం కుటుంబంతో సహా అక్కడే ఉండి మంచి అనుభవం సంపాదించి వచ్చాడు. ఛార్లీ కూడా నా గురించి నెగటివ్గా ఏమీ ఫీడ్ బాక్ ఇవ్వలేదు. పై పెచ్చు నా బాధ్యతలని పెంచాడు కూడా. కొత్తగా పెరిగిన బాధ్యతలని సక్రమంగా నిర్వర్తిస్తే నాకు ఇప్పుడు కాకపోతే మరెప్పుడన్నా ప్రమోషన్ రాకపోదు. చిన్నప్పుడు భవిష్యత్తు గురించి కలలు కంటూ, ఇంజనీరింగ్ లో వర్తమానంలో బ్రతికిన

నేను, ఎందుకో ఇలా రాను రాను జరిగిపోయిన వాటి గురించి ఆలోచిస్తూ గతంలో కాలం గడపడం తప్పనిపించింది. "ఇంకా ఏమిటి ఆ ఆలోచన సుధీర్?" అంది శిల్ప పక్కనుంచి.

"మళ్ళీ మిత్రా సాకర్ మేచ్ ఎప్పుడా?ఎప్పుడెప్పుడు వెనక్కి వద్దామా? అని ఉంది శిల్పా!" అన్నా చిరునవ్వుతో! నాలో మార్పుకి ఆశ్చర్యంగా చూసింది శిల్ప. ఇవాళ పడుకుని రేపు లేచేసరికి ఈ మార్పు ఇలాగే ఉంటుందా అని మీరు నన్నడగొచ్చు. దానికి సమాధానం కాలమే చెబుతుంది. కానీ ఒక్కటి మాత్రం నిజం! జీవితంలో కొన్ని చిన్న చిన్న ఆనందాలు.. అవే... మిత్రా సాకర్ మేచ్‌లు, దివ్య వచ్చీ రానిమాటలూ... ఇంకా రాబోయే మా మేరేజ్ ఏనివర్సరీ... వీటిని ఏ ప్రమోషన్లూ, ప్రాజెక్ట్ డెడ్ లైన్లూ దూరం చెయ్యలేవు!

నేను మళ్ళీ వాడి సాకర్ మేచ్ కి వస్తాననడం విన్నట్లున్నాడేమో... ఆనందంగా కేరింతలు కొడుతూ "ఈసారి సాకర్ స్టేడియంలో నాకు కాటన్ కేండీ కొనిపెట్టవా డాడీ!" అంటున్న మిత్రాని రేర్ వ్యూ మిర్రర్ లో చూస్తుంటే అనిపించింది. మిస్సైన గోల్‌నీ, ఓడిపోయిన మాచ్‌నీ, ఇంకిపోయిన కన్నీటినీ గతంలోకి నెట్టేసి భవిష్యత్తు గురించి బంగారు కలలు కంటున్న వీడి దగ్గర చాలానే నేర్చుకోవాలని!

# తిరుమది శే.సా.లక్ష్మి (అగినిపరు) రిటర్న్‌డ్ -భువనచంద్ర

**ఈ మధ్య** మా వీధి ఓ నానా జాతి సమితి అయిపోయింది. మొన్న మొన్నటి దాకా చక్కగా అడ్డపంచె... బొట్టు.. బనీన్ 'టక్'ఇన్ తో దర్శనమిచ్చే మా తిరువెంగడం ఈ మధ్య 'సూట్'లో దర్శనమిస్తున్నాడు. కొడుకు దగ్గర అమెరికాలో ఉండొచ్చాడో లేదో పద్ధతే మారిపోయింది. అది వరకు ఎవరు పలకరించినా 'వణక్కం' అని రెండు చేతుల్తో నమస్కరించేవాడు కాస్తా ఇప్పుడు ఒక్క చెయ్యి మాత్రం ఎత్తి 'హాయ్' అంటున్నాడు.

పరిమళా అయ్యంగారి స్టైలే మారిపోయింది. గోచి పోసుకుని 'మామి' కట్టు కట్టేది కాస్తా పగలు పన్నెండైనా 'నైటీ'లోనే దర్శనమిస్తోంది. చక్కగా సాంప్రదాయ బద్ధకంగా ఉండే నటరాజన్ కూడా 'మన్ హటన్' వెళ్ళొచ్చాక 'ఓ షిట్. ఓ హెల్' అని నిముషానికి పదిసార్లు అంటున్నాడు. (అంతకు ముందు చక్కగా 'మురుగా' అనో 'పరమశివనే' అనీ అంటుండేవాడు.)

అది వరకు బ్రిటిష్ సింబల్‌గా ఇంటిముందు ఉండే 'హంబర్' సైకిళ్ళన్నీ ఎక్కడికి పోయాయో తెలీదు గానీ... కొత్త కొత్త కార్లు తళ తళ మెరుస్తూ వీధికళ్ళకి విందు చేస్తున్నాయి. అంతెందుకు ఫలానా ఎల్.విశ్వనాథన్, రిటైర్డ్ IAS లాంటి నేం బోర్డులు కూడా నాగరికత నేర్చుకుని 'మిస్టర్. విశ్వ, ఎల్.నాథన్, IAS రిటైర్డ్ & అమెరికా రిటర్న్‌డ్' అని కొత్త సొగసులు సంతరించుకున్నాయి

మా సత్తి నాయర్ కూడా ఈ మధ్య సింగపూర్ వెళ్ళొచ్చాక ఇడ్లీ వడా మానేసి పిజాలు, హాట్ డాగ్స్ హాంబర్గర్లూ అమ్ముతున్నాడు. మొన్న నా వంక జాలిగా చూసి 'బిసీ సారూ .. ఒక్కసారైనా ఫారిన్ వెళ్ళని లైఫూ ఓ లైఫేనా?' అంటూ నిట్టూర్చాడు.

ఇవన్నీ ఒక ఎత్తయితే, మా మూడో ఇంటి పనిమనిషి 'చెల్లకణ్ణు'ది ఇంకో ఎత్తు. ఇంటి ఓ నర్సుతో పాటు అదీ ఓ ఆర్నెల్లు ఢిల్లీలో ఉండొచ్చింది. 'ఢిల్లీ' ట్రిప్ గురించి ఊరంతా వర్ణించి వర్ణించి చెప్పడం సంగతి అలా ఉంచితే, ప్రతిరోజూ మా ఇంటికి రావడం.. ఓ స్మైలిచ్చి "పాయీసాబ్.. ఆప్ కీసాహై" (అరవాళ్ళకి పఫ, బభలకు ఒకటే అక్షరం. అంచేత భాయీసాబ్ కి బదులు 'పాయీ' సాబ్

అనీ కైసేహైకి బదులు 'కీసాహై') అంటూ పలకరించటం మొదలెట్టింది. పోనీలే 'జాతీయ' భాషని ఉద్ధరిద్దామని నేను "అచ్చాహై" అనటం మామూలయి పోయింది. ఇదంతా ఓ వారం గమనించాక మా ఆవిడకి ఆవేశం పొంగుకొచ్చి, "ఏంది వోయ్..? పనిమనుషులతోటి ఆ పరాచికాలూ, ఎకసెక్కేలు ఏమిటి? అదో బోడి 'బెహన్'జీ నువ్వో గ్రేటు 'పాయి' జీవి...జాగ్రత్త.. ఇంకోసారి దాంతో 'ఇకిలిస్తూ' మాట్లాడితే మళ్ళీ మనం కలుసుకునేది కోర్టులోనే! " అని ఓ అల్టిమేటం ఇచ్చింది.

ఎంత జాగ్రత్తగా ఉన్నా ఏదో ఓ టైములో అది, "క్యా పాయూ సాబ్ నాష్టా హోగయా" అనడమూ.. నేను ఇబ్బందిగా పళ్ళికిలించి 'హా" అనడమూ. ఆ తరువాత మా ఆవిడ నాకూ నా పూర్వీకులకి 'తలంటి'పొయ్యడమూ, గత నాలుగైదు వారాలుగా జరిగి నా ఓపిక నశించి, ఆ చెల్లకణ్ణు పని ముగించేవరకూ దుర్యోధనుడు నీళ్ళ మడుగులో దాక్కున్నట్టు మేడమీద ఆఫీసు గదిలో దాక్కోటం మొదలెట్టా. దాంతో మా ఆవిడే జాలిపడి దాంతో, "ఒసేయ్ ఇంకోసారి మా ఆయన్ని పలకరిస్తే నిన్ను ఉప్పులో ముంచి ఊరగాయ వేసేస్తా!" అని బెదిరించింది. అదో 'ఢిల్లీ రిటర్న్' సర్వెంట్ కాండ.

మళ్ళీ మొదటి కొస్తే, మా వీధిలో 'ఆస్ట్రేలియా రిటర్న్'లూ, 'న్యూజిలాండ్ రిటర్న్'లూ 'దుబై, మస్కట్, సింగపూర్, మలేషియా రిటర్న్'లూ ఎక్కువైపోయారని చెప్పాను గదా. ఇంతకు ముందు 'పావలా' ఖర్చు పెట్టాలంటే పాతిక సార్లు ఆలోచించే వీళ్ళంతా ఇప్పుడు 'వీకెండ్ ' పార్టీలు చేసుకోవడంతో, ముందు పార్టీలు కూడా రెండుగా చీలిపోయాయి.

ఏం చేస్తాం.. 'నాన్ రిటర్న్' వాళ్ళమైన నేనూ, గణేశన్ మామా, సుందర పాండీ నాచ్చియారూ, దండాయుధపాణీ, అన్బళగన్ మాత్రమే నిస్సారంగా రోజులు నెట్టుకొస్తున్నాం.

ఇంత జరుగుతున్నా మా ఆవిడ ఒక్క కామెంటు కూడా 'పాస్' చెయలేదు. ఉండబట్టలేక నేనే, 'అదికాదే.. అది వరకు అత్తా కోడళ్ళు అందరూ పంచాయితీ నీ ముందే పెట్టుకునే వాళ్ళుకదా.. ఇప్పుడు వాళ్ళిటువైపు రాకపోతే నీకేమీ 'ఇదిగా లేదా?' అనడిగేశా 'ఆ ఏవుంది వెధవ గోలా వెధవ పంచాయితీలూనూ! ఇప్పుడే ప్రాణానికి హాయిగా ఉంది!' అని ఒక్క ముక్కతో తేల్చేసింది.

పోనీ 'వాకింగ్'కి పోదామన్నా 'స్టైలు' మారిపోయింది. అది వరకు లుంగీల్తో నడిచే వాళ్ళు కాస్తా ఇప్పుడు 'అరలాగూలూ' 'ముప్పాతిక లాగూలూ' జాగింగ్' డ్రెస్సులూ వేసుకుని, పలకరిస్తే 'అర' నవ్వులూ 'అరవ' నవ్వులూ విసురుతున్నారు గానీ ఒక్కమాట మాట్లాడటంలా.

ఓ రోజు నేనూ సుందర పాండీ రోడ్డు మీద నడుస్తూంటే, నటరాజన్ వాళ్ళ పనిమనిషి 'ఇంట్లో చెత్తని చేటలో ఎత్తి వీధిలో పారబోసింది. గాలి ఎక్కువగా వీస్తూండటంతో ఆ చెత్తంతా యమా స్పీడ్ గా పోయి పోర్ట్ బ్లెయిర్ రిటర్న్ ప.వేలాయుధం గారి ఇంట్లో పడింది. అదీ, శ్రీయుత వ. వేలాయుధన్ గారు వాకిట్లో గార్డెన్ చైరూ, గార్డెన్ టేబులూ వేసుకుని కాఫీ సేవించే సమయంలో

"యార్ డా అదీ?" చర్రున లేచాడు వేలాయుధం. "ఎవర్రా ఆ ఇన్ డిసిప్లిన్డ్ ఈడియట్? ఎవడ్రా ఆ స్కౌండ్రల్.. ఎవడ్రా ఈ చెత్తని నా ఇంట్లో విసిరిన నాయి"! ఘీంకరించాడు మళ్ళీ వేలాయుధం. (తమిళంలో నాయి అటే కుక్క అని అర్థం.)

వేలాయుధం గేటు తెరిచి బైటికి రాగానే మా సుందరపాండి అతనికి నటరాజన్ ఇల్లు చూపించాడు. అంతే..! అగ్గి అంటుకుంది.

"డేయ్.. నటరాజా.. వెళీల వాడా.. వెళీలవాడా నాయీ.." (బయటికి రారా కుక్కా' అని అర్థం) అరిచాడు వేలాయుధం.

సచిన్ కొట్టే సిక్సరంత స్పీడుగా బయటికొచ్చాడు నటరాజన్.

"నా ఇంటి ముందుకొచ్చి నన్నే 'నాయి' అంటావురా డబుల్నాయీ"! పిచ్చి కోపంతో అరిచాడు నటరాజన్.

"డబుల్ నాయి నేను కాదురా.. నువ్వే! డబుల్ కాదు.. ట్రిబుల్ నాయివి... కుక్క వెళ్ళొచ్చినట్టు అమెరికా వెళ్ళొచ్చావు గానీ కుక్కబుద్ధి మాత్రం పోలా... నీ ఇంట్లో చెత్తని నా ఇంట్లో పడేస్తావురా భడువా..! ఐ విల్ డ్రాగ్ యూ టు కోర్ట్.." చిందులు తొక్కాడు వేలాయుధ.

భుజాన సంచీలూ, చేతిలో సీసాల్తో ముగ్గురు ఆడవాళ్ళు ఇద్దరు మగవాళ్ళూ గబగబా ఫైటింగ్ స్పాట్‌కి వచ్చారు. వేలాయుధం 'భడువా' అనంగానే ఒకావిడ చిర్నవ్వు నవ్వుతూ "సార్ మేం బార్లిక్స్ కంపెనీ నుంచి వస్తున్నాం సార్. బజార్లో కొంటే అరకిలో బార్లిక్సూ అయిదొందలు, అదే మా దగ్గర తీసుకుంటే కేవలం త్రీ హండ్రెడ్. అంతేగాక హాఫ్ కిలో పంచదార ఫ్రీ..."

చేతిలోని బార్లిక్స్ సీసాని చూపిస్తూ, మరో చేత్తో పంచదార పేకెట్ తీసి, నటరాజన్ కివ్వబోయింది సేల్స్ ప్రమోటర్.

"నీ వాయమూడు" (నువు నోరు మూసుకో) అని ఆ పిల్లతో అని, "డేయ్ వేలాయుధా.. నువ్వుకాదురా..నేనూ.. నేనే నీ మీద డేమేజీ కేసు బనాయిస్తా.. మా తోడల్లుడి బామ్మరిది ఎస్.పి పది నిమిషాల్లో అరెస్టు చేయించకపోతే నా పేరు నటరాజన్ కాదు!".. ఛాలెంజ్ చేశాడు నటరాజన్.

"ప్లీజ్ సార్.. పెద్దవారు! చాలా నీరసంగా కనిపిస్తున్నారు. మా దగ్గర బార్లిక్స్ కొంటే.. ఎనర్జీకి ఎనర్జీ.. సేవింగ్ కి సేవింగ్".. కొంచెం స్మార్ట్ గా ఉన్న మగ ప్రమోటర్ వేలాయుధాన్ని బ్రతిమాలాడు. 'డేయ్ కరుప్పు నాయీ, (నల్లకుకా) నీ తోడల్లుడి బామ్మర్ది ఎస్.పి అయితే మా ఆవిడ పిన్ని కొడుకు ఐ.జీ.రా. నిన్నూ నీ పెళ్ళాన్నీ కూడా లోపల తోయించి ఊచలెక్కబెట్టిస్తా.. ఖబడ్దార్.. ముందు మా ఇంట్లో పడేసిన చెత్తని ఊడ్చి మర్యాదగా బయటపడేయ్' పిచ్చి కోపంతో అరిచాడు వేలాయుధం.

"ఇది న్యూ బార్లిక్స్ సార్..!" బీపీని కూడా కంట్రోల్ చేస్తుంది. పళ్ళికిలించి నటరాజనికి సీసా చూపించింది ఇంకో పిల్ల.

"నీ మొగుడ్ని మొసలి మింగాలా? నాకు బోడిగుండు చేయిస్తావా? నిన్నూ నీ పెళ్ళాన్నే మొసలి మింగాలి.. నీ పెళ్ళామే ముండమొయ్యాలి.. ఇష్టమైతే కొను లేకపోతే మానెయ్. ఏవనుకుంటునావో".. వీలున్నంత అసహ్యంతోనూ కోపంగానూ నటరాజన్ని చూస్తూ అంది సేల్సు ప్రమోటర్.

"ఎన్నడీ పేసరా? (ఏమిటే మాట్లాడుతున్నావ్?) ముందు నా ఇంటి ముందు నుంచి గెటౌట్!" అరిచాడు నటరాజన్.

"య్యోవ్.. ఈ రోడ్డు నీ బాబుది కాదు. గెటౌట్ అంటానికి. కష్టమర్లకి మా బార్లిక్స్ గురించి వివరించడం మా డ్యూటీ.. గెటౌట్ అంటే వెళ్ళిపోతామా? బార్లిక్స్ తాగితే ఎముకలకి ఏనుగంత పుష్టి. బార్లిక్స్ తాగే వాడి ఎముకల్ని భీముడైనా విరచలేడు. కావాలంటే చూసుకో.... రికమండెడ్ బై MBBS,FRCS,DOMT ఆర్థోపెడిక్స్" చూడమనట్టుగా నటరాజన్ చేతిలో పెట్టింది సేల్స్ ప్రమోటర్. పిచ్చి కోపంతో ఆ సీసాని ఎదుర్ంటి గోడకేసి కొట్టాడు నటరాజన్. ఆ సౌండ్ కి ఎదురింటి పరమ శివన్ బైటకొచ్చాడు. పగిలిన బాటిల్నీ నటరాజన్నీ మార్చి మార్చి చూశాడు. అన్నట్టు పరమశివం మలేషియా రిటర్న్. "ఎవడు ఈ బాటిల్ని మాగోడకేసి కొట్టింది?" సీరియస్‌గా అన్నాడు పరమ శివం.

"మర్యాదగా త్రీ హండ్రెడ్ ఇచ్చి ఈ ఫ్రీ పంచదార తీసుకోండి." మరింత సీరియస్‌గా నటరాజన్ వంక చూసి, పంచదార తీసింది సేల్స్ ప్రమోటర్. "యస్.. బార్లిక్స్ బాటిల్ కొన్నా.. పగలగొట్టినా రేటు ఒకటే.. నో రిబేట్" ఫర్మ్‌గా అన్నాడు మగ ప్రమోటర్.

"ముందు మా ఇంట్లో చెత్త తియ్యి" కరుగ్గా అన్నాడు వేలాయుధం.

"ఆ పగిలిన సీసా ముక్కలెవరు తీస్తారు?" బార్లిక్స్ వాళ్ళనీ, నటరాజన్నీ, వేలాయుధాన్నీ చూస్తూ గర్జించాడు పరమ శివం.

"దున్నేవాడిదే భూమి.. పగల గొట్టినవాడిదే సీసా... అంచేత ఆయనే తీయాలి!.." నటరాజన్ని చూపిస్తూ అంది సే. ప్ర.

"యస్. యూ ఆర్ రైట్.! నా ఇంట్లో కూడా చెత్తని విసిరింది ఈ మనిషే. ఆ చెత్తని ఊడ్చి బైట పారేయ్యాల్సిందీ ఇతనే!" ఆడ సే. ప్ర.కి సపోర్టిచ్చాడు వేలాయుధం.

"మీ దిక్కున్న చోట చెప్పుకోండి!... ఆ చెత్తా తియ్యను.. ఈ బాటిలూ తియ్యను, డబ్బు ఇవ్వను. పిచ్చి పిచ్చిగా వాగుతూ చేతిలో సీసా పెడితే పారెయ్యకో, పగల కొట్టకో ముద్దెట్టుకుంటారా? గేటు మూసెయ్యబోయాడు నటరాజన్.

"సీసా చేతికిస్తే పగలగొడతారా లేదా అన్నది కాదు పాయింటు. ఎందుకు ఎదుటి వాడి గోడకేసి పగలగొట్టావన్నదే కొచ్చిను. ఇహపోతే, ముదు పెట్టుకోవటం అనేది నీకూ ఆవిడకీ సంబందించిన వ్యవహారం. నా మటుకూ నాక్కావల్సింది మర్యాదగా ఆ సీసా ముక్కల్ని ఆ బార్లిక్స్ తో సహా శుభ్రంగా చేటకెత్తడం. ఆ ముండా బార్లిక్స్ అక్కడుంటే చీమలు పడతై.. ఆ తరువాత ఆ చీమలు పెట్టిన పుట్టల్లోకి పాములు చొరబడతై! పెరట్లో పాముల్ని పెంచుకోవాలని ఎవడూ అనుకోడు!" ముక్కు సూటిగా చెప్పదల్చుకునది చెప్పేశాడు పరమ శివం.

"ఐ విల్ నాట్ డు" గేటు మూశాడు నటరాజన్.

"ఓ.కె. నటరాజన్.. నువ్వూ రిటైర్డ్ గాడివి.. ఆ వేలాయుధమూ రిటైర్డే. మీరు పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇస్తే వెంట్రుక ముక్కంత కూడా లెక్క చెయరు. గోళ్ళూడి పోయిన సింహాలు మీరు, నేను గానీ ఒక్క కంప్లైంటు ఇస్తే, ఏమవుతుందో ఆలోచించుకోండి. మీ ఇళ్ళలో ఫోన్లు కట్ చేయిస్తా. వాటరూ, కరెంటూ కట్ చేయిస్తా.. పబ్లిక్ న్యూసెన్స్ కేసు పెట్టి మూడున్నర చెరువుల నీళ్ళు తాగిస్తా. నా కొడుకు హైకోర్టు లాయరు. ఒక్క గంట టైమిస్తున్నా. జస్ట్ ఒన్ అవరు.."

"నా గోడ దగ్గర సీసా పెంకులే కాదు, పిసరంత బార్లిక్స్ కూడా కనబడకూడదు!" వార్నింగిచ్చి లోపలికి వెళ్ళిపోయాడు పరమశివం.

"సార్ పోనీ టూఫిఫ్టీ ఇచ్చి పంచదార తీసుకోండి.. మేం చాలా ఇళ్ళు తిరగాలి. పొద్దున్నే 'ఎదవ బేరం' తగిలిందని సరిపెట్టుకుంటాం" అంది సేల్సు ప్రమోటర్.

"యస్! పంచదార తీసుకోకపోయినా కనీసం టూ ఫిఫ్టీ ఇవ్వక తప్పదు" డిక్లేర్ చేశాడు మగ సే.ప్ర.

"చచ్చినట్టు చెత్త తియ్యాల్సిందే.!" తనూ వార్నింగిచ్చాడు వేలాయుధం.

"ఏంటయ్యా మా ఆయన్ని ఇష్టం వచ్చినట్టు ఆడిస్తున్నారు? ఏంరా వేలాయుధం.. బేకరీలో పన్జేసే నీ కొడుకు దగ్గర మూడ్నెల్లు ఉండి రాగానే ఫారిన్ రిటర్న్ అయిపోయావా? నిన్నటి దాకా, అంతెందుకూ ఇందాగ్గాడా మీ ఆవిడ పాచిపోయిన అన్నం కూరగాయ పెచ్చులూ వెనక వాళ్ళ స్థలంలో పడెయ్యలేదూ? వాళ్ళకో ఫోన్ కొడితే చాలు. బుర్ర రాంకీర్తన పాడిస్తారు. ఏమే ఏబ్రాసీ.. ఎవడు దూరమన్నాడే నిన్ను మధ్యలో..? బార్లిక్సి బార్లిక్స్ అంటూ మా ఆయన ప్రాణం తీస్తావా? ఎవడో సంతానం గాడు రికమెండ్ చేశాడని సీసా ఆయన చేతికిస్తావా? ఆ బాటిల్ విసరాల్సింది గోడ మీదకి కాదు. నీ నెత్తిమీదకి.. ఏరా ఆడంగి రేకుల వెధవా? ఆడాళ్ళ వెనకాల తిరుగుతూ టూ ఫిఫ్టీ ఇచ్చి తీరాలంటావా? ఇంకో క్షణం అక్కడే నిలబడితే టూ ఫిఫ్టీ ఇస్తా చీపురుతో–" రైలింజన్లా దడదడా వచ్చి అరించింది మిసెస్ నటరాజన్.

"ఏంటే నీ గొప్ప? మా వాడు బేకరీలోనైనా పన్చేస్తున్నాడు! నీ కొడుకు మింగేది కోడలు డబ్బేగా? ఎవరి జాతకం ఎవరికి తెలీదు? గెటౌట్" అన్నాడు వేలాయుధం కోపంలో వెటకారం మిళాయించి.

"మరి తిరువెంగడం సంగతి?" ఎంక్వయిర్ చేశాడు సుందర పాండి.

"ఏడిశాడు.. కోడలికి డెలవరీ అయితే అక్కడికెళ్ళి రిటర్న్ టిక్కెట్టు కోసం బేబీ సిట్టింగ్ చేసొచ్చారు." ఈసడించాడు వేలాయుధం

"మరి పరమశివం?" పన్లో పనిగా అన్నాడు సుందర పాండి.

"నా టూఫిఫ్టీ ఇస్తారా పోలీస్ రిపోర్టు ఇవ్వనా?" అసహనంగా అరిచింది సే.ప్రా.

"యస్.. వియ్ విల్ రిపోర్ట్ ద మేటర్ టూ అవర్ బాస్... ఆయన హోం మినిస్టర్ తమ్ముడు... హీ విల్ బీ వెరీ సీరియస్..." కల్పించుకున్నాడు మగ సే. ప్ర.

"నేనూ వదల్ను.. ఐ విల్ సీ యువర్ ఎండ్!" అరిచాడు వేలాయుధం.

"మీ సంగతిలాక్కాదు!" గబగబా లోపలికి పోయి చీపురు కట్టతో పరిగెత్తుకొచ్చింది మిసెస్ నటరాజన్.

"బీ సీ సారూ.. ఇక్కడుండటం ప్రమాదం.. లెట్స్ రన్" అంటూ పరుగు లంకించుకున్నాడు సుందర పాండి

ఈ లోగా వేలాయుధం భార్య.. పరమ శివమూ & శ్రీమతి పరమ శివం కూడా 'గలాటా'లో జాయిన్ అయ్యారు.

మా ఆవిడ గబగబా వస్తూ కనిపించింది.

"ఏమిటీ యుద్ధాలు జరుగుతున్నాయటగా? నువ్వెక్కడ ఇరుక్కుంటావో అని భయపడి చచ్చా..." వగరుస్తూ అంది.

"మాటలు బోర్డరు దాటి ఇప్పుడే చేతుల్లోకి ప్రవేశిస్తున్నారు!" తాపీగా అన్నా, మా వీధి వాళ్ళంతా అరవడంలో ఎక్స్‌పర్ట్‌లే గానీ ఫైటింగ్‌లో జీరోలని నాకు బాగా తెలుసు.

"అసలే వీళ్ళందరూ బియ్యేస్సీలు (బి.ఎస్.సి అంటే బిపి, సుగర్, కొలెస్ట్రాల్) వెళ్ళి ఆపాలి!" అంటూ యుద్ధరంగం వైపు నడిచింది మా ఆవిడ, అరుపులూ తిట్లూ.. తిట్లూ అరుపులూ.. మళ్ళీ అరుపులూ మళ్ళీ తిట్లేగానీ! 'యాక్షన్' మాత్రం కనపడలా. మొత్తానికి ఓ గంట తరువాత గాలి చల్లగా వీచింది.

ఓ వారంలో మా వీధిలో పెను మార్పులు జరిగాయి. ఒకరి గుట్టు ఇంకొకరికీ ఆ తరువాత అందరికీ తెలిసినందు వల్లనేమో, 'రిటర్డ్' బోర్డులన్నీ మాయమై మామూలు నేమ్ ప్లేట్లొచ్చాయి. ట్రాక్ సూటూ, అరలాగూలూ పోయి అందరూ హాయిగా అడ్డ పంచెలతో లుంగీలతోటీ వాకింగ్ చేస్తున్నారు. మహా సంతోషపడ్డా, కానీ, ఓ రోజున మా ఇంటి ముందు ఓ బోర్డు వెలిసింది. దాని మీద శ్రీమతి బి.సి. అగినిప్రు రిటర్డ్ అని.

✹✹✹

# గురువిందగింజ - ఆర్.శర్మ.దంతుర్తి

**కారు పార్కింగ్** లాట్ లో పెట్టి గుళ్ళోకి నడిచాడు రాఘవరావు. చెప్పులిప్పుతూంటే లోపల్నుంచి పూజారి రాజయ్యగారి కంఠం వినబడుతోంది. ఎవరికో ధర్మ సందేహం తీరుస్తున్నారులా ఉంది. మొహం చిట్లించుకుని లోపలికి నడిచాడు.

గుడి కమిటీలో మెంబర్స్ అందరితోనూ చెప్పాడు రాజయ్యగార్ని పూజారిగా సెలక్ట్ చెయ్యొద్దని. కానీ ఎవరూ వినలేదు.

కారు నలుపు, వికారమైన స్ఫోటకం మచ్చల మొహం, దానికి తోడు నున్నటి గుండూ, దానిమీద ఓ పిలక. గుళ్ళో కొచ్చే జనం ఝడుసుకునేలా ఉంటుంది రాజయ్యగారి రూపం. అయితే నోరు విప్పాడా కంచు కంఠమే. వేద మంత్రాలు గానీ, పూజ మంత్రాలు కాని చదివితే నాలుగు రోడ్ల అవతలకి వినపడి తీరుతుంది. ఆగమ శాస్త్రం అంతా నోట్లో కదులుతూ ఉంటుంది. పూజలు చెయ్యడలో గానీ గుడి నిర్వహణ గానీ రాజయ్యగారి తర్వాతే ఎవరైనా. అయితేనేం? అనాకారుణ్ణి గుళ్ళో పూజారిగా పెడితే జనం పారిపోతారని రాఘవరావు కమిటీ మెంబర్స్‌తో వాదించాడు. ఈ దేశంలో ఈక్వల్ ఆపర్చ్యునిటీ అనే రూల్ ఉంది కనుక మనం రాజయ్యగార్నే సెలక్ట్ చేద్దాం అని రాఘవరావు మాటని తోసిరాజన్నారు. చెప్పొద్దూ, రాఘవరావుకి రాజయ్యగారిలో అనాకారి రూపం తప్ప మిగతావన్నీ నచ్చాయి కూడాను.

ఎంత బుర్రగోక్కున్నా రాఘవరావుకి అర్థం కానిదొక్కటే. రాజయ్య బ్రాహ్మడైతే పేరు అలాగ ఉందే? బ్రాహ్మల్లో రాజయ్య అనే పేరు విన్నట్టు రాఘవరావుకి గుర్తులేదు. అదే చెప్పాడు. కమిటీ మెంబర్స్ తోటి. మేము చెక్ చేశాం, ఆయన బ్రాహ్మడే అని చెప్పారు రాఘవరావుతో. మొహం చూస్తే ఈయన బ్రాహ్మడేనా అనిపించదూ?...

ఆలోచనలు కట్టిపెట్టి రాఘవరావు గుళ్ళోకెళ్ళి దేముడికో దణ్ణం పెట్టుకున్నాక ఓ వారగా నిలబడ్డాడు.

రాజయ్యగారు మిగతా అందర్నీ పంపించేసాక రాఘవరావు దగ్గరకొచ్చి "బాగున్నారా? ఎప్పుడు ప్రయాణం? టిక్కట్లూ అవీ అమరాయా మీకు" నవ్వుతూ అడిగాడు.

"రేపు సాయంత్రం వెళుతున్నానండి. అన్నీ అమరాయి దేముడి దయవల్ల. మీకు ఏదో కావాలన్నారటా ఇండియా నుంచి. చెప్పండి. చేతనైతే, వీలుంటే తీసుకొస్తాను."

"ముందు మీరు ఏ ఊరికెళుతున్నారో చెప్పారు కాదు"

"నేను వెళ్ళేది ధవళేశ్వరం, రాజమండ్రి పక్కన. ముందు అక్కడ మా వాళ్ళని పలకరించి తర్వాత హైదరాబాదు అవీ చూసి మూడు వారాల తరువాత వెనక్కి వస్తాను."

ధవళేశ్వరం పేరు వినగానే రాజయ్యగారి మొహంలో రంగులు మారడం గమనించాడు రాఘవరావు.

"ఇప్పుడే వస్తానుండండి," అని లోపలికి వెళ్ళాడు రాజయ్యగారు.

ఓ పది నిముషాలు పోయాక వెనక్కొచ్చారు "ఇప్పుడేమీ వద్దులెండి. ఏదో చిన్న వత్తుల పెట్టె లాంటిది తెప్పించుకుందాం అనుకున్నాను. కానీ లోపల చూస్తే మా దగ్గర వత్తుల పెట్టె ఉంది. మీకు లేనిపోని శ్రమ. అదీగాక మా దగ్గర ఉంది కూడాను. క్షేమంగా వెళ్ళి లాభంగా రండి. తీర్థ, ప్రసాదాలు ఇస్తాను రండి." అంటూ మరో మాటకు తావియ్యకుండా గర్భగుళ్ళోకి నడిచాడు రాజయ్య.

ప్రసాదం తీసుకున్నాక మళ్ళీ అడిగాడు రాఘవరావు. "నాకేమీ శ్రమ లేదు. మీకు ఏదో కావాలని గుడి కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మికాంత్ జడేజా గారితో అన్నారుట. ఆయన నన్ను వెళ్ళమంటే నేను నలభైమైళ్ళు డ్రైవ్ చేసుకుని ఇక్కడకి వచ్చాను. ఏమీ అనుకోను చెప్పండి మీకేం కావాలో."

"ఏమీ వద్దండి. మీకు శ్రమ ఇచ్చినందుకు క్షమించాలి. మరోలా అనుకోకండి." ఈసారి రాజయ్య మొహంలో సీరియస్‌నెస్ రాఘవరావుని ఆశ్చర్యపరచింది. ఇంక చేసేదేంలేదు కనక ప్రసాదం చేత్తో పట్టుకుని ఇంటికి బయలుదేరాడు.

✹✹✹

అమెరికాలో బయలుదేరి మూడు విమానాలు మారి గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాక మర్నాడు రాజమండ్రిలో దిగాడు రాఘవరావు. స్టేషన్‌కి వచ్చిన అన్నయ్య కొడుకు భాస్కరం పలకరించాడు, "బాబయ్యా, బావున్నావా?" ఆశ్చర్యపోయాడు ఆరడుగుల కుర్రాణ్ణి చూసి. టాక్సీ మాట్లాడుకుని భాస్కరం చెప్పే కబుర్లు వింటూ తెల్లవారక ముందే ధవళేశ్వరంలో గూటికి చేరాడు రాఘవరావు. పనిపిల్ల ఇంకా రాలేదులా ఉంది. నూతి దగ్గర అంట్లు అలాగే ఉన్నాయి. గుమ్మం దగ్గిర ముగ్గు వేసినట్లు లేదుకూడా. అయినా గంట ఆరు అవ్వందే ఇవన్నీ ఎలా పూర్తవుతాయ్? ఇంట్లోకి నడుస్తూంటే, పూజ గదిలోంచి రాఘవ అన్నయ్య రామం చెయ్యూపాడు పలకరింపుగా నవ్వుతూ. భాస్కరం సామాను లోపల పెట్టాడు.

"నువ్వు పూజలో ఉన్నావన్నమాట. సరే కానియ్యి. నేను మొహం కడుక్కుని వదినతో మాట్లాడుతూ ఉంటాను ఈ లోపున" అన్నాడు అన్నతో రాఘవ.

పావుగంట పోయాక వదిన ఇచ్చిన ఫిల్టర్ కాఫీ తాగుతూ కబుర్లు మొదలుపెట్టాడు.

కాటన్ బ్రిడ్జి ఇంకా బాగానే ఉంది, ఈ మధ్య వర్షాలు సరిగ్గా పడట్లేదు, భాస్కరం చదువు వచ్చే ఏడు అయిపోతూంది కనుక అప్పుడే అమెరికా వెళ్ళడానికి పరీక్షలు రాస్తున్నాడు అనేవి చెపుతూ రాఘవ దగ్గర్నించి ఆవిడ సమాచారం రాబడుతోంది. పిల్లల్ని తీసుకు రావడం లేదు.. ఇలా ఆది, అంత్య నిష్టూరాలు అయ్యేసరికి రామం పూజ అయిందనిపించి బయటకొచ్చి

"ఇప్పుడు చెప్పు ఏమిటి విశేషాలు? ప్రయాణం సుఖంగా జరిగిందా?" అన్నాడు తమ్ముడితో.

"బాగానే జరిగిందిరా అన్నాయ్. నువ్వు ఎన్ని చెప్పు, ఈ విమానంలో ప్రయాణం కంటే కాకినాడ పాసింజర్‌లో పడుకుని తిరుపతి వెళ్ళడం ఈజీ. అదీగాక ప్రతీ ఎనిమిది గంటలకి విమానం మారడం, వాళ్ళిచ్చే గడ్డి తినలేక పోవడం అనేవి తప్పిస్తే ప్రయాణం సుఖంగా జరిగినట్టే."

"ఈసారైనా మూడు నెలలు ఉండాలి ఇక్కడ. ఏడు సంవత్సరాలు పోయాక వచ్చావు నువ్వు."

"మూడు నెలలా? ఇంకా నయం. మూడు ఏళ్ళన్నావు కాదు. మూడు వారాలు శెలవు ఇవ్వడానికే ఏడిచాడు మా బాసు. వచ్చే పదో తారీఖుకి నేను ఉద్యోగంలో ఉండాలి అదిగాక మధ్యలో హైదరబాదు ట్రిప్పూ, మిగతా చూడాల్సినవీ అవీ ఉన్నాయి కదా?"

"అయ్యో అలాగా? సరే పోయి స్నానం చేసి సంధ్యావందనం చేస్తావా?"

"లేదురా, ఆ సంధ్యావందనం, పూజలూ అవీ మానేసి చాలారోజులైంది."

"ఒర్నీ, మెడలో జంజేప్పోస కూడా లేదా అయితే?"

"లేదురా అన్నాయ్. ఎప్పుడో కుదిరినప్పుడు గుళ్ళోకెళ్ళి ఓ నమస్కారం పెట్టుకోవడం తప్ప ఇవన్నీ ఎక్కడ కుదురుతాయ్? ఎప్పుడైనా ఇంట్లో వ్రతం చేసుకున్నప్పుడో, ఏదో శుభకార్యం జరిగితేనో ఓసారి వేసుకుంటాను తప్ప మిగతా టైములో కుదరట్లేదు."

"మీకు అక్కడ గుడి కూడా ఉందా బాబయ్యా ?" ఇదంతా శ్రద్ధగా వింటున్న భాస్కరం అడిగాడు కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా.

"ఎందుకులేదు? గుడి ఉంది, తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆగమ శాస్త్రం చదువుకున్న పూజారులూ ఉన్నారు."

"పూజార్లు అంటున్నావ్. ఎంత మందేం?"

"ఇద్దరు ఉండేవారు. కానీ ఇప్పుడు రాజయ్య అని మూడో ఆయన్ని తీసుకొచ్చారు. సో, మొత్తం ముగ్గురు."

"రాజయ్యా?" భాస్కరం ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది. తండ్రికేసి చూసాడు అనుమానంగా.

"అందరు రాజయ్యలూ మనకి తెలుసున్న రాజయ్యలౌతారా ఏమిటి. ఇంక నోరు మూసుకో.." రామం భాస్కరాన్ని కసిరి మాట మార్చాడు. కాసేపు ఈ మాట ఆ మాట అయాక స్నానానికి లేచాడు రాఘవ.

❁ ❁ ❁

మర్నాడు పొలం చుడ్డానికి రాఘువని బయలుదేరదీసాడు రామం. ఇద్దరూ ముందు నడుస్తూంటే వెనగ్గా భాస్కరం వస్తున్నాడు కబుర్లు చెపుతూ. రాఘవ భాస్కరం చదువు గురించి ఆరా తీసాడు.

"వచ్చే ఏడు డిగ్రీ పూర్తైపోతూంది. టెస్టులన్నీ ఈ డిసెంబర్లో రాస్తున్నాను. ఎడ్మిషన్ వస్తే వచ్చే ఏడు ఈ పాటికి అమెరికా వద్దామని అనుకుంటున్నాను." అన్నాడు భాస్కరం.

"ఇంతకీ నువ్వు ఏ బ్రాంచి, ఎక్కడ చదువుతున్నావో చెప్పలే దొరే. నేను క్రితం సారొచ్చినప్పుడు నువ్వు స్కూల్లో చదువుతున్నట్టు గుర్తు" రాఘవ అన్నాడు ఎపాలజిటిగ్గా.

"నేను చదివేది కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీలో. మూడో ఏడు. ఎలెక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్. కానీ అందరూ అమెరికా అయితే ఎమ్.ఎస్ కంప్యూటర్ సైన్స్ చదవమని చెపుతున్నారు. ఇంకా డిసైడ్ చేసుకోలేదు మరి. నువ్వేమంటావ్ బాబయ్యా?"

"కంప్యూటర్ సైన్స్ మంచిదే. ఈ మధ్య అమెరికాలో తెలుగువాళ్ళు చాలామంది కంప్యూటర్ కోర్సులకే వస్తున్నారు కూడాను."

"ఇక్కడకూడా అంతే. అసలు ఇక్కడ ఓ జోకు ఉంది. అమెరికా వీసా ఇద్దరికే ఇస్తారుట - ఒకటి కంప్యూటర్ సైన్స్ వాళ్ళకీ, రెండు, హిందూ గుళ్ళో పూజారులకీ." నవ్వుతూ చెప్పాడు భాస్కరం. జోక్‌కి రామంతో పాటు రాఘవ కూడా నవ్వాడు. కాసేపు నిశ్శబ్దంగా నడిచాక సడన్ గా అడిగాడు రాఘవ.

"పూజారి అంటే గుర్తొచ్చింది. నిన్న నేను రాజయ్య పేరు చెపితే మాట మార్చావు అన్నయ్యా. మీకు రాజయ్య అనే ఆయన తెలుసా?"

ఆ సారి తప్పించుకోలేకపోయాడు రామం.

"అవున్రా. మన పరమేశ్వర శాస్త్రిగార్నెరుగుదువా? పాత వీధిలో ఉండే వేద పండితులు?"

"పరమేశ్వర శాస్త్రిగారు తెలీక పోవడమేమిటి. చెప్పు."

"ఆ మధ్యనొక్క అబ్బాయిని చేరదీసి చదువు చెప్పించారు. ఆ కుర్రాడి పేరే రాజయ్య. ఆయన పట్టుబట్టి ఆ కుర్రాడ్ని తిరుపతి వేద పాఠశాల్లో జేర్పించారు. ఆ తర్వాత ఎక్కడో రాయలసీమలో ఉద్యోగం వచ్చి ఆ కుర్రాడి బతుకు అతను బతుకుతున్నాడు. కానీ చేరదీసినప్పటునుంచి, ఈయన్ని ఇక్కడ తక్కువగా చూడ్డం మొదలెట్టారు."

"ఎవర్నో చేరదీసారని వినడం గుర్తుంది. కానీ ఎందుకు తక్కువగా చూడ్డం?"

"రాజయ్య మాలవాళ్ళబ్బాయిటా!" చటుక్కున మాట జారాడు భాస్కరం, తండ్రి నోరు తెరిచే లోపుల.

"ఏవిటీ?" గొంతు పెగుల్చుకుని అన్నాడు రాఘవ వెనక్కి తిరిగి నమ్మలేనన్నట్టుగా. భాస్కరం మాట్లాడలేదు.

రామం చెప్పడం మొదలెట్టాడు. "ఆ మధ్య వచ్చిన గోదావరి వరదల్లో మాల పేట పూర్తిగా కొట్టుకుపోయింది. చాలామంది పోయారు పాపం. ఈ రాజయ్య అప్పటికి చిన్నపిల్లాడు. తల్లీ తండ్రీ వరదల్లో పోతే దిక్కులేనివాడైపోయాడు. అందరూ తలో చెయ్యి వేసి సహాయం చేద్దాం అంటే మనవాళ్ళకి కులం అడ్డొచ్చింది. ఏం చెయ్యాలా అనే మీ మాంసంలో ఉండగానే పరమేశ్వర శాస్త్రిగారు పెంచుకుంటాను ఇవ్వండి అని ఇంటికి తీసుకొచ్చారు."

"ఎంత ధైర్యం. ఊళ్ళోవాళ్ళేమీ అనలేదా?"

"ఎందుకనలేదు? ఆయన్ని పిలవడం మానేసారు పూజలకి వాటికీ. ఆయన గవర్నమెంట్ ఉద్యోగం ఆయన చేసుకుంటూ బతికాడు. ఆయన మాత్రం మానవ సేవే మాధవ సేవ అని చెప్పి ఏ మాత్రం జంకు లేకుండా పెంచాడు కుర్రాడ్ని. ఇంట్లో వేదం నేర్పించాడు కూడా. రాజయ్య అఖండుడు. ఎంతో కష్టపడి మనకే నోరు తిరగని మంత్రాలన్నీ శాస్త్రి గారిదగ్గిర్నుంచే నేర్చుకున్నాడు. ఆ తర్వాత వాడి కోరిక మీదే వాణ్ణి తిరుపతి వేద పాఠశాల్లో జేర్పించారు. "

"తిరుపతిలో ఏమీ అడ్డంకి రాలేదా చేర్చుకోవడానికి?"

"శాస్త్రిగారు ఇంటిపేరు తనదే పెట్టారు రాజయ్యకి. ఇంకేం అడ్డం? ఇంటిపేరు మంగళంపల్లి అనేసరికి ఇంకెవరికి అనుమానం? అదీగాక అక్కడ అప్లికేషన్‌లో కిందన తండ్రిగా శాస్త్రిగారి సంతకం ఉండనే ఉంది. ఇంకో విషయం తెల్సా? అక్కడ పెట్టిన వేదోచ్చారణ టెస్టుల్లో అన్నింట్లో రాజయ్య ఫస్ట్ మార్కు సంపాదించేట్ట."

"అయితే ఇప్పుడు మా ఊళ్ళో ఉన్న రాజయ్య, నువ్వు చెప్పిన రాజయ్యా ఒక్కరేనా?"

"మాకెలా తెలుస్తుందిరా రాఘవా? ఇక్కడ రాజయ్య అయితే మొహం మీద స్ఫోటకం మచ్చలు, గుండూ, పిలకా, కంచు కంఠం అవీ చూస్తే గుర్తు పట్టగల్ను నేను. మీ ఊళ్ళో రాజయ్యని నేను చూళ్ళేదు కదా?"

"నువ్వు చెప్పేది చూస్తుంటే, ఈ రాజయ్యే మా గుళ్ళో పూజారి." స్థిరంగా అన్నాడు రాఘవరావు. తాను వెళ్ళేది ధౌళేశ్వరం అనగానే రాజయ్య మొహంలో రంగులు మారడం, ఏం కావాలని తాను అడిగాక వెళ్ళే ఊరు గురించి అడగడం అన్నీ ఒక్కొక్కటే

గుర్తొచ్చాయి రాఘువకి. "మొత్తం మీద రాజయ్య ఎవరో తెలిసిపోయింది" అన్నాడు కాస్సేప్పోయాక రాఘువ నోరు పెగుల్చుకుని. గుడి కమిటీలో దీన్ని గురించి ఎలా చెప్పాలా అని అప్పుడే రాఘువరావు ప్లాన్ చేసుకోవడం మొదలు పెట్టాడు.

ఇండియా ట్రిప్పుకి మూడు వారాల శెలవు అంటే ఎంతసేపు? అలా హైదరాబాదూ, ఇలా అన్నవరం చూసొచ్చేసరికి వెళ్ళవలిసిన రోజు దగ్గరకొచ్చింది. భాస్కరానికి అమెరికా రావడానికి చెప్పవలసినవన్నీ చెప్పి, వదిన ఇచ్చిన లడ్డూలు, కారప్పూసా, నాలిక బద్దలూ మొదలైనవన్నీ పేక్ చేసుకుని తిరుగు ప్రయాణం మొదలుపెట్టాడు రాఘువ. అమెరికా వచ్చే సరికి ఇంట్లో ఆల్రడీ గుడి కమిటీ నుంచి వచ్చిన రెండు వారాల్లో జరగబోయే మీటింగ్ ఇన్విటేషన్ ఎదురుచూస్తూ ఉంది. రెండు వారాల్లో జెట్ లాగ్ తీరిపోతుందిలే అనుకుంటూ నడుం వాల్చాడు.

కమిటీ మీటింగ్ దగ్గరకొచ్చేవరకూ రాఘువరావు ఆత్రుత పెరిగిపోతూంది రోజురోజుకీ. రెండు వారాలు గడిచాయి. కమిటీ మీటింగ్ మొదలై ప్రెసిడెంట్ చెప్పవల్సిన విషయాలు చెప్పేసాక రాఘువ అన్నాడు, "నేను మీకు చెప్పాల్సిన విషయం ఒకటి ఉంది." ఇండియా ఈ మధ్యే వెళ్ళొచ్చిన రాఘువరావు ఏదో చెపుతాడనేసరికి అందరికీ కుతూహలం పుట్టుకొచ్చింది. రాఘువ చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను ఇండియా వెళ్ళినప్పుడు తెల్సింది. మన ప్రీస్ట్ రాజయ్య మాలవాడు."

"మాల అంటే" అడిగాడు నార్త్ ఇండియన్ జడేజా అర్థంకాక.

"మాల అంటే షెడ్యూల్ కులం, జాతిలాంటివి," చెప్పాడు ఇంకో మెంబరు కుటుంబరావు.

"రాజయ్యగారు ఇక్కడ పనిచేస్తున్నప్పట్నుండీ మనకి బాగానే ఉంది. గుడికొచ్చే జనం ఆయన్ని బాగానే చూస్తున్నారు. ఆయనొచ్చాక పని అంతా ఆయనే చూస్తూ మనకి వెసులుబాటు కల్పించారు. ఆయన హిందీతో పాటు రెండు మూడు భాషలు మాట్లాడుతున్నారు కూడా. ఎప్పుడో ఇండియాలో ఉన్నప్పుడు ఆయన కేస్ట్ గురించి ఇప్పుడు పట్టించుకోవాల్సిన అవసరం ఏముంది?" జడేజా అడిగాడు.

ఎవరూ మాట్లాడలేదు. రాఘువరావే చెప్పాడు. రాజయ్య గురించి, చిన్నప్పుడు మాలవాడుగా పుట్టడం, పరమేశ్వర శాస్త్రిగారు పెంచుకోవడం అన్నీను. అన్నీ విన్నాక జడేజా అన్నాడు.

"రాఘువరావ్, పుట్టినప్పుడు మాలవాడే రాజయ్య. కానీ బ్రాహ్మడిగానే పెంచబడ్డాడు కదా? నాకు తెలిసినంతలో రాజయ్య మంచి పండితుడు, మనకున్న పూజారుల్లో ఉత్తముడూను. ఈ కాస్ట్ సంగతి మనం మర్చిపోవచ్చనుకుంటా. ఇండియా రూల్స్ ప్రకారం అయితే సముద్రం దాటిన ప్రతీవాడూ, రాముడితో సహా, మాలవాడే సో, నేను, మీరు కూడా మాలవాళ్ళమే. అంచేత నాకైతే ఏమీ ప్రోబ్లం కనిపించడంలేదు మరి. కావలిస్తే రాజయ్యగారినే అడుగుదాం."

"పిలవండి ముందు, అసలు రాజయ్య పండితుడో కాదో చూద్దాం," అన్నాడు రాఘువరావు.

నిప్పులు కడిగే వంశంలో పుట్టిన అతనికెలాగో ఒకలాగ రాజయ్య అనే మాలవాడ్ని గుళ్ళోంచి బయటకి పంపించాలని ఉంది. ఆ క్షణంలో రాఘువరావుకి తాను బ్రాహ్మణ్ణనే అహంకారం తప్ప, తాను సంధ్యావందనం మానేసినట్టుగానీ, జంధ్యం తీసేసినట్టుగాని గుర్తు రాలేదు. బ్రాహ్మణత్వం పుట్టుకతోనే వస్తుందా? గురువింద గింజకి తన నలుపు ఎప్పటికీ కనిపించదా?

"సరే మీరే వెళ్ళి ముందు పూజారి శివరామశాస్త్రిగార్ని పిలవండి" అన్నాడు జడేజా.

"ఆయనెందుకు మధ్యలో?"

"చెపుతాను కదా. వెళ్ళి పిలుచుకు రండి." పూజారి వచ్చాక కూర్చోమని చెప్పి అడిగాడు జడేజా.

"ఏదో మాటల్లో వచ్చింది మా మధ్య చిన్న డౌటు. మీకు తెలుస్తుందని పిలిచాం. సంకల్పంలో ఇలా చెపుతాం కదా? శ్రీ మహా విష్ణోర్జాజ్ఞయా ప్రవర్త మానస్య, ఆద్య బ్రహ్మణ ద్వితీయ పరార్ధే శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే.. ఆ మంత్రంలో శ్వేత వరాహ కల్పం అనే పేరు ఎలా వచ్చిందీ అని మల్లగుల్లాలు పడుతున్నాం. మీకు తెలుస్తుందేమో చెప్పగలరా?" జడేజా అడిగాడు. ఇదేం పిచ్చి ప్రశ్న అనుకుంటూ రాఘవరావు దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

"పరం అంటే కొన్ని మహా యుగాలు కలిపి, అనేక లక్షల సంవత్సరాలు. ప్రతీ పరంలో ఒక్కో కల్పం జరుగుతూ ఉంటుంది. ఈ కల్పం పేరు శ్వేత వరాహ కల్పం అని మాకు వేద పాఠశాల్లో నేర్పించారు. అంతకు మించి ఇలాంటివి వాటికి అర్ధం చెప్పరు. అయినా భక్తి ఉండాలి గానీ ప్రతీ అక్షరానికి అర్ధం తెలుసుకోవడం దేనికండి?"

"సరే మీరు వెళ్ళి గుళ్ళో పనులు చూసుకోండి. ఏదో ఒక్కొక్కప్పుడు మాకు ఇలాంటి వెర్రి సందేహాలు వస్తే మిమ్మల్ని అడుగుతూ ఉంటాం తప్ప వేరే ఇంకేమీ లేదు. మీరు వెళ్ళాక కాస్త రాజయ్యగార్ని ఇలా మేము రమ్మన్నామని చెప్పండి. ఆయన వీసా గడువు ఐపోక ముందే దాని గురించి మాట్లాడాలి."

రాజయ్య లోపలికి రాగానే ఆయన్ని ఇదే ప్రశ్న అడిగారు కమిటీ మెంబర్స్. రాజయ్య చెప్పడం మొదలుపెట్టాడు.

"నాలుగు యుగాలు - సత్య, త్రేతా, ద్వాపర, కలి - అవి కలిస్తే ఒక మహాయుగం. వెయ్యి మహాయుగాలు కలిపితే ఒక కల్పం. ఒక కల్పం జరగగానే ప్రళయం వచ్చి అన్నీ ఏకమవుతై. అలాంటి ఒక ప్రళయ సమయంలో హిరణ్యాక్షుడు భూమిని రసాతలంలో ఉంచడం వల్ల విష్ణువు వరహావతారం ధరించి వాణ్ణి సంహరించాడు అని మీకు తెలుసు. మహా విష్ణువు తెల్లని వరాహ రూపుడై భూమిని ఉద్ధరించాడు కనుక మన కల్పానికి 'శ్వేత వరాహ కల్పం' అని పేరు పెట్టారు. ఇప్పుడు మనకి ఉన్న మనువు వైవశ్వతుడు. అందుచేత 'శ్వేత వరాహ కల్పే వైవశ్వత మన్వంతరే' అనడం."

కాసేపు మాట్లాడాక రాజయ్యని వెళ్ళనిచ్చి రాఘవ రావు కేసి చూసారు కమిటీ, "ఇప్పుడేం చెపుతావ్?" అన్నట్టు.

"ఒక మాలవాడు గర్భగుళ్ళో పూజలు చేస్తూ మన నెత్తిమీద శఠగోపం పెడుతున్నాడంటే ఏదోలా ఉంది నాకు. మీరు కూడా ఆలోచించండి."

జడేజా ఇదంతా విని అన్నాడు "రాఘవ్, మీ ఆఫీసులో పనిచేసే నల్లవాళ్ళు ఏ కాస్ట్? బ్రాహ్మణత్వం అనేది మనిషిని బట్టిగానీ పుట్టుక వల్ల ఎలా వస్తుంది? మీరు బ్రాహ్మలే కానీ రోజూ పూజా పునస్కారాలు చేస్తున్నారా? ఏదీ చూద్దాం మీరు జంధ్యం వేసుకున్నారా? మీరు ఇప్పుడే చూసారు కదా మన బ్రాహ్మణ పూజారి గారి నాలెడ్జ్ అదీగాక ఈ దేశంలోఈక్వల్ ఆపర్చ్యునిటీ మనం పాటించి తీరాలి. ఇప్పటిదాకా ఎవ్వరూ మమ్మల్ని అడగలేదు రాజయ్య గురించి. ఎవరికీ అభ్యంతరం ఉన్నట్టు లేదు. మాకు ఏమీ అభ్యంతరం లేనప్పుడు మీకు మాత్రం ఎందుకు? వియ్ ఆర్ హేపీ విత్ ప్రీస్ట్ రాజయ్య."

"ఆయన అందరి ఇళ్ళల్లోనూ పూజలు చేయించి అక్కడే వెనకా ముందూ చూడకుండా భోజనం చేసేస్తున్నాడుట."

"ఏం తప్పు అది? మీరు హోటల్లో భోజనం చేస్తే అది ఎవరు వండుతున్నారో మీకు తెలుస్తోందా? అది వండేవాడు బ్రాహ్మడా?" కాస్త కోపంగానే అన్నాడు ఈసారి జడేజా. "మీకు తెలియదేమో, మాంసం తినేవాళ్ళు, నాన్ బ్రాహ్మిన్స్ కూడా పూజారులని ఇంటికి పిలిస్తే బ్రాహ్మల కన్నా జాగ్రత్త తీసుకుని శుచిగా వండి పెడతారు. మీ బ్రాహ్మలకే అన్నీ అనుమానాలు కానీ. మీకు తెలియదేమో నార్త్ ఇండియన్స్ చాలామంది బ్రాహ్మలు మాంసం తింటారు."

రాఘవరావు నోరు విప్పబోతూంటే, పక్కనుంచి ఇంకోకమిటీ మెంబర్ చెప్పాడు "రాఘవరావు గారు, మీకు ఇష్టం ఉంటే గుడికి రండి. కష్టం అయితే మానేయండి. మీరు చెప్పిన కథ ప్రకారం రాజయ్య మాలవాడే, అయితేనేం? మాకు ఆయన పట్ల ఆదరం గౌరవం

ఉన్నాయి ఎందుకంటే ఆయన చదువులో, శాస్త్రంలో బ్రాహ్మడే మాకు. మీరు పుట్టుకతో బ్రాహ్మలైనా బిహేవియర్‌లో మాల కన్నా హీనంగా ఉన్నారు. ఆయనకున్న నాలెడ్జ్ మాకు తెలుసు. ఇప్పుడు టెస్ట్ చేసి చూసాక మీకూ తెలుసు. ఆయన ఇక్కడే ఉంటాడు. ఇంక దీనిమీద డిస్కషన్ అనవసరం. ఇప్పటికే దీనిమీద చాలా టైం తగలేసాం. వెళదాం పదండి." అంటూ లేచాడు.

రాఘువరావు బయటకొచ్చాడు అందరూ వెళ్ళిపోయేదాకా ఆగి. గుళ్ళో కెళ్ళబుద్ధికాలేదు. కాసేపు అటూ ఇటూ తచ్చాడాక వెనకనుంచి రాజయ్య మాట వినపడింది. "రాఘువరావు గారు రండి. ప్రసాదం తీసుకోండి."

లోపలకెళ్ళాడు రాఘువరావు. అందరూ వెళ్ళిపోయాక రాజయ్య రాఘువరావుతో ఇలా అన్నాడు. "మీరు మాట్లాడింది నాకు చేరింది. ఎలాగ జేరింది అని అడక్కండి. మీకు ఉన్న అభ్యంతరం ఏమిటో చెపుతారా? నా తప్పైతే వెంటనే దిద్దుకుంటాను."

రాఘువరావు ఏమీ చెప్పలేకపోయాడు. ఏవుంది చెప్పడానికి?

రాజయ్యే అన్నాడు, "నేను పుట్టినప్పుడు సాకిన తల్లీ తండ్రీ ఎవరో నాకు గుర్తులేదు. కాని నన్ను పెంచిన నాయనగారు పరమేశ్వర శాస్త్రిగారు నాకోసం జీవితాన్ని వదులుకుని వెలివేయబడ్డారు సొంత ఊరిలో. ఆయన దాన్ని లక్ష్యపెట్టలేదు. అలాంటివారి ఇంట్లో శాస్త్రిగారి భార్య సాక్షాత్తూ అన్నపూర్ణమ్మగా నాకు భిక్షపెట్టి వేదం నేర్పించారు నాకు. పట్టుదలతో నేను నేర్చుకున్నాను. ఏనాడూ శాస్త్రిగారు నన్ను ఇది చెయ్యి అది చెయ్యి అని బలవంతం చెయ్యలేదు. ఆయన కొడుకులే నేర్చుకోనన్నప్పుడు, నేనే వేదం నేర్చుకుని ఆగమ శాస్త్రం నేర్చుకుంటానన్నాను. మొహం మీద స్ఫోటకం మచ్చలు గుండు పిలకా అంటారా? అవి నాకు నచ్చినవి, చిన్నప్పటినుంచీ ఉన్నవి. ఇప్పుడు నేను అమెరికా వచ్చినందుకు జుట్టు పెంచి నీట్‌గా క్రాప్ చేయించుకోమంటారా? అలా చేస్తే ఈ రాజయ్య మంచి వేషాలు మారుస్తున్నాడే అని మీరే అంటారు కదా? చెప్పండి నన్ను ఏం చెయ్యమంటారు?"

ఒక్కో మాట శూలంలా పొడుస్తూ ఉంటే, రాఘువరావు బుర్ర వంచుకుని విన్నాడు. కళ్ళెత్తి చూసే సరికి రాజయ్య మసగ్గ కనిపించాడు. ఇంటికి వెళ్ళడానికి బయలుదేతూంటే వెనకనుంచి రాజయ్య కంఠం వినిపించింది "నేను మీ కూడా వస్తాను ఉండండి."

కారు దగ్గరకొచ్చేసరికి రాజయ్య పైన కప్పుకున్న అంగవస్త్రం తీసి లోపలున్న బనీను పక్కకి తప్పించాడు. రాఘువరావు ఆశ్చర్యపోయాడు ఇంత చలిలో రాజయ్య లోపలి బట్టలు కూడా తీయడం చూసి. ప్రశ్నార్థకంగా రాజయ్య కేసి చూసాడు. ఛాతీ మీద ఉన్న పెద్ద పుట్టుమచ్చ చూపించి వెంటనే బట్టలు మామూలుగా తొడుక్కున్నాడు రాజయ్య.

మొహంలో చిరునవ్వుతో "ఇప్పుడర్థం అయిందా?" అన్నట్టు రాఘువరావుకేసి చూసాడు.

ఒక్కసారి నెత్తిన పిడుగు పడ్డట్టైంది రాఘువ రావుకి. ధవళేశ్వరంలో పరమేశ్వర శాస్త్రిగారు తమ ఇంటికొచ్చినప్పుడు తనూ అన్న రామం అదే పనిగా ఆయన ఛాతీ మీద పుట్టుమచ్చ గురించి మాట్లాడుకోవడం గుర్తొచ్చింది. రాజయ్య నిజంగానే శాస్త్రిగారి కొడుకా? రాజయ్య చేతులొక్కసారి పట్టుకుని "మీరు, మీరు.." అని మాత్రం అనగలిగాడు.

రాజయ్య మెల్లిగా తలపంకించాడు అవునన్నట్టుగా. "బాధ్యతలు పెద్దగా తెలీని ఉడుకు వయస్సులో శాస్త్రిగారు, మా అమ్మా చేసిన తప్పుకి నేను ప్రత్యక్ష సాక్ష్యం. మాలపల్లె కొట్టుకుపోయాక పేరూ ప్రతిష్టలూ అన్నీ ఒదులుకుని నన్ను ఎందుకు పెంచుకున్నారో ఇప్పుడు మీకు అర్థం అయిందా? మా ఇద్దరికీ ఉన్న పోలికలు పట్టిగ్గా కనపడకుండా ఉండడానికి ఎంత జాగ్రత్త తీసుకున్నారో? ఒకసారి నేను కడుపులో పడ్డాక గొడవలు రాకుండా ఉండడానికి మా అమ్మ ఎంత జాగ్రత్త తీసుకుందో మీరు ఊహించగలరా? మొత్తం మాలపేట శాస్త్రిగారి ఇంటిమీదకి వెళ్ళి సర్వనాశనం చేయగలరు కానీ అమ్మ ఎవ్వరికీ చెప్పలేదు. ఇంక ఆ విషయాలు చెప్పుకోకపోవడమే మంచిది. శాస్త్రిగారి ఆవిడ నాకు పినతల్లే కానీ నాన్నగారు ముందు చెప్పారో ఏమో మరి, ఒక్కసారి కూడా నా దగ్గిర గాని ఎవరి దగ్గరకానీ ఆ ప్రస్తావన చేయలేదు. నాన్నగారికి పేరేకాదు, ఇంట్లో నా మూలంగా ఆవిడతో సహజీవనం కూడా కరువైంది నేను వెళ్ళాక. అయితేనేం? ఏటికి ధైర్యంగా ఎదురీది నన్ను పెంచారు. బ్రాహ్మడవడానికి జన్మతః కులం కారణం ఐతే, ఇప్పుడు చెప్పండి, నేను బ్రాహ్మణ్ణేనా?"

కళ్ళు బైర్లు కమ్ముతూంటే మాటరాక నిలబడిపోయాడు. రాఘవరావుని అలా వదిలేసి రాజయ్య గుళ్ళోకి వెనక్కి నడిచాడు. కాసేపటికి తేరుకుని కారు స్టార్ట్ చేసి ముందుకి పోనిస్తూ అలవాటు ప్రకారం మ్యూజిక్ ఆన్ చేసాడు. బండి ముందుకి నడుస్తూండగా మంద్రస్థాయిలో 'సప్తపది'లో పాట వినిపించింది.

'ఏ కులమూ నీదంటే, గోకులమూ నవ్వింది
మాధవుడూ యాదవుడూ మా కులమే లెమ్మంది'

❋❋❋

# పడమట సంధ్యారాగం - సరిపల్లి మంజుల

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**టాక్సీ దిగి ఇంట్లోకి** అడుగుపెట్టీ పెట్టగానే, ఆనందంతో అమ్మమ్మ ఎదురువచ్చి, నన్ను వాటేసుకుంది.

"బుజ్జీ, నా బంగారు తల్లీ బాగున్నావా? పొద్దుటి నుంచీ మీ కోసమే ఎదురు చూస్తున్నాం. రా బాబూ, రవీ, బాగున్నావా?" అంటూ ప్రేమగా పలకరించి, ఆనందంతో నన్ను వదలకుండా పట్టుకునే ఉంది.

తాతయ్య ఎంతో ఉత్సాహంగా,

'ఓహో బుజ్జీ తల్లీ, వచ్చావా? బాగున్నావా, బాబూ' అంటూ మమ్మల్నిద్దరినీ దగ్గరకి తీసుకున్నాడు.

అంతలోనే సర్దుకుని,

'వరం, పిల్లల్ని లోపలికి రానీ మరీ! బుజ్జీ, ఆ పెట్టెలలా ఉండనీ, బాబులుగాడు వస్తున్నాడు, పెట్టెల్ని వాడు లోపల పెడతాడులే. ఒరే, బాబులూ, తొందరగా రారా!' అని తాతయ్య హడావిడిగా, అందరితోనూ ఒకసారే మాట్లాడేస్తున్నాడు.

మేమిద్దరం అమ్మమ్మకో, తాతయ్యకి కాళ్ళకి వంగి నమస్కరించగానే, మమ్మల్ని దీవిస్తూ, దగ్గరకి తీసుకున్నారు. రవి కూడా ఎంతో పరిచయమునట్లే అమ్మమ్మ, తాతయ్యలతో కుశల ప్రశ్నలు వేసి కబుర్లు చెపుతూంటే, నేను పెరట్లో నూతి దగ్గర కాళ్ళు కడుక్కుని వచ్చాను.

రవి మాటలకి వాళ్ళిద్దరూ, నాగస్వరం వింటున్న పాముల్లాగ, మహదానందంతో తలలాడించేస్తున్నారు. నాకు వాళ్ళ చనువుని చూస్తూంటే ఎంతో ఆశ్చర్యం, సంతోషం కూడా కలిగింది.

నన్ను చూసి అమ్మమ్మ, 'అదేమిటే బుజ్జీ అలా చిక్కిపోయావు? పెళ్ళి ఫోటోల్లోను, సీ.డీలోనూ కాస్త ఒళ్ళువచ్చినట్లుగా కనిపించావు. ఈ ఆర్నెల్లలోనూ బాగా చిక్కావు సుమీ! ఒంట్లో బాగానే ఉందా?' అని అభిమానంతోను కాస్త అనుమానంతోను అడుగుతుంటే వెంటనే రవి,

"అంతా స్వయంపాకం మహిమ అమ్మమ్మా! కొంచెం తినగానే కడుపు నిండిపోయిందనో, నచ్చటం లేదనో అంటుంది. ఇద్దరి వంతూ నేనే తింటున్నాను. నేను లావయాను కదూ?" అన్నాడు.

'లేదు బాబూ, నువ్వు ఫోటోలోలాగే ఉన్నావు. అసలు, బుజ్జికి వంట చెయ్యటం అలవాటు లేదు మరి. కొన్నాళ్ళయితే సర్దుకుంటుంది. పోన్లే బాబూ, బుజ్జి వంటకి నువ్వు వంకలేవీ పెట్టకుండా సర్దుకుపోతున్నావు కద! అదే, నువ్వు కానీ వంక పెట్టావనుకో, ఆ తినేది ఆ కాస్తా కూడా మింగుడు పడదు దానికి!'

అమ్మమ్మ మాటలకి అప్రయత్నంగానే, మా ఇద్దరి చూపులూ 'ఢీ' కొన్నాయి. నా వంటకి, రవి వంక పెట్టని రోజుందా? ఏదో కామెంట్ చేస్తూనే ఏదీ వదలకుండా తినడం రవి వంతయితే కొంచెం తినగానే మరి తినబుద్ధికాక చెయ్యి కడుక్కోవటం నా వంతు. ఇది ఒక 'రొటీన్' అయిపోయింది. ఆ బాధతోనే

'అమ్మమ్మా, ఎంత శ్రద్ధగా చేసినా, వంటలేవీ రుచిగా ఉండటంలేదు. నేనిక్కడ ఉన్నన్నాళ్ళూ నాకు వంట నేర్పవా?' దీనంగా అడుగుతున్న నాతో

'ఓస్! వంటకేముందే? అంతంత చదువులు చదివిన నీకు వంట నేర్చుకోవడం ఓ బ్రహ్మవిద్యా..? ఐనా, నీ వంటని రవి ఇష్టంగా తింటున్నాడు కదా! ఏం రవీ..?' అమ్మమ్మ ప్రశ్నకి రవి ఏం జవాబు చెప్పాలో తెలియక

'యా, యా, అఫ్ కోర్స్!' అంటూ పెట్టె తెరిచే ప్రయత్నంలో పడ్డాడు.

'సరే, మీరు తొందరగా స్నానాలు చేసి రండి, వడ్డించేస్తాను... రవికి ఏమిటి ఇష్టమో...' ఇంతలో ఎవరో బయటనుండి గట్టిగా పిలవడంతో, 'సూరి వచ్చినట్లున్నాడు..' అంటూ అమ్మమ్మ బయటకి వెళ్ళింది.

స్నానం చేసి రెడీ అయి వచ్చేసరికి, టేబుల్ మీద కంచాలు, గిన్నెలు అన్నీ సర్ది ఉన్నాయి. అందరం కంచాల ముందు కూర్చున్నాక చూస్తే, అన్నం గిన్నె లేదు. 'అయ్యో! నా మతి మరపు బంగారం కానూ! కుక్కర్లో బియ్యం రెడీగా పెట్టాను, ఆఖర్న వండితే వేడిగా ఉంటుంది కదా అని. అడుగో, ఆ సూరీడు కొబ్బరికాయలు దింపడానికి రావడంతో, దీని సంగతే మర్చిపోయేను. ఎంత పనైపోయింది?' అని బాధపడుతూ వంటింట్లోకి వెళ్ళి కుక్కర్ స్టౌ మీద పెట్టి వెలిగించింది.

'మిమ్మల్ని కంచాల ముందు నుంచి లేవదీసాను. ఎప్పుడూ లేదు, ఇవాళ ఇలా అయిందేమిటి?' అంటూ అమ్మమ్మ ఒకటే వర్ణిస్తోంది.

'పరవాలేదమ్మమ్మా. ఎంతసేపు మహా? మాకేమీ ఎక్కువ ఆకలిగా లేదు కూడా' అని నేను అంటూంటే

'ఫర్వాలేదులే వరం, ఇంతా చేస్తే ఓ అరగంట ఆలస్యమవుతుంది. అంతేకద! ఇలా వచ్చి కూర్చో. కొంచెం సేపు వీళ్ళతో కబుర్లు చెపుతూంటే టైమే తెలీదు. ఏమంటావు రవీ..?'

'నో ప్రోబ్లమ్! అమ్మమ్మా నో టెన్షన్! ఇంత మాత్రానికే సర్దుకుపోలేమా?' రవి చాలా సులువుగా అంటూ నా వైపు చూడగానే నాకు గతం గుర్తొచ్చింది.

ఇదే పొరపాటు నా వల్ల జరిగింది దానికి ఎన్ని రకాలుగా నచ్చచెప్పినా వినకుండా, రవి ఎంత గొడవ చేసాడు? నన్ను ఎన్నెన్ని మాటలన్నాడు? ప్రత్యేకంగా వాళ్ళ అమ్మకీ, అక్కకీ ఫోన్ చేసి, 'జయ కుక్కర్ పెట్టడం మర్చిపోయింది, పుస్తకం పట్టుకుంటే ఒళ్ళు తెలీదు' అని కూడా చెప్పాడు. అంతేకాదు, గుర్తొచ్చినప్పుడల్లా వెక్కిరిస్తూనే ఉంటాడు. పాత జ్ఞాపకాలు మనసులోంచి బయటికి వచ్చి నా కళ్ళలో ప్రతిఫలిస్తూంటే, ఆ భావాల తీవ్రత రవి మనసుకి 'గేలం'లాగ గుచ్చుకుని, అతన్ని అప్రయత్నంగానే తలదించుకునేలా చేసాయి.

ఇదేమీ గమనించని తాతయ్య 'అన్నట్లు, మరిచేపోయేను సుమీ! ఇప్పుడే వస్తాను..' అని గబగబా గదిలోకి వెళ్ళి, ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు నవ్వుతూ ..

అవతల గదిలోంచి, 'అందమె ఆనందం .. ఆనందమె జీవిత మకరందం..' పాట సన్నగా, మృదు మధురంగా వినిపిస్తోంది. ఆ పాటతో పాటు అప్రయత్నంగా నేనూ పాడడం మొదలు పెట్టాను. చిన్నతనంలో ఆ పాటని అమ్మమ్మతో కలిసి, పాడి, నేర్చుకోవడం,

మధ్య మధ్యలో తాతయ్య సలహాలు, చిన్న నాటి తీపి గుర్తులన్నీ ఆ పాటతో కలిసి, నన్నేదో లోకానికి తీసుకువెళ్ళినట్లనిపించింది. నా కిష్టమైన పాటని తాతయ్య సరిగ్గా ఈ టైములో వినిపించడం నాకెంతో సంతోషం కలిగించింది. ‘పడమట సంధ్యా రాగం...‘ దగ్గర అమ్మమ్మ కూడా తన గొంతు కలిపింది. చివర్న ‘అందమే ఆనందం‘ అంటూ తాతయ్య కూడా గొంతు కలపడంతో అందరం చెప్పలేనంత సంతోషంతో ఉక్కిరిబిక్కిరయాం. ఈ మధ్యలో రవి వీడియో కెమేరాతో రికార్డింగ్ చేస్తున్నట్లు కూడా నాకు తెలియలేదు. పాట పూర్తయేసరికి నాకు, అమ్మమ్మకీ, తాతయ్యకీ కళ్ళనిండా ఆనంద బాష్పాలు.

'చూసావా, బుజ్జీ, మీ అమ్మమ్మ ‘మూడ్‘ ఎలా మార్చేసానో..!?' అని తాతయ్య గర్వంగా అంటుంటే అమ్మమ్మ, బుగ్గలు సొట్ట పడేలా నవ్వింది.

మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్లు ‘బుజ్జీ, మీ పెళ్ళి డీవీడీని మేం రెండురోజులకోసారైనా చూస్తుంటాం. అమెరికాలో పెళ్ళయినా, అంతా ఇక్కడి పద్ధతిలోనోనే జరిపించారు. బాగుంది. అన్నిటికన్నా, ఆ పల్లకీ, పల్లకీలో ఊరేగింపు ఎంతో బాగుంది సుమీ!' అన్నాడు తాతయ్య.

అమ్మమ్మ మాటలకి మధ్యలో 'ఆ! మరేం! మా పెళ్ళి తర్వాత మళ్ళీ మీ పెళ్ళికి పల్లకీ ఊరేగింపు చూసాం. చాలా బాగుంది. ఔనే జయా, నీ పెళ్ళికి మేం రాలేదు కదా. ఐనా సరే అందరి మధ్యా మేం కూడా కుర్చీల్లో కూర్చున్నట్లు ఎలా చూపించారు? మా ఫోటోల్నే అలాగ మధ్యలో పెట్టారని తాతయ్య అన్నారు కాని, నాకైతే అర్థంకాలేదు.' అమ్మమ్మ మాటలకి నాకు, రవికీ నవ్వాగలేదు.

'ఫోటోల్లో ఉన్నవాళ్ళందరి పేర్లూ వాళ్ళతో మన చుట్టరికాలూ అన్నీ మీ అమ్మ వివరంగా నాకు ఉత్తరం రాసింది.'

నాకు చటుక్కున గుర్తొచ్చి, గదిలోకి వెళ్ళి, పెట్లోంచి మేము అమ్మమ్మకీ, తాతయ్యకీ తీసుకు వచ్చిన బహుమతులు, బట్టలు అన్నిటినీ తీసి అందిస్తూంటే, ‘ఎందుకర్రా ఇవన్నీ? ‘అంటూనే, ఆనందంగా అందుకున్నారు.

మా పెళ్ళిలో తీయించుకున్న, ఫామిలీ గ్రూప్ ఫోటో పెద్ద సైజు చేసి, ఫ్రేం కట్టించింది పెట్లోంచి బయటకి తీస్తూ ‘తాతయ్యా, అమ్మమ్మా, కళ్ళు మూసుకోండి‘ అని వాళ్ళిద్దరి చేతుల్లోనూ ఆ ఫోటోని పెట్టాను. కళ్ళు తెరచి చూస్తూనే వాళ్ళకి ఆశ్చర్యం, ఆనందం. ఆ ఫోటోలో, మధ్యలో అమ్మమ్మా, తాతయ్య కూర్చుని ఉన్నారు, చుట్టూరా మేమంతా ఉన్నాం.

‘వరం, కుక్కర్ అప్పుడే మూడోసారి పిలిచింది‘ తాతయ్య అనగానే, అమ్మమ్మ వెళ్ళి స్టౌ ఆపింది.

అమ్మమ్మ, తాతయ్యల ఛలోక్తులతో, కొసరి కొసరి వడ్డనలతో, రుచికరమైన వంటతో చాలా ఏళ్ళ తర్వాత తృప్తిగా భోజనం చేసాం. పేపర్ తిరగవేస్తూంటే అప్రయత్నంగానే నిద్రముంచుకు వచ్చింది. నిద్రతీరి, తెలివిరాగానే హాల్లోంచి భగవద్గీతా పఠనం వినిపిస్తోంది. వెళ్ళి చూద్దును, హాల్లో చాపమీద ఓ పది, పదిహేనుమంది ఆడ, మగ నడివయస్కులు స్కూలు పిల్లల్లాగ కూర్చుని శ్రద్ధగా వింటున్నారు. అమ్మమ్మ రాగయుక్తంగా చదువుతూంటే తాతయ్య దాన్ని సులువుగా అర్థమయేట్లు చెపుతున్నాడు. గీతా పాఠాలు ముగిసాక, అందరితో మాకు పరిచయాలయాయి. వాళ్ళంతా వెళ్ళాక

'రోజూ మధ్యాహ్నం మూడునుంచి ఐదుగంటల వరకూ గీతాపారాయణమో, రామాయణమో, భాగవతమో, ఇలా అందరం కలిసి చెప్పుకుంటాం.' అన్నాడు తాతయ్య.

'చాలా బాగుంది తాతయ్యా.' అని నేనంటే

'ఔను తాతయ్యా, వింటూంటే ఇంకా వినాలనే ఉంది. సమయాన్ని బాగా సద్వినియోగం చేస్తున్నారు. మీ దగ్గర మేం నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి తాతయ్యా.' అన్నాడు రవి మెచ్చుకోలుగా.

సాయంత్రం తాతయ్య రవితో ‘మా ఊరి లైబ్రరీ చూద్దువుగాని పద‘ అని తీసుకు వెళ్ళాడు. అమ్మమ్మ డైరెక్షన్స్‌తో నేను వంట పూర్తి చేసాను. మా కబుర్ల మధ్యలో రవి, తాతయ్య తిరిగి వచ్చారు.

‘జయా, టవల్ ఎక్కడ పెట్టావ్?‘ రవి అడగడంతో, నేను గదిలోకి వెళ్ళాను.

అంతలోనే అమ్మమ్మ, తాతయ్యా ఏదో గట్టిగా చిరాకుగా మాట్లాడుకుంటున్నట్లు వినిపించి హాల్లోకి వచ్చాను.

తాతయ్య 'ఏమిటి వరం, ప్రతిదానికీ నన్ను ఏదో ఒకటి అనకపోతే నీకు తోచదా? పొద్దున్న అలానే.. ' అంటుండగానే

అమ్మమ్మ, 'ఆc పొద్దుట ఏమన్నాను? తడితువ్వాలు అలా మంచం మీద పడేసే బదులు, బయట తీగ మీద వెయ్యకూడదా అన్నాను. అదీ, తప్పే?' అంది.

'చూడమ్మా బుజ్జీ.. ఏమీ లేదు చూడవే. ఈ షర్ట్ వెలిసిపోయింది మార్చుకోమన్నాను. నిన్ననేమో చిరుగులున్న పాత పంచె కట్టుకుంటే, మార్చుకోమన్నాను. నువ్వు చెప్పు, నాది తప్పా?' అని అమ్మమ్మ అంది.

'అలా చెప్పకపోతే, పోనీ, ఏం బట్టలు వేసుకోవాలో తీసి పెట్టొచ్చు కదా' అని తాతయ్య ఎదురు ప్రశ్న.

వెంటనే బాణంలాగ వచ్చింది జవాబు. 'ఆc! ఓపిక ఉన్నన్నాళ్ళూ అలాగే అందించాను. ఇంక నాకు ఓపిక లేదు. నాకూ వయసుపైన పడుతోంది మరి..' అనగానే

తాతయ్య అమ్మమ్మని ఎగాదిగా చూసి, 'ఏమిటీ, నీకు వయసు పైన పడుతోందా? ఏమో, నాకైతే నువ్వెప్పుడూ పెళ్ళికూతురిలాగే కనిపిస్తున్నావు సుమా!' అని అన్నాడో లేదో

వెనకాలనుంచి రవి 'వన్స్ మోర్ తాతయ్యా!' అని గట్టిగా ఈలవేసాడు.

అమ్మమ్మకైతే తాతయ్య విసిరిన ఆ పూలచెండు బుగ్గలకి తగిలి, అమ్మమ్మ బుగ్గలు కెంపులే అయాయి. బదులుగా అమ్మమ్మ విసిరిన ఓరచూపులో ఆ కెంపుకర్థం? ఆ భగవంతుడికే తెలియాలి.

'చాల్లెండి, మీరూ, మీ హాస్యమూను. పిల్లలు నవ్వుతారనైనా లెదు. 'అంటూనే తాతయ్యకి వేరే షర్ట్ అందించి మరీ వెళ్ళింది.

నాకైతే వాతావరణమంతా ఎంతో హాయిగా, ఆహ్లాదంగా, గుండెలనిండా సంతోషంతో మత్తెక్కినట్లుంది. రవి కళ్ళల్లోనూ అదే భావం కనిపించింది.

నిజానికి, ఈ మధ్య కొన్నాళ్ళ నుంచి రవికీ తనకీ ప్రతి చిన్న విషయంలోనూ బేదాభిప్రాయమే. నేను చేసే ప్రతి పనిలోనూ తప్పులెంచడం దానికి బదులు చెప్పలేక మనసులోనే మధనపడటం.. దానితో, చేసేపనిలో ఆసక్తి, శ్రద్ధం ఉత్సాహం లేక లైఫ్ అంతా 'డల్'గా 'బోర్'గా అనిపిస్తోంది. రవికి కూడా కోపం, చిరాకు ఎక్కువయి, ఇద్దరికీ కూడా లైఫ్‌లో ఏదో మార్పు కావాలనిపించింది. ఆ సమయంలోనే, అమ్మమ్మ, తాతయ్య తమని రమ్మని ఉత్తరాల మీద ఉత్తరాలు రాయడంతో, ఇద్దరం ఇక్కడికి రావడమయింది. వచ్చినందుకు ఫలితమేదో, ఇక్కడి అనుభవాలు, అనుభూతులు చెప్పకనే చెపుతున్నాయి.

ఆలోచనలలో మునిగి ఉన్న నాతో అమ్మమ్మ 'ఏమిటే ఆ పరధ్యానం? పోనీ రవినే అడుగుతాను. నువ్వు చెప్పు బాబూ, మీరిద్దరూ కూడా ఎప్పుడైనా దెబ్బలాడుకుంటారా?' అంది.

సూటిగా అలా ఊహించని ప్రశ్న వచ్చేసరికి, రవి కాస్త తడబడ్డాడు.

వెంటనే అమ్మమ్మ, 'ఐనా, నా తెలివితక్కువ కాని, ప్రేమించి పెళ్ళిచేసుకున్న మీరు, తెలివి తక్కువగా దెబ్బలాడుకుంటారా? జయకి నేను ఆరోజే చెప్పాను. బుజ్జీ, గుర్తుందా? మీరిద్దరూ పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాక బుజ్జి నాకే మొట్టమొదట ఉత్తరం రాసింది. అప్పుడు నేనేమన్నానో తెలుసా? బుజ్జీ, బాగా ఆలోచించుకో ప్రేమంటే ఆ అబ్బాయి నీకిచ్చే బహుమతులూ, అతను వాడే ఫెర్ ఫ్యూమ్స్, అతని స్టైలు, నీకోసం అతను పెట్టే ఖర్చు, కేర్‌ఫ్రీగా తిరగడమూ వగైరాలు కాదు సుమా! అసలైన ప్రేమ అంటే, కలిసి జీవితం పంచుకున్నాక, ఇద్దరూ కలిసి జీవించడం మొదలు పెట్టాకనే. ఒకరి ఇష్టాలు, అయిష్టాలు, అలవాట్లు, పొరపాట్లు వగైరాలన్నీ మరొకరికి తెలుస్తాయి. ఒకరితో ఒకరు సర్దుకుని, ఒకరినొకరు అర్ధం చేసుకుని, గౌరవించుకుని శాంతంగా, ఆనందంగా జీవితం పంచుకోవడమన్నమాట! అదీ ప్రేమంటే! ఏమండీ సరిగానే చెప్పానా?' అని తాతయ్యని అడిగింది.

'చాలా బాగా చెప్పావు వరం. ఐతే, ఓ చిన్న సవరణ. ప్రేమ పెళ్ళైనా, పెద్దలు కుదిర్చిన పెళ్ళయినా భార్యాభర్తలు అన్యోన్యంగా, సామరస్యంగా, సంతోషంగా జీవితం గడపాలి. 'లోకోభిన్న రుచి' అన్నట్లు, బేదాభిప్రాయాలు వచ్చినా వాదనలలోకి దిగినా, అలకలు, కోపాలూ వచ్చినా, వాటిని సమయస్ఫూర్తితో సరిదిద్దుకోవాలి. ఇవన్నీ మీకు మేము చెప్పనక్కరలేదనుకో. '

'భోజనానికి టైమయింది' అమ్మమ్మ హెచ్చరికతో ఆ చర్చ అంతటితో ముగిసింది.

డిన్నరయాక, ఆరుబయట వాకిట్లో కూర్చుని, కొబ్బరి చెట్ల ఆకుల మధ్యలోంచి దోబూచులాడుతున్న వెన్నెల నీడలతో పాటే, పాత జ్ఞాపకాల్ని తల్చుకుంటూ, ఆకులు వింజామరలుగా మాకు గాలి వీస్తుంటే మనసుకీ, శరీరానికీ హాయిగొల్పే ఆ అనుభూతిని పదిలంగా దాచుకుని నిద్రాదేవి ఒడిలో వాలాం.

ఉదయం తొందరగా తెలివి వచ్చేసింది. ఎక్కడినుంచో కోడి కూత వినపించగానే, అదొకరకమైన ఆనందం కలిగింది.

'ఎంత బాగుందో కదూ? నా చిన్నతనం గుర్తొస్తోంది. డాబామీదకి వెళదాం పద' అన్నాడు రవి.

నాకూ ఎంతో ఉత్సాహం కలిగింది. హాల్లోకి రాగానే, అమ్మమ్మ, తాతయ దేముడి గదిలో జపం చేసుకుంటూ కనిపించారు.

టేప్ రికార్డర్‌లో మంద్రస్వరంలో 'ఓం కారం' వినిపిస్తోంది.

మేం చప్పుడు చెయ్యకుండా డాబా మీదకి వెళ్ళాం. హాయిని గొలిపే సన్నని, చల్లని గాలులు, చిన్నగా పక్షుల కలకలలు, గాలికి మెల్లిగా తలలూపే చెట్లూ, నిశ్శబ్దంలోని వింత అందాలతో పట్టణ వాతావరణానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్న అందమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ, తన్మయత్వంతో కళ్ళు మూసుకుని తదేక ధ్యానంలో ఉండిపోయాను. దూరం నుంచి లౌడ్ స్పీకర్లో 'ఓం నమశ్శివాయ' వినిపించగానే ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. రవి నా పక్కనే, కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చుని ఉన్నాడు.

కొంతసేపటికి కిందకి వచ్చి అమ్మమ్మనీ తాతయ్యనీ పలకరిస్తూ, 'అమ్మమ్మా, తాతయ్యా, మాకిక్కడ ఎంతో బాగుంది. రిటైరయాక ఇక్కడే సెటిల్ అవుతాం' అని డిక్లేర్ చేసాడు రవి.

'ఇక్కడ, నీకు అంతగా నచ్చినదేమిటో చెపుతావా రవీ?' అన్నాడు తాతయ్య.

రవి వెంటనే, 'ఇక్కడి ప్రశాంత వాతావరణం, మీ దినచర్య అన్నీ ఎంతో నచ్చాయి. మీరు నాకు మార్గ దర్శకులని చెప్పగలను. ఇంకా ఇంకా మాటల్లో చెప్పలేనిది..'

'సరే, బాగుంది. చాలా సంతోషం ఐతే, నాదొక సలహా, ఏమిటంటే, రిటైరయే వరకు దేముణ్ణి తలచుకోవడం మాత్రం పోస్ట్ పోన్ చెయ్యకు. దేముణ్ణి ప్రార్థించడం, తీర్థయాత్రలు చెయ్యడం, భాగవతం, రామాయణం, భగవద్గీత మొదలైనవి చదవడం - ఇవన్నీ వయసులో ఉన్నవాళ్ళు చెయ్యవలసినవి కావని చాలామందికి దురభిప్రాయం నాటుకు పోయింది. అప్పుడే విరిసిన పూలతో దేముడికి పూజ చెయ్యాలికానీ రేకులు రాలి, వాడిపోతున్న పూలతో పూజ చేస్తామా? చెప్పండి. ఒంట్లో ఓపిక ఉత్సాహం, శ్రద్ధ తగ్గిపోతుంటే తీర్థయాత్రలు చెయ్యగలమా? మంచి పనులు ఎంత తొందరగా మొదలుపెడితే అంతమంచిది. నీ రిటైర్ మెంట్ జీవితానికి ఇప్పటినుండే పునాది ప్రారంభించు. డిసిప్లిన్‌తో, ఒక లక్ష్యంతో, మంచి దినచర్యతో గడిపే జీవితంలో నువ్వెక్కడ ఉన్నాసరే ప్రశాంతతని సాధించాలి' అంటూ తాతయ్య చెప్పినదానికి శ్రద్ధగా, భక్తిగా తల ఊపాడు రవి.

'ఇవాళ గుడికివెళ్ళి వచ్చాకనే టిఫిన్.. తొందరగా తయారవండి' అని అమ్మమ్మ ఆర్డర్ జారీ చేసింది.

గుడిలో పూజలు అయాక, ఇంటికి వచ్చిన తర్వాత టిఫిన్ టైమప్పుడు, భోజనాల మధ్యలో అలా సమయం దొరికినప్పుడల్లా అమ్మమ్మని వంటల తయారీల నడిగి ఓ పుస్తకాన్ని తయారు చేసుకున్నాను. సాయంత్రం పూట కోనేటికీ, తోటకీ, గుడికీ వెళుతూ ఆ ఊరి వాళ్ళతో పరిచయం పెరిగింది. తోవలో ఏ ఆవు దూడనో, మేకపిల్లనీ ఎత్తుకుని, వీడియో తీయించుకోవడం, గుడిలో పూజారిగారితో, తోటలో కూలీలతో, అందరితో మాటలు కలిపి, ఫోటోల్లో కలిసి, అంతా, ఇంతానా? ఎంతో.....ఆనందాన్ని రవి, నేనూ

పంచుకున్నాం. రోజూ రాత్రి పడుకునే ముందు అమ్మమ్మకి, తాతయ్యకి ఆ వీడియో రికార్డింగ్‌ని టీవీలో సినిమాలా చూపించి, అందరం నవ్వుల్లో తేలిపోయే వాళ్ళం. ప్రయాణం ముందు రోజు, కోనేటి గట్టు మీద కూర్చుని, రవి నా చేతిని తన చేతిలోకి తీసుకుని, 'జయా, ఇప్పుడాలోచిస్తుంటే ఎంతో చిన్న విషయాలని పెద్దవిగా చేసి, తెలివి తక్కువగా అలా ఎందుకు ప్రవర్తించానా అనిపిస్తోంది. ఇక్కడకి వచ్చాక, అమ్మమ్మని తాతయ్యని చూసాక, లైఫ్ ఎంత ఈజీగా, టెన్షన్ ఫ్రీగా ఆనందంగా గడపవచ్చునో అర్థమయింది అయామ్ సో సారీ జయా!' అనగానే నాకు చెప్పలేనంత సంతోషం కలిగింది.

ఇంక, తిరుగు ప్రయాణమనగానే అమ్మమ్మ, తాతయ్యతో పాటు మాకు కూడా చెప్పలేనంత భాధ, దిగులు కలిగాయి. వీలైనపుడల్లా వస్తామని అమ్మమ్మకీ తాతయకీ మనస్ఫూర్తిగా మాట ఇచ్చాం. ముందుగానే తయారు చేసిన కూరపొడి వగైరాలు, స్వీట్స్, చలిమిడి, అప్పడాలు, వగైరాలన్నిటినీ అమ్మమ్మ చక్కగా 'ప్యాక్' చేసి, పెట్టి నింపింది. టాక్సీ వచ్చేసరికి మళ్ళీ మరో పేకట్‌లో రవికీ, నాకూ బట్టలూ, నాకు పసుపు - కుంకుమ అందించింది అమ్మమ్మ. అన్నిటినీ నేను పెట్టెలో సర్దుతూంటే, రవి అమ్మమ్మకీ తాతయ్యకీ కలిపి తాను పెయింట్ చేసి తయారు చేసిన పెద్ద గ్రీటింగ్ కార్డు అందించాడు. దాన్ని అందుకుని తాతయ్య ఆ గ్రీటింగ్ కార్డులో రాసింది గట్టిగా చదివాడు -

"మా కెంతో ప్రియమైన అమ్మమ్మకీ తాతయ్యకీ - పాదాభివందనాలు! అధారిటీతోనో, పెద్దరికంతోనో కాకుండా, మంచి స్నేహితుల్లాగ మా మనసు గ్రహించి, సున్నితంగా సలహాలు చెప్పినట్లే చెప్పి, మా జీవితంలో మరచిపోలేని మధురక్షణాల్ని మళ్ళీ రప్పించిన మాకెంతో ఆప్తులైన అమ్మమ్మకీ, తాతయ్యకీ ఇవే మా జోహార్లు!

ఎంతో ప్రేమతో - జయ, రవి"

అని చదవడం ముగించాడు. కళ్ళనిండా ఆనంద బాష్పాలతో, అమ్మమ్మ తాతయ్యల వీడ్కోలుతో రవి, నేను టాక్సీ ఎక్కాం.

***

# ఒక నిజం - ఒక నమ్మకం -డా. ఎమ్.సుగుణ రావు

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

**సదాశివాన్ని చంపడానికే నిర్ణయించుకున్నాడు గాంధీ.** అతడితో తన సంబంధం ఏమిటో తెలిసిన తరువాత ఆ నిర్ణయం మరింత బలపడింది. ఆ సంబంధం మామూలు సంబంధం కాదు రక్త సంబంధం. సదాశివం గాంధీకి స్వయానా తండ్రి.

***

రెండు రోజుల క్రితం గాంధీని కలవడానికి ఒక వ్యక్తి వచ్చాడు. క్లుప్తంగా చెప్పాడు. "ఒక పెద్దాయన ఉన్నారు ఆయనను కీర్తిశేషుల్ని చెయ్యాలి. అందుకు నీకు ముట్టేది ఐదు లక్షలు, రెండురోజుల్లో మన నగరంలోని ఆడిటోరియంలో ఆయనకు సన్మానం. ఆ

హాల్‌లో వెయ్యిమంది ప్రేక్షకులు కూర్చునే అవకాశం ఉంది. సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు కరంటు పోతుంది. జనరేటర్ వెయ్యడానికి ఐదునిమిషాలు పడుతుంది. ఆ టైములో ఆయన మీద కాల్పులు జరిపి జనంలో కలిసిపోవచ్చు..'' అన్నాడా వ్యక్తి.

''ఆయన ఎలా ఉంటారు?'' అన్నాడు గాంధీ.

ఆ వ్యక్తి గాంధీని పరిశీలనగా చూసి ''నీకు ముసలి వేషం వేస్తే అచ్చం అలాగే ఉంటావ్..'' అన్నాడు.

ఆ వ్యక్తి మాటలకు ఆ రోజు గాంధీ నవ్వుకున్నాడు గానీ ఆ రోజు సాయంత్రమే కొరియర్ లో వచ్చిన సదాశివం ఫోటో చూసి ఆశ్చర్యానికి లోనయాడు. ఆయన ఫోటో తమ ఇంట్లో ఉంది. ఆయన పక్కనే తన తల్లి.

ఇప్పటి సదాశివంకు ఆ ఫోటోకు తేడా కనిపించలేదు అతడికి. ఆ ఫోటో ఈ మధ్యే అతడికి దొరికింది. అదయినా తన తల్లి చనిపోయిన తర్వాత ఆమె ట్రంకు పెట్టెలో దొరికింది. తల్లికి మరణ ఘడియలు సమీపించినపుడు గుమ్మం వైపు దృష్టి నిలిపేది. ''ఆయన వస్తారు.. తప్పక వస్తారు.. ఉత్తరం రాసాను..'' అనేది.

''ఇంతకీ ఎవరమ్మా ఆయన?'' అన్న గాంధీ ప్రశ్నకు మెల్లగా 'మీ నాన్నగారు' అని చెప్పింది. గాంధీ ఆశ్చర్యపోయాడు. అతడికి ఊహ తెలిసిన తర్వాత తల్లి ఎప్పుడూ తండ్రి గురించిన ప్రస్తావన తేలేదు. డాక్టర్లు ఈవిడ బతకదు అని తేల్చి చెప్పిన రోజు నుంచీ కాస్త శబ్ధం వినిపిస్తే చాలు ''మీ నాన్న వచ్చారేమో!?'' అనేది. చివరికి ఆమె తలుపు వైపు చూస్తూనే ప్రాణాలు విడిచింది.

- తల్లి చనిపోయిన కొన్నిరోజుల తర్వాత ఆమె ఏకైక ఆస్తి అయిన ఆ ట్రంకు పెట్టె తెరవగానే దొరికింది ఆ ఫోటో. నలుపు తెలుపు రంగుల్లో ఉన్న పాతకాలం నాటి ఫోటో. తన తల్లి పక్కనే సదాశివం. కృష్ణుడు, సత్యభామ వేషాల్లో ఉన్న ఆ ఇద్దరి ఫోటో చూసి గాంధీ మనసు మూగగా రోదించింది. ఆ ఫోటోలోని వ్యక్తే తన తల్లిని మోసం చేసాడనే విషయం గాంధీకి అర్ధమయింది. చనిపోవడానికి వారంరోజుల ముందు ఆమె గాంధీ జన్మ రహస్యం చెప్పింది.

''పాపం, ఆయన చాలా మంచివారు, కృష్ణుడి వేషం కట్టేవారు, నేను సత్యభామను. అంతకు ముందే ఆయనకు పెళ్ళయ్యిందట, పెద్ద కుటుంబం నుంచి వచ్చారు. బాగా ఆస్తిపరులు. అయినా మా మనసులు కలిసాయి.'' అంది తల్లి.

''ఫలితంగా ఈ దురదృష్టవంతుడు ఈ భూమ్మీద పడ్డాడు'' అనుకున్నాడు గాంధీ. తల్లి ఒక రంగస్థల నటి. నాటకాలు బాగా ఆడే రోజుల్లో జీవితం సాఫీగానే గడిచింది. అవి మూలబడటంతో ఆమె బతుకు బజారున పడింది. అప్పటికి తను ఐదేళ్ళ పిల్లాడు మగదిక్కులేదు. పక్కనున్న వారి సూటి పోటీ మాటలు. అంతే! తల్లి ఊరొదిలి పెట్టిందట! ఒక ఫ్యాక్టరీలో దినసరి కూలీగా చేరింది. రెక్కలు, ముక్కలు చేసుకుంది. తనను పాతికేళ్ళు పెంచింది. డిగ్రీ వరకు చదివించింది. ఉద్యోగం సంపాదించి తల్లిని సుఖపెట్టాలనుకున్నాడు. ఆ ఆశ తీరలేదు. అందుకే దొంగగా మారాడు. తల్లికి కోలుకోలేని జబ్బు సోకింది. అదీ కేన్సర్. దానికి డబ్బుకావాలి, అందుకోసం హత్యలు చెయ్యడానికి వెనకాడలేదు, అయినా తల్లిని దక్కించుకోలేక పోయాడు.

- తల్లి జ్ఞాపకాలతో గాంధీ హృదయం బరువెక్కింది. ఆ ఆలోచనలను ఆపలేకపోతున్నాడు. అవి మళ్ళీ అతడిని వెంటాడాయి.

తను చేస్తున్న దుర్మార్గపు పనుల గురించి ఆ పిచ్చి తల్లికి తెలీదు. ఆ అభాగ్యురాలు తనకు మంచిపేరే పెట్టింది. మహాత్ముడి పేరు పెట్టుకున్నందుకు తను చేస్తున్న పనులు ఇదీ అని తెలిస్తే ఆ తల్లి తట్టుకోలేదు. అందుకే ఆమె దగ్గర తన చీకటి జీవితాన్ని రహస్యంగా దాచాడు.

స్కూల్లో చదివే రోజుల్లో జరిగిన సంఘటన గాంధీకి గుర్తుకొచ్చింది.

ఒకరోజు పాఠం చెప్పలేనందుకు తనను ఒక టీచరు ఇంగ్లీషులో తిట్టారు. ఆ పదానికి అర్ధం తెలీదు. తమ పక్కనున్న ఇంటాయన్ని అడిగాడు. ఆయన జాలిగా చూసాడు. తను పదే పదే అడిగితే చెప్పాడు. అంతే, తండ్రి మీద పగమొదలయ్యింది. ఇన్నేళ్ళ

తర్వాత ఆయన ఆచూకీ తెలిసింది. తల్లి జీవితాన్ని నాశనం చేసి, తనో నేరస్తుడిగా, హంతకుడిగా మారేందుకు కారణమైన ఆ వ్యక్తిని చంపేందుకు అవకాశం వచ్చింది. ఆ అవకాశం జారవిడుచుకోకూడదనుకున్నాడు గాంధీ.

***

రెండు రోజుల తర్వాత తను చేయబోయే పని గురించి ఆలోచిస్తూ ఉద్విగ్నంగా ఉన్నాడు గాంధీ. ఆ రోజు ఉదయమే అతడికి ఫోన్ వచ్చింది. "ఈ రోజే మన కార్యక్రమం, నీకు ఫోన్ రాగానే బయలుదేరు, అన్నట్టు నీకు ఒక ముఖ్య విషయం చెప్పాలి. సదాశివం హత్యకు పథకం పన్నింది ఆయన దూరపు బంధువులే, ఆయనను చంపితే కోట్లలో ఆస్తి కలిసి వస్తుందని... ఈ విషయం మనసులో ఉంచుకో...." అని ఆ ఫోన్ సారాంశం.

ఫోనులోని వ్యక్తి చెప్పిన మాటలకు గాంధీ నవ్వుకున్నాడు.

'స్వంత బంధువులు హత్యకు పథకం పన్నితే, ఆయన కొడుకే స్వయంగా చపడానికి వచ్చాడు... ఇదే విధివిలాసం' అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూ గదిలో పచార్లు చేస్తున్నాడు. ప్రతీ నిమిషానికి టైము చూసుకుంటున్నాడు. తల్లి ఫోటో ముందు నిలుచుని తనని క్షమించమని కన్నీళ్ళు పెట్టుకున్నాడు, 'ఇది తప్పే .. చాలా ఘోరమైన తప్పిదం, అయినా తప్పదు..' దృఢమైన నిశ్చయంతో అతను బైటికి వచ్చేసరికి ఫోన్ మోగింది, 'బాబూ టైము దగ్గర పడింది. నువ్వు ఒక గంటలో అక్కడకు చేరుకోవాలి.' ఫోనులో వ్యక్తి చెప్పాడు.

గాంధీ రివాల్వరు, కెమేరా ఉన్న సంచిని భుజానికి తగిలించుకుని తన బండి స్టార్ట్ చేసాడు. సదాశివంకు సన్మానం జరుగుతున్న ఆడిటోరియం వైపు బండి ముందుకు కదిలింది.

***

సదాశివంగారిని సన్మాన నిర్వాహకులు వేదిక మీదకు ఆహ్వానించారు. ఆ సమయంలో ఆయన అడుగులు ఉద్వేగంగా పడ్డాయి. సన్మానాలు కొత్తకాదు ఆయనకు. అయినా ఈరోజు మరుపురానిరోజు. ఆయన రాసిన జీవిత చరిత్ర గ్రంధాన్ని ప్రచురించారు. ఆ పుస్తకం ఆవిష్కరించటంతో పాటూ ఆయనకు సన్మానం ఏర్పటు చేసారు ముఖ్య అతిధి కలక్టరుగారు, "సదాశివం.. ఒక వ్యక్తి కాదు ఒక సంస్థ. చిన్న స్థాయి వ్యాపారవేత్తగా జీవితం ప్రారంభించి ఒక ప్రముఖ పారిశ్రామిక వేత్తగా ఎదిగారు. అలాగే ఒక రంగస్థల నటుడిగా అనేక పాత్రలు పోషించారు. నట శిరోరత్న సదాశివం అంటే ఆంధ్ర ప్రజలందరికీ తెలుసు, ఆ పేరు వింటేనే శ్రీకృష్ణుడు, హిరణ్యకశిపుడు, సత్యహరిశ్చంద్రుడు గుర్తుకొస్తారు. ముప్పయ్యేళ్ళ క్రితం ఆయన స్థాపించిన నటరాజ నిలయం మన కళ్ళముందు మెదులుతుంది. కళతో ముడిపడ్డ తన జీవితాన్ని గురించి ముందు తరాలవారికి తెలియచెయ్యాలనే సదుద్దేశంతో ఆయన తన జీవిత చరిత్ర రాసుకున్నారు దాన్ని నా చేతులమీదగా ఆవిష్కరించడం నా అదృష్టం.." అంటూ ఆయన ఉపన్యాసం ముగించారు.

- కలక్టరుగారు మాటలలో వేదిక ముందు నుంచున్న గాంధీ మనసు రగిలిపోయింది. 'నా తల్లికి అవమానం, ఈ పెద్ద మనిషి సన్మానం' అనుకున్నాడు.

గాంధీ ఇపుడు సదాశివంగారికి అతి చేరువలో ఉన్నాడు. అతడి చేతిలో కెమేరా ఉంది. ఎవరికీ అనుమానం రాకుండా ఫోటోగ్రాఫర్‌గా ఆ ఆడిటోరియంలోకి ప్రవేశించాడు. ఫోటోలు తీస్తూ ఆయన ముందుకు వచ్చి నిలబడ్డాడు. 'ఇప్పుడు పాయింట్ బ్లాంక్‌గా ఆయనను కాల్చెయ్యవచ్చు' అనుకున్నాడు. ఎనిమిదయింది. ఎవరో ఉపన్యాసం ఇస్తున్నారు. పూలదండలు, అభినందనలు సన్మాన పత్రాలు, అవన్నీ చూస్తుంటే గాంధీకి చిరాకుగా ఉంది. అయినా ఓపికగా నుంచున్నాడు. ఇంకో నిమిషంలో కరంటు పోవాలి. అతడిలో టెన్షన్. అరవై సెకనుల కాలంలో అతనిలో ఉత్కంఠ. నరాలు తెగిన ఫీలింగ్. అప్పటికి సన్మానం అయిపోయింది. కరంటు పోలేదు. అప్పుడు అతని సెల్ మోగింది.

"ఏదో పొరపాటు జరిగింది.. ఆయన ఇంటికి వెళతారు. ఇంట్లో ఆయనొక్కరే, బాగా అర్ధరాత్రయిన తర్వాత పని పూర్తిచెయ్యి" ఒప్పందం కుదిర్చిన వ్యక్తి చెప్పాడు.

గాంధీ వేగంగా ఆ ఆవరణ దాటి బైటకొచ్చి తన బండిని ముందుకు పోనిచ్చాడు

***

సన్మానం అయిన తర్వాత ఇంటికొచ్చి భోజనం కానిచ్చిన సదాశివం తన గదిలో పచార్లు చేయడం ప్రారంభించారు. వాతావరణం చల్లగా ఉంది. దూరంగా ఎవరి ఇంటినుంచో వినిపిస్తున్న సంగీత సాధన శ్రావ్యంగా వినిపిస్తోంది. ఆ రోజు ఆవిష్కరించినబడిన తన జీవిత చరిత్ర గ్రంధాన్ని ఆయన చేతుల్లోకి తీసుకున్నారు. బాల్యం నుంచి యవ్వనం వరకూ వివిధ దశల్లో తన ఛాయాచిత్రాలు. వాటిని చూడగానే ఆయనకి తన బాల్యం గుర్తుకొచ్చింది. పెరిగిన ఊరు, పొడుగ్గా సన్నగా ఉండే తాతగారు, తనతో పురుష సూక్తం, శ్రీ సూక్తం చదివించడం స్మృతిలో మెదిలింది. పద్యాలు రాగయుక్తంగా పాడటానికి ఉదయం పూట చలిలో గోదారొడ్డున కూర్చుని ప్రాక్టీసు చేసిన రోజులు గుర్తొచ్చి ఆయన పరవశం చెందారు. పదహారేళ్ళకే పెళ్ళి, పెళ్ళిపీటల మీద భార్య నిద్రపోవటం జ్ఞాపకానికొచ్చి ఆయనకు చాలా నవ్వొచ్చింది ఇంతలో ఎక్కడినుంచో లీలగా వినిపిస్తున్న ఒక పాత పాట "సడిచేయకే గాలి.. సడిచేయబోకే.. అలసి ఒడిలో నా రాజు పవ్వళించేగాను.."

- ఆ పాట వినగానే సదాశివం లేచి కూర్చున్నారు. మనసంతా దిగులుతో నిండిపోయింది.

-ఇంట్లో ఎవరూ లేరు. కొడుకులిద్దరూ విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కూతురు అల్లుడి ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉంటుంది. ఆమెనుచూడటం కోసం భార్య రెండు రోజుల క్రితమే ఢిల్లీ వెళ్ళింది.

సదాశివంకు ఒక్కసారిగా తాను ఒంటరివాడిననే బెంగ బయలుదేరింది.

తనను కలవరపెట్టిన ఆ పాట అయిపోయినా ఆ పాటను వెన్నంటి ఉన్న జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ పాట పాడి తనకో మహతరమైన అనుభూతి మిగిల్చిన మాణిక్యరత్నం ఆయనకు గుర్తుకొచ్చింది.

ఆ పాట తన కోసం ఎంత మధురంగా స్వానుభవంతో పాడేదో. కృష్ణలీలలు నాటకంలో తను సత్యభామ వేషం కోసం జరిపిన అన్వేషణలో దొరికింది. గుక్కతిప్పుకోకుండా ఐదునిమిషాల సేపు రాగం తీయగలిగేది. విశాల నేత్రాలతో మనోహరంగా నవ్వేది. తను పెళ్ళయినవాడని తెలిసినా తనకు దగ్గరయింది. తనకు సర్వస్వం అర్పించిన ఆమె నుంచి తను దూరంగా పారిపోయాడే తప్ప తను ఆమెకు తోడుగా నిలవలేకపోయాడు. తీవ్రంగా జబ్బుపడి చావు బతుకులో ఉందని తెలిసినా తను వెళ్ళలేదు, తనగురించే కలవరించి కనుమూసిందనే వార్త తెలిసి తను రెండు కన్నీటి బొట్లు రాల్చాడే తప్ప ఆమె కోసం ఏం చెయ్యగలిగాడు.

మాణిక్యరత్నం గురించిన జ్ఞాపకాలతో అలజడికి గురయిన సదాశివం నిద్రపోదామని మంచంపై నడుం వాల్చారు. నిద్రపోతూ టైంకి చూసారు. అర్ధరాత్రి పన్నెండు గంటలు.

***

గాంధీ తన వాహనాన్ని ఆ రెండంతస్తుల భవనంకు కొంచెం దూరంలో ఆపి టైం చూసుకున్నాడు. పన్నెండు దాటింది. చుట్టూ చూసాడు. కార్పోరేషను వారి దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఐనా ఎక్కడా నరసంచారం లేదు. తాళం వేసి ఉన్న ఆ ఇంటి గేటు ఎక్కి మెల్లగా ఆ ఆవరణలోకి దూకాడు. లోపల అంతా చీకటి. ఆకు కదిలినా వినిపించే శబ్దం. ఆ ఇంటివెనక వైపు నడిచాడు. పైపు గొట్టం పట్టుకుని బాల్కనీ మీదకు చేరాడు. బాల్కనీ ఆనుకునే ఉన్న గది తలుపు తాళం తీయడాణికి పావుగంట శ్రమ పడ్డాడు. తలుపు తీయగానే విశాలమైన హాలు. ఆ గది దాటి పక్కనే ఉన్న మరో గది తలుపు తోసేసరికి మంచం మీద నిద్రపోతున్న సదాశివం. ఆయనను చూసి టక్కున తలుపు వెనక్కి జరిగాడు.

***

ఆకాశంలో కొంగల గుంపు బారుగా సాగిపోతున్న దృశ్యం అవన్నీ నల్లగా ఉన్నాయి.. ఏమిటీ కల? కొంగలా, కాకులా? నిద్రలోనే సదాశివం గుండె ఝల్లుమంది. దిగ్గున లేచి కూర్చున్నారు. - దూరంగా ఎక్కడినుంచో పసిపిల్లవాడి ఏడుపు లీలగా వినబడుతోంది. ఊరు చివర నుంచి వినవస్తున్న మంగళవాయిద్యాల శృతి పెరిగి కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి. ఆ శబ్ధంలో తన గదిలోకి తనను చంపటానికి ఒక ఆగంతకుడు ప్రవేశించిన చప్పుడు వినబడలేదు.

మంచం మీద ఉన్న తన జీవిత చరిత్ర పుస్తకం మళ్ళీ చేతుల్లోకి తీసుకున్నారు సదాశివం. ఆయనలో దుఃఖం తన జీవితంలో అత్యంత సాన్నిహిత్యంలో మెలిగి చేరువగా, ఊపిరిగా నిలిచిన మాణిక్యరత్నం గురించిన ప్రస్థావన ఈ పుస్తకంలో లేదు. ఆమె గురించి రాస్తే తను చరిత్ర హీనుడవుతానని రాయలేదు. అయ్యో! తనెంత తప్పుచేసాడు - అలా మాణిక్య రత్నం గురించి మధనపడుతున్న సదాశివంలో హఠాత్తుగా మొదలయ్యింది ఆ బాధ. ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. ఆస్తమా ఎటాక్! కొన్ని సంవత్సరాలుగా తాను బాధపడుతున్నాడు.. మరి ఇంత ఉధ్రుతంగా ఎప్పుడూ రాలేదు.. ఈ రాత్రే చరమరాత్రా..!? గొంతెత్తి అరవాలి... సర్వెంట్ క్వార్టర్‌లో ఉన్న వాచ్‌మేన్ లేస్తే బాగుండును.. ఎప్పుడు దగ్గరుంచుకునే 'నెబులైజర్' ఏమయింది? పద్యం పాడితే పక్క ఊరి వారిని నిద్రనుంచి లేపే గొంతు మూగవోయింది.. కనీసం ఆ టేబుల్ మీద టాబ్లెట్లు వేసుకుంటే..!? మళ్ళీ మాణిక్యరత్నం ఎదురుగా వచ్చి నిలుచున్నట్టయింది. నిలువెత్తు మనిషి, నుదుటి మీద పెద్దబొట్టు.. ఎప్పుడూ పసుపురాసుకునే ముఖం...

-రెండు నిమిషాలుగా సదాశివాన్ని గమనిస్తున్న గాంధీలో ఆశ్చర్యం.. ఉద్వేగం. తను చంపుదామనుకున్న వ్యక్తి తనకు ఎదురుగా చావుబతుకుల్లో ఉన్నాడు. ఊపిరి ఆడక మెలికలు తిరిగిపోతున్నాడు. ముఖం నీలి రంగులోకి మారిపోతోంది, ఆ జబ్బు గురించి తనకు తెలుసు.. ఎదురుగా తన తండ్రి తనకు వారసత్వంగా ఆస్తిపాస్తులు ఇవ్వలేకపోయినా ఆస్తమా వ్యాధిని ఇచ్చాడు. తను ఎప్పుడూ ఉంచుకునే నెబులైజర్, ఫాంటు జేబులో ఉంది, మరో జేబులో రివాల్వర్. ఒకటి బతికించేది.. రెండోది చంపేది.

గాంధీ ఒక్కక్షణం సదాశివం వంక చూసాడు. ఆయాసంతో మెలికలు తిరుగుతున్నాడు తను చంపే అవసరం లేకుండా చనిపోయేలా ఉన్నాడు. సదాశివాన్ని పరిశీలనగా చూసాడు. ఈయనలానే తనూ ఉన్నాడు, అచ్చుగుద్దినట్టు.. అలా అనుకున్న గాంధీలో పేగు కదిలినట్టయింది. తను చంపుదామనుకున్న వ్యక్తి మీద జాలిలాంటి భావన.

'అమ్మ ఒక నిజం.. నిజం చచ్చిపోయింది. నాన్న ఒక నమ్మకం, ఇప్పుడు ఆ నమ్మకం చావుబతుకుల్లో ఉంది.. లేదు నేనిపుడు ఆ నమ్మకాన్ని బతికించుకోవాలి.'

- అలా అనుకున్న గాంధీ వేగంగా ముందుకు కదిలాడు. తన జేబులోని నెబులైజర్‌ని సదాశివం ముక్కుదగ్గర ఉంచి ఆన్ చేసాడు. ఆయన ఆశ్చర్యంగా చూసి.. ఏదో చెప్పబోయాడు. గాంధీ మౌనంగా తన పని పూర్తిచేసాడు.. టేబుల్ వంక ఆయన చెయ్యి చూపించాడు. గాంధీ ఆ సీసాలోని మాత్రల పేర్లు చదివాడు తను వేసుకునేవే! గబగబా టాబ్లెట్టు తీసి మంచినీళ్ళు అందించాడు. ఆయన టాబ్లెట్ తీసుకుని కళ్ళుమూసుకున్నాడు. పక్కనే ఫోన్, అంబులెన్స్‌కు ఫోన్ చేసాడు.

"ఇక్కడ ఒక పేషెంటు చావు బతుకుల్లో ఉన్నారు." అంటూ ఆ ఇంటి అడ్రస్ చెప్పాడు.

- 'ఇక తన పని అయిపోయింది' అనుకున్నాడు గాంధీ. వచ్చే ముందు ఆ గదిలో తను చూసిన ఆ వస్తువును దొంగిలించాలనుకున్నాడు దాన్ని గబగబా తన సంచిలోకి చేర్చాడు. ఆ ఇంట్లోంచి బైటకు నడిచి పైపుతో దిగే అవసరం లేకుండానే మెట్లు దిగి క్రిందకు వచ్చాడు. గేటు దూకి బైటకు వచ్చాడు. అతను వచ్చిన ఐదు నిమిషాలకు ఇంటిముందు అంబులెన్సు వచ్చి ఆగింది. గాంధీ గోడ చాటుకు తప్పుకున్నాడు. అంబులెన్సులో తెల్లబట్టలు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు దిగారు. ఆ బిల్డింగ్ అవుట్ హౌస్‌లో ఉంటున్న వాచ్‌మేన్ తాళం తెరిచాడు. గాంధీ అంతా గమనిస్తూ దూరంగా నిలబడ్డాడు.

మరో పావుగంట తర్వాత సదాశివంగారిని వీల్ చెయిర్‌లో తీసుకొచ్చి అంబులెన్సు ఎక్కిస్తున్నారు.

"ఫరవాలేదు.. గండం గడిచింది, నెబులైజరు ఉపయోగించడం.. టాబ్లెట్లు వేసుకోవటంతో రిలీఫ్ వచ్చింది.. ఇంతకీ మీకు ఈ ప్రధమ చికిత్స చేసిందెవరు?" అన్నాడు తెల్లబట్టలు వేసుకున్న వ్యక్తి.

"ఏమో.. నాకేమీ అర్ధంకావడంలేదు.. అంతా లీలగా జరిగిపోయింది. బహుశా దేవుడేమో.." అన్నాడు సదాశివం రెండుచేతులూ జోడిస్తూ.

ఆ మాటలు గోడచాటున దాక్కుని విన్న గాంధీకి స్పష్టంగా వినిపించాయి.

గాంధీ తను దొంగిలించిన వస్తువు బైటకి తీసాడు. అది ఒక ఫోటో ఫ్రేమ్. తన తల్లి, తండ్రి కలిసి తీయించుకున్న పాతకాలంనాటి ఫోటో. తనకు తండ్రి ఉన్నాడనే నమ్మకం మిగిల్చే ఒక సాక్ష్యం. ఆ ఫోటోను ఒక్కసారి తడిమాడు. అతడి కళ్ళల్లో నీళ్ళు.

'అమ్మా, నువు ప్రేమగా ఆ మహాత్ముడి పేరు పెట్టుకున్నావ్.. ఇన్నాళ్ళకి దాన్ని సార్ధకం చేసాను. చంపాలనుకుని వచ్చాను....చావబోతున్న నమ్మకాన్ని బతికించాను అది చాసి ఈ జీవితానికి..'

- అలా అనుకుంటూ గాంధీ ముందుకు కదిలాడు

***

# పరిణిత - విజయ (కర్రా) గంటి

**ఆ అమ్మాయి 'సిరివెన్నెల' పాటలా ఉంటుంది.** అందుకనే నేమో ఏ దేశంలో ఉన్నా, ఎలాంటి వస్త్రధారణలో నయినా ఈ అమ్మాయి తెలుగు అమ్మాయి అని ఇట్టే చెప్పేయచ్చు. అమెరికాలో ఎం.ఎస్ చేస్తున్న స్నేహ, సమ్మర్ జాబులో చేరి ఆ కార్పోరేట్ భవనంలో ఏడో అంతస్తులో ప్రస్తుతం పని చేసుకుంటోంది.

ఆమెతో పాటు ఇంటర్న్‌గా చేరిన మరో ఇద్దరు, జేమ్స్ ఇంకా టోని సాంగ్. టోని కొరియన్, ఎనిమిదేళ్ళప్పుడు తల్లితండ్రులతో అమెరికాకి వచ్చి ప్రస్తుతం తను కూడా మాస్టర్స్ చేస్తున్నాడు. జేమ్స్ అమెరికన్, వీళ్ళకన్నా చిన్నవాడు, డిగ్రీ చదువుతున్నాడు. ఆ రూములో అతని మాటలే ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఇంటికి వచ్చిన చిన్న పిల్లలని చూస్తే పెద్ద వాళ్ళు ఎలా ముచ్చట పడతారో సమ్మర్ జాబులో చేరిన కాలేజీ స్టూడెంట్స్‌ని చూస్తే కూడా అలాగే ముచ్చటగా ఉంటుంది మిగిలిన వాళ్ళకి.

ఉన్నట్లుండి వెల్డింగ్ చేస్తున్నప్పుడు వచ్చే శబ్దం లాంటిది ఒకటి స్టార్ట్ అయి అందరిని ఉలిక్కిపడేలా చేసింది. అదో వర్ణించలేని, భరించలేని శబ్దం. సడన్‌గా స్టార్ట్ అయిన ఆ సౌండ్‌కి అందరిలాగే స్నేహ కూడా ఒక్కసారి ఉలిక్కిపడింది. లేచి వెళుతున్న జేమ్స్ ఆగి "ఫైర్ అలారం.. కమాన్ లెట్స్ గో." అన్నాడు. టోని అప్పటికే లేచి వెళ్ళిపోతున్నాడు. లేచి కంగారుగా వాళ్ళ వెంట బయటికి నడిచింది. అప్పుడే స్పీకర్లో ఎనౌన్స్ చేసారు. ఎలివేటర్ ఉపయోగించకూడదని, మెట్ల ద్వారా అందరు ఆ బిల్డింగ్ వదిలి దూరంగా వెళ్ళాలని.

"జేమ్స్..." అంటూ గట్టిగా పిలిచి" ఏమిటీ.. ఇన్ని ఫ్లోర్స్ మెట్లు దిగి వెళ్ళాలా....?" అడిగింది భయంగా.

"మన పయిన ఇంకా మూడు ఫ్లోర్స్ ఉన్నాయి, వాళ్ళంతా కూడా అలాగే వెళతారు. డోంట్ వర్రీ, యు విల్ బి ఆల్ రైట్" అన్నాడు నవ్వుతూ. అప్పటికే ఆ అంతస్తులో వాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ మెట్లు దిగి వెళ్ళిపోతున్నారు. అందరిని గమనిస్తూ, ఒకొక్క

అంతస్తే దిగుతూ, 'వీళ్ళకిది అలవాటే కాబోలు' అనుకుంటూ క్రిందకి వచ్చేసింది. బయపడినంతగా ఏమీలేదు, నిజంగా చూస్తే తను బయట ఇంతకన్నా ఎక్కువే నడుస్తుంది.

అన్ని అంతస్తుల నుండి జనం బయటికి వచ్చి గుంపులు గుంపులుగా విడిపోయే కబుర్లు చెప్పుకుంటున్నారు. స్నేహకి ఒక్క నిమిషం ఏం చెయ్యాలో తోచలేదు. అది కొత్తగా కట్టిన ఆధునిక భవనం. కుడివైపు కొద్ది దూరంలో తీరుగా వరుసగా పెంచుతున్న చెట్లు. ఆ చెట్ల వెనకాల ఏముందో చూద్దామని అటు కదిలింది.

అక్కడ రాతితో మలచిన రౌండ్ టేబుల్స్, వాటి చుట్టూ కూర్చోడానికి వీలుగా ఉన్నాయి. మొదటి నాలుగు వదిలేసి ఆమె ఆఖరి టేబుల్ దగ్గరి కెళ్ళి కూర్చుంది. కంగారుగో బ్యాగు,ఫోను ఏమి తెచ్చుకోలేదు, ఒకసారి తలెత్తి బిల్డింగ్ కేసి చూసింది. స్నేహ మెరిట్ స్టూడెంట్. పూర్తి ఎయిడ్‌తో మంచి యూనివర్సిటీలో సీట్ తెచ్చుకుని ఎం.ఎస్ చేయడానికి వచ్చింది. కాని చాలా మంది ఆ వయసు అమ్మాయిల్లానే తనని తాను తక్కువగా అంచనా వేసుకుంటుంది.

చెంపకి చెయ్యి ఆనించుకుని ఆలోచిస్తున్న స్నేహకి ఎందుకో తెలియని దిగులు వేసింది. డాడి ఫ్రెండ్ ఒకరు చెప్పడం ద్వారా ఈ సమ్మర్ జాబ్ వచ్చింది. రానంత వరకు ఎక్కడో అక్కడ ఇంటర్న్‌షిప్ వస్తే బావుండునూ అని, తీరా వచ్చి చేరాక మరో బెంగ. ఈ అమెరికన్స్ అందరూ బానే ఉంటారు, చక్కగా మాట్లాడతారు కాని తనకే ఏం మాట్లడాలో తెలియదు. ఒక రెండు కుశల ప్రశ్నలు, ఆ తరువాత ఇంకేమి అడగాలో ఏం చెప్పాలో తెలియదు. స్నేహకి మళ్ళీ బోలెడు దిగులు వేసింది.

స్నేహ అలా తన ఆలోచనలలో ఉండగానే "హలో, హౌ ఆర్ యు టుడే?" అంటూ వినిపించింది. తల ఎత్తి చూస్తే ఒక మధ్య వయసు ఆఫ్రికన్ అమెరికన్ స్త్రీ, నవ్వుతూ ఎదురుగుండా వచ్చి కూర్చుంది. మధ్యలో ఖాళీగా ఉన్నా టేబుల్స్ వదిలేసి ఆమె తన దగ్గరికే రావాలా అనుకుంది స్నేహ.

"ఇట్స్ ఎ నైస్ బ్రేక్ ఫర్ ఆల్ ఆఫ్ హస్" అంది ఆమె కూర్చుంటూ.

స్నేహ అవును అన్నట్లు తల ఊపింది.

ఆమె ఎత్తుగా లావుగా ఉంది. తన పేరు చెప్పి, స్నేహ వివరాలు అడిగింది. తరువాత సంభాషణలో ఆమె ఎక్కువసేపు మాట్లాడింది. స్నేహ ఇంటర్న్‌షిప్ వివరాలనుండి, ఇండియాలో ఎక్కడి నుండి వచ్చింది, ఆమెకి ఇండియాలో తెలిసిన సిటీలు, బాలివుడ్ ఇంకా కల్చర్ అన్నీ.

"అక్కడి కల్చర్, లైఫ్ స్టైల్ ఇక్కడితో పోలిస్తే మీకు చాలా తేడాగా ఉంటుంది కదూ. ఝుంప లహరి తన కథలలో ఈ విషయాలు, జన జీవితంలో తేడాలు చాలా బాగా రాస్తుంది."

స్నేహ ఆ రచయిత్రి రాసిన నవల ఆధారంగా తీసిన నేమ్ సేక్ మూవీ చూసింది కాని ఆమె రాసిన బుక్స్ ఏమీ చదవలేదు. ఈమెకి ఇన్ని విషయాలు ఎలా తెలుసా అనుకుంటే ఆశ్చర్యంగా అనిపించింది.

"వర్క్ ఎలా ఉంది, ఆర్ యు కంఫర్టబుల్?"

"ఇంటరెస్టింగ్.." చెప్పింది స్నేహ.

"నిన్ను బాగా చూసుకుంటున్నారా, ఆర్ దే ఇంటరాక్టివ్?"

స్నేహ ఇబ్బందిగా మొహం పెట్టింది.

"ఎనీ ప్రోబ్లంస్?"

"వాళ్ళంతా బానే ఉంటారు.. ఫ్రెండ్లీగా మాట్లాడుతారు, కాని.. నాకే, ఏం మాట్లాడాలో తెలియదు." అంతకు ముందు ఇదే విషయం ఆలోచిస్తోందేమో తనకి తెలియకుండానే చెప్పేసింది.

"ఎందుకని?'

"..ఏం మాట్లాడాలో తెలియదు."

"అదే ఎందుకని అని అడుగుతున్నాను?"

ఒకసారి ఇబ్బందిగా కదిలి చెప్పింది స్నేహ "ఎందుకంటే, కామాన్ టాపిక్స్ ఉండవు కనుక."

ఆమె నవ్వి అడిగింది "ఆ కామన్ టాపిక్స్ రావాలంటే నువ్వు ఏం చెయ్యాలి?"

స్నేహ తెల్లబోయి చూసింది.

"సారీ, ఇన్ కేస్ ఇఫ్ ఐ హర్ట్ యు. పాతికేళ్ళ క్రితం నేను ఇప్పుడు నువ్వున్న స్థితిలోనే ఉన్నాను. మాట్లాడే నేర్పు ఉన్నా ఎవరితో ఏం మాట్లాడాలో తెలియదు. ఇక్కడ పుట్టి పెరగడం వలన నాకు నీ కన్నా ఎడ్వాన్సే ఉండేది. కాని ఎన్నో దేశాలనుండి, విభిన్న భాషా మరి సంస్కృతులతో నడచి వచ్చిన సంఘం ఇది. ఎవరితో ఏం మాట్లాడుతాము అన్నది ఇప్పటికీ నాకు కూడా సమస్యే!"

అప్పుడే గట్టిగా సైరన్లు మ్రోగించుకుంటూ వచ్చారు ఫైర్ ఇంజన్ స్క్వాడ్ ఒకసారి తలతిప్పి చూసి "అదిగో వచ్చారు మన హీరోలు" అని, తిరిగి ఆమె చెప్పసాగింది.

"నువ్వు రేపటి రోజున ఈ కంట్రీలోనే పనిచేస్తావో, మరి ఏ ఇతర దేశంలోనో.... ఎక్కడైనా సరే, బేసిక్ కామన్ విషయాలు, స్పోర్ట్స్, మూవీస్, టీవి ప్రోగ్రామ్స్, రోజువారి అక్కడ జరిగే సంఘటనలు ఇలాంటివి కొంచం అయిన తెలుసుకోవాలి. అవి ఎలా తెలుస్తాయి?"

"టీ.వి. చూడడం ద్వారా.. చదవడం ద్వారా.." చెప్పింది స్నేహ.

"గుడ్, టీ.వీ.లో ఎన్నో ఎంటర్టైనింగ్ ప్రోగ్రామ్స్ వస్తున్నప్పుడు, మా అమ్మాయి న్యూస్ ఛానల్ కేసి వెళ్ళనే వెళ్ళదు. ఆమెతో నేను స్ట్రిక్ట్‌గా చెప్పేదేమిటంటే రోజుకి రెండు సార్లయినా రేడియోలో వార్తలు వినాలి. అలా వింటున్నప్పుడు నీ ఏకాగ్రత అంతా వినడంలోను, విన్న దాన్ని అర్థం చేసుకోవడంలోను ఉంటుంది. రోజూ ఒకటి రెండు అయినా పేపర్లు చదవాలి. రోజూ కుదరకపోతే వీక్ ఎండ్‌లోనయినా చదవాలి. అలా చదవటం అలవాటుగా మారిన రోజున నీ పరిధి ఎంత విస్తృతం అవుతుందో ఆలోచించు. మరో ముఖ్యమయిన విషయం, నేను నీ దేశం గురించి, నీ చదువు గురించి ప్రశ్నలు వేసి తెలుసుకున్నాను. అదే నువ్వు చేశావా?"

లేదు అన్నట్లు స్నేహ తల అడ్డంగా ఊపింది.

"సమయం ఉండి ఎదుటి మనిషి నీతో మాటలాడటానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నప్పుడు, నువ్వు ప్రశ్నలు వేసి వారి గురించి తెలుసుకో. తప్పులేదు. అఫ్ కోర్స్, కంప్లీట్ స్ట్రేంజర్స్‌తో కాదనుకో."

ఆమె ఆగి మళ్ళీ చెప్పసాగింది. "ఎలాంటి చదువు లేని నా తల్లితండ్రులు వర్జిన్ ఐలాండ్స్ నుండి ఈ నార్త్ అమెరికాకి వచ్చారు. చిన్న చిన్న జాబ్స్ చేస్తూ తమ నలుగురు పిల్లలని చదివించారు. వర్జిన్ ఐలాండ్స్ ని భూలోక స్వర్గం అంటారు. అంత గొప్పగా ఉంటాయి ఆ దీవులు. కాని అక్కడ టూరిజం తప్ప మరో రకమయిన ఉపాధి లేదు. వాటి గురించి తెలుసుకో. పుస్తకాల ద్వారానో, ఇంటర్నెట్ లోనో చదివి తెలుసుకో. ఆ ఐలాండ్స్ చరిత్ర చదివిన రోజున నేను ఎవరు, నా రూట్స్ ఏమిటి అన్నది నీకు అర్థం అవుతుంది. ఈ రోజున అమెరికన్ అయిన ఈ ఆఫ్రికన్ వనిత ఇక్కడికి ఎలా వచ్చి ఉంటుంది? అని ప్రశ్నించుకుంటే, దానికి సమాధానం దొరుకుతుంది."

స్నేహ తనెక్కడుందో కూడా మరచిపోయి ఆమె చెప్పేది వినసాగింది.

ఆగి ఒకసారి ఊపిరి పీల్చుకుని తనకి తానే చెప్పుకుంటున్నట్లు ఆమె తిరిగి అంది.

"ఎన్ని వందల ఛానల్స్ పెంచినప్పటికీ టీవీ ప్రపంచ జ్ఞానాన్ని అందించలేదు. ఎన్ని పేజీలు పెంచినప్పటికీ న్యూస్ పేపర్ మనిషి తాలూకు చరిత్రని కాని మనుగడని కాని చెప్పలేదు. వాటి పర్పస్ వేరు. అలాంటి విషయాలు తెలుసుకునేలాగా చేసే ఒకే ఒక సులువయినా సాధనం... రీడింగ్."

"ఆఫ్ఘనిస్తాన్ చరిత్ర నుండి అంతరిక్షయానం వరకు ఏ విషయమయినా చదవడం ద్వారా తెలుసుకోవచ్చు. ఒక ప్రాజెక్టులో ఒక రష్యన్‌తోనో లేదా ఒక చైయినీస్‌తోనో పనిచెయ్యాలిసి వచ్చినప్పుడు ఆ ప్రాజెక్టు గురించి ఎలా తెలుసుకుంటావో, అలాగే ఆ వ్యక్తుల గురించి కూడా.. వాళ్ళని ప్రశ్నించడం ద్వారా కొన్ని విషయాలు తెలుసుకుంటే, వారి దేశం, ప్రదేశాలు, వస్త్ర ధారణ గురించి నీవు చదివిన విషయాలు చర్చించడం ద్వారా మరిన్ని అలా నీ కామన్ టాపిక్స్ పరిధి పెరుగుతుంది. నీవంటే ఎదుటి మనిషికి ఇంట్రెస్ట్ కలుగుతుంది."

స్నేహాకి తన అమ్మమ్మ గుర్తుకు వచ్చింది. ఆవిడ రోజు పేపర్ చదివేది, రేడియోలో వార్తలు వినడానికి ఇష్టపడేది. "ఈ రోజుల్లో పిల్లలకి బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదు" అని విసుక్కునేది. ఈ దేశం కాని దేశంలో తనకి ఇంత ముఖ్యమయిన విషయాలు చెపుతున్న ఆమె ఆ క్షణంలో చాలా ఆత్మీయురాలిలా అనిపించింది.

ఇంతలో వచ్చిన ఫైర్ ఇంజన్లు తిరిగి వెళ్ళసాగాయి.

ఆమె నవ్వుతూ స్నేహాకేసి చూసి "ఓకే, లెట్ అస్ గో బ్యాక్ టు వర్క్" అంది.

ఇద్దరూ లేచి నిలుచున్నాక ఆమె స్నేహ భుజం పయిన తట్టి చెప్పింది "నైస్ టాకింగ్ టు యూ" కొద్ది సేపు వెళుతున్న ఆమె కేసే చూస్తుండిపోయింది స్నేహ.

వెనక్కి తిరిగి వస్తుంటే జేమ్స్ కనిపించి కుతూహలంగా అడిగాడు.

"ఏమిటి మన సీనియర్ మానేజర్‌తో అన్ని కబుర్లు.?"

"ఆమె...?"

"వన్ ఆఫ్ అవర్ వైస్ ప్రెసిడెంట్స్."

***********

ఆ రోజు ఇంటికి తిరిగి వచ్చాక స్నేహ ఫేసు బుక్ లో మెసేజెస్ చూస్తూ టైం పాస్ చెయ్యలేదు. తన ఫ్యావరెట్ తెలుగు హీరో మూవీ కూడా చూడదలుచుకోలేదు.

చాలా రోజుల తరువాత డైరీ రాద్దామని తీసింది. 'ఈ రోజు ఒక ప్రత్యేకమయిన స్త్రీని కలుసుకున్నాను, ఆమె పేరు..' పేరు రాద్దామంటే ఆమె లాస్ట్ నేమ్ గుర్తురాలేదు. ఫస్ట్ నేమ్ రాసి ఊరుకుంది.

ఆ తరువాత ఇలా రాసుకుంది.

పరిచయమయిన వ్యక్తి పేరు గుర్తుపెట్టుకోవాలి, ముఖ్యంగా లాస్ట్ నేం. లేదా మరోసారి అడిగి తెలుసులోవాలి.

ఈ రోజునుండి న్యూస్ తప్పక వినాలి, అది కూడా రేడియో ద్వారానే.

రోజూ పేపర్ చదవాలి.

హాలిడేస్‌లో వారానికి రెండు బుక్స్ అయినా చదవాలి, కాలేజీ ఉన్న టైములో కనీసం ఒకటయినా రేపటి రోజున తనతో పనిచేస్తున్న టోనితో మాట్లాడాలి. స్నేహంగా తన వివరాలు చెప్పి అతని వివరాలు అడగాలి. ఆ పైన మరిన్ని కొత్త పరిచయాలు పెంచుకోవాలి.

ఆ రోజు నుండి ఆమెకి దిగులు పడే తీరిక మరి అవకాశం రాలేదు. రోజులు చకచకా గడవసాగాయి.

# బహుమతి - సన్నిహిత్

**"ఏమేవ్! ఎక్కడేవాడు?"** అంటూ వినబడ్డ నాన్న అరుపుకి పెరట్లో ఆడుకుంటున్న నేను పరుగెత్తుకుంటూ వచ్చి పుస్తకాల ముందు కూర్చుని చదువుతున్నట్లు నటించసాగాను.

వాకిట్లో సైకిల్‌కి స్టాండు వేసి, కాళ్ళూ చేతులు కడుక్కుని ఇంట్లోకి వచ్చి కుర్చీలో కూలబడ్డారు నాన్నగారు. సమయం సాయంత్రం ఆరవుతోంది. వంటగదిలో నుండి కాఫీ కప్పుతో వచ్చి ఆయన కెదురుగా కూర్చుంది అమ్మ. కాఫీ త్రాగుతూ నన్ను గమనించసాగారు నాన్న!

మా ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ఎలిమెంటరీ స్కూలుకి హెడ్ మాస్టర్ ఆయన. రోజూ సైకిల్ మీద వెళ్ళి పాఠాలు చెప్పి వస్తుంటారు. నేను మాత్రం మీ ఇంటి ప్రక్కనే ఉన్న 'చిన్నబడి'లో ఐదోక్లాసు చదువుకుంటున్నాను. మా ఊళ్ళో ఇంకో బడి కూడా ఉంది. అది 'పెద్దబడి'.. అంటే హైస్కూలు అన్నమాట!

'మాస్టారిగారి అబ్బాయి..బాగా చదువుతాడు'... ఇవీ నాకున్న బిరుదులు. అవి వింటున్నపుడల్లా నాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది. మరింత బాగా చదువుకోవాలి, మరింత మంచివాడిని అనిపించుకోవాలి అన్న కోరిక కలుగుతూ ఉంటుంది.

"ఏమండీ.. బాబుకి కారు బొమ్మ కావాలంట.. కొని పెట్టమంటున్నాడు. మీకు చెప్పమని ప్రతీరోజూ నా ప్రాణం తీసేస్తున్నాడు" నెమ్మదిగా సిఫార్సు చేసింది అమ్మ. నేను అదేమీ విననట్లు, శ్రద్ధగా చదువుకుంటున్నట్లు నటించసాగాను.

"ఎందుకట? వాడేం ఉద్దరించాడని కారుబొమ్మ?" కొట్టిపడేసారు నాన్న. నాకు మనసు చివుక్కుమంది. నాన్న ఎప్పుడూ అంతే! నేను ఏది కావాలన్నా కొనివ్వరు. అదే నా క్లాస్ మేట్ రమేష్ వాళ్ళ నాన్న అయితే వాడికి ఎన్నో బొమ్మలు కొంటారు. ఏది అడిగినా కాదనరు. నాకళ్ళల్లో సన్నటి కన్నీటి తెర! మనసు మార్పు కోసం నిజమానే చదవడంలో నిమగ్నమయ్యాను.

మరుచటి సంవత్సరం ఆరో తరగతి చదవడానికి పెద్ద స్కూల్లో జాయిన్ అయ్యాను. అంటే హైస్కూలు చదువన్నమాట..! నాకు చాలా కొత్తగా, వింతగా అనిపించింది. హైస్కూలు ఆవరణ చూడటానికి ఎంతో విశాలంగా ఉంది. పెద్ద పెద్ద క్లాసు రూములూ, అందులో పెద్ద బ్లాక్ బోర్డు, పెద్ద బెంచీలూ, బయట పెద్ద పెద్ద చెట్లూ, విశాలమైన ప్లే గ్రౌండూ!

ప్రతీరోజూ ప్రొద్దున్నే బుద్ధిగా స్కూలుకి వెళ్ళేవాడిని. కొత్త పుస్తకాలూ, కొత్త టీచర్లూ, కొత్త సబ్జెక్టులు ఎంతో ఉత్సాహంగా అనిపించేవి. శ్రద్ధగా పాఠాలు వినేవాడిని. అక్కడి టీచర్లందరిలోకీ 'విద్యాసాగర్' మాష్టారంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన తెలుగు చెప్పేవారు. ఆయన పాఠం చెబుతుంటే ఒక సినిమా చూస్తున్నట్లుగానో, ఒక నవల చదువుతున్నట్లుగానో అనిపించేది.

ఒకసారి ఆయన నన్ను పిలిచి "ఒరేయ్ అబ్బాయి! నువ్వు బాగా చదువుతున్నావు కాబట్టి నీకో సలహా ఇస్తాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ కొత్తగా 'గురుకుల పాఠశాలలు'నెలకొలుపుతోంది. నీలా బాగా చదువుకునే గ్రామీణ విద్యార్థులకి అందులో అవకాశం కలిపిస్తారు. దానికి ఒక ప్రవేశ పరీక్ష వ్రాయాలి. నువ్వు రాస్తావా?" అని అడిగారు. నా కెందుకో ఇంట్రెస్టింగ్ గా అనిపించింది.

"వ్రాస్తాను సార్! కానీ మా నాన్నగారికి ఒకమాట చెప్పండి" అన్నాను.

ఆ సాయంత్రం నాన్నగారు నన్ను దగ్గరకి పిలిచి అడిగారు.

"ఏరా! గురుకుల పాఠశాల పరీక్ష వ్రాస్తావా?" అని.

"అవును నాన్నా! నాకు వ్రాయాలని ఉంది. ఇంకా బాగా చదువుకోవాలని ఉంది" అన్నాను.

"అది సరే! అందులో సెలక్టయితే నువ్వు మాకు దూరంగా ఉండి చదువుకోవాల్సి ఉంటుంది. నీకు సాధ్యమవుతుందా?"

"ఫర్వాలేదు నాన్నా! చదువుకోగలను" ధైర్యంగా చెప్పాను.

ఆ తర్వాత నాన్నగారే దగ్గరుండి నన్ను పరీక్షకు తీసుకెళ్ళారు. ఎంతో బాగా వ్రాసాను. రిజల్ట్సు వచ్చాక చూస్తే మా జిల్లా మొత్తానికి టాపర్‌ని నేనే! ఏనుగెక్కినంత సంబరంగా అనిపించింది. నా జీవితానికి సంబంధించి అది మొదటి విజయం! నాన్నగారి మొహంలో ఆనందంతో కూడిన గర్వం కనిపించింది. ఆ సందర్భంగా నన్ను మెచ్చుకుంటూ నాకు ఒక చక్కటి 'బహుమతి' ఇస్తారేమో అనుకున్నాను. కానీ ఏమీ ఇవ్వలేదు. కనీసం ప్రక్క ఊళ్ళో ఉన్న థియేటర్లో నా అభిమాన హీరో చిరంజీవి సినిమాకి తీసుకెళ్ళమన్నాను.

"ఇప్పుడెందుకట సినిమాలు.. తర్వాత ఎప్పుడైనా తీసుకు వెళతాలే" అంటూ అమ్మతో అన్నారు. నాకు మళ్ళీ కళ్ళల్లో సన్నటి కన్నీటి తెర! నిరాశతో కూడుకున్న తలుపుల చెర!

❋❋❋

మా ఊళ్ళోని హైస్కూలు చదువు డిస్‌కంటిన్యూ చేసి, 'బొబ్బిలి' లో ఉన్న గురుకుల పాఠశాలలో మళ్ళీ ఆరోతరగతిలో జాయిన్ అయ్యాను. అక్కడి వాతావరణం నాకు ఎంతో నచ్చింది. చిన్న అడవిలాంటి ప్రాంతంలో మధ్యలో నిర్మించబడిన స్కూలు అది. ఒక ప్రక్కగా రేకుల షెడ్డుతో వేసిన క్లాసు రూములు, వాటికి దూరంగా మీకందరికీ ఉండటానికి డార్మెటీలు. బాహ్య ప్రపంచానికి దూరంగా, కేవలం చదువే లోకంగా ఎటువంటి ఎంటర్టైన్ మెంట్స్ లేని జీవితం. ఏ చిన్న అవసరానికయినా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణానికి అలవాటు పడిపోయాను. అందరూ నా వయసు పిల్లలే కాబట్టి ఆటపాటలతో, చదువుతో కాలం గడిచిపోయేది.

ప్రతీ రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకి ఉత్తరాల సంచితో సైకిల్ మీద వచ్చేవాడు పోస్ట్‌మేన్! అతడు రాగానే మా పిల్లలందరం 'పులిహోర పొట్లాల కోసం ఎగబడే వరదబాధితుల్లా' మీద పడేవారం. ఇంటి నుండి లెటర్ వచ్చిన పిల్లల మొహాల్లో ఒకటే ఆనందం!

రెండు వారాలకొకసారి నాన్నగారు ఉత్తరం వ్రాసేవారు.

"బాగా చదువుకో.. క్రమశిక్షణతో మెలుగు" ఇదీ అందులో సారాంశం!

అంతకు మించి ఏమీ ఉండేది కాదు. నన్ను మెచ్చుకుంటారనీ, ఏ విషయం మీదైనా నన్ను అభినందిస్తారనీ ఆశపడేవాడిని. కానీ నాకు నిరాశే మిగిలేది. మా స్కూల్లో ఒక నియమం ఉండేది - నెలలో ఒక ఆదివారం తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపి వెళ్ళవచ్చు. ఆ విధంగా చాలామంది తల్లిదండ్రులు ఏదో ఒక ఆదివారం వచ్చి తమ పిల్లలతో గడిపి వెళుతుండేవారు. కానీ నాకు మాత్రం ఆ 'అదృష్టం' మూడు నెలల వరకు కలగలేదు. ఆదివారం వస్తే నా తల్లిదండ్రులు వస్తారేమో అని ఆశగా ఎదురు చూసేవాడిని. సాయంత్రం వరకు చూసి చూసి ఇక రారని నిర్ధారించుకున్నాక మంచం మీద పడి వెక్కి వెక్కి ఏడ్చేవాడిని. కొన్ని రోజుల తర్వాత నా కల తీరడానికి అన్నట్లు ఒక ఆదివారం నిజంగానే నా తల్లితండ్రులు వచ్చారు. అంత దూరం నుండి వాళ్ళని చూడగానే పరుగెత్తుకుంటూ వెళ్ళి కాళ్ళని చుట్టేసాను. అమ్మ కళ్ళలో నన్ను చూసిన ఆనందంతో భాష్పాలు. నాన్న మాత్రం గంభీరంగా ఉన్నారు. ఆ రోజంతా వాళ్ళతో ఆనందంగా గడిపాను. నా చిన్నారి జీవితంలో అతి మధురమైన క్షణాలు అవి.

లేలేత ప్రాయంలో తెల్లకాగితం లాంటి నా మనసు మీద పడిన తియ్యటి ముద్రలు! ఆ సాయంత్రం వాళ్ళు నన్ను వదిలి వెళుతుంటే మా సంస్కృతం మాష్టారు ఎదురు పడ్డారు. నా తల్లితండ్రులని ఆయనకు పరిచయం చేసాను. ఆయన ఎంతో సంతోషించి వాళ్ళతో ఒక మాట చెప్పారు.

"మీ అబ్బాయి అని చెప్పడం కాదుకానీ వీడు మహా తెలివైనవాడు. ఎటువంటు పాఠాన్నైనా ఇట్టే పట్టేస్తాడు... ఏక సంథాగ్రాహి! అన్నిటి కంటే ముఖ్యమయినది.. మీకు తెలుసో లేదో వీడు తియ్యగా పాడతాడు. సంగీతం నేర్చుకుంటే ఎంతో పైకొస్తాడు దీర్ఘాయుష్మానుభవ!" అని దీవించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంగతి తల్లిదండ్రుకంటే గురువులకే బాగా తెలుస్తుంది. అమ్మ మొహంలో విపరీతమైన ఆశ్చర్యం తొంగి చూసింది. నన్ను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది. నాన్న పెదాల మీద లీలగా చిరునవ్వు దోబూచులాడింది అదీ క్షణం సేపే! మళ్ళీ గంభీరత ముసుగు!

రెండు కిలోమీటర్ల తర్వాత ఉన్న రోడ్డు పట్టుకుని బస్సు ఎక్కడం కోసం నన్ను వదిలి వాళ్ళు వెళ్ళిపోతుంటే మనసంతా భాధతో నిండిపోయింది. వాళ్ళు కనుమరుగయేంత వరకు అలా చూస్తూ ఉండిపోయాను.. నడి సంద్రంలో వదలబడ్డ 'ఒంటరి నావలా' మిగిలిపోయాను.

❖❖❖

కాలంతో పాటే నా చదువు కూడా ముందుకు సాగింది. పదో క్లాసులోకి వచ్చాను.

విపరీతమైన పోటీ! పగలంతా క్లాసులు.. రాత్రులు టీచర్లు దగ్గరుండి మరీ మమ్మల్నందరినీ చదివించేవారు. పగలు క్లాసురూముల్లో కునికిపాట్లు పడుతుండేవాళ్ళం. ఎట్టకేలకు సమయం రానే వచ్చింది. మార్చి నెలలో పబ్లిక్ పరీక్షలు వ్రాసి, మిత్రులందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని వేసవి సెలవల్లో ఇంటికి వచ్చేసాను. ఆ తర్వాత కొద్దిరోజులకి రిజల్ట్స్ వచ్చాయి. స్టేట్ లెవల్లో టెంత్ రాంక్ వచ్చింది నాకు. అది విని మా ఊరి వాళ్ళంతా నాకు బ్రహ్మ రథం పట్టారు. ఇంకా చెప్పాలంటే చుట్టు ప్రక్కల ఊళ్ళనుండి విద్యార్థులు నన్ను చూడటానికి వచ్చేవారు. అమ్మకయితే ఇదంతా ఒక కలలాగా అనిపించేది. తన కొడుకు ఇంత గొప్ప విజయం సాధిస్తాడని ఆమె ఎప్పుడూ ఊహించలేదు. ఆ మాటకొస్తే నేనే ఊహించలేదు. ఎప్పటిలాగే నాన్న నుండి ఎటువంటి ప్రశంసా లేదు. ఇంటర్మీడియట్‌లో ఎం.పి.సి గ్రూపు తీసుకోమని కొందరు, బై.పి.సి తీసుకోమని కొందరు నాకు సలహాలిస్తుండేవారు. ఆ మాటలు నాన్న చెవిని వేస్తే చిన్నగా నవ్వి ఊరుకునేవారు. లోకమంతా నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నా నా తండ్రి మాత్రం నన్ను మెచ్చుకోకపోవడం ఆశ్చర్యం కలిగించేది. అయితే ఈసారి బాధ కలుగలేదు. బహుశా నా మనసు కూడా అందుకు అలవాటు పడిందేమో!

చివరకు అటు తిరిగి, ఇటు తిరిగి ఇంటర్ లో 'ఎం.పి.సి' గ్రూపు తీసుకున్నాను. ప్రక్క ఊళ్ళో ఉన్న జూనియర్ కాలేజీకి రోజూ సైకిల్ మీద వెళ్ళివస్తుండేవాడిని. కౌమార దశ! లోకమంతా ఎంతో అందంగా కనబడేది. పాటలు పాడుకుంటూ, చదువుకుంటూ హాయిగా తిరిగేవాడిని. ఇంటిపట్టున ఉన్నప్పుడు లెక్కలు, ఫిజిక్సుతో కుస్తీలు పట్టేవాడిని. ఆ సంధి దశనుండి తేరుకునే సరికి ఇంటర్మీడియట్ పూర్తయింది. 'ఎనభై శాతం' మార్కుల జాబితా నా చేతికి వచ్చింది.

ఆ రాత్రి నాకు ఒక కల వచ్చింది!

"నా తండ్రి నా దగ్గరగా వచ్చి తలనిమురుతూ నన్ను ముద్దు పెట్టుకున్నారు. భుజం తట్టి అభినందించారు". మెలుకువ వచ్చాక తెలిసింది - అది కేవలం కల మాత్రమేనని!

❖❖❖

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. ఎప్పటిలాగే నాన్నగారు స్కూలు నుండి వచ్చి కుర్చీలో కూర్చున్నారు. నేను పుస్తకాలు ముందేసుకుని 'నిజంగానే' చదవసాగాను. అవి 'ఎమ్ సెట్' పరీక్షకు సంబంధించిన పుస్తకాలు.

వంట గదిలో నుండి కాఫీ కప్పుతో బయటకు వస్తూ అడిగింది అమ్మ.

"అదేమీటండీ! వాడు ఇంజనీరింగ్ చదువుకుంటానని అడుగుతుంటే మీరు 'బి.యస్సీ' చదవమంటున్నారు?" అని.

నాన్న నుండి ఎటువంటి సమాధానం లేదు. తనలో తానే ఏదో గొణుక్కుంటున్నట్లు ఉండిపోయారు. మళ్ళీ అమ్మే అంది - ''వాడికి తెలివి తేటలున్నాయి. చదువు కోవాలని తపన ఉంది. ఇంకా మీరు ఎందుకు సందేహిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు'' అంటూ రెట్టించింది. నాన్న నుండి ఈ సారి కూడా అదే స్పందన.. ఏదీ తేల్చి చెప్పని మౌనం!

ఎమ్ సెట్ పరీక్ష దగ్గర పడుతుండటంతో గుండెల్లో గుబులు ఎక్కువయింది. నాన్న చూస్తే ఇలా ముభావంగా ఉంటున్నారు. 'ఏది ఏమైనా నాకు అనవసరం. ఎలాగైనా నేను ఉంజినీరింగ్ చదవాలి' అన్న పట్టుదల నాలో క్రమంగా పెరగసాగింది అదే పట్టుదలతో ఎటువంటి సోషల్ డిస్టబెన్స్‌కి లోను కాకుండా సీరియస్‌గా ప్రిపేర్ అయి ఎంసెట్ వ్రాసాను. రిజల్ట్స్ వచ్చాక చూస్తే మంచి రాంక్ వచ్చింది. ఏనుగెక్కినంత సంబరంగా అనిపించింది.

తర్వాత 'కౌన్సిలింగ్' కోసం నాన్నగారే నన్ను హైదరాబాద్ తీసుకు వెళ్ళారు. అయితే నేనూహించినట్లుగా మా ఊరికి దగ్గర్లో కాకుండా ఎక్కడో దూరంగా ఉన్న 'అనంతపురం' ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. వెళ్ళాలి.. తప్పదు! నేను కోరుకున్న చదువుకోసం.. నేను ప్రేమించే తల్లిదండ్రులకు దూరంగా వెళ్ళాలి. ఈ విషయం తెలిసాక అమ్మ మొహం అంత ప్రసన్నంగా లేదు. నాన్న సంగతి చెప్పేదేముంది.. అదే గంభీరత! చివరకు నేను ఇంజినీరింగ్ కోర్సు చదవడానికి వెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది. 'విశాఖపట్నం' రైల్వే స్టేషన్ లో రైలు ఎక్కాక వీడ్కోలు చెబుతూ, నా చేతిని చిన్నగా నొక్కి ఒక 'బహుమతి' ని ఇచ్చారు నాన్నా! దానితోపాటే ఒక 'ఉత్తరం'! ఆశ్చర్యానందాలతో నా మనసు గంతులేసింది.

కదులుతున్న రైలు లోంచి బయటకు చూడసాగాను. కాలంతో పాటే దాటిపోయే సంఘటనల్లా చెట్లూ చేమలూ వెనక్కి వెళ్ళిపోతున్నాయి. గాలికి నా చేతిలోని ఉత్తరం రెపరెపలాడింది. తెరిచి చదవసాగాను.

**''చిరంజీవి కుమారునికి -**

నాన్న దీవించి వ్రాయునది! మనసులోని మాట చెప్పడానికి అశక్తతతోడైనప్పుడు మనిషి ఉత్తరాల్ని ఆశ్రయిసాడు. ఇప్పుడు నేనూ అదే పని చేస్తున్నాను. బాబూ! ఎన్నీ సార్లు నీ కళ్ళల్లో ఒక భావాన్ని చూసాను. అది - 'నేను నిన్ను మెచ్చుకుంటే సంతోషపడదామన్న నీ తాపత్రయం'. కానీ ఏ రోజూ నిన్ను నేను మెచ్చుకోలేదు. భుజం తట్టి ప్రోత్సహించనూ లేదు. బహుశా దానికి కారణం నాలో 'ఎదుటి మనిషి గొప్పతనాన్ని అంగీకరించలేని' సామాన్యుడి మనస్తత్వం కావచ్చు. నా విషయంలో అది కాస్త 'ముదిరి' కన్నకొడుక్ని కూడా అభినందించలేని వికృత మనస్తత్వంగా మారింది. అలాగని నీమీద నాకు ఎటువంటి ఈర్ష్య భావమూ లేదు. తన చేతితో నాటిన మొక్క పెరిగి పెద్దదై పువ్వులు పూస్తుంటే ఏ తోటమాలి అయినా సంతోషిస్తాడు కదా! నాక్కూడా నీ ప్రతీ విజయం పట్లా ఎంతో ఆనందం కలిగేది. కానీ అది నీతో పంచుకుందాం అనుకునేసరికి ఏదో అడ్డు తగులుతూ ఉండేది. అది నా 'అహంభావం' కావచ్చు. అర్థం చేసుకుంటావు కదూ!

నా చిన్నతనంలో మీ తాత అంటే నా తండ్రి ఎప్పుడూ నన్ను తిడుతూ ఉండేవాడు. దగ్గరకు తీసుకుని మెచ్చుకున్న దాఖలాలు లేవు. అది ఆయనకు సంస్కారం! బహుశా నా సబ్‌కాన్షియస్ మైండ్ లో కూడా అదే ముద్రపడి ఉంటుంది. ఇక నా టీచర్లతో నాకున్న అనుబంధం వర్ణించనలవి కానిది. నేను చేసే ప్రతీ చిన్న తప్పుని ఎత్తి చూపుతూ నన్ను చితకబాదేవారు అందుకే నాకు చదువన్నా, బాగా చదువుకునే విద్యార్థులన్నా ఒక రకమైన ఏహ్యాభావం, అసహ్యం ఉండేది. అయితే పొట్టకూటి కోసం తంటాలు పడి టీచర్ని అయ్యాను - అది వేరే సంగతి! బహుశా ఈ సంఘటనల ప్రభావం వల్లనేమో క 'జడపదార్థంలా' తయారయ్యాను. అందుకు ప్రతిగా ఎంతో

కోల్పోయాను. ప్రేమను పంచడంలో ఉండే మాధుర్యాన్ని అనుభవించలేకపోయాను. అన్నిటికంటే ముఖ్యంగా నీ పసిమనసుని ఎంతో గాయపరిచాను. అందుకే నిన్ను ఒకటి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను - నన్ను 'క్షమించమని'!

క్షమిస్తావు కదూ! చివరగా ఒక మాట. నువ్వు ఇంజినీరింగ్ చదువుతానంటే వద్దన్నది కేవలం నా ఆర్థిక అసమర్ధతవలనే. అంతకు మించి నువ్వు చదువు పేరుతో ఎక్కడెక్కడికో వెళ్ళిపోతే విడిచిపెట్టలేని బలహీనత వలనే. అర్ధంచేసుకుంటావు కదా!

**ప్రేమతో - నాన్న"**

కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి నాకు. నిజంగా నా తండ్రిది ఎంత వేదన! ప్రకృతి సిద్ధమైన ఫీలింగ్స్‌ని కంట్రోల్ చేసుకోవడం కూడా ఆయనకి ఒకరకమైన 'శాపమే' కదా! అయితే మా నాన్నకి తెలియని విషయం ఒకటి ఇక్కడుంది. అది ఆయన నన్ను మెచ్చుకోకుండా నిరుత్సాహపరచిన ప్రతిసారీ నాలో 'పట్టుదల' కలిగేది.

ఎలాగైనా ఆయన మనసు జయించాలి, ఆయనతో 'శభాష్' అనిపించుకోవాలి అన్న 'తపన కలిగేది. ఆ పట్టుదలతోనే ఇన్ని విజయాలు సొంతం చేసుకున్నాను. ఇంత వరకు రాగలిగాను. జీవితంలో కావాలనుకున్నది పొందాలనుకున్నప్పుడు కృషితో పాటూ ఓర్పు, సహనం కూడా ఉండాలి అన్నది ప్రాక్టికల్ గా నేర్చుకున్నాను. నేను అలవర్చుకున్న ఆ 'దృక్పథమే' నా తండ్రి కిచ్చిన గొప్ప **'బహుమతి'**.

ఒక జీవిత కాలం వేచి చూసి నేను పొందిన - వెలకట్టలేని 'పెన్నిధి'! ✹✹✹

# గుర్తింపు

**శ్యామలాదేవి దశిక**

**మా అమ్మాయి పెళ్ళిచేసుకోవడంతో మావారి సంగతేమోకానీ, నాకుమాత్రం మన కమ్యూనిటీలో మంచి గుర్తింపొచ్చింది!**

తల్లి లెవెల్ నుంచి అత్తగారిలెవెల్ కు ఎదిగిన తర్వాత అంతవరకు పెద్దగా పట్టించుకోని G.P.A. సభ్యులు నాకు "హలో" చెప్పడం మొదలెట్టారు. అంతేకాకుండా అందులో బాగా పేరున్నవారు, ప్రముఖులు నేను ముందుముందు ఇంకా ఎదగగలనని పసిగట్టేసి, ఎందుకైనా మంచిదని వారి పక్కన నాకు స్థానం ఇవ్వడం మొదలుపెట్టారు!

అంత గొప్పవాళ్ళ మధ్య కూర్చునే అదృష్టం దొరికినందుకు ఉబ్బితబ్బిబైపోయాను. ఎందుకంటారా?

మరి ఆ G.P.A. , అదేనండీ 'గ్రాండు పేరెంట్స్ అసోసియేషన్' లో ఉన్నవాళ్ళు సామాన్యులటండీ?

వాళ్ళలో ఒక్కక్కరికీ ఎంత విజ్ఞానం, ఎంత అనుభవం. . . . అన్నింటినీ మించి అందులో అడుగు పెట్టాలంటే ఎంత అదృష్టం చేసుకోవాలి!

ఏ సందర్భం వచ్చినా అందరూ కలుసుకుంటూ వాళ్ళ అనుభవాల్ని తోటివారితో పంచుకుంటూ నాలాంటి వారికి ఆదర్శప్రాయంగా వుంటున్న ఎందరో మహానుభావురాండ్రులకు నిలయంగా వుంటున్న సంస్థ అది. వారిచ్చే సలహాలు, సూచనలు వారి వెనక నడిచే నాలాంటి వాళ్ళకు వారు చేసే ఉపదేశాలు, హెచ్చరికలు అత్యంత అమూల్యమైనవి.

"పిల్లల్ని కనడం వాళ్ళ స్వవిషయం, మనకెందుకూ అని మాట్లాడకుండా ఊరుకునేరు. ఎప్పుడు కనాలనుకుంటున్నారో అప్పుడప్పుడూ అడుగుతూ వుండండి. లేకపోతే మాలాగా వున్నపళంగా వుంటున్న ఊరుని, వున్న వాకిలినీ వదిలేసుకోవాల్సివస్తుంది. ఈ పిల్లలకు వాళ్ళ వీలే ముఖ్యంగాని మన ఇబ్బందులూ, మన ప్లాన్లు వాళ్ళకు అవసరంలేదు. తస్మాత్ జాగ్రత్త" అని అంటారు జానకి గారు.

"నువ్వు పిల్లల్ని కనేయి. నేను చూసుకుంటాలే అని తొందరపడి నేను చేసినట్టు వాగ్దానాలు చెయ్యకండి.

ఆ తర్వాత పీక్కుచావాలి" అంటూ హెచ్చరిస్తారు హేమలతగారు!

"ఇప్పుడే లైఫ్ ఎంజాయ్ చెయ్యండి! మీరు ఎక్కడికెళ్ళాలన్నా, ఏం చూడాలనుకున్నా వెంటనే చేసేయండి. రేపు మనవలు-మనవరాళ్ళు వచ్చాక ఇవన్నీ బంద్" అంటూ మన భవిష్యత్తును కళ్ళముందుంచుతారు కోమలగారు.

"మనం పిల్లల్ని కనే వయసులో మన పేరెంట్స్ దగ్గరలేకుండా ఇలా దేశాలు వచ్చి నానా తిప్పలు పడ్డాం.

ఇప్పుడు మళ్ళీ పిల్లల్ని సాకాలనడం అన్యాయం" అంటూ తన నిరసనను వెలిబుచ్చుతారు నిర్మలారావుగారు.

"అప్పటి ఓపికలు వేరు. ఆ ఓపిక ఇప్పుడు రమ్మంటే ఎక్కడ వస్తుంది? అదీకాక అప్పుడు పిల్లల్ని మనకు చేతనైనట్టు పెంచుకున్నాం. ఇప్పుడు అట్లాకాదే వాళ్ళ రూల్స్ ప్రకారం, వాళ్ళ ఇష్టానుసారం పెంచాలి. ఏ కాస్త తేడా వచ్చినా మనపని గోవిందా!" అని అంటారు అటు కూతురి పిల్లల్ని, ఇటు కొడుకు పిల్లల్ని పెంచి తల బొప్పి కట్టించుకున్న భవానిగారు.

"వాళ్ళ అవసరాలకు మనం కావాలి, కానీ వాళ్ళకు మనమీద వీశమెత్తు నమ్మకం కూడ వుండదు. ఓచెంప మనచేత అన్నీ చేయించుకుంటూనే 'ఆర్ యూ షూర్ యు కెన్ హాండిల్' అంటూ ఇమ్మిగ్రేషన్ వాళ్ళు చూసినట్టు మనవంక అనుమానంగా చూస్తారు" అంటూ తన కోపాన్ని ప్రకటిస్తూ వుంటారు పార్వతిగారు.

"ఎవైలబుల్ గా వుంటే ఇలాంటి పాట్లు పడాల్సివస్తుందనే నేను వున్న ఉద్యోగం వదలకుండా పట్టుక్కూర్చున్నాను" అంటూ తన అసలు రహస్యం బైటపెట్టారు రాధారాణిగారు.

ఇలా గ్రాండ్ పేరెంట్స్ అసోసియేషన్ ఆడవాళ్ళందరూ అడపాతడపా చర్చలు జరుపుకుంటూ వాళ్ళ విజ్ఞానాన్ని తోటివారితో పంచుకుంటున్నప్పుడు, పక్కనే వున్న తాతగార్లు కూడా సంభాషణలో తల దూరుస్తూవుంటారు.

"మాకంటే మీరు ఎన్నో రెట్లు నయం. మీ ఆడవాళ్ళకు గ్రాండ్ మదర్‌గా మంచి గుర్తింపు, తోటి ఆడవాళ్ళ దగ్గరనుంచి టన్నులకొద్దీ సానుభూతి వుంటుంది. మామగాళ్ళనే ఎవరూ ఎప్పుడూ పట్టించుకోరు" అంటూ విచారాన్ని వ్యక్తపరుస్తారు విష్ణుమూర్తిగారు.

"ఈ వయసులో కూడా ఇంకా పనిచేస్తూ అలిసిపోయి ఇంటికి వచ్చే నాకు మా ఆవిడ దర్శనభాగ్యమే వుండదు. ఎప్పుడు ఏ పిల్లల ఇంటికి వెళ్తుందో, ఎన్నాళ్ళుంటుందో, ఎప్పుడు వస్తుందో ఆ దేముడికే ఎరుక! మా పిల్లలకు నా భార్య కావాలి గాని నేను అక్కరలేదు" అంటూ వాపోతారు వాసుదేవరావుగారు.

"ముప్ఫై ఐదేళ్ళు కంపెనీకి గొడ్డు చాకిరీ చేసి రిటైరై హాయిగా బతుకుదామనుకున్నాను. కానీ రిటైరైన మర్నాటినుంచి, 'తాతా టేక్ మి దేర్, గ్రాండ్ పా డ్రాప్ మి హియర్, తాతా డోంట్ ఫర్ గెట్ టు పిక్ మి అప్' అంటూ నా గ్రాండ్ చిల్డ్రన్ ఇచ్చిన డ్రైవర్ ఉద్యోగంతో రోజంతా రోడ్డుమీదే" అంటారు రెడ్డిగారు.

ఇలా పెద్దపెద్దవారి అనుభవాలు వింటూ పరిచయాలు పెంచుకున్న నేను, వాళ్ళు ఊహించినట్లే జి. పి. ఎ. తరఫున భావితరాలవారికి ఒక సరికొత్త సందేశమిచ్చే స్థాయికి ఎదిగిపోయాను !!

నిన్నగాక మొన్న ఏదో ఒక్క పెళ్ళి చేసి ఏ గ్రాండ్ చిల్డ్రన్ లేకుండా ఎంతో ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ పేరెంట్స్ అసోసియషన్‌లో ఇంత సులభంగా దూరిపోయి ఇంత పాపులారిటీని ఎలా సంపాదించానా అని చాలామంది అనుమానిస్తూ అసూయ పడటం నేను గమనించాను.

పెళ్ళై మా అమ్మాయి దాని ఇంటికి అది వెళ్ళగానే మావారు ఇదే ఛాన్స్ అని ఓ నెల రోజులపాటు ఇండియా ప్రయాణం పెట్టేసారు. అక్కడ వున్నన్ని రోజులు నన్ను ఎక్కించిన రైలు ఎక్కించకుండా, చూపించిన డ్రైవర్ని చూపించకుండా ఆయన ఇష్టం వచ్చినట్టు తిప్పారు. మా విహారయాత్ర మధ్యలో మా అమ్మాయి-అల్లుడి దగ్గరనుంచి " we have a news to tell you, we will announce it soon" అంటూ అదేమిటో చెప్పకుండా బాంబులాంటి ఈ మైల్ వచ్చింది. ఇద్దరం ఆశ్చర్యపడటంతోపాటు, నేనూ అందరి

ఆడవాళ్ళలాగానే ఏదో వూహించుకోవడం వగైరా జరిగాయి.

తర్వాత వారం రోజులకు, " we are proud parents of Rani. She is two weeks old---beautiful---- అంటూ ఆటంబాంబులాంటి ఈ మైల్ వచ్చింది. పెళ్ళై రెండు నెలలన్నా కాలేదు, అప్పుడే పిల్లను పెంచుకోవడమేమిటీ? ఇలాంటి ఆలోచన వున్నట్టు మాటవరసకైనా అనలేదే అని అనుకుంటూ ఏమీ అర్థం కాక ఫైల్ ఓపెన్ చేసాం.

మా అమ్మాయి ఒళ్ళో దర్జాగా కూర్చున్న కుక్కపిల్లను చూసి ఒకరిముఖాలు ఒకరం చూసుకొని దీనికా ఇంత బిల్డప్పు ఇచ్చారు అని ఒకటే నవ్వుకుని ఆ సంగతి అంతటితో మర్చిపోయాం!

ఆ తర్వాత వారం రోజులకు మా హనీమూన్ యాత్ర ముగించుకొని ఇంటికొచ్చిపడ్డాం.

జెట్ లాగ్, ప్రయాణపు బడలిక తీరకుండానే అమ్మాయి-అల్లుడ్ని చూడాలన్న ఆతృతతో వాళ్ళింటికి బయలుదేరి వెళ్ళాం. కారు డ్రైవ్ వే లో ఆగడం చూసిన మా అల్లుడు మేము డోరు బెల్లు కొట్టకుండానే తలుపు తీసాడు. అతను తలుపు తీసీ తీయడంతోటే కుక్క "భౌభౌ" మంటూ అరుస్తూ బంతిలాగా నా మీదకు ఎగరడం, నేను దానికి రెట్టింపు అరుపుతో బావురుమంటూ రోడ్డుమీదకు పెరిగెత్తడం, క్షణంలో జరిగిపోయింది. ముందు నేను, నా వెనకాల కుక్క, అది ఎక్కడ తప్పిపోతుందో అని ఆదుర్దాతో దాని వెనకాల మా అమ్మాయా-అల్లుడు, ఏ కారుకిందో పడి కాలో చెయ్యో విరగొట్టుకుంటానేమో అనికంగారు పడుతూ ఆయాసపడుతూ మావారు ఇలా కుటుంబం అంతా రోడ్డునపడ్డాం!!

కుక్కలంటే నాకు విపరీతమైన భయం అని తెలుసుకున్న మా అల్లుడు దాన్ని పట్టుకుని వెంటనే కేజ్‌లో పెట్టి అదేపనిగా సారీ చెప్పాడు. మా అమ్మాయి మాత్రం"ఇంత పెద్దదానివై యుండి అంత చిన్న కుక్కపిల్లకు భయపడతావా? అది షాంపూ చేసుకొని ఉదయంనుంచీ మీకోసం ఎదురుచూస్తోంది తెలుసా? చక్కగా అమ్మమ్మా-తాతకు హలో చెప్పడానికి వస్తే నువ్వు దాన్ని హడలుకొట్టడమే కాకుండా, నీ మూలకంగా అది వాళ్ళ డాడీ చేత చివాట్లు తింది తెలుసా?" అంటూ ఇన్నాళ్ళుగా దానికి నామీద వున్న కసంతా తీర్చుకుంది !

మా అల్లుడు మాత్రం ఈ వయసులో కూడా ఇంత స్పీడుగా పరిగెత్తగల అత్తగార్ని చూసి ఆశ్చర్యపోయాడు !

అతనికి తెలీదు నేను స్కూల్ రన్నింగు రేసులో ఎప్పుడూ ఫస్టు వచ్చేదాన్నని !

చిన్నప్పటినుంచి నాకు కుక్కలన్నా, సూదిమందన్నా చచ్చేంత భయం. హఠాత్తుగా స్కూల్లో టీకాలవాళ్ళు ప్రత్యక్షమైనప్పుడు, సంక్రాంతి టైములో తెల్లవారు జామున ఆవు పేడకోసం వెళ్ళేసమయంలో కుక్కలు నావెంట పడినప్పుడు ఎవరూ ఊహించలేనంత స్పీడుగా పరిగెత్తి ఆపదనుంచి తప్పించుకోవటం నాకు బాగా అలవాటు !

ఆ తర్వాత మేము మా అమ్మాయిని-అల్లుడ్ని మా ఇంటికి ఎన్నిసార్లు పిలిచినా ఏవో సాకులు చెప్పడం మొదలుపెట్టారు. గట్టిగా అడిగితే చివరకు మా అమ్మాయి అసలు విషయం బైటపెట్టింది.

"మేము రాకపోవడానికి నువ్వే కారణం.

క్రితంసారి వచ్చినప్పుడు నీ వలన రాణిని బయట ఎండలో చెట్టుకు కట్టేయాల్సివచ్చింది.

ఆ తర్వాత ఒక్కదాన్నే గరాజ్ లో వుంచితే రాత్రంతా ఏడుస్తూనే వుంది.

మేము సకుటుంబంగా మీఇంటికి రావాలంటే నువ్వు అర్జెంటుగా రిఫార్మ్ అవ్వాలి.

ఏ పూజో-పునస్కారమో చేసి కుక్కలంటే భయం పోగొట్టుకో.

ఆ తర్వాత ఆలోచిద్దాం" అంటూ తెలుగు సీరియల్స్ లోని ఆడవిలన్ లాగ మాట్లాడి ఫోన్ పెట్టేసింది !

దీని వ్యవహారం చూస్తుంటే నన్నే ఇది వాకిట్లో నించోపెట్టేటట్టుందని ఇక లాభంలేదని How to get rid off your fears,

how to be friendly with animals? లాంటి పుస్తకాలు చదివి, మావారి సాయంతో నెమ్మదిగా ఎలాగో అతికష్టం మీద భయం పోగొట్టుకున్నా. అక్కడితో నా బాధ్యత తీరిందని భ్రమపడ్డా ! కేవలం భయం తీరితే చాలదని, వాళ్ళ కుక్కని ఎలా పలకరించాలో గ్రాండ్ పేరెంట్‌గా ఎలా బిహేవ్ చెయ్యాలో, నా రెస్పాన్సిబిలిటీస్ ఏమిటో అన్నీ మొట్టికాయలు వేయించుకు మరీ నేర్చుకున్నాను.

మొదట్లో నేను మా అమ్మాయి అత్తవారి యోగక్షేమాలు అడిగితే, "అందరు ఎలా వున్నారని పేరుపేరునా అడుగుతున్నావు కానీ మా అమ్మాయి ఎలా వుందని అడగవేం?" అని అక్షింతలు వేసింది !

ఆ తర్వాత మాట్లాడినప్పుడు చేసిన తప్పు దిద్దుకుందామని " హౌ ఈజ్ డాగ్?" అని అడిగి మరో తప్పు చేశా.

నాకుమల్లే దానికీ గోత్రనామాలున్నాయని, సరిగ్గా సంభోదించటం నేర్చుకోమని మా అమ్మాయి ఓ క్లాసు తీసుకుంది.

క్రిస్‌మస్‌కు ఇద్దరికీ మంచి గిఫ్టు పట్టికెళ్ళి "మరి మా రాణి గిఫ్టు ఏది?" అని అడిగించుకున్నాం.

ఒకసారి వాళ్ళింట్లో ఇద్దరం ఏదో ఊసులాడుకుంటుంటే వంటింట్లో వున్న మా అమ్మాయి వచ్చి,

"అలా ఊరికే కూర్చోకపోతే రాణితో కాసేపు ఆడచ్చు కదా?" అని కోప్పడింది !

ఇదంతా పాత కథ అనుకోండి! ఇప్పుడు మేము పెర్‌ఫెక్ట్ గ్రాండ్ పేరెంట్స్‌ము. మా అమ్మాయి గొంతు వినగానే ముందు రాణి గురించే అడుగుతాం. మా అమ్మాయి కూడా అచ్చమైన తల్లిలాగే అది ఎంత అల్లరి చేస్తున్నదో, ఎంత తెలివిగలదో, మధ్యరాత్రిలో వాళ్ళ బెడ్ మీదకు ఎలా చేరుతుందో, బయటకు తీసికెళ్ళినప్పుడల్లా రాణికి ఎంత దిష్టి తగులుతుందో ఇంకా దాని అనారోగ్యం. . . . అన్నీ ఏకరువు పెడుతుంది !

రాణి వచ్చినప్పుడల్లా మా ఇల్లూ అందరి గ్రాండ్ పేరెంట్స్ ఇల్లులాగే సందడిగా వుంటుంది. అందరిలాగే మేమూ మా రాణి సోఫాలు ఎక్కి పాడుచేసినా, కార్పెట్లమీద పెరిగెత్తినా ఏమీ అనము, అనకూడదు కూడా.

రాణి వస్తోందంటే మా వారు చిన్నచిన్న వస్తువుల్ని, విలువైన వస్తువుల్ని తీసి దాచేస్తుంటారు !

అందరు గ్రాండ్ పేరెంట్స్ చేస్తున్నట్లే మేమూ "రాణి"ని బేబీసిట్ చేస్తుంటాము.

మీ పిల్లలు రూల్స్ పెట్టినట్లే మాకూ బోలెడు రూల్స్ వున్నాయి.

"ఇప్పుడే డిన్నరు ఇచ్చాం, ఇక దానికి ఏమీ పెట్టద్దు" అని ఆర్డరిచ్చి వెళ్తారు.

మేము అలాగే అని తల వూపుతాం. వాళ్ళు అటు వెళ్ళగానే అది తోక వూపుకుంటూ మాతోపాటు వేడివేడి ఇడ్లీ-సాంబారు, మసాలా దోశెలు, చపాతీ-కూర్మాలు లాగిస్తుంది !

రాణీ ఎలాగో చెప్పదు అలాగే మేమూ చెప్పం.

మీ ఇళ్ళలో పిల్లలక్కావాల్సినవన్నీ వున్నట్లే, మా ఇంట్లో మా రాణికి కావాల్సినవన్నీ వున్నాయి.

ఈ మధ్యనే డైమండ్స్ పొదిగిన కాలర్ మా బుజ్జిరాణి మెడలో వేస్తే, దాన్ని మేము అతి గారాబం చేసి పాడుచేస్తున్నామని అందరి పిల్లల్లాగే మా పిల్లలు మమ్మల్ని కోప్పడ్డారు ! రోజూ వాక్‌కు వెళ్ళమంటే మొరాయించే మావారు రాణి వస్తే చాలు దాన్ని తీసుకుని షో అండ్ టెల్‌కు బయలుదేరతారు. రాణి ఎటు తీసికెళ్తే (లాక్కెళ్ళితే) పాపం మావారు అటే వెళ్తారు.

ఇన్ని రోజులైనా మా ఫామిలీ ఫొటో ఒకటి మంచిది లేదని ఈ మధ్యనే గ్రాండ్ పేరెంట్స్ డే రోజున అందరం స్టూడియోకెళ్ళి తీయించుకున్నాం. తలుపు తీయగానే ఎదురుకుండా కనిపించే ఆ ఫొటో చూసిన ఎవరికైనా మాదెంత హ్యాపీ ఫ్యామిలీయో ఇట్టే తెలిసిపోతుంది !

గ్రాండ్ పేరెంట్స్ అంటే వుత్తినే మనవలు-మనవరాళ్ళను చూస్తేనే సరిపోదని, వాళ్ళు పెంచుకునే పెంపుడు జంతువుల్ని కూడా ప్రేమించి పెంచగల సమర్ధత కలిగివుండాలని చాటిచెప్పిన మొట్టమొదటి దంపతులము మేమే !

ఇప్పుడు తెలిసిందా మీకు?

జి.పి.ఎ. లో మాకు అంత గుర్తింపు ఎందుకు వచ్చిందో?!